A0GA105B152

కాకతీయసంచిక

జగత్సు వసుధా ఖాతి తస్యా మేకశిలాపురీ।
కాకతీయాన్వయ స్తత్ర తస్మిన్ రుద్రనరేశ్వరః॥

(ప్రతాపరుద్రీయం)

సంపాదకుడు

మారేమండ రామారావు ఎం. ఏ. బి. ఇడి.

మదరాసు విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థి 1928—1930.

గ్రంథకర్త— భారతీయ విద్యాచరిత్రము : శ్రీమధ్వాచార్యచరిత్రము.

Etc.

KINNERA
16, JONES STREET
MADRAS 1

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.
10,086

ప్రకాశకులు:

ఆంధ్రేతిహాసపరిశోధకమండలి

రాజమహేంద్రవరము.

1935

సర్వస్వామ్యసంకలితము]

[వెల. రు. 4.

(తపాలఖర్చుగాక)

ఆంధ్రేతిహాసపరిశోధకమండలి.

తెనుగుప్రచురణములు:-

1.	రాజరాజనంచిక వెల	రు. 5—0—0	తగ్గింపుధర	రు. 3—0—0
2.	కళింగదేశచరిత్ర	7—8—0	,,	5—0—0
3.	కాకతీయ సంచిక	4—0—0		

పై మూడు పుస్తకములు నొకేసారి కొనువారికి తగ్గింపుధరల కీయబడును.

(పోష్టుఖర్చులు ప్రత్యేకము)

ఆంగ్లప్రచురణములు:-

QUARTERLY JOURNAL
OF
THE ANDHRA HISTORICAL RESEARCH SOCIETY.

Vols. I-VIII Nett. Rs. 35.
(Except Vol. No. I Part. 2.)

Original Price per set	Rs 52/-
Reduced ...	35/-.

954.84
KA/K

పుటలు. ౧౩౯—౧౭౬, అకారాది సూచికలు రెండును, విషయసూచికాది మొదటి భాగము ౧౨ పుటలును సుజనరంజనీ ముద్రాశాలయందును, మిగిలిన భాగము రాజ్ ఎలెక్ట్రిక్ ప్రెస్ నందును ముద్రింపబడినవి.



కాకతీయసంచికాసంపాదకీయసంఘము.

శ్రీయుత రాళ్ళబండి సుబ్బారావుగారు ఎం. ఏ. ఎల్.టి.; శ్రీయుత మారేమండ రామారావుగారు ఎం.ఏ.బి.ఇ.డి. (సంపాదకులు); శ్రీయుత చిర్రాపూరి ఆత్మారాంగారు బి.ఏ.బి ఎల్; శ్రీయుత టేకుమళ్ళ అచ్యుతరావుగారు ఎం.ఏ.,ఎల్.టి. (ఎడమనుండి కుడివైపుకు)

శ్రీయుత సురవరం ప్రతాపరెడ్డిగారు
బి.ఏ.బి.ఎల్.

శ్రీయుత ధర్మవీర్ వామన నాయక్ గారు
జాగీర్దార్ (చారిత్రిక ప్రదర్శన
ప్రారంభకులు)

శ్రీయుత పింగళి వెంకటరామా
రెడ్డిగారు దేశముఖ్ (కాకతీయ
సభాహ్వాన సంఘాధ్యక్షులు)

ప్రొఫెసరు శిరుగూరి హనుమంతరావుగారు
ఎం. ఏ. ఎల్. టి. (కాకతీయసభాధ్యక్షులు)

శ్రీయుత మాదిరాజు రామకోటేశ్వర రావుగారు
(ఆహ్వానసంఘ ముఖ్య కార్యదర్శులు).

పోషకులు—విరాళములు

శ్రీమంత మహారాణీ శ్రీశ్రీశ్రీ ఆదిలక్ష్మీదేవమ్మ బహద్దరువారు
గద్వాలసంస్థానాధీశ్వరులు. రు. 500 0-0

శ్రీ రాజాబహదూర్ వెంకటరామారెడ్డిగారు ఓ. బి. ఇ.
రిటైర్డుపోలీసుకమిషనరు, హైదరాబాదు. (O. S) 200-0-0

శ్రీయుత ధర్మవీర్ వామననాయక్ గారు,
జాగీర్దారు, హైదరాబాదు. (O. S) 50-0-0

శ్రీయుత పింగలి వెంకటరామారెడ్డిగారు,
దేశముఖ్, హైదరాబాదు. 50-0-0

శ్రీయుత ముక్త్యాల వెంకటకృష్ణయ్యగారు. (O. S) 50-0-0

254.84

కాకతీయసంచిక—విషయసూచిక

సంపాదకీయవిజ్ఞాపనము. I-V

1. కాకతీయుల చరిత్రము. ౧-౧౧౨
   శ్రీయుత మారేమండ రామారావుగారు ఎం. ఏ. బి. ఇడి.
2. కాకతీయరాజధాని ప్రశంసా. ౧౧౩
   శ్రీయుత విద్వాన్ ముదిగొండ వీరేశలింగశాస్త్రిగారు.
3. కాకతీయరాజుల విజయబిరుదప్రశస్తి ౧౧౪
   శ్రీయుత డాక్టరు బుర్రా శేషగిరిరావుగారు ఎం. ఏ. పి. హెచ్. డి.
4. ప్రతాపరుద్రుని కాలపు మఖ్తానదు. ౧౧౫
   శ్రీయుత ఒద్దిరాజు రాజేశ్వరరావుగారు బి. ఏ. యల్. యల్. బి.
5. హనుమకొండ స్థానికచరిత్రము. ౧౧౬-౧౨౩
   శ్రీయుత పింగిలి వెంకటేశ్వరరావుగారు.
6. విద్యానాథుని కాకతీయాన్వయ నిరూపణము. ౧౨౪-౧౩౨
   శ్రీయుత రుద్రరాజు నరసింహరాజుగారు.
7. కాకతీయసామ్రాజ్యాంధ్రవాఙ్మయము ౧౩౩-౧౪౦
   శ్రీయుత నిడుదవోలు వెంకటరావుగారు బి. ఏ.
8. కాకతీయచోలరాజాదులప్రశంస. ౧౪౦
   శ్రీయుత చాగంటి భాస్కరలింగంగారు.
9. కాకతీయులనాటి సాంఘికచరిత్ర. ౧౪౧-౧౪౯
   శ్రీయుత అంబడి సుబ్బరాయచెట్టిగారు ఎం. ఏ. బి. ఇడి.
10. ప్రతాపరుద్రప్రశస్తి. ౧౫౦
    శ్రీయుత మారేమండ రామారావుగారు ఎం. ఏ. బి. ఇడి.
11. ప్రతాపరుద్రునిపై మహమ్మదీయుల దండయాత్రలు. ౧౫౧-౧౫౯
    శ్రీయుత గొర్తి వెంకట్రావుగారు ఎం. ఏ. యల్. యల్. బి.
12. కాకతీయుల ఆంధ్రభాషాసేవ. ౧౬౦-౧౬౩
    శ్రీయుత దూపాటి శేషాచార్యులుగారు.
13. కాకతీయప్రశంసా పంచరత్నములు. ౧౬౪
    శ్రీయుత సాగి వెంకటనరసింహముగారు ఎం. ఏ.

14. కాకతీయులు రెడ్లు. ౧౬౫-౧౬౮
శ్రీయుత బి. కృష్ణమూర్తిగారు.
15. కాకతీయ రాజ్యము - భౌతికస్వరూపము. ౧౬౯. ౧౭౬
శ్రీయుత రాళ్లబండి సుబ్బారావుగారు ఎం. ఏ. యల్. టి.
16. కాకతీయులు - కళింగము. ౧౭౭-౧౮౨
శ్రీయుత మల్లంపల్లి సోమశేఖరశర్మగారు.
♦ 17. రుద్రమ్మ. ౧౮౩
శ్రీయుత పాటిబండ మాధవశర్మగారు.
18. కాకతీయవంశము. ౧౮౯-౧౬౭
శ్రీయుత మేడేపల్లి వెంకటరమణాచార్యులుగారు.
19. ప్రతాపరుద్రీయము ౧౫౭-౨౦౨
శ్రీయుత మేడేపల్లి వెంకటరమణాచార్యులుగారు.
20. ఓరుగల్లుచరిత్ర. ౨౦౩-౨౦౬
మౌల్వీసయ్యద్ అహమదుల్లాసాహెబ్ గారు.
21. పాలకురికి సోమనాథకవి. ౨౦౭-౨౨౬
శ్రీయుత బండారు తమ్మయ్యగారు.
22. కాకతీయ నాణెములు. ౨౨౭-౨౨౮
శ్రీయుత ఎస్. టి. శ్రీనివాసగోపాలాచార్యులుగారు. ఎం. ఎల్.
23. కాకతీయులు - ద్రవిడ వాఙ్మయము. ౨౨౯-౨౩౧
శ్రీయుత సోమసుందర దేశికరుగారు.
♦ 24. గణపతిదేవప్రశంస. ౨౩౧-౨౩౨
శ్రీయుత నేదూరి గంగాధరంగారు.
25. కాకతీయులనాటి సాంఘిక చరిత్ర. ౨౩౩-౨౪౩
శ్రీయుత సురవరము ప్రతాపరెడ్డిగారు బి. ఏ. బి. యల్.
26. వినుకొండ వల్లభరాయని క్రీడాభిరామము. ౨౪౩-౨౪౮
శ్రీయుత టేకుమళ్ల అచ్యుతరావుగారు ఎం. ఏ. యల్. టి.
27. ప్రతాపచరిత్రము. ౨౪౯-౨౫౩
శ్రీయుత కె. రాఘవాచార్యులుగారు ఎం. ఏ. బి. యల్.
28. కాకతీయులచరిత్రము-విశేషాంశములు. ౨౫౪-౨౬౦
శ్రీయుత దూపాటి రమణాచార్యులుగారు.
29. గద్వాలసంస్థానము. ౨౬౧-౨౭౨
శ్రీయుత మారేమండ రామారావుగారు ఎం. ఏ. బి. ఇడి.
30. కాకతీయవంశోత్సవము. ౨౭౩-౩౦౨
సంపాదకుడు.
అకారాదిసూచిక. ౩౦౫-౩౩౦

♦ ఈగుర్తు గలవి పద్యవ్యాసములు.

అనుబంధము — విషయసూచిక

—o—

వాఙ్మయము.

1. ప్రతాపరుద్రీయమ్ 1-8
2. హేమాద్రివ్రతఖండము-రాజ ప్రశస్తి 9
3. శివయోగసారము 10-20
4. మార్కండేయపురాణము 20-22
5. రంగనాథరామాయణము 22-24
6. రాజకాలనిర్ణయము 24-26
7. భాస్కరరామాయణము 26-27
8. భీమేశ్వరపురాణము 27-28
9. దశరథరాజనందనచరిత్రము 28
10. బాల భారతము ,,
11. అప్పకవీయము ,,
12. ఉదారరాఘవము ,,

శాసనములు.

1. ఖాజీపేటశాసనము 29
2. ,, ,, ,,
3. గూడూరుశాసనము 30
4. అనుమకొండశాసనము 31
5. ఖాజీపేటశాసనము ,,
6. హనుమకొండశాసనము 32-39
7. మామిళ్ళపల్లిశాసనము 39-40
8. ,, ,, 40
9. లేములవాడశాసనము 41
10. నగునూరు శాసనము ,,
11. గణపవరము శాసనము ,,
12. బెక్కల్లు శాసనము 42-43

13. పిల్లలమఱ్ఱి శాసనము	44-45
14. కుందవరము శాసనము	45-48
15. ఉప్పరపల్లిశాసనము	48-50
16. పాళాల శాసనము	50-55
17. ఏకామ్రనాథ శాసనము	55-57
18. పాలంపేట శాసనము	57-59
19. పిల్లలమఱ్ఱి శాసనము	59-60
20. ,, ,,	60-61
21. నాగులపాడు శాసనము	61
22. ,, ,,	62
23. ,, ,,	62
24. ,, ,,	63
25. ముప్పవరము శాసనము	63-64
26. వరంగల్లు శాసనము	64-66
27. పమ్మి శాసనము	66-68
28. బూరుగుగడ్డ శాసనము	68
29. పానుగల్లు శాసనము	,,
30. కొలనుపాక శాసనము	68-71
31. మల్కాపుర శాసనము	71-81
32 కోటగిరి తామ్ర శాసనము	81-84
33. రాయచూరు శాసనము	84-85
34. తెరాల శాసనము	85-86
35. గణపవరము శాసనము	86
36. కారెంపూడి శాసనము	86-87
37. టేకుమాల శాసనము	87
38. కలవకోలను శాసనము	88
39. మాదిరెడ్డికుంట శాసనము	88-89
అకారాది సూచిక	91-98

చిత్రపటముల వివరము

1 కాకతీయసంచికా సంపాదకీయసంఘము. ముఖపత్రము

2 శ్రీయుత ధర్మవీర్ వామననాయక్ గారు, జాగీర్దారు
శ్రీయుత పింగళి వెంకటరామారెడ్డిగారు దేశముఖ్
ప్రొఫెసరు శిరుగూరి హనుమంతరావుగారు
ఎం. ఏ. ఎల్. టి.
శ్రీయుత మాదిరాజు రామకోటేశ్వరరావుగారు. ,,

3 కీ॥ శే॥ మహారాజా శ్రీసీతారామభూపాల్ బహద్దరువారు -
గద్వాల సంస్థానాధీశ్వరులు. II ఎదుట

4 శ్రీరాజా వెంకటరామారెడ్డి బహద్దరువారు ఓ. బి. ఇ. III

5 హనుమకొండ పద్మాక్షీయాలయమునందలి యక్షుడు. ౨౨ ,,

6 డిటో డిటో పద్మాక్షీవిగ్రహము. ౨౩ ,,

7 హనుమకొండ పద్మాక్షీఆలయమువద్ద బండపైనున్న జైనవిగ్రహములు. ౨౪

8 హనుమకొండ సహస్రస్తంభదేవాలయము- మండపము.
డిటో డిటో ప్రధానాలయము ౨౫ ,,

9 ద్రాక్షారామ భీమేశ్వరాలయము
బోధాన్ దేవాలయము-మసీదుగామార్చబడినది. ౭౪ ,,

10 హనుమకొండ సహస్రస్తంభదేవాలయము-ఒకపార్శ్వము. ౩౫ ,,

11 శ్రీయుత ముక్త్యాల వెంకటకృష్ణయ్యగారు. ౮౮ ,,

12 ఏకశిలానగరదుర్గము. ౮౯ ,,

13 వరంగల్లుకోట ఏకశిల. ౯౦ ,,

14 డిటో జీర్ణదేవాలయము - ద్వారము. ౯౧ ,,

15 డిటో మట్టిగోడ. ౯౨ ,,

16 నగునూరు దేవాలయము. ౯౩ ,,

17 ఏకశిలానగరదృశ్యములు-
శిలాప్రాకారము-లోభాగము
మనోహరమగు ద్వారము
చెదరిన నంది ౯౪ ,,

18	ఏకశిలానగరదృశ్యములు - నాజుతల స్వయంభూదేవాలయము-భిన్నశిల్పములు స్వయంభూదేవాలయము	౯౫	,,
19	వరంగల్ కోట-సింహద్వారము	౯౬	,,
20	వరంగల్ కోట-జీర్ణమంటపము	౯౭	,,
21	వరంగల్ కోట-వెంకటేశాలయములోని స్తంభము	౧౧౬	,,
22	రామప్పదేవాలయము-ద్వారము డిటో - లోపలిగోడపై శిల్పము	౧౧౭	,,
23.	రామప్పదేవాలయాంతర్భాగము	౧౫౨	,,
24.	రామప్పదేవాలయము-గర్భాలయద్వారము	౧౫౯	,,
25.	కాకతీయరాజ్యము-భౌతికస్వరూపము	౧౬౯	,,
26.	పానగల్లు దేవాలయము	౧౭౦	,,
27.	యాదగిరి దుర్గము	౧౭౧	,,
28.	పాలంపేట దేవాలయము-యక్షిణీవిగ్రహము	౧౭౬	,,
29.	హనుమకొండ సహస్రస్తంభదేవాలయము-ఒక స్తంభము	౧౭౭	,,
30.	వరంగల్లుకోట-కుషీమహల్‌లోభాగము	౨౩౬	,,
31.	వరంగల్లుకోట-తూర్పుద్వారము	౨౩౭	,,
32.	రాయచూరుదుర్గము-దూలములను మోసికొనిపోవుట డిటో - రథయాత్ర	౨౮౨	,,
33.	రాయచూరుదుర్గము-హిందువులగోడ	౨౮౩	,,
34.	వరంగల్లుకోట-కుషీమహల్	౨౮౬	,,
35.	వరంగల్లుకోట-కుషీమహల్ ద్వారము	౨౮౭	,,
36.	భువనగిరిదుర్గము	౨౬౦	,,
37.	రాయచూరు దుర్గము-మరియొకదృశ్యము	౨౬౧	,,
38.	కాకతీయవర్ధంత్యుత్సవము-ప్రతినిధులు, ప్రేక్షకులు	౨౭౨	,,
39.	కాకతీయవర్ధంత్యుత్సవము-ఆహ్వానసంఘము, స్వచ్ఛంద సేవకులు	౨౭౩	,,
40.	కాకతీయ సభావ్యవసాపకులు	౨౭౪	,,
41.	పెద్దచెరుకూరు శాసనము	౨౭౫	,,
42.	పాలంపేట దేవాలయము-శిఖరము	౨౮౨	,,
43.	పాలంపేట దేవాలయము-ముఖమంటపము	౨౮౩	,,

			ఎదుట
44.	ఇత్తగి దేవాలయశిఖరము	౨౫౬	,,
45.	ఇత్తగి దేవాలయము-స్తంభములు	౨౫౭	,,
46.	కాకతీయవర్ధంత్యుత్సవ చారిత్రికవస్తుప్రదర్శనము-స్థానికశాఖ డిట్టో నైజాంప్రభుత్వ ఆర్షశాఖ	౨౯౨	,,
47.	కొప్పల్ దుర్గము	౨౯౩	,,
48.	పానుగల్లు-పంచమహాశిహాలయ శిల్పములు	(అనుబంధము) 70	,,
49.	మల్కాపురశాసనము (భాగము)	,, 71	,,
50-55	కోటగిరి తామ్రశాసనము	,, 80-81	,,

సంపాదకీయ విజ్ఞాపనము.

రాజమహేంద్రవరమున సుమారు పండ్రెండు సంవత్సరములనుండియు ఆంధ్రేతిహాస పరిశోధకమండలివారు చరిత్రపరిశోధనకార్యమును నిర్వహించుచుండు టాంధ్రలోకమునకు జిరపరిచితమైన విషయమే. ఈమండలివారు 1922 వ సంవత్సరమున రాజరాజపట్టాభిషేకవర్ధంతిని, 1927 వ సంవత్సరమున కళింగదేశవర్ధంతిని జరపి రాజరాజకళింగసంచికలను బ్రకటించియున్నారు. అటుపై గాకతీయోత్సవమును జరపి తత్ఫలితముగ గాకతీయసంచికను బ్రకటింపవలెనని వారు 1931 డిశంబరునెలలో నిశ్చయించిరి.

సంపాదకీయసంఘము.

కాకతీయసంచికకు నేను సంపాదకుడుగను, శ్రీయుత జయంతి రామయ్యపంతులు, రాళ్ళబండి సుబ్బారావు, టేకుమళ్ళ అచ్యుతరావు, భావరాజు వెంకటకృష్ణారావు గార్లు సంపాదకీయసంఘసభ్యులుగను నియమింపబడితిమి. పిమ్మట నేనును అప్పటి మండలికార్యదర్శియగు శ్రీయుత సుబ్బారావుగారును హనుమకొండ హైదరాబాదు పట్టణములకేగి కాకతీయోత్సవమును గాకతీయరాజధానులగు హనుమకొండ వరంగల్లు నగరములలో జరపుటకు వలయు బ్రయత్నములను జేసితిమి. ఈయుత్సవము 1932 వ సంవత్సరము ఏప్రిలు నెలలో జయప్రదముగ జరగినది. మండలివారి యాహ్వానము నంగీకరించి కొందరు పండితు లుత్సవమునకు వచ్చి కాకతీయుల చరిత్రమునకు సంబంధించిన వ్యాసములను పద్యములను జదివిరి. మరికొందరు చక్కని యువన్యాసముల నొసంగిరి ఉత్సవసమయమునకే పదునాలుగు వ్యాసములు మాకు జేరినవి. శ్రీయుత రామయ్యపంతులుగారు దేహానారోగ్యమువలన నంచికాసంపాదకీయవర్గమున నుండజాలమని తెల్పుటచే వారి స్థానమున హైదరాబాదు వాస్తవ్యులును చరిత్రకోవిదులు నగు శ్రీయుత సురవరము ప్రతాపరెడ్డిగారిని మండలివారు సభ్యులుగ నెన్నుకొనిరి. 1933 వ సంవత్సరమున మండలి కార్యనిర్వాహకవర్గమున జరగిన మార్పుననుసరించి యప్పటి సంయుక్తకార్యదర్శులగు శ్రీయుత వడ్డాది అప్పారావు, చిర్రావూరి ఆత్మారాంగార్లును సంపాదకీయ వర్గమున సభ్యులైరి. 1934 వ సంవత్సరము ఏప్రిలునెలలో శ్రీయుత అప్పారావుగారు తమ సంయుక్త కార్యదర్శిత్వమునుండి విరమించుటవలనను, శ్రీయుత భావరాజు వెంకటకృష్ణారావుగారు మండలిలోనుండి తమ సభ్యత్వమును వదలుకొనుటవలనను నంచికాసంపాదకీయ వర్గమునుండి వారి స్థానములు ఖాళీయైనవి. మిగిలినవారు తుదవరకును నంచికాకార్యమును నిర్వహించిరి.

కి. శే. మహారాజా శ్రీ సీతారామ భూపాల్ బహద్దరువారు గద్వాలసంస్థానాధీశ్వరులు.

శ్రీ రాజా వెంకటరామారెడ్డి బహద్దరువారు. ఓ. బి. ఇ.
పోలీసు కమీషనర్, హైదరాబాదు.

ముద్రణము

కాకతీయోత్సవమయిన పిమ్మట మరికొన్ని గద్య పద్య వ్యాసములును, శాసనములును చేరినవి 1932 వ సంవత్సరము జూలై నెలలో సంచికాముద్రణ మారంభింపబడినది. సెప్టెంబరు నెలలో నేను శ్రీయుత రాళ్ళబండి సుబ్బారావుగారును హైదరాబాదుకు బోయి శ్రీరాజావెంకటరామారెడ్డి బహద్దరు ఓ. బి. ఇ. వారిని దర్శించి వారిద్వారా శ్రీశ్రీశ్రీ గద్వాల మహారాణీ సాహేబా వారి దర్శనము చేసి సంచికకై వారి సాహాయ్యమును వేడితిమి. విద్యాపోషకులు సుదార హృదయులగు శ్రీవారు మండలి చేయుచున్నపరిశ్రమ ననేక విధముల బ్రశంసించి రు 500 ల విరాళమును దయచేసిరి. శ్రీరాజా వెంకటరామారెడ్డి బహద్దరు వారును రు 200 (O. S) ల విరాళమునొసంగి మండలిపై దమకుగల యవ్యాజానురాగమును బ్రకటించిరి. పిమ్మట మహాఘనతవహించిన శ్రీ నైజాం ప్రభుత్వమువారి యార్షశాఖవారు నాయభ్యర్థనమును మన్నించి ముద్రణార్థ మమాల్యములగు బ్లాకులను బంపిరి. 1933 వ సంవత్సరము జూలై నాటికి గాకతీయసంచిక 200 పుటలును, ముప్పదిబ్లాకులును ముద్రింపబడినవి.

అటుపై గొండరుప్రముఖులు బంపెదమని వాగ్దానము జేసిన వ్యాసములకొరకును శ్రీశ్రీశ్రీ గద్వాల మహారాణీసాహేబావారు బంపెదమనిన వారి సంస్థానచరిత్రముకొరకు నాకుమానములు వేచియుండవలసివచ్చెను. అనుబంధములో జాలభాగము నీలోపున బూర్తి చేసితిమి. పిమ్మట అక్టోబరునెలలో శ్రీ శ్రీ శ్రీ మహారాణీసాహేబావారి యాహ్వానముపై నేను గద్వాలకేగి, పరిశోధనాపూర్వకముగ వారి సంస్థానచరిత్రమును రచించివచ్చుటచే మరి యారు మాసములయాలస్య మయ్యెను. అప్పుడుగాని యాచరిత్రసారాంశమును సంచికలో ముద్రింప వీలుపడలేదు. అప్పటికి హైదరాబాదునుండి గోల్కొండపత్రికా కార్యాలయమువారును, మదరాసునుండి భారతిపత్రికా కార్యాలయమువారును మరికొన్ని బ్లాకులను బంపియుండుటచే వానిని ముద్రించితిమి.

ఇంతలో మండలి కార్థికముగ గొన్నిచిక్కులు దటస్థించినవి. దీనికితోడు ముద్రణాలయమును మార్చవలసివచ్చెను. ఈకారణములచే గొంతయాలస్యమైనది. 1934 వ సంవత్సరము జూలై నాటికి సంచికమూలమును, అనుబంధమును బూర్తియైనది. అటుపై ముద్రింపవలసిన "అకారాది సూచిక" లను నేనే తయారుచేయవలసి వచ్చినది. ఈకార్యముయొక్క స్వభావనుబట్టియు, నేను కార్యాంతరములచే దరచుగ గ్రామమున లేకుండుటవలనను మరికొంత యాలస్యమైనది.

వ్యాసములు.

ఈసంచికలో బ్రకటింపబడిన వ్యాసములనుగూర్చి కొన్నిమాటలు చెప్పవలసియున్నవి. చరిత్రాత్మకములగువానిలో "కాకతీయులచరిత్రము" అను నావ్యాసము మదరాసువిశ్వవిద్యాలయమున బరిశోధక విద్యార్థిగనుండినపుడును, పిమ్మట హైదరాబాదు లక్ష్మణరాయ పరిశోధకమండలివారి శాసనములను జూచినపుడును నేను సేకరించిన విషయముల నాధారముగ జేసికొని వ్రాయబడినది. అందుచేర్కొనబడిన నైజాంరాష్ట్రశాసనములు చాలభాగ మనుబంధమున జేర్పబడినవి. శ్రీయుత గొర్తి వెంకటరావుగారి వ్యాసము ప్రతాపరుద్రునినాటి దేశపరిస్థితులను స్పష్టీకరించి, మహమ్మదీయుల వ్రాతలనుండి యాంధ్రదేశముపై తురుష్కులొనర్చినదండయాత్రలనుగూర్చి దెలియనగు విశేషాంశముల నెన్నిటినో దెల్పుచున్నది. "కాకతీయులు — కళింగము" అను శ్రీయుత సోమశేఖరశర్మగారి యమూల్యమగువ్యాసము "కళింగసంచిక" నుండి పునర్ముద్రితము. శ్రీయుత దూపాటి రమణాచార్యులవారు "కాకతీయుల చరిత్రము — విశేషాంశములు" అను వ్యాసమునందు నైజాంరాజ్యమున చిరకాలమునుండియు తాముజేయుచున్న శాసనపరిశోధనాఫలితములగు నూతనాంశముల నెన్నిటినో పేర్కొనియున్నారు.

స్థానికచరిత్రములకు సంబంధించిన వ్యాసములు మూడీసంచికలో ముద్రింపబడినవి. శ్రీయుత పింగిలి వెంకటేశ్వరరావుగారి "హనుమకొండస్థానికచరిత్రము" ప్రాచీనగాథలను, చారిత్రికాంశములను సమన్వయించి వ్రాయబడినది. మౌల్వీసయ్యద్ అహమ్మదుల్లాసాహేబ్ గారి "ఓరుగల్లుచరిత్ర" మహమ్మదీయచరిత్రకారుల వ్రాతల ననుసరించి నిర్మింపబడినది. ఉర్దూభాషలోనున్న యీవ్యాసము శ్రీయుత ప్రతాపరెడ్డిగారిచే భాషాంతరీకరింపబడినది. శ్రీయుత కె. రాఘవాచార్యులుగారు "ప్రతాపచరిత్రము" అను వ్యాసమునం దాపేరుగల రెండు గ్రంథములందును గన్పించు వ్యత్యస్తవిషయములను జర్చించి వానిని శాసనాదిచారిత్రక ప్రమాణములతో సమన్వయించి యీగ్రంథముల మూల్యమును నిర్ణయించియున్నారు.

ఈసంచికలో వాఙ్మయమునకు సంబంధించిన వ్యాసము లారు గలవు. శ్రీయుత నిడుదవోలు వెంకటరావుగారు క్రీ. శ. 1100-1350 నడుమగల వాఙ్మయయుగమునకు గాకతీయయుగమనిపేరిడి, యందుండిన కవులనుగూర్చియు సంగ్రహముగ వ్రాసియున్నారు. "కాకతీయ ఆంధ్రభాషాసేవ" యనువ్యాసమున శ్రీయుతదూపాటి శేషాచార్యుగారు శాసనములనుండి తెలియనగుగొందరుసంస్కృతాంధ్రకవులనుగూర్చియు, ప్రతాపరుద్రునికాలపుగవితల్లజులనుగూర్చియు నమూల్యాంశములను వెలిబుచ్చియున్నారు. "పాలకురికిసోమనాథకవి" నిగూర్చి శ్రీయుతబండారు

తమ్మయ్యగారు వ్రాసిన వ్యాసము విశేషపరిశోధనాఫలితము. క్రీడాభిరామకర్తృత్వమును గూర్చిగల వివిధాభిప్రాయములను జర్చించి శ్రీయుత టేకుమళ్ళఅచ్యుతరావుగారు తమవ్యాసమున వల్లభరాయనికర్తృత్వము నిరూపించినారు. శ్రీయుత మేడేపల్లివెంకటరమణాచార్యులవారు "ప్రతాపరుద్రీయము" అనువ్యాసమున నాపేరుగల యలంకారగ్రంథముయొక్క సారస్వతప్రాశస్త్యమును బ్రశంసించి యందలి చారిత్రికాంశములను వివరించియున్నారు. "కాకతీయులు—ద్రవిడవాఙ్మయము" అను శ్రీయుతసోమసుందరదేశికరుగారివ్యాసమును, "కాకతీయనాణెములు" అను శ్రీయుతగోపాలాచార్యులవారివ్యాసము నాంగ్లమున మండలివారి త్రైమాసికపత్రికలో బ్రకటింపబడి నాచే నాంధ్రీకరింపబడినవి.

ఈసంచికలో సాంఘికవిషయములకు సంబంధించిన వ్యాసములు నాల్గుగలవు. "విద్యానాథునికాకతీయాన్వయ నిరూపణము" అను వ్యాసమున శ్రీయుత రుద్రరాజ నరసింహరాజుగారు గాకతీయులు క్షత్రియేతరులనువాదమును బ్రతిఘటించి, వారుక్షత్రియులనుటకు ప్రతాపరుద్రీయమునుండి యాధారములను జూపి, యత్యర్కేందుకులత్వమును క్షత్రియత్వమనుట కుపపత్తులను బేర్కొనియున్నారు. "కాకతీయులురెడ్లు" అను శ్రీయుత బి. కృష్ణమూర్తిగారివ్యాసము గాకతీయకులమునుగూర్చి గల రెండవవాదమును దెల్పుచున్నది. "కాకతీయుల నాటిసాంఘికచరిత్ర" యనుశీర్షికగల రెండువ్యాసములలో శ్రీయుత అంబడి సుబ్బరాయచెట్టిగారును, శ్రీయుత సురవరము ప్రతాపరెడ్డిగారును శాసనవాఙ్మయాద్యాధారములనుండి దెలియనగు కాకతీయసామ్రాజ్యమునందలి మతసాంఘికార్థికనైతిక పరిస్థితులను, వాణిజ్యవ్యవసాయములస్థితిని జక్కగ వర్ణించియున్నారు.

వివిధాంశములకు సంబంధించిన మరిమూడు వ్యాసము లీసంచికలో గలవు. అందు "కాకతీయరాజ్యము - భౌతికస్వరూపము" అను శ్రీయుత రాళ్ళబండి సుబ్బారావుగారి వ్యాసమున నీరాజ్యపుటెల్లలును, భౌతికసంపద, శీతోష్ణస్థితి, పంటలు, వాణిజ్యము మున్నగునవి వర్ణింపబడినవి. కాకతీయప్రతాపరుద్రదేవునికాలమునం దుద్భవించి, నాటినుండియు విద్యాపోషణమునకు బేరెన్నికగాంచి, నేటికి నాంధ్రసంస్థానములలో నగ్రగణ్యమై యలరారుచున్న గద్వాలసంస్థానచరిత్ర మదేపేరుగల వ్యాసమున గ్లుప్తముగ నాచే వర్ణింపబడినది.

ఇవిగాక నీసంచికలో గాకతీయరాజులగు ప్రోలరాజ గణపతిదేవ రుద్రాంబా ప్రతాపరుద్రాదులను బ్రసంసించు పద్యవ్యాసము లారు గలవు.

మాయభ్యర్థనమును మన్నించి రు. 500 ల మహావిరాళము నొసంగిన శ్రీ శ్రీ శ్రీ గద్వాల మహారాణీసాహెబావారికిని, తమంతటదామే రు. 200 ల విరాళము నొసంగి మాకనేకవిధముల నుపకారముల నొనర్చిన శ్రీరాజా వెంకటరామారెడ్డి బహద్దరు ఓ. బి. ఇ. వారికి నితరదాతలకును మాకృతజ్ఞతాపూర్వక వందనములు. ఈసంచికలో ముద్రించుటకై బ్లాకులనెరువొసంగిన శ్రీనైజాం ప్రభుత్వార్వ శాఖవారికిని, గోల్కొండ భారతీపత్రికాధిపతులకును, ఆంధ్రసాహిత్యపరిషత్తువారికిని, ఏకశిలానగరదుర్గపు ప్లానును దయతోనొసంగిన వరంగల్ తాలుక్దారువారికిని, స్థానికశిథిలముల ఫొటోలను బంపిన కాకతీయోత్సవాహ్వాన సంఘమువారికిని, కాకతీయసభాధ్యక్షోపన్యాసమును దెలుగుజేసియిచ్చిన శ్రీయుత మాడపాటి హనుమంతరావుపంతులుగారికిని మండలివారు మిక్కిలి కృతజ్ఞులు. అమూల్యములగు గద్యపద్యవ్యాసములను బంపిన పండితవర్యులకు మావందనములు. ఈసంచికా సంపాదకీయ సంఘమువారికిని, ముఖ్యముగ ముద్రణాకార్యమున నాకనేకవిధముల దోడ్పడిన నామిత్రులు శ్రీయుత రాళ్ళబండి సుబ్బారావుగారికిని, అనుబంధములో జేర్పబడిన శాసనములలో గొన్నిటిని దయతోనొసంగిన శ్రీయుత దూపాటి రమణాచార్యులవారికిని, ఉద్గ్రంథవ్యాసమును భాషాంతరీకరించియిచ్చి మరియు ననేకవిధముల సహాయముజేసిన నామిత్రులగు శ్రీయుత సురవరము ప్రతాపరెడ్డిగారికిని నాకృతజ్ఞతాపూర్వక వందనములు.

సంచికా ముద్రణము నోర్పుతో నిర్వహించి తోడ్పడిన రాజన్ ముద్రణాలయాధికారులకును, సుజనరంజనీ ముద్రణాలయాధికారులకును నేను మిక్కిలి కృతజ్ఞుడను.

అనివార్యములగు గారణములవలన నీసంచికాప్రకటన మాలస్యమగుటయు, నిందుగొన్ని తప్పులుపడుటయు జరిగినవి. సహృదయులగు పాఠకమహాశయు లీప్రమాదములను మన్నింతురుగాక!

రాజమహేంద్రవరము.
15-3-1935

మా రే మం డ రా మా రా వు, ఎం. ఏ. బి. ఇ. డి.
సంపాదకుడు.

కాకతీయుల చరిత్రము

శ్రీ కూకటి వారి వెంకట రామారావు గారు, యం.ఏ. బి. ఇ.డి

1 ప్రాముఖ్యత

అనుపమతేజోవంతమై యాసేతుశీతాచల పరిగీత యశోవిశేషమై మూడుశతాబ్దముల కాలము వెలుగొందిన కాకతీయసామ్రాజ్య చరిత్ర మాంధ్రుల చరిత్రమునకేగాక భారతదేశచరిత్రమునకుఁగూడ మిగుల ముఖ్యమైనది. క్రీ. పూ. 3 వ శతాబ్దమునుండి యాఱువందలసంవత్సరము లాంధ్రదేశము నేలిన శాతవాహనవంశజులకుఁ బిమ్మట నంతటి సువిస్తృతభూభాగముపై పరిపాలనమును నెఱపిన రాజవంశము కాకతీయవంశమే. మధ్యయుగమునందీ దేశమున వివిధభాగములపై యధికారము నెఱపిన వేంగీచాళుక్య, పశ్చిమచాళుక్య, చోళవంశముల చరిత్రములందలి విశేషభాగము కాకతీయవంశచరిత్రమునందిమిడియున్నది. ప్రకృతమునందాంధ్రభాష వ్యవహారమునఁ గల భూభాగమునంతటిని దమయేకచ్ఛత్రాధిపత్యమునకుఁ గొని తెచ్చి యాంధ్రభావమున కంకురార్పణ మొనర్చిన వారలు కాకతీయచక్రవర్తులు. వీరిపరిపాలనాకాలముననే యనేకములగు సాంఘికపరిణామము లొదవి బ్రకృత విభాగము లేర్పడినవి. బౌద్ధ జైన శైవ వైష్ణవమతము లీకాలమున బ్రబలి యన్యోన్యసంఘర్షణచే గొన్ని క్షీణించుటయు గొన్నివర్ధిల్లుటయు సంభవించినవి. గీర్వాణాంధ్రవాఙ్మయపోషణమున కేకశిలానగరసామ్రాజ్యము పెట్టినదిపేరుగ నుండెను. సుప్రసిద్ధులగు కవికుంజరు లనేకులు కావ్యనాటకాదులను రచించియు, విద్వచ్ఛిఖామణులనేకులు వివిధశాస్త్రములఁ జర్చించి సుగతముల నొనర్చియు సంస్కృతభాషాపోషకు నూతనాలంకారముల నొనగూర్చిరి. ఆంధ్రకవితకు రాజమహేంద్రవర విక్రమసింహపురములకుఁ బిమ్మట నోర్గల్లుపురమే రంగస్థలముగ నుండినది. కాకతీయచక్రవర్తుల యాదరమునను పౌరాణిక యుగము పరిసమాప్తినంది భావిప్రబంధయుగమునకు మార్గమేర్పడినది. ఆకాలపుటాంధ్రుల యాదర్శవిశేషమునకును, భావనాశక్తికిని, కల్పనాచాతుర్యమునకును దాత్కాలిక శిల్పములే ప్రబలనిదర్శనములు. ఓరుగల్లు కోటలోని యాలయద్వారములకు బౌద్ధశిల్పచూడామణు లనదగు సాంచీద్వారములే సాటియని ఫెర్గుసన్ పండితుడు వ్రాసియున్నాడు. హనుమకొండ, పాలంపేట, రామప్ప, పిల్లలమఱ్ఱిమున్నగు స్థలములందలి యాలయరాజములు చాళుక్యహోయసలకళలను మించి యాంధ్రులకళాభినివేశమును వ్యక్తీకరించు చున్నవి. ఆర్థికవిషయమునఁ గూడ గాకతీయచక్రవర్తుల పరిపాలనాకాలము బ్రకృతమునకుఁ బ్రాతిపదికముగ నొప్పుచున్నది. విదేశవాణిజ్యమును పెంపొందించి

యు, దేశీయవాణిజ్యమును సుకరముగ నొన
ర్చియు, భూముల పరిమాణమును సస్యసమృ
ద్ధి ననుసరించియునే సుంకముల నేర్పరిచియు,
నరణ్యభాగములను గృషియోగ్యములుగ నొ
నర్చియు నీచక్రవర్తు లనేకవిధముల దేశక్షేమ
మునకై పాటుపడియుండిరి. కాకతీయులనాటి
కేంద్రస్థానికప్రభుత్వవిధానములును గ్రామపరి
పాలనావిధులు ననేకశతాబ్దములకాలము వర్ధి
ల్లి నేటికినిఁగాంచేనగుచున్నవి. ఇటునటుననేల
సర్వవిధములను గాకతీయచక్రవర్తుల పరిపాల
నాకాలమునం దాంధ్రుల కీర్తి ప్రతాపము
లెల్లెడలను వ్యాపించినవి. అట్టి యీచక్రవ
ర్తుల చరిత్రను బ్రకృతోపలబ్ధములగు చారి
త్రకాధారముల సాహాయ్యమున సంక్షేపముగ
లిఖించుటయే యీ వ్యాసముయొక్క ము
ఖ్యోద్దేశము.

II ఆధారములు.

శాసనములు:— కాకతీయులచరిత్ర రచన
కుఁ దగినయాధారములు పెక్కులు గలవు.
వానిలో శాసనములు ముఖ్యములైనవి. ఇయ్య
విచోలపరకు బ్రిటిష్‌గవర్నమెంటువారిదక్షిణ
హిందూదేశశాసన నివేదికలలో నుదహరింప
బడినవి. కొన్నిమాత్రము ఇండియన్ ఆంటి
క్వారీ, ఎపిగ్రాఫియా ఇండికా, దక్షిణహిం
దూదేశ శాసనసంపుటములు మున్నగు గ్రంథ
ములలో సమూలములుగను సవ్యాఖ్యానము
లుగను బ్రకటింపబడియున్నవి. ఇవిగాక హైద
రాబాదునుండి వెలువడు సుజాత పత్రికలో
నైజాంరాష్ట్రమునందలి కొన్ని యపూర్వ
శాసనముల నాంధ్రపరిశోధకమండలివారు ప్ర
చురించియున్నారు. ప్రకృతమున లక్ష్మణరా
య పరిశోధకమండలి యన బరగు నీమండలి
వారివద్ద నింక ననేకములగు శాసనములకుఁ
బ్రతిబింబములు గలవు. హైదరాబాదు ప్రభు
త్వమువారి యార్కియాలజీశాఖచే ఉప్పరపల్లి, పాలం
పేట, కోటగిరిశాసనములు బ్రకటింపబడి
యున్నవి. ఈశాసనము లన్నియు సందర్భాను
సారముగ పేర్కొనబడినవి. దిఙ్మాత్రముగ గొ
న్నిటి చారిత్రక ప్రామాణ్యముమాత్ర మిచ్చ
ట వివరింపబడుచున్నది. మోటుపల్లి, పాకాల
ఏకామ్రనాథ, పిల్లలమర్రి శాసనములు కాకతీ
యుల వంశక్రమమును నిర్ణయించుటకును,
పిల్లలమర్రి, నాగులపాడు, పాలంపేట, రామ
ప్ప శాసనములు రేచర్లవంశీయుల చరిత్రము
నకును, మాల్కాపురశాసనము తాత్కాలిక
మత పరిస్థితులను దెల్పుటకును, మోటుపల్లి
వారంగల్లు శాసనము లాకాలపు టార్థికస్థితిని
నిర్ణయించుటకు నుపయోగించుచున్నవి.

వాఙ్మయము:— శాసనములకుఁ బిమ్మ
ట గాకతీయచరిత్రరచనమున కెక్కుడుగ దో
డ్పడునవి సంస్కృతాంధ్రవాఙ్మయములు. ఇం
దు ప్రతాపరుద్రచక్రవర్తి యాస్థానకవిగ నుం
డిన విద్యానాథుడు రచించిన "ప్రతాపరుద్ర
యశోభూషణ" మను నాలంకారికగ్రంథ మ
గ్రగణ్యము. ఈగ్రంథకర్త నిజనామ మగస్త్యు
డనియు విద్యానాథు డనునది కేవలము బిరుద
మనియుఁ గొంద అభిప్రాయపడియున్నారు
ఇట్టి యూహకు "జాతోస్త్యగస్త్యః కిము"
అను నొక శ్లోకభాగము మాత్ర మాధార
ము. ఈగ్రంథమునుండి యనేక చరిత్రాంశ
ములు దెలియనగుచున్నవి. నాయకప్రకరణ
మునందు కాకతి యను దుర్గ 'యేకశిలానగరే
శ్వరులకుఁ గులదేవతయనియు గాకతీయకుల
"మత్యర్కేందుకుల" మనియు, ముమ్మడంబా

మహాదేవరాజులు ప్రతాపరుద్రుని దల్లిదండ్రు లనియు, నాతడు యువరాజుగ నుండగనే రాజ్యభారమును వహించె ననియు, జెప్పబడి యున్నది. కావ్యప్రకరణమునుండి కాకతీయులకు వరాహముద్ర యుండెడిదనియు, రుద్రదేవుడనునది రుద్రాంబికకు వ్యావహారికనామమనియు, రుద్రాంబ గణపతిదేవున కేకమాత్ర పుత్రికయనియు, నాతని యాజ్ఞచే నామె దౌహిత్రుండగు ప్రతాపరుద్రుని బుత్రునిగ బరిగ్రహించె ననియు, నాతడు యువరాజుగ నుండి యనేక విజయముల నందెననియుఁ దెలియుచున్నది. ప్రతాపరుద్రీయమునకుఁ బిమ్మట పేర్కొనదగిన సంస్కృతగ్రంథము గంగాంబ రచించిన "మధురావిజయము". దీని యవతారికలో నీ కవయిత్రి యేకశిలానగరమునఁ బ్రసిద్ధిగాంచిన యగస్త్య, విశ్వనాథ, నరసింహ, మల్లికార్జునాది గీర్వాణకవులను బేర్కొనినది. ఉదారరాఘవ నిరోష్ట్య రామాయణాది సకృల్లభ్యములగు గ్రంథములుగూడ తాత్కాలిక గీర్వాణభాషావైదుష్యమును నిరూపించు చున్నవి. ఆంధ్రవాఙ్మయమునఁ గాకతీయచరిత్రరచనమున కెక్కుడుగ దోడ్పడునది వల్లభామాత్యకృతమగు "క్రీడాభిరామము." దీని కర్తృత్వము వల్లభకవిదిగాక శ్రీనాథుని దని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చెప్పుచున్నారు. అది యెటులున్నను కాకతీయులనాటి సాంఘిక చరిత్రమును దెల్పునెడ నీగ్రంథ మద్వితీయము. నాటి యేకశిలానగర విభాగములు, ప్రజలలోని విభేదములు, నాకాలపు మతాచార వ్యవహారములు, ప్రజాసామాన్యము కాలక్షేపము నొనర్చు విధములు, రాజధానియందలి దేవాయతనములు మున్నగు విశేషాంశము లీ గ్రంథము నుండి దెలియనగుచున్నవి. శ్రీనాథుని పల్నాటి వీరచరిత్రమునుండి యాకాలమునం దోదవిన సాంఘికమతపరిణామములును, పద్మనాయక వంశోత్పత్తియు సువేద్యము లగుచున్నవి. మారన "మార్కండేయపురాణము"నఁ బ్రతాపరుద్రుని యాశ్రితుడగు నాగయగన్న మంత్రియొక్కయు నాతని వంశము యొక్కయుఁ బ్రశంసగన్పడుచున్నది. "భాస్కర రామాయణము"నుండి భాస్కరమల్లికార్జునయయ్యలార్యులను నాంధ్రకవిపుంగవుల నామములును, ప్రతాపరుద్రుని యశ్వసైన్యాధ్యక్షుండగు సాహిణిమారుడు నాతని వంశక్రమమును దెలియుచున్నవి. మతగ్రంథములుగూడ కాకతీయ చరిత్రాన్వేషణమున నెక్కుడుగ నుపకరించుచున్నవి. వానిలో "శివయోగసార" మగ్రగణ్యము. ఇయ్యది కొలనిగణపతిదేవకృతము. కాకతీయసేనానులలో నగ్రగణ్యులై, తుదకు రాజబంధువులుగూడనై సామ్రాజ్యమూలస్తంభులై యొప్పిన యిందులూరివారి వంశచరిత్రము నీగ్రంథము సవిస్తరముగఁ దెల్పుచున్నది. రెండవ ప్రోలరాజునుండి ప్రతాపరుద్రునికాలమువరకు నీవంశజు లమాత్యులుగ నుండిరి. వారిలో సోమన, అన్నయ, రుద్రుడు ననువారలు ముఖ్యులు. సోమమంత్రి గణపతిదేవచక్రవర్తి కాలమున గొలని సీమను గళింగమును జయించెను. అన్నయదేవు డైదులక్షలబలమున కధిపతియై బేతవోలు, ఓలచెర్ల, రాజమహేంద్రవరము మున్నగు దుర్గముల నేలుచు, కళింగరాజులను, పాండ్యులను తురకలను జయించి, ప్రతాపరుద్రుని బినతల్లియగు రుయ్యాంబను బెండ్లియాడి యోరుగల్లు మొదలు సింహాచలమువరకునుఁ గల భూభాగమునకు బ్రతినిధిపాలకుడుగ నుండె

ను. ఇటిగాక శివయోగసారమునుండి రుద్రాంబిక గణపతిదేవునికి గూతురనియు, ప్రతాపరుద్రుని తలిదండ్రులు ముమ్మడంబామహాదేవరాజు లనియు విశేషముగ దెలియుచున్నది. "గురుమల్లికార్జునపండితారాధ్యచరిత్రము"నుండియు పాల్కురికి సోమనాథుని గ్రంథములనుండియు తాతా లిక శైవమతప్రాబల్యము స్పష్టమగుచున్నది. అప్పకూర్యుడను జైనకవి రచించిన "జినేంద్రకల్యాణాభ్యుదయము"నుండి యాకాలమున కాకతీయప్రతాపరుద్రుని నిష్పక్షపాత విద్యాపోషకత్వము రూఢి యగుచున్నది.

స్థానికచరిత్రములు:—గడచిన శతాబ్ది మధ్యభాగమున కల్నల్ మెకంజీ యను దొర మనదేశమునందలి వివిధభాగములలో ప్రజాసామాన్యముయొక్క స్మృతి పథమునం దున్న పూర్వరాజుల చరిత్రములను గ్రామవృత్తాంతములను సేకరించి వ్రాయించి యుండెను. అందు వివిధప్రదేశములందున్న శాసనములకుఁ గూడ నకళ్ళు జేర్పబడినవి. చరిత్రరచనమున కీస్థానికచరిత్రము లమూల్యసాధనములుగ నున్నవి. ఇందలి విషయము లనేకములితరప్రమాణములకు సరిపడుచు నసహ్యసాధ్యములగు సమస్యలను నిర్ణయించుటకుఁ దోడ్పడుచున్నవి. అరువదినాలుగు సంపుటములుగల యీచరిత్రము మదరాస్ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున భద్రపరుపబడియున్నది. ఎలియట్ అనుదొర సంగ్రహించిన యొక శాసనసంపుటమునఁ గూడ గొన్ని యపూర్వశాసనములు గలవు.

వంశచరిత్రములు:— ఆంధ్రదేశమున రాజ్యమేలిన యనేక రాజవంశముల చరిత్రములు కర్ణాకర్ణిగ దేశమం దెల్లెడలను వ్యాపించియున్నవి. ఇయ్యవి చాలవరకు మెకంజీ దొరచే వ్రాయింపబడియున్నవి. ఇందు గాథలు పురాణములు పెక్కు లున్నను చరిత్రరచనకుఁ దోడ్పడు రత్నములు గొన్ని గలవు. కాకతీయచరిత్రమున కుపయోగించు వంశచరిత్రములును గాథలును, బెక్కులు గలవు. వీనిలో ఏకశిలానగరవృత్తాంతము, తెలుగురాజుల చరిత్రము, కలియుగరాజుల చరిత్రము, ప్రతాపరుద్రుని సంగతి, కాకతీయరాజ వంశావళి, సిద్ధేశ్వరచరిత్రము, సోమదేవగాజీయము, ఒంటిమిట్ట కరణాలకైఫీయతు, అనుమకొండ ఏకశిలానగరమును పాలించిన రాజుల వంశావళులు చర్యలు, ప్రతాపరుద్రుని వంశావళి, కాలజ్ఞానము నను తెలుగుగ్రంథములును, కుమారరామనచరితె, పరదార సోదరరామనచరితె యను కన్నడగ్రంథములును మిగుల ముఖ్యములైనవి.

శిల్పము:— దేవాలయ, ప్రాసాద తటాక, దుర్గాది వాస్తువులనుండి తాత్కాలికుల నిర్మాణ కళాకౌశలము వ్యక్తమగును. వారంగలు, హనుమకొండ, రామప్ప, పాలంపేట, పానగల్లు, పిల్లలమర్రి మున్నగు స్థలములందలి మహోన్నతదేవాలయములు కాకతీయులనాటి నిర్మాణకళ నభివర్ణింపుచున్నవి. అందలి సుందరశిల్పములనుండి నాకాలమునఁ గలమతాభినివేశము, సంగీతనర్తనకళల కొసగబడుచుండెడి యాదరము, తాత్కాలికవస్త్రభూషణాదులు మున్నగు విశేషాంశములును దెలియుచున్నవి.

దేశచరిత్రములు:— కాకతీయులచరిత్రము సమగ్రముగ నింతవరకు నెచ్చటను విశేషముగ గానరాకున్నది. ఆంధ్రచరిత్ర పరిశోధనమునకు మార్గదర్శులగు శ్రీయుత చిలుకూరి వీరభద్రరావుగారి "యాంధ్రులచరిత్రము"లోని

ద్వితీయభాగమునం దప్పటికిఁ బ్రకటింపబడిన సాధనముల యాధారమున కాకతీయుల చరిత్రము లిఖింపబడియున్నది. కె. వి. యస్. అయ్యరుగారి "పూర్వదక్కను చరిత్రము" నందొక ప్రకరణమున కాకతీయుల ప్రశంస గలదు. కాని యియ్యది కేవల మప్పటికిఁ బ్రకటితములైన శాసనములను మాత్ర మనుసరించి వ్రాయబడియుండుటచే నసమగ్రముగ నున్నది. ఇతరదేశములయొక్కయు చరిత్రములలో సందర్భానుసారముగ గాకతీయుల ప్రశంస కొంతగలదు. భాండార్కరుగారి "ప్రాచీన దక్షిణచరిత్రము"ను ఫ్లీటుదొరగారి "కన్నడ రాజవంశ చరిత్రము"ను, డాక్టరు కృష్ణస్వామిఅయ్యంగారి "దక్షిణ హిందూదేశము, మహమ్మదీయ విజేతలు" నను గ్రంథమును, ఎల్లియట్ & డౌసన్ అనువారి "హిందూదేశ చరిత్రము"ను అట్టివే. ఇవిగాక కాకతీయ సేనానుల సంతతివారలై బ్రకృతమున జమీందారులుగ నున్న వెలమ రెడ్డి కులజుల వంశ చరిత్రములు గొన్నిగలవు పద్మనాయక చరిత్రము, వెలుగోటివారి వంశావళి, సురభి వంశావళి, రెడ్డికుల నిర్ణయచంద్రిక మున్నగునవిట్టివి.

వ్యాసములు:—చరిత్ర పరిశోధకులు గొందరు యాదృచ్ఛికముగ గాక, తీయచరిత్రము నందలి కొన్నియంశములను జర్చించి యుండిరి. ఇవి యన్నియు పత్రికా, ముఖమున బ్రకటితములై యున్నవి. వానిలో నాంధ్రసాహిత్య పరిషత్పత్రికలో శ్రీ జయంతి రామయ్య, నీలాద్రి రాజుగార్లొనర్చిన కాకతీయుకుల నిర్ణయచర్చయు, ఆంధ్రపత్రికోగాది సంచికలోని శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి "రెండవ ప్రతాపరుద్రునినాటి యార్థిక పరిస్థితు"లను వ్యాసమును, శ్రీ శేషాద్రిరమణ కవులు భారతీ యుగాదిసంచిక, సుజాత, గోల్కొండ పత్రిక మున్నగు వానిలో వ్రాసిన వివిధ వ్యాసములును గాకతీయ చరిత్రాన్వేషుల కమూల్య సౌకర్యము నొసగూర్చుచున్నవి.

ఇంతవరకును వెలువడిన శాసన వాఙ్మయాది ప్రమాణములను, నైజాంరాష్ట్రమున లక్ష్మణరావు పరిశోధక మండలివారిచే సేకరింపబడిన యపూర్వ శాసనములను ఆధారముగ జేసికొని కాకతీయుల రాజకీయ చరిత్రమును సంక్షేపముగ నేను రాజమహేంద్రవరాంధ్రేతిహాసపరిశోధక మండలివారి త్రైమాసిక పత్రికలో బ్రకటించి యుంటిని.

ఇంతవరకును గాకతీయ చరిత్రమునకుఁగల చారిత్రక ప్రమాణములను పేర్కొని యుంటిమి వీని ప్రత్యేక ప్రామాణ్యము సందర్భానుసారముగ సూచింపబడును. ఇక వీని యాధారమున దెలియనగు కాకతీయుల చరిత్రము వివరింప బడుచున్నది.

III కాకతీయులెవరు?

కాకతీయులెవరు యెచ్చటివారలు నను నవి కాకతీయ చరిత్రమున ముందుగ బరిష్కరింపవలసిన ముఖ్య సమస్యలు. ఈ విషయములను గూర్చి దెల్పు నాధారములను బరిశీలించినచో ననేకవిధముల దోచుచున్నది అయినను వానిలో ముఖ్యము లగు వానినైనను మనమాలోచింప వలసియున్నది. ప్రతాపరుద్ర చక్రవర్తి కంకితమొనర్పడిన ప్రతాపరుద్రీయము నందు కాకతియను దుర్గాశక్తి యెకశిలానగరేశ్వరులకుఁ గుల దేవతయనియు, నామెనారాధించుటచే నావంశీయులు కాకతీయు లనబరగిరనియు జెప్ప

బడియున్నది. ఏకశిలానగరము నందాకాల మున గాకితమ్మ గుడియుండెడిదని క్రీడాభి రామము దెల్పుచున్నది.[1] కాకతియన గు మ్మడితీగెయనియు, నొక రాజాంతఃపురమును శత్రువులు నాశనమొనర్చు సమయమునం దొక బాలుడు దైవవశమున గృహమునుం డి వెలువడి యొక గుమ్మడితీగెలో జిక్కు కొని శత్రువుల బారినుండి దప్పెననియు, నాతడు ప్రియమునంది సంస్థానాధీశ్వరు డ య్యెననియు, నాతని సంతతివారెల్లరును దమ వంశమును రక్షించిన గుమ్మడితీగెను గౌర వించుట కై కాకతీయులమని చెప్పుకొను చుం డెడివారనియు ననితల్లి కలువచేరు శాసనము వలనఁ దెలియుచున్నది.[2] ఇదియంతయు నొ కగాథవలె గన్పట్టినను బ్రమాణాంతరముల నుబట్టి యిందుకొంతయైన నుపయోగ్యమగు నంశమున్నటుల దోచుచున్నది. కాకతీయ రాజులలో పూర్వులు జైనులుగ నుండినటు ల దెలియుచున్నది. వారిరాజధానులగు హ నుమకొండ వారంగల్లు ప్రాంతములలో నే టికిని జైనశిల్పములును కట్టడములు ననేక ములుగలవు. రాజులవలె నయ్యవిగూడ గా లక్రమమున శైవమును బరిగ్రహించినవి జైనశిల్పశాస్త్రమును సావధానముగ బరిశీ లించినచో గాకతీయులఁగూర్చి విశేషాంశ ములుగొన్ని వెలువడగలవు. హేమచంద్రు డనునాతడు "అభిదానచింతామణి", "త్రిషష్టిశ లాకా పురుషచరిత్రము"నను గ్రంథములలో జైనతీర్థంకరులయొక్కయు వారి కౌపచారికు లుగనుండు యక్షయక్షిణుల యొక్కయు లక్షణములను బేర్కొనియున్నాడు. నేమి యనునాత డిరువదిరెండవ తీర్థంకరుడు. ఆ తనికి "కూష్మాండినీ" యను యక్షిణి శా సనదేవి[3] శ్వేతాంబర జైనులీమెను "అం బికా" యనిపిల్చెదరు వారిశాస్త్రము ననుసరించి యీమెకు నాల్గు చేతులును, రెండు కుడిచేతులలో నొకదానిలో మామిడిపండ్ల గుత్తియు మరియొకదానిలో పాశమును, యెడమచేతులలో నొకదానియందంకుశమును మఱియొకదానియందొక శిశువు నుండవలెను. దిగంబరగ్రంథముల ననుసరించి యీమె తొ డలపై నానుకొని వడిలోనిర్వురు శిశువులుం డవలయును. కూష్మాండమన గుమ్మడి యని యర్థము. కలువచేరు శాసనమందలి గుమ్మడితీగెకును రాజశిశువునకును గల సంబంధమునకును జైన విగ్రహశిల్పమునం దలి కూష్మాండినీ నామకయక్షిణికిని యీ మెవడియందలి శిశువులకును సన్నిహితమగు సామ్యము గన్పడుచున్నది. "కాకతి" యను మాటకుగూడ గుమ్మడితీగెయనియే యర్థము. శాసనములలో కాకతీయ శబ్దమునకుఁ గాక తి, కాకత్య, కకెత, యనురూపాంతరము లు గాంచనగుచున్నవి. గాన "కాకతి" య ను వంశనామము కేవలమును గుమ్మడితీగె నుండి యుద్భవించె ననుటకంటెను, కూ ష్మాండినీయను జైనశాసనదేవి వలననే గలి గెననుట సమంజసముగనుండును. అయినచో గాకతీయులు మొదట జైనులుగనుండిరని ధ్రు వపడుచున్నది. దిగంబరులే కూష్మాండినీనా మము నుపయోగించి శ్వేతాంబరులాదేవి

---

1 కాకతమ్మకు కైదోడు యేకవీర.

2 ఆం. సా. ప. పత్రిక. IV. పే. 96—112

3 I. A. for 1903. P. 459,

నంబికయని బిలచుటచే గాకతీయులు మొదటిశాఖకే చెందియుండవలయును. రెండవ ప్రోలరాజు మొదటజైనుడుగ నుండినను బిమ్మట శైవమతము నవలంబించెను. ఆతని సంతతివా రందరును శివభక్తిపరాయణులై యుండిరి. గాన రాజమహేంద్రవర రెడ్డిరాజ వంశోద్భవయై 15 వ శతాబ్దమునందుండిన యనితల్లి కాలమునకే గాకతీయుల జైన మతావలంబనావిషయము సంపూర్ణముగ విస్మృతమైయుండి కూష్మాండినీ బ్రశంస యడుగంటియుండుటచే గాకతియన కూష్మాండమను నర్థముమాత్రము బరిగ్రహింపబడి యొకగాథ ప్రచురణలో నుండియుండును.

ఇంతవరకును గాకతీయులాదియందు జైనమతావలంబులని జెప్పియుంటిమి ఇటుపై వీరలెచ్చటివారలను విషయమును నిర్ణయింపవలసి యున్నది.

ప్రాచీన గాథలనుండిగాకతీయులనుమకొండ ప్రాంతమునకు వలసవచ్చిరని దెలియుచున్నది నైజాం రాష్ట్రములోని గంగాపురమునకును వీరికిని సంబంధము గన్పించుచున్నది. కాకతి బేత రాజు కొఱవిదేశమునఁ బ్రతిష్ఠింపబడియెనని యొక శాసనమునుండి దెలియనగును. 10 వ శతాబ్దినాటి యొక తూర్పు చాళుక్యశాసనమునఁ గాకతీయుల ప్రశంస గాననగుచున్నది.[4] ఈతామ్రశాసనము నించుక పరిశీలింపవలసి యున్నది. వేంగీచాళుక్యరాజగు రెండవ అమ్మరాజు తన పదునొకండవ రాజ్య సంవత్సరమున దనసవతి తమ్ముడగు దానార్ణవుని వేంగీదేశముపైఁ బ్రతినిధిఁజేసి తాను కళింగదేశముపై దాడివెడలెను. అట్టి సమయమున గుండియ రాష్ట్రకూటుని మనుమడును, ఎఱియ రాష్ట్రకూటుని కుమారుడునగు గుండ్యన లేక కాకర్త్యగుండ యను నాతని ప్రేరణచే నతవాటి విషయాధివాసుల కుద్దేశింపబడినది పైపేర్కొనబడిన దానశాసనము. అమ్మరాజు రాజ్యారంభమునుండి యీశాసనకాలము క్రీ. శ. 956 అగుచున్నది. కాకతీయపదప్రశంసగల శాసనములలో నిదియే మొట్టమొదటిది గుండ్యనపేరున కుపసర్గగనుండిన "కాకర్త్య" యను పదము కాకత్య, కాకత, కాకతి, కాకెతియను రూపాంతరములకు సరిచేయుట సమంజసముగ నుండును. గుండ్యన తండ్రి తాతలకు నామాంత్యమున "రాష్ట్రమాట" యని యుండుటయు నీతని పేరునకు కాకర్త్య యను నుపసర్గ యుండుటయు చిత్రముగ నున్నవి. రాష్ట్రకూట యను నామాంత్య పదమును రెండువిధములుగ నన్వయింపవచ్చును. ఈగుండియు మెఱయయనువారలు రాష్ట్రకూట వంశీయులుగనుండి కాకర్త్య గుండ్యన కాలమునం దాంధ్రదేశమున వేంగీ చాళుక్యసామంతులుగ స్థిరపడియైన నుండవలెను.[5] లేదేని "రాష్ట్రకూట" యనునది ప్రాయికముగ దామ్రశాసనములలో "రాష్ట్రకూట ప్రముఖాన్ సర్వేకుటుంబినస్స మాహూయ" యనునెడ గాంచేనగు నొక యుద్యోగమైనను గావలెను. అటులయిన చో స్థానికచరిత్రములలో గాంచేనగు రెడ్డి

4 C. P. No. 1 of 1916—17 & E. R. 1917. P 117.

5 కాకతీయులు మొదట రెడ్లుగ నుండిరను నొక యభిప్రాయము గలదు. రాష్ట్రకూట, రట్ట, రడ్డ, రడ్డి, రెడ్డి పదములు రూపాంతరములను భాషాశాస్త్రజ్ఞుల యభిప్రాయము ననుసరించి పైయట్లయి, గుండియు యనువారలును, అందుచే కాకతిప్రోలరాజాదులునుగూడ రెడ్లే యనియును దేలుచున్నది. పినిపలన గాకతీయులు మొదట రెడ్లు తఱువాత కమ్మవారు నను శ్రీయుత చిలుకూరి వీరభద్రరావుగారి వ్రాతలకు బాధ కలుగుచున్నది.

కరణము మున్నగు గ్రామోద్యోగులలోని రెడ్డికిని శాసనములందలి రాష్ట్రకూటునికిని సంబధముగాని సామ్యముగాని యుండవలెను. దీనిననుసరించి గుండ్యనయునాతని పూర్వులును రెడ్లుగ నుండియుందురను శంక వొడముచున్నది. గుండ్యన గాష్ట్రకూట పదమును విడనాడి కాకర్త్యయను నుపసర్గను గృహనామమునకు సరియగునటుల బరిగ్రహించుటకుఁ గారణమేమియో తెలియదు. సాధారణముగ గృహనామములు నివాసస్థానముల నుండియే బరిగ్రహింపఁ బడుచుండును. పిల్లలమఱ్ఱి బేతిరెడ్డి, వెల్నాటికులోత్తుంగ చోడ గొంకరాజు, ఓరుగంటి ప్రతాపరుద్రదేవమహారాజు మున్నగు నామములిందులకుఁ దార్కాణములు. అటులనే కాకతీయపదమునకు సరియగుపదమే నామముగా గల గ్రామమేదైన నున్నదియాయని చూచినచో మనకు మైసూరు రాజ్యమునఁ "గాకతి" యనునొక గ్రామము గన్పడుచున్నది.[6] దీనినుండి గుండ్యనయు నాతని పూర్వులును మొదట నీకాగతిగ్రామమునం దుండెడివారనియు నీతడాగ్రామ నామమునే బరిగ్రహించెననియు దోచుచున్నది.[7] ఈతని ప్రేరేపణ ననుసరించి చాళుక్యభూపాలకు డొకదానము నొసర్చెనన నీగుండ్యన విశేషప్రతిభా శాలియనియు నెక్కుడుపలుకుబడి, గలవాడనియు స్పష్టమగుచున్నది. ఈ ప్రాబల్యము ననుసరించియే యీతడు గృహనామమును గ్రహించి కొంతవ్యక్తిత్వమును జూపియుండెనని యూహింపవచ్చును. గాన గాకతీయవంశమున కీగుండ్యనయే మూలపురుషు డనఁదగును. ఈతనికాలము క్రీ. శ. 950. ప్రాంతమయి యుండును.

ఈ 10 వ శతాబ్ది మధ్యభాగమునుండి 11వ శతాబ్ది మధ్యభాగపు మొదటి ప్రోలరాజు కాలమువరకును కాకతీయుల ప్రశంస యేమియు గన్పించుటలేదు. అయినను తాత్కాలిక వేంగీచాళుక్యచరిత్రమునుండి దాని నూహించుట కవకాశము గలుగుచున్నది. క్రీ.శ. 970-973 ల నడుమ నంతఃకలహములతోడను రక్తపాతములతోడను రెండవ అమ్మరాజు రాజ్య మంతమునందెను. ఇట్టిసమయమున గాకర్త్యగుండ్యనయు విజృంభించి విశేషాధికారమును సంపాదించియుండును. అమ్మరాజునకుఁ బిమ్మట బాదపుడు వేంగీసింహాసనము నాక్రమించి క్రీ. శ. 999 వరకును రాజ్యమేలి శక్తివర్మచే నాసంవత్సరమున రాజ్య

6 ఈగ్రామ మాంధ్రదేశపు సరిహద్దులకు సమీపమునం దున్నది.

7 ఈయూహ కేవలమును "కాకతి" యను వంశనామమునకును "కాగతి" యను గ్రామమునకును గల సామ్యమునైననే యాధారపడియుండునది. నిర్దుష్టములగు నితరప్రమాణములు దొరకనిఁగాని దీనిని విశ్వసింపవలను పడదు. చోళులు మొదట దాక్షిణాత్యులుగనుండి పిమ్మట నాంధ్రదేశమున స్థిరపడి యాంధ్రులయినటులే గాకతీయులును దత్తమండలప్రాంతములందలి రాష్ట్రకూటవంశజులై యుండి రెండవఅమ్మరాజుకాలమునాటి కాంధ్రదేశమున స్థిరపడి యాంధ్రులయి యుండవచ్చును. కర్ణాటకదేశమునందలి కల్యాణీచాళుక్యవంశజులగు కుబ్జవిష్ణువర్ధనాదుల సంతతివారలు కొన్ని పురుషాంతరములకుఁ బిమ్మట దమ కర్ణాటకోత్పత్తిని మఱచి "జన్మభూమిశ్చళుక్యానాం దేశో వేంగీతి విశ్రుతః" యని చెప్పుకొనియుండుటయు పై యూహకు మఱియొక దార్కాణము. ఏదియొటులున్నను తెలంగానాప్రాంతమున రాజ్యాధికారమును నెఱపి దగినంతవిశ్రాంతిగాంచిన చక్రవర్తులుగ నుండిన ప్రోలరాజాదులుమాత్ర మాంధ్రులనుట నిర్వివాదాంశము.

భ్రష్టత నందింపబడెను.[8] ఇంతవరకును గుండ్యన జీవించియుండకపోయిన నాతని సంతతివారైన నాతనిచే స్థాపింపబడిన స్వాతంత్ర్యమును పెంపొందించియుందురు.

IV కాకతీయుల వంశావళి.

కాకతీయశాసనములు ప్రాయికముగ రెండవప్రోలరాజునుండియే వంశావళిని బేర్కొనుచున్నవి కొలదిశాసనములుమాత్రమంతకు పూర్వముండిన వారి ప్రశంసను చేయుచున్నవి. కాకతిరుద్రుని హనుమకొండశాసనమునందాతనికిఁ బూర్వము బేతరాజును ప్రోలరాజునుదహరింప బడియున్నారు.[9] గణపతిదేవుని నాటిపకామ్రినాథ చేబ్రోలు శాసనములలో[10] నొక త్రిభువనవల్ల బేతరాజుగాంచేనగుచున్నాడు. పకృత చరిత్రకారులీ బేతరాజే కాకతీయవంశమునకు మూలపురుషుడని తలంచుచున్నారు. కాని యీయూహ సరియైనదికాదు. కాకతీయవంశ వృక్షమునింకను రెండుపురుషాంతరముల వెనుకకు జరపుటకు దగినయాధారము లగపడుచున్నవి. క్రీ. శ. 1244. నాటిదగు మోటుపల్లి శాసనమునందలి 73—86 పంక్తులలో నొకప్రోలరాజు నాతనిపుత్రుఁడు త్రిభువనమల్లుడు నాతని తనయుఁడు ప్రోలరాజును పేర్కొనబడియున్నారు.[11] వీరిలో మొదటిప్రోలరాజు కేసరీతటాక నిర్మాతయని విశేషించి పేర్కొనబడి యుండుటచే నిందలినామక్రమము సరియైనదియేయని స్పష్టమగుచున్నది. ఈశాసనములందలి త్రిభువనమల్లుడును చేబ్రోలుశాసనమందలి త్రిభువనమల్లబేతరాజునుగూడ ప్రోలరాజునకుఁ దండ్రిగనే చెప్పబడియుండుటచే వారిర్వురు నొక్కరేయని యూహింపవచ్చును. అటులైనచో నీ త్రిభువనమల్లాభిదుడగు బేతరాజునకుఁ దండ్రిగ బేర్కొనబడిన మరియొక ప్రోలరాజెవ్వడు? ఆతనిప్రశంస మఱియెచ్చటనైనను గలదా? యనుప్రశ్నలు బయల్వెడలును. నైజాంరాష్ట్రమునందలి కొన్ని యపూర్వశాసనముల యాధారముపై నీప్రశ్నలకు సమాధానముఁజెప్ప వలనుపడుచున్నది. వారంగల్లుజిల్లా కాజీపేటగ్రామమందలి యొకశాసనము దుర్జయవంశీయుఁడగు బేతరాజుకొడుకు ప్రోలరాజుచేసిన ధర్మమునుఁ దెలుపుచున్నది.[12] అచ్చటిదే మఱియొకశాసనము శ్రీమన్మహామండలేశ్వర కాకతీయబేత

---

8 The History of Rajahmundry' in J. A. H. R. S. IV, V, VI by Mr. B. V. Krishna Rao.

పాలంపేటశాసనము — 36-38 పంక్తులు

9. 19 శ్రీమద్రుద్రనరేశ్వరస్య సుమతేర్వ్యక్తంశావలిం
20 వర్ణయే॥ శ్రీమత్త్రిభువనమల్లో రాజా కాకత్య వంశసంభూతః।
24 ……॥ తత్పుత్రః … … … …
25 … … … … …. ప్రోలో
26 రాజ ఇతి …. … … … … …. I. A. XI. p. 10.

10 I. A. XXI. P. 197. E. I. VI. P. 142

11 E. I. XII. P. 188.

12 దుర్జయకులాబ్ధిచంద్ర స్సత్యా ధీనస్సకల బేతనరేంద్రః॥ తత్పుత్రః ప్రోలనృపః …… 11—13 పంక్తులు

రాజు నాతనితండ్రి మహామండలేశ్వర పోళ రసను పేర్కొనుచున్నది.[13] ఈ రెండు కాజీ పేటశాసనములనుండియు దెలియనగు వంశక్రమము పై మోటుపల్లి చేబ్రోలుశాసనములందలి వంశక్రమమునకు సరిపడుచున్నది. దీనిని మఱియొకప్రమాణముకూడ బలపఱచుచున్నది. నైజాంరాష్ట్రమునందలి పిల్లలమఱ్ఱి, పాలంపేట యను రెండుగ్రామము లందలి శాసనములనుండి కాకతీయ రెండవప్రోలరాజు సైన్యాధిపతియగు కామసేనానికిఁ బ్రపితామహుడగు బమ్మసేనాని చోళులతోఁ బోరి యొకకాకతివల్లభునికి వీరలక్ష్మీవివాహమును ఘటించెనని దెలియుచున్నది.[14] దీనినుండి బమ్మసేనాని కాకతి బేతరాజునకుఁ పూర్వపు వాడేయనియు నాతని యేలికయగు కాకతీయ రాజన్యుడు బేతరాజు తండ్రియగు ప్రోలరాజేయనియు నూహింప నగుచున్నది. పై చర్చనుండి ప్రోలరాజు, బేతరాజు, రెండవప్రోలరాజు ననువారలు కాకతీయ వంశమున మొదటివురుషాంతరముల నుండిరని స్పష్టమగుచున్నది రెండవ ప్రోలరాజునకు రుద్రదేవుడు మహాదేవుడు నను నిర్వురు పుత్రులుండినటు లనేకశాసనములు దెల్పుచున్నవి. మహాదేవ రాజునకుఁ బుత్రుడు గణపతిదేవుడు. ఈతనికిఁ బురుషసంతానమేమియు లేక రుద్రాంబికయను కూతురుమాత్రము గల్గినటుల విద్యానాథుని "ప్రతాపరుద్రీయ యశోభూషణము" నుండియు ననేకశాసనములనుండియుఁ దెలియుచున్నది.[15] రుద్రాంబికకు ముమ్మక్క యుమ్మక్క యను నిర్వురు తనయులు బుట్టిరి.[16] వారిలో ముమ్మడంబకుఁ బ్రతాపరుద్రదేవుడు జన్మించెను.[17] పై విషయములనుండి కాకతీయ వంశవృక్షము నీక్రిందివిధమునఁ బేర్కొనఁదగును.

---

13 .....శ్రీమన్మహామణ్డలేశ్వరం కాకతీయబేతే
శనం తన్నతన్దైమహామండలేశరం పోళలరస. 16—19 పంక్తులు

14 శ్రీమత్పద్మజ పాదపద్మయుగళాల్లోకత్రయాభ్యుశ్చతా దుబ్బా
తే విపులేపులే నరవరో బమ్మాభిధానో భవత్। యః కాంచీ
నగరీకవాటహరణం కృత్వా ప్రచండాహవ క్రీడశ్చోడన
రాధిపస్య కృతవాన్మాన ద్రుమోన్మూలనం॥ 10—13 పంక్తులు॥ పిల్లలమఱ్ఱిశాసనము.

Hyd. Arch. Series No. 3. lines 31—38. ఈవిషయము "Recherla family" యను J. A. H. R. S. vol V; pt. 3. P. 139—150. లోని నావ్యాసమున చర్చింపఁబడియున్నది.

15 పురాకిల గణపతినామ్ని మహారాజే దుహితృమాత్రసంతానే కదాచిద్దైవ
యోగేన కాలపరిపాకముపేయుషి ... ... ప్ర॥ రు॥

16 రుద్రాంబిక రెండవకూతు రుమ్మక్కదేవియని ప్రాచీనచరిత్రములలో చెప్పబడియున్నది. శివయోగసారమునం దీమె రుయ్యాంబ యని పేర్కొనబడినది.

17 అకుపిత రుద్రమాంబికకు నాత్మజ నాబోగడందు
నా ముమ్మడయ్యకు మహాదేవరాజునకు నాత్మ
జుడైన బ్రతాపరుద్రు ... ... శి॥ యో॥ సా॥

మొదటి ప్రోలరాజు
|
త్రిభువనమల్ల బేతరాజు
|
రెండవ ప్రోలరాజు
|
రుద్రదేవుడు — మహాదేవరాజు
|
గణపతిదేవుడు
|
రుద్రాంబిక
|
ప్రతాపరుద్రుడు

V కాలనిర్ణయము.

వంశక్రమమువలెనే కాకతీయరాజుల కాల నిర్ణయము గూడ బహు సమస్యాన్వితమై యొప్పుచున్నది. పూర్వరాజన్యులకాల మింత వరకును సునిర్ణితమై యుండలేదు. గణపతిదేవుడు క్రీ. శ. 1199—1260 ల నడుమను 1260—1296. మధ్య రుద్రాంబికయు నామెకుఁ బిమ్మట నామెదౌహిత్రుడగు ప్రతాపరుద్రదేవ చక్రవర్తి 1296—1323. లనడుమను రాజ్యమేలిరని ప్రకృత చరిత్రకారుల యభిప్రాయమై యున్నది.[18] హనుమకొండ శాసనము క్రీ. శ. 1162. నాటిదగుటచే 1160. ప్రాంతముననే రుద్రదేవుడు రాజ్యమునకు వచ్చియుండునని కొందఱుపండితు లభిప్రాయపడుచున్నారు. నైజాంరాష్ట్రమునందలి శాసనములను బరిశీలించినచోఁ బ్రకృత పరిగణము సరియైనది కాదనియు, రుద్రదేవునికిఁ బూర్వపు వారల కాలమునుగూడ నిర్ణయింప వీలగునని యుఁ దేలుచున్నది.

సౌకర్యార్థమై ప్రతాపరుద్రుని నుండియే కాలనిర్ణయమునుఁ బరిగణింతము. ఈచక్రవర్తి తనమాతామహియగు రుద్రాంబిక క్రీ. శ. 1296లో మరణించినపిమ్మట రాజ్యమునకు వచ్చెనని చరిత్రకారులు విశ్వసించి యున్నారు కాని యీక్రిందిశాసనములనుండి యీతడు క్రీ. శ. 1290. నుండియే రాజ్యపరిపాలనమునఁ బాల్గొనుచుండినటులఁ దెలియుచున్నది.[19]

(1) శా. శ. 1212లో చోడమల్లి దేవమహారాజను సామంతునిచేఁ జేయఁబడిన ధర్మమునుఁ దెల్పు దర్శిశాసనము.[20]

(2) శా. శ. 1212. నాటి మల్యాల శాసనము.[21]

(3) శా. శ. 1214 నాటి కళ్లేపల్లి, గణపవర శాసనములు.

అదేవిధమున నీచక్రవర్తి రాజ్యాంత్య సంవత్సరముఁగూడ మార్పునందజేయు శాసనమొకటి కృష్ణామండలమునఁ గన్పట్టుచున్నది.

---

18 ఈ సందర్భము నంధ్రుల చరిత్రము ద్వితీయభాగము (పే 245) లో గణపతిదేవుడు క్రీ. శ. 1199—1260 ల నడుమను, రుద్రాంబ 1261—1295 లనడుమను, (పే. 297) ప్రతాపరుద్రుడు1295—1321 వఱకును (పే. 325) రాజ్య మేలిరని వ్రాసియున్నారు.

19 "ధీరోయం యువరాజ ఏవవహతి శ్రీవీరరుద్రోధురాం" అను శ్లోకభాగమున విద్యానాథుడు గూడ నీవిషయమునే జెప్పియున్నాడు.

20 Nel. Ins. D. 6. Ins. Ced. Dist. 105

21 E. R. 204 of 1899 & 173 of 1905

22 Ibid 126 of 1897 నైజాంరాష్ట్రమునందలి పానగల్లు గణపవరము మానూరు శాసనములు క్రీ. శ. 1291, 1292, 1294. లకుసరియగు కాలముల నొసంగుచున్నవి.

దానినుండి క్రీ. శ. 1326 వ సంవత్సరమునఁ బ్రతాపరుద్రచక్రవర్తి యోరుగల్లు పట్టణంబున రాజ్యము చేయుచుండగా నాతనియాశ్రితుఁడగు రుద్రసేనాని చేసినధర్మము తెలియనగుచున్నది.[23] కాన ప్రతాపరుద్రుడు క్రీ. శ. 1290—1326 ల నడుమ రాజ్యమేలెనని స్పష్టము కాగలదు.

అటులనే రుద్రాంబిక రాజ్యకాల నిర్ణయమునుగూడ మార్పుచేయ వలసియున్నది. క్రీ. శ. 1261 లో రుద్రాంబిక రాజ్యకాలమున వేయబడిన మాల్కాపుర శాసన మీరాజ్ఞిని యామెతండ్రియగు గణపతిదేవునిఁగూడ ఈనాసంవత్సరమునఁ బేర్కొనుచున్నది. ఇటులతండ్రికూతు లొకేకాలమున రాజపదమునను నుండుటయును, క్రీ. శ. 1260 నుండియే రుద్రాంబిక రాజ్యమేలుచుండెనని నిరూపించు నితరశాసన ప్రమాణము లభించుటయు సమాలోచించి పై మల్కాపుర శాసనమునుఁ బ్రకటించిన శ్రీజయంతి రామయ్య పంతులుగారు గణపపతిదేవుడు క్రీ. శ. 1260 లో రాజ్యమును త్యజించియుండునని యభిప్రాయపడి యున్నారు.[24] నైజాంరాష్ట్రమునందలి బూరుగుగడ్డలోని యొకశాసనము పై సమస్యకు స్పష్టమగు నుత్తరము నొసంగుచున్నది. అందు క్రీ. శ. 1258 లో రుద్రాంబిక భృత్యుడొకడు ఆరాజ్ఞి రాజ్యకాలమునందొక ధర్మమునుఁ జేసెనని చెప్పబడి యుండుటచే నీమె యీశాసనకాలమునకె (క్రీ. శ. 1258 నాటికే) సింహాసనమునకు వచ్చెనని తెలియుచున్నది[25] దీనినుండి క్రీ. శ. 1248—1261 ల నడుమ గణపతిదేవుడును రుద్రాంబికయునుఁ గలసి రాజ్యమేలుచుండిరని స్పష్టమగుచున్నది గణపతి తన యేకమాత్రి దుహితకు రుద్రదేవుడనుఁ బురుషనామమిడి యామె ననేక రాజ్యాంగకార్యములఁ బాల్గొనఁ జేయుచుండెనని చెప్పు ప్రతాపరుద్రీయము దానిని బలపఱచుచున్నది. ఇట్టి సంయుక్త పాలనముకాకతీయచరిత్రమునందింకొకసమయమునఁగూడ గాంచేనగుచున్నది. 1290—1296 ల నడుమ రుద్రాంబికయుఁ బ్రతాపరుద్రుఁడునుఁ గూడ నిటులే పరిపాలించియున్నారని యింతకుముందే నిరూపింపఁబడి యున్నది. గాన గణపతి దేవుని రాజ్యాంత్య సంవత్సరము క్రీ. శ. 1261 యని తేటపడుచున్నది. ఈరాజన్యుని దగు నొక త్రిపురాంతక శాసనము క్రీ. శ. 1182 లో నీతని 62 వ రాజ్యసంవత్సరమున వేయబడియున్నది దీనినుండి గణపతి దేవుడు క్రీ. శ. 1198 కి సరియగు శా. శ. 1120 లో కాకతీయ సింహాసనము నధిష్ఠించెనని తెలియుచున్నది.[26] ఈతని తండ్రియగు మహాదేవరాజు కాలమును నిర్ణయించుటకు బ్రత్యక్ష ప్రమాణము లేమియులేక గణపతిదేవుని రాజ్యారంభ

---

23 మఱియును హంపీనృసింహస్వామికి వెనుకవైపున గల యొకశిలపై క్రీ. శ. 1326 లో నీచక్రవర్తి యాశ్రితుడగు నొక రెడ్డిచే లిఖింపబడిన దానశాసనము రెడ్డికులనిర్ణయ చంద్రిక 89—90 పుటలలో పేర్కొనబడినది.

24 J. A. H. R. S. V pt. IV. The Malkapur Ins. of Rudradeva.

25 ...స్వస్తిశ్రీమన్మహామండలేశ్వర కాకతీయ రుద్రదేవమహారాజులు పృథివిరాజ్యము సేయుచుండగాను..... .....దేవకీపుత్రదా సులు స్వస్తిశ్రీ శుభశకనర్షములు ౧౧౨౦. పడమర — 3.7 పంక్తులు

26 E. R. 196 of 1905

కాలమును ఆతని పెదతండ్రియగు రుద్రదేవుని రాజ్యాంతకాలము నాధారములై యున్నవి. నైజాంరాజ్యములోని పిల్లలమర్రి గ్రామమందలి యొక శాసనము శా. శ. 1117 లో రుద్రదేవుడు రాజ్యమేలుచుండగా నామిరెడ్డి యొనర్చిన ధర్మమునుఁ దెలుపుచున్నది.[27] ఇటుపై రుద్రదేవుని శాసనములు గానరాకుండుటచే నిదియే యాతని రాజ్యాంత్యవత్సరమని బరిగణింపవలసి వచ్చుచున్నది. అటులయినచో మహాదేవరాజు రాజ్యకాలము క్రీ. శ 1195—1198 ల నడుమ నయియుండును. ద్రాక్షారామ శాసనములలో నొకదానియందు శా. శ. 1080 లో రుద్రదేవుని ప్రశంసగలదు.[28] ఇంతకుఁ బూర్వపు శాసనములు గన్పింపకుండుటచే నిదియే యాతని రాజ్యారంభకాలముగ బరిగణింపవచ్చును. ఇటుపై కాలనిర్ణయమొనర్చుట కష్టసాధ్యముగనున్నది. రెండవ ప్రోలరాజు ప్రశంస క్రీ. శ. 1117 నాటి అనుమకొండ శాసనమునను,[29] నైజాంరాష్ట్రమునందలి క్రీ. శ. 1119 నాటి మాటేరుశాసనమునందును, 1195 సం॥ దక్షిణదేశ శాసన నివేదికయందలి క్రీ. శ. 1115 నాటి మఱియొక శాసనమునను గన్పడుచున్నది.[30] గాన నీతడు క్రీ. శ. 1115—1158 ల నడుమ రాజ్యమేలియుండునని చెప్పవచ్చును. ఇటుపైని పురుషాంతరమునకు ముప్పది సంవత్సరముల వంతున లెక్కించి కాకతి బేతరాజు 1085—1115 ల నడుమను మొదటిప్రోలరాజు 1050—1085 ల నడుమ రాజ్యమేలిరని యూహింపవలసియున్నది. అప్పుడు కాకతీయరాజుల రాజ్యకాలము లీ క్రిందివిధమున నుండును.

మొదటి ప్రోలరాజు	1050—1085
కాకతి బేతరాజు	1085—1115
రెండవ ప్రోలరాజు	1115—1158
రుద్రదేవుడు	1158—1195
మహాదేవరాజు	1195—1199
గణపతి దేవుడు	1199—1261
రుద్రాంబిక	1258—1296
ప్రతాపరుద్రుడు	1290—1326

VI. కుల నిర్ణయము.

కాకతీయుల కులనిర్ణయమునుగూర్చి యిదివరలో ననేక వాదోపవాదములు ప్రబలియుండినవి.[31] కొందరు పండితు లీ రాజులు క్షత్రియులనియు మఱి కొందరు వీరలు చతుర్థకులజులనియు నభిప్రాయపడియున్నారు. ప్రాయికముగ శాసనములలో వీరలు కాకతీయులనియు, వీరిది కాకతీయకులమనియు చెప్పబడియున్నది. కాని గణపతి దేవునినాటి మోటుపల్లి, పాఖాల, కాంచీవరశాసనము లలో నీరాజులు క్షత్రియులుగను సూర్యవంశీయులుగను పేర్కొనబడియున్నారు.[32] బస్తరు సంస్థా

---

27 నిర్దుష్టమంబునిధి పట్టితాంతాం పృథ్వీమిమాం శాసతి రుద్రదేవే. పం॥ 5—6
శకవరుషములు ౧౦౧౭. పం. 11—31.

28 S. I. I. IV, No. 1107 29 E. I. IX, p. 256

30 E. R. 316 of 1915

31 J. A. H. R. S. IV, pt. 3. "Some interesting facts about the Kakatiyas" అను నావ్యాసము.

32 Ep. Ind, XII, p 188. Hyd. Arch. Series No. 4.
Ind. Ant XXI, p. 197.

నమునందలి కొన్ని శాసనములలో రాజా దిక్పాలదేవుడు కాకతీయ వంశజుడనియు నా వంశము చంద్రవంశమనియుఁ దెల్పబడి యున్నది.[33] ప్రాచీన వంశచరిత్రలలో గూడ నీరాజన్యులు చంద్రవంశీయుడగు మాధవవర్మ సంతతివారలుగ చెప్పబడియున్నారు. ప్రతాప రుద్రీయ గ్రంథకర్తయగు విద్యానాథకవి కాకతీయాన్వయ "మత్యర్కేందుకుల" మని వర్ణించియున్నాడు. కాకతి రుద్రదేవునినాటి యనుమకొండ శాసనమును లిఖించినకవి "శ్రీరుద్రదత్త నరేశ్వరస్య సుమతేర్వంశావలిం వర్ణయే" యని చెప్పియు, "శ్రీమత్రిభువన మల్లోరాజా కాకత్యవంశ సంభూతః" యని ప్రారంభించియున్నాడు.[34] ఇది యిట్లుండ కాకతీయరాజుల సామంతులయొక్క శాసనములనుండియు, వారి సన్నిహిత బాంధవ్యములనుండియు, వారలు జన్మచే క్షత్రియులు గారనియు, చతుర్థాన్వయులేయనియు దెలియుచున్నది. కాకతీయ శాసనములలోనే వారు దుర్జయుని సంతతివారని యున్నది.[35] ఇట్టి దుర్జయవంశీయు లనేకులు చతుర్థాన్వయులై యుండి 12, 13 శతాబ్దములలో నాంధ్రదేశము నేలిరి. వీరందరకునుఁ గాకతీయులకును సన్నిహిత బాంధవ్యములు డి నటుల శాసనముల నుండి తెలియుచున్నది. కొండపడమటి బుద్ధరాజును నంబయయును దుర్జయులు.[36] కాకతీయ గణపతిదేవుని సోదరియగు మేలాంబిక దుర్జయవంశీయుడును నతవాటి బుద్ధరాజు కుమారుడునగు రుద్రునిఁ బెండ్లియాడెను.[37] ఈ గణపతిదేవుని పుత్రికయగు గణపాంబ దుర్జయాన్వయుఁడగు కోటబేతరాజున కొసంగబడియెను.[38] వీనినుండి చతుర్థాన్వయులతో సంబంధములను నెఱపిన కాకతీయులుగూడ నదేశులమునకుఁ జెందినవారై యుందురని తేలుచున్నది. దక్షిణపాడులోని నాగనాథాలయమందలియొక శాసనమున రెడ్డిశబ్దవాచ్యుడొకడు ప్రతాపరుద్రునికిఁ బుత్రుడుగ పేర్కొనబడియున్నాడు. స్థానిక చరిత్రములు జుట్టయలంక గొంకారెడ్డియను నాతడా రాజన్యున కింకొక తనయుడని దెల్పుచున్నవి. నైజాంరాష్ట్రములోని బూదపుర గ్రామమునందలి యొక శాసనము మొదట నాలుగు వర్ణము లుండిన వనియు, వానిలో నాల్గవది జగత్ప్రసిద్ధమగువంశమనియు, నందు గాకతీయులు జన్మించిరనియుఁ జెప్పుచున్నది[39] ఇదే విషయమును మల్యాలగుండ దండాధిపుని భార్య పద్మమాను పురమున వేయించిన శాసనముగూడ దెలుపుచున్నది.[40] గాన నీ ప్రమాణముల యాధారముపై గాక

---

33 Inscriptions of the Buster State Ep. Ind. IX, p. 163.

34 19—20 పంక్తులు 35 పైమోటుపల్లి, పాఖాలశాసనములు.

36 Ep. Ind. VI, p. 268 and 269. 37 E. R. 204 of 1904.
Ep. Ind, VI, p. 159. 38 Ep. Ind VI, p. 84.

39 .....చత్వారా జగతిఖ్యా
తా స్తేషాం వర్ణాస్సమంతతః। ..... తేషాం మహీయమహీ
మం మహితస్తురీయో వర్ణశ్రియః ప్రసవభూమి.....
.....
ప్రశస్తసు స్థితత్రాపి కాకతీయకులం మహత్. 17—23 పంక్తులు॥

40 సుజాతా 1927 సంపుటము పే 86.

తీయులు చతుర్థాన్వయులేయనియు వారికి క్షత్రియత్వము కేవల ధాత్రీపతిత్వ సంజ్ఞకమేయనియు చెప్పవలసి యున్నది

VII మొదటి ప్రోలరాజు

(1050—1080)

ఈ మొదటిప్రోలరాజు సేనాని యొకడు కాంచీనగరముపై దాడివెడలి చోళరాజునకు పరాభవమొనర్చి యానగర కవాటమును హరించి తనయేలికయగు కాకతివల్లభునకు విజయలక్ష్మి వివాహమునొనర్చెనని పిల్లలమర్రి, పాలంపేట శాసనములనుండి తెలియనచ్చుచున్నది. ఈవిషయము కాకతీయచరిత్రమునకు చాలముఖ్యమైనది. కాకతీయుల కాలమును నిర్ణయించునెడ నీమొదటిప్రోలరాజే పై కాకతివల్లభుడని చెప్పియుంటిమి. గుండ్యన నామమునకుఁగల కాకర్త్యపదమును యీప్రోలరాజునకుఁగల "కాకతివల్లభ" యను విశేషణము నీయిర్వురు నొకేవంశములోనివారని చెప్పుచున్నవి. ఈప్రోలరాజెచ్చట రాజ్యమేలెను, యీతనికి గాంచీపుర చోళులతో వైరమునకుఁగారణమెద్ది యను విషయములను నిర్ణయింపవలసి యున్నది. ఇట్టియెడ గూడ బూర్వమువలెనే వేంగీ చాళుక్యవంశచరిత్రమే మనకు తోడ్పడగలదు. మహాభారత కృతిభర్తయగు చాళుక్యరాజరాజు క్రీ. శ. 1050 లో మరణించినపిమ్మట వేంగీదేశమునం దల్లకల్లోలమయ్యెను. ఆతని రాజ్యకాలముననే గోదావర్యుత్తర, పశ్చిమోత్తర భాగముల నల్లరులు చెలరేగినవి. పిమ్మట నాతనిపుత్రుడును, చోళరాజునకు దౌహిత్రుడును కులోత్తుంగాభిదుడుగ జరిత్రవిఖ్యాతి నందినవాడునగు యువరాజరాజేంద్రుఁడు వేంగీదేశమున కధిపతియయ్యెను. ఇదేసమయమున చోళరాజ్యాధీశుఁడుగూడ మరణించెను సామ్రాజ్య నిర్మాణ కాంక్షియు, మహాదుత్సాహ సంపన్నుడునగు నీచాళుక్యరాజేంద్రుడు పైతృకమగు వేంగీరాజ్యమునుఁ దనపినతండ్రియగు నేడవ విజయాదిత్యునికొసంగి తాను ద్రావిడదేశ సింహాసనము నధిష్ఠించుటకు దగుప్రయత్నము లొనర్చుచుండెను. ఆంధ్రదేశమున బ్రతినిధిగ నియమింపబడిన యీవిజయాదిత్యుడు తనకుమారుగ దనకుమారుడగు రెండవ శక్తివర్మను వేంగీదేశపాలకునిగ నియమించి దాను పశ్చిమచాళుక్య సామ్రాజ్యాంతర్భూతమును స్వరాష్ట్రమునగు నలంబవాడికిఁజనియెను. ఇదియిట్లుండ దక్షిణదేశమున గతించిన రాజేంద్రచోడుని దాయాదియగు వీరచోడుడు ద్రావిడదేశ సింహాసనమునాక్రమించి వేంగీదేశముపై దండెత్తుటకై బ్రయత్నము సల్పుచుండెను. ఇంతలో వేంగీపాలకుడగు రెండవశక్తివర్మ యకాలమరణమునందెను. వెంటనే వీరచోడుడాంధ్రదేశముపై దండెత్తెను. నలంబవాడినుండి స్వశదేసంరక్షణార్థమై విజయాదిత్యుడేతెంచుసరికి వేంగీదేశము శత్రుజనపరివేష్టితమై యుండెను. ఆంధ్రదేశమునంతటిని గబళింప నుకించుచుండిన యీచోళదావానలమును పరిమార్ప ననేకభూపాలురు యేకమైరి, విజయాదిత్యుడు దనకుమిత్రులగు బశ్చిమచాళుక్యులయొక్కయు, బంధుగులగు కళింగగాంగులయొక్కయు సాహాయ్యము నభ్యర్థించెను. యువరాజ రాజేంద్రుడుగూడ నీసమయమున వారింజేరి నాయకత్వమును వహించెను. ఇంతియగాకనీమహాక్లిష్టసమయమునందనేకులగువీరపురుషులు రాజేంద్రునికిఁ దోడ్పడిరి. ద్రాక్షారామశాసనములలో నిట్టిసామంతులు నాయకు

లును చేసినస్నేహప్రతిజ్ఞలుగాంచనగుచున్నవి. తుదకు వీరచోడుడు పరాభూతుడై స్వరాష్ట్రమునకు మరలెను.

కాకతి బేతరాజు అనుమకొండప్రాంతమున రాజ్యమేలెనని శాసనములనుండి ధృవపడుచున్నది. మొదటనాతడు కొఱవిదేశమును[41] బిమ్మట పశ్చిమచాళుక్య సామంతుడుగ సబ్బిమండలమునుఁబాలించెను.[42] ఈతనితండ్రియగు మొదటిపోలరాజుకూడ నాభూభాగమునకే యధిపతియై యుండునని యూహింపవచ్చును. పైవిభాగములు రెండును నైజాంరాష్ట్రమునందలి వారంగల్లు మండలమునందున్నవి. చాళుక్యభీమునినాటి యొకశాసనమునుండి వేంగీసామ్రాజ్యము కొఱవిదేశమువఱకును వ్యాపించియుండెనని దెలియుచున్నది.[43] వీనినిబట్టి చాళుక్యరాజరాజు రాజ్యాంతకాలమునకుఁ గాకతీయులు వేంగీదేశమునకు బశ్చిమోత్తరదిశను స్థిరపడి క్రమక్రమాభివృద్ధినందుచుండిరని యూహింపవచ్చును. అట్టియెడ నిచ్చట రాజ్యమేలుచుండిన మొదటిపోలగాజునకు దూరమునంగల కాంచీపుర చోళులతో వైరముపొసగుటెట్లు? ఈప్రశ్నకు పైవివరించిన వేంగీచాళుక్య చరిత్రము సమాధానము నొసంగుచున్నది. ఆంధ్రదేశముపై దాడివెడలిన చోళరాజులలో వీర రాజేంద్రుఁడే కడపటివాడు. ఈదండయాత్రా సందర్భమునం దనేకు లగు స్థానిక పాలకులు చాళుక్యులకు సహాయము గ జోళుల నెదిర్చియుండిరి. మొదటిప్రోలరాజు కాలమీదండయాత్రలు జేరిగిన సమయమునకు సరియగు చున్నది.[44] వేంగీదేశము నాక్రమించిన పిమ్మట చోళులు కాకతీయ రాజ్యమునే గబళింపవలసి యుండును. ఈ కారణములను బట్టి మొదటి ప్రోలరాజుగూడ నీ వేంగీయుద్ధమున బాల్గొనియుండును. పరాభూతుడై స్వరాష్ట్రమునకు మఱలుచుండిన వీరచోడుని కాకతీయ సైన్యాధ్యక్షుడగు బమ్మసేనాని కాంచీపురము వరకును వెంబడించి యాతని నచ్చట మఱియొకసారి పరాభవించి యుండును. ఈయుద్ధము జేరిగిన యనతి కాలమునకే యువరాజ రాజేంద్రుడు దక్షిణదేశ సింహాసనము నధిష్టించెను. ఇంతలో వేంగీ పరిపాలకుడుగ నుండిన విజయాదిత్యుఁడుగూడ గతించుటచే గాజేంద్రుడే కులోత్తుంగచోళుడను పేరిట ద్రవిడాంధ్రదేశముల రెండిటినిఁ బరిపాలింపజొచ్చెను. చక్రవర్తి సుదూరమునందుండుటచే నాంధ్రదేశమునం దాతని తనయులు ప్రతినిధులుగ పరిపాలించుచుండిరి. ఈ ప్రాతినిధ్యము నామమాత్రముగ నుండినది. రాజపుత్రుల ధ్యానమంతయు రాజధానీ నగరముపైననే యుండుటచే వేంగీదేశము నందనేక సామంత రాజవంశములు దలలెత్తి స్వరాజ్య విస్తరణార్థమై యొండొరులతో బోరాటములు సల్పమొదలిడినవి. ఈసందర్భమున గోదావరి కుత్తరము నందుండిన కాకతీయులు తమ

---

41 అతణ్డనిబొట్ట బేతవసు ధాధిపు జేకొని వానివైరి సు
ద్ధితమునజంపి యాకొఱ విదేశమునందు బ్రతిష్ఠచేసి. గూడూరుశాసనము- 13-16 పంక్తులు.

42 .....కాకతిబేత నరేంద్రినం జగం పొగలె చాళుక్యచక్రి చరణం సలెకా
ణిసి తత్ప్రసాదదిం బగెగోళె సబ్బిసాయిరమనైలిసి.....
"అనుమకొండ శాసనము—Ep. Ind IX. p. 256 32—35 పంక్తులు"

43 కొఱవినుండి తీసిన యీశాసనము యొక్క ప్రతిబింబము హైదరబాదు లక్ష్మణరాయపరిశోధక మండలివారివద్దగలదు.

స్వాతంత్ర్యమును సుస్థిరముగ నెలకొల్ప నవకాశమొదవెను.

మొదటి ప్రోలరాజునుఁగూర్చి యింతకంటెను విశేషము లేమియు దెలియరావు. ప్రాచీనవంశచరిత్రములలో ననుమకొండను బాలించిన పూర్వరాజులలో బేతరాజునకు ముందుగ నొక భువనైకమల్లుని ప్రశంస గన్పించుచున్నది. బేతరాజునకు పశ్చిమచాళుక్య సామంతతయును త్రిభువనమల్ల బిరుదము నుండినటుల శాసనములనుండి తెలియుచున్నది. ఈబిరుదము పశ్చిమచాళుక్యచక్రవర్తులలో నగ్రగణ్యుఁడగు నాఱవ విక్రమాదిత్యునిది. ఈతనికిఁ బూర్వవిజాతని సోదరుడును భువనైక మల్ల బిరుదాంచితుడునగు మూడవ సోమేశ్వరుడు రాజ్యమేలెను. దీనినిఁబట్టి కాకతీయ త్రిభువనమల్ల బేతరాజువలెనే యాతని తండ్రియగు మొదటిప్రోలరాజుగూడ చాళుక్య (సోమేశ్వరునికి) సామంతుడుగనుండి, భువనైక మల్ల బిరుదమును వహించియుండె నేమోయని సందేహము గలుగుచున్నది. కాని బేతరాజు విషయమునందువలె నీ ప్రోలరాజు విషయము నందిట్టి యూహను బలపఱచు శాసనప్రమాణ మేమియు లభింపకుండుటచే నీ యూహయందలి నిజానిజములను భావి పరిశోధనమూలముననే నిశ్చయింపవలసి యున్నది.

VIII త్రిభువనమల్ల బేతరాజు

(1080—1115)

కాకతి బేతరాజు చరిత్రమును నిర్ణయించుటకింతవరకు నాతని కాలమునాటిదగు ననుమకొండకన్నడశాసనము ముఖ్యమగు నాధారముగ నుండినది. ప్రాచీన వంశ చరిత్రములందలి విషయములు కేవల కల్పితములుగ నున్నవి. పూర్వోదాహృతమగు నైజాం రాష్ట్రములోని గూడూరు గ్రామమునందలి యొక శాసనము బేతరాజునుగూర్చి కొన్ని ముఖ్యాంశములను దెలుపుచున్నది. ఈతనితండ్రికాలమునకే కాకతీయులు గోదావరీ నదికిఁ బశ్చిమోత్తరమున స్థిరపడి యుందురని యిదివరలో జెప్పి యుంటిమి. వీరలీభాగమునకు నూతనాగతులగుటచేతనో లేక మొదటి ప్రోలరాజు మరణించునప్పటికే బేతరాజు బాలుడుగనుండుటచేతనో మఱియేకారణమువలననో కొందరు శత్రురాజులు చేరి బేతరాజును పదభ్రష్టునిఁ జేసిరి. అప్పుడు దుర్జయవంశీయుడగు నెఱ్ఱన యనునాతడీ శత్రువునుదునిమి బేతరాజును కొఱవిదేశమునఁ బ్రతిష్ఠించెను. ఎఱ్ఱనభార్యయగు కామసాని పల్లవరాయడు, భాస్కరచక్రవర్తి, కాడవనాయకుడు మున్నగు బేతరాజు శత్రువులను నిర్జించి యీబేతరాజును కాకతివల్లభునిఁ జేసెను. ఈవిషయములు రెండును పైగూడూరు శాసనమునుండి తెలియుచున్నవి. ఇందలి శత్రురాజులను గూర్చి విశేషము లేమియుఁ దెలియుట లేదు. ఎఱ్ఱనయు నాతని భార్యయు గూడ బేతరాజునకు సాహాయ్య మొనర్చిరి. భర్తయుండినపుడు భార్యరణరంగమున దిగుట యసామాన్యము. దీనినుండి మొదటిలో కొఱవిదేశము బేతరాజునకు బైతృకమనియు నాతడు దానిని గోలుపోవ నెఱ్ఱన దాననాతనిఁ దిరిగి బ్రతిష్ఠించెననియు, ఎఱ్ఱన చనిపోయిన పిమ్మట బేతరాజునకు దిరిగి శత్రువులవలని యపాయమొనవుటచే నెఱ్ఱనభార్య కామసాని యీతూరి యాతనికి బాసట యయ్యెననియు నూహింపవలసి యున్నది. బేతరాజు శాసనములింకను గొన్ని నైజాంరాష్ట్రమునఁ గలవు.

వానిలో నాతనికి స్వాతంత్ర్యసూచకములగు బిరుదములుండి సామంతచిహ్నము లేమియు లేకుండుటచే నీతడు పై వివరింపబడిన కష్టములను గడచిన పిమ్మట కొంతకాలము స్వతంత్రముగ బరిపాలించెనని స్పష్టమగుచున్నది. వారంగల్లుజిల్లాలోని కాజీపేట యందలి శాసనములనుండి బేతరాజునకు "దుర్జయకులాబ్ధిచంద్ర, చలమర్తిగండ, మహామండలేశ్వర, అనుమకొండంపురవరేశ్వర" యను బిరుదములుండినటుల దెలియుచున్నది. పశ్చిమచాళుక్యచక్రవర్తియగు త్రిభువనమల్లవిక్రమాదిత్యునికాలమున జాళుక్యసామ్రాజ్య మెక్కడగ విస్తరించి పడమట కల్యాణీనగరమునుండి తూర్పున వేంగీదేశమువఱకునుగూడ వ్యాపించినది. ఈచాళుక్యవాహినీవిజృంభణమునకు మధ్య కాకతీయరాజ్యమడ్డువచ్చెను. ఈసందర్భమున బేతరాజుదూరమాలోచించి విక్రమాదిత్య చక్రవర్తిశరణుజొచ్చి యాతని యనుగ్రహమున సహస్రగ్రామపరిమితగు సబ్బిమండలమును బడసెను. ఈతని మంత్రియగు వైజదండాధినాథుడే యీసంధానమునకుఁ గర్తయని యనుమకొండ కన్నడశాసనమునుండి తెలియుచున్నది. అదేశాసనమునందీరాజు పరమమాహేశ్వరుడని చెప్పబడియున్నది. బేతరాజునుఁ గూర్చి యింతకు మించియేమియు దెలియరాదు.

IX రెండవ ప్రోలరాజు.

(1115—1158)

త్రిభువనమల్ల బేతరాజునకుఁబిమ్మట నాతనితనయుఁడగు రెండవప్రోలరాజు కాకతీయ సింహాసనము నధిష్ఠించెను. తండ్రివలె నీతడు గూడ గొంతకాలమువఱకును బశ్చిమచాళుక్యులకు సామంతుడుగ నుండెను. ఆఱవ విక్రమాదిత్యుని రాజ్యాంత్యభాగమున చాళుక్యులకు దక్షిణమున చోళులనుండియు హోయసలులనుండియు నొత్తిడి కలిగెను. మహాయోధుడును, ప్రజ్ఞాశాలియు నగు ప్రోలరాజు యదనును గ్రహించియు, చాళుక్యసామంతుల యన్యోన్యవైషమ్యములనాలోకించియు స్వాతంత్ర్యసంపాదనమునొనర్ప బ్రయత్నించెను. ఈసందర్భమునందీకని కనుమకొండరాజ్యపరిసర ప్రదేశములందలి వివిధ చాళుక్యసామంతులతో ననేకయుద్ధములు సంభవించియుండినవి. అనుమకొండ రుద్రేశ్వరాలయమునందలి శాసనము కాకతిప్రోలరాజు విజయములను ప్రత్యర్థులను పేర్కొనుచున్నది. పూర్వకాకతీయచరిత్రమునకు మూలస్తంభమనదగు నీశాసనమునుప్రచురించుచు ఫ్లీటు పండితుడిందలి కాకతీయప్రత్యర్థుల నొకవిధమున నిర్ణయించియున్నాడు.[45] ప్రోలునిశత్రువులలో తైలపదేవుడు, గోవిందరాజు, గుండరాజు, జగద్దేవుడు ననువారుండిరి.

హస్త్యారోహణచతురుఁడును, చాళుక్యచూడామణియు నగు తైలపదేవుని క్షణములో బంధించియు, భక్త్యనురాగములచే ప్రోలరాజు విడిచిపుచ్చెను. ఈతైలపదేవునిఁ బశ్చిమచాళుక్యచక్రవర్తియగు మూడవ తైలపదేవునితో సమన్వయించి, యాతడు యువరాజుగ నుండినపుడే ప్రోలరాజుతో యుద్ధము జేరగి యుండవలెననియు లేనిచో ప్రోలునికి సుదీర్ఘమగు రాజ్యకాల మండియుండవలెననియు ఫ్లీటుపండితు డభిప్రాయపడి యున్నాడు. కాకతి

45 I. A. XI. p. 272 లోని గణపేశ్వరశాసనమున గూడ నీప్రోలరాజు ప్రత్యర్థుల ప్రశంసగలదు.

ప్రోలుడునలుబదిమూడుసంవత్సరములు రాజ్య మేలియుండెనని యితంకమున్నే నిరూపింపబడి యున్నది. ఇటీవల దొరకిన నైజాంరాష్ట్ర శాసనముల నాధారముగ జేసికొని యాతడు యువ రాజ తైలపదేవునే యోడించెనని చెప్ప వలను పడుచున్నది. నల్లగొండ జిల్లాలోని పానుగల్లు గ్రామమునందలి శాసనమొకటి పశ్చిమ చాళుక్య చక్రవర్తియగు విక్రమాదిత్యుని నాతని తనయుడగు తైలపదేవునిఁగూడ బేర్కొను చున్నది. మహబూబ్ నగరజిల్లాలోని నెక్కొండ గ్రామమునందలి యొక శాసనమున త్రిభువనముల్ల విక్రమాదిత్యుని రాజ్యకాలమున కుమార తైలపదేవుడు సకుటుంబముగ రాజధాని కోడూరునుండివచ్చి చాళుక్య విక్రమ శకము 46 లో నెక్కొండలో నొక ధర్మము చేసెనని చెప్పబడియున్నది.[46] ఇందలి కాలము క్రీ. శ. 1122 అగును. పానగల్లు నెక్కొండ శాసనములనుండి విక్రమాదిత్యుని రాజ్యాంత కాలమున నాతని తనయుడగు కుమార తైలప దేవుడు నైజాంరాష్ట్రములోని మహబూబు నగర నల్లగొండ జిల్లాలను రాజప్రతినిధిగ నేలు చుండెనని స్పష్టమగుచున్నది. అనుమకొండ శాసనమున ప్రోలరాజు తైలపదేవుని భక్త్యను రాగములచే విడిపించెనని చెప్పబడియున్నది. ఫ్లీటు దలచినటులీ తైలవుడు స్వతంత్ర రాజు గనే యుండినచో తైలవునియెడ నిట్టి భావము ప్రోలరాజున కుండెనన నొప్పదు. గాన నీయు ద్ధము విక్రమాదిత్యుని రాజ్యకాలముననే 1122—1127 ల నడుమ జరిగియుండెననియు నాతని యెడగల భక్తివలననే ప్రోలుడు చేతికిఁ జిక్కిన శత్రువును విడిచిపుచ్చెననియు జెప్ప వలెను.

కాకతిప్రోలుని రెండవ ప్రత్యర్థి గోవింద రాజు. ఈతని నీ కాకతీయ రాజన్యుడు యుద్ధ మున నోడించి యీత డేలుచుండిన లుంతాక విషయమును ఉదయరాజున కిచ్చెనని యనుమ కొండ శాసనమునఁ జెప్పబడియున్నది.[47] పై శాసనమునందలి గోవిందరాజును, విక్రమా దిత్యుని దండనాథుడుగనుండి ద్రాక్షారామాది స్థలములలోని శాసనములవలనఁ దెలియనగు దండనాయక గోవిందరసయు నొక్కరే యై యుందురు. ఆంధ్ర చరిత్రకారులీతడు బెజవాడ దగ్గరనున్న కొండపల్లిదుర్గపాలకుడనియునుఁ శ్రీ శేషాద్రిరమణకవు లీతడు వరంగల్లుజిల్లా లోని నేలకొండపల్లి ప్రాంతపాలకుడనియు నభి ప్రాయపడుచున్నారు.[48] ప్రోలరాజు కాలము ననే కాకతీయ రాజ్యవిరస్తణ మారంభమయి యుండెననియు, నాతని ప్రత్యర్థులందరు ననుమ కొండ పరిసర ప్రాంత పాలకులేయనియు నిది వరలో జెప్పియుంటిమి. ఈ యభిప్రాయము ననుసరించి గోవిందరాజు నేలకొండపల్లిని పాలించుచుండెనని జెప్పుటయే సమంజసముగ గన్పట్టుచున్నది.

మఱియును కాకతిప్రోలుడు మంత్రికూట

---

46 ఈశాసనములు రెండును లక్ష్మణగాయపరిశోధకమండలివారివద్ద గలవు. వాటి నకళ్ళు శుక్లసంవత్స ర చైత్రమాస భారతి 533 పేజీలో శ్రీ శేషాద్రి రమణకవులచే బ్రకటింపబడియున్నవి.

47 Ibid

48 Ibid. క్రీ. శ. 1120—24 ల నడుమ వేంగీదేశమునం దధికారము నెఱపిన గోవిందరసయు నీ నేలకొండపల్లి పాలకుడగు గోవిందరాజు నొక్కరేయని చెప్పవచ్చును. ఆస్థానమే కేంద్రముగ నీతడు వేంగీదేశ మునుగూడ నేలియుండవచ్చును.

నగరాధిపుడగు గుండరాజునిర్జించి యాతనిశి రోమండనమొనర్చి వక్షముపై దనలాంఛనము గు వరాహముద్రనువేయించి విడిచిపెట్టెను. పిమ్మట నాగుండరాజు భీతుడై సమరమునకు దిరిగి యాహ్వానింపఁబడియు, తననగరమునకుఁ బరుగెత్తిపోయెను. పూర్వచరిత్రకారులీ మంత్రికూటనగరమును బ్రకృతకృష్ణామండలమందలి మంతెనగ్రామముతో సరిచేసియుండిరి. కాని యీగ్రామ మనుమకొండరాజ్యమునకుఁ జాలదూరమున నుండుటచే నీసమన్వయము పొసగనేరదు. నైజాంరాష్ట్రమునఁ గోదావరీ తీరమునసే మంత్రికూటమని విఖ్యాతిగాంచిన మంథనిగ్రామముకలదు. తత్పరిసరప్రాంతము ల గుండరాజుపేరిటఁ గట్టబడినగ్రామము లనేకములుగలవు. గాన నీమంథనియే యనుమకొండశాసనములోని మంత్రికూటమని చెప్పవలసియున్నది.[49] పాలంపేటకు సమీపమునకు న్న రామప్పగుడులశాసనమునుండి కాకతిప్రోలుని యాశ్రితులలో నొకఁడగు రేచర్లకామచమూపతి యుద్ధరంగమున మంథన్యగుండరాజునుఁజంపి యితరశత్రువులనుఁ బారదోలెనని తెలియుచున్నది. ఇయ్యది కాకతిప్రోలుని విజయమునకుఁ బిమ్మట జరిగిన వృత్తాంతమై యుండును.[50]

రెండవప్రోలుని ప్రత్యర్థులలో గడపటివాడు జగద్దేవుడు. ఈతడనేక మండలీకులతో గూడి యనుమకొండనగరమును ముట్టడింపగా నతిత్వరితముగఁ నీతనిఁ ప్రోలరాజు పలాయితుని జేసెనని యనుమకొండశాసనమునఁ జెప్పబడియున్నది పూర్వచరిత్రకారులీ జగద్దేవుడు మైసూరురాష్ట్రమువందలి పొట్టుపంబచ్చపుర పాలకుడై త్రిభువనమల్లాభిదుడై యుండెనని నిర్ణయించియుండిరి.[51] కాని యీవిషయము నంగీకరింప వలనుపడదు. ప్రోలునికాలమునఁ గాకతీయరాజ్యము మైసూరువరకును వ్యాపించియుండలేదు. మధ్యమార్గమునందనేక పశ్చిమచాళుక్య సామంతులుండగా ప్రోలునకు దూరదేశపాలకుడగు నీతనితో వైరముపొసగుట సమంజసముగ గన్పడదు. నైజాంరాష్ట్రమునందలి నల్లగొండజిల్లాలోని గణపేశ్వరగ్రామమునందలి రెండుశాసనమొక జగద్దేవునిఁబేర్కొని యాతనియనంతరము కాకతిప్రోలుడా భూభాగమునకు రాజయ్యెనని తెలుపుచున్నది. కరీంనగరమండలమందలి నగునూరులోని మఱి యొకశాసనమున దొమ్మరాజు, జగద్దేవుడు, మేడరాజు ననువారలు యెనుబదివేలసైన్యమును గెలిచిరని చెప్పబడియున్నది. పైపేర్కొనిన జగద్దేవుని సపత్నులిర్వురును కాకతిప్రోలరాజు తనయుడగు రుద్రునిచే పరాభూతులై నటులనుమకొండ శాసనమునుండి తెలియుచున్నది కరీంనగరజిల్లాలోని లేములవాడగ్రామమునందలి శాసనమునుండి "పొలవాకకులతిలకు"డగు

---

49 ఫ్లీటు, కృష్ణశాస్త్రిప్రభృతుల యభిప్రాయములను గాంచునది

50 యుద్ధేయేన మహాబలేన నిహతో మంథన్యగుండాధిపః॥

Hyd. Arch. Series No. 3 43—46 పం॥

51 ఆంధ్రులచరిత్రము రెండవభాగము 157 పేజీలో నీజగద్దేవుడు పొట్టుపుంబచ్చ పురాధీశ్వరుడనియు నారవ విక్రమాదిత్యునికిని రెండవజగదేకమల్లునికిని సామంతుడనియు నందువలనఁ బ్రోలరాజుపై దాడివెడలెనని యుఁ జెప్పబడియున్నది. కాని మైసూరునకును అనుమకొండకును నడుమ బహుదూరముండుటచేతను, తెలంగాణమునసే యొక జగద్దేవుడు కాకతిప్రోలునిచే నిర్జింపబడెననుటకు శాసనప్రమాణము గన్పడుచుండుటవలనను యాంధ్రచరిత్రకారుల యూహ సయైనదికాదని స్పష్టమగుచున్నది.

గు మహామండలేశ్వర జగద్దేవుడు క్రీ. శ. 1109 ప్రాంతమున లేములవాడనుండి రాజ్యమేలు చుండెనని తెలియుచున్నది.[52] పై ప్రమాణము ల నాధారముగఁ జేసికొని ప్రోలునిపుత్రుడగు జగద్దేవుడు లేములవాడ ప్రాంతపాలకుడగు నొకచాళుక్యసామంతుడని నిర్ణయింపవచ్చును.

పశ్చిమచాళుక్య చక్రవర్తియగు నాఱవ విక్రమాదిత్యుడు మరణించిన యనతికాలము నకే కాకతిప్రోలరాజీ విజయయాత్రల నొనర్చి రిపుజనభీకరుడై తాత్కాలికరాజన్యులలో నగ్రగణ్యుడై, స్వతంత్రుడై, భావికాకతీయాంధ్ర సామ్రాజ్యమునకుఁ బునాదులనేర్పఱచెను. విక్రమాదిత్యునికిఁబిమ్మట రాజ్యమునకువచ్చిన మూడవసోమేశ్వరుడొక యాంధ్రరాజుతో యుద్ధమొనర్చెను.[53] బహుశః యీయాంధ్రరాజు ప్రోలుడేయైయుండెననియు, దీనజయించియే యాతడుస్వతంత్రస్థాపన మొనర్చెనని యు నూహింపవచ్చును. కాకతిప్రోలుని కీర్తి చంద్రికలు క్రీ. శ. 1150 నాటికి దిగంతములకు వ్యాపించియుండినవి. తాత్కాలిక చాళుక్యచక్రవర్తియగు మూడవతైలపుని రాజ్యకాలమున చాళుక్యసామ్రాజ్యము విచ్ఛిన్నముగా జొచ్చెను. అందలిప్రాచ్యభాగములన్నియు నిదివరకే కాకతీయులాక్రమింప మంత్రియు దండనాథుడునగు గళచురిబిజ్జలుడుచక్రవర్తిని రాజ్యచ్యుతునిఁజేసి కళ్యాణీ సింహాసనము నాక్రమింప యత్నింపుచుండెను. క్రీ. శ. 1158 లో బిజ్జలునిచే సర్థితుఁడై ప్రోలరాజు కల్యాణీ బేతరాజుకడ మంత్రిగనుండిన వైజదం డాధిరాజ్యనాశనము నందాతనికి దోడ్పడి, తన నాథుని పుత్రుడగు బేతనయొక్కడు. మహామార్గమును నిష్కంటకముగ నొనర్చుకొనియెను.[54]

ఇటులీరాజన్యుడు స్వబాహుబలముచే ననేక భూభాగములను దనరాజ్యమునఁ గలిపికొనెను. ఈతని జీవితాంత్య మెటులయియుండెనో స్పష్టముగఁ దెలియుటలేదు. ప్రాచీనవంశ చరిత్రలయందాతడు ప్రమాదవశమునఁ దన పుత్రుఁడగు రుద్రునిచే చేంపబడెనను విషయము గాంచనగుచున్నది. ప్రమాణేతరరాహిత్యతచే నీయంశము విశ్వసనీయముగ గన్పట్టుటలేదు. ద్రాక్షారామ శాసనములలో నొకదానియందు వెలనాటి వంశీయుడగు రెండవ చోడరాజు "కాకతిప్రోల నిర్దహనుఁ"డని పేర్కొనబడియున్నాడు.[55] ఈతడు తన తండ్రియగు రెండవ గొంకరాజునకుఁ బిమ్మట క్రీ. శ. 1163—1181 ల నడుమ రాజ్యమేలియుండెను. కాకతి ప్రోలరాజు క్రీ. శ. 1158 లో మరణించియుండెనని యిదివరలోఁ జెప్పియుంటిమి. దానినుండి రెండవ గొంకరాజు రాజ్యకాలమున కాకతిప్రోలుడు వెలనాటిపై దాడివెడలెననియు నా సందర్భమున గొంకరాజు పుత్రుఁడును, యువరాజునగు చోడుడు, ప్రోలరాజుతో బోరి యాతనిఁ జంపియుండెననియు నూహింప నగుచున్నది.

ఉద్యోగులు—శాసనములనుండి కాకతిప్రోలుని యుద్యోగులు కొందరు తెలియనగుచున్నారు. ఈతని మంత్రులలో త్రిభువనమల్ల వైజదం డాధిరాజ్యనాశనము నందాతనికి దోడ్పడి, తన నాథుని పుత్రుడగు బేతనయొక్కడు. మహా

---

52 శుక్లచైత్రభాగవతి535 వ పుట

53 Bhandarkar— Early History of the Dekkan. 3rd. Edn. p. 322

54 Bombay Gazetteer vol. I, pt. II. p. 222, p. 458. FF. 2 & p. 462

55 S. I. IV. No. 1242.

విద్వాంసుఁడును, ధర్మశీలుఁడునగు నీమంత్రి భార్య మైలమ యనునామె యనుమకొండపై కడలాలయ వసతిని నెలకొల్పెను.[56] వారంగల్లు జిల్లా మాటూరు గ్రామమునందలి యొక శాసనమునుండి మల్లెనాయకుడను మహాసామంతుడొకడు తెలియవచ్చుచున్నాడు. వేంగీ దేశమునందలి చెల్లేకిపుర వాస్తవ్యుడును, సుప్రసిద్ధ బ్రాహ్మణవంశీయుడునగు గంగాధరుఁడను మంత్రికూడ ప్రోలరాజు నౌద్యోగిక వర్గమున జేరియుండి రాచనగరునకు రక్షకుడుగనుండెను.[57] రేచెర్ల వంశజుడగు కామచమూపతిని గూర్చి యిదివరకే చెప్పియుంటిమి.

కట్టడములు—ప్రోలరాజునాటి కట్టడములలోనెల్ల ననుమకొండ పద్మాక్షీ దేవాలయము ముఖ్యమైనది. ప్రస్తుత మనుమకొండయని పిలువబడు నగరమునకు పశ్చిమమున నొక పర్వతపంక్తిగలదు. అందిరుపార్శ్వములను రెండు వరుసల కొండలుగలిగి తూర్పు పడమరలకు వ్యాపించియుండు కనుమయొకటిగలదు. తూరుపుదిశ నున్నతమగు శిలాద్వారమున్నది. ద్వారము నంటుచు నెడమవైపున నొక పెద్ద కొండ కలదు. కుడివైపున ద్వారమునుండి యొక దట్టమైన మట్టిగోడ యనతిదూరమున నున్న మఱియొక కొండను చేరుచున్నది. ఇయ్యవి ప్రాగ్భాగమునఁ గాంచేనగు దృశ్యములు. ఈకొండల వరుసకును దీనివెనుకనుండు మఱియొక దానికిని నడుమ సుమారు రెండు మూడు ఫర్లాంగుల దూరముండును. శిలాద్వారమునంటి దక్షిణముగనున్న కొండకావల కొంత విడిభూమియును, పిమ్మట నొక త్రికోణాకృతిగల పర్వతమును గలవు. దీనినంటి మఱి యొక యెత్తైన కొండగలదు. ఈకొండనుండి శిలాద్వారమునకు పశ్చిమభాగమున మరియొక బలమగు మంటిగోడ గాంచేనగును. ఇయ్యది శిలాద్వారమున కుత్తరమునసున్న కొండనంటి యుండిన పద్మాక్షికొండ యని పిలువబడు మఱియొక కొండను చేరుచున్నది. ఈవిధమున నప్పటి యనుమకొండ నగరము నాలుగు పర్వతముల చేతను, రెండు బలిష్ఠములగు మట్టిగోడలచేత నావరింపబడియుండెను. ఈరెండవ వరుసలో నుత్తరదిశనున్న కొండపైననే పద్మాక్షీదేవాలయముగలదు. కొండక్రిందుగ పద్మాక్షిగుండమను నొక కోనేరున్నది. దానిప్రక్కనుండి కొండపైకి మెట్లుగలవు. ఇతర కాకతీయ నిర్మాణములవలె మహోన్నతమును, స్నిగ్ధద్వారప్రాకార స్తంభసంయుతమును, సుందర శిల్పవిభూషితమును గాక నీయాలయము సంకుచితముగనున్నది. గర్భాలయమును దానినంటి నామమాత్రమగు నొక ముఖమంటపమును మాత్ర మిచట గాంచేనగుచున్నవి. ఆలయ గోపురముజైన పద్ధతిననుసరించి మెట్లుమెట్లుగ గట్టబడియున్నది.[58] ఈయాలయమున కెదురుగనే ప్రోలరాజునాటి కన్నడశాసనముగలదు. దాన కడలాలయ బసది యను నీయాలయము 42 వ చాళుక్య విక్రమ సంవత్సరమునఁ గట్టబడినటులఁ జెప్పబడి యున్నది.

పైకడలాలయకును ప్రస్తుమిందు బూజింపబడుచున్న పద్మాక్షీదేవికిని గల సంబంధమేమి

---

56 E. I. IX, p. 256.

57 చనువుమెయి నగరిలోదగు పనులెల్లను జెంపు మెరసి బఱికించుచు
కరీంనగరశాసనము. 41—43 పం॥

58 ఏకశిలానగరమునందలి స్వయంభు, విష్ణు, వేంకటేశాలయగోపురములుగూడ నీపిధమున నేయున్నవి.

హనుమకొండ పద్మాక్షి ఆలయమునందలి యక్షుడు.

హనుమకొండ పద్మాక్షి ఆలయమునందలి పద్మాక్షి విగ్రహము.

యో దెలియుటలేదు. శాసన పరిశోధకు లీ కడలాలయ యను దేవిజైన శాసనదేవులలో జేరిన యంబికగనో లేక పద్మావతిగనో యం డునని వ్రాసియుండిరి.[59] కడలాలయ యను కన్నడ పదము 'సముద్రమునుండి బుట్టిన'దను నర్థము నిచ్చునుగాని పద్మావతి యను నర్థము ను దెల్పుటలేదు. ఈయాలయమునందు బ్రకృత మారాధింపబడు దేవి పద్మాక్షియని పిలువ బడుచున్నది. ప్రాచీన చరిత్రములు గూడ నామె కదే నామము నొసంగుచున్నవి. 12 వ శతాబ్దమున నెల కొలుపబడిన కడలాలయ బ్రకృత పద్మాక్షీదేవిగ నెటుల మార్పుజెందె నో తెలియుటలేదు. మఱియును శాసన పరి శోధకుల యభిప్రాయముననుసరించి యీదేవి నంబిక యనుటకును, పద్మావతియనుటకుఁ గూడ వలనుపడుటలేదు. ఇందలి గర్భాలయ మునఁ బ్రవేశించినతోడనే యితరాలయముల వలె నెదురుగ నేమియు గానవచ్చుటలేదు. ఎడమవైపున గోడగ నమరిన యొకశిలపై నొకజైన తీర్థంకరుని విగ్రహమును దాని కిరు పార్శ్వములను యక్ష యక్షిణీ విగ్రహములు నున్నవి. ఇందలి యక్షిణి ద్విభుజయై పద్మాస నాసీనయై యున్నది. ఈమెయే ప్రకృతమున బద్మాక్షిగ బూజింపబడుచున్నది. ఇరువది రెండవ తీర్థం కరుని శాసనదేవియగు నంబికకు సింహలాంఛనమును, కుడిచేతులు రెండిటను మామిడిపండ్లగుత్తియు, పాశమును, యెడమ చేతులలో నొకశిశువును అంకుశము నుండవలెను. గాన నీ పద్మాక్షియంబికగాదు. ఇఱువదిమూ డవ తీర్థంకుడగు పార్శ్వనాథుని యక్షిణి పద్మా వతి. ఈమెకు హంసలాంఛనమును, చతుర్బా హువులు నుండవలెను. దిగంబరజైన శిల్ప శాస్త్రానుసారమీమె శిరోపరిభాగమునందెదు పడగల సర్పము ఛత్రమువలె నుండవలెను. శ్వేతాంబరజైనుల గ్రంథములనుండి యీదేవి కుక్కుట సర్పవాహనయనియు కుడిచేతులలో కమలమును, పాశమును యెడమచేతులో ఫల మును అంకుశమును ధరించి యుండుననియు దెలియుచున్నది.[60] ఈపద్మావతీ వర్ణనము బ్రకృత బద్మాక్షీదేవికి సరియగుటలేదు. పై చర్చనుండి ప్రకృతమారాధింపబడు దేవి మైలమ నెలకొల్పిన కడలాలయ కాదని తేలు చున్నది. ఆలయమధ్యమున వేదికగాని తదు పరి దేవతా విగ్రహమును వాని చిహ్నము లైనను గానరాకుండుటచే నీయాలయమునందు మొదట బ్రతిష్ఠింపబడిన విగ్రహ మేకారణము ననో స్థలాంతరమునకుఁ గొనిపోబడి యుండె ననియో లేక నియ్యది కడలాలయ బసదికాద నియో చెప్పవలసియుండును ఆలయమున కెదురుగ నొకకన్నడశాసనముండుటయు దాని ప్రక్కనే యొక శిలపై మైలమయొక్కయు నామె భర్తయొక్కయు విగ్రహములు నిర్మిం పబడి యుండుటయు రెండవయూహ కెడమిచ్చు టలేదు. అటులయిన నిందలి కడలాలయ యే మయ్యెనను సమస్య వొడమును. దానికి క్రింది విధమున సమాధానము నొసంగవచ్చును. శాసనపండితు లీ కడలాలయ యంబికయై యుండునని యూహించిరని యిదివరలో జెప్పి యుంటిమి. ఈయంబికకు "కూష్మాండినీ" యని మఱియొక పేరుగలదు. కాకతి కూష్మాండ శబ్దములకు గుమ్మడితీగతో సంబంధముగలదు. కాకతియను దుర్గాశక్తినారాధించువారలుగాక

59 I. A. XXI, p. 257

60 Ibid for 1903, p. 459. Cf. Ibid for 1927, p. 23

తీయులు. అంబికయను దేవి దుర్గారూపము. దానినుండి గాకతీయులీ యంబికాభక్తులని స్పష్టమగుచున్నది. ఏకశిలానగరేశ్వరులకుఁ గులదేవతయగు నీకాకతమ్మకు ఆనగరమున సుప్రసిద్ధమగు దేవాలయముండెనని క్రీడాభిరామాదులనుండి దెలియనగును. వారంగల్లు ప్రాంతమునందు మొదట జైనమతమును, పిమ్మట శైవమతమును బ్రబలి, జైనకట్టడములును శిల్పములును శైవదీక్షనందినవనుటకుఁ బ్రత్యక్షనిదర్శనము లనేకము లగుపడుచున్నవి. కాకతి రెండవ ప్రోలరాజు మొదట జైనుడుగనుండి పిమ్మట శైవుడయ్యెను. క్రీ. శ. 1150–58 ల నడుమ బసవేశ్వరుడొనర్చిన వీరశైవప్రబోధము నీతడునుఁ జేవి చూచియే యిటులొనర్చియుండును. ప్రోలుని పుత్రుఁడగు రుద్రదేవుడు మహాశైవుడై యనేక శివ, భైరవ, శక్త్యాలయములను నిర్మించెను. ఇటుల శైవమత మోర్గల్లు ప్రాంతములకెక్కించిన కాలమున జైనులనేక విధముల హింసింపఁబడి వారి కట్టడములు పాడుచేయుబడినటుల ప్రాచీనచరిత్రములలోఁ జెప్పబడియున్నది. ఈసందర్భమునవే రెండవప్రోలుడో లేక రుద్రుడో యీ యనుమకొండ యాలయమునందలి యంబికా విగ్రహమును గదలించి నూత్న నిర్మితమగు నేక శిలానగరమున నొక రమ్యహర్మ్యమునఁ గాకతియను పేరఁ బ్రతిష్ఠించి యుందురని దోచుచున్నది అనంతర మీమెయే కాకతమ్మయని బ్రఖ్యాతి నందియుండును.

ఆలయమున కుత్తరమున రెండుపెద్దశిలలు గలవు. వానిలో మొదటిదానిపై నొకజైనవిగ్రహమును తచ్ఛిరోపరిభాగమునందొక విస్తృతసప్తముఖనాగమునుఁగలవు. ఇయ్యది యిరువదిమూడవ తీర్థంకరుడగుపార్శ్వనాథుని విగ్రహము. ఈశిల్పమునకుప్రక్కనొక ధ్యానిజైన విగ్రహమును, దత్పార్శ్వమున సపత్నీకుడగు నొకభక్తుడును చిత్రింపబడియున్నారు. ప్రాయికముగ వీరిర్వురును మంత్రిబేతనయు నాతనిభార్య మైలాంబికయు నై యుందురు. రెండవశిలలో నధోభాగమున రెండుగుహలు నిర్మింపబడియున్నవి. ఇయ్యవి బిక్షువులయుపయోగార్థమై యుండనోపును.

శాసనాంతరములనుండి రెండవప్రోలరాజు జగత్కేసరియను నొకతటాకమును నిర్మించెనని తెలియుచున్నది ప్రాచీనవంశచరిత్రములలో నేకశిలానగరమునుగూడ ప్రోలుడేనిర్మించినటులఁ జెప్పబడియున్నది. ఈవిషయమున నీక్రింది గాథ గాంచనగును—

ఒకనా డనుమకొండనగరమునకుఁ దినుబండములనుగొనిదెచ్చుబండ్లలోనొకటి నగరసమీపముననొకరాయికిఁదగిలి బోరగిలపడెను. చూపరులకాశ్చర్యమొదవ నాశిలభిన్నమై యందుండి దివ్యతేజోమయమగు నొకశివలింగముద్భవించెను. తలక్రిందులయిన యాబండియిరుసు దేదీప్యమానమగు స్వర్ణముగమాఱెను. చారులచేనీవార్తనాలకించి విద్వజ్జనపరివారాదులఁగూడి ప్రోలరాజాప్రదేశమునకేగి యాదేవునింగాంచి, పండితవర్యులాతనికి స్వయంభుదేవుడనియు, స్పర్శవేదియనియు నామములొసగ, దానచ్చోట నొకసుందరదేవాయతనమును నిర్మించెను.

ఈగాథయంతయు సత్యముగాకుండినను కాకతిప్రోలుడు స్వయంభుదేవాలయాది పూర్వకాకతీయ దేవాలయములను నిర్మించెననుటకు, పద్మాక్షీయాలయము నయ్యవి యనేకవిధములఁబోలి యుండుటయె నిదర్శనము. విష్ణుగుడి, వీరభద్రగుడి, మున్నగు నేకశిలానగరదుర్గము





హనుమకొండ పద్మాక్షి ఆలయమువద్ద బండపై నున్న జైనవిగ్రహములు.



హనుమకొండ సహస్రస్తంభ దేవాలయము—మంటపము.



హనుమకొండ సహస్రస్తంభ దేవాలయము—ప్రధానాలయము.

నందలి యాలయములీ సందర్భముననే నెల కొల్పబడియుండవలెను. కాకతిరుద్రునినాటికి ప్రదేశమున చేక్కినినగరమొకటి యుండినటుల శాసనములనుండి తెలియుచున్నది. పై కారణములచే ననుమకొండలోని పద్మాక్షి, సిద్ధేశ్వరాలయములును, ఏకశిలానగరమునందలి స్వయంభు కేశవాలయములునుగూడ ప్రోలరాజు కాలముననే నిర్మింపబడినటుల దోచుచున్నది.

X రుద్రదేవుఁడు.

ప్రోలరాజుకుమారులలో నగ్రజుడగు రుద్రదేవుడు రాజ్యమునకువచ్చునప్పటి కాంధ్రదేశమునందలి పరిస్థితులు విపరీతములుగనుండినవి. తూర్పుతీరమున వెలనాటివంశీయుల ప్రతిభ రెండవచోడరాజు కాలమునకు పరమావధిని గాంచి, యనంతరమున క్షీణింపఁదొడంగెను. దక్షిణపశ్చిమముల నాంధ్రచోడులు కొణిదెన పొత్తపి మున్నగు స్థలములబలి వెలనాటిపై దాడివెడలజొచ్చిరి. నెల్లూరుచోడులు దక్షిణ దేశ రాజ్యాంగవిషయములఁబాల్గొని ప్రాముఖ్యత నందసాగిరి. గోదావరికి దక్షిణమున కొలనివంశీయులును ఉత్తరమున తూర్పుగాంగులును రాజ్యమేలుచుండిరి. అనుమకొండరాజ్యమునకుఁ బశ్చిమోత్తరమున లింగాయతులు గళచురిరాజ్యము నంతమొందించిరి. ఉత్తరమునుండి యాదవులుగూడ రాజ్యమును విస్తరించుకొనుచుండిరి. ఒకప్పుడుపశ్చిమచాళుక్యులకు సామంతులుగ నుండిన మండలేశ్వరులెల్లరును స్వతంత్రులై పరస్పర కలహములకు లోనై యుండిరి. ఈవిధమున దక్షిణాపథమంతయు నల్లకల్లోలములకులోనై నిరుపమబాహుబల సంపన్నుడును, నిర్మాణకర్మనిరతుడునగు నొకవ్యక్తికై యెదురుచూచుచుండెను.

విజయములు:—రుద్రదేవుడు మహాపరాక్రమశాలియు దూరదర్శియునై యుండెను. సింహాసనమునకు వచ్చినవెంటనే యీతనికి రెండుకర్తవ్యములుగనపించెను. వానిలో మొదటిది తనతండ్రి జయింపగామిగిలిన యితరమండలీకులను జయించుట, రెండవది తనతండ్రి మరణమునకుఁ గారకులుగనుండిన వెలనాటిరాజులపై బగదీర్చికొనుట. ఈతడీ రెండుకార్యములును గూడ నుత్కృష్టముగ నెరవేర్చెను. రుద్రదేవునిచే నిర్జింపబడిన శత్రురాజులలో దొమ్మెరాజు మేడరాజు, మైలగిదేవుడు, భీముడు, చోడదయుడు, ముఖ్యులుగనుండిరని యనుమకొండ శాసనమునుండి తెలియుచున్నది. ఈశాసనము క్రీ. శ 1162 నాటిది. అప్పటికే తైలపదేవుడు రుద్రదేవుని భయమువలన దివంగతుడయ్యెను. క్రీ. శ. 1158 లో రాజ్యచ్యుతుడై అన్నెగిరికి పలాయితుడైన మూడవతైలపదేవుడే యీతడని స్పష్టమగున్నది.

దొమ్మెరాజువిషయ మింతవరకునుఁ జరిత్రమునకుఁ దెలిసియుండలేదు. రెండవప్రోలరాజు దిగ్విజయములను వర్ణించుసందర్భమునం దీ దొమ్మెరాజును జగద్దేవుడునుఁగలసి యొకశాసనమునఁ బ్రశంసింపబడిరని చెప్పియుంటిమి. జనసామాన్యమునంగల గాథలలోనీతడు నైజాం రాష్ట్రమునందలి ధర్మపురినుండి గోదావరీతీరమునందలి భద్రాచలము వరకునుగలభూమి కేలికగ బ్రశంసింపబడుచున్నాడు. ఈతనినిర్జించుటచేఁ గాకతిరుద్రునిరాజ్యము ప్రకృతగోదావరీమండలమందలి యుత్తరదిశను వ్యాపించెను.

మేడరాజుకూడ చరిత్రమున కపరిచితుడై యుండినవాడు. పాఖాలతాలూకాగోవిందాపు

రములోని క్రీ. శ. 1127 నాటియొకశాసనము నుండి యీమేడరాజు మాధవవర్మవంశజుడగు దుగ్గరాజుపుత్రుఁడని తెలియుచున్నది. ప్రాయికముగ నీతడు వారంగల్లుమండలములోనికురువపట్టకును గోదావరికిని నడుమఁగలదేశమున కధిపతియై యుండును.[61]

మైలగిదేవునిఁబూర్వచరిత్రకారులు యాదవరాజగు మల్లుగితో సరిచేసియుండిరి కాని యియ్యది యనుమకొండ శాసనము నందలి విషయములకు విరుద్ధముగ నున్నది. మైలగిదేవునిఁ జయించి కాకతిరుద్రుడు పొలవాసదేశమును స్వాధీన మొనర్చుకొనెను. అనుమకొండ కనతిదూరముననే జగత్యాల తాలూకాలో నొక మైలగి గనవచ్చుచున్నాడు. ఆ తాలూకాకు నేటికిని "పొలాసా" యను నామముగలదు. గాన నీతడే రుద్రదేవుని బ్రత్యర్థి యని చెప్పవలెను.[62]

అప్పటి మండలికు లందరిలోనను భీమరాజు మిగుల బలవంతుఁడు. కేవల స్వార్థాభిలాషియై యాతడు మాతుస్సపత్నీరతత్వమునకు నగ్రజ వధకునుఁ గూడ వెనుదీయ కుండెను. అతి ధూర్తుడగు నీత డాశాపిశాచమునకు లొంగి చాళుక్యసింహాసనమునుసహిత మాక్రమింప దొడగెను. ఈదుర్వినీతుని చరిత్రము నాలకించిరుద్రదేవుడు చితబలములతోఁగూడ భీముని రాజధానియగు వర్ధమానపురముపై దాడి వెడలి దానిని ముట్టడించెను. కాకతీయుల దాడి కోర్వఁజాలక భీముడు సకుటుంబముగ నడవులకుఁ బాఱిపోయెను. రుద్రదేవుడంతట వర్ధమానపురము నాక్రమించి, దానిని సమూలముగ నాశమొనర్చి తన్మధ్యమునం దొక గొప్పతటాకమును నిర్మించెను. వారంగల్లునకు సుమారు 50 మైళ్ళ దూరమునం దున్న వడ్డమరిగ్రామ మీవర్ధమానపురమై యుండవచ్చును. నైజాంరాష్ట్రమునందలి మామిళ్ళపల్లిగ్రామములోని యొక శాసనము వర్ధమానపురచోళవంశము నభివర్ణించుచున్నది. దాని నుండి కలికాలచోళుని వంశమున గోకర్ణుఁడును, అతని కుదయాదిత్యుఁడును, అతనికి భీమగోకర్ణు లనువారలును జనించిరని తెలియుచున్నది.[63] ఈశాసనము క్రీ. శ. 1118 లో, నన గా ననుమకొండశాసనమునకు 44 సంవత్సరములు పూర్వము రచింపబడినది. ఇందలి భీముడు ననుమకొండశాసనమునందలి భీముడు నొక్కరే యయియుందురు. ఆంధ్రదేశమున వర్ధమానపురమునఁగూడ నొక చోళవంశముండె ననియు, గాకతీయులకు నాంధ్రచోళులకు నిదియే ప్రథమసంగర మనియు నీ సందర్భమున గమనింపవలసియున్నది.

కాకతిరుద్రదేవుని ప్రత్యర్థులలో చోడోదయుడను నాతడు మఱియొకడు. రుద్రదేవుడీతని యెడ సామము నవలంబించి[64] యీతని పుత్రిక యగు పద్మావతినిఁ బెండ్లియాడెను. ఇటీవ వెడలి దానిని ముట్టడించెను. కాకతీయుల ల బయల్వెడలిన గొన్ని శాసనముల యాధార

---

61 శుక్లచైత్రభారతి, 537 వ పేజీ. శ్రీ శేషాద్రిరమణకవు 'ఎనుమకొండ' శాసనపు పేరిట రచించిన వ్యాసము. నేను వీరియూహల నామోదించుచున్నాను.

62 Ibid

63 Ibid

64 శ్రీ శేషాద్రిరమణకవులచే రచింపబడిన "పద్మావతి" యను నవల యీచరిత్రాత్మకవిషయముల నెల్ల రమ్యముగ మనోగతముల నొనర్చుచున్నది.

మున నీ చోడోదయుని వ్యక్తిత్వమును నిర్ణయింప వలనుపడుచున్నది. క్రీ॥శ॥ 1162 నాటి జటచర్లశాసన మొకటి కరికాలవంశజు డగు మహామండలేశ్వర కందూరి ఉదయన చోడ మహారాజుయొక్క సుంకాధికారులను పేర్కొనుచున్నది. ఈతని ప్రశంస 12 వ చాళుక్య విక్రమ కాలమునాటి కొలనుపాక శాసనమునను, క్రీ. శ. 1125 నాటి నేలకొండపల్లి శాసనమునను గూడ గానవచ్చుచున్నది.[65] ఈతడే యనుమకొండ శాసనములోని చోడోదయుడని స్పష్టముగ చెప్పవచ్చును. పై పేర్కొనిన ప్రతిపక్షులను జయించి, రుద్రదేవుడు పరిసర ప్రాంతమును నిష్కంటకముక నొనర్చుకొని, ప్రకృత తెలింగానా ప్రాంతమునెల్ల తన యేలుబడి లోనికిఁ దెచ్చెను.

అటుపిమ్మట నీతడు తన దృష్టిని వెలనాటి పైఁ బ్రసరింపజేసెను. ఈతడీ రాజ్యమును జయించెననుటకు శాసన ప్రమాణము లనేకములు గలవు. అనుమకొండ శాసనమున రుద్రదేవుని రాజ్యము దక్షిణదిశను శ్రీశైలము వరకును వ్యాపించెనని చెప్పబడి యున్నది. త్రిపురాంతక క్షేత్రమునఁ గూడ నీతని శాసన మొకటి గలదు. ఇంతకుఁ బూర్వమీ ప్రదేశములు రెండును వెలనాటి రాజుల యధీనమునందుండినవి. గోదావరీ మండలమునందలి ద్రాక్షారామమున క్రీ. శ. 1158 నాటిదగు మఱియొక శాసనము రుద్రుని కాలమునాటిది గలదు. దాన నీతని మంత్రియగు ఇనగాల బ్రిమ్మరెడ్డి ధర్మ మభిపర్ణింపబడి యున్నది.[66] అచేటనే క్రీ. శ. 1168, 1186 లనాటి శాసనములు మఱి రెండు గానవచ్చుచున్నవి.[67] వెలనాడు వంశీయుల రాజ్య మీ ప్రాంతములకుఁ గూడ వ్యాపించి యుండెనని యితర శాసనములనుండి తెలియుచున్నది. పై విషయములన్నెల్ల గమనించినచో క్రీ శ. 1158 లో రెండవ పోలరాజు రణనిహతుడయినప్పుడే రుద్రదేవుఁడొకతూరి వెలనాటి యుత్తరభాగముపై దాడి వెడలెననియు, క్రీ. శ. 1162 లో (అనుమకొండ శాసనకాలము) రెండవసారి దండు వెడలి శ్రీశైల త్రిపురాంతక ప్రాంతములను జయించెననియు నూహింపవచ్చును. ఆతడు క్రీ. శ. 1168 నుండియు ననగా వెలనాటి రెండవ చోడరాజు కాలమునుండియు తూర్పు తీరము నలజడి పఱచుచుండెను. ఉత్తరమున కొలని రాజులును, దక్షిణమునఁ దెలుగు చోడులును, ప్రబలి వెలనాటి వంశీయుల యధికారమును ధిక్కరించుట యీ కాకతీయ విజృంభణమునకుఁ బ్రోద్బలము నొసంగియుండును. మూడవ గొంకరాజు కాలమున వెలనాడులో నుపద్రవములు ప్రబలి యరాజక మెక్కుడయ్యెను. క్రీ. శ. 1185 నకుఁ బిమ్మట నీతని విషయమేమియు దెలియకుండుటయు, నీతని తనయుఁడగు పృథ్వీశ్వరుడు గోదావరి కావల రాజ్యమేలియుండుటయు, క్రీ. శ. 1186 నాటి దే కాకతిరుద్రుని శాసనమొకటి ద్రాక్షారామమున గన్పించుచుండుటయు నంతకుఁ బూర్వమనేకసార్లు కాకతీయులు వెలనాటిపై దండెత్తియుండుటయు నాలోచించి చూడ మూడవ గొంకరాజును గాకతిరుద్రదేవుడు క్రీ. శ. 1186 లో రణరంగమున నెదుర్కొనెననియు దాన గొంకరాజు నిహతుడగుటచే నాతని పుత్రుఁడు పిఠాపురమునకుఁ బాఱిపోయెననియు నూహింప

65 ఈశాసనముల ప్రతిబింబములు హైదరాబాదు లక్ష్మణరాయపరిశోధకమండలివారివద్ద నున్నవి.

66 S. I. I. IV No. 117. 67 Ibid Nos. 1095 & 1155.

వలనుపడుచున్నది.[68] ఆటుపిమ్మట విజృంభించినకోట,నతవాడి మున్నగు వంశములతో కాకతీయ గణపతిదేవుని కేర్పడిన వైవాహిక సంబంధములకు రుద్రదేవుడే స్వరాష్ట్ర రక్షణార్థమై, బునాదుల నేర్పరచి యుండును. ఈ వెలనాటి యుద్ధముల మూలమునఁ గాకతి రుద్రుడు కేవలము పితృవధకుఁ బ్రతీకార మొనర్చుటయేగాక స్వరాజ్యమును బ్రకృత గోదావరీ కృష్ణా మండలముల లోనికిఁ గూడ వ్యాపింపఁ జేయగలిగెను.

ఆశ్రయులు—శాసనములందును వాఙ్మయమునను రుద్రదేవుని యుద్యోగులును సామంతులు ననేకులు పేర్కొనఁబడియున్నారు. ద్రాక్షారామ శాసనములలో నొకదానినుండి యినగాల బ్రిమ్మిరెడ్డియను నొకమంత్రి తెలియవచ్చు చున్నాఁడు. తన రాజ్యకాలము ననే రుద్రదేవుఁడు ఓరుగల్లుపురమున రాచనగరునుఁ గట్టించి ఇందులూరి వంశీయులగు పిన మల్లన పెదమల్లన యను నిర్వురు సోదరులను మంత్రులుగ నియమించి యచ్చట రాజకార్యములను నెరవేర్చు చుండెనని శివయోగసారమునఁ జెప్పబడియున్నది.[69] రెడ్డికులజులగు రేచెర్ల వంశీయులీ కాలమునఁ గడుఁ బ్రసిద్ధికెక్కియుండిరి. వీరిలో నొకఁడగు కామచమూపతి రెండవ ప్రోలరాజునకుఁ దక్షిణహస్తమై యొప్పియుండెను. ఆతని తనయులగు బేతిరెడ్డి, కాటరెడ్డి, నామిరెడ్డి యనువారలు రుద్రదేవుని కాలమున వాసికెక్కియుండినటుల శాసనములనుండి తెలియుచున్నది. బేతిరెడ్డి బిరుదములనుండియు, నాతనిభార్య యెఱకసానమ్మ చేసిన భర్తృప్రశంసనుండియు నాతడు మహాశూరుఁడుగ గన్పట్టుచున్నాడు. ఈతని కాలమును నిర్ణయించుటకుఁ గొన్ని యాధారములున్నవి. క్రీ. శ. 1195 నాటి యొక శాసనమున నామిరెడ్డికి వంశానుగతములగు బిరుదము లేమియు లేకుండుటయు, క్రీ. శ. 1202 నాటి మఱియొక శాసనమునందయ్యవి గాంచేనగుటయు, నాతనియగ్రజుడగు బేతిరెడ్డికా బిరుదములన్నియు నుండుటయుఁజూడ నీబేతిరెడ్డి క్రీ. శ. 1195—1202 ల నడుమ మరణించియుండునని తోచుచున్నది. మహావీరుడగు నీతడు యుద్ధకర్మనిరతుడును, యోధశిఖామణియునగుఁ గాకతిరుద్రుని దండాధినాథులలో నొకడై యుండి యాకాలపు యుద్ధములలోనెల్ల బాల్గొని యుండెననుట నిర్వివాదాంశము.[70] క్రీ. శ. 1195 లోనే యీకాకతిరాజన్యుఁడు

---

68 J. A. H. R. S. V, pt, 2 లోని "Velnadu chiefs" అను వ్యాసమున నీవిషయమును జర్చించియుంటిని.

"The fact that Guru Mallikarjuna Panditaradhya cursed the Velnadu ruler at Chandavolu and that he was a contemporary of Kakati Rudra might be taken to support this view of Kakatiya connection with the fall of the Velnadu rulers".

69 గీ. మతివాని సత్పుత్రికులు పెదమల్లవిభుడు, పిన్నమల్ల ప్రభుండన పృథివి బరగి
కాకితయ్య మహారాజ్యకర్తయైన, రుద్రమహారాజ సచివులై రూఢిమనిరి.
తరల. అనుమకొండపురంబుగాదని యావిభుండిల నోరుగ, ల్లనపురంబు ఘటించి యచ్చటి కచ్చుగా నరుదెంచి యమ్మనుజనాథుడు నాయకత్వము మల్లమంత్రికి చిన్నమ, ల్లనకు ధారిణి పెద్దసంప్రతి నాతతంబునకిచ్చెన్.
||శివయోగసారము||

70 J. A. H. R. S. V, pt. 3 లోని "రేచర్లవంశము" అను నావ్యాసమును జూడనది.

దేవగిరియాదవులతో ఘోరముగఁబోరి రణరంగమునఁ బ్రాణములుబాయుటయు, నదేసంవరత్సమునకుఁ బిమ్మటఁ బేతిరెడ్డిప్రశంస గానరాకుండుటయుఁజూడ నీతడుకూడఁ దనయేలికవలెనే స్వదేశసంరక్షణార్థమై యాదవనిశితధారలకుఁ దనప్రాణము నాహుతిగనొసంగెనని స్పష్టమగుచున్నది. ఈతనియనంతరము నామిరెడ్డి పిల్లలమర్రి యామనగల్లుప్రాంతముల కధిపతియయ్యెను. ఈతడు ధర్మకార్యాభినిరతుఁడై యాలయ తటాకాది నిర్మాణములఁ గాలక్షేపము చేయుచుండెను. ఈసోదరులలో మధ్యముఁడగు కాటెర్రెడ్డి ప్రశంసయేమియు గానరాకుండుటచే నాతఁడు సామాన్యముగనే తనజీవితమును గడపియో లేక బేతిరెడ్డికన్న ముందుగనేమరణించియో యుండును. ఈకాటెడ్డిపుత్రుఁడగు రుద్రసేనాని యాంధ్రసేనానులలోనెల్ల బ్రసిద్ధుఁడును, కాకతిరాజ్య సంరక్షకులలో నగ్రగణ్యుఁడునై యాంధ్రలోకమునకు మహోపకారమునొనర్చి కీర్తి నందియుండెను. ఈరుద్రసేనాని కాకతిరుద్రునికాలమున యువకుఁడుగనుండి యాతని రాజ్యాంతకాలమునకు ప్రౌఢవయస్కుఁడై విజృంభించెను. నైజాం రాష్ట్రమునందలి కరీంనగరమునందలి యొక శాసనమునుండి కాకతిరుద్రునివద్ద గంగాధరుఁడనునొక బ్రాహ్మణమంత్రిగూడ నుండెనని తెలియుచున్నది. ఈతడు రెండవప్రోలరాజు కాలమున రాచనగరులో నొకయుద్యోగిగనుండి రుద్రదేవునికాలమున మంత్రిపదవిని సముచిత లాంఛనములనుఁబొందెను. ధర్మచిత్తుఁడును మహాభక్తుఁడునగు నీమంత్రిసత్తముఁడు హిడింబాశ్రమము, నగరూరు, అనుమకొండ మున్నగుచోటుల ననేకదేవాలయములనుఁ బుష్పవాటికలను నిర్మించెను. ఈకాలమున బౌద్ధపూజ సామాన్యముగ జరుగుచుండెను. అందుచే నీమంత్రి బుద్ధదేవునకుఁగూడ నొకయాలయమునుఁ గట్టించెను.

వాఙ్మయము:—కాకతిరుద్రదేవుని రాజ్యకాలము కాకతీయాంధ్రసామ్రాజ్యమునకే గాక భావివిద్యాభిపోషణమునకుఁగూడ బునాదులనిర్మించెను. సంస్కృతాంధ్రములయందసమానవైదుష్యముగల యీరాజచూడామణి మహారసికుఁడై యనేకవిద్వాంసుల నాదరించుటయేగాక స్వయముగా గ్రంథరచనము నొనర్చియుండెను. ద్రాక్షారామ శాసనములలో నొకదానినుండి యీతనికి "విద్యావిభూషణుఁ" డను బిరుదముండెనని తెలియుచున్నది. ఈతడు సంస్కృతమునరచించిన "నీతిసార" మను గ్రంథమును బద్దెనకవి "నీతిశాస్త్రముక్తావళి" యనుపేరిటఁ దెనిగించెను.[71] అంతియగాక సుప్రసిద్ధశైవాచార్యుడును, మహావిద్వాంసుడునగు గురుమల్లికార్జునపండితారాధ్యుఁడు నాతనిశిష్యుడును, వీరశైవ మతప్రవర్తకాగ్రగణ్యుఁడునగు పాల్కురికి సోమనాథుడునుగూడ గాకతిరుద్రదేవునికి సమకాలికులై యుండి యాతనియాదరణమునుఁ బడసియుండిరి. ఈకవిపుంగవులు కర్ణాటాంధ్రములలో రచించిన గ్రంథరాజము లాంధ్రదేశమున శైవమతము వ్యాపించుటకెక్కుడుగఁ దోడ్పడినవి. వీరశైవమతావేశపూరితులై యనేకులగు కర్ణాటకకవు లాంధ్రభాషను, ఆంధ్రకవులు కర్ణాటకమునునుఁగూడ గ్రంథములను రచింపుచుండుటచే మతవాఙ్మయ విషయములలో కర్ణాటాంధ్రులకుఁ జేక్కసిపొందిక యీకాలమునం దేర్పడుట కవకాశముగలిగెను.

71 ఆంధ్రులచరిత్రము 2 వ భాగము పేజీ 172—173.

పల్నాటియుద్ధము:—కాకతీయ చరిత్రమునకు రుద్రదేవుని రాజ్యకాలముననే తూర్పుతీరమునఁజరిగిన పల్నాటియుద్ధము మిగులమ ఖ్యమైనది. సవతితల్లుల బిడ్డలకుజరిగిన యీ యుద్ధకాలము మహాసంక్షోభము నొనగూర్చి వెలనాటిరాజులు మున్నగువారల యదృష్టములను తారుమారొనర్చెను. ఈయుద్ధము ననేక కవులుకీర్తించి యుండిరి. వానిలో శ్రీనాథుని పల్నాటివీరచరిత్ర మగ్రగణ్యము. పదకొండవ శతాబ్దపు టంత్యభాగమునుఁ బండ్రెండవ శతాబ్ది ప్రారంభమునను హైహయవంశీయు లనేకు లాంధ్ర శమున వెలనాటి ప్రాంతమునఁ స్థిరపడి పశ్చిమచాళుక్యులకు సామంతులుగఁ జిన్నచిన్న రాజ్యముల నేర్పరచుకొనిరి. కాలక్రమమున వీరలుఁ బ్రబలులగుటచే వెలనాటి రెండవ చోడరాజు నంతటివాఁడు తన పుత్రికయగు మైలమను హైహయుఁడగు అనుఁగురాజున కిచ్చి వివాహమొనర్చెను. ఈ సంబంధము వలన అనుఁగురాజు పల్నాటి కధిపతియై గురిజాలనుండి పరిపాలింపసాగెను. ఈతనికి మైలమవలన నలగామరాజును ఇతర భార్యలవలన మఱికొందరు సుతులు నుద్భవించిరి. అనుఁగురాజునకు రేచెర్ల బేతిరెడ్డి కుమారు డగుదొడ్డానాయఁడు మంత్రిగనుండెను. కొందరు పండితులీ బేతిరెడ్డిని పిల్లలమఱ్ఱి శాసనములలోని బేతిరెడ్డితో సమన్వయించి వంశవృక్షమును సరిచేయుటకై యసంబద్ధములగు ననేక నిర్ణయములను జేసియుండిరి. ఇట్టియూహాలు సరియైనవి కావనియు, నీపద్మనాయక వంశమునకు మూలపురుషుడుగఁ బరిగణింపఁబడు బేతిరెడ్డియును, రేచెర్లయనునింటి పేరుగలిగి పిల్లలమఱ్ఱి అమనగల్లు ప్రాంతముల నభివృద్ధినందిన వంశమునఁ బేర్కొనబడు బేతిరెడ్డియు నొక్కరు గాదనియు నిరూపించి నైజాంరాష్ట్రమునందలి గార్లగ్రామము నందున్న యొక శాసనమునుండి తెలియనగుచు నీ పల్నాటి యుద్ధకాలముననే యుండిన రేచెర్ల బేతిరెడ్డియే పద్మనాయక కుల ప్రతిష్ఠాపకుఁడనియు నేనిదివరలో సూచించియుంటిని. అనుగురాజును దొడ్డానాయమును మరణించినపిమ్మట వారిపుత్రులగు నలగామరాజును, బ్రహ్మనాయఁడును రాజును మంత్రియునైరి. రాజ్యమునకు వచ్చిన కొలది కాలమునకే నలగాముఁడు స్వాభిమానపూరితయు, తంత్రిజ్ఞయు నజ్ఞాతోద్భవయు నగు నాయకురాలను నొక లావణ్యరాశి విలాసములకులోనయ్యెను. రాజునకీమె దనసవతి సోదరులయెడ మత్సరమునుఁబుట్టించెను. మంత్రియగు బ్రహ్మనాయఁడీ యన్యాయ ప్రవర్తనము నుగ్గడించి రాజును సన్మార్గమునకు మరల్ప యత్నించుటలో నాతనికి నాయకురాలితో వైషమ్య మేర్పడియెను. మహాభారత యుద్ధమునందువలె నీసందర్భమున గూడ నిరువంకలవారును కోడిపందెముల మూలమునఁ దమ తగవును బరిష్కరింప నిశ్చయించిరి. మాయోపాయముచే నాయకురాలు దన కోడిని గెలిపించి బ్రహ్మనాయని నాతని పక్షము వారగు నలగామునిసవతి తమ్ముల నేడుసంవత్సరములు రాజ్యమునువిడిచి యుండునటులొనర్చెను. ఈమితిగడచినపిమ్మట బ్రహ్మనాయఁడు సవతిపిల్లలతరపున నర్ధరాజ్యము నడుగగా నలగాముఁడు వార్త దెచ్చిన రాయబారినిఁ బొడిపించివైచెను. అంత నిరుపార్శ్వములవారికిని కారెమపూఁడివద్ద నొకఘోర సంగ్రామము జేరిగెను. ఈసందర్భమునఁ గాకతి రుద్రదేవుఁడు నలగామరాజునకు సహాయముగ వేయిగుఱ్ఱములనంపెననియు, కోటవంశీయుడగు

రెండవ కేతరాజు నాయకురాలిపక్షమున నొక కాయుబారమును నడపెననియుఁ దెలియనగు చున్నది. కారెమపూడి యుద్ధమునం దనేకవీరు లిరుపార్శ్వములను మడసియుండిరి. అంతియగాక నాయకురాలు దానుస్వయముగ రణరంగమునఁ బాల్గొనెను. తుదకుబ్రహ్మనాయఁడు జయించియు తనపక్షమునందలి రాజపుత్రులందరును సమసియుండుటచేఁ జేయునదిలేక నలగామరాజునుక్షమించి తిరిగిరాజ్యమున కభిషిక్తునిఁజేసెను. ఈయుద్ధము క్రీ. శ.1176_1182 నడుమ, ననగా వెలనాటి రెండవచోడరాజు రాజ్యాంత్యమునను మూడవగొంకరాజు రాజ్యారంభకాలమునను జరగియుండెను. ఈసందర్భమునం దనేకమండలీకులు స్వతంత్రులై వెలనాటివారి యధికారమును ధిక్కరించిరి. ఈపరిస్థితులను గమనించుచుండిన కాకతిరుద్రదేవుడు క్రీ. శ. 1186లో వెలనాటిపై దండెత్తి మూడవగొంకరాజును వెలనాటివంశమును నాశమొనర్చి, సరిహద్దులలోనుండిన నతవాటిరాజులతో బాంధవ్యమును నెఱపికొని స్వరాజ్యమునకు మరలెను. హైహయుఁడగు నలగామరాజు రుద్రునకు మిత్రుడని యిదివరకే చెప్పియుంటిమి. ఈవిధమున నీపల్నాటి యుద్ధపరిణామముగ వెలనాటివంశపతనమును, వివిధమాండలికవిజృంభణమును, గాకతిరాజ్య విస్తరణమును సమకూడినవి.

సాంఘిక పరిణామములు:— రుద్రదేవుని రాజ్యకాలమునఁ దాత్కాలిక సాంఘికవిభాగములం దనేకమార్పులు గలిగినవి. కాకతీయ రాజ్య మూలస్థంభులై, యద్వితీయస్వామిభక్తిపరాయణులై, యనేక సమరవిశ్రుత విశాల యశోవిలాసులై, సకల రాజ్యాంగ నియోగ పాలకులై యొప్పి, ఏకశిలానగర సామ్రాజ్య మంతరించిన వెంటనే స్వతంత్ర రాజ్య సంస్థాపనమొనర్చి, రెడ్డిరాజులకును, సంగమవంశీయులకును, దురుష్కులకును, బ్రతిపక్షులై నిలచి, యుత్తర తెలింగానా ప్రాంతమునం దాంధ్ర గౌరవ దీపికను బ్రత్యుద్ధరించిన పద్మనాయక వీరులీ కాలముననే ప్రాముఖ్యత నందిరి. వీరి యుత్పత్తినిగూర్చి పిఠాపురము, బొబ్బిలి, జటప్రోలు, వెంకటగిరి జమీందారుల వంశ చరిత్రములనుండియు, శ్రీనాథుని పల్నాటివీర చరిత్రము నుండియు, వల్లభామాత్యుని క్రీడాభి రామమునుండియు, పద్మనాయకచరిత్రమను దాళపత్రగ్రంథము నుండియు, విశేషాంశములు దెలియనగుచున్నవి. పై వంశ చరిత్రములలో పద్మనాయ కోత్పత్తిని గూర్చి రెండు గాథలు గాంచేనగుచున్నవి. వానిలో మొదటిది వారలొకప్పుడు క్షత్రియులుగనుండియు మహాపద్మునిచే చిరకాలము ఖైదునందుంచబడి కులోచిత సంస్కారములను మఱచి, బందీవిముక్తులైన పిమ్మట నేమియుఁదోచేకపద్మనాయకులమని చెప్పుకొనుచు, కర్మహీనులై శూద్రప్రాయులై యుండిరనునది. రెండవగాథ ననుసరించి వీరలు మహావిష్ణువుయొక్క పాదపద్మమునుండి బుట్టిననాయకులగుటచేఁ బద్మనాయకులైరని తెలియుచున్నది. పద్మనాయక చరిత్రమున వీరుల యుత్పత్తినిఁగూర్చి బ్రశంస చేయరాదనియు, వారిలోఁ గొందరు రెడ్లును, గొందరు లక్కనాయకులును, మఱికొందరు కొంకణులునై యుండిరనియు, నూరిలోని నీరంతయు వరదనీటఁజేరి మహానది యైనటుల వారందరును మహావీర్యముచేఁ బద్మనాయకులైరనియుఁ స్పష్టముగఁ జెప్పబడియున్నది. వీరి యౌన్నత్యమునకుఁ గాకతీయరాజుల సమాదరణముఁగూడ ప్రబల

కారణమయ్యెను. అదే గ్రంథమున వెలమవంశము రెడ్డిసంతతికి మారొడ్డి విడఁబడియెనని చెప్పఁబడియున్నది. మఱియొకచో వెలమవారు రెడ్లనుఁ ద్యజించి కాపులతో కలసిరని యున్నది. పల్నాటివీరపురు షాగ్రగణ్యుఁడగు బ్రహ్మనాయఁడువీరవైష్ణవుఁడై యుండి యొకసాంఘిక సంస్కారము నొనర్చెను. వివిధ జాతులకుఁ జెందిన వీరులనందర నొకచోఁజేర్చి యాలఁడు వారల కన్యోన్య భోజనాది సంబంధము నేర్పరచి, జాతిభేధములను మఱచి సోదరబృందమువలె వారల నంచరింపఁజేసెను. పల్నాటి వీర చరిత్రమునుండి యిట్టివారిలో కన్నమనాయఁడను నొక పంచముడును, అనపోతను నొక బ్రాహ్మణవీరుఁడును, గొల్ల, కుమ్మరి, చాకలి మున్నగు నితరజాతుల వార లనేకులును, బ్రహ్మనాయని బలములలో నుండినటులఁ దెలియుచున్నది. దానినుండి పద్మనాయక వంశము వివిధవర్ణములలోని యోధపురుషుల సంమిశ్రణమువలన నేర్పడిన మహావీరవంశమని స్పష్టమగుచున్నది. ఈవిషయమున వీరిని రసవుత్రవీరులతోఁ బోల్చదగును. బ్రహ్మనాయనికి బాదన్న లేక పద్మన్నయను నగ్రజుఁడుండెను. వీరులకెల్ల బ్రహ్మన్నయే నాయకుఁడైనను నామమాత్రమున కాతని యగ్రజుఁడగు పద్మన్నను నాయకునిగ నొనర్చి యటుల పద్మన్న నాయకుఁడుగ నుండినవారగుటచే వారందరును బద్మనాయకులని బ్రసిద్ధి జెందియుందురు.

మహాశూరులునుఁ గేవలశస్త్రోపజీవులు నగు నీపద్మనాయకవీరులు పలనాటి యుద్ధానంతరము కర్తవ్యముగానక తమ్ముఁబోషించి యుచితోద్యోగమునొసంగు యేలికలేకయు, వివిధవర్ణములవారిచేఁ గులభ్రష్టులుగఁ బరిగణింపబడియు, శోచనీయమగు నవస్థకులోనైరి. ఈసమయమున వీరలనాదరించి వీరిని వీరకర్మల నియోగింపజాలునంతటి యార్థికరాజకీయ ప్రాపకముగలవారలు కాకతీయరాజులు తప్ప నితరులెవ్వరును లేకుండిరి. రుద్రదేవుని రాజ్యాంతకాలమున నాతనికిఁ దేవగిరియాదవులతో మహారణమొనగూడెను. ఆతనియనంతర మాతనిసోదరపుత్రుఁడగు గణపతిదేవ చక్రవర్తి బద్మనాయకులయెడ నెక్కుడభిమానమునుఁ జూపియుండెను. దీనినుండి రుద్రదేవుఁడే తనయాదవ యుద్ధములలో నీపద్మనాయక వీరులను నియోగించియుండెననియు నందలి యుపయోగమునుఁ గాంచియే గణపతిదేవుఁడు గూడ వారియెడ నెక్కుడాదరమును జూపెననియు నూహింపనగును.

మతము:—కాకతిరుద్రుని రాజ్యకాలమున మతవిషయికములగు మార్పులుగూడ జరిగినవి. క్రీ. శ. 1158లో రెండవప్రోలరాజు కలచురివంశజుఁడగు బిజ్జలునకుఁదోడ్పడ నాతడు పశ్చిమచాళుక్య చక్రవర్తియగు మూడవ తైలపదేవుని రాజ్యచ్యుతుని జేసెనని యిదివరలోఁ జెప్పియుంటిమి. అటుపైనయిదారు సంవత్సరములలో బిజ్జలుడు కళ్యాణనగరమున స్వతంత్రపాలనము నారంభించెను. అంతవరకును జైనమతము ప్రాముఖ్యతనందియుండెను. ఈసమయమున దక్షిణదేశమున శ్రీరామానుజాచార్యుని వైష్ణవమతము సుస్థిరముగ నాటికొని తాత్త్వికబోధనమునకు మతావేశముగూడఁ దోడ్పడ శ్రీఘ్రముగ నెల్లెడలనువ్యాపింపఁజొచ్చెను. పల్నాటిసీమలో వీరాగ్రగణ్యుఁడఁగు బ్రహ్మనాయఁడొనర్చిన సంఘసంస్కరణ మీ వీరవైష్ణవ ప్రాబల్యఫలితమే. ఇటుల వైష్ణవమత మొకవంకను జైనధర్మము మరియొకవంకను వ్యాపించుచుండ, నూత్నవినిర్మిత గళచురి

రాజ్యమున గళ్యాణీనగరమునందొక మతోద్ధారకుఁడు బయల్వెడలెను. ఈతడే మహావీరుడగు బసవేశ్వరుడు. ఈతనిబోధనలచే శైవమతమొకనూతన వికాసమునుగాంచెను. జనబాహుళ్యము జైనవైష్ణవ మతములవంకకు బోకుండగ నరికట్టి వారిని శైవులఁజేయుట యీతనికి బ్రధానోద్దేశ్యమైయుండెను. గాన నీతడు తనబోధనలను సులభసాధ్యములుగను జనాకర్షకములుగను జేసెను. పూర్వము దక్షిణదేశమునందు నాయనారులున్నగు మహాభక్తులచే బ్రచారముచేయబడిన శైవము కేవల జ్ఞానభక్తిమార్గములచేతనే సాధ్యమయినదిగ నుండెను. పిమ్మట శ్రీశంకరాచార్యుడు బ్రస్థానత్రయములను దాసికాధారములుగ నేర్ప అది దానిని సంస్కరించెను. వేదోక్తములగు గర్మకాండల నాచరించి మనస్సంయమమునంది వేదాంతాధ్యయన మొనర్చి సరియగు నాధ్యాత్మికజ్ఞానము నలవడజేసికొని బ్రహ్మోపాసన చేయుట బహుకష్టసాధ్యముగ నుండెను. దీనిని గ్రహించియే వీరవైష్ణవులు కేవల భక్తిమార్గమునుబూని, కర్మకాండనుసంకుచితమొనర్చి, జాతిభేదములేక నెల్లరకును వైష్ణవదీక్ష నొసగుచు, బ్రజాసామాన్యమునకు మహోపకారమొనర్చిరి. బసవేశ్వరుడుగూడ నీయాదర్శమునే యనుసరించి సనాతనకర్మకాండకు మూలాధారములగు వేదములకు, దత్సంప్రదాయప్రవర్తితములగు వర్ణభేదములకు ద్వజించెను. మఱియు నీతడు శేషించిన శైవుల యాదరమునుగూడ నందుటకై శ్రీశంకరుని సిద్ధాంతములను, ఆకాలమున బ్రబలముగనుండిన భక్తితత్త్వమునుగూడ దనబోధనలలో జొప్పించెను. నూత్నవినిర్మిత మగు నీమత మితర మతములతో ననేక సంగ్రామములఁ జేయవలసియుండు ననియు నట్టియెడ వేదధిక్కార మొనర్చుదీనికి బ్రమాదము వాటిల్లుననియు, నందువలన నీమత మవిచ్ఛిన్నముగ నడచుటకు దగిన యావేశమును శక్తియు నవసరములనియును, గ్రహించి బసవేశ్వరుడు తనమతావలంబనము నొక వీరకార్యముగను, దద్వ్యాపనము నొక వీరధర్మముగ నొనర్చెను. ఈవిషయమున వైష్ణవులు జైనులయెడ నుపయోగించిన రీతి నీతడును భేదదండోపాయములను విధించెను. మఱియు నీతడు భక్తి, వైరాగ్య, ప్రపత్తులకు విశేషార్థమును ఘటించి దేహచ్ఛేదన నయనోత్పాటనాది సాహసకార్యముల నాచరించుటను గూడ ననుమతించెను. దీనివలన భక్తి సాత్త్వికముగను జ్ఞానజనితముగ నుండుటకు మారుగ నీమతమున గేవల మావేశరూపము దాల్చెను. ఇటుల బసవేశ్వరుడు బోధించినమతము వీరశైవమని ఖ్యాతి నొందినది. ఇందలి ముఖ్యసిద్ధాంతము లీక్రింద పేర్కొనబడినవి:—

శివుడే పరమదైవము. భక్తియే యాతనిఁజెందుట కత్యుత్తమమైనమార్గము. ఉపవాసములచే దేహము గృశించును. అవయవములను తుదకు కంఠమును గూడ ఛేదించుటచే గల్గు నమితమగు బాధనుసహితము లెక్కచేయకుండునంతటివాడే నిజమైనభక్తుడు. అట్టివాడే శివునితో నైక్యమునంద నర్హుడు. శివభక్తులలో జాతిభేదములు లేవు. ప్రతివారును గురువులవలన దీక్షను గైకొని శివపంచాక్షరిని జపించుచు లింగపీఠార్చనముఁ జేయుచు శివచిహ్నమగు లింగమును దేహమున ధరింపవలయును. జంగములను పరమశివునిరూపములుగ గుర్తించి పూజింపలెను. పరదేవతాస్మరణము నన్యమతసంపర్కమును గర్హ్యములు.

అసతికాలముననే వీరశైవమతమతివ్యాప్తి నందినది. మతావేశపూరితులై శైవులు జైనులనుహింసించి, వారిగ్రంథముల నగ్నిబడవైచియు, వారికట్టడములను నాశనముజేసియు ననేకధముల జైనమతమునువిధ్వంసమొనర్చిరి. మఱియొకవంక మల్లికార్జునపండితారాధ్యుడు, పాల్కురుకి సోమనాథుడు మున్నగు బండితకవి శ్రేష్ఠు లీమతమును బ్రచారమొనర్చి యనేక గ్రంథములను రచింపుచుండిరి. బౌద్ధమతము వలె నీమతముగూడ దేశభాషలలోనే బ్రచురింపటడుటచే గన్నడాంధ్రభాషలభివృద్ధినంది, ప్రబంధములు, కావ్యములు, పురాణములు, ద్విపదలు, పాటలు మున్నగు ననేకరూపముల నాభాషావాఙ్మయములు వర్ధిల్లినవి. ఈకాలము నందాంధ్రకవులు గన్నడమునను గన్నడకవులాంధ్రమునను గూడ గ్రంథములను రచింపుచుండుటచే నీరెండుభాషలకును సన్నిహితమగు సంబంధమేర్పడెను. బసవేశ్వరునికిఁ బిమ్మట వారలు మతచర్చలోఁ దమకుఁ గల్గు వేదబాహ్యత్వబాధను దొలగించుకొనుటకై బహువిధముల బ్రయత్నించి, వైదికవాఙ్మయమునుండియు బురాణములనుండియు గొన్ని భాగములనుగైకొనియు, నూతనముగ నాగమములను సృష్టించియు, నీవీరశైవమును సంస్కరించి సుస్థిరము నొనర్చిరి. ఇటుల కళ్యాణీనగరమునం దుద్భవించిన యీమతతరంగ మాంధ్రభూభాగమును గూడ చేరెను. ఈసంపర్కము వలననే కాకతీయరుద్రదేవుడు పరమమాహేశ్వరుడై యనేక సుందరశివాలయములను నెలకొల్పెను.

రాజధాని:— రుద్రదేవునికాలమునఁగూడ ననుమకొండనగరమే రాజధానిగ నుండెను. ఈతని కాలమునం దనేక దేవాలయములును, రమ్యహర్మ్యములును నిర్మింపబడుటచే నానగర మతిసుందరముగ నొప్పుచుండెను. రెండవ ప్రోలరాజు కాలమున నిప్పటి పద్మాక్షీయాలయముచుట్టు నున్న లోయలోమాత్రి ముండిన యనుమకొండనగరము రుద్రదేవునికాలమున కీ కొండలచుట్టును రెండు మూడు ఫర్లాంగుల దూరము వ్యాపించియుండును.[72] రాజధానీ నగరమున జనసమ్మర్ద మెక్కుడగుటఁజేసి రుద్రదేవుడు ఓరుగల్లునగరమునుగూడ రాజకార్యనిర్వహణమునకై యుపయోగించుచు, దాను జయించిన శత్రునగరములందలి జనులనెల్ల నోరుగల్లులో నివసింపజేసి, వారి సౌకర్యమునకై యం దనేక విభాగములను నిర్మించెను. ఇట్టి శూరాగ్రణి యగు రాజుపాలనమునందుండి దేశ మేవిధమైన పీడ నెఱుంగక సంపూర్ణ శాంతి నందియుండుటచే వివిధ విద్యలు, కళలు నభివృద్ధినంద నవకాశ మొదవెను. దీనికి శైవమత విజృంభణము దోడగుటచే నత్యద్భుత శిల్పకళాభినిరతి బయల్వెడలెను. హనుమకొండయందలి సహస్రస్తంభ దేవాలయాభిదమగు రుద్రేశ్వరాలయము తాత్కాలికాంధ్రుల నిర్మాణశిల్పకళావైభవమును వేనోళ్ళ జాటుచున్నది.

ఈరుద్రేశ్వరాలయము దక్షిణాభిముఖమై రెండు విభాగములుగ నిర్మింపబడియున్నది. దీనిచుట్టును బలిష్టమగు నొక నావరణమును నిర్మించి దాని దక్షిణదిశ నొక ద్వారమును, తూర్పున మరియొక దానిని గల్పించి, నైజాం ప్రభుత్వమువా రీజీర్ణదేవాలయము నతి భద్రముగ గాపాడుచున్నారు. దక్షిణద్వారముసుండి యీ యావరణమును బ్రవేశించినచో మన

72 అనుమకొండరుద్రేశ్వరాలయములోని శాసనమం దీనగరవర్ణనముగలదు.



ద్రాక్షారామ భీమేశ్వరాలయము.



బోధాన్ దేవాలయము—మసీదుగా మార్చబడినది.

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.



హనుమకొండ సహస్రస్తంభ దేవాలయము — ఒక వార్శ్వయి.

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.

ఆ ఇ ఈ ఉ ఊ ఋ ఎ ఏ ఐ ఒ ఓ ఔ అం.
3 ఆ
(3) 3 ఆ B

కు బ్రవేశమంటపము మాత్రము గన్పించును. ఇయ్యది భూమట్టమునకు 3 లేక 4 అడుగుల యెత్తుగ నున్న యొక శిలావేదికపై నిర్మింపబడి బహుస్తంభములతో గూడియున్నది. ఇందుపయోగింపబడియున్న రాళ్ళన్నియు తెల్లని రంగుగల "యిసుకరాళ్లు" (White sandstone) గ నున్నవి. ఒక సోపానపంక్తి నధిరోహించి మంటపప్రారంభమున కేగినతోడనే పెక్కు స్తంభములపై నిర్మింపబడిన రెండు వసారాలిరుపార్శ్వములను గన్పట్టును. వాని నడుమ ప్రథమద్వారము గలదు. ఇందుపై దూలముపై గజలక్ష్మి విగ్రహము చెక్కబడియున్నది. ఈ ద్వారమును దాటి 16 స్తంభములపై నిర్మింపబడిన యొక చతురశ్రమును చేరుదుము. ఇందలి యధోభాగమున మధ్యగా మూడు నాలుగంగుళముల యెత్తుననాలుగు శిలాస్తంభముల నంటి యొక వలయము గలదు. ఈ చతురశ్రమునందలి స్తంభములన్నియు నుపరిభాగమున మాత్రము కొలదిగ చెక్కబడియున్నవి. దీనికి తూర్పువైపున మూడు నాలుగడుగుల యెత్తున నొక వసారా గలదు. దీనిని జేరుటకు సోపానములు గలవు. ఇయ్యది పురాణశ్రవణాదులఁ జరుపుటకును యితర సమావేశములకు ననుకూలముగ నున్నది. అదేవిధమున పడమటివైపున గూడ నొక వసారా గలదు. ఇది యన్నివైపులను దెఱువబడియున్నది. మధ్యనుండు వేదినిబట్టి యిది యొక చిన్నయాలయముగ నుపయోగింపబడెనేమో యని తోచుచున్నది. అటులైనచో నిది తెరువబడియుండుటకు గారణము దెలియుటలేదు. చతురశ్రమున కుత్తరమునఁగూడ, దక్షిణమునందువలెనే యొక ద్వారమును, దాని కిరుపార్శ్వములను రెండు వసారాలును గలవు. అచ్చటనుండి యొక మెట్ల వరుసను దిగి ప్రవేశమంటపమును దాటుదుము.

ఈమంటపమునకును రుద్రదేవాలయమునకును నడుమ నొక వేదిక గలదు. దాని మధ్యభాగమున నీలశిలావినిర్మితమును, సుందర శిల్పకళావిరాజమానమును నగు నొక చేక్కని నందియుత్తరాభిముఖముగ నెలకొల్పబడియున్నది దీనికి ముందు వెనుకల నిరుపార్శ్వములను గూడ సోపానములు గలవు. ఈ నందివేదికను దాటి యుత్తరముగ నేగినచో యాలయ ముఖమంటపసోపానము లున్నవి. ఆలయమంతయు బ్రవేశమంటపమువలెనే నక్షత్రాకృతి గల (Starshaped) శిలావేదికపై నిర్మింపబడియున్నది. ఈవేదిక యంచునకును ఆలయకుడ్యములకును నడుమ చుట్టును కొంత స్థలము విడువబడియున్నది. ఆలయమునందలి భూమట్టము వేదికనుండి 7 లేక 8 అడుగుల యెత్తున నున్నది. నంది కెదురుగ నొక సోపానపంక్తి గలదు. దీని కిరుపార్శ్వముల నొక యేనుగయు నొక నందియు నున్నవి. ఈమెట్ల నెక్కిపోయినచో నాలుగు స్తంభములపై నిర్మింపబడిన యొక ప్రాంగణము గలదు. దానికి వెనుక నిరుపార్శ్వములను రెండు వసారాలు గలవు. వాని మధ్యనుండు ద్వారమును దాటి యేగినచో నొక చతురశ్రము బ్రవేశింతుము. ఈయాలయమును నీలశిలలచే గట్టి, ప్రతి స్తంభమునందును సుందరమగు నగిషీపనిని చూపియుండిరి. ప్రవేశమంటప మెంత సామాన్యముగ నున్నదో యీ యాలయమంత సుందరముగ నున్నది. ఈచతురశ్రము నాలుగు మహా బలిష్ఠములగు నీలశిలాస్తంభములపై నిర్మింపబడియున్నది. వీనియందలి శిల్పకళను గాంచి తీరవలెగాని వర్ణించుట కలవి గాజాలదు. అధోభాగ

మున స్తంభముల నంటుచు నొక వలయము 4, 5 అంగుళముల యెత్తున నర్మింపబడియున్నది. ఉపరిభాగమున కప్పుపై గూడ నత్యద్భుతమగు శిల్పము గాంచనగును. క్రింద నున్న యీవలయమునకు సరియగునటుల కప్పుపై నొక చతురశ్రము గలదు. దాని లోభాగమున నొక చతుష్కోణమును, దానిలోపల నొక చతురశ్రమును, దానికి లోభాగమున నింకొక చతుష్కోణమును, దానిలోపల నొక దానిలో నొకటిగ రెండు వలయములును గలవు. ఈచతుష్కోణ చతురశ్రములలోభాగమున కోణముల కెదురుగ చేక్కని కవచముఖములు చెక్కబడియున్నవి. వలయములలో లోపలిదానిమధ్య నొక దేవీవిగ్రహము చెక్కబడియున్నది. ఆమె కాయుధసహితములగు పది చేతులు గలవు. ఈవిగ్రహము చిన్నదియై, భూమట్టమునకు పది పదునై దడుగుల యెత్తుసం దుండినను నేత్రాద్యవయవములుగూడ చూపరులకు స్పష్టముగ నగపడుచున్నవి. ఈ ప్రథమవలయమునకు జుట్టును రెండవ వలయమునంటియు, గజములు, అశ్వములు, లొట్టిపిట్టలు మున్నగు జంతువులును వానిపై రౌతులతో చెక్కబడియున్నవి. ఈచతురశ్రమును చేరి యిరుపార్శ్వములను రెండు సన్నని వసారాలును వానివెనుక పార్శ్వాలయములును గలవు. వీనిలో పడమటిప్రక్కనుండు వసారా పైకప్పు లోపలిభాగమున నొక షట్కోణమును దానిమధ్య నొక పద్మమును గలవు. వసారా నంటియే పార్శ్వాలయము గలదు. దీని ముఖద్వారము రెండు స్తంభములకు నడుమ బిగింపబడియున్నది. ఈ స్తంభములకును ద్వారమునకును నడుమ రెండుప్రక్కలను రెండు చేక్కని కోతనగిషీ పని (Sreen work) గల శిలాభాగములు గలవు. వీనివలన సౌందర్యమేగాక యాలయాంతర్భాగమునకు వెలుతురుగూడ వచ్చుట కవకాశము గల్పింపబడినది. ద్వారబంధమునగూడ చేక్కని నగిషీపని గలదు. క్రిందిభాగమున నిర్వురు ద్వారపాలకులు గలరు. పైదూలమున కడుగుభాగమున 9 కలువమొగ్గలవలె నున్న శిఖరములు గలవు. దీని పైభాగమున యాలయోపరిభాగము నంటుచు నొక చక్కని శిల్పఖండము బిగింపబడియున్నది. ఇందలి మధ్యభాగమున మహిషాసురమర్దనీ విగ్రహమును, ఇరుపార్శ్వములను పరివారమును, వారి కిరుపార్శ్వముల నారోహకసహితములగు రెండు మకరములును, రాతిలో కోయబడియున్నవి. ఈద్వారమును దాటినచో యొక చిన్న ముఖమంటపము గలదు. ఇందలి గోడలపైనను ద్వారమునను గూడ ననేక విగ్రహములు చెక్కబడియున్నవి. వీరందరును ఋషులో లేక భక్తగణములో యని తోచుచున్నది. ఈ మంటపమునంటియున్న గర్భాలయమున నొక వేదికపై శివలింగమున్నది. అటులనే చతురశ్రమునకుం దూర్పుభాగమునగూడ నొకచిన్న వసారాయును దానినంటి మఱియొక పార్శ్వాలయము నున్నవి. కాని దీనికిని పశ్చిమాలయమునకును కొన్ని భేదములు గన్పించుచున్నవి. ఈప్రాగాలయ ముఖద్వారమునకును దానికిరుపార్శ్వములనున్న స్తంభములకును నడుమ నేమియు శిల్పము లేక తెరపిగ నున్నది. ఇందలి ముఖమంటపాంతర్భాగము సుందరతరముగఁ జెక్కబడియున్నది. గర్భాలయమునందలి వేదికను బట్టి యందలివిగ్రహ మొకదేవియో లేక విష్ణువో యైయుండవలెనని తోచుచున్నది. చ

తురశ్రీమునకు నడుమ నుత్తరదిశకు వ్యాపించి యొకసన్నని నసారానంటి రుద్రేశ్వరగర్భాలయము గలదు. ముఖద్వారము చక్కని రెండుద్వారములనడుమ నున్నది. ఇందలి పైదూలముమీద మధ్యగనొక శివవిగ్రహ మున్నది. ఆయుధసహితములగు నష్టహస్తములను, వంచిన యొకకాలుపై మఱియొకదాని నడ్డముగ నాని యుండుటను, కొంచెము ప్రక్కకు వంగిన శరీరమును, జూడ నీవిగ్రహము దక్షిణ దేశమునందలి నటరాజవిగ్రహమును జ్ఞప్తికి దెచ్చుచున్నది. దీనికిరుపార్శ్వములను రెండు మకరములును వానిపై రెండు చిన్నవిమానములును గలవు ద్వారమున కిరుపార్శ్వములను స్తంభములవరకును వ్యాపించి కోతనగి పీపనిగల శిలాఖండములుగలవు. పడమటిభాగమునందొక గణపతివిగ్రహమున్నది. ఈద్వారమును దాటినచో పార్శ్వాలయము లందువలె నిచ్చటగూడ నొక ముఖమంటపమున్నది. అందతిసుందరములగు శిల్పములుగలవు. దీనివెనుక గర్భాలయముగలదు. అందు వేదికమాత్రము గాంచనగుచున్నది. ఈ ప్రధానాలయమునకును పార్శ్వాలయములకును నడుమ కోణములందలి ప్రదేశము తెఱువబడియున్నది. నీలాశిలామయమగు నీయాలయమున వెలుతురుచక్కగ వచ్చుటకై యిట్టియేర్పాటు జేయబడియుండెనని తోచుచున్నది. ఈయాలయ బహిర్భాగమందలిగోడ వంకె వంకెలుగ నిర్మింపబడియున్నది దానిలో ననేకవిధములగు శిల్పవిశేషములుగలవు. ఈభాగము నాలయోపరిభాగమునుగూడ ప్రవేశమంటపము నందువలెగాక మూయబడి యున్నవి. ఈ యనన్యశోభావిలాసమగు దేవాయతనమున కుపరిభాగమునం దసమానసౌందర్యముఁ గలిగి మహోన్నతములగు గోపురము లుండియుండవలెను. వానిస్థానమునందిపుడు మూడు చిన్నదిబ్బలుమాత్రము కప్పుపైనఁ గన్పించుచున్నవి. రుద్రేశ్వరాలయమునకుఁ బ్రాగుత్తరమున నొకపుష్కరిణియును బ్రాగ్భాగమునందొక చిన్నమంటపమునుఁ గలవు. ఈమంటపస్తంభములలో నొకదానినాని యొకనీలశిలపై నొక చేక్కని శాసనముగలదు. ఇదియే చరిత్రప్రసిద్ధమగు ననుమకొండ శాసనము. దీనినుండియే రెండవప్రోలరాజు యొక్కయు, నాతనితనయుఁడును రుద్రేశ్వరాలయ నిర్మాతయునగు గాకతిరుద్రునియొక్కయు, దిగ్విజయములును, రుద్రేశ్వరాలయ నిర్మాణకాలమునుఁ దెలియుచున్నవి.

రుద్రుని మరణము:—ఇటులు దుర్నిరీక్ష్యతేజోవంతమై విరాజిల్లుచుండిన యాంధ్రసామ్రాజ్యమునుజూచి దేవగిరియాదవు లసూయాగ్రస్తులై యనుమకొండపై దాడివెడలిరి. రుద్రదేవుడు నసమానపరాక్రమమున వారినెదుర్కొనెను. గాని విధివశముచే యుద్ధరంగమునం దసువులనుబాసెను. యాదవరాజగు జైతుగి యొకయాంధ్రరాజును పశువుగ నుపయోగించి యొకనరమేధము నొనర్చెనని హేమాద్రి తనవ్రతఖండమునఁ బేర్కొనియున్నాడు.[73] పైటాను శాసనమునుండి యీరాజు మఱియొకయాంధ్రరాజును జంపి యాతనితనయునిఁ జెఱపట్టెనని తెలియుచున్నది.[74] కాకతి రుద్రునికి సంతానమేమియు లేకుండుటచే నాతడు పై శాసనమునందలి యాంధ్రరాజు గాజా

73 Bhandarkar - Early History of the Dekkan. (3rd Edn.) p. 243
74 Ep. Ind. III, p. 113.

లడు. గాన హేమాద్రిసేర్కొనిన తెలుగురాజీ రుద్రదేవుడేయని తేలుచున్నది. క్రీ. శ. 1197 నకుఁబిమ్మట రుద్రదేవునిప్రశంస గానవచ్చుట లేదని యిదివరలో జెప్పియుంటిమి. గాన నీ యాదవ దండయాత్రయు దత్ఫలితమగు రుద్రదేవుని మరణము నాసంవత్సరముననే జరిగియుండునని స్పష్టమగుచున్నది.

XI మహాదేవరాజు.

1195—1198

కాకతిరుద్రుని మరణానంతర మాతని తమ్ముడగు మహాదేవరాజు కాకతీయసింహాసనము నధిష్ఠించెను. ఈతని చరిత్రమును గూర్చి ప్రత్యక్షప్రమాణము లేమియు దెలియుటలేదు. ప్రాచీన చరిత్రములలో నీతడు తన యన్నకాలముననే రాజ్యము నాక్రమించుటకై బ్రయత్నించెననియు, రుద్రదేవు డాతని మన్నించెననియుఁ జెప్పబడియున్నది. ఓరుగల్లు కోటలోని స్వయంభుదేవాలయమున కెదురుగనున్న యొక శిలాఖండముపైనున్న శాసనమున మహాదేవరాజున కుపమన్యుమునియనునాత డొకడు సాయచేముసెనని వ్రాయబడియున్నది. కాని దానిని గూర్చి వివరము లేమియు దెలియరావు. క్రీ. శ. 1198 లో దేవగిరి యాదవరాజగు జైతుగి యనునాతడు ఆంధ్రదేశముపై దండెత్తివచ్చెను. అంత నాంధ్రులకును యాదవులకునొక ఘోరయుద్ధము జేరుగ నందు జైతుగి మహాదేవరాజును జంపి యాతని తనయుడగు గణపతిదేవుని చెరగొని దేవగిరికి మఱలెను.[75] ఇంతకంటెను మహాదేవరాజును గూర్చిన విశేషములేమియుఁ దెలియుటలేదు.

XII గణపతిదేవ మహారాజు.

1198—1261

కాకతీయరాజన్యులలో నగ్రగణ్యుడగు గణపతిదేవుని రాజ్యకాల మాంధ్రదేశ చరిత్రమునకు వెలలేని యొక భూషణమువంటిది. ఈచక్రవర్తినాటి త్రిపురాంతక శాసనమునందు శా. శ. 1182వ సంవత్సరమీతని 62 వ రాజ్యసంవత్సరమని చెప్పబడియుండుటచే నీతడు శా. శ. 1120కి సరియగు క్రీ. శ. 1198 లో కాకతీయరాజ్యమున కేలికయయ్యెనని యిదివరలో చెప్పియుంటిమి. కాని యీతని మొట్టమొదటిశాసనము క్రీ. శ. 1209 లో, ననగా నీతనిపదియవ రాజ్యసంవత్సరమునాటిదిగా నున్నది.[76] ఈపది పదునొకండు సంవత్సరములును గణపతి యేమిచేయుచుండెనను సమస్యకు యాదవచరిత్రము సమాధానము నొసంగుచున్నది. యాదవరామచంద్రదేవుని పైఠాన్ శాసనమునుండి జైతుగి గణపతిపై దయగల్గి యాతనిని బందీవిముక్తునిఁ జేసి స్వరాజ్యమునకు బంపెనని తెలియనగును.[77] దీనినుండి క్రీ. శ. 1198—1209ల నడుమ గణపతిదేవుడు దేవగిరిలో బందిగనుండి 1209లో తిరిగి స్వరాజ్యమునకు వచ్చెననియు, నాతని రాజ్యకాలముమాత్రము 1198 నుండియే బరిగణింపబడియెననియు దెలియుచున్నది.

గణపతిదేవుని రాజ్యము క్లిష్టములగు పరిస్థితులలో నారంభమాయెను. మహాదేవరాజు

---

75 Ep. Ind. III, p. 113: J.B.B.R.A.S. XV, p. 386: I. A. XI, p. 197.

76 E. R. No. 196 of 1905.

77 I. A. XXI, p. 197 also I. A. XIV, p. 314

కాలము జేయుటయు, నాతనితనయుడును గాక తీయరాజ్యమున కనంతరవారసుడునగు గణపతిదేవుడు శత్రులచే జిక్కుటయు, దేశమున కెక్కడనర్థమును గల్పించినవి. శత్రురాజులనేకులు నూతనముగ బయల్వెడలిన యీ కాకతీయరాజ్యమును సమూలముగ నాశమొనర్చి, రెండవప్రోలరాసుజురుద్రదేవుడును దమకొనర్చిన పరాభవములకు బ్రతీకార మొనర్చు నుత్సాహముతో ననుమకొండ రాజ్యముపై దాడివెడలిరి. మఱికొందరు సామంతు లీయదనున స్వాతంత్ర్యము బ్రకటించిరి. కానియాంధ్రులయదృష్టవశమున నవక్రవిక్రములగు గాకతీయసేనానులు, దేశభక్తియు, రాజభక్తియు బురికొల్ప వైరివాహిని నడ్డగించిరి. ఇట్టివారిలోగాకతీయ సామ్రాజ్యమూలస్తంభు లననొప్పు రేచర్లవంశీయులగ్రగణ్యులు. రేచర్లరుద్రసేనాని కాలాంతరుద్రుడై నాగతిభూపాలుడు మున్నగు నీప్రత్యర్థి భూపాలురందఱిని, కాకతీయసామ్రాజ్యము నకాలప్రళయజలధి మగ్నముగాకుండ రక్షించి, బందీవిముక్తుడై యేతెంచిన గణపతిదేవున కొసంగెను. దీనికి పాలంపేటశాసనము ప్రమాణము.[78] రుద్రాంబికనాటి యొక త్రిపురాంతకశాసనమున బొప్పదేవుడను నొక సేనాని గణపతిదేవునికి గూడ నాశ్రితుడై యుండి, గొంటూరి నాగదేవుని దునిమి, యితరులగు, ననేక శత్రువులను బరిమార్చెనని చెప్పబడియున్నది[79] పాలంపేట శాసనమునందలి నాగతిభూపాలుడు నీ నాగదేవుడు నొక్కరే యనియు, గొంటూరనునది ప్రకృత గుంటూరునగర మనియు నూహింపవచ్చును.

ఇటు లీయుపద్రవములనుండి బయల్వెడలి కాకతీయరాజ్యము గణపతిదేవుని కరగతమగు సరి కాంధ్రదేశము విచిత్రములగు పరిస్థితులకు లోనయియుండెను. క్రీ॥ శ॥ 1186 లో రుద్రదేవుడు వెలనాటి మూడవ గొంకరాజును రాజ్యచ్యుతుని జేసిననాటినుండి[80] క్రీ॥ శ॥ 1209 వరకును గల కాలమున తూర్పుతీరమునం దనేక విధములగు రాజకీయపరిణామములొదవినవి. వెలనాటిరాజుల ప్రతిభ యణగిన తోడనే వేంగీదేశమునం దమరావతీప్రాంతమున కోటవంశీయులును, మడపల్లెలో నతవాడి వంశమును, సారసిపురమున కొలనినాయకులును, గుడిమెట్టనుండి చాగివంశీయులును విజృంభింపసాగిరి. కృష్ణానదీ ముఖద్వారమునందలి ద్వీపమునం దయ్యవంశీయులు ప్రబలియుండిరి.[81] గోదావరి కుత్తరభాగమున వేంగీదేశమునుండి పలాయితుడైన పృథ్వీశ్వరుడను వెలనాటిరాజు క్రీ॥ శ॥ 1196 ప్రాంతమున పిఠాపురమున స్థిరపడెను. ఇంకను కొంచె ముత్తరమున కళింగగాంగు లుండిరి. వేంగీదేశమునకు దక్షిణమున పొత్తపి, నెల్లూరు మున్నగు స్థలములనుండి తెలుగుచోళులు విజృంభించి మహాపరాక్రమమున ద్రవిడదేశరాజ్యాంగములం గూడ బాల్గొనుచు నెక్కుడు ప్రాముఖ్యత నందుచుండిరి. ఇది యిట్లుండ ననుమకొండ రాజ్యమునకు వాయువ్యమున హొయసలులును, దక్షిణమున చోళులును, ఉత్తరమున దేవ

---

78 Hyderabad Archaeological series No. 3. Palampet Ins. lines 50–60. 79 E. R. No 194 of 1905

80 J. A. H. R. S. Vol. V, pt. ii. లోని "The Velnadu chiefs" అను నా వ్యాసమును జూచునది.

81 ఆంధ్రుల చరిత్రము 2 వ భా. పే. 249—250

గిరియాదవులును రాజ్యవిస్తరణమునకై బ్రయత్నించుచుండిరి.

కాకతీయసింహాసనము నధిష్ఠించినతోడనే గణపతిదేవుడు తనదృష్టిని వెలనాడు వంకకు మళ్ళెను. ఇందులకు రెండుకారణములుగలవు. మొదటిది, తన పెదతండ్రియగు రుద్రదేవుడు జయించిన భద్రాచలమునుండి వెలనాడువఱకు నుఁగల భూభాగమునం దనేకులగు రాజులు ప్రబలుట. రెండవది, గాంగవశజుల యిక్కట్టులు. క్రీ. శ. 1202 నాటికి గాంగులకు తురుష్కులతోఁ బోరు ఘోరముగ జరుగుచుండెను. ఒకవేళ నాగాంగులు పరాజితులైనచో యవను లాంధ్రదేశమునుఁ గబళింప నవకాశ మేర్పడును. గాన దూరదర్శియు రాజ్యతంత్రజ్ఞుడునగు గణపతిదేవుడు తూర్పుతీరమును సత్వరమున రక్షింపవలెనని గ్రహించెను. గణపతిదేవుని కళింగవిజయమును నిర్ణయించుటకు శాసనములెక్కుడుగ దొడ్డపడుచున్నవి. వెలనాటిలోని యీతని శాసనములుగొన్ని క్రీ. శ. 1213—1214 నాటివిగ నున్నవి.[82] ఈతని సేనానియగు రేచెర్లరుద్రుని యాశ్రితుడగు రాజయనాయకుని ద్రాక్షారామ శాసనమొకటి క్రీ. శ. 1212 నాటిదిగ నున్నది. దీని నుండి గణపతిదేవుని వెలనాటి విజయము క్రీ. శ. 1212—13 లలో ప్రారంభమయ్యెనని స్పష్టమగుచున్నది. మహానీతిమంతుడగు నీ చక్రవర్తి కేవల యుద్ధములవలననే దనయభిలషితమును నెఱవేర్చుకొని యుండలేదు. నానేనాని అంతకంటెను శాశ్వతములగు విధముల నీతడు తనయధికారమును వెలనాటను బాదుకొల్పెను. కోటవారును, నతవాడివంశజులును స్థానికులలో ప్రబలులుగనుండిరి. వీరి సాహాయ్యమునందు నుద్దేశ్యమునఁ గణపతిదేవుడు తన కూతురగు గణపాంబను కోట బేతరాజునకిచ్చియు,[83] తన సోదరియగు మేలాంబికను నతవాటి బుద్ధరాజుకొడుకగు రుద్రునకు నిచ్చియు వివాహములంజేసెను.[84] పిమ్మట నీత డయ్యవంశీయుల నెదుర్కొనెను. కృష్ణాముఖద్వారమున క్రొయ్యూరను గ్రామమునం దయ్యవంశమునబుట్టిన భీమనాయకుడను నాతడుండెను. జల్లయ, నారయ, సూరయ, యను నీతనిపుత్రులు వెలనాటిరాజుల కాశ్రితులై విశేష ప్రఖ్యాతిని గాంచియుండిరి. వారిలో నారయ కృష్ణాముఖద్వారప్రాంతమున కధిపతియై యుండెను. ఈతనికి పినతోడి నాయకుడను నొక కుమారుడు నాతనికి నారమ, పేరమయను తనయులును, జాయపనాయకుడను బుత్రుడునుండిరి. గణపతిదేవుడు వెలనాటిపై వెడలినకాలమునకు జాయపనాయకుడు మహాశూరుడని ప్రఖ్యాతిగాంచియుండెను. గణపతి యీతని నోడించియు, నీశూరునిఁ దనసామ్రాజ్య నిర్మాణకార్యమునం దుపయోగించుకొను నుద్దేశ్యమున నీతని సోదరీద్వయమును బరిణయమాడి, జాయపనాయకునిఁ దన గజసైన్యముల కధ్యక్షునిగ నియమించెను.[85] ఇంతటితుండియు

82 E. R. Nos. 107 of 1897 and 717 of 1921.

83 E. I. III. p. 94. మఱియును E. R. Nos. 261 & 262 of 1897 లలో కోట వంశీయుడగు రెండవ కేతరాజు భార్యలలో కాకతీయవంశజయగు నాగమయను నామె పేర్కొనబడియున్నది. ఈమెకును గణపతి మున్నగు కాకతీయరాజులకును గల సంబంధ మెట్టిదో తెలియుటలేదు.

84 E. R. No. 204 of 1903. E. I. IV, p. 159.

85 E. I. III, p. 84.

బ్రఖ్యాతివహించి కాకతీయుల దక్షిణదేశ దిగ్విజయములం దెక్కుడుగ బాల్గొనియెను. పిమ్మట గణపతిదేవుడు కొలనిమండలికులపై దాడివెడలెను. ఈవంశీయులు వెలనాటిరాజులకుఁ బ్రక్కలోని బల్లెమువలెనుండి తద్రాజ్య పతనమునకు గారకులై యుండిరి. గణపతికాలమునకుఁ గేశవనాయకుడను నాతడు సారసిపుర పరిసరములనెల్ల జయించి విఖ్యాతివడసి యుండెను. ఈతనికిని గాకతీయులకునుఁ జరిగిన సంగ్రామమునుఁగూర్చి వివరములు "శివయోగసార"మను శైవగ్రంథమునుండి తెలియవచ్చుచున్నవి. ఇందులూరి వంశజుడును, గణపతిదేవుని యమాత్యులలో నొకడు నగు సోమయమంత్రి కొలనిపురమను సారసిపురమును ముట్టడించి, కేశవనాయకుని జయించి, యాతనిసంస్థానమును స్వాధీనము చేసికొనెను. ఇంతటినుండియు నీయిందులూరి వంశముఁ గొలనివంశమనిబ్రఖ్యాతిఁ గాంచెను.[86] ఇంతటితో గణపతిదేవుని వెలనాటివిజయము పూర్తియయ్యెను. ఇయ్యది క్రీ. శ. 1212—1225 లనడుమ జరిగియుండును.

కళింగవిజయము.—వెలనాటి నీవిధమున స్వాధీనము జేసికొనిన పిమ్మట గణపతిదేవుడు తనదృష్టిని కళింగముపై మరల్చెను. అచ్చటి పరిస్థితులుగూడ నీకాకతీయ విజృంభణమున కనుకూలము గనే యుండినవి. కళింగ గాంగరాజేగు మూడవ యనంగభీముఁడు (1211—1238) తనతండ్రి కాలమునుండియు కళింగము నలజడిపఱచుచుండిన యవనులతోఁ బోరుచుండెను. కాని ద్రాక్షారామమునందలి కొన్ని శాసనములనుండి క్రీ. శ. 1230 నాటికి పరిస్థితులు మారినట్లు తెలియుచున్నది. శా. శ. 1152—1155 ల నడుమ అనంగభీముడు నాతని సేనానియగు జప్రాజునందు బేర్కొనబడియున్నారు.[87] ఈసేనాని వేంగీదేశమును జయించెనని చెప్పబడి యుండుటచే క్రీ. శ. 1225 ప్రాంతముల గణపతిదేవు డను మకొండకు మరలినపిమ్మట క్రీ. శ. 1230 ప్రాంతమున నీగాంగసేనాని వేంగిపై దండువెడలెననియు, నీసంవత్సరముననే కాకతీయుల కళింగదేశ విజయము ప్రారంభమయ్యెననియు నూహింపవచ్చును. శాసనములును శివయోగసారము నీసందర్భమునం దెక్కుడుగ నుపయోగించుచున్నవి. కొలనిపుర విజయమున బ్రఖ్యాతిగాంచిన సోమయమంత్రి కోదులనాటి నిజయించి, గోదావరినిదాటి, మన్యప్రాంతముల నాక్రమించి, ఓరుగల్లునుండి సముద్రతీరము వరకునుఁగల ప్రదేశమునంతటి నాక్రమించెనని శివయోగసారమునఁ దెల్పబడియున్నది.[88] ఈ విజృంభణము 1230 లోని గాంగులదండయా

---

86 లీలగొలని మండలీకుల వెలదోలి । గొలనిపీడు దానుగొనుట జేసి
కాకతీశుడైన గణపతి యండను కొలని సోముడనగ వెలసెజగతి. (శివయోగసారము.)

87 S. I. I. IV Nos. 1360 & 1339.

88 చ॥ ఇలఁబహుసైన్యముల్ గొలువ నేకశిలాపురి తూర్పుదిక్కునన్
గలరిపుభూములెల్ల గొని గర్వముమై నే(రి)కాడిమండ లీ
కులనవలీలదోలి మరిగోగులనాడును గొల్నివీడు నా
వెలసిన దుర్గముల్గొనుచు వేగమె గౌతమిదాటి యిమ్ములన్.
క॥ మాడియు రెండులుగొనిమా । దాడెను పన్నెండు మన్నియములు నొడిచి దా
నాడెకళింగయ సీమకు । గూడిన భువిగొనియె సోమకులముఖ్యుడొగిన్.

త్రిల కుత్తరమై యుండనోపును. కాకతీయు లింకొకతూరిగూడ గళింగమున బ్రవేశించినటు ల గణపతిదేవునినాటి యుప్పరపల్లి శాసనము దెల్పుచున్నది.[89] అందు రుద్రుని యాశ్రితు డగు రాజయనాయకుడు బొక్కెరలో వీరభ టావళిని వధించి, యుదయగిరినిసాధించి, ద్రాక్షా రామ భీమేశ్వరు నర్చించెనని చెప్పబడియున్న ది.[90] బొక్కెరగ్రామ మిప్పటికిని గంజాము మండలమునందలి ఆస్కాతాలూకాలో నున్న ది. ఉదగిరి నెల్లూరు మండలములోని యుద యగిరితో సమన్వయింప బడినదిగాని యీస్థల ముగూడ గళింగదేశముననే యుండునని తో చుచున్నది. కళింగదేశ ప్రశంసను జేయుసంద ర్భమున నెల్లూరి మండలములోని గ్రామప్ర శంస సమంజసముగ గన్పట్టదు. ఇంతటితోఁ దృప్తినందక గాకతీయ సేనానులు మూడవ తూరి కళింగముపై దాడివెడలిరి. గజసాహిణి జాయపనాయకుని యాశ్రితుడగు హేమాద్రి రెడ్డి యనునాతడీ విషయమున నెక్కుడు శౌ ర్యపరాక్రమములఁ జూపినటుల శాసనముల నుండి తెలియుచున్నది. ఈ విజయములు క్రీ. శ. 1235—1253 లనడుమ జరిగియుం డును. 1254 ప్రాంతమున కాలపనాయకు డ నునాతడీ కళింగభాగమునకుఁ బాలకుడుగ నుం డెను.[91] ఈకాలమునుండి ప్రతాపరుద్ర చక్ర వర్తి రాజ్యాంతమువరకు నీభాగము కాకతీ యుల స్వాధీనముననే యుండి కాకతీయ సా మ్రాజ్యమునకొకమర్మస్థానముగ నుండినది.[92]

తెలుగుచోళులను జయించుట:—గణపతి దేవచక్రవర్తి తనసేనానులు కళింగదేశమును జయించుచుండిన సమయమున దాను దక్షిణ దిశకు వెడలెను. తెలంగాణమును, దక్షిణ కళింగమును, వేంగీదేశమును స్వాధీన మయిన పిమ్మట నీతనికి శేషించిన యాంధ్రభూభాగ మంతను గూడ జయింప నిచ్ఛవొడమెను. గుంటూరు, నెల్లూరుమండలములును దత్త మండలములు నీకాలమున తెలుగుచోళుల పరి పాలనమునకు లోనై యుండినవి. 7, 8, 9, శ తాబ్దములలో రేనాటిని బాలించిన యీచో ళులు 10, 11, శతాబ్దములలో రాజ్యచ్యు తులై సామాన్య సేనానులుగనుండి పశ్చిమ చాళుక్యులకు లోనై యుండిరి. కాలక్రమమున వీరలు కడపమండలములోని పొత్తపిలోను, గుంటూరు మండలమునందలి కొణిదెనయందు ను, నెల్లూరను స్థిరపడిరి. పండ్రెండవ శతా బ్దాంత్యభాగమునను, పదమూడవశతాబ్ది ప్రారంభమునను నెల్లూరిశాఖ ప్రాముఖ్యత నందెను. అందలి తిక్కనృపతి మహాశూరుడై మండలికుల ననేకులజయించి, దక్షిణదేశ రా జ్యాంగములఁ బాల్గొని, చోళ పాండ్య హొ యసల వంశీయులతోఁ బోరి, యనేకవిధముల తనప్రతిష్టను పెంపొందించు కొనియెను. గణపతిదేవుని కాలమున కాతని తనయుఁడగు మనుమసిద్ధి నెల్లూరు సీమకు బరిపాలకుడుగ నుండెను. అటులే పొత్తపినాటికి ఒప్పిలి సిద్ధి యధిపతిగనుండెను. కొణిదెనశాఖలోని చోడ

89 Hyd. Arch. Series No. 3 P. 16.

90 S. I. I. IV Nos. 1045 & 1252. 91 Ibid 602.

92 మఱియు నీకళింగవిజయ ప్రశంస గణపతిదేవుని నాటి మోటుపల్లి, ఏకామ్రనాథ, పాఖాల మున్న గుశాసనములందును, కాకతీయ సామంతుల శాసనములగొన్నిటియందునుఁ గూడగలదు. ఈసందర్భమున ఆం. ఇ. ప. మండలివారి కళింగ దేశచరిత్రమునందలి "కాకతీయులు కళింగము" అను శ్రీయుత మల్లంపల్లి సోమశేఖర శర్మగారి వ్యాసము విశేషాంశములను దెల్పుచున్నది.

మల్లిదేవ చోడుడును, కన్నరదేవుడనుఁగూడ నీకాలపువారలే. నెల్లూరుమండలములోని శాసనములనుండి క్రీ. శ. 1218. నాటికి ఒంగోలు పొదిలి, దర్శితాలూకాలు గణపతిదేవుని యధీనమునందుండి నటుల దెలియుచున్నది [93] క్రీ.శ. 1224. నాటికి పొత్తపి పాలకుడగు ఒప్పిలి సిద్ధిని జయించి గణపతిదేవు డాతనిని దనప్రతినిధిగ నియమించెను. [94] ఈ సందర్భమున నీ చక్రవర్తి అద్దంకి పాలకులగు నొకమహారాష్ట్ర సామంత కుటుంబమునుఁ గూడ జయించెను. శాలంకాయన గోత్రుడును చక్రనారాయణ బిరుదాంకితుడు నగు మాధవదేవుడు క్రీ. శ. 1240-45 ల నడుమ నద్దంకిని బాలించుచుండెను. క్రీ శ. 1240 నాటియొక శాసనము నందీతడు గణపతిదేవునికి సామంతుగ బేర్కొనబడియున్నాడు. [95] ఈతని యనంతర మీతనిపుత్రుడు సింగళదేవుడు క్రీ. శ. 1247 వరకు [96] నటు పిమ్మట నాతని సోదరుడగు సారంగపాణిదేవుడు నద్దంకిని పాలించెను. ఈసారంగపాణి నెల్లూరి మనుమసిద్ధి నృపాలునితో నిరంతరమును బోరుచుండెనని తిక్కన సోమయాజి కృత నిర్వచనోత్తర రామాయణమునుండి తెలియుచున్నది. మనుమసిద్ధిని స్వాధీన పఱచుకొనిన పిమ్మట, ననగా సుమారు క్రీ శ. 1250 ప్రాంతమునగణపతిదేవు డీతనిని జయించియుండును. [97] సుమారు క్రీ. శ. 1245 నాటికి గణపతిదేవుడు పొత్తపి, కొణిదెనపాలకులను, అద్దంకి పాలకులను జయించెను. ఇంకను నెల్లూరు దనకు వశముగాకుండుటచే నాతడు సమయమునకై వేచియుండెను. ఇట్టియెడ మనుమసిద్ధి నృపాలునికి దాయాదులగు నక్కన బయ్యనలను వారలతో వైరము సంభవించి, యాతడు వారలచే రాజ్యభ్రష్టుడు గావింపబడెను. ప్రాచీనచరిత్రములలో నీసందర్భమున మనుమసిద్ధి నృపాలునకాశ్రితుడగు తిక్కన సోమయాజి యేకశిలానగరమునకేగి గణపతిదేవునిఁ దన పాండితీ ప్రకర్షచే మెప్పించి, యాతడు తనయేలికకు సాయముచేయు నట్లేర్పరచెనని చెప్పబడియున్నది. ఇందలి నిజానిజము లెట్లున్నను, మనుమసిద్ధికి సాహాయ్యమొనర్చుట దనకు లాభకరముగ నుండుటచే గణపతిదేవుడు నెల్లూరుపై దాడి వెడలి, యక్కన బయ్యనల నోడించి, మనుమసిద్ధిని తిరిగి విక్రమసింహపురీ సింహాసనమునఁ బ్రతిష్ఠించెను. [98] ఇయ్యది సుమారు క్రీ శ. 1245 ప్రాంతములఁ జేఱగియుండును. [99]

తెలుగు చోళులను జయించు సందర్భమున గణపతిదేవునికి దత్తమండలము నందలికాయస్థవంశీయులతో వైరమేర్పడియెను. ఈ వంశమునఁ బుట్టిన గంగయసాహిణి శూరశిఖామణియై యుండెను. ఈతడు మొదట నెల్లూరు పురపాలకులలో నగ్రగణ్యుడగు చోళతిక్కనృపాలుని సేనాధ్యక్షుడుగ నుండెననియు, నాతనికిఁ బిమ్మట స్వతంత్రుడయ్యెననియు దెలియుచున్నది. ఇట్టి యెడ తిక్కరాజు మరణానంతర మాతని తనయుడగు మనుమసిద్ధికి నీగంగసాహిణికిని శాత్రవమేర్పడెననియు, తుదకు మనుమసిద్ధి యీకాయస్థుని నిర్జించెననియు నిర్వచనోత్తర రామాయణమునుండి తెలియుచున్న

93 Nel. Ins. O. 45. 94 E. R. 1900 P. 20 and 183 of 1899.
95 Nel. Ins. O. 76.
96 పైసంపుటము నందలి చందలూరు శాసనమును గాంచునది. 97 Ibid సారంగపుర శాసనము.
98 E. R. 69 of 1922.
99 E. R. 1900 P. 20 లోగూడ గణపతిదేవుని యాంధ్రచోళ విజయప్రశంసగలదు.

ది. గణపతిదేవుడు కూడ నీ గంగయసాహిణి ని జయించి నటులనేక శాసనములనుండి తెలియుచున్నది. బహుశః దానికి గారణము, మను వసిద్ధి దాయాదులచే దబుమబడిన పిమ్మట నీకాయస్థపాలకుడు స్వతంత్రుడై యాంధ్ర చోళరాజ్యము నలజడి పఱచుటయేయై యుండును. క్రీ. శ. 1250 నుండియు గంగయ గణపతిదేవునికి సామంతుడుగ బేర్కొన బడుచుండుటచే నీతడు 1245—1250 ల నడుమ కాకతీయులకు సామంతుడయ్యెనని తోచుచున్నది. గంగయను జయించుటచే గణపతికి నాతడు పాలించుచుండిన కడప మండలములోని పులివెందలతాలూకా నుండి మైసూరు రాజ్యము నందలి చింతామణి తాలూకా వరకునుగల విశాలభూభాగమంతయు స్వాధీనమయ్యెను.[100] మఱియు నీచక్రవర్తి గండికోట, ములికినాడు, రేనాడు, సకిలినాడు, ఏరువనాడు, పొత్తపినాడు మున్నగు దత్తమండల ప్రాంతములనెల్ల జయించి వానిపై గంగయసాహిణిని దనకు బ్రతినిధిగ నియమించెను.

ఇట్లు 1250వ సంవత్సరమునాటికి గణపతిదేవుడు ప్రకృతనైజాం రాష్ట్రమునందలి తెలంగాణాప్రాంతమునంతటిని, తూర్పుతీరమున గంజాం మండలము మొదలు నెల్లూరువరకును, దత్తమండలముల నన్నిటిని, గూడ స్వాధీనముగా నించుకొని కాకతీయ సామ్రాజ్యమును నిర్మించెను. దుర్నిరీక్ష్యతేజోవంతమై యలరారుచుండిన యీ మహాసామ్రాజ్యమున కీసమయమున నేక శిలానగరము రాజధానిగ నొప్పుచుండెను. బేతరాజు కాలముమండియు గాకతీయులకు అనుముకొండపురము రాజధానిగ నుండినది. గణపతిదేవుని కాలమున క్రీ. శ. 1253 వరకు నాపట్టణమే కేంద్రస్థానముగ నుండినట్లు దెలియుచున్నది.[101] కాని క్రీ. శ. 1254 నాటి యొక శాసనమున గణపతి యోరుగంటిపుర వరాధీశ్వరుడని పేర్కొనబడియుండుటచే[102] నాసంవత్సరముననే యీచక్రవర్తి తన రాజధాని నేక శిలానగరమునకు మార్చుకొనెనని స్పష్టమగుచున్నది.

దక్షిణదిగ్విజయము:—గణపతిదేవుడు దక్షిణదేశముపై గూడదాడివెడలియుండెను. అందులకు రెండు కారణముల నూహింప నవకాశము గలదు. మొదటిది విజిగీషామనీష. రెండవది తనకు సామంతులుగ నుండిన చోళులనుదాక్షిణాత్యులలజడిపఱచుట. ఈరెండవకారణము నఱయుటకు దక్షిణదేశ చరిత్రము మిక్కిలి తోడ్పడుచున్నది. పండ్రెండవ శతాబ్దాంత్యమున మూడవ కుళోత్తుంగుడు చోళరాజ్యమును పాలించుచుండెను. ఈతడు పరాక్రమ హీనుడగుటచే ననేకులగు సామంతులు స్వతంత్రింపదేశ మల్లకల్లోలములకు లోనయి యుండెను. పాండ్యులు, హోయసలులు, తెలుగు చోళులు, పల్లవుడగు కొప్పెరుంజింగడు మున్నగువారలు దమ యన్యోన్య కలహములలో చోళరాజును పణముగ నుపయోగించుచుండిరి. తెలుగుచోళులు కాంచీపురము నాక్రమించి తొండమండలమునుఁ బరిపాలింపసాగిరి. అంత కుళోత్తుంగుడీ యాంధ్రచోళులను నిర్జించి తఱి

---

100 ఆంధ్రులచరిత్రము—భా 2 పే. 260.

101 E. R. Nos. 273, 195, 223 of 1905-6.

Nel. Ins. O. 28. 102. E. R. 231 of 1905

మివైచెను. ఇంతలో నాతని సామంతుడగు కొప్పెరుంజింగ డాతని నిర్జించి బందీకృతునిం జేసెను. ఈచోళరాజునకు మామయగు హోయసల నరసింహుడు దక్షిణమున కేతెంచి సెండమంగళమును చోట కొప్పెరుజింగని నోడించి తన యల్లుని బందీవిముక్తునిం జేసెను. అతని యనంతర మాతని తనయుఁడగు హోయసల సోమేశ్వరుడు ద్రావిడదేశమునందలి కన్నూరున నిల్చి, చోళరాజ్యమును చక్కపఱుప జొచ్చెను. అంత నెల్లూరు పాలకుడును మహాశూరుడును మనమసిద్ధినృపాలుని దండ్రియునగు తిక్కరాజు వీరసోమేశ్వరునిపై దండెత్తి యాతనినిర్జించి చోళస్థాపనాచార్యు డయ్యెను. తిక్కరాజు మరణానంతరము మనుమసిద్ధి రాజగుటయు నాతని నక్కనబయ్యనలు పదభ్రష్టు నొనరించుటయు గాంచి, యిటుపై దెలుగు చోళులవలన భయములేదను ధైర్యమున పాండ్యులు వీరసోమేశ్వరుని కొప్పెరుంజింగని జయించి కాంచీపురము నాక్రమించిరి. అదేసమయమున కొప్పెరుంజింగడు తొండమండలమునుండి యాంధ్రచోళులను దఱిమెను.[103] ఇంతటితో దృప్తినందక యాతడాంధ్రదేశమున వేంగీమండలమునకు గూడ నేతెంచెనని దాక్షారామ శాసనములనుండి తెలియుచున్నది.[104] కాని యీ పల్లవరాజును గణపతిదేవుని సామంతు లతి సులభముగ నిర్జించిరి. పై శాసనములలో నొక దానియందు "అవన్యవనోద్భవ, కాకతపతి" మున్నగు బిరుదములుగల యొకరాజు "కాకతిపతి"కి ధర్మముగ కాకతమహోత్సవమును జరుపనేర్పఱచెనని దెల్పబడియున్నది.[105] పై బిరుదములు రెండును కొప్పెరుంజింగని యితరశాసనములలో గనవచ్చుచుండుటచే నాతడి ద్రాక్షారామశాసనములలో బ్రశంసింపబడెనని చెప్పుట కాక్షేపమేమియులేదు. దాననే "గణపతి మహారాజ స్యాజ్ఞాంప్రవర్తయతాం" అనియును, "కాకతిః (గణపతి పదారవింద) మధుకరాయమాణ మానసేన" యనియు నుండుటచే నీకొప్పెరుంజింగడు కాకతీయ గణపతిదేవచక్రవర్తిచే నిర్జింపబడెనని స్పష్టమగుచున్నది. ఈ వృత్తాంతమంతయు క్రీ. శ. 1249 లో జరగియుండును. కాంచీపురము నాక్రమించిన పాండ్యులను శిక్షించుటకై గణపతిదేవుడు తన మంత్రులలో నొకడగు సామంతభోజుని బంపియుండెను. ఈతడు దనయేలిక యాజ్ఞానుసారము కంచికిపోయి పాండ్యులను బారదోలెనని యీతని యేకామ్రనాథాలయ శాసనమునుండి తెలియుచున్నది.[106] కాని మఱునటి సంవత్సరముననే యనగా క్రీ. శ. 1250 లో పాండ్యులు తిరిగి కాంచీపురముపై దండెత్తి యచ్చటి కాకతీయసేనానిని పాఱదోలి, నెల్లూరును ముట్టడించి, మనుమసిద్ధిని జయించి యచ్చట వీరాభిషేకమొనర్చిరి.

అంత్యదశ:—గణపతిదేవు డీపరాభవము

---

103 430 of 1902.

104 E. I. VII P. 67 లో కొప్పెరుంజింగడు తనరాజ్య ముత్తరమున దాక్షారామమువరకును వ్యాపించెనని జెప్పుకొనియున్నాడు.

105 S. I. I. IV Nos. 1342 A & C.

106 Nel. Ins. Vol. III P. 830 No. 16.
E. R. No. 32 of 1891.
Idib 118 of 1894.

నకుఁ బ్రతీకార మొనర్చినటు లగపడదు. ముదిమియేదానికిఁ గారణమైయుండును అది యునుగాక నీతనికి బురుషసంతాన మేమియు లేక రుద్రాంబిక యేకమాత్ర పుత్రికయై యుండుటచే నీతడు తనయనంతరము గాకతీయ సామ్రాజ్యము విచ్ఛిన్నము గాకుండుటకై యేర్పాటులఁ గావించుకొనుచుండెను. ప్రజలకును సామంతులకు నీమెయందు గౌరవ విశ్వాసములు పెంపొందుటకును, ఆమె పురోభివృద్ధి నభిలషించియు, నీత డామెకు పురుషోచిత కృత్యముల నేర్పుచు నామెను రాజ్యాంగములఁ బాల్గొనజేయుచుండెను. ఇందులకు విద్యానాథుని ప్రతాపరుద్రీయమును, క్రీ శ. 1258 నుండియు నీరుద్రాంబ పరిపాలనా కార్యమును నెఱవేర్చుచుండెనని ముందువివరించి నవిషయమునఁ బ్రబలనిదర్శనములు. మఱియును గణపతిదేవుడువాస్తవముగ నేబదిరెండు సంవత్సరములు (1209—1261) రాజ్యమేలెను, అంతకుబూర్వ మీతడు పదిసంవత్సరములుదేవగిరిలో బందిగనుండెను. ఈతడు రాజ్యమునకు వచ్చునప్పటికి బాలుడుగ నుండెనని యెచ్చటను జెప్పబడకుండుటచే నాకాలమున కీతడు యువకుడుగ నైననుండి యుండును. దానిని బట్టి యీతడు పాండ్యులు కాంచీనగరమును రెండవతూరి యాక్రమించునప్పటికి డెబ్బది సంవత్సరముల వయస్సున నుండెనని యూహింపనగుచున్నది. గణపతిదేవుడు శైవుడు. తుదికాలము నందాతనికి గోళగీమఠాచార్యుల సంపర్కమబ్బుటచేతను వారి కీతడు పెక్కు దానధర్మములనుజేసి, తన చరమకాలము నాధ్యాత్మిక చింతతో గడిపి యెనుబదియవ సంవత్సరమున దివంగతుండయ్యెను.[107]

ఆశ్రితవర్గము:— (1) పిల్లలమఱి రెడ్లు. వీరి నిజమైన వృత్తాంత మింతవరకును చరిత్రకారులకు దెలిసియుండలేదు.

కాకతీయరాజుల కాలమున విశేష ప్రఖ్యాతి గాంచిన దీవంశము. ఇయ్యది రేచర్ల వంశ మనిగూడ బేర్కొనబడి యున్నది. చరిత్రమున కీనామముగల వంశములు రెండు పరిచితములుగ నున్నవి. వానిలో నొకటి "రేచర్ల" యను పదము గృహనామముగనుండిన రెడ్డివంశము. రెండవది "రేచర్ల" గోత్రమునందుద్భవించిన పద్మనాయకవంశము. చరిత్రకారులు గొంద రీరెండు వంశములు నొకటేయను భ్రమలోనై, యనేక ప్రమాదములకు బాల్పడిరి పిల్లలమఱ్ఱి, నాగులపాడు, దోసపాడుమున్నగు నైజాం రాష్ట్రగ్రామములందలి శాసనము లీప్రమాదములను సరిచేయదోడ్పడుచున్నవి. వానిలో "పిల్లలమఱి రేచర్ల బేతిరెడ్డి" "రేచర్ల నామిరెడ్డి" "రేచర్ల కాటిరెడ్డి" మున్నగు నామము లీ వంశీయులు రెడ్లనియు, వారికి రేచర్ల గృహనామమనియు జెప్పుచున్నవి. (cf కోటకేతరాజు, కాకతిగణపతి, ఇందు లూరి అన్నయ etc.) ఇక పద్మనాయక వంశీయులకు "రేచర్ల" యనునది గోత్రనామ మనుటకుఁగూడ నిర్దుష్టమగు శాసనప్రమాణముగలదు. ఈసందర్భమున యైనవోలు శాసనమును, అనపోతానాయకుని రాచకొండ శాసనమును, మాచానాయకుని యుమామహేశ్వర శాసనమును బేర్కొన దగియున్నవి. ఈ రేచర్లవారి చరిత్రమును వ్రాయుపట్ల చరిత్రకారులు మఱియొక పొరపాటునుఁ గూడ జేసియుండిరి. రెడ్డిపద్మనాయక వంశము

107 ప్రాచీన వంశచరిత్రము లీవయస్సునే దెల్పుచున్నవి.

లకుఁగల వ్యత్యాసముఁ గ్రహింపఁ జాలక వారలీరెండువంశములకు నొకే వంశవృక్షమునునిర్మింపఁ బ్రయత్నించి యసమంజసములగు ననేక సిద్ధాంతముల నొనర్చిరి.

పిల్లలమఱ్ఱి ప్రాంతముపై కాకతీయసామంతులుగనుండి యధికారమును నెఱపి, మహాశూరులును, మహాదాతలు నని పేరువడసిన యీరెడ్డికులజుల చరిత్రమును దెలిసికొనుటకు తెలంగాణమునందలి శాసనములే ముఖ్యాధారములుగనున్నవి. పాలంపేట శాసనముగూడ నీవిషయము నందగ్రగణ్యము. పై శాసనములలో చాలభాగము కొత్తగ లభించిన వేయగుటచే నీక్రింద వాని సారాంశమొసగబడుచున్నది:—

(1) పిల్లలమఱ్ఱి శాసనము:— బ్రహ్మపాదములనుండి బుట్టిన యొక వంశమున బమ్మసేనాని యుదయించెను. ఆతడు చోడరాజు మానదుర్మదమును నాశమొనర్చి కాంచీనగరీ కవాటమును హరించెను. పిమ్మట "ముచ్చ" యను నాతడు బుట్టెను. ఆతని బుత్రుడగు కాట్రెడ్డి కాచాంబికను బరిణయ మయ్యెను.

(2) పిల్లలమఱ్ఱి శాసనము :— పద్మజపాదపద్మములనుండి బుట్టిన వంశమున బమ్మ, ముచ్చ, కాటయనువార లుద్భవించిరి. కాటయకుమారుడు కామయ. కాచాంబిక యాతని భార్య. వీరికి "బేత"యను నాత డుదయించి ఎఱ్ఱక్కయను నామెను చేపట్టెను.

(3) పిల్లమఱ్ఱి శాసనము:— మహాసాధ్వియగు నెఱకసానికిఁ బుత్రుఁడు మల్ల యను నాతడు. శా.శ. 1130 లో పిల్లలమఱ్ఱి గ్రామము నందెఱుకసాని యెఱకేశ్వరునిఁ బ్రతిష్ఠ చేయించెను.

(4) పిల్లలమఱ్ఱి శాసనము:— కామిరెడ్డి కాచాంబికలకు సుతుడును, ఐతాంబికా వల్లభుడునగు నామిరెడ్డి గణపతిదేవమహారాజు దయచే నధికారమునుఁ బొందెను.

(5) నాగులపాడు శాసనము:—నామిరెడ్డికిని అయితాంబికకును బుత్రుడగు మండలికకాట్రెడ్డి గణపతిదేవ మహారాజు రాజ్యకాలమున శా. శ. 1156 లో తనపేరను దనతల్లిదండ్రులపేరను దేవప్రతిష్ఠలఁ గావించెను.

(6) పిల్లలమఱ్ఱి శాసనము:—అయితాంబికా నందనుడగు రేచెర్ల కామిరెడ్డి శా. శ. 1180 లో నొకధర్మముఁ జేసెను.

(7) నాగులపాడు శాసనము:—రక్తాక్షి సంవత్సరమున గణపిరెడ్డి మఱెడ్డి యనువారలు తమతల్లి కామసానికిని దండ్రి కామిరెడ్డికిని బుణ్యముగా నొకధర్మముఁ జేసిరి.

(8) నాగులపాడు శాసనము;—కామయ నామయ మల్లయ లనువారలు కాట్రెడ్డి, పారసాని యను తమ తలిదండ్రుల బుణ్యమునకై పెక్కుదానములను జేసిరి.

(9) పాలంపేట శాసనము:—కాంచీపురమున వీరలక్ష్మి పరిగ్రహణము నొనర్చినవాడు బమ్మసేనాని. కాటచమూపతి యాతనివంశమునఁ బుట్టెను. మంధన్యగుండాధిపునిఁ బరిమార్చిన కామసేనాని యాతనికిఁబుత్రుఁడు. ఈతనికిని కామాంబికకును, మహాశూరుడగు రేచెర్ల రుద్రసేనాని యుదయించెను.

(10) పిల్లలమఱ్ఱి శాసనము:—గణపతిదేవ మహారాజునకుఁ బుణ్యముగా రేచెర్ల రుద్రరెడ్డి యొకధర్మము జేసెను.

(11) పిల్లలమఱ్ఱి శాసనము:—శా. శ. 1124 లో పిల్లలమఱ్ఱి గ్రామమున రేచెర్ల నామిరెడ్డి దనపేరిట నామేశ్వరదేవునిఁ బ్రతిష్ఠించెను.

(12) పిల్లలమఱ్ఱి శాసనము:—శా. శ. పైశాసనములనుండి[108] యీ రెడ్డిసామంతు 1117 లో రుద్రదేవుని రాజ్యకాలమున దత్ప్ర వంశవృక్షము నీక్రిందివిధమున నిర్ణయింప సాదాసిదత రాజ్యలక్ష్మీవిలాసుండగు నామి వలనుపడుచున్నది.
రెడ్డి మూడు దేవతాప్రతిష్టలఁ జేయించెను.



ఈవంశవృక్షరచనమును గూర్చి కొన్నియభి ప్రాయభేదములు గలవు. పాలంపేటశాసనము నందలి రుద్రసేనాని నీవంశమునఁ జేర్పవలను పడదని శ్రీశైలాద్రిరమణకవుల యభిప్రాయమై యున్నది. ఆశాసనమునందలి వంశక్రమమున ముచ్చసేనాని బ్రశంసలేకుండుటయు, నామిరెడ్డికి బేతిరెడ్డిగాక నింకొక సోదరుడు కాటాభిదు డుండినట్లితరప్రమాణములనుండి తెలియకపోవుటయు వారుజూపెడి కారణములు. కాని మూడు నాలుగు పురుషాంతరములకుఁ బూర్వముండిన యొక పూర్వికుని నామమును విస్మరించుటొక గొప్పలోటుగాదు. ఇతరుల కీర్తిశౌర్యములను గొనియాడిన యీవంశీయుల శాసనములు ముచ్చసేనానిఁ గూర్చి విశేషముగ బ్రశంసింపకుండుట జూడ బహుశః యీతడకాలముననే గతించియో, లేక సా

108 పైశాసనముల ప్రతిబింబములు హైదరాబాదు లక్ష్మణరాయపరిశోధకమండలివారిచే సేకరింపబడి "సుజాత" పత్రికలో గొంతవరకును బ్రకటింపబడినవి. మిగిలినవానికి. నేను వ్రాసిన మూలములనుండి యీసారాంశము వ్రాయబడినది.

మాన్యముగనే దనజీవితమును గడపియో యుండునని తోచుచున్నది. కాకతీయశాసనములనేకములు వంశక్రమమును రెండవప్రోలరాజునుండియే ప్రారంభించుచున్నవి. పెక్కింట మహాదేవరాజుస్మరణము గూడ గనవచ్చుటలేదు. అటులనే పల్లవచోళశాసనములలో గూడ గొందరు పూర్వీకుల నామములు విడువబడియున్నవి. ఇందుచే శ్రీశేషాద్రిరమణకవుల రెండవయభ్యంతరము గూడ సరియైనదికాదని తోచుచున్నది. నామిరెడ్డి శాసనము లందెచ్చటను బేతిరెడ్డి తన సోదరుడని చెప్పుకొనియుండలేదు. తలిదండ్రుల నామసామ్యములనుఁ బట్టియే వీరిర్వురును సోదరులని చెప్పవలసియున్నది. అదేవిధమున కాటెర్రెడ్డి గూడ వీరికి సోదరుడనుటలో నాక్షేపమేమియు లేదు. ఇది యిట్లుండ పాలంపేట పిల్లలమఱ్ఱిశాసనములలోని వంశములు రెండు నొక్కటే యనుటకు యీరెండు తెగలశాసనములకును బమ్మసేనాని ప్రశంస సామాన్యముగనున్నది. ఈసందర్భమునఁగూడ శ్రీశేషాద్రిరమణకవులు భిన్నాభిప్రాయము నొసంగియున్నారు. రుద్రసివంశనిర్మాత బమ్మసేనానియనియు, నామిరెడ్డి బూర్వికుడు భీమసేనానియనియు వారి మతము. నేనీ పూర్వికునిఁ బేర్కొను పిల్లలమఱ్ఱిశాసనమును స్వయముగ జూచియుంటిని. అందీతని నామము "బమ్మాభిధానో" యని స్పష్టముగా లిఖింపబడియున్నది. ఈకారణములవలన పై నొసంగబడిన పిల్లలమఱ్ఱి రెడ్లవంశవృక్షము సరియైన దనియే నావిశ్వాసము.

ఇందు బమ్మసేనాని మొదటి ప్రోలరాజుకాలమునందుండి కాంచీపుర చోళులను జయించి ప్రఖ్యాతివడెను. కామచమూపతి రెండవప్రోలరాజు బ్రత్యర్థియగు మంథన్యగుండాధిపునిఁ దునిమెను. బేతిరెడ్డి కాకతిరుద్రునికిఁ దక్షిణభుజమై యొప్పి దన యేలికతో రణరంగమున బ్రాణములను బాసెను. ఆతని తమ్ముడగు నామిరెడ్డి గణపతి కాలమున విశేషముగ దానధర్మములజేసియు, ననేక దేవాలయములను గట్టించియు వాసికెక్కియుండెను. గణపతి బందిగనుండిన సయమున, వైరిరాజులు గాకతీయ రాజ్యముపై దండెత్తి వచ్చినపుడు, వారల నెదుర్కొనినవారిలో నీనామిరెడ్డి ప్రశంసయేమియు గానరాదు. గాన నీతడు తన యన్నవలె మహాశూరుడుగాక సాత్వికవర్తనుడై యుండెనని దోచుచున్నది క్రీ.శ. 1202 కు పిమ్మట నీతని ప్రశంస గనవచ్చుటలేదు. రేచెర్ల రుద్రసేనాని నాగతిరాజు మున్నగు శత్రురాజుల నిర్జించి, కాకతీయ రాజ్యము నెటులు గణపతిదేవుని కర్పించెనో యింతకు బూర్వమే చెప్పియుంటిమి. కాకతిరాజ్య భారధౌరేయుండను బిరుదమీతనియెడ సార్థకమైయొప్పెను. మహాశూరుడగు నీసేనాని యనుచరుడగు రాజెయనాయకుడు గణపతిదేవుని కళింగవిజయములలో నెక్కుడుగ బాల్గొనెను. రుద్రసేనాని యనుమకొండలో నొక రుద్రేశ్వరునిఁ బ్రతిష్ఠచేసెను. ఈవంశపు ప్రాబల్యమింతటితో నంతరించెను. రుద్రసేనానికి దరువాతి వారందరును గణపతిదేవుని కాలమునకే నశించియుందురు క్రీ. శ. 1258 కి బిమ్మట నీవంశీయుల ప్రశంసయేమియు గన్పడుటలేదు.[109]

2. పద్మనాయక వంశము:— రేచర్ల శబ్దవాచ్యమగు రెండవ కాకతీయ సామంత

109 J. A. H. R. S. V. pt 3 లోని "Recherla Family" యను వ్యాసమును జూచునది.

వంశము మఱియొకటిగలదు. ఈ వంశచరిత్రము ప్రాచీనమగు పద్మనాయక చరిత్రము నుండియు, నాధునికములగు "వెలుగోటివారి వంశావళి" "సురభివంశావళి" మున్నగు వెలమవారి చరిత్రముల నుండియు దెలియనగుచున్నది. పిల్లలమఱ్ఱి శాసనములలోని రేచర్ల రెడ్ల వంశమును, యీపద్మనాయకులవంశమును భిన్నములని యిదివరలోఁ జెప్పియుంటిమి. పద్మనాయక చరిత్రకారులీ వ్యత్యాసమును గ్రహింపకపోయిరి మఱియును పిల్లలమఱ్ఱివంశీయులందరును రెడ్డి శబ్దవాచ్యులుగను, పద్మనాయక రేచెర్లవంశీయులు నాయక శబ్దాభిధులుగను గన్పడుచున్నారు. ఇటుల వ్యత్యస్తములగు నీరెండు వంశములనొకే వంశమను భ్రమచే పైవంశచరిత్రకారు లనేకప్రమాదములకులోనైరి. మఱియును, వారు పల్నాటివీర పురుషులలో నగ్రగణ్యుడగు బ్రహ్మనాయని, పద్మనాయక రేచర్లవంశమునకు మూలపురుషుడుగ బేర్కొనఁ బడిన బేతాళనాయునిని, పిల్లలమఱ్ఱి శాసనములలోని బేతిరెడ్డిని గలిపి యొకనిగ నిర్ణయించిరి. ఇది కేవలమును చరిత్రవిరుద్ధము. ఇందు మూడుచరిత్రాత్మకములగువిషయములు గలవు. వానిలో మొదటిది మొదటి ప్రోలరాజునుండియు కాకతీయసామంతులుగ నుండిన పిల్లలమఱ్ఱిశాసనములందలి రెడ్లు, వీరు గణపతిదేవునికిఁ బిమ్మట గానరారు. రెండవది పల్నాటి యుద్ధమున బ్రహ్మనాయని సంస్కారాభిలాషచే వివిధ జాతులనుండి యనేక శూరు లాకర్షింపబడి, కేవల శౌర్యోపజీవులగు పద్మనాయకుల కులముగ నేర్పడుట. మూడవది గణపతిదేవుని కాలముననే యీ పద్మనాయకులు కాకతీయరాజుల యాదరణకుఁ బాత్రులగుట. ఈప్రత్యేకములగు విషయములను సమ్మిశ్రితముజేయుట తగదు. వెలమవంశ చరిత్రకారుల వ్రాతలకు రెండవ యభ్యంతరము పైవంశములలోని బురుషనామములపై నాధారపడి యున్నది. పిల్లలమఱ్ఱి వంశమునందలి బేతిరెడ్డికి మల్లారెడ్డియను బుత్రుడొక్కరుడు మాత్రముండెను. పల్నాటివీరుడగు బ్రహ్మనాయని పుత్రుడు బాలచంద్రుడు. పద్మనాయకవంశకర్తగ బేర్కొనబడిన భేతాళనాయనికి ప్రసాదాదిత్యనాయుడు, రుద్రనాయుడు నను వారలు బుత్రులై యుండిరి. దీనినుండి బ్రహ్మనాయుడు బేతిరెడ్డికాడనియు, బేతిరెడ్డి భేతాళనాయకుడు గాడనియు స్పష్టమగుచున్నది.

పైచర్చనుండి రేచర్లగోత్రీయులగు నీ వెలమ వంశీయుల చరిత్రము నీక్రింది విధమున నిర్ణయింపవచ్చును. ఈ రేచర్లగోత్రీయులు పల్నాటియుద్ధమునకుఁబిమ్మట నేర్పడిన 17 పద్మనాయక గోత్రీయులలో నొక్కరు. ఈవంశమునకు భేతాళనాయకుడు మూలపురుషుడు. క్రీ. శ. 1240-50 ప్రాంతముల పిల్లలమఱ్ఱి రెడ్లప్రతిభ యంతరించిన పిమ్మట నీపద్మనాయకులు కాకతి గణపతిదేవుని గొలువునఁ జేరి, యాతని దిగ్విజయముల యందసమాన పరాక్రమముఁ జూపి, యాతని గౌరవాదరములకుఁ బాత్రులైరి. ఈభేతాళనాయకునిఁ దరువాత వారిచరిత్రము రుద్రాంబికా ప్రతాప రుద్రుల చరిత్రములలోఁ బేర్కొన బడును. 110

2 కాయస్థవంశము:—ఇందలి మొదటివాడగు గంగయసాహిణిఁగూర్చి గణపతిదేవుని యాంధ్రచోళ విజయములలో దెల్పియుంటిమి. ఈతనికి గండపెండేర బిరుదమును,

110 సౌకర్యార్థమీ పద్మనాయక వంశీయుల యొక్కయు వారియేలికలగు గాకతీయనృపాలుర యొక్క

మాండలిక బ్రహ్మరాక్షస, రక్కెస గంగ యను బిరుదములు నుండెడివి స్థానిక చరిత్ర ములనుండి యీసేనాని యెక్కుడు మతాభిని రతిగల వాడనియు, గర్నూలు మండలము సం దనేక పుణ్యకార్యముల నొనర్చెననియు దెలియుచున్నది. ఒకప్పుడాతని రాష్ట్రమును కాంచీపురమునుండిభీమయదేవ సిద్ధయదేవు లను వారలలజడి పఱుప, గంగయకు దాయా దియగు జన్నిగదేవుడను నాతడు వారల నెదిర్చి, యోడించెను. 111 గంగయకు నామ దేవ పండితుడను నొక బ్రాహ్మణమంత్రి విశేష సాహాయ్యము నొనర్చుచుండెను. 112

3 అయ్యవంశము :—ఇండలి జాయ పనా యకుని నిర్జించి యాతనిని గణపతిదేవుడు దన గజసైన్యముల కధ్యక్షునిఁ జేసికొనెనని వెల నాటివిజయముల నభివర్ణించునెడ జెప్పియుంటి మి. ఈసేనానికి చక్రవర్తి చేబోర్లునొసగెను.

4 మల్యాలవంశము :— ఈవంశీయులు గూడ గణపతిదేవుని కాలము నందెక్కుడు ఖ్యాతినందియుండిరి. వీరి చరిత్రమును రచించు టకు నైజాం రాష్ట్రమునందలి యీక్రిందిశాస నములమూల్యమగు సాహాయ్యము నొసంగు చున్నవి:—

1 కొండిపర్తి శాసనము:— దుర్జయాన్వ యమున మల్యాలవంశమున దన్నపనాయకుడు ను, ఆతనికి సజ్జసేనాపతియు, నాతనికి కాచమ యందు కాకతిరుద్రదేవుని సచివుండగు నొక పుత్రుడును, ఆతనికి బొల్లమవలన పోతయ, చౌండసేనాని యను నిర్వురు సుతులు జనిం చిరి. గణపతిదేవుని సైన్యాధ్యక్షుడుగ నుండిన చౌండసేనాని చౌండపురమను నగ్రహారమును, చౌండసముద్రమను తటాకమును, కొండిపర్తి నగరమున చౌండేశ్వరాలయమును నిర్మించి, యాయాలయముపై నొక హేమకలశమును నిల్పెను. ఈచౌండసేనాని భార్యమైలమ.

2 కొండిపర్తి శాసనము;— తూర్పువైపు- మల్యాలవంశమున దన్నసేనాపతియు నాతనికి సజ్జసేనానాథుడు నాతనికిఁ గాటచమూపతి యునుఁబుట్టిరి. శా. శ. 1162 లో నాకాటచ మూపతి రుద్రేశ్వర ప్రోలేశ్వరులకు ధర్మము లఁజేసెను. ఈతడు గణపతి సృపతి శ్రీపాద పద్మషట్చరణుడు.

3 బూదపుర శాసనము :— కాకతీయ గణపతిదేవునకుఁ దక్షిణభుజముగ నొప్పుచుండి నవాడును, బాచాంబికా బాచవరూధి నీశులకుఁ దనయుడును, గోనవంశసంజాతయగు కప్పాం బికకు భర్తయునగు మల్యాలగుండయ క్రీ. శ 1181 లో బూదపురమున నొక తటాకమును నిర్మించెను.

4 బూదపుర శాసనము :—మల్యాలవం శమున దన్నసేనాపతి జనించెను. ఆతనికి జావ

యు నామము లీవిధమునఁ జేర్కొనదగును.

1 పురుషాంతరము— జేతాశనాయకుడు, గణపతిదేవుడు.

2 ,, ప్రసాదాదిత్యుడు —రుద్రమనాయకు, } రుద్రాంబ.
3 ,, వెన్నమనాయకు —సిబ్బినాయకు, }

4 ,, ఎఱ్ఱదాచానాయకుడు, నల్లదాచానాయకు, సింగమనాయకు, } ప్రతాపరుద్రుడు.
5 ,, వెన్నమనాయకు, యాచమనాయకు. }

111 E. R. No. 208 of 1905. 112 Ibid No. 231.

దండాధినాథు డుదయించెను. 113

పైశాసనములనుండి కాటచమూపతి, చౌండచమూపతియు, మల్యాలగుండయయు నొకే వంశమునకుఁ జెందిన వారని తెలియుచున్నది. దుర్జయకులమునకుఁజెందిన యీమల్యాలవంశీయుల వంశవృక్షమీ క్రిందివిధమున నిర్ణయింపవచ్చును :—



ఇందు గుండయు రుద్రమదేవికాలమున గూడ జీవించియుండెనని పైశాసనముల నుండియే దెలియుచున్నది.

5 సేవుణ వంశము :— వీరి చరిత్రమును గణపతిదేవుని నెల్లూరు దండయాత్రల వర్ణించు నెడజెప్పియుంటిమి.

6 ఇందులూరి వంశము :—ఈవంశీయులు రెండవపోలరాజు కాలమునుండియు కాకతీయుల కాశ్రితులుగ నుండిరి. గణపతిదేవుని వెలనాటు కళింగ విజయములలో నీవంశజుడగు సోమమంత్రిజూపిన పరాక్రమ మగ్రగణ్యము. 114

7 ఆంధ్రచోడ వంశము ;—ఇందలిపొత్త పిశాఖకుఁజెందిన యెప్పిలిసిద్ధి గణపతిదేవుని సామంతుడుగ నుండి కొంతకాలము వెలనాటికిని నెల్లూరు మండలమునకునుఁ బ్రతినిధిగనుండెను. కొణిదెనశాఖకుఁ జెందిన కన్నరదేవదోడుడను నాతడు గణపతిదేవునిసైన్యాధ్యక్షుడై యుండినటులొక నందలూరు శాసనమునుండి దెలియుచున్నది.115

—గణపతిదేవుని యుద్యోగులు.—

మేచయనాయకుఁడు—ఈత డేకశిలాపురీపాలకుడై గణపతిదేవుని యనుగుదలవరిగ నుండెను 116

తిక్కచమూపతి—మంత్రియు సేనానాయకుడును.

పోతన—మఱియొకమంత్రి బ్రాహ్మణుడుగానుండనోపును. ఈతడు సూర్యదేవుడను కవికాశ్రయ మిచ్చెను. 117

దోచిరాజుగణపామాత్యుడు.

పోలరౌతు—తంత్రపాలుడు. ఈతని తనయులగు ఎక్కినాయడు, రుద్రనాయడు, పిన రుద్రినాయడు ననువారలుగూడ గణపతిదేవుని కొలువునుండిరి. వారలు పద్మనాయకులై యుందురు. 119

భాస్కరమంత్రి. 120

సిరిరిఅన్నయ— చక్రవర్తికి స్వాధికారి.121

---

113 ఈశాసనములు హైదరాబాదు లక్ష్మణరాయ పరిశోధకనుండని వారివద్దనుండు ప్రతిబింబములను నేను వ్రాసి మూలములనుండి గ్రహింపబడినవి.

114 ఈ సందర్భమున శివయోగసారమును గాంచుఁది.

115 E. R. No. 805 of 1922.

116 cf. మారన మార్కండేయ పురాణము, కృత్యాది.

117 E. R. No. 530 of 1925. 118 Ibid 203 of 1899 &. 245 of 1905

119 Ibid 330 of 1915. 120 Ibid 405 121 Ibid 537 of 1925

శ్రీమన్ గోవిందనాయకుడు— మహాప్రధాని.

దామనామాత్యుడు—కార్యభరణుడు[122]

బయ్యననాయకుడు—మహాప్రధాని. ఈతనికి పెదగణప, నల్లగణప, జగదాలముమ్ముడి, యనుమువ్వురు పుత్రులుండిరి. వారిలో గడపటియాతడు తనపేరిట నొకతటాకమును నిర్మించి, కాకతి గణపతిదేవుని పేరుగా దానియొడ్డు నగంగాపురమును గట్టించెను.

వీరలుగాక నింకను మల్లిదేవ సిద్ధయదేవులను నాంధ్రచోడవంశీయులును, అల్లాడ పెమ్మయదేవుడను పల్లవరాజును, గణపతిదేవుని సామంతులుగనుండిరి. శాసనములనుండి నూవుల మంచిరాజు, దేవరాజునను నిర్వురు మంత్రులు గూడ దెలియనగుచున్నారు.

ఆర్థికపరిస్థితులు:—గణపతిదేవుని కాలము నందాంధ్రదేశమున వాణిజ్యము ప్రబలియుండెను. ముఖ్యముగ విదేశములతోడి వ్యాపారము సురక్షితముగా నడచుటకై యీతడు వేలానగరమను మోటుపల్లిలో కొన్ని కట్టుదిట్టములను జేసెను. అప్పటి వరకును ఆ రేవునకుఁ జేరు నావికులకు తీరమండలీకుల నుండి రక్షణ మొసంగు వారలెవరును లేకుండుటచే నా చక్రవర్తి వారికాయభయము నొసంగెను. మఱియు నితరదేశములవర్తకు లారేవునకు వచ్చుచు, దన పాలనము నందుండిన యాంధ్రదేశముతో వాణిజ్యమును నెఱపుటకై యీతడు సాధారణముగ విదేశవాణిజ్యముపై విధింపఁబడు పన్నులను తీయించివైచెను. శ్రీగంధము, పచ్చకర్పూరము ముత్యాలు, దంతము, పట్టునూలు, పవడము మిర్యాలు, మన్నగువానిపై నొక నియమిత ద్రవ్యమును సుంకముగ నేర్పరచెను. ఈ నియమములను బాలించుటకై సిద్ధయదేవుడను సేనాని మోటుపల్లికిఁ బాలకుడుగ నియమింపబడెను.

మఱియు నువారంగల్లులోకోటకుపోవుమార్గమున ఖాన్‌సాహెబ్ తోటవద్ద నొక రాతిపై గలశాసనము నుండి[123] గణపతిదేవుని కాలము నందాంధ్రదేశమున నీ క్రిందిసరకులు వర్తకమున కనుకూలముగ నుండినవనియు, వానిపై నీ క్రిందివిధముగ స్థలసుంకములు వసూలు చేయబడు చుండెడివనియును దెలియుచున్నది.

నీలి—మూడకు రెండువీసాలు.

పోకలు—లక్షకు పాతిక.

కూరగాయలు—బండికి పాదిక.

మామిడి, కొబ్బరి—etc.

నూవులు, గోధుమలు, పెసలు, వడ్లు, జొన్నలు } బండికి మానెడు.

ఉప్పు—బండికి పదిపెరుకలమానెడు.

ఆవాలు, Etc కొలభండాలు—మూడ పాదిక.

తగరము, సీసము, రాగి—తులముకు 1ఫలము.

చందనము—తులం 1కి 1 ఫలము.

కర్పూరము—పీశ 1కి 2 చిన్నాలు.

జవాది—మూడపఱక.

కస్తూరి—100 చిన్నాల 1కి 2 చిన్నాలు.

పట్టునూలు—తులం 1కి చిన్నము.

ఇవిగాక మంజిష్టము, చందనము, ముత్యము, రుద్రాక్ష, గాటపూసమున్నగు మణిభండాలందును, పసుపు, ఉల్లి, జాజు, కంద, పెండలము మున్నగు, దుంపదినుసు లందు గూడ నాకాలమున వర్తకము జరుగుచుండెడిది.

---

122 Ibid 383 of 1924.

123 ల॥ రా॥ ప॥ మండలివారిశాసన మునకు నేనువ్రాసిన నకకలనుండి సంగ్రహింపబడినది.

పై పేర్కొనబడిన వాణిజ్య సుంకములు గాక మాగామ యను మఱియొక పన్నును ఉప్పుపై నొకపన్ను నాకాలమున వసూలు చేయబడు చుండెనని శాసనములనుండి తెలియుచున్నది.

మతము:—కాకతిరుద్రదేవుని పరిపాలనమునందు గురుమల్లికార్జున పండితారాధ్యుడు మున్నగు మహాశైవుల బోధలచే నాంధ్రదేశమున వీరశైవమతము వ్యాపించెనని దెల్పియుంటిమి. దానినిఁ బల్నాటివీరచరిత్రము గూడ బలబఱచు చున్నది. అలరాజేనవీరుని గూర్చి యిటులున్నది.

విరజాజి మల్లెలు విభూతిపత్రి
లింగని కారీతి బూజలు చేసి
పిలుమని జంగాల బిలిపించెరాజు
వచ్చిరి అప్పుడు పుణ్యజంగాలు.

దానినుండి 12వ శతాబ్దాంత్యమునకే యీపరిస్థితు లుండినవని దెలియనగును. పల్నాటియుద్ధమునందధిక ప్రఖ్యాతివహించిన బ్రహ్మనాయుడు వైష్ణవ మతావలంబియనియు, నాతడు బసవేశ్వరుని వలెనే కులభేదములను బాటింపక సమస్తజాతుల వారిని వైష్ణవమతము నవలంబింపజేయు చుండెననియుఁ జెప్పబడియుండుటచే, నాకాలమునవైష్ణవమతము కూడ ప్రబలియుండెనని స్పష్టమగుచున్నది. జైనులు గూడ నీకాలమునందుండిరనియే చెప్పవలెను.

గణపతిదేవుని కాలమునం దాంధ్రదేశమున కంతకును జోలముఖ్యమగు నొక సంస్థ యీదేశమునఁ బాదుకొల్పఁ బడెను. మల్కాపురశాసనమునుండియు, రుద్రాంబిక నాటి యొక తామ్రశాసనమునుండియు 124 నాకాలమున గోళగి మఠశైవాచార్యులు మన దేశమున కేతెంచి యెక్కడు రాజాదరణమునుఁ బడసిరని తెలియుచున్నది. ఈమఠముయొక్క చరిత్రిమీక్రిందివిధముగ నున్నది.

భాగీరథీ నర్మదా నదులకు మధ్య దహాల మండలము గలదు. అచ్చట దూర్వాసగోత్రియుడును, సిద్ధిసంపన్నుడును, మహాశైవుడునగు సద్భావశంభువను నాతడుండెను. ఈతడు కళచురిరాజునకు దీక్షాగురుడగుటచే నా రాజీతనికి 3 లక్షలగ్రామములను దానముచేసెను. అంత నాగురువుగోళగి యను మఠము నొక దానిని నిర్మించి యాగ్రామములను దానికి వృత్తిగానిచ్చెను. ఆతని పుత్రుడు సోమశంభువను నాతడు శైవాచార పద్ధతిని రచించెను. అతనికి వామశంభువు బుట్టెను. ఈతడును కళచురిరాజులకు గురువుగ నుండెను. ఇటులీ మఠమునం దనేకులగుశిష్యులును, బ్రశిష్యులునుండిరి. వారిలో శక్తిశంభువునకు కీర్తిశంభువనునాతడు శిష్యుడయ్యెను. ఇట్టివీరు గౌడ రాఢ కేరళ దేశాధీశులకుఁ గురువులైరి. వారిలో ధర్మశంభువునకు విశ్వేశ్వరదేశికుడు బుట్టెను. ఇతడు చోల ప్రఖ్యాతి నందియుండెను. చోళమాళవరాజు లీతని శిష్యులు. కళచురి కాకతీయరాజుల కీతడు దీక్షాగురుడు మహావిద్వాంసుడగుటచే నీతడు గణపతి విద్యామండపము నందధ్యక్షుడుగ నుండెను. 125 ఈతనికి గణపతిదేవుడు వెలనాటరు కంద్రవాటి విషయమున, కృష్ణానదికి దక్షిణమునందు మందరమను గ్రామమును దానము చేసెను. ఆతని పుత్రిక యగు రుద్రాంబ వెలగపూడి నిచ్చెను. అంత నీ విశ్వేశ్వరశివు డచ్చట విశ్వే

124 ఇయ్యది ఆంధ్రసాహిత్యపత్రికాం వద్దగలదు. ప్రకటింపబడినట్లుతోచదు.

125 ఈవిశ్వేశ్వరశివుడే పురుషార్థసారమును రచించిన శివదేవయ్యయని కొందరిమతము.

శ్వరగోళగి యను నొక మఠమును, విశ్వేశ్వరాలయమును, సత్రము నొక దానిని గట్టించెను. ఇచ్చట విద్యార్థులకును, శివయోగులు నాగంతులకును భోజనాది సౌకర్య మేర్పరుపబడెను.[126]

ఈ గోళగీమఠమునకు దక్షిణదేశమునందనేక శాఖలుండినవి. ఇట్టివి పుష్పగిరి[127] త్రిపురాంతకము నను నాంధ్రభాగములందును, ద్రవిడదేశమున తిరుప్పురన్కుర్రం, దేవికాపురము నను స్థలము లందు నుండెడివి.

కట్టడములు — రాజ్యాంగమునందువలెనే గణపతిదేవుని రాజ్యకాలము శిల్పకళకును భవననిర్మాణమునకును మిగుల ముఖ్యమైనది. దేశమునం దంతటను సువిశాలములగు ననేక కట్టడము లపూర్వమగు రీతిని నిర్మింపబడినవి. ఇట్టి శోభనాంధ్రదేశ మిదివరలో గాంచియుండ లేదనుటలో నతిశయోక్తి లేదు. ఈకాలపు శిల్పములను బరిశీలించినచో నాటి యాంధ్రుల నిర్మాణకళానైపుణ్యము వ్యక్తమగుచున్నది. కొందఱు పండితులు కాకతీయుల కళ చాళుక్యకళ కనుకరణమే యని యభిప్రాయపడియున్నారు. స్థూలదృష్టి కియ్యది సరిగనే యున్నను సవిమర్శముగ జూచినచో నిందనేక వ్యక్తిక వ్యత్యాసములు గాంచేనగుచున్నవి. ఏకశిలానగరము, రామప్ప, పిల్లలమఱ్ఱి, కొండిపర్తి మున్నగుననేక స్థలములలో గణపతిదేవుని కాలమున సుందరదేవాలయములు నిర్మింపబడినవి. ఇవి యన్నియు సామాన్యముగ నొకేవిధముగ నున్నవి. రామప్ప తటాకమున కనతిదూరమునం దున్న యా దేవాలయము కాకతీయశిల్పశిఖామణి యన నొప్పుచున్నది. దాని యౌన్నత్యము చూపరులకు విస్మయము గొల్పుచున్నది. భూమిపై నుండి సుమారుపదియడుగుల యెత్తున నక్షత్రాకృతిగల వేదికపై నీ మహోన్నతమగు దేవాలయము నిర్మింపబడియున్నది. దాని బహిర్భాగమంతయు నత్యంతరమణీయముగ జెక్కబడియున్నది. ఆలయమున కెదురుగ మహోన్నతమగు గోపురమును, సుందర శిల్పవిరాజమానమగుద్వారము నుండినవియచ్చటిశిథిలములు దెల్పుచున్నవి. ఇందలి ముఖమంటపము చక్కని శిలాస్తంభములచే నావరింపబడియున్నది. ఇయ్యవి సర్వవిధములను హనుమకొండ సహస్రస్తంభదేవాలయమునందలి స్తంభములను బోలి బ్రతి యంగుళమునను జెక్కబడియున్నవి. స్తంభములకును పైదూలములకును నడుమనుండు సంధిశకలములు వర్ణనాతీతములుగ నున్నవి. హంపీవిజయనగరమునందలి విఠలదేవాలయమునందువలె (Cf. కల్యాణమంటపము) నీ శకలములపై మనోహరములగు మూర్తిశిల్పములు గలవు. యక్షయక్షిణీవిగ్రహము లిం దగ్రగణ్యములు. నీలశిలావినిర్మితములగు నియ్యవి సుస్నిగ్ధములై చూపరులకు సజీవములవలె గన్పట్టుచున్నవి. ఈ యాలయము పైకప్పునందలి లోభాగమున ననేక వరుసలలో తామరమొగ్గలు నిర్మింపబడినవి. ప్రవేశమంటమునందలి గోడలపై భాగమునం దుత్సవములును, విచిత్రములగు ననేక దృశ్యములు గలవు. వీనినుండి యాకాలపు టాంధ్రుల దుస్తులు నాభరణ విశేషములును దెలియుచున్నవి. ఇందొక భాగమున సంగీతసభలును, వివిధములగు నృత్యములును గూడ చెక్కబడియున్నవి. గణపతిదేవుని సేనానులలో నగ్రగణ్యుడగు జాయసేనాపతి

126 ఇందునుగూర్చి విశేషాంశములకు మాల్కాపురశాసనమును జూచునది.

రచించిన నాట్యశాస్త్ర మిచ్చట నీవిధమున జిత్రింపబడినదని గొందరు బండితుల యభిప్రాయము. ఈరామప్పదేవాలయమున కొక మైలు దూరమునం దింకొక సుందరమగు జీర్ణాలయము గలదు. ఇయ్యది యెఱ్ఱని యిసుకరాతితో నిర్మింపబడియున్నది. ఆలయము వెలుపలి వసారాల పైకప్పు లోభాగమున వరుసలు వరుసలుగ తామరమొగ్గలు చెక్కబడియున్నవి. ఆలయము వెలుపలి గోడలపై బురాణములనుండి యనేక చిత్రములు చిత్రింపబడియున్నవి. ఈయాలములు రెండును విజయనగరసామ్రాజ్యాధీశులచే నిర్మింపబడిన యాలయముల నీవిషయముల బోలియున్నవి. గణపతిదేవునికాలమున నిర్మింపబడిన యాలయము లన్నియు నిదేవిధమున మహోన్నతములును శోభావంతములు నై యున్నవి.

ఏకశిలానగరదుర్గమునుగూడ గణపతిదేవుడనేకవిధముల సంస్కరించెను. ప్రాచీనచరిత్రములనుండి రుద్రాంబికకాలమునకే యీదుర్గముచుట్టును రాతిగోడయుండెనని దెలియుచున్నది. బహుశః దీనిని గణపతిదేవుడే నిర్మించియుండును. ఇంతియగాక నీతడు శిలాప్రాకారమునకు లోభాగమునం దొక యిటిక గోడను గూడ గట్టించెను. దీని లోభాగమునే రాజప్రాసాదము లుండెడివి. ఈయిటిక గోడపై రక్షకభటు లుంచబడిరి. రాత్రింబవళ్ళు వారలు దానిని జాగరూకులై రక్షించునటు లేర్పాటులు జేయబడినవి.

ఏకశిలానగరదుర్గమునందలి మనోహరములగు ద్వారములనుగూడ గణపతిదేవుడే నిర్మించెనని గొందరి యభిప్రాయము. ఈనాలుగు ద్వారములు నొక జీర్ణమంటపమునకు సమీపమునం దున్నవి. వీనిమధ్య నొక యాలయ ముండెడిదని చెప్పబడుచున్నది ఈవిషయము నచ్చటి భూమిని ద్రవ్వి పరిశోధించినగాని నిర్ణయింప వలనుపడదు. ఈసుందరద్వారములు ప్రతాపరుద్రచక్రవర్తిచే నిర్మింపబడియండునని దోచుచున్నది.

XII రుద్రాంబ.

(1258—1296)

కాకతీయ గణపతిదేవ చక్రవర్తికిఁ బిమ్మట రుద్రమదేవి రుద్రదేవమహారాజను పేరిట నేకశిలానగర సింహాసనము నధిష్ఠించెను. ఈమెకును గణపతిదేవునికిని గల సంబంధమునుఁ గూర్చి యిదివరలో నభిప్రాయభేదములుండినవి. ఈక్రింది ప్రమాణములనుండి యామె గణపతికి భార్యయను వాదమొకటి ప్రబలియుండినది.

(1) వెనీసుదేశ యాత్రికుఁడగు మార్కోపోలోయను నాతడు మోటుపల్లిని దర్శించి, యచ్చటి నియమముల నేర్పరచిన గణపతిదేవుని శ్లాఘించి యాకాలము నందానినిభార్య రాజ్యమేలు చుండెనని వ్రాసియున్నాడు.[128]

(2) విద్యానాథకృతమగు ప్రతాపరుద్రీయమునకు వ్యాఖ్యానమును వ్రాయుచు, కుమారస్వామి "పురాకిల కాకతికుల సంభూతే గణపతినామ్ని మహారాజే కాలపరిపాకము పేయుషి తస్మహిషీరుద్రమదేవీ నామరాజ్ఞీ" యనిపేర్కొని యున్నాడు.

(3) సోమదేవరాజీయమునుండి గణపతి యాదవరాజునోడించి యాతని కూతురగు రు

127 E. R. No. 272 & 323 of 1905.
128 Yule—Morco Polo Vol, II P. 361.

ద్రమ్మనుద్వాహమాడెనని తెలియుచున్నది

(4) హిందూదేశచరిత్ర సంగ్రహమున లక్ష్మణరావుగారును, Colonel Haig అను నాతడు మఱియొకచోట నిటులేదలంచిరి.

పైవానిలో మార్కోపోలో వ్రాతలకు సరియైన నిర్ణయమువేరు. అతడు ప్రజాసామాన్యము నందలిగాథల నాధారముగ జేసికొనెను. కుమారస్వామి వ్యాఖ్యానము మూలమునకు విరుద్ధమగుటచే నప్రామాణ్యము. ప్రాచీన చరిత్రములు సందేహాస్పదములు. రుద్రమ గణపతిదేవునికిఁ గూతురనుట కీ క్రింది ప్రబల ప్రమాణములు గలవు.[129]

(1) గణపతినృపతిస్త్వేకోనరపతిశతపోషక క్షోణ్యాం (39 పంక్తి)

రుద్రదేవీసము దభూచ్ఛరణ్యా సర్వభూభృతాం। గంభీరాన్మహతస్తస్మాల్లక్ష్మీ రత్నాకరాదివ॥

(మాల్కాపురశాసనము 41&42 పంక్తులు)

(2) స్వస్తిశ్రీకాకతీశోగణపతినృపతి స్తస్య సారుద్రమాంబా। (కోటగిరి తామ్ర శాసనము॥)[130]

(3) తత్పుత్రోగణపతినామధేయో సంజజ్ఞే। జాతాతస్య పయోనిధేరివరమా...శ్రీరుద్రదేవీసుతా (కొలనుపాక శాసనము॥)[131]

(4) తవమాతా శివాస్సాక్షాద్దేవో గణపతిః పితా॥ (ప్రతాపరుద్రీయము)

(5) శ్రీగణపత్యధీశః। స్వరజ్జయ శ్రీమతి రుద్రభూపతీ తదాత్మజాకుర్వతి రాజ్యమున్న తం॥ (పానుగల్లు శాసనము)[132]

(6) పితర్యుపరతేతద్వదరక్షదఖిలాంక్షితీం। వీరరుద్రమదేవీతి దుహితా మహితాగుణైః॥ (అనితల్లికలువచేరు శాసనము)

(7) వెండియు గణపతి ధరణీ। మండలపతి పుత్రిరుద్రమహిదేవికొగిన్ (శివయోగసారము)

రుద్రాంబిక కుటుంబమును గూర్చి కూడ కొన్ని సందేహము లుండినవి. ఈమెభర్త నామమెద్దియో యింతవరకును సరిగ నిర్ణయింపబడియుండలేదు. ద్రాక్షారామ శాసనములలో నొక దానియందు మల్లదేవు డొకడు గణపతిదేవుని కల్లుడుగ బేర్కొన బడియున్నాడు. గురుజాడ శ్రీరామమూర్తిగారీతనిని పిఠాపురమున 13వ శతాబ్దమున బాలించిన విష్ణువర్ధన మల్లపునిగా నిర్ణయించియున్నారు. కాని యాతని కాలము 1202_12 గ నుండుటచేతను, పైశాసనము క్రీ. శ. 1175 నాటిదగుటచేతను, రుద్రమకాలము 1258-1296 అగుటచేత నీ నిర్ణయము ప్రమాదకరమని స్పష్టమగుచున్నది. వీనినన్నిటినిఁ జర్చించి యాంధ్రచరిత్రకారులు రుద్రాంబికభర్త యొక సామంతమండలీకుడై యుల్లరిక ముండెననియు, యౌవనముననే గతించెననియు, నూహించుటకు బాధలేమియు లేవని వ్రాసియున్నారు.[133] E. R No. 740 of 1920 లోరుద్రాంబిక చాళుక్యవీరభద్రేశ్వరుని భార్యయని చెప్పబడియున్నది. ఇదివరలో, పేర్కొనబడినకొలనుపాక శాసనము నందు చాళుక్యవంశమణియు, నిందుశేఖరనరాధిపుని జ్యేష్ఠపుత్రుడు

---

129 Hultzsch in I. A. 1892, P. 198.
Sewell Antiquities I. P 74 & 75.
E. R. Nos. 94 of 1917 & 740 of 1920.

130 Hyd. Arch. Serices No. 3.

131 & 1_32 వీనిమాతృకలు లక్ష్మణరావుపరిశోధకమండలి వారివద్దగలవు.

133 ఆం. చరిత్రము 2 భా. పే. 306-308.

నగు వీరభద్రుడు రుద్రాంబిక భర్త యనియు, నాతడు 30ని వర్తనములనేలను దానము చేసెననియు దెలుపబడియున్నది.[134]

పరిపాలనము:—రుద్రమ గణపతిదేవుని కేకమాత్ర దుహిత. ప్రాచీన చరిత్రములలో నీమె యెనుబది సంవత్సరములు జీవించెనని చెప్పఁబడియున్నది. తుది కాలమునం దీమె తన మనుమని రాజ్యాంగముల పాల్గొనజేయుటయు, తాను క్రీ. శ. 1258 నుండియు, పరిపాలనాకార్యము నెరవేర్చుటయు జూడ, పై చరిత్రము లీవిషయమున విశ్వసనీయములని తోచుచున్నది. క్రీ॥ శ॥ 1254 లో నీమె కూతురు ముమ్మక్కకుఁ బ్రతాపరుద్ర దేవుడు జననమందెను. 1258—1296 నడుమ 40 సం॥గలవు. పౌత్రదర్శనము గల్గుట కీమెకు 1258 నాటికి ముప్పది నలువదియేండ్లైన నుండవలెను. దానిని బట్టి రుద్రమ క్రీ॥ శ॥ 1220-1225 ల నడుమ జన్మించెనని యూహింపవచ్చును. ఈమెకు బుత్రికోదయమైన వెంటనే భర్తృమృతినంది యుండును. దానఁజేసి తనయనంతరమీమెయే కాకతీయసామ్రాజ్యమున కధిపతిగావలసియుండుటచే, గణపతిదేవు డీమెకవసరమగు రాజకీయ శిక్షణమునొనంగెను. ఆతడీమెకు "రుద్రదేవు"డను బురుషనామమిడి యుద్ధములందు సహితము బాల్గొన చేయుచుండెనని ప్రతాపరుద్రీయము నుండియు, రుద్రదేవమహారాజనుపేరిటనామె క్రీ.శ. 1258 నుండియు రాజ్యతంత్రమును నెఱపుచుండెనని శాసనములనుండియు, దెలియుచున్నది.

రుద్రమదేవి సింహాసనమునెక్కిన వెంటనే యాంధ్రదేశము నొక్కసారిగ ననేకప్రళయము లావరించినవి. త్రిపురాంతకమునందలి కొన్ని శాసనములనుండియు, కాకతీయసేనాధ్యక్షుల బిరుదములనుండియు నీ కాలమున వైరిరాజులనేకులు కాకతీయ సామ్రాజ్యపు దక్షిణదిశ నలజడి పఱచిరని దెలియుచున్నది. అట్టివారిలో మూడవ కులోత్తుంగచోడుడొకడు.[135] ఆంధ్రచోడుడగు సిద్ధయదేవచోడుని,[136] కులోత్తుంగునిఁగూడ రుద్రమ్మసేనాని ద్రిపురాంతకుడు నిర్జించెను. ఆతని దమ్ముడగు నంబదేవుడు ఎఱువమల్లి దేవచోడుడు, కేశవదేవుడు, సోమిదేవుడు, అల్లుగంగు, మల్లికార్జునుడు, దామోదరుడు మున్నగు వారలజయించెను.[137] పిమ్మట నీసేనాని, గణపతిదేవుడొనర్చిన పరాభవమునకు బ్రతీకారమొనర్ప నేతెంచిన కొప్పెరుంజింగని దటిమివైచి,[138] విద్రోహమొనర్చిన సామంతుఁడగు మనుమగండగోపాలుని శిక్షించియు, కాంచీపురపాలకుఁడగు విజయగండగోపాలుని యుద్ధమునుండి బలాయితునిఁజేసియు,[139] గాకతీయసామ్రాజ్యము నకాలప్రళయమునుండి గాపాడెను.

ఈసామంతులయొక్కయు దాక్షిణాత్యుల యొక్కయు నుపద్రవము లడంగిన వెంటనే యుత్తరమునుండి యాదవులు దండెత్తివచ్చిరని తెలియుచున్నది. 1220—1270. నడుమ దేవగిరిరాజ్యమును బాలించిన మహాదేవరాజునుఁగూర్చి ప్రశంసించుచు హేమాద్రి తన వ్రతఖండమునందు "ఇత్థంవినిశ్చిత్య తతోబిభీ

---

134 1930-31, ఉగాదిసంచికనుగూడ జూచునది. ఈచాళుక్య వీరభద్రునిగూర్చి విశేషాంశము లేమియు దెలియుటలేదు.

135 E. R. 196 & 201 of 1905. 136 E. R. 175 of 1905.
137 E. R. 268 of 1905. 138 E. R. 170of 1905 and 480 of 1902.
139 E. R. 168, 173, 174, 242 & 268 of 1905.
అనుశాసనములనుండి యీవిషయమై విశేషాంశములు దెలియుచున్నవి.

తైరంధ్రైః పురంధ్రీనిహితా నృపత్వే" యని వ్రాసియున్నాడు. (cf. రాజప్రశస్తి 14 శ్లో॥) పైగ్రంథమునందలి యవతారికలోని 52వశ్లోకమగు

యస్తస్యైవరణే జహారకరిణ
స్తత్పంచశబ్దాదికాన్।
యస్తత్యాజవధూవధాదుపరత
స్తధ్యాభుజాంరుద్రమాం".

అనుశ్లోకము నాధారముగ జేసికొని భాండార్కరుపండితుడు ఆంధ్రులు మహాదేవరాజునకుఁ భయపడి స్త్రీని దమకేలి కగనొనర్చిరనియు, నంత నాత డాంధ్రదేశముపై దండెత్తి వచ్చి యుద్ధమున రుద్రాంబిక నోడించి పంచరత్నములను, నేనుగులను, పంచశబ్దసాధనములను హరించి, యామెను స్త్రీయగుటచే ప్రాణములతో విడిచిపుచ్చెననియు వ్రాసియున్నాడు.[140] ప్రాచీనవంశ చరిత్రములలో నీప్రశంస యింకొక తీరున గనవచ్చుచున్నది. రుద్రాంబికకు హరిహరుడు మురారిదేవుడునను నిద్దరు సవతికొడుకులుండిరట. స్వార్థపరులై వీరలు యాదవులతో గుట్రలు చేసి, దేవదర్శనార్థమై మహారాజ్ఞి నగరు వెడలిన యదనున దుర్గము నాక్రమించిరట. రాజభక్తిపరాయణులగు బౌరుఁయొక్కయు సేనానులయొక్కయు సాహాయ్యముచే రుద్రమ వీరినోడించెనట. వెంటనే యామె దూరదర్శియగుటచే నేకశిలాదుర్గమును బాగుచేయించెను. అనతికాలమునకే యాదవులు దండెత్తిరా నామె మహాశౌర్యము జూపియు, పరివారమున కెక్కుడుత్సాహము గల్గించియు, నీశత్రువులను బరిమార్చెనట. ఈ యిరుపార్శ్వముల వారి గాథలయందు నెంతనిజముండినను, కాకతీయులకీ యుద్ధమువలన విశేషముగ నష్టమొనగూడియుండి యుండలేదనుట సత్యము.

క్రీ. శ. 1290 నాటికే వయసు మందిరిన దగుటచే నీమె తన మనుమడగు ప్రతాపరుద్రుని రాజ్యాంగమున నియోగించు చుండెను. తన తండ్రియగు గణపతిదేవుని యాజ్ఞచే నీమె మనుమని తనతండ్రి జీవితకాలముననే దత్తతచేసికొనెను.

ఈమె రాజ్యమునందింక నేమియు నుపద్రవములు లేకుండుటచే శాంతి యెల్లడలనుఁబ్రబలజొచ్చెను. రాజనీతిజ్ఞులును, శౌర్యసంపన్నులునగు మంత్రిసేనాధ్యక్షాదులు సామ్రాజ్యమును నిర్వహింపుచుండ నీమహారాజ్ఞి ప్రజాహితకరములగు ననేక సత్కార్యముల నొనర్చుచుండెను. ఈమె యొసంగిన దానములకును, నిర్మించిన యగ్రహార వాపీకూప తటాకాదులకును లెక్కలేదు. ప్రజలనేకు లీమె యెడ దమకుఁగల గౌరవ విశ్వాసములఁ జూపుటకునై "అంబాల" యను గ్రామముల ననేకముల నిర్మించిరి. ఎల్లరకు నీమె "అంబ"యై జగదంబయన నొప్పుచుండెను.

సేనానులు:— (1) కాయస్థులు;—రుద్రాంబకాలమునకు గంగయసాహిణిమరణించియుండుటచే నాతని గౌరవములకు జన్నిగదేవుడు పాత్రుడై గండికోట ప్రాంతమున కధిపతి యయ్యెను. ఈతడు కులోత్తుంగచోడుని, సిద్ధయదేవ చోడుని జయించెనని యిదివరలో జెప్పియుంటిమి. జన్నిగదేవుడు వీరశైవుడు. శాంతపూర్వశివదేవునికిఁ శిష్యుడు. ఈతడు క్రీ. శ. 1270 ప్రాంతమువరకును జీవించియుండెను.

పిమ్మట ద్రిపురాంతకాంబ దేవులు దత్త

140 Erly History of the Deccan (3rd Edn.) P. 225.

మండలములకు బాలకులైరి. త్రిపురాంతకుడు కమ్మనాడు, ములికినాడు, పొత్తపినాడు మున్నగు నాడులను పాలించుచుండెను. కడప మండలమునందలి మఠాధిపతియగు నఘోర శివాచార్యుని కీతడు శిష్యుడు. మొదట దువ్వూరునుఁ బిమ్మట వల్లూరు నీతనిరాజధానులు. ఈసేనాని శ్రీశైల త్రిపురాంతక దేవాలయములకుఁ బెక్కు ధర్మములనొనర్చియుండెను.

అంబదేవమహారాజు త్రిపురాంతకుని సోదరుడు. కాయస్థ వంశజులలో నీతడగ్రగణ్యుడు. మహాశూరుడును, నిరుపమపరాక్రముడునగు నీతడు రుద్రాంబిక రాజ్యాభిషేకానంతర మాంధ్రదేశముపై దండెత్తివచ్చినశత్రువులనెల్ల నిర్జించెను. ఈతనికి రాయసహసి మల్లుడను బిరుదముండెను. కేవల ధైర్యము ననేగాక నీతనికి పరిపాలనా క్రమమునఁగూడ నెక్కుడు నైపుణ్య ముండినది. సామ్రాజ్యపు టార్థికస్థైర్యమునకై యీతడు తనపరిపాలనము నందుండిన భూమినెల్ల కొలిపించియు, పన్నుల నేర్పరచియు ననేకసంస్కరణముల నొనర్చెను.

2 రేచెర్లవంశము:—ఈవంశము నందలి రెండవ పురుషాంతరమునకుజెందిన దామానాయుడు, ప్రసాదాదిత్య నాయుడు, రుద్రమ నాయుడు ననుతారలు రుద్రాంబకాలమునఁ బ్రసిద్ధికెక్కియుండిరి. వీరిలో ప్రసాదాదిత్యుడగ్రగణ్యుడు. ఈతనికిఁ 'గాకతిరాజ్య ప్రతిష్ఠాపనాచార్య' బిరుదముండినటుల పద్మనాయక చరిత్రమునుండి తెలియుచున్నది. బహుశః యీతడు యాదవులతోడి యుద్ధములలో నెక్కుడుగ బాల్గొనియుండును. స్థానికచరిత్రములలో నీతనిఁగూర్చి యొకవింతగాథ గలదు. పురుషవేషముతోనుండిన రుద్రమ యొకకన్యకను బరిణయమాడెనట. నిజము తెలసినపిమ్మట నాకన్యపడు దుఃఖమును సహింపజాలక నీసేనాని రుద్రమను జేంపి, యామెస్థానమున బ్రతాపరుద్రుని యేలికనొనర్చెనట. ఇది కేవల మవిశ్వసనీయము.

3 ఇందులూరివంశము:—మనుమగణపతి, అన్నయదేవుడు, రుద్రుడు నను నీవంశీయులు రుద్రమకాలమున ఖ్యాతిగాంచిరి. వీరిలో అన్నయ సుప్రసిద్ధుడు. కాకతీయ సామ్రాజ్యమున కాయువుపట్టువలె నుండు దక్షిణకళింగము నీతడు పాలించుచుండెను. రుద్రాంబిక తన రెండవ కూతురగు రుయ్యమ్మదేవి నీతనికిఁ బరిణయ మొనర్చుటనుబట్టి యీతని ప్రాముఖ్యత దెలియుచున్నది.

4 గోనగన్నారెడ్డి:—ఈతడు వర్ధమానపురమునుండి కాకతీయ సామ్రాజ్యపు పశ్చిమభాగమునెల్ల బాలించుచుండెను. ఈసేనాని యనేక వైరివీరులఁ ద్రుంచెననియు, ఆదోని, తుంబుక, మానువ మున్నగు దుర్గములను జయించెననియు రాచూరు శాసనమునుండి తెలియుచున్నది.

5 నాగదేవుడు:—అంబదేవుడు మనుమగండ గోపాలుని జయించిన పిమ్మట పాకనాటిసీమ కీనాగదేవు డధిపతిగనుండెను. ఈతని భార్య మల్లమాంబిక గణపతిదేవుని తలవరియగు మా చెయనాయకునికి పుత్రిక. మారన మార్కండేయ పురాణమును గృతినందిన ప్రతాపరుద్రుని కాశ్రితుడుగనుండిన గన్నమంత్రి కీతడు పితామహుడుగ నుండును.

6 సామంత పోతినాయకుడు:—ఈ సేనాని క్రీ. శ. 1277 లో రాచూరులో నొకయాలయమును నిర్మించి యనుమకొండ నాడులో

నొక గ్రామమును దానము చేసెను.[141]

7 పర్వతనాయకుడు:—ఈతడు మహారాజ్ఞి కంగరక్షకుడుగ నుండెను.[142]

8 ఆదిదమ్మ:—మీసరగండ బిరుదాంకితుడగు నా సేనాని మనుమగండ గోపాలుని జంపెను.[143]

9 వల్లనాయకుడు:— రాజనగరరక్షకుడు

10 పట్టసాహిణి దాది గన్నమ నాయకుడు:—ఈతని శాసనములు గొన్ని గుడిమెట్టలో గన్పడుచుండుటచే నీతడు వెలనాటిపై యధికారిగ నుండెనని తోచుచున్నది.

11 దాది సోమయ సాహిణి:— గన్నమ నాయకుని పుత్రుఁడు. ఈతడు రుద్రాంబ రాజ్యాంత్యభాగమున బ్రసిద్ధికెక్కినవాడు.

సామంతులు:— 1 ఆంధ్ర చోళులు— సింగయదేవ గడిదేవుడను నెల్లూరిపాలకుడు. క్రి. శ. 1267 నాటిశాసనము నందురుద్రమకు సాంతుడని పేర్కొనబడి యున్నది. (ఎదురురాళ్ళ పాడు శాసనము)

2 సేవుణవంశము:—శ్రీమన్మహా మండలేశ్వర మాధవదేవుడు.

3 బద్దెన:—ఈమండలేశ్వరుడునీతిశాస్త్ర ముక్తావళీగ్రంథకర్త. కృష్ణానదికి దక్షిణము నందొక చిన్నసంస్థానమున కధిపతి.

రాజధాని:—రుద్రాంబ యేకశిలానగర దుర్గము ననేక విధముల సంస్కరించెనని ప్రాచీన చరిత్రములనుండి తెలియుచున్నది. అంతకు బూర్వమేయుండిన రాతి గోడకు లోభాగము నందామె మెట్లను గట్టించెను. ఇందుచే శత్రువులు దుర్గమును ముట్టడించినపుడు లోపలివారలు సులభముగ నారాతిగోడపై కేగి వారిపై నాయుధములను బ్రయోగింపవలను పడును. దుర్గముచుట్టునుండు నితరకార్యములనుగూడ నీమె సంస్కరించెను. దుర్గమును విస్తరించి యీరాజ్ఞి దానిచుట్టును భూమికోటనుగట్టించి యొక లోతైన యగడ్తనుదవ్వించి గోడపై నెన్నియో బురుజులను వేయించెను. దీనికెనిమిది గౌనులును బదునారు దిడ్లనుంచేబడినవి. పుట్టకోటకును రాతికోటకునుగూడ నటులే నాలుగుగౌనులు నెనిమిది దిడ్లను గట్టబడినవి. అటుపై నీగోడలను రక్షించుటకై కొమ్మకు యిద్దరును, బురుజుకు యేబదిమందిని, గౌనుకు నైదువందల మందియు, దిడ్డికి నూర్గురును రక్షకభటు లేర్పఱుపబడిరి.

XIV ప్రతాపరుద్రదేవుడు.

(1290—1326)

జన్మాదికము:—ప్రతాపరుద్రచక్రవర్తి జననకాలమింత వరకును నిర్ణయింపబడియుండలేదు. కాకతీయచరిత్రమునకు మిగుల ముఖ్యమగు నీసమస్యను బరిష్కరించుటకు వలయు నాధారములు కొలదికాలమునకు బూర్వము వరకును లభించియుండలేదు. బ్రిటీషు దొరతనమువారి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారము నందలి కొన్ని ప్రాచీనవంశ చరిత్రలమూలమునను, కొన్నిసంవత్సరములకు బూర్వము మదరాస్ శాసన నివేదికలలో నుదహరింపబడి, యిటీవల రాజమహేంద్రవరాంధ్రేతిహాస పరిశోధకమండలి వారి పత్రికలో సమూలముగఁ బ్రకటింపబడిన మాల్కాపుర శాసనమూలమున, నీచక్రవర్తి జన్మకాలమును నిర్ణయిం

141 E. R. No. 67 of 1915.
142 Ibid 130 of 1917.
143 Ibid 170 of 1905.

ప వీలగుచున్నది. కాకతీయరాజుల చరిత్రము నుదెలుపు ప్రాచీనగ్రంథము లనేకములు గలవు. వానిలో నేకశిలానగర వృత్తాంతము, తెలుగురాజుల చరిత్రము, ప్రతాపచరిత్రమును ముఖ్యములైనవి. ఈచరిత్రములు ప్రతాపరుద్రచక్రవర్తి జననకాలమునుగూర్చి పరస్పర విరుద్ధములు నవిశ్వసనీయములు నగు విషయములను దెలుపుచున్నవి. ఉదాహరణమునకై వాని నిట పొందు పఱచుచున్నాము—

".....అబ్బాలుండు అయిదువర్షంబులు రుద్రమదేవులు దమ అంకపీఠంబున కూర్చొనచేయుటయు.....పదారవయేట విశాలాక్షిమున్నగు రాజకన్నెలను పదారుగురను పెండ్లిచేసి తదనంతరంబున శ్రీమత్ప్రతాపరుద్రుని సింహాసనాసీనుంజాయవలయునని రుద్రమదేవులు శివదేవయ్యకు వప్పనచేసి ఆరుద్రమదేవి 38 యేండ్లు రాజ్యముపాలించి తాను శివలోకంబునకు యేగెను. యిదివర్కు శాలివాహనశకవరుషంబులు 1215."

(ప్రతాపచరిత్రము)

దీనినుండి శా. శ. 1215 కయిదేండ్లకు పూర్వమే, యనగా శా.శ 1210 కు సరియగు క్రీ.శ. 1288 వ సంవత్సరమున ప్రతాపరుద్రచక్రవర్తి జన్మించియుండెనని తెలియుచున్నది.

"దశమాససంపూర్ణమైన శా. శ ౧౧౬౬ అనగా నందనసంవత్సర చైత్రశు ౫ గురువారము రోహిణీనక్షత్రమున....."

(ఏకశిలానగర వృత్తాంతము.)

"దశమాసంబులు సంపూర్ణంబులైన శా. శ. ౧౧౬౦ అగు ఆనందసంవత్సర చైత్ర శు౫ గురువారము రోహిణీనక్షత్రమున....."

(తెలుగురాజుల చరిత్రము).

ఈవిధమున నీప్రాచీన చరిత్రములనుండి శా. శ. 1210, 1166, 1160 సంవత్సరములు ప్రతాపరుద్రుని జన్మసంవత్సరములుగ దెలియనగుచున్నవి. వీనిని బ్రత్యేకముగ విమర్శించిగాని బరిగ్రహింపవలనుపడదు. క్రీ.శ. 1290 నుండియు బ్రతాపరుద్రుడు రాజ్యపాలనమొనర్చుచుండినటుల శాసనప్రమాణము గన్పడుచుండుటచేతను, అంతకు పూర్వవత్సరముననే యాతడు జన్మమందియుండుట యసంభవమగుటచేతను, శా. శ. 1210 వ సంవత్సరమును బరిత్యజింపవలసి యుండును ఏకశిలానగర వృత్తాంతమునందలి నందనసంవత్సరము 1166 వ శకసంవత్సరమునకు సరిపడక 1214 నకు సరియగుచున్నది. శా. శ. 1166. క్రోధిసంవత్సరమునకు సరిపడుచున్నది. కాని యప్పటి చైత్రశుద్ధపంచమి గురువారముగాక మంగళవారమగుచున్నది. అటులనే తెలుగురాజుల చరిత్రమునందలి యానందసంవత్సరము 1160 వశకమునకు సరిగాక 1176 కు సరియగుచున్నది. "ఇండియన్ ఎఫిమెరిస్" అను కాలనిర్ణయ గ్రంథమునుండి పై కాలములకు సరియగు క్రీస్తు శకకాలము లీక్రిందివిధమునఁ దెలియనగుచున్నవి. [144]

1 ఆనంద చైత్రశుద్ధ పంచమి=25 మార్చి 1254 సంవత్సరము.

2 శా.శ. 1160 చైత్రశు ౫=22 మార్చి 1238.

3 నందన చైత్రశుద్ధ పంచమి=24 మార్చి 1292.

4 శా.శ. 1166 చైత్రశు౫ =15 మార్చి 1244.

ఇటు లీనాలుగు జననకాలములును 1238-

144 L. D. Swami Kannu Pillai—The Indian Ephemeris Vol. IV.

1292 లకు నడుమగల యేబదినాలుగు సంవత్సరముల వ్యత్యాసమునకు లోనై యుండుటచే వానీలో దేనిని పరిగ్రహించుటకును వలనుపడకున్నది.

మాల్కాపురశాసన మీసందర్భమున నెక్కుడుసహాయ్యము నొసగునని యిదివరలో చెప్పియుంటిమి. ఈశాసనము క్రీ. శ. 1261వ సంవత్సరమునఁ గాకతీయ గణపతిదేవచక్రవర్తియు నాతనికూతురగు రుద్రాంబయు గోళగీ మఠశైవాచార్యున కొసర్చిన దానమును దెలుపుచున్నది. ఇందలి కాకతీయవంశాను వర్ణనము మనకు ప్రకృతమునం దవసరమయినది. ఈ శాసనమునందలి 52—54 పంక్తులిటులున్నవి.[145]

"యస్యాః కాకతివంశమౌక్తికమణే
శ్రీరుద్రదేవ స్సుత—
స్తస్యాః కిం కథయామ వైభవమత
శ్రీరుద్రదేవ్యా పరం"

పైపంక్తులనుండి శాసనకాలమగు క్రీ. శ. 1261. నాటికి రుద్రమదేవికి రుద్రదేవుడను నొక కుమారుడుండెనని తెలియుచున్నది. ప్రాచీన వంశావళులలో నీమహారాజ్ఞికిఁ బురుషసంతాన మేమియు లేకుండెననియు, ముమ్మక్క, యుమ్మక్కయను నిర్వురు తనయలు మాత్ర ముండిరనియు చెప్పబడియున్నది. విద్యానాథునిచే రచింపబడి, ప్రతాపరుద్రదేవుని కంకితమొనర్పబడిన "ప్రతాపరుద్రీయ యశోభూషణము"నఁ బ్రతాపరుద్రుడు ముమ్మడంబ కుమారుడనియు,[146] రుద్రాంబిక తనతండ్రి యాజ్ఞ ననుసరించి దౌహిత్రునిఁ బుత్రునిగ పరిగ్రహించెననియు దెలుపబడి యున్నది.[147] శాసనమునందలి రుద్రదేవుడు ప్రతాపరుద్రుడే యని పై విషయములనుండి స్పష్టమగుచున్నది. గణపతిదేవచక్రవర్తి క్రీ శ. 1260. లోనే మరణించెనను ప్రస్తుత చరిత్రకారుల యభిప్రాయము నీమాల్కాపుర శాసనము ఖండించి, యాతడు క్రీ. శ. 1261. లో గూడ జీవించియుండెనని నిరూపించుచున్నది. ఈశాసనమును ప్రతాపరుద్రీయము తోడను, ప్రాచీన చరిత్రములతోడను సమన్వయించినచో, క్రీ. శ. 1261. వ సంవత్సరమునకు పూర్వమే రుద్రాంబిక సంతానయోగ్యావస్థను దాటియో లేక విగతభర్తృకగనో యుండెననియు, నప్పటికే యామెపుత్రికయగు ముమ్మడంబకుఁ బ్రతాపరుద్రదేవుడు జన్మించియుండి దత్తస్వీకారార్హమగు వయస్సు నందియుండెననియు, తన తనయయగు రుద్రాంబిక మరణానంతరమునఁ గాకతీయసామ్రాజ్యము విచ్ఛిన్నమగుట నిచ్ఛింపక, గణపతిదేవుడు తనజీవితకాలముననే యామెచే దౌహిత్రునిఁ బుత్రునిగ పరిగ్రహింపజేసెననియు, నూహింపనగుచున్నది. ప్రతాపరుద్రుఁడు గణపతిదేవుని తుదికాలమునకు యుక్తవయస్కుడేయై యుండినచో, రాజనీతిజ్ఞుడగు నాచక్రవర్తి యీతనినే తనయనంతరమునఁ గాకతీయరాజ్యమున కభిషిక్తునిఁ జేసియుండును ఆతడటులొనర్పక విద్యానాథుడు పేర్కొనినటుల రుద్రాంబకు 'రుద్రదేవు' డను బురుషనామ మిడియు,[148] నామెను రాజ్యాంగ నిర్వహణమునఁ బాల్గొనజేసి, దౌహిత్రుని బరిగ్రహింపజేయుటయు, గణపతిదేవ రుద్రాం

145 J. A. H. R. S. Vol. 4 IV pt 3 & 4 P 154.

146 విష్ణోర్నాతాతదను మహితా ముమ్మడంబాతృతీయే॥

147 స్వీకృతేపుత్రభావేన దౌహిత్రేపాఙ్క్తమాజ్ఞయా॥

148 రుద్రఇతివ్యవహారః కృతః,, ప్ర॥ రు॥

బికాదుల శౌర్యధైర్యాదికముల నభివర్ణించి యుండిన మల్కాపురశాసనము ప్రతాపరుద్రుని నామమును మాత్రము దెలిపి యూరకుండుటయుజూడ, ప్రతాపరుద్రుడు క్రీ. శ. 1261 సంవత్సరమున బాలుడై యుండెనని స్పష్టమగుచున్నది. ప్రాయికముగ పదిసంవత్సరములు దాటకమున్నె దత్తస్వీకారము జరుపబడును గాన నీతడు సుమారు క్రీ. శ. 1250—52 సంవత్సరములలో జననమంది యుండునని మాల్కాపుర శాసనాధారముపై నూహింపవలసి యుండును.

ఇంతకుముందు ప్రాచీన చరిత్రములనుండి దెలియనగుచున్నవిగ పేర్కొనబడిన కాలములలో క్రీ. శ. 1254వ సంవత్సరము పై నూహించినకాలమున కించుమించుగ సరిపడుచున్నది. అటులయినచో క్రీ. శ. 1261లో గణపతిదేవుడు మరణించునాటికి ప్రతాపరుద్రుడేడేండ్లబాలుడయి యుండును. ఇయ్యది మన మొనర్చినయూహ కనుకూలముగనే యున్నది. గాన నిర్దుష్టములగు ప్రమాణవిశేషములు బయల్వెడలి యితోధికములగు హేతువులనొసంగి యీయూహను ఖండించువరకును ప్రతాపరుద్రదేవ చక్రవర్తి శా. శ. 1176 ఆనంద సంవత్సర చైత్ర శు. ౫ గురువారమునకు సరియగు క్రీ. శ. 1254 సంవత్సరము మార్చి నెల 25వ తేదీని జననమందెనని చెప్పవలసి యుండును.

ప్రతాపరుద్రుని తలిదండ్రులఁ గూర్చియు నితరబంధువులఁ గూర్చియు కొంచెముగ జర్చింపవలసియున్నది. ప్రాచీనచరిత్రము లీతని తల్లి రుద్రాంబికతనయయగు ముమ్మక్కదేవి యని తెలుపుచున్నవి. ప్రతాపరుద్రీయ మీ విషయమును బలపఱచుచు నీక్రిందిశ్లోకములలో నాతనితండ్రి మహాదేవాభిధుండని చెప్పుచున్నది—

"మహాదేవాజ్జాత స్సపున రవనీభృ
ద్దుహితరి॥"

"విష్ణోర్మాతా తదను మహితా
ముమ్మడంబా తృతీయే॥"

'శివయోగసార' మను ప్రాచీన శైవగ్రంథము గూడ పై విషయమునే పేర్కొనుచున్నది[149]

"అకుపిత రుద్రమాంబికకు నాత్మజనా
బొగడందు ముమ్మడ
య్యకు మహాదేవరాజునకు నాత్మజుడైన
బ్రతాపరుద్రు....."

ఈమహాదేవరాజెవ్వరో నిర్ణయించుట కింతవరకును సరియైన యాధారములు గానరావు. దక్షిణహిందూదేశ శాసనసంపుటములోని కొన్నిశాసనములలో సర్వలోకాశ్రయ, విష్ణువర్ధనాది బిరుదాంకితుఁడును, చాళుక్య వంశీయుఁడును, నిడుదప్రోలు పాలకుఁడునగు నొకమహాదేవరాజు గాంచేనగు చున్నాడు. ఈతడు శా. శ. 1218—1228లగు క్రీ. శ. 1296—1306 సంవత్సరములనడుమ రాజ్యమేలియుండెను.[150] ప్రతాపరుద్రునితండ్రి యీతడే యనుటకుఁ గొన్నియభ్యంతరము లున్నవి. చాళుక్యాన్వయుఁడగు వీరభద్రునికిని గాకతీయ రాజపుత్రికయగు రుద్రమదేవికిని గూతురగు ముమ్మడంబ[151] తానును చాళుక్యాన్వయుఁడగు మహాదేవరాజు నుద్వాహమగుట విహితముగ గన్పట్టుటలేదు. అదియునుఁగాక బ్రతాపరుద్రుని జన్మకాలమగు క్రీ. శ. 1254

149 "సుభాషి" 1928 అక్టోబరుసంచిక.

150 S. I. I. IV Nos. 735. E. R. 510 & 511 of 1892.

151 ల॥ ప॥ మండలివారి కొలనుపాకశాసనము.

సంవత్సరమునకును, చాళుక్య మహాదేవరాజు నాటి క్రీ శ. 1296 నకును నడుమ నలుబది రెండు సంవత్సరముల వ్యత్యాసము గనపడు చున్నది. ఈతడే ప్రతాపరుద్రుని తండ్రియై యుండి, యాతని 10 లేక 16వ రాజ్యసంవత్సరమువరకును జీవించియే యుండినచో, నాతని ప్రశంస యించుకంతయు తాత్కాలిక శాసన వాఙ్మయాదులలో గన్పడకుండుట చిత్రముగ నున్నది. ప్రాచీనవంశ చరిత్రములలో బ్రతాపరుద్రదేవున కన్నమదేవుడను సోదరుం డొకడుండెనని చెప్పబడియున్నది. దీనిని బలపఱచు నాధారము లింకేమియు గానరావు. బస్తరు రాజ్యమునందలి దంతేశ్వరమునంగల క్రీ. శ. 1703 నాటి రాజాదిక్పాలదేవుని యొకశాసనమునం దొక యన్నమరాజు సోమవంశీయుడగు నర్జునుని సంతతివాడుగను, గాకతీయుడుగను పేర్కొనబడియున్నాడు.[152] ఈతనిం దమపూర్వికునిగ బరిగణించు బస్తరురాజులు గూడ దాము గాకతీయులమనియే చెప్పుకొనుచున్నారు. కాని యీ యన్నమరాజు ప్రాచీనచరిత్రములందలి యన్నమదేవుడనుటకు దంతేశ్వరశాసనమునందలి కాలము ప్రతిబంధకమగుచున్నది. క్రీ. శ. 1703 లో నుండిన దిక్పాలదేవునికిసీయన్నమరాజునకును నడుమ నెనిమిది తరములు గలవు. దీనినుండి యన్నమరాజు పదునైదవ శతాబ్దమున నుండెనని తెలియుచున్నది. ఈ కాలమునకును ప్రతాపరుద్ర చక్రవర్తి కాలమునకును నూరు సంవత్సరముల యంతర మున్నది. గాన ప్రతాపరుద్రుని తండ్రినిగూర్చియు సోదరునిగూర్చియు భావిపరిశోధనల మూలమునగాని నిశ్చయముగ నేమియు నిర్ణయింప వలనుపడదు. ముఖ్యముగ నిజాంరాష్ట్రమునందలి శాసనవాఙ్మయాదికములఁ బరిశోధించినగాని యీ విషయములు విస్పష్టములు కాజాలవు.

ప్రకృతమునఁ జరిత్రకారులు క్రీ. శ. 1296 వ సంవత్సరమున రుద్రాంబ మరణింపగాఁ ప్రతాపరుద్రదేవు డామె యనంతరమునఁ గాకతీయ సింహాసనము నధిష్ఠించెనని యభిప్రాయపడుచున్నారు.[153] కొన్ని ప్రమాణ విశేషముల యాధారముపై నీయూహ సరికాదని నిరూపింప వీలగుచున్నది విద్యానాథ కవి ప్రతాపరుద్రదేవుడు యువరాజుగనుండగనే రాజ్యభారమును వహించి యనేక దేశములను జయించెనని వ్రాసియున్నాడు.[154] చరిత్రకారు లీ వ్రాతలను కేవల మలంకారికములుగ బరిగ్రహించి వానిని చారిత్రక దృష్టితో బరిశీలింపకుండిరి. వీనిని విమర్శించి యన్యప్రమాణములతో సరిచేసి చూచినచో నీ చక్రవర్తి క్రీ. శ. 1296. వ సంవత్సరమునకుఁ బూర్వమే పరిపాలనము నారంభించియుండెనని తెలియనగుచున్నది. ఆంధ్రదేశమునందలి శాసనములు పెక్కు లీ యూహను బలపఱచుచున్నవి. అట్టివానిలో నీ క్రిందివి ముఖ్యములు.

1. శా. శ. 1212 (క్రీ. శ. 1290.) లో చోడమల్లి దేవమహారాజను సామంతునిచేఁ జేయబడిన ధర్మమును దెలుపు దర్శిశాసనము.[155]

2. శా. శ. 1212 (క్రీ. శ. 1290) లో

152 Ep. Ind. IX P. 165.

153 Historical Sketches of Ancient Dekkan—K. V. S. Iyer, ఆంధ్రులచరిత్రము 2 సంపుటము.

154 ధీరోయం యువరాజఏవ వహతి శ్రీవీరరుద్రోధురం।

155 Nel. Ins. D. 6.

బొల్లమ రెడ్డియను నాతడు కాకతీయ రుద్రకుమారుని రాజ్యకాలమునం దొనర్చిన ధర్మమునుఁ దెలుపు మల్యాలశాసనము.[156]

3. శా. శ. 1214 (క్రీ. శ 1292) నాటి కుమార రుద్రదేవునికాలపు కళ్ళేపల్లి శాసనములు.[157]

4. శా. శ. 1214 (క్రీ. శ. 1292) లో నొక మహామండలేశ్వరకుమారరుద్రదేవుని బేర్కొను గణపవర శాసనము.[158]

పై శాసనములనుండి ప్రతాపరుద్రదేవుడు క్రీ. శ. 1290 నుండి 1296 వఱకును తనమాతామహి యగు రుద్రాంబకు రాజ్యపరిపాలనమున దోడ్పడుచు క్రీ. శ. 1296 లో నామె మరణించినపిమ్మట కాకతీయ సింహాసనము నధిష్ఠించి, యాంధ్రసామ్రాజ్యము నేల నారంభించెనని తెలియనగుచున్నది.

రాజకీయ చరిత్రము:— క్రీ. శ. 1290 వ సంవత్సరమునుండియు ప్రతాపరుద్రదేవుడు తనమాతామహియగు రుద్రాంబికకు రాజ్యంగనిర్వహణమునం దోడ్పడు చుండెననియును, యువరాజుగ నుండినపుడే యాత డనేక దేశములను జయించి ప్రసిద్ధిఁగాంచియుండెననియు నిదివరలో చెప్పియుంటిమి. క్రీ శ. 1296 వ సంవత్సరమున రాజ్ఞీమతల్లియగు రుద్రమదేవి కాలముచేయగా నామెచేబుత్రుడుగ బరిగ్రహింపబడినప్రతాపరుద్రదేవు డేకశిలానగరమునగాకతీయ సింహాసనము నధిష్ఠించి యాంధ్రసామ్రాజ్యపట్టభద్రుఁడయ్యెను. కొన్నిప్రాచీన చరిత్రములయం దీతని రాజ్యాభిషేకముఁగూర్చియొక వింతగాథ గనవచ్చుచున్నది. రుద్రాంబ పురుషవేషమును బురుషనామమును ధరించుటయేగాక "రుద్రదేవమహారాజ"ను పేరిట సుద్వాహమగుటకై సత్కులసంజాతయగు నొక కన్యకనుఁగూడ రావించెనట. కొన్నిదినములకు బిమ్మట నీ సంగతిని గ్రహించియు, నాకన్యక యనుభవించుచుండిన యాశాభంగమును దుఃఖమును గాంచియు, పద్మనాయక వీరుడును సుప్రసిద్ధకాకతీయ సేనానియునగు ప్రసాదాదిత్యనాయకు, వేసారి వయసుగడచిన రుద్రాంబికను రాజ్యచ్యుతంజేసి, యామెమనుమడగు ప్రతాపరుద్రుని గాకతీయసింహాసనమున గూర్చుండ జేసెనట. తనరాజ్యకాలమున ప్రతాపరుద్రచక్రవర్తి పద్మనాయకులకొసంగిన ప్రత్యేక గౌరవమర్యాద లీగాథకు కొంతబలము నొసంగుచున్నవి. అయినను ప్రబలతరములగు ప్రమాణములు లభ్యములగువరకు నీ విషయమును విశ్వసింపవలసువడదు.

ప్రతాపరుద్రచక్రవర్తి రాజ్యాభిషిక్తుడయిన యనతి కాలమునకే యొకవిప్లవము జరగినటు లీకాలపుశాసనములనుండి తెలియుచున్నది. వానిలోనొకటి చక్రవర్తిసేనానులోనొకడగు "ఆదిదమ్మ"యను నాతడు నెల్లూరుపై దండెత్తి యాంధ్రచోడుని జంపెనని చెప్పుచున్నది. మఱియొక శాసనమునుండి యంబదేవుఁడను కాయస్థసామంతుడు మనుమగండ గోపాలునికి మిత్రుడని తెలియుచున్నది. ఈ రెండు విషయములను సమన్వయించినచో క్రీ. శ. 1296—98 ల నడుమ నంబదేవుని సాహాయ్యమున గాకతీయ సామంతుడగు మనుమగండ గోపాలుడు తిరుగుబాటుచేసెననియు నాదిద

156 Ins. Ced. Dist. No. 105.
157 E. R. 204 of 1899.
" 173 of 1905,
158 " 126 of 1897. నైజాంరాష్ట్రమున-కేసుమాల, మానూరు మున్నగు స్థలములగూడ నటులే క్రీ. శ. 1292—1296 నడుమ వేయబడిన శాసనములుగలవు.

మ్మసేనాని యావిప్లవము నణంచెననియు నూహింపనగుచున్నది.

ప్రతాపరుద్రచక్రవర్తి యాంధ్రసామ్రాజ్యాధినాథుడయిన సంవత్సరమున ఢిల్లీరాజ్యమున కల్లాయుద్దీను ఖిల్జీ యేలిక యయ్యెను. యౌవనమున నుండగనే యీతురుష్కరాజు క్రీ. శ. 1294 లో దేవగిరిపై దాడివెడలియాదవులను నిర్జించి యమూల్య ధనరాసులను సేకరించియుండెను సింహాసనమున నధిష్ఠించినపిమ్మట నీతనికి దక్షిణాపథమును జయించు నభిలాష జనించెను. తదనుసరణముగ నాతడు క్రీ. శ. 1303లో బహువిస్తృతమును, సస్యశ్యామలమును, బహుజనాకీర్ణమునగు నీభూభాగమును జయించుటకునై, వంగదేశమార్గమున నొకసైన్యము నంపియుండెను. కాని యీతురుష్కసైన్యము కళింగప్రాంతమున, గాంగవంశీయులచే నోడింపబడి ఢిల్లీకి మఱలవలసివచ్చెను.[159] దీనినిసరకుచేయక యనతికాలముననే యల్లాయుద్దీను మాలిక్ నాయబ్ కాఫర్ అను సేనానాయకుని విశేషబలములతో దక్షిణాపథమున కంపెను. ఇంతకుమున్నె క్రీ. శ. 1294 లో మహమ్మదీయులప్రభావమును జేవిచూచియున్న దేవగిరియాదవు లీసమయమున మహమ్మదీయుల కనేకవిధముల సాహాయ్య మొనర్చి యాత్మరక్షణ మొనర్చుకొనిరి. చారులచే నీయుపద్రవమునుగూర్చి దెలిసికొని ప్రతాపరుద్రచక్రవర్తి దనసేనానులలో నగ్రగణ్యులగు మేచయనాయకుడు, బెండపూడియన్నయ మయనాయకుడు, గుండయనాయకుడు, మామున్నగువారల నసంఖ్యాకములగు బలముల చయనాయనింగారు మున్నగు నాయకులతో నుత్తరదిశకుఁ బయనముచేసెను. ఈకాకతీయ సేనానాయకులు గోదావరీతీరమునకేగి, రేవులనెల్ల సంరక్షించి, తురుష్కులరాకకై యెదురుచూచుచుండిరి.[160] శత్రువులెప్పటికిని రాకుండుటచే వారు గోదావరీనదినిదాటి కొంతదూరమేగుసరికి మహాప్రళయమువలె నేతెంచుచుండిన యవనవాహిని వారికెదురయ్యెను. దానినిఁగాంచి యాంధ్రవీరులత్యుత్సాహమున బ్రతిఘటింప నొకఘోరసంగ్రామ మిరుపార్శ్వములవారికినిఁ జేరగెను. రుద్రమూర్తులై విజృంభించి శత్రుమారణ మొనర్చుచుండిన యాంధ్రుల ప్రతాపమునకుఁ దాళజాలక తురుష్కులు పలాయితులైరి.

ఈవిజయవార్త నాలకించి యేకశిలానగర పౌరులు నాంధ్రసామ్రాజ్యమంతయు నానందవార్ధి నోలలాడిరి. ఉత్తరమునకేగిన విజయసేనలింకను మఱలియుండలేదు. ఆంధ్రవిజయోత్సవములింకను ముగిసియుండలేదు. ఇంతలో దక్షిణమున గండికోటదుర్గప్రాంతముల నొకవిద్రోహము బయల్వెడలెను. ఇంతకుపూర్వము మనుమగండ గోపాలుని యొక వ్యాజముగనుంచుకొని తిరుగుబాటుచేసియుండిన త్రిపురాంతకాంబదేవులను కాయస్థసామంతులు చక్రవర్తి యేమఱియుండిన యీసమయమున మఱి యొకతూరి విజృంభించిరి. ఇంతలో నాంధ్రసైన్యము లుత్తరదిశనుండి రాజధానీనగరమునకు మఱలివచ్చుటచే చక్రవర్తి యాబలములను, సోగు మేచయనాయకుడు, బెండపూడియన్నయ మయనాయకుడు, గుండయనాయకుడు, మామున్నగువారల నసంఖ్యాకములగు బలముల చయనాయనింగారు మున్నగు నాయకులతో

---

159 ఆంధ్రులకును మహమ్మదీయులకును జరగిన యీసంగ్రామములను గూర్చి సప్రశంస మహమ్మదీయ చరిత్రకారులవ్రాతల యందును పత్రాపచరిత్రాదులందును గూడగలదు. పైరెండువిధములగు ప్రమాణములనుగూడ పక్షపాతముతో వ్రాయబడినవియే. గాననందలి నిజానిజముల నితరచారిత్రకాంశముల మూలముననే నిశ్చయింపవలసియున్నది.

160 కాకతీయసామ్రాజ్యము గోదావరి కావలగూడ విస్తరించియుండెను.

గండికోటకు బయనముచేసెను. పూర్వమువలెనే కాకతీయసైన్యములీ విద్రోహమునణంచి విజయలక్ష్మిని జేపట్టినవి. క్రీ. శ. 1303—4 లో జరిగిన యీసమరమునకుఁ బిమ్మట నంబదేవాదుల ప్రశంస గన్పింపకుండుటచే వారలీసమరమున సమసియుందురని యూహింప నగుచున్నది. ఆసంవత్సరమునకుఁ బిమ్మటగండికోటలోసోమయనాయకునిశాసనములు గన్పించుచుండుటయు, స్థానికచరిత్రములలో కాయస్థులు తిరుగుబాటుచేసిరని చెప్పబడియుండుటయు నీయూహను బలపఱచుచున్నవి.[161]

క్రీ. శ. 1304లో మఱియొక యుపద్రవముగూడ సంప్రాప్తమయ్యెను. తమకుఁ జన్మశత్రువులగు నాంధ్రులు యవనుల నవలీలగ నిర్జించి స్వేచ్ఛగనుండ తాముమాత్రము వాఱలకు లోబడియుండుటకు లజ్జించి దేవగిరియాదవులు క్రీ. శ. 1303 లో దాము ఢిల్లీసుల్తానుకు చెల్లింపవలసిన కప్పమును పంపుట మానివైచిరి. ఈయవిధేయతను దండించుటకై యల్లాఉద్దీను క్రీ. శ. 1390లో మాలిక్ కాఫర్‌ను మఱియొకతూరి దేవగిరిపైకంపెను. మహాశూరుఁడును, విజయకాంక్షియునగు నీసేనాని యాదవులను శిక్షించుటతోఁ దృప్తినొందక, తనపూర్వపరాజయ కళంకమును బాపుకొనుటకై యోరుగల్లు సామ్రాజ్యముపైగూడ దాడివెడలెను. నాల్గుమాసములైనను గడువకుండగనే క్లిష్టసమయమున నేతెంచిన యీద్వితీయ తురుష్క దండయాత్రాసమాచారము నాలకించి యాంధ్రులు విస్మితులైరి. అయినను సహజమగు ధైర్యమునువీడక ప్రతాపరుద్రచక్రవర్తి రాజధానీనగరమున నితరప్రాంతములనుండిన సేనలను ప్రోత్సహించి శత్రుసంహారమునకుఁ బురికొల్పెను. అంత నాంధ్రబలము లత్యుత్సాహముతో నుత్తరమునకేగి సరిహద్దులను దాటుసరికి మహమ్మదీయులు ప్రత్యక్షమైరి. ఏమఱిపాటున నాంధ్రులపై బడి నుఱుమాడి సునాయాసముగ విజయమునందు ధైర్యముతో నేతెంచుచుండిన తురుష్కసైన్యముల నొక్కసారిగ మార్కొని, చక్రవర్తినుడివిన యుత్సాహవాక్యములను స్మరించుకొనుచు, స్వదేశసంరక్షణార్థమై యాంధ్రవీరులు బాణములకు తెగించి పోరుచు, శత్రువులను చిందరవందర చేయసాగిరి. చేయునదిలేక మాలిక్ కాఫర్ హతశేషులగు వారలతో యుద్ధమునుండి విరమించి దేవగిరిమార్గమునుబట్టెను.[162]

ఈద్వితీయవిజయ మాంధ్రులకుఁ బూర్వాధికసంతోషము నొసగూర్చెను. చక్రవర్తియు నితరులునుగూడ నింతటితోనాంధ్రులకుఁ దురుష్కులపీడ తొలగిపోయెననితలంచిరి. విద్రోహములెల్లనమూలముగ నిర్మూలింపబడియుండినవి. గానసీవిజయమునకుఁ బిమ్మట నాంధ్రసామ్రాజ్యమునకునూతనోత్సాహ ముదయించెను. శాంతిసౌఖ్యములెల్లెడలనుఁ బ్రబలినవి ప్రజలు తమతమ కార్యముల నుత్సాహముతో నిర్వర్తించుకొనుచుండిరి. ఈసమయమునఁ జక్రవర్తికించుక విశ్రాంతికలిగెను. మహావిద్వాంసుడును,

---

161 Local Records— 'Gandikota.'

162 మహమ్మదీయులీసమయమునఁ దమకేవిజయముసంప్రాప్తమయ్యెనని వ్రాసియున్నారు. అదియేనిజమైనచో నాంధ్రసామ్రాజ్య మీసంవత్సరముననే గూలియుండవలసినది. గాన నీయుద్ధసందర్భమునఁ బ్రతాపచరిత్రమే విశ్వసనీయముగ గన్పడుచున్నది.

ప్రాజ్ఞుడునగు నీతడుకాలమును వ్యర్థముచేయక వైజ్ఞానికాభివృద్ధికై పాటుపడ నారంభించెను. కత్తి చేఁబట్టి యుద్ధరంగమునఁ బ్రవేశించి శత్రు లలాటములపై విజయాక్షరములను లిఖించి యుండిన యాంధ్రవీరు లీసమయమున రుధిరార్ద్రములగు నాయుధములకించుక విశ్రాంతినొసంగి, కలమునుచేపట్టి సాహితీరంగమునం ద ద్వితీయనైపుణిఁబ్రదర్శించి యపూర్వవిజయముల నందసాగిరి. జాతిమతవయోభేదముల నెంచేక నెల్లరును శారదోపాసన మొనర్చుచుండ, శిల్పనాట్యాది కళావిశేషములును, వేదాంత జ్యోతిషాదిశాస్త్రములును, కావ్యనాటకాది సారస్వతాంగములును విశేషాభివృద్ధినందినవి. సంస్కృతాంధ్రకవులనేకులు చక్రవర్తి యాస్థానమునఁజేరి యాతని గౌరవమర్యాదలనంది యనేక గ్రంథరాజములను రచించుచుండిరి. గణపతిదేవ చక్రవర్తికాలమున విశ్వేశ్వర శివాచార్యునిచే నలంకరింపబడియుండిన విద్యామంటప మనేక కవిప్రవరులచేఁ గ్రిక్కిరిసియుండ, నిరంతరమునువిద్యావ్యాసంగములచ్చటఁ జరగుచుండెను. విజయనగరాధీశుఁడగు కృష్ణరాయలవలెనే ప్రతాపరుద్రచక్రవర్తియు నీవ్యాసంగములందు పాల్గొని సహజపాండిత్యమును రసజ్ఞతనుజూపుచు, గుణాగుణనిర్ణయ మొనర్చుచు ననేకవిధముల నన్నివిద్యల నాదరించుచుండెను.

ఇటు లాంధ్రసామ్రాజ్యమంతయు విద్యావ్యాసంగమునమునిగియుండి, కలనైనను శత్రుపీడయనుదానినిగాంచి యెఱుంగకుండిన సమయమున నుత్తరదిశనుండి యొకయుకాలప్రళయ మాసన్నమగుచుండెను. దక్షిణాపద విజయకాంక్షాపీడితుఁడగు నల్లాయుద్దీనకు వరుసగ రెండుపర్యాయములు తనసైన్యము లాంధ్రులచే పరాభవింపబడుట యధైర్యము నొందవజేయుటకుమారుగ నధికోత్సాహమును గలిగించి కార్యదీక్షను శతాధికమొనరించినది. దీనికి దేవగిరిరాజుల కుట్రలనేకవిధముల తోడ్పడినవి. తమకాజన్మశత్రువులగు నాంధ్రులు స్వతంత్రముగనుండుటయు, తురుష్కుల ననేకమారులు నిర్జించుటయు, దామునిరంతరము యవనుల బారికి గురియగుచు వారలకు దాస్యము చేయవలసి వచ్చుటయుఁ గాంచి యసూయనంది దమశత్రువులను గూడ దామనుభవించుచుండిన దుస్థికిఁ బాల్పడచేయు నుద్దేశ్యముతో నాంధ్రులు విద్యాకలాపమున మునిగియేమఱియుండిన సమాచారము నతిత్వరితముగ యాదవులు సుల్తానున కెఱింగించిరి. సమయమునకై వెదకుచుండిన యల్లాయుద్దీ నీ వార్తనాలకించి మహోత్సాహమునంది, తనబలములనెల్ల రావించి, వారల నధికముగఁ బ్రోత్సహించి, క్రీ. శ. 1309 లో మాలిక్ నాయబ్ కాఫర్‌ను వాని కధిపతిఁజేసి తెలింగానాపై దండుపంపెను. ఈ తృతీయ మహమ్మదీయ దండయాత్రను 'అమీర్ ఖుస్రూ' యను తురుష్క చరిత్రకారుడీక్రింది విధమున వర్ణించి యున్నాడు.[163]

"మంత్రియగు మాలిక్ కాఫరు తెలింగానాపై దండువెడలెను. అతని సైన్యములు మజిలీల వెంబడి ప్రయాణము చేయుచు, మసూద్ పురమున రెండుదినములు విశ్రమించి యరణ్యముల తోడను, విషమశిలాపరివృత పర్వతములతోడను నిండి యుండిన దుర్గమ ప్రదేశముల నతికష్టముతో నరకయాతననుభవించుచుఁ దాటి, యాఱునెనము

163 Elliot & Dowton—History of India Vol III. P. 81.

లలో సుల్తానుపురమునఁ జేరినవి. అచ్చట నాలుగు దినములుండి, పదుమూడుదినముల లో ఖందర్‌నగరమున కేతెంచి తురుష్కులట నొకపక్షమువరకును విశ్రమించిరి. ప్రళయమారుతమువలె చెలరేగి సర్వనాశన మొనర్చుచు, పర్వతముల నధిరోహించి నదుల నతిక్రమించి యేతెంచుచుండిన యీసైన్యములకు నర్మదానది యొక జలప్రళయము వలె గన్పట్టెను. దానిని దాటిన యెనిమిది దినములకు మహమ్మదీయులు దేవగిరిరాజ్యములోని నీలకంఠ్ అను పట్టణమునుచేరిరి. అచ్చట రెండు దినములు మాత్రముండి తమ యాత్రనుసాగించి పూర్వాధికములగు కష్టములకులోనై వారలాధ్రిదేశపు సరిహద్దుననున్న శిరిపురమును గాంచిరి. ఇచ్చటఁ దురుష్కులు విజృంభించి యథేచ్ఛముగ జనులను హింసించియు, గృహములను సస్యములనుఁ గాల్చియు, శిరిపురదుర్గమును జయించిరి. అట నుండి మూడుదినములలో కునర్పాల్ దుర్గమున జేరి యటుపై నోరుగల్లు మార్గమునుఁబట్టిరి. ఆనగరము సమీపించిన పిమ్మట మాలిక్ కాఫరు యిర్వురు సేనానులను నలుబదిమంది విలుకాండ్రతో ననుమకొండకేగి పరిస్థితులను గమనించి వచ్చుటకై నియమించెను. అటుపై ననతి కాలముననే తురుష్కులాపట్టణమున విడిసిఁ యోరుగల్లును ముట్టడించిరి.

ఓరుగల్లు దుర్గపుబహిఃప్రాకారము మృన్నిర్మితమే యయినను యవనుల యుక్కుబల్లెములకు సహితము లొంగనంతటి బలిష్ఠముగ నుండెను. వారి యాగ్నేయాస్త్రముల నుండి నిర్గమించిన లోహగోళము లాగోడలకుఁ దగిలి తిరిగి వారిసైన్యములవంకకే ప్రతినిర్గతములగు చుండెడివి. రాత్రిభాగమున నేమఱుపాటున దుర్గము నన్నివైపులనుండియు నొకేసారిగ ముట్టడింప వీలగురీతిని, హిందూసైనికుల యాగ్నేయాస్త్రములకుఁదనవారలు గుఱికాకుండు విధమునను, తురుష్కసైన్యములు వేర్వేఱుస్థలములలోనుండునటులేనేర్పాటుచేయబడెను. ప్రధానసేనానాయకుని శిబిర మోరుగల్లు దుర్గప్రధాన ద్వారమున కెదురుగఁ గల్పింపబడ నితరశిబిరములు సూదిమొనదూర్చుటకైన నెడములేనంతటి దగ్గరగ దుర్గముచుట్టును వేయబడియుండినవి. 12546 గజముల చుట్టుకొలతగల యాదుర్గము చుట్టునుండిన ప్రదేశమున 1200 గజముల కొక విభాగమువంతునఁ దురుష్కబలము లేర్పఱుపబడినవి. పరిసర ప్రాంతములందుండిన వృక్షములనెల్ల గూల్చియవనులు తమశిబిరముల చుట్టు నొకకంపగోట నిర్మించుకొనిరి. రాత్రివేళ 'బనక్ దేవ్' అనునాతడు కతిపయ హిందూబలముతోఁ దురుష్క శిబిరమునఁ బ్రవేశించి యుద్ధముచేయ శత్రులాతనిని ససైన్యముగఁ బరిమార్చిరి. తెల్లవారినతోడనే యుద్ధము ప్రారంభింపబడెను.

మాలిక్ కాఫరు నాజ్ఞ ననుసరించి తురుష్కులు తమయగ్నిగోళములను దుర్గాంతరమునకంప మొదలిడిరి. మఱికొందరు కోటబురుజులను మించెడి యౌన్నత్యముగల కర్రమంచెలను నిర్మించి, వానినుండి శతఘ్నులఁ బ్రయోగించి శత్రువులను హింసింప,నితరులు మట్టినిబోసి కోటగోడనంటియుండిన యగాధమగు కందకమును పూడ్ప యత్నించుచుండిరి. పిమ్మట వారలు బండరాళ్ళతో భేదించి దుర్గద్వారమును స్వాధీనము చేసికొనిరి. రంజాను నెల 11 వ రోజున దురుష్కులు హిందువులు

తమపై కురిపించుచుండిన శిలావర్షమును లెక్కసేయక తామింతకుఁబూర్వమే సిద్ధపఱచికొనియుండిన నిచ్చెనలపై కోటగోడ కెగబ్రాకి, మూడుదినములు హోరాహోరిగఁబోరి, మట్టిగోడను మూడు బురుజులను స్వాధీన మొనర్చుకొనిరి. అటుపై వారికి యగాధమగు కందకముచే నావరింపబడినయొక శిలాప్రాకారము గన్పించెను. అయినను వెనుదీయక వార లమితోత్సాహముతో నాకందకము నీది రాతిగోడ నెగఁబ్రాకి యతిశౌర్యముఁజూపి శిలాప్రాకారముపై నుండిన యొకబురుజు నాక్రమించిరి. దీనిని జూచి విగతధైర్యుడై లడ్డర్ దేవుడు[164] తురుష్కనాయకునితో సంధియొనర్చుటకై రాయబారమునంపెను. తాను వారికి లోబడుట కొప్పుకొని యారాజు బంగారముతో నిర్మింపబడిన తన ప్రతిమకు మెడచుట్టు నొక స్వర్ణ శృంఖలమునుంచి వారికడకంపెను. తురుష్కసేనాని యంతటితోఁ దృప్తినందక రాయలు తన సర్వస్వమునుఁ దురుష్కులకీయవలెనని యాజ్ఞాపించెను. చేయునదిలేక రాయలు రాత్రియంతయు శ్రమపడి యనేక ధనరాసులను సేకరించి యుదయమున గుర్రములు నేనుఁగులు మున్నగువానితో వానిని మాలిక్ కాఫర్ నొద్దకుఁ బంపించెను. పిమ్మట రాయలు ప్రతివత్సరమును జి జి యా పన్ను నిచ్చునటు లేర్పాటుచేసి యాతడు తన్నుమోసగింపకఁ దనసర్వస్వము నర్పించెనని రూఢిచేసికొ క్రీ. శ. 1310. సంవత్సరము మార్చినెల 16వ తారీఖున పదివేలలొట్టిపిట్టలు మోయలేక మోయుచుండునంతటి ధనమును వెంటబెట్టుకొని మాలిక్ కాఫరు ఓరుగల్లునుండి బయనమయ్యెను."

పై నుదహరింపబడిన మహమ్మదీయ చరిత్రకారుని వర్ణనమునుండి యనేకనూత్నాంశములు తెలియవచ్చుచున్నవి. అందలి దుర్గప్రశంసనుండియు, దానిని వశపఱచుకొనుటకై తురుష్కులొందిన శ్రమనుండియు, తాత్కాలికాంధ్రుల దుర్గనిర్మాణకౌశలము విదితమగుచున్నది. మహమ్మదీయులు శతఘ్నులను, రాళ్ళనువిసరుమంచెల నుపయోగించుచుండ, నాంధ్రులు ధనుస్సులతోడను రాళ్ళతోడనుఁబోరియుండిరి. దీనినుండి యుద్ధసాధనము లవిషయమునఁ దురుష్కులే బ్రబలముగనుండిరని తెలియుచున్నది. ప్రతాపరుద్రచక్రవర్తి వారికొసంగిన ధనరాసులును, వారియెడఁజూపిన విధేయతయు మహమ్మదీయ చరిత్రకారుడు పేర్కొనినంతటి మహత్తరములుగ నుండియుండకుండినను, ఆంధ్రులేమఱిపాటునఁ దమపై బడి, ప్రాణములకుఁ దెగించి యమితోత్సాహముతో పోరుచుండిన తురుష్కులదాడి కోర్వఁజాలక, దుర్గాంతరమునఁ బంధింపబడియుండి, వెలుపలనుండినవారి సాహాయ్యమునంద నశక్తులై, గత్యంతరములేక మహమ్మదీయులతో సంధి చేసికొనినమాట వాస్తవము. దేవగిరిరాజగు రామచంద్రునివలెనే ప్రతాపరుద్ర చక్రవర్తి గూడ దాత్కాలికశాంతికొఱకై కొంతద్రవ్యమును మాలిక్ కాఫరునకొసంగి, సంధిచేసికొనెను. ఇందుకుఁ బ్రతికూలములుగనున్న ప్రతాపచరిత్రాదు లీవిషయమున విశ్వసింపఁదగినవికావు.

ప్రతాపరుద్రదేవు డుత్తరమునఁ దురుష్కులతో సంధిచేసికొని విశ్వప్రయత్నమొనర్చి వారిని బంపివైచి యాంధ్రసామ్రాజ్యమున కాలప్రళయమునుండి రక్షించుచుండిన సమ

164 తురుష్కులు ప్రతాపరుద్రుని 'లడ్డర్ దేవ్' అని పేర్కొనిరి.

యమున దక్షిణదిశనుండి యొక కష్టమాన్నమ యెను. క్రీ. శ. 1311 లో పాండ్యులు కాంచీపురముపై దాడివెడలి యచ్చటి కాకతీయ సామంతుఁడగు వీరగండ గోపాలునిఁ దఱిమి యానగరము నాక్రమించిరి. రుద్రాంబిక కాలమునుండియు నాంధ్రులకు లోబడియుండిన యానగర మన్యాక్రాంతమగుటకోర్వజాలక చక్రవర్తి పద్మనాయకసేనానులలో సుప్రసిద్ధుడగు నెఱ్ఱదాచానాయనిఁ బాండ్యుల గర్వమణంచుటకై దక్షిణమున కంపెను. ఈసేనాని మహాపౌరుష పరాక్రమములజూపి పాండ్యులనోడించి వారల స్వర్ణసింహాసనమును, అఱచేతి ప్రమాణముఁగల యొకపచ్చను గైకొని, యేకశిలానగరమునకు మఱలి విజయలక్ష్మితో బాటు వానినిఁగూడ దన యేలికకు సమర్పించెను. దీనికి మెచ్చి చక్రవర్తి యెఱ్ఱదాచానాయనికి "పంచపాండ్యదళవిఫాల" "కాంచీకవాటచూఱకాఱ" యను బిరుదమొల నొసంగి విశేషముగ గౌరవించెను.[165] ఈకాంచీపుర దండయాత్రలో నిందులూరి రుద్రదేవుడు గూడ బాల్గొనెను.[166]

క్రీ. శ. 1313 సంవత్సరము నాటికి దేశము నందంతటను శాంతి నెలకొల్పబడియెను. విశ్వసనీయులగు ప్రతినిధులు సరిహద్దులనెల్ల గాపాడుచుండిరి. చక్రవర్తి తురుష్కుల కెక్కుడుధనము నొసంగియుండుటచేతను, వరుసగనుద్భవించిన సామంతవిప్లవముల నణంచుటకు విశేష ధనము వ్యయమయియుండుటచేతను, సామ్రాజ్యకోశము నీరసించెను. శత్రుపీడితులై యుద్ధములచే నలజడిపడియుండిన ప్రజలను సుంకములను వృద్ధిచేసి యధికముగ బాధించుటకు బ్రతాపరుద్రచక్రవర్తికి మనమొప్పకుండెను. సామ్రాజ్యపుటార్థికస్థితిని, దనకోశాగారమును యెటులనభివృద్ధి చేసికొనవలెనో నిశ్చయింపజాలక చక్రవర్తి డోలాయమానమానసుఁడై యున్నసందర్భమున దక్షిణభాగమున రెండువిపరీతములు జేరిగినవి. పాండ్యుల పీడవదలినను కాంచీనగరమున కింకొక సంకటము సంభవించెను. కేరళదేశపాలకుడగు రవివర్మయనునాతడా నగరమునుముట్టడించి వీరగండగోపాలునిఁ దఱిమి కంచినాక్రమించెను. ఇదేసమయమునఁ జక్రవర్తి యితరజాతుల వారినిఁద్రోసిపుచ్చి పద్మనాయకులనే రాజ్యాంగని యోగముల కధికారులుగ నియమించుటచే, గినుకవహించి తమకువైరులగు వెలమలయెడను, వారినాదరించి దమ్మునవమానపరచిన చక్రవర్తియెడనుఁ బగదీర్చుకొనుటకై యన్నమరెడ్డిమున్నగు రెడ్డిసామంతులు గండికోటదుర్గమునఁజేరి కాయస్థులను, వడ్డిరాజుల నుద్బోధించి యొకప్రబల విద్రోహము నొనగూర్చిరి. క్రీ. శ. 1313 వఱకును గండికోటలో సోమయనాయకుని శాసనములుండుటచేతను, 1315 నుండియు నచ్చట గొంకారెడ్డి రాజప్రతినిధిగ నుండుటచేత[167] నీవిప్లవము క్రీ. శ. 1314లో జేరగెనని తెలియుచున్నది. ఇటులొకేసారిగ నుద్భవించిన యీ రెండుసమస్యలను జక్రవర్తి యతిశ్రీఘ్రముగను చక్కని దూరదృష్టితోడను, బరిష్కరించెను. పాకనాటికధిపతిగనుం

165 "సింగభూపాలీయ" మునందును, ప్రాచీనచరిత్రము లందు నీవిషయము గాంచనగుచున్నది.

166 గీ॥ వీరమారవసుందర విక్రమేశ, బల్లహుఁ నాదగిన పంచపాండ్యరాయ
మానమర్దనుండయ్యె బ్రహ్మణ్యరాజు, భద్రవిభవుండు నన్నయ రుద్రవిభుడు॥
(శివయోగసారము)

167 cf. L. R. Gandikota.

డిన మహావీరుడగు ముప్పిడినాయకునిఁ గాంచీ నగరముకేగ నియమించి తాను స్వయముగ గండికోటపై కేగెను. అచ్చటి విప్లవమును సత్వరముగ నుపశమింపజేసి ప్రతాప రుద్రదేవు డనేకములగు సంస్కరణముల నా ప్రదేశము నందొనర్చెను. సామ్రాజ్య దక్షిణదిశను బలపఱచుకొనుటకును, దనయార్థికస్థితి నభివృద్ధి జేసికొనుటకును గూడ చక్రవర్తి కిందుమూలమున నవకాశ మేర్పడెను. రాజాజ్ఞచే ప్రకృత కడప కర్నూలు మండలము లందలి యడవులన్నియు నిర్మూలింపబడి యచ్చటి భూమి గృషి యోగ్యముగ నొనర్పబడినది. సామ్రాజ్యమునందలి వివిధ భాగములనుండి జను లనేకులిటకు వలసవచ్చి, చక్రవర్తిచే వృత్తులను బడసి యనేకములగు గ్రామములను నిర్మించిరి. అపుడు బ్రతాపరుద్రదేవుడు విశ్వసనీయులగు వారలను రాజధానినుండి రావించి వారి నీప్రాంతమున కధిపతులుగ నియమించెను. [168] ఇట్టి వారిలో అనుమకొండ అన్నవెంక, విజెము రుద్రయ మున్నగువారు ముఖ్యులు. [169] ఇదే సమయమున దక్షిణము కేగిన ముప్పిడి నాయకుడు కేరళ రవివర్మను జయించి, కాంచీనగరమును స్వాధీనము చేసికొని, యాంధ్రచోడ వంశీయుడగు మానవీరు నటరాజ ప్రతినిధిగ నెలకొల్పెను. [170]

ఈవిజయమునకు బిమ్మట జక్రవర్తి పుణ్యక్షేత్రములను దర్శింపనేగెను. ప్రాచీనవంశ చరిత్రలును, స్థానికచరిత్రములునుగూడ నీవిషయమును బేర్కొనుచున్నవి. శ్రీశైలత్రిపురాంతకాదియాంధ్రభూములను జూచి, యటుపై నీచక్రవర్తి దక్షిణదేశమున కాంచికేగి, యటనుండి శ్రీరంగజంబుకేశ్వరముల వరకును గూడ నేగెను. జంబుకేశ్వరము నందలి శివాలయములో నొక శాసనమున నేకశిలాపుర పాలకుడగు బ్రతాపరుద్రదేవుడు ప్రశంసింపబడియున్నాడు. ఇతరవిషయములుగల యందలిభాగము గోడలోని కమిడ్చబడియున్నది. ఈప్రశంసనుబట్టి గాకతీయచక్రవర్తి యింతవరకును వచ్చియుండెనని యూహించుటకు దాత్కాలిక దక్షిణదేశపరిస్థితు లవకాశము నొసంగుచున్నవి. అప్పటికాప్రాంతమున బ్రబలురగు బ్రత్యర్థు లెవ్వరును లేకుండిరి. చోళ రాజులప్రతిభ క్షీణించి వార లదృశ్యులైరి. పల్లవరాజగు కొప్పెరుంజింగడు మరణించెను. పాండ్యులలో జటావర్మన్ సుందరుని దరువాతవచ్చినవారలు దుర్బలులై యుండిరి. ఈకారణమునుబట్టి ప్రతాపరుద్రదేవుడు జంబుకేశ్వరమున దన విజయధ్వజమును నాటెననియే యూహింపవచ్చును. ఈసందర్భము నందీతడు బ్రకృతమైసూరు రాజ్యమునందలి గొన్నిభాగములందు గూడ వీరవిహారమొనర్చెనని తెలియుచున్నది. అందలి తుంకూరు తాలూకాలోని యొకశాసనమునందు, నవలక్షధనుర్ధరాధీశ్వరుడును, మహారాష్ట్రకళింగ సౌరాష్ట్రఘూర్జరవరహాటకర్ణాట ద్రవిడతుళుదేశములను జయించినవాడునగు గాకతీయ ప్రతాపరుద్రదేవుడు, శివగంగపర్వతాగ్రమున కేగి యచ్చట బుణ్యోదకమున స్నానాదికము

168 Karnul Dt. Manual, Sec 3.
కర్నూలు మండల చరిత్రము, కిమ్మూరు కైఫీయతు,

169 నైజాంరాష్ట్రములోని మానూరు గ్రామమునందలి యొక శాసనమున వీరిప్రశంస గలదు.

170 E. P. Ind. VII లోని అరులల్ పెరుమాళ్ శాసనము.

నొనర్చి, యనంతపురమను గ్రామము నగ్రహారముగ దానమొసంగెనని, చెప్పబడియున్నది.[171] ప్రాచీనచరిత్రములు బ్రతాపరుద్రదేవుడు తీర్థయాత్రావ్యాజమున రామేశ్వరమువఱకు నేగెనని చెప్పుచున్నవిగాని, యట్లనుటకితర ప్రమాణములేమియు గానరావు. ఇంతవరకును బేర్కొనిన విషయములనుండి చక్రవర్తిజేసిన యీసంచారము కేవలమామోదస్మికబుద్ధిచేతనేగాదనియు, దన్మూలమున సామ్రాజ్యమునంతటి నొక్కసారి బరిశీలించి, వలయుచోట్ల కట్టుదిట్టములను జేసికొని, యథాసాధ్యముగ ధనము సుపార్జించుకొనుట గూడ నాతని ముఖ్యోద్దేశ్యమనియు స్పష్టమగుచున్నది.

"కోయి లొలుగు" అను ద్రవిడకావ్యమునుండి యీకాలమున జరగిన మఱియొక ముఖ్యవిషయము దెలియుచున్నది. 1314_15 ప్రాంతముల ఒరిస్సాపాలకుడగు కపిలేంద్రగజపతియాంధ్రదేశముపై దాడివెడలి యేకశిలానగరమును ముట్టడించెనట. కాని దీనివలని యుపద్రవములేమియు గలుగలేదు. రాజభక్తిపరాయణులును, శౌర్యధనులు నగు గాకతీయాంధ్రయోధులీయోధ్రుల నతిసులభముగ దఱిమియుందురు. 'కాకతీయరాజ్యప్రతిష్ఠాపక' 'రాయబందీవిమోచక' మున్నగు బిరుదములు గలవారలు దేవరినాయనింగారు మేచయనాయనింగారు మున్నగు సేనాను లనేకులు బ్రతాపరుద్రదేవుని కొలువునందుండిరి.[172] క్రీ. శ. 1318 నాటికి చక్రవర్తి రాజధానికి మరలియుండెను. ఈసంవత్సరము కాకతీయచరిత్రమున నాంధ్రదేశచరిత్రమునను గూడ మిక్కిలి ప్రతిభావంతమైనది. ఎల్లెడల నాంధ్రులు విజయమునందిరి. సామ్రాజ్యమున విద్యలును గళలు నభివృద్ధి నందుచుండినవి. మఱిరెండు వత్సరములలో నాంధ్రులు గర్ణాటకులను సహితమరికట్టిరి. అదియెట్లన[173] క్రీ. శ. 1319_20 ప్రాంతముల కాకతీయ సామ్రాజ్యపు దక్షిణదిశనున్న కంపిల రాజ్యమును రామనాథరాయు లేలుచుండెను. అతని తనయుడగు గుమారరాముడు నిర్వక్రపరాక్రముడై సోరగల్లు, బాదామి, హెనగల్లు, మున్నగు దుర్గములను జయించి, హొయసల రాజగు మూడవ బల్లాలుని ముప్పు తిప్పల బెట్టుచుండెను. అంతటితో దృప్తినొందక హొయసల రాజ్యమును సమూలముగ జయించు నుద్దేశ్యముతో గుమారరాముడు బ్రతాపరుద్ర చక్రవర్తి సాహాయ్యము నభ్యర్థించుచు రాయభారమంపెను. ఈ జైత్రయాత్ర యక్రమమగుట వలనను, హొయిసలులు దనకు మిత్రులగుటచేతను బ్రతాపరుద్రదేవుడీ యభ్యర్థనమును నిరాకరించెను. అంతనా గంపిల రాజపుత్రుడు కాకతీయదుర్గమగు ముద్గల్లును ముట్టడించియు, "వీరరుద్రనగండ" "మూరు రాయరగండ" మున్నగు బిరుదములను గల్పించుకొనియు, నాంధ్రదేశాధీశ్వరు నవమానించెను. ఈయవినయతను శిక్షించుటకై జక్రవర్తి పద్మనాయకసేనానియగు రేచర్ల సింగమనాయకుని, మంత్రిశేఖరుడగు బెండపూడి యన్నామాత్యుని, గంపిల

171 E. P. Carn. Vol. XII. P. 4

172 E. R. No. 72 of 1929 – 30

173 Q. J. M. S. XX. Pt. 2, 3, 4 లోని "కుమార రామనచరిత్రె" యను గన్నడగ్రంథము నుండి యీవిషయ మెఱుంగనగుచున్నది.

కంపెను. 174 అటజరగిన యుద్ధమున గంపిల బలములకే విజయము గల్గినను, దధీశుడగు గుమారరాముడు సింగమనాయకునితో సంధిచేసికొని యాతనికి 6000 గుఱ్ఱముల నిచ్చెనట. ఈవిషయము విశ్వసనీయముగ గన్పడదు. విజయమునందిన వారలు సంధిచేసికొనుట యాచారముగాదు. అందునను గుమార రాముని వంటి మహాశూరున కదియుచితముగాదు. నిర్జితులువిజేతలకు గాన్కలొసంగుదురుగాని, దామే వానిని బరిగ్రహించుటయదు. అదియును గాక బ్రతాపరుద్రునిపై నంతటి క్రోధమును బూనిన రాముడు సమరజయి యైనచో నాంధ్రసామ్రాజ్యమున విశేష భాగమునుగూడ జయించియేయుండును. అతడటు చేయకుండుట యటుండ, క్రీ. శ. 1310 వరకు నెన్నియో స్థలముల నాక్రమించిన యాతడీ సంవత్సరమునుండి క్రీ. శ. 1327 వరకు, సనగా గాకతీయసామ్రాజ్య మస్తమించిన నాలుగు సంవత్సరములవరకునుగూడ నిర్వ్యాపారుడై యుండెను ఈ కారణములను బట్టి పై యుద్ధమునం దాంధ్రుల కేవిజయము సిద్ధించెనని స్పష్టమగుచున్నది.

క్రీ. శ. 1320 లో నాంధ్రసామ్రాజ్య నాశమున కంకురార్పణ మొనర్పబడెను. కంపిలపై కేగిన సైన్యము లింకను మరలియుండలేదు. చక్రవర్తియు బ్రజలునుగూడ నీ కర్ణాటక విజయోన్మత్తులై నిర్భయులై యుండిరి. ఇంతలో నుల్కవలె నుత్తరమునుండి మహమ్మదీయులు దండెత్తి వచ్చుచుండిరను వార్త వినవయ్యెను. రాజధానీనగరమునందుండిన బలములను జక్రవర్తి యుద్ధమునకై సిద్ధముజేయు చుండుసమయమున దక్షిణదిశనుండి ప్రోలయవేమారెడ్డి మున్నగువారలు ధరణికోటకేగి, స్వాతంత్ర్యము బ్రకటించి రను దుర్వార్త యేతెంచెను. ఇయ్యది ప్రతాపరుద్రదేవుడు పద్మనాయకుల యెడజూపినపక్షపాతమునకును, దమకు గండికోటలో నొనర్చిన పరాభవమునకును రెట్లొనర్చిన బ్రతీకారము అతిశీఘ్రముగ జక్రవర్తి కొన్ని సైన్యములను ధరణికోటకు బంపెను. కాని ప్రోలయవేముడీ బలములను సులభముగ నిర్జించి వినకొండదుర్గమును జేరి పరిసరప్రాంతముల నాక్రమించి యధికారము జేయసాగెను.

ఈసమయమునం దాంధ్రుల మనోబలము లుత్తరదిశను కేంద్రీకరింపబడినవి. ఏమఱిపాటున నొక్కుమ్మడిగ బయల్వెడలిన మహమ్మదీయప్రళయవాహినినెదుర్కొనుటకే యెల్లరును బ్రయత్నించుచుండిరి. ఇంతకు ముందు క్రీ శ. 1309 లో దురుష్కుల తృతీయదండయాత్ర జరగినది. నాటినుండి క్రీ. శ. 1320 వరకును గల కాలమున ఢిల్లీరాజ్యమునందెన్నియో మార్పులు జరగినవి. 1316 లో అల్లాఉద్దీన్ మరణింప, నాతనిసేనానాయకుడుగ నుండి దక్షిణదేశమును జయించిన మాలిక్ కాఫర్ విజయగర్వాంధుడై ఢిల్లీసింహాసనము నాక్రమింపయత్నించి, తుదకు నిహతుడయ్యెను. అటుపిమ్మట ముబారక్ ఖిల్జీ రాజ్యమునకువచ్చి 1320 లో హత్యచేయబడెను. ఆతనివెనక

---

174 శ్రీనాథుడు భీమఖండోపోద్ఘాతమునందు యన్నమంత్రిని

"ఘాటివిసుటిత కృష్ణటోద్యాను దనగ
యవన సంహారవిలయ కాలాగ్నియనగ
.....
నతుల బలశీలి పోలయయన్నశౌరి" యని బ్రశంసించి యున్నాడు.

'ఖుస్రూఖాన్' అను సామంతుడు 'ఘాజీబేగ్ టుగ్లక్' అను నామముతో సింహాసనమధిష్ఠించెను. అనతికాలమునకే యీసుల్తాను తన జ్యేష్ఠపుత్రుడగు 'అలుఫ్‌ఖాన్'ను తెలింగాణమును జయించుటకై దక్షిణదిశ కంపెను. కాకతీయాంధ్రసామ్రాజ్యమును నిర్మూలించి, దక్షిణహిందూదేశస్వాతంత్ర్యమును భంగపఱచిన యీతురుష్కదండయాత్రను జియాఉద్దీన్ బారనీ యను మహమ్మదీయచరిత్రకారుడీ క్రిందివిధమున వర్ణించియున్నాడు.[175]

"సుల్తానువలని భయముచేతను, ఉల్లుఖానుని పౌరుషపరాక్రమములను వినియు, భీతులై, లడ్డర్‌దేవ్ మున్నగువారలు రాజధానీ నగరమునకు బఱ్ఱెడి యందు దాగికొనిరి. తురుష్కులు ఓరుగల్లు దుర్గపుమట్టిగోడను ముట్టడించిరి. ఉల్లుఖాను దేశమును దోచియు, ప్రజలను బీడించియు, రాష్ట్రమునల్లరిచేయుడని తనసైనికుల కాజ్ఞాపించెను. అనేకమంది హిందువులు మట్టిగోడను, శిలాప్రాకారమును రక్షించుచుండిరి. కాని తురుష్కుల ప్రతాపమునకు దాళజాలక వారిలో ననేకులు సమసిరి. మట్టిగోడ తురుష్కులచే నాక్రమింపబడినవెంటనే లడ్డర్‌దేవుడు సంధికై రాయభారము నంపెను. కాని ఉల్లుఖాను డందుల కంగీకింపక దుర్గమును రాయలనుగూడ స్వాధీనముచేసికొన నిశ్చయించుకొని, యుద్ధమును సాగించెను. ఈసమయమునం దురుష్కశిబిరమునందొక కలవరము జనించెను. తాను ఢిల్లీనుండి బయల్వెడలినప్పటినుండియు నచ్చటి సమాచారము లేవియు నీతురుష్కసేనా నాయకునికి దెలియవయ్యెను. అట్టిసమయమున సుల్తాను కాలముచేసెననియు, నోరుగల్లును ముట్టడించుచుండినసైన్యములు నిస్సహాయములైనవనియు నొకప్రబలమగువదంతి బయల్వెడలెను. దీనికి మహమ్మదీయనాయకుల పరస్పర కలహములు తోడగుటచే తురుష్కసైన్యము లొక్కసారిగ చెల్లాచెదరైనవి. చేయునదిలేక వారినాయకుఁడును ఢిల్లీమార్గమును బట్టెను. దైవికమగు నీప్రతిహతమునకు సంతసించి యాంధ్రులు దుర్గమునుండి వెలువడి తురుష్కుల వెన్నంటి వారి ననేకవిధములఁ బీడించిరి. స్వల్పపరివారముతో నుల్లుఖానుడు దేవగిరిఁజేరి, ప్రాణసంరక్షణము జేసికొనగల్గెను."

పై వ్రాతలనుండి యీసందర్భమున దురుష్కులకు మరియొకతూరి పరాభవము జరగెనని స్పష్టమగుచున్నది ఏకశిలానగర మప్పుడే బాగుచేయింపబడియుండుటచే శత్రువులు దానిని భేదింపజాలకుండిరి. ఆంధ్రులును ముందుగనే యీదండయాత్రను గూర్చి యెఱింగియుండి యుద్ధమునకు సంసిద్ధులై యుండిరి. ఈయుద్ధమునుగూర్చి ప్రాచీనచరిత్రములు దెలుపువిషయములు విశ్వసనీయములుగ గన్పడుచున్నవి. సాహిణిమారయ్య, మహాకాళిదొర, కొల్లిపాకసిద్ధయ, కొలనిరుద్రుఁడు మున్నగు వీరు లీసమయమునందద్వితీయపరాక్రమము జూపియుండిరి.

ఈవిజయము తిరిగి యాంధ్రులను సంతోషాంధులను గావించినది. ఇంతవరకును మహమ్మదీయుల పూనికను గాంచియు, పరాజయానంతర మతిత్వరితముగనే మరల దండెత్తివచ్చు వారియుద్ధపద్ధతుల నెఱింగియుగూడ, నాంధ్రులు విజయాంధులై భావిపరిస్థితుల నించు

175 Barani—Tarikh-i-Firozshahi—Elliot. p. 231

Acc NO. 10086

కేనియు నాలోచింపరైరి. వినాశకాల మాసన్నమగుటచేతనే వారల కిట్టి విపరీతబుద్ధి పొడమియుండును. సరిహద్దులలో సమర్థులగు వీరుల నుంచి, జన్మశత్రుత్వమును మఱచి దేవగిరి యాదవులతో దాత్కాలిక మైత్రినిఁ జేసికొని, వారలనుగూడ దురుష్కులను నిర్జించుటలోనర్చి, ప్రతాపరుద్రచక్రవర్తి యప్రమత్తుడై యుండినచో, దక్షిణహిందూదేశమున గాకతీయసామ్రాజ్య మింకను కొంతకాలముఁ బ్రబలి యుండును. కాని దైవదుర్విపాకమునఁజేసి చక్రవర్తి హ్రస్వదర్శియై యాక్లిష్టసమయమునం దేమఱియుండెను.

ఢిల్లీపట్టణమున సుల్తానీపరాజయవార్త నాలకించి నిరుత్సాహతనందక విశేషబలముల రావించి దేవగిరిదుర్గమున నున్న తన తనయునికడ కంపి, యీపర్యాయము తప్పక తెలింగానాపాలకుని బందిగ గొనితెమ్మని యాజ్ఞాపించెను. క్రీ. శ. 1320 నుండి 1321 యుత్తరభాగమువరకు నింతకు పూర్వపుయుద్ధము జరగియుండెను నాల్గుమాసములైనను గడువకమునుపే క్రీ. శ. 1322 మొదటిభాగమున ఉల్లుఖాను చక్రవర్తిబంపిన యీబలములతో తిరిగి యాంధ్రదేశముపై దాడివెడలెను. ఈయాత్రను చరిత్రకారుడగు బారనీ యిటుల వర్ణించి యున్నాడు.

"సుల్తాను నాజ్ఞనుసరించి రాజపుత్రుడాంధ్రదేశమున బ్రవేశించి, బీడరుదుర్గమును స్వాధీనము చేసికొని, తత్పాలకుని బందిగ జేసెను. అతిత్వరితముగ నాత డోరుగల్లునకేగి సులభముగ మట్టిగోడను వశపఱచుకొనెను. తోడనే లడ్డర్ దేవుడు సకుటుంబసపరివారముగ నాతనికి స్వాధీను డయ్యెను, అంతట ఉల్లుఖానుడు రాయలను విశేషధనరాసులను మాలిక్ బేడర్, ఖ్వాజాహాజీయనువారి రక్షణమున ఢిల్లీనగరమునకుఁ బయనముచేసి, యోరుగల్లునకు "సుల్తాన్‌పూర్" అనుపేరిడి, తెలుగుదేశమునంతటిని జయించెను." 176

జియాఉద్దీన్ బారనీ యాంధ్రసామ్రాజ్యపతనము నింతలఘువుగ బరిష్కరించినను వాస్తవ మింకొకవిధముగ నుండినది. క్రీ. శ. 1323 లో నారంభింపబడిన యీయుద్ధము క్రీ. శ. 1323 వరకును జఱగియుండెను. ఆంధ్రసామ్రాజ్య పతనమునకు కేవలమును తురుష్కుల కార్యదీక్షయు యుద్ధనైపుణియు నేగాక నితరకారణములుగూడ నుండినవి వానిలో మొదటిది యాంధ్రుల దృష్టిమాంద్యము. రెండవది వారియంతఃకలహములు. సామ్రాజ్యము జీవన్మృత్యుసమస్యకు లోనై యుండిన సమయమున బ్రోలయవేమాది రెడ్డికులజు లొనర్చిన రాజద్రోహము మొదటిప్రహరణము. ఇంతటితోఁ దృప్తినందక రెడ్లు సంగ్రామము ఘోరముగ జరుగుచుండిన సమయమున మత్సరపిశాచపీడితులై యొక దుష్కార్యము నొనర్చినటుల బ్రాచీనవంశ చరిత్రములనుండి తెలియుచున్నది. యుద్ధరంగమున శౌర్యమును స్వామిభక్తిని జూపుటకు మాఱుగ, నింకను జక్రవర్తిబలములలోనుండిన రెడ్లు తమ మేధాబలముల వ్యర్థపఱచి స్వామి నాశమునొనగూర్చిరి. పద్మనాయకవీరు లద్వితీయముగఁ బోరుచు శత్రుసంహార మొనర్చుచుండ, ప్రోలయవేమాదుల స్వాతంత్ర్యప్రకటనము నాలకించి, రెడ్డికులజులు బొబ్బారెడ్డి యాధిపత్యమునఁ దురుష్కులతో కుట్రచేయ మొదలిడిరి. మహమ్మదీయులనుండి కొంతధనమునుగైకొని

176 Ibid

వార లొకనాటి యుద్ధమునం దాంధ్రులపక్షమున యుద్ధముచేయకుండుటకై యొడంబడిక చేసికొనిరి. తాము రంగమునం దుండకుండినచో యుద్ధభారమంతయు బద్మనాయకులపై బడుననియు, తురుష్కుల నెదుర్కొని వారలతి త్వరితముగ నశింతురనియు, నీటుల ప్రత్యర్థులు నశించినపిమ్మట దాము చక్రవర్తి గౌరవాదరముల నేకభోగ్యములుగ ననుభవించి యవనుల ననాయాసముగ నిర్జింపవచ్చుననియు నీరెండ్లు తలంచియుందురు మఱునా డుదయమున యుద్ధమారంభమయినవెంటచే దమ యొడంబడిక ననుసరించి బొబ్బారెడ్డిమున్నగు వారలు యుద్ధభూమినుండి సుమారము నిష్క్రమించిరి. తమదేశమును దమయేలికను, రక్షించుటకై ప్రాణములను లక్ష్యముచేయక మై మరచి పోరుచుండిన పద్మనాయకవీరు లీ విషయమును గమనింపరైరి. మహావాహినివలె దురుష్కసైన్య మాంధ్రవీరులపై బడుటనుగాంచి, ప్రతాపరుద్రచక్రవర్తి జాగుచేసినచో బ్రమాద మొదవునని యెంచి, మదగజారూఢుడై శేషించినయల్ప పరివారముతో గూడి యుద్ధరంగమున బ్రవేశించెను. ఇట్టిమహాసమయమున కిప్పటికే సంసిద్ధుడై యుండిన తురుష్కసేనాని, యోధులెల్లరును మైమరచియుండిన సమయమున గొంతసైన్యముతో నొక్కసారిగ జక్రవర్తిపై బడి, యాతని స్వల్పపరివారమును జెండాడి యాతనిని బందిగజేసెను. ఈ వార్త యింకను సైనికులకు దెలియకమునుపే ఉల్లుఖాను రహస్యమార్గమున విశ్వసనీయులగు సేనానాయకుల రక్షణమున ప్రతాపరుద్రదేవుని ఢిల్లీనగరమున కనిపెను. ఇంతటితో గాకతీయ సామ్రాజ్యభాను డాంధ్రమండలమునం దస్తమించెను. పద్మనాయకవీరులు విజయలక్ష్మిని జేపట్టి, స్వదేశమునకు బోవుచుండిన తురుష్కులతో పోరుట నిష్ఫలమని యెంచి యూరకుండిరి. బొబ్బారెడ్డి మున్నగువార లతిశీఘ్రముగ నడచిన యీ వ్యాపారము నంతయుగమనించి దమ యకార్యమునకు బశ్చాత్తప్తులై తురుష్కులపై బడిరి. కాని యిట్టి రాజద్రోహులు దేశమునం దుండగూడదను నుద్దేశ్యముననోయన దురుష్కులు వారినెల్లరను నిశ్శేషముగఁ బరిమార్చిరి. ఈ విధమున పదునొకండవ శతాబ్ది మధ్యభాగమున నుదయించి సుమారు మూడు శతాబ్దముల కాలము దుర్నిరీక్ష్యుడై తేజరిల్లిన కాకతీయభానుడు దైవోపహతులగు నాంధ్రుల బుద్ధిమాంద్యమును, రెడ్డిపద్మనాయక వైషమ్యములునను నీలమేఘావృతుడై, క్రీ. శ. 1323 వ సంవత్సరమునఁ దురుష్కకాళరాత్రిలో విలీనుడయ్యెను.

ప్రతాపరుద్రదేవుడు తురుష్కులచే బందిగగొనిపోబడుటతో నీతనిచరిత్ర మంతమయ్యెనని చరిత్రకారులు దలంచుచున్నారు.[177] కాని యాచక్రవర్తి క్రీ. శ. 1326 లో గూడ రాజ్యమేలుచుండెనని యూహించుటకు గొన్నియవకాశములు గలవు. ప్రాచీనవంశచరిత్రములలో నీతడు ఢిల్లీనగరమున కేగినపిమ్మట సుల్తా నీతని ననేకవిధముల బహూకరించి, తిరిగి యాంధ్రదేశమున కంపెననియు, ననతికాలమునకే ప్రతాపరుద్రుఁడు గోదావరితీరమున దేహమునుఁ జాలించెననియు చెప్పబడియున్నది. ఆంధ్రదేశమున బ్రబలము

177 ఢిల్లీనగరమునకు గొనిపోబడుచుండిన లడ్డర్ దేవుడు మధ్యమార్గముననే మరణించెనని మహమ్మదీయులు వ్రాసియుండిరి—Vide—Elliot. III p. 367. ఇది నొప్పకల్ల.

గ వ్యాపించియున్న మఱియొక గాథనుండి ప్రతాపరుద్రుని మంత్రులలో నొకఁడగు యుగంధరుడనునాతడు శిష్యులతోఁగూడి ఢిల్లీనగరమునకేగి పిచ్చివానివలె నటించి, యద్వితీయ మేధాశక్తిని గనుపఱచి రత్నపరీక్షామిషపై సుల్తానును, బందిగనుండిన ప్రతాపరుద్రునిఁ గూడ, గంగానదిపై గట్టబడియుండిన యొక యోడపై కేతెంచునటులొనర్చి, రహస్యముగ నాయోడను దరలించి, సుదూరమేగినపిమ్మట నొకనిర్జనస్థలమున సుల్తానుని విడిచిపుచ్చి, ప్రతాపరుద్రదేవుని యాంధ్రనగరికి గొనితెచ్చి తిరిగి కాకతీయసింహాసనమునఁ గూర్చుండఁజేసినని తెలియుచున్నది.[178] పైగాథలయందలి వాస్తవ మెటులున్నను వానికి బలము నొసగునాధారములు కొన్నిలభ్యములగు చున్నవి. దేవగిరిపాలకుఁడగు రామచంద్రదేవుడిటులనే తురుష్కులచే బందిగగొనిపోబడియు స్వదేశమునకు పంపబడియుండెను. చక్రవర్తి సేనానులలో నొకడగు రేచర్లసింగమనాయనికి "రాయబందీవిమోచక" యను బిరుదనామ ముండెను. చక్రవర్తి క్రీ. శ. 1323 లో దక్క నిదివరకెన్నడును బందియై యుండలేదు. ఏకశిలానగరపాలకుఁడగు నాగయగన్నమంత్రి "నీతియుగంధరు"డని పేరు గాంచి యుండెను అదియునుగాక క్రీ శ. 1326. వ సంవత్సరమున ప్రతాపరుద్రదేవచక్రవర్తి రాజ్యముచేయుచుండెనని రెండుశాసనములనుండి తెలియుచున్నది. వానిలోనొకటి రుద్రసేనానిధర్మమునుఁ దెలుపుచున్నది.[179] మఱియొకటి హంపీక్షేత్రమునందొకరెడ్డి యొనర్చిన దానమును బ్రశంసించుచున్నది[180] వీనినుండి ప్రతాపరుద్రచక్రవర్తి యేకారణముచేతనో క్రీ. శ. 1323 కు బిమ్మట నాంధ్రదేశమునకు దిరిగివచ్చి క్రీ. శ. 1326. వ సంవత్సరమువఱకును రాజ్యమేలుచుండెనని స్పష్టమగుచున్నది. ఈతడు బందీవిముక్తుడై యాంధ్రదేశమునకు మరలిన విధము భావిపరిశోధనలమూలమునఁ దప్పక వెలువడునని మావిశ్వాసము.

విద్యాపోషణము:—కాకతీయ సామ్రాజ్యము కేవలము రాజకీయ వైభవమునకు నార్థిక భాగ్యమునకునేగాక వాఙ్మయాభివృద్ధికిఁగూడ నెక్కుడు బేరెన్నికఁ గాంచియుండెను. కాకతిరుద్రునిచే నారంభింపబడిన విద్యాపోషణము గణపతిదేవ రుద్రాంబికలచే పెంపొందింపఁబడి ప్రతాపరుద్ర చక్రవర్తి కాలమునకు విశ్వవిఖ్యాత మయ్యెను. ఆంధ్రవాఙ్మయమునకు రాజరాజ మనుమసిద్ధి ప్రతాపరుద్ర కృష్ణరాయాములు మూలస్థంభములు. ఏకశిలానగరము పదునాలుగవ శతాబ్దమున విద్యానిలయమై యొప్పెను. స్వయముగ మహావిద్వాంసుడును రసజ్ఞుడునైన వీరరుద్రుఁడు గీర్వాణాంధ్రకవుల నెందరినో దనయాస్థానమునఁజేర్చి వారిచే భాషా యోషక మూల్యాలంకారముల ననేకముల నిర్మింపజేసెను. ప్రతాపచరిత్రాది ప్రాచీనచరిత్రము లీతనికాలమునం దభివృద్ధి నందుచుండిన సంగీత, నాట్య, జ్యోతిష, కావ్య, నాటకాది వివిధవిజ్ఞానములఁగూర్చి వేనోళ్ళఁజాటుచున్నవి. అయినను మన దురదృష్ట వశమున నాకాలపుఁ గవిపుంగవుల గ్రంథములెన్నియో బ్రకృతమున లభింపకున్నవి. యు

178 ఈగాథననుసరించియే 'ప్రతాపరుద్రీయ'మను నాంధ్రనాటకము రచింపబడినది.

179 E. R. No. 308 of 1915.

180 రెడ్డికుల నిర్ణయచంద్రిక, పే. 88—89.

ధాలభ్యములగు నాధారముల నుండి యీ చక్రవర్తి కాలమునం దీక్రింది గీర్వాణాంధ్రకవు లేకశిలా నగరమునం దుండినటులఁ దెలియుచున్నది.

శాకవెల్లి మల్లికార్జునభట్టు:— ఈతడొక సుప్రసిద్ధ సంస్కృతకవి. "శాకల్యమల్లః" యను నామాంతరముగల నీతడు "సరోష్ట్యరామాయణము"ను రచించెను. వైష్ణవగురు పరంపరావృత్తాంతములలో నీకవి సుప్రసిద్ధ వైష్ణవ సిద్ధాంత ప్రతిపాదకుడగు వేదాంతదేశికుని తనయుఁడగు వరదదేశికునికి సమకాలికుఁడుగ బేర్కొనఁబడియున్నాడు. ప్రసంగరత్నాకరమను గ్రంథమునుండి యీ మల్లికార్జునభట్టు విజయనగరరాజేగు హరిహరరాయల యాస్థానమునఁ గూడ నుండెనని తెలియుచున్నది. ఈతనిగ్రంథములలో నిపుడొక "యుదారరాఘవ" మే లభ్యమగుచున్నది. అందలి యంకాంత పద్యములనుండి యీతని తండ్రిపేరు మాధవుఁడనియు, "శాకల్య" లేక "శాకవెల్లి" యనునది యీతని గృహనామమనియు దెలియనగుచున్నది.

విద్యానాథుఁడు:— ఈ సంస్కృతకవినామము వాఙ్మయముననేగాక చారిత్రిక ప్రపంచమునఁగూడ శాశ్వతముగ నుండగలదు. ఈతని 'ప్రతాపరుద్ర యశోభూషణము' నుండి కాకతీయచరిత్రమున కద్వితీయ ప్రాముఖ్యత గల యనేకవిషయములు తెలియనగుచున్నవి. ఏతద్గ్రంథరచననుగూర్చి ప్రాచీనవంశ చరిత్రములలో నీక్రిందిగాథ గలదు.

'ప్రతాపరుద్రుని కీర్తివైభవములను కవితాపోషణమును విని యీకవి యాచక్రవర్తినిఁ బ్రధానముగఁజేసి యొకయలంకార గ్రంథమును నిర్మించి, చక్రవర్తిని దర్శించుటకై యేకశిలానగరమున కేతెంచెను. అచ్చట నారాజు తురుష్కులచే బందిగ గొనిపోబడెనని వినియు, హతాశుఁడుగాక, నాతనిఁగాంచుటకై తురుష్కశిబిరమున కేగెను అంత నెక్కుడుప్రయాసమునకోర్చి యేతెంచిన యీకవికుంజరునిఁ జక్రవర్తి మిగులనాదరించి యాతనిగ్రంథమును సావధానముగ నవలోకించెను. వస్తుప్రాశస్త్యమును గ్రహించియు, తననిస్సహాయస్థితికి వగచి చక్రవర్తి కవితోనిట్లనియెనట— కవీంద్రా దీనుడను, అన్యాక్రాంతుడనగు నన్నాశ్రయించి నాగుణముల స్తుతించుటచే నీకగులాభమెయ్యది. నీగ్రంథమును స్వతంత్రుడును శ్రీమంతుడునగు నింకొకరాజన్యునికిఁ గృతియొనర్చి దాననీలేమిని బాపుకొనుము." అప్పుడు కవిచక్రవర్తి రసజ్ఞతకుమెచ్చియు నాతని నిష్ప్రయోజకతకై విచారించి "ఓయీ! ప్రతిపంక్తియందును నిన్నేతగులబెట్టితిని, దాననింకొకనిఁజేర్ప నెటులసాధ్యమగు"నని బదులుపల్కెను. అంత బ్రతాపరుద్రుఁడాతని నోదార్చి తన ముద్రాంగుళి నొసంగియు "విద్యానాథు"డను బిరుదము నొసంగియు నాతనిఁగౌరవించెనట—

పైగాథయందలి వాస్తవ మెటులున్నను, విద్యానాథకవి ప్రతాపరుద్రచక్రవర్తి యాస్థానమునం దగ్రస్థానము నలంకరించియుండెననియు, నాతడు చక్రవర్తి పూర్వులచరిత్రము నామూలాగ్రముగ నెఱింగియుండెననియు నాతని యలంకార గ్రంథమునుండి స్పష్టమగుచున్నది. అందలి యొకశ్లోకము నాధారముగఁ జేసికొని కొందరుపండితులీతని నామ మగస్త్యుడనియు, విద్యానాథుడనునది బిరుదనామ

మనియు నభిప్రాయపడుచున్నారు.[181]

అగస్త్యుడు:—ఈకవి సంస్కృతమునఁ బాలభారతమును రచించెను. ప్రతాపరుద్రుని యాస్థానముననే యుండిన విశ్వనాథకవికీతడు మాతులుడు.[182] మధురావిజయమునం దగస్త్యుఁడు డెబ్బదినాల్గు కావ్యములను రచించెనని చెప్పబడియున్నది.[183]

గంగాధరకవి:—ఈతడు సుప్రసిద్ధపండిత కుటుంబమున జన్మించెను. సిద్ధనాథుని పుత్రి డు. మహాభారతకథను నాటకరూపమునరచించి ప్రసిద్ధికెక్కెను.[184]

నరసింహకవి:—ఈతడాకాలపు రచయితలలో సుప్రసిద్ధుఁడు. ఈకవిగ్రంథములలో కాదంబరీనాటకము ప్రకృతమునఁ గాంచనగుచున్నది.[185] ఈతని తండ్రి గంగాధరకవి.

విశ్వనాథుడు:—ఈతడొక నాటకరచయిత. ఈతనికృతులలోసౌగంధికాపహరణమను నొక వ్యాయోగముమాత్రము దొరకుచున్నది.[186]

---

181 ఈవిద్యానాథుడు సుప్రసిద్ధ సంస్కృత గ్రంథవ్యాఖ్యాతయు మహావిద్వాంసుడునగు కోలాచల మల్లినాథసూరియని శ్రీశేషాద్రిరమణకవుల యభిప్రాయము, నారాయణపండితుడు రచించినరామాయణచంపూవ్యాఖ్యానములోని వ్యాఖ్యాతవంశవర్ణనములోని

"కోలిచల్మాన్వయాబ్ధీందు ర్మల్లినాథో మహాయశః।
శతావధాన విఖ్యాతో వీరరుద్రాభిహర్షితః॥

అనుశ్లోకము వీరిబ్రమాణము. (చూ రజతోత్సవసంచిక—అనుబంధము—పే 22)

182 వాచస్తస్య కవేరుదార మధురా ఇత్యత్ర చిత్రంకిము
ప్రఖ్యాతస్సకలాసు దిక్షుగుణిషు శ్రీమానగస్త్యః సుధీః
వేధశ్చంద్రముఖీ కరాంగుళి దళాసంగక్వణద్వల్లకీ
వాచోయుక్తి సహోక్తిదర్శిత సుధాజన్మా స యన్మాతులః॥ "సౌగంధికాపహరణము"

183 చతుస్సప్తతి కావ్యోక్తి వ్యక్త వైదుష్యసంపదే।
అగస్త్యాయ జగత్యస్మిన్ స్పృహయేతోక్త కోవిదః॥ "మధురావిజయము"

184 సుమస్తమపరం వ్యాసం గంగాధరమహాకవిం।
నాటకచ్ఛద్మనా దృష్టాం యశ్చక్రే భారతీంకథాం॥ "మధురావిజయము"
జానాత్యేవహియద్భవాన్ కవికులం సత్యైర్యదభ్యర్థితం
నిత్యంసన్నిదధాతి సాభగవతీ యస్మిన్గిరాందేవతా।
తత్రాసీత్కుల సిద్ధనాథతనయో గంగాధరః పండితః
బాహుశ్రుత్య విశేషవిశ్రుత యశస్సాహిత్యసాహిత్యభూః॥
"కాదంబరీనాటకము"

185 తస్యైషమధ్యమః పుత్రో నరసింహ ఇతీరితః।
విశ్రుతస్సతు కర్తాస్య కృతేత్ర వధారయ॥
"కాదంబరీనాటకము"

186 సూత్రధారః—అద్యఖలు రాజ్ఞాప్రతాపరుద్రేణ సంభావితై రశేషవిద్యాసారసార్వజ్ఞ ధారేయమతిభిః సభాసద్భి రాహూయమాన మాదిష్టోస్మి—
విశ్వనాథ ఇతిఖ్యాత కవిరస్తి యదుక్తయః
అకాబ్చనమరత్నం చ విదుషాం కర్ణభూషణం॥
"సౌగంధికాపహరణము"

చిరంసవిజయీ భూయా ద్విశ్వనాథ కవీశ్వరః।
యస్యప్రసాదాత్సార్వజ్ఞం సమింధే మాదృశేష్వపి॥ "మధురావిజయము"

వీరభల్లటదేశికుఁడు:—ఈకవి యనేకశాస్త్రములలో బాండిత్యము గలిగియుండెను.[187]

అప్పయార్యుఁడు:—ఈతడొక సుప్రసిద్ధజైనకవి. శాలివాహనశకము 1241 వ సంవత్సరమున (20 జనవరి 1310) మాఘశుద్ధదశమీ యాదివారమునా డీకవి "జినేంద్రకళ్యాణాభ్యుదయ" మనుగ్రంథమును రుద్రకుమారుని రాజ్యకాలమున నోరంగల్లు నగరమునఁ బూర్తిచేసెను. ఈతడు పుష్పశేనాచార్యుని శిష్యుడు. స్థానికచరిత్రములందునుఁ బ్రాచీన వంశ చరిత్రములందునుఁగూడ ప్రతాపరుద్రుఁడు జైనులను హింసించెనని చెప్పబడియున్నది. ఈజైనసంస్కృతకవి యాచక్రవర్తి రాజధానీనగరమున వసింపుచు. ప్రశాంతముగ గ్రంథరచనమొనర్చుటబట్టి పైయూహ యవిశ్వసనీయ మేమోయని తోచుచున్నది. అంతియగాక ప్రతాపరుద్రచక్రవర్తి కవితాపోషణము జాతిమతభేదములను బాటింపక కేవలగుణమునే బరిగ్రహించెననిగూడ యీ యప్పయార్యుని చరిత్రము నిరూపించుచున్నది.[188]

ఈచక్రవర్తి కాలమునం దాంధ్రకవులనేకులాదరింపబడియుండిరి. చక్రవర్తి ననుసరించి యాతని సామంతులుఁగూడ నదేవిధమున విద్యాపోషణము నొనర్చుచుండిరి.

త్రిపురాంతకుడు:—సామాన్యముగ 'తిప్పన' యని వ్యవహరింపఁబడు నీకవి యనేక సంస్కృతాంధ్ర గ్రంథములను రచించెను. ఏకశిలానగరమున నాకాలమునందుండిన సాంఘిక నైతిక పరిస్థితుల నభివర్ణించుచు నీతడు సంస్కృతమున "ప్రేమాభిరామ" మునురచింప, వినుకొండ వల్లభామాత్యుడు దానిని "క్రీడాభిరామ"మను పేరిటఁ దెనిగించెను.

మారన:—కవిబ్రహ్మయగు దిక్కనసోమయాజికీతడు శిష్యుడు. ఈకవి యాంధ్రమున "మార్కండేయపురాణము"ను రచించి ప్రతాపరుద్రచక్రవర్తి సేనానులలోనొక్కఁడగు నాగయగన్న మంత్రికంకితము చేసెను.

భాస్కరకవి:—సుప్రసిద్ధాంధ్ర గ్రంథమగు భాస్కరరామాయణ మీతనిపేరనే బరగుచున్నది. ఆగ్రంథమును రచించిన వాఱలలో నీతడగ్రగణ్యుడు. దీనికిఁ గృతిభర్త చక్రవర్తి యశ్వదళముల కధిపతియగు సాహిణిమారుడు. కొందఱు పండితు లీతనిఁ దిక్కనసోమయాజికిఁ బితామహుఁడగు మంత్రి భాస్కరునితో సరిచేయుచున్నారు. కాని 12 వ శతాబ్దమధ్యభాగమునందుండిన యామంత్రిశేఖరుడు 13 వ శతాబ్దితుదిభాగమునను 14 వ శతాబ్దిమొదటి భాగమున నుండిన సాహిణిమారుని యాస్థానమునందుండుట పొసగనేరదు. భాస్కరకవి యొక్కయరణ్యకాండమును మాత్రమేరచించియుండెను. ప్రతాపచరిత్రాదులు సాహిణిమారునితోగూడ భాస్కరుడును చక్రవర్తి కాలమునం దుండినటులపేర్కొనుచున్నవి. కవితాప్రాశస్త్యముఁ బట్టియీతనికి తరువాత కవులు తిక్కనవారితో సరియగు స్థానము నొసంగినటు లనేక గ్రంథములనుండి తెలియుచున్నది. భాస్కరకవికి, రామాయణమునందలి యితర భాగములను వ్రాసిన మల్లికార్జునకవి పుత్రి

187 ఇతీవకథయామాస వీరభల్లటదేశికః।
ప్రతాపరుద్రదేవస్య సన్నిధౌ సర్వశాస్త్రవిత్॥

188 Catalogue of Sanskrit and Prakrit Manuscripts in C. P. & Berar Hiralal, p.XX X V II.

డును, కుమారరుద్రుఁడు శిష్యుడును, అయ్యలార్యుడు మిత్రుడును నై యుండిరి. ఇటులు పుత్రమిత్రభ్రాతృలతో గూడి భాస్కరరామాయణమును రచించి యీకవి యాంధ్రులకమునకు మహోపకారము నొనర్చియుండెను.

ఏకామ్రనాథుడు:—ఈతడుగూడ ప్రతాపరుద్రచక్రవర్తి యాస్థానమునందుండెనని యీతడు రచించిన బ్రతాపచరిత్రమునుండి తెలియు చున్నది. ఈయంశము విచారణీయము.

సేనానులు:—కాకతీయాంధ్ర సామ్రాజ్యమును మధ్యయుగమునందలి యాంధ్రుల ప్రతిభావిశేషమును, శూరశిఖామణులును స్వామిభక్తిపరాయణులునగు సేనానులపై నాధారపడియుండెను. సింహాసనము నధిష్ఠించిన యేలిక స్త్రీయైనను అసమర్థుడైనను, పరిపాలకుడు సామ్రాజ్యమునం దుండకుండినను గూడ నీయోధాగ్రేసరులును, ప్రజ్ఞాసముద్రులగు మంత్రివరులును జేరి, యాంధ్ర సామ్రాజ్యమున విచ్ఛిన్నముగ గొనసాగించుచుండిరి. అందువలనఁ సామ్రాజ్యవిస్తరణ మొకవంకను, శత్రురాజవిద్రావణ మింకొకప్రక్కను, జేరుగుచుండినకాలమునఁ గాకతీయ సామ్రాజ్యమున శాంతివాతావరణ ముండుటయు, కవితాశిల్పాది విజ్ఞాన మభివృద్ధి నందుటయు, సంభవించినది. రాజ్యక్షేమమునే దమక్షేమముగను, స్వామి కార్యదురంధరత్వమే తమ స్వార్థముగను నెంచి, శాశ్వతకీర్తి నందియుండిన ప్రతాపరుద్రచక్రవర్తి కాలపు మంత్రి సేనానాయకాది యుద్యోగుల చరిత్ర మీప్రకరణమునఁ జర్చింపబడుచున్నది.

నాగయగన్నమంత్రి:—కమ్మకులజుఁ డగు నీసేనాని యేకశిలానగరమునకుఁ బాలకుడుగ నుండెను. ఆంధ్రకవుల చరిత్రమునందీ గన్నమంత్రి మడికిసింగనకవిచేఁ బద్మపురాణమునుఁ గృతినందిన కందనమంత్రికిఁ బితామహుఁడగు గణపతిమంత్రికి సోదరుడని చెప్పబడియున్నది. మారనకవి తనమార్కండేయ పురాణమునం దీ గన్నమంత్రి చతుర్థకులజుడని చెప్పియుండుటచేఁ నీతడు నియోగి బ్రాహ్మణుడను కవి జీవితకారుని యభిప్రాయము సరియైనది కానటుల దెలియుచున్నది. గన్నమంత్రి తననిరుపమ యుద్ధనైపుణిచేఁ బ్రతాపరుద్ర చక్రవర్తి నుండి యధికార విశేషమును వడసెను. ఈతనికి మేచయనాయకుడు, ఎల్లయనాయకుడు ననునిర్వురు సోదరులుండిరి. వారిలో మేచయ చక్రవర్తికి మహాధికారిగ నుండెను. వెలనాటను రాజప్రతినిధిగ నుండిన సుప్రసిద్ధ సేనానియగు దేవరినాయనింగారీతని పుత్రుఁడు.

ఇందులూరి అన్నయ:—ఈతడు బ్రతాపరుద్రచక్రవర్తియధికారవర్గమునం దగ్రగణ్యుడు. శివయోగసారమునందీతని గీర్తిశౌర్యము లభివర్ణింపబడి యున్నవి. గణపతిదేవరుద్రాంబికలకు మంత్రియు దండనాథుడు నై యుండిన కొలని సోమయమంత్రి తనయుడగు గన్నమంత్రికిని గౌరమకు నీతడు జన్మించెను. మహాశక్తిసంపన్నుడగు నొక యోగిపుంగవున కీతడవరావతారము. మోపూరిరాజులనుగెల్చి రాయచౌహత్తమల్లబిరుదమును, పెక్కుదుర్గములను గొనుటచే స్థలగిరివనదుర్గజలకోటమల్ల బిరుదము నీతడు బొందెను. తురకలతోడి యుద్ధములయం దద్వితీయపరాక్రమము నుజూపి చక్రవర్తిమన్ననలను బడసెను. అదియగాక నాబ్రాహ్మణమంత్రి రుద్రాంబిక ద్వితీయపుత్రికయగు రుయ్యాంబను బెండ్లాడెను. ఐదులక్షల కాల్బలమున కధిపతియై యీతడు సింహాచలమునుండి యోరుగల్లు వరకును గల

ప్రదేశము నేలెను. కళింగదేశాధీశ్వరు డీతని బాహాదర్పమునకు దాళజాలక బలాయితు డయ్యెను. ఈమంత్రికళింగమునందలిమహేంద్ర గిరిమొదలు దక్షిణమున గృష్ణానదివరకును గల ప్రదేశమునం దాతామతటాకాది ప్రతిష్ఠ లనెన్నిటినో జేసి దేవప్రజాహితము నభివృద్ధి పఱచెను. తనయేలుబడిలో నుండిన దుర్గము లందు బంధుల నెందరినో యధిపతులుగ నియ మించి యీతడు రాజత్వము ననుభవించు చుండెనని తెలియుచున్నది.

ఇందులూరి రుద్రుడు:—ప్రతాపరుద్ర చక్రవర్తి సేనానులలో నీతడు గడుఁబ్రసిద్ధి నంది సామ్రాజ్యమునకు మూలాధారమై యుండెను. ఈతడు బ్రాహ్మణుడు. ఈతడు గన్నమంత్రికిమల్లమాంబిక యందుజన్మించెను. శివయోగసార మీతడు సకలాగమప్రాజ్ఞు డని దెలుపుచున్నది. ప్రతాపరుద్రచక్రవర్తి పంపున ద్రవిడదేశమునకేగి పంచపాండ్యులను జయించెను. ఓలచెర్ల, కంచెర్ల, తుని, చేబ్రోలు, దేవపురము, సూరవరము, రాజమహేంద్రవరము. కురుముతూరు, చామెర్లకోట, బెండపూడి, పిఠాపురము మున్నగు స్థలము లందలి దుర్గము లీతనిచే జయింపబడినవి. బాహత్తరి దుర్గనాయక, నాయగదావిళి, రాయచౌహత్తమల్ల, కాళింగరాయవిఫాళ యను బిరుదము లీతని కుండెడివి.

బెండపూడిఅన్నామాత్యుడు:-ఈతనిమను మడును, వీరభద్రారెడ్డికిమంత్రియునగు నన్న మంత్రికిఁదనభీమపురాణమునుఁ గృతియొసంగు సందర్భమునఁ శ్రీనాథుడీ యన్నామాత్యునిఁ బ్రశంసించి యున్నాడు. దానినుండి యీమం త్రిశేఖరుఁడు చక్రవర్తి గజబలంబుల కద్యక్షుడనియు నాంధ్రరాజ స్థాపకుండనియుఁ బ్రతాపరుద్రునికిఁ దక్షిణ భుజమనియు, యవనులపాలిటి కాలాగ్నిహోత్రుం డనియునుఁ దెలియుచున్నది. క్రీ. శ 1319. ప్రాంతమునఁ గాకతీయులకును, కంపిల రామునికినిఁ జేరిగిన యుద్ధమునందీతడు పాల్గొని యుండెను. బహుశః నీమంత్రిప్రవరుడు తురుష్కులతోడి యుద్ధములలో నిహతుడయి యుండును.

ముప్పిడి నాయకుఁడు:—ఈతడొక సుప్రసిద్ధ సేనానాయకుఁడు. వెలమకులజుడని తోచుచున్నది. మహ్మదీయు లుత్తరదిశనుండి దండెత్తిన సమయమున దాక్షిణాత్యులు కాంచీనగరముపై బడి యచ్చటి కాకతీయ సామంతుఁడగు మనుమగండ గోపాలునిఁ బారదోలి యానగరము నాక్రమింప, నీసేనాని చక్రవర్తి పంపున దక్షిణమున కేతెంచి పాండ్యులజయించి, యాంధ్రసామంతునిఁ దిరిగి కాంచీనగరమునఁ బ్రతిష్ఠించెను. రెండవతూరి కేరళదేశాధీశ్వరుఁడగు రవివర్మ యీమనుమగండ గోపాలునిఁ జేంపి కాంచినాక్రమింప ముప్పిడినాయకుఁ డాతనిఁగూడ నిర్జించి, మానవీరుని కాంచీసింహాసనమునఁ గూర్చుండఁ జేసెను. శాసనములనుండి యీసేనాని పాకనాడును, తొండమండలమునుఁ బ్రతాపరుద్రునికిఁ బ్రతినిధిగ పాలింపుచుండినటుల దెలియుచున్నది. ఈతని అరులల్ పెరుమాళ్ శాసనమునుండి యీతని తండ్రి నాగినాయఁడనియుఁ దల్లి గంగసానమ్మ యనియు, నీతడు క్రీ. శ. 1316. లో మానవీరునిఁ గాంచిలో నభిషిక్తునిఁ జేసెననియు స్పష్టమగుచున్నది.

సాహిణి మారుడు:—ప్రతాపరుద్ర చక్రవర్తి యాస్థానమునందలి ముఖ్యోద్యోగులలో

నీతఁడు ముఖ్యుడుగ ప్రాచీన చరిత్రములలో పేర్కొనబడి యున్నాడు. చక్రవర్తి యశ్వదళ ములీతని స్వాధీనమునం దుండెడివి. ఈతనికి సుప్రసిద్ధాంధ్ర గ్రంథమగు భాస్కరరామాయణము గృతినేయబడి యున్నది. సాహిణి మారుని పూర్వీకులఁగూర్చి కొన్ని సందియములు గలవు. పై గ్రంథమునందలి యయోధ్యకాండలోని యాద్యంతములనుండి బుద్ధయ కాచాంబికయను వారలీతని తలిదండ్రులని తెలియుచున్నది. కవిజీవితకారు లీతని వంశవృక్షము నీక్రిందివిధమున నిర్ణయించి యున్నారు.

కోనకాట ధరణీశుఁడు
|
రుద్రుడు
|
బుద్ధరాజు
|
విఠల ధరణీశుఁడు
|
బుద్ధరాజు
|
సాహిణిమారుడు

కాచవిభుడు. విఠల రాజునను నిర్వురు సోదరులు ద్విపదకావ్యమగు రంగనాథరామాయణమునురచించి, తమతడ్రియగు బుద్ధారెడ్డి కంకితమొనర్చియుండిరి. సాహిణిమారుడును బుద్ధారాజు కొడుకయియుండుటచే నాతడీ రామాయణ రచయితులకు సోదరుడని చెప్పవలసి యుండును. కవిజీవితకారులు మారుని తండ్రియు బుద్ధారెడ్డియు నొక్కరు కారని యభిప్రాయపడియున్నారు. ఆంధ్రచరిత్రకారు లివిషయమునుచర్చించుచు, రంగనాథరామాయణ రచయితలుఁ సాహిణిమారునంతటి ప్రఖ్యాతసేనాని దమకు సోదరుడేయైనచో నాతని దప్పకబ్రశంసించియేయుందురనియు, వారలటు చేయకుంటయె నీసంబంధము సరియైనది కాదనుటకుఁ బ్రమాణమనియు, నభిప్రాయపడియున్నారు. ఈవిషయమును భావిపరిశోధనలవలన నేనిర్ణయింపవలసియున్నది.

కాయస్థసేనానులు:— కాకతీయచక్రవర్తులకుసుప్రసిద్ధవీరవంశములను దమకొల్వునందిడికొని పోషించుచుండు టాచారమైయుండెను. అట్టివానిలో నీకాయస్థకుటుంబము మిగులముఖ్యమైనది. గంగసాహిణియను నాతడు గణపతిదేవచక్రవర్తి కాలమున పానుగల్లునుండి మార్జవాడివఱకునుఁగల భూభాగమునంతటిని సామంతుడుగఁ బాలించుచుండెను. ఆతనియనంతరమున జన్నిగదేవుఁడు ములికినాడు, పొత్తపినాడు, గండికోటమున్నగు ప్రాంతములనేలుచు, రుద్రాంబికకుదక్షిణభుజముగనుండెను. ఆమహారాజ్ఞి కాలముననుఁ బ్రతాపరుద్రదేవుని కాలమునను త్రిపురాంతకాంబదేవు లనునాతని సోదరులు వాసికెక్కియుండిరి. వీరిలోనంబదేవుడు ప్రఖ్యాతుఁడు. శాసనములనుండియు స్థానిక చరిత్రములనుండియు గూడ నీతడాకాలమునందనేక సామంతపాలకులపై దనయధికారమును నెరపు చుండెననియు, దూరమునందుండిన దేవగిరియాదవులు గూడ నీతని యనుగ్రహమునభిలషించియుండిరనియు, దెలియుచున్నది. ఈతని యాజ్ఞానుసారము పెద్దనాయకుఁడను నతడు పొత్తపినాడులోని భూములనన్నిటినికొలిపించి, యనేకవిధముల విభజించి వానిపై పన్నుల నేర్పఱచినటుల స్థానికచరిత్రములనుండి దెలియుచున్నది. క్రీ. శ. 1304. ప్రాంతమున వీరలు ప్రతాపరుద్ర చక్రవర్తిపై తిరుగుబాటు చేసిరి. గుండయ నాయకుడును, మాచయ నాయకుఁడును, వీరి విద్రోహము నణంచిరి. క్రీ. శ. 1304 నకుఁబిమ్మట వీరినా

మములు గన్పడకుండుటచే వీరలాసంవత్సరమున సమసియుందురని తోచుచున్నది. వీరశైవ మతావలంబులగు నీసోదరులు శ్రీశైల త్రిపురాంతకాది దేవాలయములకుఁ బెక్కు ధర్మముల నొనర్చియుండిరి.

రేచెర్లవంశీయులు:—కాకతిరుద్రుని కాలమునఁ బ్రబలిన యీవంశము తరువాతి చక్రవర్తులకాలమున విశేషవిఖ్యాతి నందెను. ప్రతాప రుద్రదేవుడు పద్మనాయకులనే రాజ్యాంగ నియోగముల కధిపతులఁ జేసియుండుటచే పద్మనాయకులగు నీవంశమువారీ చక్రవర్తికాలమునఁదమశౌర్యసంపదకుతోడు రాజాశ్రయమునుగూడ నందియుండిరి. ఈకాలమున బ్రకృత నైజాంరాష్ట్రమునందలిరాచకొండ ప్రాంతమును ఎఱ్ఱదాచానాయడు నల్లదాచానాయడు నను నిర్వురుసోదరులు, రాజప్రతినిధులుగఁ బాలించుచుండిరి. పాండ్యులు దక్షిణమున నొత్తిడికలుగజేయుచుండిన సమయమున నీయెఱ్ఱదాచానాయడు చక్రవర్తిపనుపున వారిపై దాడివెడలి, వారల నోడించి, ధనకనకవాహనాదులఁ గొల్లగొని తనయేలికకర్పించెను. సంతుష్టుడై చక్రవర్తి యాతనికి "పంచపాండ్యదళవిఫాల" "కాంచీకవాట చూఱకాఱ" యను బిరుదములనొసంగెను. ఎఱ్ఱదాచానాయని దాయాది యగు సింగమనాయడు గూడ నీచక్రవర్తికాలమునఁ ధైర్యసాహసములకుబ్రఖ్యాతి కెక్కియుండెను. దేవర కొండప్రాంతమునకుఁ బ్రతినిధిగనుండిన యీతడు క్రీ. శ. 1319 లో జరగిన కంపిలయుద్ధమున బెండపూడి యన్నామాత్యునితో బాల్గొనియుండి కాకతీయ బలములకునాయకుడుగ నుండినటులొక కన్నడలిఖితగ్రంథమునుండి తెలియుచున్నది.

పైనుదహరింపబడిన వారలేగాకబ్రతాపరుద్రచక్రవర్తికాలమున సోమయవెంక, బమ్మనాయనింగారు, అన్నయపెద్దగడ, రుద్రనాయకుడు, మాయిదేవులెంక, మున్నగు ననేకులగు సేనానులుండిరి. శాసనములనుండియు స్థానికచరిత్రములనుండియు నీక్రిందిప్రతినిధులు సామ్రాజ్యమునందలి వివిధభాగముల నేలుచుండినటులఁ దెలియుచున్నది.

కొలనిరుద్రుడు, ఏకశిలానగర సింహాచలమధ్యదేశము		
అన్నువెంక	మెదక్‌సీమ	1294
వేషేటి కొమ్మయ	కమ్మనాడు	1312
కామయ బొప్పనింగారు	,,	1304-11&13-23
గొంకారెడ్డి ములికినాడు, పొత్తపినాడు		1309-23
త్రిపురాంతకాంబదేవులు	,,	1291-04
పోతయసాహిణి	పాకనాడు	
గుణ్ణయనాయకుడు	కమ్మనాడు	1299-11
సోమయ వెంకంగారు	వెలనాడు	1290-04
మాచయనాయనింగారు	,,	1304-08
దేవరినాయనింగారు	,,	1308-19
ముమ్మడిమట్టయ	పెదకట్లసీమ	1319
ముప్పిడినాయకుడు	పాకనాడు,కొండ మండలము	1294-17

రాజ్యపరిస్థితులు:—ఆదినుండియుఁ గాకతీయరాజులు దేశవిస్తీర్ణము నెక్కుడుచేసియు, శత్రువులను విద్రోహుల నణంచియు, వాణిజ్యాదుల నభివృద్ధి పఱచియు, దేశమునందెల్లపుడును శాంతిని ప్రబలజేసియు, ప్రజాక్షేమమునకై పాటుపడు చుండుటచే నాంధ్రదేశమునఁ బ్రజలుశాంతిసంతోషముల నోలలాడుచు, దమయార్థికజీవనము నభివృద్ధి పఱచుకొనుచుండిరి. దానఁజేసి తాత్కాలికాంధ్రదేశము సస్యసమృద్ధమనియు మహాదైశ్వర్యయుత మనియు దేశదేశములను ఖ్యాతివడసియుండెను. గణపతిదేవచక్రవర్తి కాలమునకే

యిట్టి యుత్కృష్టదశనంది యీదేశము రుద్రాంబా ప్రతాపరుద్రుల కాలమునం దధికశోభా వంతముగ నుండెనని యనేక ప్రమాణములనుండి తెలియుచున్నది.

కేంద్రప్రభుత్వమునకు చక్రవర్తియే యధిపతిగ నుండెను. స్వేచ్ఛాధికారమును గలిగి యుండియు నాతడు ధర్మశాస్త్రానువర్తియై ప్రజానుకూల్యము నాసించుచు వారియసంతుష్టికి వెఱచుచుండెను. వివిధరాజ్యాంగ విషయముల నాతనికి తోడ్పడుచుఁ బరిపాలనా విధానమును నిర్వర్తించుట కనేకప్రధానులును మహాప్రధానులు నుండిరి. రాజకీయ నియోగమునకు వలెనే చక్రవర్తి సర్వసైన్యములకును నియంతయై యనేక సమయములలో స్వయముగ యుద్ధరంగముల కేగుచుండినను, సేనానాయకా ద్యనేకోద్యోగులుగల సైనిక నియోగ మొకటి ప్రత్యేకముగ నుండెడిది. ఇదియగాక నాకాలమున డెబ్బదియేడు రాజ్యాంగనియోగము లుండెడివనియు నొక్కొకనియోగమున కొక్కొకనాయకు డధిపతిగ నుండెననియుఁ బ్రాచీనవంశ చరిత్రములనుండి తెలియుచున్నది.[189] ఈనాయకులును, వివిధరాష్ట్రములందలి ప్రతినిధులును సామంతులును చక్రవర్తికి లోనై యాతని యాజ్ఞానుసారము మెలగుచుండిరి.

పరిపాలనా సౌకర్యమునకై దేశమంతయు జేసెను.[192] అట్టివిభాగములలో నాడు, సీమ, స్థలము, గ్రామము మున్నగునవి ముఖ్యములు. కమ్మనాడు ములికినాడు, పొత్తపినాడు, పాకనాడు వెల్నాడు మున్నగు నాడలును, గండికోట సీమ కోరుకొండసీమ మొదలగుసీమలును, పెల్నాటిస్థలము పింగళిస్థలము గురివిందాల స్థలము మొదలగు స్థలములు నాకాలమునం దుండినటుల శాసనములనుండి తెలియనగుచున్నది. ఒక్కొకనాడుపై నొక్కొకరాజప్రతినిధియుండెను. వీరిని నియమించుటలో చక్రవర్తియొక్కడు దూరదృష్టినిగలిగి యుండెను. దక్షిణదేశమునకు ద్వారమువలె నుండు గండికోట సీమకు మహాశూరుడును రాజభక్తిపరాయణుడునగు పట్టసాహిణిసోమయనాయకుడు నతనికిఁ బిమ్మట జక్రవర్తి తనయుడగు[190] జుట్టయలంకాగొంకేరెడ్డియును బ్రతినిధులుగ నియమింపబడి యుండిరి. అటులనే యుత్తరదిశను కళింగగాంగరాజ్యమునంటి యుండిన సింహాచలప్రాంతమునకు జక్రవర్తి తన పినతల్లిభర్తయు,[191] రాజనీతిజ్ఞుడునగు బెండపూడి యన్నామాత్యునిఁ బ్రతినిధిపాలకునిగ జేసెను. నూతనముగ నడవులనిర్మూలించి నిర్మింపబడిన కర్నూలుజిల్లాలోని గ్రామములపై విశ్వసనీయులగు నేకశిలా నగరవాసుల నీ ప్రతాపరుద్రదేవుడు పాలకులఁ జేసెను.[192]

ననేక విభాగములుగ విభజింపబడి యుండెను. ఇతరస్థలము లందలి ప్రతినిధుల నొకచోటి

---

189 ప్రతాపచరిత్రము నందికాలమున 77 నియోగములుండెడివనియును బ్రతాపరుద్రుడు వానికి 77 గురు పద్మనాయకులను నాయకులుగ నియమించి యన్యజాతినాయకులను తొలగించెననియు చెప్పబడియున్నది.

190 స్థానిక చరిత్రము లీసంబంధమును పేర్కొనుచున్నవి. వానిలో నిట్టివే కొన్నిశాసనములుకూడ గానగుచున్నవి. వీని విశ్వాసార్హతను భావి పరిశోధకులు స్పష్టీకరింపవలసియున్నది.

191 ప్రతాపచరిత్రమునం దీవిషయము చెప్పబడియున్నది. విమర్శనీయము.

192 L. R. Kurnool.

నుండి మఱియొకచోటికి తఱచుగమార్చుచు, దానును స్వయముగ వారి ప్రవర్తనలను చారుల ముఖమునఁ గన్గొనుచు నీతడనేకవిధముల నౌద్యోగికసామర్థ్యము నభివృద్ధిపరచు చుండెను. స్థానికోద్యోగులందరును యుద్ధసమయములలో తమసేనలతో గూడ దేశసంరక్షణార్థమై చక్రవర్తి సాహాయ్యమున కేగుచుండిరి.

సామ్రాజ్య మంతటికిని గ్రామపరిపాలనము మూలస్థంభముగ నొప్పుచుండెను. దేశము ప్రశాంతముగ నుండినను, ఘోరయుద్ధములు జరిగినను కేంద్రరాష్ట్రీయ పాలకులు పరివర్తన మందినను, గ్రామజీవిత మవిచ్ఛిన్నముగ సాగుచుండెను. రెడ్డి, కరణము, తలారి, మున్నగువారలు గ్రామమునందలి ముఖ్యోద్యోగులు. వీరుగాక పన్నులను విధించుటకై ఆయగాండ్లును, వాణిజ్యముపైనను యెగుమతి దిగుమతులపైనను సుంకములను విధించు స్థలసుంకాధికారులును గూడ నుండిరి.[193] వీరందరికిని బ్రతిఫలముగ జాతికట్టు మాన్యములును కొన్ని సమయములలో ధాన్యమునఁగూడ నొసంగబడుచుండెడివి. ప్రతిగ్రామమునందును లెఖ్ఖలలో గ్రామపరిమితి, గ్రామాదాయము, గ్రామసరిహద్దులు, పన్నులులేని భూములు, తోటలు, చెఱువులు, మున్నగు ననేకవివరములు వ్రాయబడు చుండినటుల స్థానికచరిత్రముల నుండి తెలియుచున్నది.[194]

శాసనము లాకాలమునందలి యార్థికపరిస్థితులను గూర్చి యనేక విశేషములను తెలుపుచున్నవి. భూపరిమితి గడ, తూము, పుట్టి, మఱ్ఱు, మున్నగువాని లెఖ్ఖను పరిగణింపబడుచుండెడిది సాధారణముగ వరిచేలను తూముల వంతునను మెరకభూములను పుట్లుగను, పరిగణించు టప్పటియాచారమై యుండినటుల దేవరినాయనింగారి శాసనములనుండి తెలియుచున్నది. నివర్తనమనునది మఱియొకకొలత. భూమియంతయు నీరు నేల వెలిపొలమునని విభజింపబడియుండెను[195] వ్యవసాయము విశేషముగ చెఱువులపై నాధారపడి యుండుటచే నాకాలపు రాజులును సామంత ప్రభువులును, ధనికులును పాఖాలరామప్ప తటాకములవలె పెద్దపెద్ద జలాశయములనునిర్మించుచుండిరి.[196] పన్నులు సాధారణముగ ధాన్యరూపముననే వసూలు చేయబడుచుండెడివి. నీరు నేలపై పన్ననకు "కోరు" అనియు వెలిపొలమైనచో "పుట్టిపహిండి" యనియు పేర్లుండెడివి. ఇవిగాక కానుక, చిల్లర, పుల్లరి, సుంకము, అంగటి ముద్ర సుంకము, నను నితరములగు పన్నులు గూడ గ్రామములలో వసూలుచేయబడు చుండెడివి.[197]

రాజులకు కృషిమూలముననే గాక వాణిజ్యమునుండియు విశేషాదాయము వచ్చుచుండెడిది. ఆకాలమున సామ్రాజ్యమునందలి

193 E. R. 630 Of 1911.

194 స్థానిక చరిత్రములలో ప్రతి గ్రామచరిత్రమున నీ వివరములను గాంచనగును.

195 దక్షిణహిందూదేశ శాసన సంపుటములందలి శాసనాంత్య భాగములను జూచునది.

196 జగత్కేసరి చౌండసముద్రము వంటి జలాశయములనుగూర్చి నైజాంరాష్ట్ర శాసనములలోని రేచర్ల వంశీయుల పిల్లలమఱ్ఱి నాగులపాడు శాసనములను, దక్షిణహిందూదేశ శాసనములను జూచునది.

197 Nel. Ins. O. 58, 89, Kurnool Dt. Manul See. II Ep. Ind. V. p. 23.

ఈకాలపుటార్థికపరిస్థితులను శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారు 1926 నాటి ఉగాది సంచికలో నొక వ్యాసమున బ్రశంసనీయముగ వర్ణించి యున్నారు.

వివిధభాగములకు వర్తకసామగ్రిలు దున్నపోతులు యెడ్లు గాడిదలు మున్నగువానిపై నెగుమతి చేయబడుచుండెడివి. ఓరుగల్లుమున్నగు ప్రధానవర్తకస్థానములలో నొక్కొక్కజంతువుచే మోయబడు సరకున కింతయనియును, వర్తక సామగ్రి యొక్క విలువను బట్టియు సుంకము భేదించుచుండెను. ఇయ్యది సాధారణముగ గ్రామమునుఁ బ్రవేశించునపుడు వర్తకుల వద్దనుండి వసూలు చేయబడుచుండెను.

కాకతీయ చక్రవర్తుల నాణెములు మిక్కిలి మనోహరములుగనుండెడివి. వానిపై నొకనందియు, దానికిరుపార్శ్వములను రెండు చామరములును గన్పించుచున్నవి. ప్రతాపరుద్రచక్రవర్తి మాడలనుబంగరు నాణెములను, పణములను వెండినాణెములను, ముద్రింపించెను.[198] ఇవిగాకఁ బ్రతాపమాడలను ప్రత్యేక స్వర్ణనాణెములున్నటుల పావులూరి మల్లనకవి పేర్కొనియున్నాడు. సామంతప్రభువులుగూడ ప్రత్యేకముగ నాణెములను నిర్మించుకొనుచుండిరి. కాంచీనగరము రాజధానిగ తొండమండలమునేలుచుండిన కాకతీయ సామంతుడగు గండగోపాలుడు "గండగోపాల మాడ"లను నాణెములను ముద్రించినటులశాసనముల నుండి తెలియుచున్నది.

ప్రతాపరుద్రచక్రవర్తి తనప్రజల యార్థికాభివృద్ధికై యనేకవిధములఁ బ్రయత్నించియుండెను. అరణ్యావృతములునుఁ గృషిదుస్సాధ్యములునగు కర్నూలుమండలమునందలి యనేక భూభాగముల నాతడు గృషియోగ్యముల నొనర్చెను. మహమ్మదీయులతో యుద్ధములవలనఁ దన ప్రజలకొదవిన నష్టములను బాపుటకై యీతడీప్రాంతమునందలి యడవులను నిర్మూలింపజేసి యచ్చట పెక్కుగ్రామములను నిర్మించెను. స్వయముగ నాదుర్గమప్రదేశములకేగి కొచ్చెర్లకోట దుర్గపరిసరములలో నిరుగపకేతినాయడనునాతనిచే దూపాడను గ్రామమునునిర్మింపచేసి, నందికోటకూరను నూతనగ్రామమునకు కల్యాణీవాస్తవ్యుడగు సిరిసింగరాజు నధికారిగ నియమించెను. అటులనే చక్రవర్తి యాజ్ఞననుసరించి విడెము కొమ్మయ అనుమకొండ అన్నవెంక మున్నగువారలు పాలమట్టి,వనమాలపాడు, దామగట్లమొదలగు పెక్కు గ్రామములనిర్మించిరి. ఈభాగములకు జనుల నాకర్షించుటకై చక్రవర్తి బ్రాహ్మణుల కగ్రహారములను, శ్రోత్రియములను, దానముచేసియు, కాపులకు పన్నులు లేకుండగనే వ్యవసాయము చేసికొనుట కనుజ్ఞనిచ్చియు, ననేకవిధములఁ బ్రయత్నించి యుండెను.[199]

ఏకశిలానగరము:—ప్రస్తుతమునై జాంరాజ్యమునందొకమండలమునకుఁ గేంద్రస్థానమై,ఓరుగల్లు,ఒరంగల్లు అను నామాంతరములఁ గలిగి, యాంధ్రనగరియని విఖ్యాతినందియుండినయేకశిలానగరము కాకతీయాంధ్రసామ్రాజ్యము మహోన్నత దశయందుండినపు డాంధ్రరాజధానియై యుండెడిది. సుస్థిరప్రాకారావృతము సుందరదేవాలయ సంయుతమునగు నీజీర్ణనగర దుర్గ మీకాలమునఁగూడ చూపఱులను విస్మయా విష్టచేతస్కులఁ జేయుచున్నది. అట్టిచో ప్రతాపరుద్రాది చక్రవర్తులకాలము నందీనగర వైభవమనుపమమై ఢిల్లీసామ్రాజ్యాధీశునికిఁ గూడ ననూయాశ్చర్యములను గల్పించెననుట యిసుమంతయు నతిశయోక్తి కానే

198. Elliot— Coins of South India p. 85

199. L. R. Kurnool.

రదు. అదృష్టవశమున నీమహానగరమునందలి జీవితవిధానములఁ గూర్చియు నిందలి నిర్మాణములఁ గూర్చియు వాఙ్మయమున గొన్నివర్ణనములు మనకు లభ్యము లగుచున్నవి. విశేషించి యిచ్చటి జీర్ణదుర్గమునందింకను దేవాలయములు, శిల్పములు, ప్రాకారములు మున్నగు ప్రాచీనశిథిలములు గాంచనగుచున్నవి. పై ప్రమాణముల మూలమున నీ ప్రకరణమునం దేకశిలానగర చరిత్రము సంగ్రహముగ చర్చింప బడుచున్నది.

ప్రారంభమునఁ గాకతీయులకు వారంగల్లుకు నాలుగుమైళ్ళ దూరమునందున్న హనుమకొండ రాజధానిగ నుండెడిది. ఇచ్చటినుండియే త్రిభువనమల్ల బేతరాజును, కాకతిప్రోలుడు నాతని తనయుడగు రుద్రదేవుడును రాజ్యమేలియుండిరి. గణపతిదేవ చక్రవర్తిగూడ యీనగరమునుండియే చోలకాలము రాజ్యముచేసెను. అనుమకొండ రాజ్యము కాకతీయ సామ్రాజ్యముగ బరిణమించినపిమ్మట నేకశిలానగరమునకు రాజధాని మార్చబడియెను. ఈసంఘటనము జేరగి యాంధ్రనగరీ భావిభాగ్యోదయ మయినకాలమును నిర్ణయింప వీలగుచున్నది. శా. శ. 1174. నాటి యొకశాసనము గణపతిదేవు డనుమకొండనుండి రాజ్య మేలుచుండినటుల దెలుపుచున్నది.[200] కాని 1176 వశకసంవత్సరమునందలి యింకొక శాసనమునం దాతనిరాజధాని యోరుగల్లుపట్టణమని చెప్పబడియున్నది.[201] దానినుండి యా చక్రవర్తి శా. శ. 1174—76లకు సరియగు క్రీ. శ. 1252—1254ల నడుమ తనరాజధానిని మార్చినటుల స్పష్టమగుచున్నది.[202]

అంతకుఁ బూర్వమునుండియే యీనగరము ప్రసిద్ధిజెందియుండెను. కాకతిరుద్రుఁడు దనవిజయాత్రలలో ననేకపట్టణములను నాశమొనర్చి వానిపేరిట నేకశిలానగరమునం దనేకభాగములను నిర్మించి పరాజితరాజ్యములందలి బ్రజల నందునివసింపఁజేసెను. రేచర్ల రుద్రసేనాని నాగతిరాజాది శత్రురాజులఁ జయించి దత్ఖ్యాపనార్థ మోరుగంటను రుద్రేశ్వరాలయమును నిర్మించెను. ఈయోరుగల్లు పట్టణ నిర్మాణముఁగూర్చి ప్రతాపచరిత్రాదులీక్రిందిగాథను దెలుపుచున్నవి.

ఒకనాడనుమకొండకుఁ దినుబండములఁ గొనితెచ్చు బండ్లలోనొకటి నగర సమీపమునందొక రాతికి దగిలి తలక్రిందులయ్యెను. అందలి యినుప పట్టియొకటి యాశిలకుఁదగిలి స్వర్ణముగ మాఱిపోయెను. ఈ విషయము దెలియవచ్చినతోడనే కాకతిప్రోలరాజు విద్వజ్జనముల తోడను పరివారముతోడ నాప్రదేశమునకేగి యాజాతినుండి దేదీప్యమానమగు నొక

200 E. R. 195, 223 & 273 of 1905–06 NEL. Ins. O. 28

201 E. R. 231 of 1905.

202 యింతకుమున్నే యేకశిలానగరము రాజధానిగ నుండెనేమోయను సందేహమును గొనిప్రమాణములు గలిగించుచున్నవి. అందుమొదటిది శివయోగసారములోని యొకపద్యము. అందుగాకతిరుద్రదేవుని బ్రశంసించుచు గవియిటుల వ్రాసియున్నాడు.

తరల॥ అనుమకొండపురంబుగాదని యావిభుండిల నోరుగ
ల్లనపురంబు ఘటించి యచ్చటి కచ్చుగానరుదెంచి.

తెండవయాధారము నైజాంరాష్ట్రమునందలి బెక్కల్లుగ్రామములోని శాసనము ఇందు శా. శ. 1117 కు సరియగు క్రీ. శ. 1195 లో రుద్రదేవు డోరుగల్లునుండి రాజ్యమేలుచుండెనని చెప్పబడియున్నది. ఈశాసనపు ప్రతిబింబము శ్రీదూపాటి రమణాచార్యులవారివద్ద నున్నది. దీనినినాకు జూపినందులకు వారికినేను కృతజ్ఞుడను.



పరశురామేశ్వరుడు.

[By courtesy of H. E. H. The Nizam's Archaeological Department.]



వరంగల్లు కోట—జీర్ణదేవాలయము—ద్వారము.

[By courtesy of H. E. H. The Nizam's Archaeological Department.]

90 B

లింగ ముద్భవించుటఁగాంచెను. వెంటనే రాజాస్థలమునందొక మహోన్నత దేవాలయమును నిర్మింప నద్దేవుడు స్పర్శవేదియనియు, స్వయంభు దేవుఁడనియుఁ బేరుగాంచెను. అతిశీఘ్రముగ జనులా ప్రదేశమునకు వలసవచ్చుటచే నచ్చట నొక నగరమేర్పడియెను. అదియే ఓరుగల్లు పట్టణము.

గణపతిదేవుడు క్రీ. శ. 1254-56 నడుమనే కశిలానగరమును రాజధానిగ నొనర్చి నప్పటి నుండియు నీగరము దినదినాభివృద్ధినందుచుండెను. ఆతడీనగరము చుట్టనొక లోతైన యగడ్తను త్రవ్వించెను. రుద్రాంబిక యిచ్చటి శిలాసోపానములను, కోటలోపలి రాజభవనముల చుట్టునొక యిటుకగోడను నిర్మింపజేసెను. శిలా ప్రాకారమున కావలనుండిన మట్టిగోడపై నీమహారాజ్ఞి బురుజులు, దిడ్డుమున్నగు వానిని గట్టించి, గోడలపై నెల్ల రక్షకభటులు గావలియుండునటు లేర్పఱచెను. ప్రతాపరుద్రచక్రవర్తికాలమునం దీనగరము దివ్యభవనములతోడను, సువిశాల రాజమార్గములతోడను, సుందరదేవాలయములు, మనోహరములగు నుద్యానవనములతోడను, విరాజిల్లుచుండెను.[203] నిరుపమమగు నిట్టినగరమునఁ గవితల్లజులు భాషాయోషను లాలింపుచుండ, శిల్పులు త్కృష్టజీవితాదర్శముల బ్రదర్శించి విజ్ఞానమును వెదజల్లుచుండ, ప్రజలు నిర్భయులై యనేకవిధములగు నుత్సాహకార్యములఁ బ్రొద్దుపుచ్చుచు, నానందాబ్ధినోలలాడుచుండిన యీ మహానగర మాకాలమున ఢిల్లీ సులతానునకే సంభ్రమాశ్చర్యములఁ గలిగించెననుటలో నతిశయోక్తియించుకైనను గానరాదు. ప్రతాపరుద్రచక్రవర్తి కాలమునం దీనగరమునందుండిన విభాగములఁగూర్చియు, నిచ్చటి సాంఘిక జీవితమునుగూర్చియు, వల్లభామాత్యకృతమగు "క్రీడాభిరామ"మను గ్రంథమునుండి యనేక విశేషములు దెలియనగు చున్నవి.[204]

క్రీడాభిరామము వల్లభామాత్య కృతమని యాగ్రంథముననే పేర్కొనబడియున్నది. ఈకవి క్రీ. శ. 15. వ శతాబ్దమునందుండెను. ఈ తనిగ్రంథము సంస్కృతమున త్రిపురాంతకకవి రచించిన "ప్రేమాభిరామ"మునకు భాషాంతరీకరణము. ఈత్రిపురాంతకుడును బ్రతాపరుద్రచక్రవర్తి కాలమునందుండినటుల పేర్కొనబడిన త్రిపురాంతకుడును, రావిపాటి తిప్పనయు నొక్కరేయని పండితుల యభిప్రాయము. గాన ప్రేమాభిరామమునందు బ్రతాపరుద్రుని కాలమునందుండిన యేకశిలానగర వర్ణనముండెననుట స్పష్టము. దాని భాషాంతరీకరణమగు గ్రీడాభిరామమునగూడ నావిషయ

---

203 వల్లభామాత్యకృతమగు 'గ్రీడాభిరామము' నందును మహమ్మదీయ చరిత్రకారుల వ్రాతలయందు నీప్రశంసగలదు.

204 ఈగ్రంథము త్రిపురాంతకకవి సంస్కృతమున రచించిన 'ప్రేమాభిరామము' నకు దెనుగుసేత గ్రంథమున వినుకొండ వల్లభరాయడీగ్రంథమును గూర్చెననియున్నది. కాని కొందరుపండితులు ముఖ్యముగ బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు శ్రీనాథకవి యీనాటకమునురచించెనని చెప్పుచున్నారుదీనిని కొంతకాలముక్రిందట శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు బ్రకటించిరి. 1928 లో శ్రీశాస్త్రిగారు ప్రత్యంతములనుబరీక్షించి మూలము నేర్పఱచియు, నీగ్రంథమునందలిబద్యములకును వృత్తమునకును సరియగు శ్రీనాథుని బద్యవృత్తములను గ్రోడీకరించి శ్రీనాథ కృతికర్తృత్వ నిర్వాహకమగు నుపోద్ఘాతమును జేర్చియు, మఱియొకప్రతిని ప్రకటించియున్నారు.

మే విశేషముగనుండునని స్పష్టమగుచున్నది. శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు దీనికర్తృత్వము వల్లభకవిది గాదనియు శ్రీనాథునిదేయనియు దమగ్రీడాభిరామ పీఠికలో వ్రాసియున్నారు. ఇదియెట్లున్నను బ్రతాపరుద్రునికి సమకాలికుడగు గవి దాత్కాలిక రాజధానీపరిస్థితుల నభివర్ణించుచు రచించిన గ్రంథమునకిది భాషాంతరీకరణ మగుటచే గ్రీడాభిరామము కాకతీయచరిత్రమునకు మిగుల ముఖ్యమైనది. మంచనశర్మ, టిట్టిభశెట్టి యనునిర్వురు మిత్రులుండిరి. వారిలో బ్రాహ్మణుడగు మంచనకు ఓర్గల్లులోని యార్యవాటమునగల కామమంజరి ప్రేయసియైయుండెను. కార్యాంతరాసక్తుడై యన్యస్థలములదిరిగి మంచన దన మిత్రునితోగూడి యోరుగల్లునకు మరలివచ్చెను. వీరిర్వురునొక యుదయమున నగరమును బ్రవేశించి యందందుదిరుగుచు, నందలివిశేషముల గాంచుచు, రాత్రికి బ్రియాసమావేశమునకై యొకసాంకేతిక స్థలముకుజేరిరి. వారలు గాంచిన దృశ్యములు, వారేగిన మార్గమును మనకు బ్రకృతమున మిగుల ముఖ్యములగుటచే వానినించుక వర్ణింపవలసియున్నది.

నగరబాహ్య ప్రదేశమున నిద్రించుచుండిన మిత్రులిర్వురును ప్రభాతసమయమునలేచి కాల్యకృత్యంబుల దీర్చికొనిరి. అప్పటికే సూర్యోదయమయ్యెను. ఇచ్చటినుండియే వారి కోరుగంటిపుర సౌధములు గన్పించినవి. అంత వారుపురంబు బ్రవేసించి వెళిపాళెముకట్టకడపట మేదరవాడకేగిరి. అచటవారికి మేదరకాంతయు, ఋతుస్నానార్థమేతెంచుచుండిన యొక చండాలాంగనయు గన్పించిరి. అటనుండి ముందునడచుచు వారు గణ్ణాటాంగనం గాంచిరి. ఇటనుండియామిత్రులుహట్టమార్గమును బట్టిపోయిరి. అటులేగగా వారికి మైలసంతలో సుసరభేత్తను మందునమ్ము యువతిగన్పించెను. ఆ పైనవారలు వెళిపాళెపు మధ్యప్రదేశమున హాలికవాటిలో నొకపామరభామను జూచి, ముందునకేగి, వీధివిటంకమునం దొకగంర్ణాటాంగనం గాంచి యింకను ముందునకేగి జూదమును, అటుపై నోరగ్రంతలో సంపెగనూనెనమ్ముకరణకాంతను, గానులకన్నెనొకర్తుకను జూచిరి. ఇచ్చటి కుత్తరంబున పువ్వులతోరణములతోను, హంసలు మున్నగువానితోడను, శోభిల్లుచుండు మోహరివాడకేగి యచ్చట నొకకుట్రిపువాని జూచి, యావాడనుదాటి యుత్తరముగానేగి, యీరీర్చుట, పసుపునూరుటయుగాంచి ముందునకేగిరి. ఇప్పటికామిత్రి లిర్వురును బాహ్యాకటకవీథి విటంకముల నతిక్రమించిరి. ఇచ్చటినుండి వారు లోతైన యగడ్తను, ఆకాశమునంటుగోడను, క్రిక్కిరిసియుండిన వంకదారను, బంగారు తలుపులుగల సింహద్వారమును జూచి యచటి రథాశ్వశకటాదులనుండి దప్పుకొనుచు క్రమముగ వానినిదాటి లోభాగమునఁ బ్రవేసించిరి. అటుపై బహుసమ్మర్దమగు రాజబాటను వదలి, వారు క్రంతతోవయగు నాలువరిక్రిందితోవగా నరిగిరి. అటుబోవుచుండ వారలకు బల్నాటి వీరుల యాలయమెదురయ్యెను. ఇచ్చటికి గొన్నియడుగుల దూరముననే ఏకవీరాగారముండెను. దీనిని దాటి బవనీడు, మాలెత, కాపుటాలు, జక్కులపురంధ్రి, అక్కలు మున్నగు వారలగాంచుచుజేని, మంచన టిట్టిభులు మైలారు దేవాలయము నచ్చటి సాహసకార్యములను గాంచిరి. ఇంకను, ముందఱకేగి యటనుండి యామిత్రులు భైరవ, చమడేశ్వరీ వీరభద్ర బుద్ధదేవాలయములను, ముసానమ్మ,



కరీంనగరు — మంజీరానది

[By courtesy of H. E. H. The Nizam's Archaeological Department.]

నగునూరు దేవాలయము.

[By courtesy of H. E. H. The Nizam's Archaeological Department.]

92B

కొమరు సామయ్య, పాండవులు మున్నగువార ల గుడులను, కొంచెము దూరముగా బ్రకాశిం చుచుండిన కేశవస్వయంభూదేవాలయములను జూడగల్గిరి. అటుపైని మిత్రులొకభైరవాల యమునకేగిరి. ఇప్పటికి మధ్యాహ్నమయ్యెను. రాజప్రాసాదమునుండి పదియారుఘడియలు విన వచ్చినవి. ఆకలిగొన్నవారై మిత్రులు భోజన మునుగూర్చి జింతించుచుండ నచటికి సమీప మునందుండిన బ్రాహ్మణవాడలో బూటకూ టింట గుడిచివచ్చుచుండిన బ్రాహ్మణుడొకడు వారికెదురయ్యెను: వారినుండి వృత్తాంతంబ రసి ముందునకేగుచు మిత్రులొక పుష్పలావికం గనుగొనిరి. అటుపైవారు వేశ్యవాటికం బ్రవే సించిరి. అచ్చట బ్రతాపరుద్ర ధరణీశోపాత్త గోష్ఠీప్రతిష్ఠాపారీణయగు మాచల్దేవియను వారాంగన గాంచి యామెతో గొంత బ్రసం గించిరి. అటనుండి యేగుచు నామిత్రులు గాంధారి యను మఱియొక వేశ్యగృహమును జొచ్చిరి. మంచనశర్మ దనపూర్వప్రేయసియ గు నామెతోడను, నామెగూతురగు మదనరేఖ తోడను గొంతప్రొద్దు బుచ్చెను. అటనుండి "వెడలి బశ్చిమదిశ నాల్గుగడియలంత ప్రొద్దుగ లుగంగ నడువీధి బోయి బోయి" పాముల యాటను, మేషయుద్ధమును, కోళ్ళపోరును, జూ చి, "యటబోవుచు నాదక్షిణంబున" మధుమా వతీ మదాలసలను వేశ్యల యిండ్ల గొంత విశ్రా మించి చేనిరి. ఇప్పటికి సూర్యాస్తమయమయ్యె ను. తమ సాంకేతికసమయము దగ్గరించు చుండుటచే నామిత్రులు, వేశ్యవాటికను, వీధీ విటంకమునతిక్రమించి, వేగముగ నేగ నిశ్చయిం చి బయల్వెడలిరి. అటుల వేశ్యవాటి కనతిక్రా మించి వారొక భైరవాలయద్వారమునం గొంద రు విటులలోబయల్వెడలిన, దగవును దీర్చి జ నుచుండ రాత్రిపడెను. అయ్యది సుప్రసిద్ధమగు గోధూళికాలగ్నమగుటచే నామిత్రులిర్వురు నార్యవాటికం బ్రవేశించి "రథ్యాముఖశివచత్వ రప్రాసామంటపంబులు విలోకించుచు" నేగిరి. అటనొక తమ్మిడిసాని యింటికేగి మంచనశర్మ తనరాకను గామమంజరికెఱింగించి, వీరభద్రేశ్వ రాలయము వెనుక బొడ్డన బావియందు సంధ్య వార్చి, సుఖాసీనుడై, ప్రియాగమము నెదురు జూచుచు, మిత్రునితో బ్రసంగించుచుండెను. ఇదియేమనకు బ్రకృతమునం గావలసిన కథా భాగము.

క్రీడాభి రామమున పై మిత్రులిర్వురు నేగి సమార్గమేదిశనుండి యేదిశకేగెనో సమగ్రము గం జెప్పబడలేదు కొన్నిస్థలముల మాత్రమే యా బ్రశంసగలదు. దానిని బట్టి యుదాహృ తములగు పురభాగముల యుసికిని నిర్ణయింప వలెను.

అంతకుం బూర్వ మాంధ్రనగరీ దుర్గపు బ్రస్తుతావస్థ నించుక వర్ణింపవలసి యున్నది. ఏకశిలానగర మిప్పటి వరంగల్లున కొక మైలు దూరమునందున్నది. కోటకు వెలుపల నొకమట్టి గోడయున్నది. అందునాలుగు ద్వారములున్న ను పశ్చిమమున మాత్ర మొకశిలానిర్మితమగు ద్వారముగలదు. కోటలోనికిం బోవలెనన్నచో దీనిని దాటియే పోవలెను. దీని పై భాగమున నిటుకలతో నిర్మింపబడి గుండ్రని పిల్లగోడ యు న్నది. నిర్మాణవైఖరిని జూడ నియ్యది తురు ష్కులచే గట్టబడినటులున్నది. ఈ ద్వారము నుండాటి కొంతదూరమేగినచో శిలాప్రాకార ముం గాంచనగును. గోలకొండ, భువనగిరి మున్నగు దుర్గములయందువలె నిచ్చటంగూడ నీ శిలాప్రాకారము మిక్కిలి బలిష్ఠముగ నున్న ది. ఇందలి శిలలనతికించుటకు సున్నముపయో

గింప బడియుండలేదు. పెద్ద పెద్ద బండల నొక వైపు నున్నగజేసి, యొకదానిపై నొకదానినుం చి, వాని కిఱుపార్శ్వములను చిన్న చిన్న శిలా ఖండములఁబెట్టియు, నొకదానినింకొక దానిలో నికి దొలిచి దూర్చియు, నొకవరుసనునిర్మించిరి. ఆపై వరుసలోననేకములగుచిన్న రాళ్ళనునిచి, తిరి గిమూడవదానిలోపెద్దరాళ్ళనునిర్మించియుండిరి. ఇట్టిప్రాకారములను, రెంటినిసుమారు రెండు న్నర గజములదూరమున నిర్మించి వానినిసువి శాలమగు ఫలకములచేగలపియుండిరి. ఈవిధ మునరథగజతురగపదాతివర్గము నడచిననుచలిం పని బలిష్ఠమగు నొక ప్రాకార మేర్పడియెను. ఈనిర్మాణపద్ధతికి Cyclopean Masonry యనిపేరు. ఈశిలాప్రాకారమునకు లోపలి భాగమున గోడనంటి యంతయెత్తునకు నేగు నొక శిలాసోపానపంక్తి కలదు. గోడవెలుపల నచ్చటచ్చటఁ గన్పించు గోతులు కందకము నందలి భాగములై యుండ నోపును. ఈగో డకు పశ్చిమము నందొక చేక్కని ద్వార ముగలదు. దాని కిరుపార్శ్వములను క్రింది భాగమున రెండుమకరములుగలవు. ద్వారము లోని మార్గమతివక్రముగనున్నది. అందలిదూ లములపైనను, గోడలోనిరాళ్ళపైననుఁ గూడ చేక్కని నగిషీపనిగాంచేనగుచున్నది. రాతిగోడ లో భాగమున గోటకుబశ్చిమదక్షిణముగగో డకు సమీపముగ "ఎర్లుల్ గుడి" యనిపిలువబడు వీరులగుడిగలదు. ఈద్వారమునకెదురుగ "కుషీ మహల్" అని పిలువబడు నొకవిశాలభవనముగ లదు. ఇయ్యది మార్గమునకుఁగుడిభాగమునం దున్నది. ఇచ్చటనుండికొంచెముదూరమేగినచో నొకజీర్ణమంటపము గాననగును. విశేషశిల్పక ళానైపుణిఁజూపునీ మంటపమునందలి భాగము లు చూపఱులకువిస్మయమునుఁగొలుపుచున్న వి. దీనికి నాల్గువైపులను దేదీప్యమానములు ను మనోహరములునగు నాలుగు మహోన్నత ద్వారములు గాంచేనగుచున్నవి. ప్రాచ్యశిల్ప కళాభిజ్ఞుఁడగు ఫెర్గుసన్ పండితుఁడు వీనిని సాంచీస్తూపమునందలి ద్వారములకు సరిపోల్చి యున్నాడు. కజిన్స్ అను నింకొకపండితుడు "ఈ ద్వారములు శిథిలములుగాక నితరభవన ములతోగూడి యుండినపుడు గుజరాత్‌లోని సిద్ధమాతృ దేవాలయమునకు సరియైయుండెడి వనుటకు సందియములేదు" అని వ్రాసియు న్నాడు.[205] వీనికించుక దక్షిణ పశ్చిమమున శంభుగుడిగలదు. ఈయాలయోపరిభాగము మెట్లమెట్లగ గట్టబడి, జైననిర్మాణమువలె గన్పడుచున్నది. దీనికిఁ దక్షిణముగ మేడ్రా యన్ గుడియున్నది. ఇది యొక వీరశైవాల య మయియుండును. రోడ్డున కుత్తరమునను, జీర్ణమంటపమునకుఁ బ్రాగుత్తరముగను, వీర భద్రాలయము గలదు. ఇందలి గర్భాలయ ద్వారమున కిరుపార్శ్వములనుండిన ద్వారపా లకులిపుడు నేలపై పొఱలుచున్నారు. ప్రా జ్ఞుఖమగు నీయాలయపు ముఖమంటపమున పదియారు స్థంభములున్నవి. కట్టడముసామా న్యమైనది. రోడ్డునకుఁ దుదిభాగమున, కోట తూర్పుద్వారమునకు సమీపమున విష్ణుగుడి యున్నది. ఒకప్పుడు మహావైభవము నంది యుండినయీదేవాలయ మిప్పుడు మహాదైన్య మగు నవస్థ ననుభవించుచున్నది. దీనికిఁ బశ్చి మమున వెంకటేశ్వరాలయమున్నది. ఇందు చేక్కనిశిల్పము గాంచేనగుచున్నది. దుర్గము నకు బ్రాగ్దక్షిణభాగమున, శంభుగుడి కెదురు గ, రోడ్డునకుఁ గుడిభాగమునం దొక యున్నత

205 Cousens—Autiquities of the Nizam's Dominions.

కాకతీయ సంచిక

ఏకశిలానగర దృశ్యములు.

౧. శిలాప్రాకారము-లోభాగము.



౨. మనోహరమగు ద్వారము.



౩. చెదరిన నంది.

By Courtesy of the "Bharati" Madras.

9UB

౪. రాజుత్రల



౫. స్వయంభూ దేవాలయము-భిన్న శిల్పములు.



౬. స్వయంభూ దేవాలయము.

By Courtesy of the "Bharati" Madras.

మగు శిలగలదు. దీనిపై నొకవిశాలమగు ముఖమంటపముగల దేవాలయమున్నది. దీని పైభాగమున శతఘ్నుల నుంచుటకనువగు దిమ్మలు కట్టబడియున్నవి. దుర్గమధ్యమునందుండి త్వరితముగఁ జూపఱుల మనముల నాకర్షించు నీశిలారాజమునుండియే యీపట్టణమున కేకశిలానగరమను నామమువచ్చియుండును.

ఇంతవరకును క్రీడాభిరామమునుండి యేకశిలానగరమును గూర్చి తెలియు విషయములను పేర్కొని,బ్రకృతదుర్గమునందలి భాగములను వర్ణించియుంటిమి. ఇటుపై నాగ్రంథమున బేర్కొనబడిన భాగములను బ్రకృతదుర్గమున సరిపోల్చవలసియున్నది. టిట్టిభ శెట్టియు మంచనశర్మయు సూర్యోదయమునుగాంచి వెళిపాళెము కట్టకడట మేదరివాడను బ్రవేశించిరి. అట్లనుటచే వారు పూర్వాభిముఖులై బశ్చిమమునుండి దూర్పున కేగియుందురని చెప్పవచ్చును. వారనుసరించిన మార్గము మైలసంత, హోళికవాటి యనువానినిదాటి యుత్తరముగా మోహరివాడకేగి, యటనుండి యుత్తరముగానేగి, బాహ్యాకటకమునుదాటి, సింహద్వారముగుండా శిలాప్రాకారము నతిక్రమించి, యాలువరి క్రిందిత్రోవగానేగి, వీరులగుడికి బోయినది, దానినుండి రాతిగోడలోని సింహద్వారమునకు సమీపముననే వీరులగుడి యుండెననియు, ద్వారమునకు దక్షిణముగ బాహ్యాకటకమునందు మోహరివాడ, వెళిపాళెమునుండి నవనియు స్పష్టమగుచున్నది. బ్రకృతదుర్గమునందు శిలాప్రాకారపు బశ్చిమ ద్వారమునకు సమీపముననేవీరులగుడి (ఎర్లుల్ గుడి)గలదు.అందువలనవీరులగుడియొక్క స్థితిని బట్టి మంచెనటిట్టిభు లిర్వురును బశ్చిమమునుండియే ఏకశిలానగరమును బ్రవేశించిరని చెప్పవలెను. ద్వారమునుదాటగనే పైమిత్రులు ప్రక్కదారినేగిరి. వారుమొదటజూచిన వీరులగుడి ద్వారమునకు దక్షిణమునందున్నది. గానా నామిత్రులు దక్షిణముగ మరలియుందురు. శిలాప్రాకారము కొంతదూరము మాత్రము బశ్చిమముగనేగి యటుపై బూర్వదక్షిణముగ దిరిగి క్రమముగ దూర్పునకేగును. వీరులగుడినుండి ముందునకేగుచు నావిటద్వయమును ఏకవీరా, చముడేశ్వరీ, భైరవ, ముసానమ్మ, కుమారస్వామి, పాండవులు మున్నగు దేవతల గుళ్ళనుజూచి యుండుటచే వారిదారి గూడ బూర్వదక్షిణముగనే యుండవలెను. అటకు దక్షిణమున తురకలమసీదుండెను. కొంతదవ్వుల కేశవ శ్రీస్వయంభూనికేతనములుండినవి, ప్రస్తుత శంభుగుడి, విష్ణుగుడియునే పైయాలయములు, ఇయ్యవి రెండునుఁ బశ్చిమ బ్రాగ్దిశలనున్నవి. అనగా మైలారుదేవళమున నిలచి దక్షిణదిశకుదిరిగి మశీదును, దూర్పునకుదిరిగి విష్ణుమందిరమును, బశ్చిమముగా దిరిగి స్వయంభు దేవాలయమును నామిత్రులు జూచియుందురు. ఇటనుండియే వారాంధ్రాధీశుమోసాలపై మోసిన రెండెన్మిదులను వినిరి. ఈరాజప్రాసాద ముత్తరదిశ నుండవలెను. దీనినుండి వీరులగుడికిబిమ్మట మైలారు దేవాలయము ముఖ్యవిశ్రమ స్థానమనియు నచటకే దక్షిణమున మశీదును, దూర్పున కేశవనికేతనమును, ఉత్తరమున రాజప్రాసాదమును, పశ్చిమమున శంభుగుడియు నుండెడివనియు, స్పష్టమగుచున్నది. పిమ్మట నామిత్రులు బ్రాహ్మణవాడలో భుజించి, వేశ్యవాటికకేగిరి. ఇవి రెండును గోటదక్షిణ భాగమునం దుం

డవలెను. వేశ్యవాటికనుండి బయల్వెడలి యావిటులు భైరవాలయమును, రథ్యాముఖ శివచత్వరప్రాపామంటములను విలోకించి యార్యవాటికంబ్రవేశించిరి. పిమ్మట మంచన దగ్గరనున్న వీరభద్రాలయమువెనుక బావిలో సంధ్యవార్చెను. ఇప్పటి దుర్గమున శంభుగుడికి సమీపమున బ్రాగుత్తరముగ వీరభద్రాలయమున్నది. శంభుగుడి ద్వారము దూర్పునకుగలదు. దీనికి దక్షిణముగనే 'మేదరాయన్‌గుడి' యను నొకయాలయమున్నది. దీనినిబట్టి కోట దక్షిణభాగము నందున్న వేశ్యవాటికనుండి యుత్తరముగా భైరవశంభుదేవళముల ప్రక్కగా బోవుమార్గము నీమిత్రు లనుసరించిరనియు శంభువీరభద్రాగారముల చుట్టునుండిన ప్రదేశము ఆర్యవాటికయనియు స్పష్టమగుచున్నది.

పై సమన్వయమునుండి 14వశతాబ్దమునాటి యేకశిలానగరదుర్గవిభాగములను, అందలి సాంఘికజీవితము నీక్రింది విధమున నిర్ణయింపవచ్చును.

(1) బాహ్యకటకము:—ఇయ్యది రాతిగోడకును మట్టిగోడకును మధ్యనుండు భాగము. ఇందు మోహారివాడ, వెళిపాళెమునను రెండు విభాగములుండెడివి. వెళిపాళెము కట్టకడపట, ననగా మట్టిగోడనంటి మేదరివాడయుండెడిది. ఈమట్టిగోడవెలుపల నొకయగడ్డయుండెను. ఇందుండిన జలమును వెళిపాళెములోని మేదరులు, ఛండాలురు మున్నగువారు స్నానాదులకై యుపయోగించు కొనుచుండిరి. ఈభాగమున గర్ణాటదేశీయులు గూడనుండిరి. మేదరివాడకు బ్రాగుత్తరముగ మైలసంతగలదు. ఇటుపై వెళిపాళెము మధ్యగా హాళికవాటి యుండెడిది. ఇందు కర్షకులుండిరి. పాడిపంటలు సమృద్ధిగనుండుటచే నిచటిస్త్రీలు గుమ్మముముందుగ పిడకల నెండించుచుండిరి. ఇంతవరకు నొకపెద్దబాటయుండినది. అటుపైన, అనగా, వెళిపాళెము ప్రాగుత్తరమున జనులు జూదము మున్నగు వానితో ప్రొద్దుబుచ్చుచుండిరి. ఈప్రదేశమున కుత్తరమున మోహారివాడగలదు. ఇది వేశ్యలుండెడి స్థలము. అలంకారాడంబరమును, శృంగారము నిచ్చట సర్వసామాన్యముగ నుండెడివి.

(2) సింహద్వారము:— శిలాప్రాకారమున బశ్చిమదిశను మోహారివాడకుత్తరమునందున్నది. ఎత్తగురాతిగోడచుట్టును, మిక్కిలిలోతైన యగడ్తయుండెడిది. పాముమెలికలవలె వంకరయైన దారిద్వారమునుజేర్చును. ద్వారమున కుంగల పెద్దతలుపులు బంగారుతోచేయబడినవి. ఈమార్గమంతయు రథఘోటశకటకరటి యూథములచే బహుసమ్మర్దముగనుండెను.

(3) దేవాలయములు:— ఆకాలమున వీరపూజ బ్రచారములో నుండుటచే నోర్గల్లులోవీరులగుడి యుండెడిది. ఈయాలయము ముందరజేరి నాయకులు తాళవాద్యములతో పల్నాటివీరుల చరిత్రమును బాడుచు ప్రజల కుత్సాహము నొనగూర్చుచుండిరి. ఏకశిలానగరమున బ్రజాసామాన్య మేకవీరాదేవిని బూజించుచుండిరి. ఈమెకు మండపాక, పెనుబాక, మాహురము, నాగవరము, పొలాసయను చోట్లగూడ నాలయము లుండెడివి. ఈమె జమదగ్నిముని భార్యయవతారమని తెలియుచున్నది. ఈయాలయమున కెదురుగ నిలచి యొకబవనీడు వాద్యములతోగూడ బరశురాముని కథనుబాడుచుండెను. కామవల్లీ మహాదేవియను కామేశ్వరి నభీష్టావాప్తికై యప్పటిజను లారాధించుచుండిరి. మైలారుదేవుడుగూడ జనసామాన్యమున కిష్టదైవతము



నాలుగవ కోటగుమ్మము.

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.

వారంగల్ కోట — జీర్ణమంటపము.

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.

లలో నొక్కడుగ నుండెను. ఈతనిని భైరవునితో సమముగ బూజించుచు నీతనియెదుట భక్తులావేశపరులై యనేక సాహసకార్యముల నాచరించుచుండిరి. వీరలుగాక భైరవుడు, చమడేశ్వరీశక్తి, వీరభద్రేశ్వరుడు, భౌద్ధదేవుడు, ముసానమ్మ, కుమారస్వామి, పాండవులు మున్నగు దేవత లాకాలమునం దాంధ్ర నగరిలో నారాధింపబడిరి. అట కేశవ స్వయంభుదేవులకు హేమశిఖరములుగల యాలయరాజము లుండెడివి.

(4) గడియారము:— మహోన్నతమగు గాకతీయరాజ ప్రాసాదమునం దొకగడియార ముండెడిది. గడియారమనగా నేటి కాలదోతకమగు యంత్రముగాక ఘడియలు కొట్టబడు స్థలమని యర్థము. ఈ కాలపుశాసనములనుండి దేవాలయములలో గూడ నిట్టి గడియారము లుండెడివని తెలియుచున్నది. టిట్టిభమంచనలు రెండెనిమిదులను వినిరట. అనగా పదియారు ఘడియలగును. ఇట్లు నేటికిని సంస్థానములలో గంటలుకొట్టు నాచారము గలదు.

(5) పూటకూటిల్లు:— ఇయ్యది బ్రాహ్మణవాడలో నుండెడిది. దారి నడచువారికి వంటయిండ్లనుండి వచ్చు తాళింపువాసనలు నోరూరజేసెడివట. ఈవాడలోని పూటకూటింట భుజించువారలు పైకమీయవలసి యుండెను. ఒక గూకకు కప్పురభోగివంటకము, కమ్మని గోధుమపిండి వంట, గుప్పెడుపంచదార, అప్పుడేకాచిన నెయ్యి, కొమ్మరటి పండ్లు, నాలుగైదు నంజుళ్ళు, చక్కని పెరుగుమున్నగు పదార్థములతో దృప్తికరముగ భోజనము పెట్టబడుచుండెడిది. ఇట విటులకు దగు నేర్పాట్లుగూడ గావింపబడు చుండెడివి.

(6) వేశ్యవాటిక:— ఇయ్యది యలంకారమునకును శృంగారమునకు నాటపట్టుగ నుండెడిది. శ్రీగంధముమున్నగు సుగంధద్రవ్యములు విరివిగ నిట వాడబడు చుండెడివి. ఇందే ప్రతాపరుద్ర ధరణీశోపాత్త గోష్ఠీప్రతిష్ఠాపారీణయు, మహావిభవోపేతయునగు మాచల్దేవియను వారాంగన యుండెడిది. ఈమె విలాసముగ జిత్రశాలా ప్రవేశమొనర్చుచుండెను. ఈ కాలమున వేశ్యలలో ముందు గణికావృత్తి నవలంబింపబోవు పడుచుల 'కద్దము జూచుట' యను నొక వేడుకను జరపుటాచారముగ నుండెడిది. అప్పటి వారకాంతలు మద్యపానము జేయుచుండిరని గ్రీడాభిరామమునుండి తెలియుచున్నది. అదేగ్రంథము నుండి యీ జారవృత్తికిగూడగొన్ని నియమములుండెడివనియు, వేశ్యలొనర్చు మోసములను విచారించి, దగుబ్రాయశ్చిత్తములను విధించుటకై విటులును బౌరులును ధర్మాసనంబుండుటాచారమై యుండెననియు దెలియుచున్నవి.

(7) వినోదములు:— ఇంతవరకును విటుల కోర్గల్లులో లభ్యములగు వినోదములను బేర్కొనియుంటిమి. ప్రజాసామాన్యముగూడ ననేక విధములగు వినోదములను గల్పించుకొనుచుండిరి. వెళిపాళెమున జూద మొకగాలక్షేపముగ నుండెడిది. కోటలో భాగమున నిట్టివి మఱికొన్ని యుండెడివి. అచ్చట పాములవాండ్రు నాగస్వరమును బట్టుచు బాములనాడించుచుండిరి. మఱియొకచో మేషయుద్ధములును, కోళ్ళపోరును జరుగుచుండెడివి. వీని వీక్షించుచు బందెముల నొడ్డుచు జనులమితోత్సాహము నందుచుండిరి.

ఇటుల ప్రతాపరుద్ర చక్రవర్తి కాలమునం దోర్గల్లుపట్టణ మపూర్వశోభాయుతమై, వివిధ

వినోదముల కాలవాలమై, ఢిల్లీనగరమున కెన యై యొప్పుచుండెను.

విజయనగర నిర్మాణము:—ప్రతాపరుద్ర చక్రవర్తితో గాకతీయసామ్రాజ్యమస్తమించినపిమ్మట నాంధ్రదేశమునందుద్భవించిన రాజ్యములలో దక్షిణ పశ్చిమమున నెలకొల్పబడిన విజయనగరరాజ్యము గూడ చేరియుండెనని ముందుచరిత్రమున జెప్పి యుంటిమి. రెడ్డి పద్మనాయక సామ్రాజ్య స్థాపకులవలె నీవిజయనగరనిర్మాతలు గూడ గాకతీయాంధ్రసామ్రాజ్యాంత్యకాలమునం దేకశిలానగరమునందుండియుండిరనియు, నీనూత్న సామ్రాజ్యమాంధ్రసామ్రాజ్యమే యనియు మావిశ్వాసము. విజయనగర రాజ్యోత్పత్తిని గూర్చియు, తన్నిర్మాణక్రమమును గూర్చియు ననేకు లనేక విధముల నభిప్రాయపడియున్నారు. ఇంతవరకు నందలి వాస్తవము నిర్ణయింప బడియుండలేదు. ఈసమస్యను చర్చించినగాని ప్రతాపరుద్రచక్రవర్తియొక్కయు, తాత్కాలికాంధ్రుల యొక్కయు ప్రతిభావిశేషముల నెఱుంగ వలను పడదు.

విజయనగరరాజ్యోత్పత్తిని చర్చించునెడ మూడు విశేషములు ముఖ్యముగ గమనింపదగియున్నవి. కొన్నిప్రమాణములనుండి తద్రాజ్యస్థాపకు లాంధ్రదేశమునుండి వలసపోయిరనియు, నాంధ్రరాజ్యమునే వారలు తుంగభద్రాతీరమున నెలకొల్పిరనియు, తుదకు వారలు గాకతీయులకు సన్నిహితబంధువులనియును గూడ దెలియు చున్నది. దీని నాంధ్రోత్పత్తి వాదమని పిలువ వచ్చును. దక్షిణదేశపు పరిశోధకపండితులీ వాదమునకుగల ప్రమాణములను విశ్వసింపక, విజయనగరనిర్మాతలనబడు సోదరులు హోయసలరాజసామంతులనియు, హోయసల బల్లాలునిచేతనే విజయనగరము నిర్మింప బడెననియు పేర్కొనుచున్నారు. దీనిని హోయసలోత్పత్తి వాదమని చెప్పనగును. ఇటులుండగర్ణాటకపండితులు కంపిలరాజ్యము తురుష్కుల వశమయినపిమ్మట హతశేషులగు నిర్వురు సోదరులు తురుష్కసామంతులుగనుండి, క్రమముగ స్వతంత్రించి, విజయనగరమును నెలకొల్పిరని వాదించుచున్నారు. ఇయ్యది కర్ణాట కోత్పత్తి వాదమని పేర్కొనదగును. ఈ వాదములందలి వాస్తవము నెఱుంగుటకు వీనినించుక సవిమర్శముగ బరిశీలింపవలసియున్నది.

హోయసలోత్పత్తి:—డాక్టరు కృష్ణస్వామిఅయ్యంగారు, లూయీరైస్, కృష్ణశాస్త్రి మున్నగు పండితులు క్రీ. శ. 1327. లో తురుష్కులు ద్వారసముద్రమును వశపఱచుకొనినపిమ్మట హోయసల రాజగు మూడవ బల్లాలుడు తన రాజధానిని దక్షిణదేశమునందలి తిరువణ్ణామలె దుర్గమునకు మార్చుకొని, తన యుత్తరపు సరిహద్దును రక్షించుటకునై తుంగభద్రాతీరమున విజయనగరమును నెలకొలిపి, హరిహరుడను సామంతుని దత్పరిపాలకునిగ నియమించెనని యభిప్రాయపడియున్నారు. 206 హీరాస్ పండితు డీయభిప్రాయమును విపులీకరించి యీవాదమునకు ప్రత్యేక వ్యక్తిత్వము నేర్పఱచెను. వారి వాదమునందలి యీక్రింది ముఖ్యాంశములను గమనింపనగును.[207]

(1) న్యూనిజ్ అను పోర్చుగీస్ యాత్రి

206 Ep. Carn. VI Intr. P. 21. A. S. R. 1909—1910 P. 160 South India & her Mahammadan Invaders P. 171, 181—182.

207 Beginnings of Vijayanagar—Rev. H. Heras. ఈపుస్తకమునుండియే రాస్ గారి యభిప్రాయములు గైకొనబడియున్నవి.

కుని వ్రాతలనుండి మొదట తురుష్కులచే బందిగ గొంపోబడి, పిమ్మట వారిచే విడువబడిన యొకనిచే విజయనగరము నిర్మింపబడెనని తెలియుచున్నది. మూడవ బల్లాలుని విషయమున నియ్యవి వర్తించు చున్నవి. ఈతడు తన పుత్రుడగు వీరవిజయవిరూపాక్షునిపేరిట విరూపాక్షపట్టణమను నొక నగరమును తుంగభద్రాతీరమున నిర్మించెను. ఇదియే విజయనగరము, తన్నిర్మాత మూడవ బల్లాలుడు.

(2) న్యూనిక్ పేర్కొనిన పూర్వవిజయ నగరరాజుల నామముల నీ క్రిందివిధమున సమన్వయింపవలెను-

న్యూనిక్.	హీరాస్.
దేవరావ్ —	మూడవ బల్లాలుడు
బుకారావ్ —	మొదటి హరిహరుడు
పురియెరి దేవరావ్ —	మొదటి బుక్కరాజు
ఆజారావ్ —	రెండవ హరిహరుడు

(3) బరకూరు మున్నగు దుర్గములలో సన్నిహితకాలముననే బల్లాలునియొక్కయు హరిహరుని యొక్కయు ప్రశంస గాననగుచుండుటచేతను, హరిహరునివంశమునను హొయసల సామంతుడగు దాదికేశవనాయకుని వంశమునను మల్లిఖార్జు నాదినాము లనేకులు గన్పించుచుండుటచేత, నారెండువంశములునొక్కటే యగుట వల్లను, హరిహరాదులు హొయసలులయెడ ననేక విధముల దమ కృతజ్ఞతను జూపుచుండుటచేతను, హరిహరుడు నాతని సోదరుడగు బుక్కరాజును హొయసల సామంతులని చెప్పనగును.

హొయసలబల్లాలుడు తిరువణ్ణామలై దుర్గమునకు తన రాజధానిని మార్చియుండెనను టకు సరియగుప్రమాణములు గానరావనియు, క్రీ. శ. 1327 నుండియు నాతడు పెక్కుస్థలముల పరిభ్రమించుచు, 1330 లో నాదుర్గము నుండి వెడలి, 1341 వఱకు నచ్చటికి తిరిగివచ్చియుండలేదనియు, ద్వారసముద్రము నాతడు విడనాడక 1335—41 ల నడుమ నచ్చటనే నివసించియుండెననియు, శాసనప్రమాణముపై డాక్టరు వెంకటరమణయ్యగారు నిరూపించియున్నారు. తురుష్కుల దాడికోర్వజాలక బలాయితుడైయుండిన బల్లాలుడు క్రీ. శ. 1327 నకు పిమ్మట తురుష్క రాజ్యమున జేరియుండిన తుంగభద్రాతీరమున విజయనగరమును నిర్మించుట యసమంజసమనిగూడ వారు జూపియున్నారు.[208] హీరాస్‌గా రనుకొనినటుల న్యూనిజ్ వ్రాతలు బల్లాలునికి వర్తింపవు. ఆతడు తురుష్కులచే బందీకృతుడై సంహరింపబడియెను. అట్టిచో నాతని విముక్తియు రాజ్యస్థాపనము · నసంభవములు. పై పండితుని రాజనామసమన్వయము భాషాపరిణామమునకు విరుద్ధముగ నున్నది. నిర్దుష్టమగు స్యూయల్ పండితుని సమన్వయము దీనియందలి దోషమును చూపుచున్నది-

న్యూనిజ్	హీరాస్	స్యూయల్
దేవరావ్	3వ బల్లాలుడు	1వ హరిహరుడు
బుకరావ్	1వ హరిహరుడు	1వ బుక్కరాజు
పురియొరిదేవరావ్	1 వబుక్కరాజు	2వ హరిహరుడు
ఆజారావ్	2వ హరిహరుడు	

అనతికాలమున నొకేస్థలమున బల్లాల హరిహరుల ప్రశంస యుండినంత మాత్రమున

వారికి స్వామిసేవకన్యాయము నాపాదింపతగదు. శాసనములందెచ్చట నీవిషయము తెలుపబడి యుండలేదు. అదియునుగాక మల్లినాథుడు, బుక్కరాజు మున్నగు వారలు హోయసలులతో పోరియుండినటుల శాసనములనుండి తెలియుచుండుటచే హరిహరుడు బరకూరు మున్నగు దుర్గములయందు బల్లాలునితోపోరి, వాని నాక్రమించుకొనియెనని స్పష్టమగు చున్నది.[209] కేవల నామసామ్యముపై నాధారపడు హీరాస్‌గారి వాదము కూడ ప్రమాదకరమే. 11,12,13 శతాబ్దములలో నాంధ్రదేశము నేలిన రాజవంశములలో ననేకులు రుద్ర, గణపతి, మహాదేవ, రాజేంద్ర, భీమనామాభిదు లుండిరి. అంతమాత్రమున. గొలనిగణపతిని గాకతీయ గణపతి దేవచక్రవర్తిగను, కొలనిరుద్రుడు, నతవాటి రుద్రుడు రేచెర్ల రుద్రుడు మున్నగువారిని కాకతి రుద్రునిగను సమన్వయింప నగునా? ఈ యభిప్రాయము లన్నియు నిటులుండ, హోయసలోత్పత్తి వాదమునకు మూలస్థంభులగు హీరాస్‌గా రొక స్వల్ప ప్రమాణమును సమన్వయింపజాలక తమ యుక్తివాదమును తామే ఖండించుకొని యుండిరి. కర్ణాటకము నందలి యొక శాసనమున "దిగ్విజయానంతరము బుక్కరాజు తుంగభద్రాతీరమున విజయనగరమును నిర్మించి, యందు భవనములు రాజమార్గములు మున్నగువానిని నెలకొల్పె" నని చెప్పబడియున్నది. ఈ శాసనముపై వ్యాఖ్యానము చేయుచు హీరాస్‌గా రిందలి విషయములు వాస్తవములు కావనియు, నింతకు పూర్వము బల్లాలుడు నిర్మించియుండిన నగరమున బుక్కరాజు భవనాదికముల నిర్మించి, దాని నభివృద్ధిపఱచెనని యన్వయింపవలెనని యు వ్రాసియున్నారు. అయినను వారింకొకచో నీ వ్రాతలయందలి దోషమును గ్రహించి, యీ యభిప్రాయము సరికాదనియు, బుక్కరాజే విజయనగరమును నిర్మించెననియు తమ యభిప్రాయమును సరిచేసికొనియున్నారు.[210] పై విమర్శనుండి హోయసలోత్పత్తివాదము నందలి వాస్తవ ప్రామాణ్యములు స్పష్టములగు చున్నవి.

ఆంధ్రోత్పత్తివాదము-ఇక రెండవదగుదీనిని బరిశీలింపవలసి యున్నది. ఈ విషయమున నీ క్రింది పండితుల యభిప్రాయములు నితరప్రమాణములును ముఖ్యములు—

(1) విజయనగర చరిత్రకారులగు బి.సూర్యనారాయణరావుగారు "యీసోదరులు తమగురువగు విద్యారణ్యుని సాహాయ్యమున క్రీ. శ. 1336 లో నీనగరమును నిర్మించి" రని వ్రాసియున్నారు.[211]

(2) "ఈసోదరు లేకశిలానగరాంధ్రరాజ్యమునుండి పలాయితులైరని చెప్పుటకు బ్రబల నిదర్శనము లున్న"[212] వని వి. ఏ. స్మిత్తు పండితుని యభిప్రాయము.

(3) స్యూయల్ పండితుడు "విశేషమతావేశముగల కురుబవంశీయులగు నిర్వురు సోదరులు క్రీ. శ. 1323 వఱకు నోరుగల్లున కోశాగారోద్యోగులుగ నుండి, తద్రాజ్యపతనానంతరము ఆనెగొందికి జేరి, యీ సంస్థానముగూడ తురుష్కులకు వశమగుటచే తామును వారికి

209 Ibid. 210 Beginnings of Vijayanagara "Conclusions."
211 Never-to be-forgotten-Empire. P. 24.
212 Smith—oxford history of India (1923 Edn.) P. 201.

లోనై, పిమ్మట విజయనగరమును నిర్మించి స్థిరపడి'' రని వ్రాసియున్నాడు.[213]

(4) క్రీ. శ. 1807 లో రామప్పవర్మకు డను బ్రాహ్మణునివద్దనుండి తుళువవంశీయుల చరిత్రమును సంగ్రహించిన బచ్నన్ అను నాతడు "వారలాంధ్రవంశీయులు. ఈబ్రాహ్మణుని వద్ద గల 'విద్యారణ్యశిష్య' యను గ్రంథమున హుక్క, బుక్క యను సోదరులు ప్రతాపరుద్రుని కోశాధ్యక్షులుగనుండి, పిమ్మట విజయనగరమును నిర్మించిరని చెప్పబడియున్నది'' యని విశదపఱచి యున్నాడు.[214]

(5) "ఓరంగల్లునుండి పాఱివచ్చిన యిర్వురుసోదరులు తమ గురువగు విద్యారణ్యుని సాహాయ్యమున విజయనగరమును నిర్మించి'' రని కల్నల్ విల్క్సుదొర యభిప్రాయము[215]

(6) మొదటి బుక్కరాజు కోడలగు గంగాంబ తన 'మధురావిజయము' న బ్రాచీన సంస్కృతకవుల బ్రస్తుతించి పిమ్మట నగస్త్య, విశ్వనాథాది యేకశిలానగర కవికుంజరులను పేర్కొనియుండెను.

(7) 17-వ శతాబ్దిలో రచింపబడిన "రాజకాలనిర్ణయము'' నను, కేలడి బసవకృతమగు "శివతత్త్వరత్నాకరము'' ననుగూడ నీసోదరు లోర్గల్లు నివాసులనియు, బ్రతాపరుద్రుని కోశాధ్యక్షులనియు పేర్కొనబడి యున్నది.[216]

(8) కాకతీయాంధ్ర సామ్రాజ్య మంతరించిన యనతికాలమునకే యాంధ్రదేశమున కేతెంచిన జియాఉద్దీన్ బారనీ యను మహమ్మదీయ చరిత్రకారుడు "సులతాను తనకు బ్రతినిధిగ గంపిలరాజ్యమున కంపిన సామంతుడు ఓరుగల్లు రాజగు కన్హానాయకునకు సమీపబంధువు'' అని వ్రాసియున్నాడు[217]

పై వివరింపబడిన (6)– (8) అంశములు చాల ముఖ్యములైనవి. మధురా విజయమునందలి కవిప్రశంసనుండి హరిహరాదులోరుగల్లున. దాముండిన కాలమున గాకతీయ ప్రతాపరుద్రదేవుని గీర్వాణాంధ్ర కవితాపోషణమును సవిస్తరముగ గాంచియుండి, తాము నూతనముగ నెలకొల్పిన విజయనగర రాజ్యమునం దాంధ్రగీర్వాణభాషల కెక్కుడు ప్రోత్సాహము నొసంగియుండిరని స్పష్టపడుచున్నది. మొదటి హరిహరరాయలు నాచన సోమనాథున కొనర్చిన గౌరవ మీయంశమునకు దార్కాణము. బారనీ పేర్కొనిన కన్హానాయకుడు ప్రతాపరుద్ర చక్రవర్తికి బిమ్మట నోరుగల్లునేలి మహమ్మదీయుల బ్రతిఘటించిన కృష్ణనాయకుడే యని చెప్పనగును. ఆతడు ప్రతాపరుద్రుని పుత్రుడని పేర్కొనబడి యున్నాఁడు.[218] హరిహర సోదరుల కీతనితో సమీపబాంధవ్యముండెనని నచో వారలు కాకతీయరాజబంధువులని చెప్పవలసివచ్చును. ఇట్టి నిర్ణయము విజయనగర సామ్రాజ్య మాంధ్రసామ్రాజ్యమనియు, దానితో గాకతీయులకును, విశేషించి బ్రతాపరుద్ర చక్రవర్తికి నెక్కుడు సంబంధముండె

---

213 Sewell—Forgotten Empire P. 23.
214 Never—to-be-forgotten-Empire P. 25 ff 1.
215 Wilks—Historical sketches of South India vol I. P. 13-14
216 Mackenzie Mss. No. 23-1-12 శివతత్త్వరత్నాకరము' 4 కల్లోలము' 12 తరంగము 30-31శ్లోకము
217 Elliott & Dowson-History of India as told by her own historians vol, III. 218 Ibid'

ననియుజూపి, యీ ప్రకరణారంభమునం దొన ర్చిన నిర్ధారణమును బలపఱచుచున్నది.

కర్ణాటకవాదము- ఇక మిగిలినది మూడ వదగు ఇందలి విషయములేవియు నాంధ్రోత్పత్తివాదమునకు ప్రతికూలములుగాక దానిని విశదీకరించుచున్నవి. ఈ వాదమునకు "కుమారరామనచరితె" "పరదార సోదర రామనచరితె" "బల్లాల రాయనయుద్ధ" యను కన్నడ లిఖిత గ్రంథములును[219] "రాజకాలనిర్ణయ" మను సంస్కృత లిఖిత గ్రంథమును ముఖ్యాధారములు. వీనినుండి దెలియదగిన ముఖ్యాంశము క్రీ. శ. 1323 లో నేకశిలానగరసామ్రాజ్య మంతరించిన పిమ్మటను, క్రీ. శ. 1335 లో విజయనగరము నిర్మింపబడుటకును, పూర్వముగల హరిహరాదిసోదరుల చరిత్రము. మహమ్మదీయు లోరుగల్లు నాక్రమించిన పిమ్మట నాసోదరులు కురువంశీయుడును, గంపిలరాజ్య పాలకుఁడు నగు రామనాథుని యాస్థానమున కేగిరి. వీరి తండ్రియగు సంగముడాగ్రంథములలో 'అళియసంగమ' 'భావసంగమ' యని పిలువబడుచు రామనాథుని యల్లుడుగ గన్పడుచున్నాడు. ఈసోదరు లిచ్చటగూడ కోశాధ్యక్షపదవులనే యుండి, యోరుగల్లున నిర్వహించినభారమునే నిర్వహించిరని "భాండారదహుక్క, భాండారదబుక్క" యను వాక్యములనుండి తెలియుచున్నది.

క్రీ. శ. 1327 లో తురుష్కులు కంపిలపై దండెత్తి, రామనాథుని సపరివారముగ బరిమార్చి, హతశేషులను ఢిల్లీకి బందీలుగ గొనిపోయిరి. ఈ ఖైదీలలో హరిహరుడు నాతని సోదరుడునుగూడ నుండిరి. ఈ నూతనముగ జయించిన కంపిలరాజ్యమునకు సులతా నొక తురుష్కసేనానాయకుని ప్రతినిధిగ నియమించెను. కాని యనతికాలముననే ప్రజలా తని నచ్చటనుండి తరిమివైచిరి. అంత చేయునదిలేక సుల్తాను కారాగారమునందుండిన పూర్వ రాజోద్యోగులగు నాసోదరుల నిర్వురను రావించి, వారిలో నొకరిని రాజుగను, మఱియొకనిని మంత్రిగ నొనర్చి, తనకు సామంతులుగ గంపిలరాజ్యము నేలుడని బంపించెను. న్యూనిజ్ యను పోర్చుగీస్ యాత్రికుని వ్రాతలుగూడ నిదేవిషయమును దెలుపుచున్నవి. పిమ్మట నాసోదరులు విదేశీయులగు నాదురుష్కుల నెదిర్చి, ప్రాచీనహైందవప్రతిభావిశేషమును బునరుద్ధరింప గల యొక సామ్రాజ్యమును నెలకొల్ప సంకల్పించుకొని, విద్యారణ్యుని సాహాయ్యమున తుంగభద్రానదికి దక్షిణతీరమున విజయనగరమును నిర్మించిరి.

పై చర్చనుండి విజయనగర సామ్రాజ్యము కర్ణాటసామ్రాజ్యమనుటయు, హోయసల బల్లాలుడు దానిని స్థాపించెననుటయు, ప్రమాదకరములనియు, నా సామ్రాజ్య మాంధ్రవినిర్మితము నాంధ్రాభిపోషకమునై యొప్పెననుటయు, సమంజసములనియు స్పష్టమగుచున్నది. గీర్వాణాంధ్రభాషా పోషణమునకును, యవన ప్రతిఘటనమునకును, విజయనగర సామ్రాజ్యమునకును, కృష్ణదేవరాయలకును, గాకతీయాంధ్ర సామ్రాజ్యమును బ్రతాపరుద్ర చక్రవర్తియు, నాదర్శములై యొప్పియుండిరని చెప్పవలసి యున్నది.

రెడ్లసంబంధము:—పదునాలుగవ శతాబ్ద ప్రథమపాదమున గాకతీయసామ్రాజ్య మస్త

---

219 వీని ప్రశంస Q. J. M. S. Vol. XX లో గాంచనగును,

మించిన పిమ్మట నాంధ్రదేశము బహు సంకటములకు లోనైయుండెను. దక్షిణాపథ మునంతను గలయబెట్టు నావేశముతో విజృంభించుచుండిన తురుష్కవాహిని యాంధ్రదేశ స్వాతంత్ర్యమును, వ్యక్తిత్వమునుగూడ గబళింప నుంకించుచుండెను. అట్టియెడ నీవిదేశీయులనటికట్టి యాంధ్రగౌరవము నుద్ధరించిన మహాసంస్థలలో విజయనగర సామ్రాజ్యము నుత్తరమున బ్రబలిన పద్మనాయక రాజ్యమును ముఖ్యములు. కాకతీయ ప్రతాపరుద్రదేవుని రాజ్యాంత్యమునకు నేకఛత్రాధిపత్యమునకు లోనైయుండిన యాంధ్రభూమి యాచక్రవర్తి మరణానంతరము పైవిధమున విభజింపబడియుండెను. రెడ్డి విజయనగర పద్మనాయక సామ్రాజ్య నిర్మాణములకు ప్రతాపరుద్రుని కాలముననే యంకురార్పణ మొనర్పబడియుండెను. విజయనగర రాజ్యోత్పత్తిక్రమమునుగూర్చి యిదివరలో జర్చింపబడియున్నది. ప్రకృతమున రెడ్లకును ప్రతాపరుద్రునికిని గల సంబంధమును చర్చింపుచు నాతని రాజ్యాంత్యభాగమున రెడ్డిరాజ్యము నిర్మింపబడినవిధమును పేర్కొనుచున్నాము.

కాకతీయులకాలమునందలి రెడ్లచరిత్రిమింతవరకును చర్చింపబడియుండలేదు. ఇటీవల గన్గొనబడిన నైజాంరాష్ట్ర శాసనముల నుండియు స్థానికచరిత్రములనుండియు వీరి పూర్వవృత్తాంతమును దెలిసికొనవలనుపడుచున్నది. కొందరు పండితులు రాష్ట్రిక, రాష్ట్రికూట, రట్ట, రెడ్డి యనుపదములకు సన్నిహితమగుసంబంధము గలదనియు దానజేసి చరిత్రప్రసిద్ధమగు రాష్ట్రికూట వంశమునకు జెందినవారే రెడ్లనియు దలంచుచున్నారు. ఇందలి నిజానిజము లెటులుండినను రెడ్డి కులజులు కాకతిరుద్రుని కాలమునుండియు నీ దేశమునం దుండిరని యూహింపనగు చున్నది. రేచెర్లాన్వయులును పిల్లలమఱ్ఱి, ఆమనగల్లు ప్రాంతపాలకులునగు బేతిరెడ్డి, నామిరెడ్డి మున్నగు వారి పిల్లలమఱ్ఱి నాగులపాడు శాసనము లీయూహను బలపఱచుచున్నవి. గణపతిదేవ చక్రవర్తి కాలమునందు పంటకులజులగు రెడ్ల ప్రశంసగానవచ్చుచున్నది. ఒరంగల్లు జిల్లా ముప్పవరగ్రామమున పంటబొల్లి రెడ్డి యను నాతడు రామేశ్వరదేవుని బ్రతిష్ఠించినటుల దెలుపు నొక శాసనమున్నది. స్థానిక చరిత్రములనుండి దత్తమండలములలో గూడ నీకాలమున గొందరు రెడ్డికులజులు భూస్వాములుగ నుండినటుల దెలియనగును. ప్రతాపరుద్ర చక్రవర్తి కాలమునం దనేకులగు రెడ్డిసామంతులు కాకతీయ సామ్రాజ్యపు దక్షిణభాగము నేలుచుండిరి. వారిలో నీక్రిందివార లగ్రగణ్యులు.

గణపయరెడ్డి	— నందిగూడెము —	1300
ఎల్లయరెడ్డి	— త్రిపురాంతకము	1308
అన్నమరెడ్డి	— నందిగూడెము	1314
ప్రోలయవేమారెడ్డి	— ధరణికోట	1320
దేవయరెడ్డి	— నెల్లూరు	
కాటమరెడ్డి	— పాకనాడు	

కాకతీయాంధ్ర చక్రవర్తుల కాలమునం దితర జాతులవారందరు, నభివృద్ధినందుచు రాజాదరణమునకు పాత్రులగుచుండ నీరెడ్డి సామంతు లేల నిటు లజ్ఞాతగౌరవులై యుండిరాయను సందియము పొడముచున్నది. దీనికొక ప్రబలమగు కారణముగలదు. పండ్రెండవ శతాబ్ది యుత్తరార్ధమున జరగిన పల్నాటియుద్ధము దేశమునం దనేకములగు మార్పు

లను జేసియుండెను. యుద్ధకాలమున మహా వీరుడును వీరవైష్ణవుడునగు రేచెర్ల బ్రహ్మ నాయడు వివిధవర్ణములకు జెందిన యోధుల నెల్లఱ నొకచోజేర్చి వారల కన్యోన్యభోజ నాది వివిధసంబంధముల నొనగూర్చి యుం డెను. పల్నాటియుద్ధము ముగిసినపిమ్మట నితరకులముల వారినుండివీరువేరై పద్మనాయ కులను ప్రఖ్యాతివడసిరి. అప్పటినుండియు వీరి కిని రెడ్లకును పరస్పర విరోధము లేర్పడజొచ్చి నవి. ఆకాలమున బేతిరెడ్డి కామిరెడ్డి మున్న గు మహావీరులు కాకతీయరాజుల గౌరవాద రణములకులోనై సేనానాయకాది పదవుల నలంకరించియుండిరి. ఇతరకులములనుండి వేరైన పద్మనాయకు లాత్మస్థితికై పల్నాటి యుద్ధమున పోరవలసియుండుటచే వారియం దనేక వీరశిఖామణు లుత్పన్నులైరి. ఈ సమ యమునకే యుత్తరాంధ్ర దేశమునంతటిని జయించిన కాకతిరుద్రదేవరాజు ప్రాగ్దక్షిణ మున వెలనాడుపై దండువెడల బ్రయత్నము లొనర్చుచుండెను. మహాయోధుడును స్వరా జ్యవిస్తరణైక దీక్షితుడునగు నారాజు యుద్ధ నీతినిపుణులగు నీపద్మనాయక వీరులకు దన యాస్థానమున తావొసంగి వారిని దన వెల నాటి విజయయాత్రలలో నియమించి యుం డును. ఈ విధమున నీవీరుల కాశ్రయము లభించెను. గణపతిదేవచక్రవర్తికాలమున రుద్రసేనాని తక్క పిల్లలమఱ్ఱి రెడ్లలో నెవ్వ రును రాజకీయమున బ్రాముఖ్యత వహించి నటుల గన్పడుటలేదు. దీనినుండి యీ చక్రి వర్తికాలమునకే పద్మనాయకులు తమ శౌర్య సాహసములచేతను, స్వామిభక్తిపరాయణత చేతను, రెడ్డి కులజుల నతిక్రమించి రాజాద రణము నేకభోగముగ ననుభవించు చుండి రని యూహింపనగు చున్నది. రుద్రాం బికకాలమునగూడ నీరెడ్ల ప్రశంస విశే షముగ గానరాక పద్మనాయకవీరులే యనేక రాజకీయపదవులయం దుండినటుల దెలియు చున్నది. ప్రసాదాదిత్యనాయడు మున్నగు వా రీమహారాజ్ఞి కాలమున విశేషకీర్తిగౌరవ ముల నందియుండినటుల స్థానికచరిత్రముల నుండియు, శివయోగసారమునుండియు, దెలియ నగుచున్నది. ఇందుమూలమున గణపతిదేవు నినాటనుండియు నీ పద్మనాయకులును, రెడ్లు ను, రాజాదరణకై యభ్యర్థించుచుండిరనియు, రుద్రాంబికకాలమున బద్మనాయకులు విజయ మునందిరనియు స్పష్టమగుచున్నది.

ప్రతాపరుద్రచక్రవర్తికాలమునం దీరెడ్డి పద్మనాయకవిరోధాగ్ని యొక్కసారిగ బ్రజ్వ రిల్లినది. రాజ్యాభిషిక్తుడయినవెంటనే యీచ క్రవర్తి డెబ్బదియేడు రాజ్యాంగనియోగముల నుండియు నితరజాతినాయకులను తొలగించి పద్మనాయకులనే నియమించెనని ప్రాచీన చరి త్రములలో జెప్పబడియున్నది. ఇంతవఱ కును గాకతీయరాజు లిట్టికార్యము నొనర్చి యుండలేదు. పద్మనాయకులయెడ బక్షపాత ము జూపుచుండినను వారలితర జాతివారల నవమానించి యుండలేదు. ప్రతాపరుద్రదేవుని యీ ప్రథమరాజ్యాంగ సంస్కరణము రెడ్డి సామంతులను హతాశుల నొనర్చివైచెను. వారికి రాజకీయగౌరవములు దుర్లభములని స్పష్టపడియెను. ఇటనుండియు రెడ్లు తమయెడ నొనర్పబడిన యీ యపకృతికి బ్రతీకార మొనర్చి చక్రవర్తిని దమ స్వాధీనమొనర్చు కొని తన్మూలమున బద్మనాయకులను పద భ్రష్టులనొనర్ప బ్రయత్నింప మొదలిడిరి. ఈ కార్యదీక్షను బూని వారలు జాతీమత్తా

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

వేశము నాంధ్రదేశాపాయములను సైతము సరకుచేయక, స్వార్థము నభివృద్ధిపఱచుకొని యుండిరి. ప్రతాపరుద్రదేవుని కాలమున గొందరు రెడ్డికులజులు సామంతపదవులనుండి యుండిరని యింతకుమున్ను పేర్కొనియుంటి మి. వీరలేగాక నోరుగల్లునగరమునం దీ కాలమున దొంతియల్లాడరెడ్డి యను నొక కర్షకుడుండెననియు, నాతనికి మాచ, వేమ, దొడ్డ, అన్న, మల్లయను నైదుగురు కుమారులుండిరనియు, వారిలో రెండవవాడగు ప్రోలయవేమారెడ్డి క్రీ. శ. 1320 ప్రాంతమున ధరణికోటలో స్వాతంత్ర్యస్థాపనము నొనర్చెననియు, "రెడ్లచరిత్రము" నం జెప్పఁబడియున్నది. దక్షిణదేశమునందుండిన రెడ్డిసామంతుడుగ బేర్కొనబడిన యన్నారెడ్డియు, నల్లాడరెడ్డి నాల్గవ పుత్రుడగు నన్నమరెడ్డియు నొక్కరేయని చెప్పవచ్చును. అటులయినచో ప్రోలయవేముడు సేనానాయకుడుగను, ఆతని యనుజుడగు నన్నమరెడ్డి యొకసామంతుడుగను, ప్రతాపరుద్రచక్రవర్తి కాలమునందుండిరని తెలియుచున్నది. వీరిద్దరు నాకాలమున రెడ్డికులమునకు నాయకులై యుండిరి. చక్రవర్తి తననియోగములను నంస్కరించిన పిమ్మట నీరెడ్డినాయకులిర్వురును జేరి యితరుల సహాయమున ప్రబలవిద్రోహముల నొనర్చిరనుటకు గొన్నినిదర్శనము లగపడుచున్నవి. ఈకాలపు శాసనమొకటి చక్రవర్తి సామంతు డొకడు శత్రువుల నిర్జించి గండికోటదుర్గమును స్వాధీనమొనర్చుకొనియెనని తెలుపుచున్నది. కాయస్థ సామంతులగు ద్రిపురాంతకాంబదేవాదుల విద్రోహమునణంచి చక్రవర్తి యాజ్ఞానుసారము క్రీ. శ. 1304_1313 ల నడుమ పట్టసాహిణి సోమయనాయకు డాదుర్గమును బాలించెను. నాచరిత్రములనుండి [illegible] జుట్టయలంక [illegible] నాత డీదుర్గమున [illegible] చున్నది. దీనినుండి [illegible] శత్రు విజయము సోమయనాయకుని మరణానంతరమును, జుట్టయలంక గొంకారెడ్డి యేతెంచుటకు బూర్వమును, అనగా క్రీ. శ. 1313-14 ల నడుమ గండికోటదుర్గమున జరిగిన విద్రోహము నణంచుటకేయని చెప్పనగును. ఇట్టి యూహ నితరకారణములుకూడ బలపఱచుచున్నవి. ఇంతియగాక నీ విద్రోహమునకును రెడ్లకు నెక్కుడు సంబంధముండినటులగూడ నూహింపవలనుపడుచున్నది. మహమ్మదీయులు ప్రథమమున క్రీ. శ. 1309 లోను రెండవతూరి క్రీ. శ. 1320_21 లోను దండెత్తియుండిరి. దక్షిణపశ్చిమముల హోయసల రాజులు కాకతీయులకు మిత్రులుగ నుండిరి. ఇట్టిచో నితరరాజు లెవ్వరును గండికోటపై దాడి వెడలుట కవకాశము గన్పడుటలేదు. అయినను క్రీ. శ. 1313_14 లలో ప్రతాపరుద్రచక్రవర్తి స్వయముగ గండిగోటప్రాంతమునకేగి యచ్చట ననేక గ్రామములను నిర్మించి శ్రీశైలత్రిపురాంతకాది పుణ్యక్షేత్రముల కేగియుండెను. అంబదేవాదు లింతకుమున్నే గతించియుండినను, తన తనయుడగు గొంకారెడ్డియే దుర్గపాలకుడుగనుండియుండిననుగూడ చక్రవర్తి స్వయముగ దక్షిణమున కేగుటచే దానికెద్దియో ప్రబలమగు కారణముండెననియు, నీతడు కడప కర్నూలు మండలములం దొనర్చిన గ్రామనిర్మాణాదికము కేవల మార్థికమేగాక రాజ్యాంగ తంత్రముగూడనై యుండవలయుననియు దోచుచున్నది. స్థానిక చరిత్రము లీ సందర్భమునం

డెక్కడుగ నుపయోగించు చున్నవి. వాని లో కర్నూలు మండల చరిత్రమునుండి దక్షిణమున గొందరు రాజులు తిరుగుబాటు చేయుటచే చక్రవర్తి స్వయముగ బయల్వెడలెననియు, నితర చరిత్రములందు గండికోట ప్రాంతమున వడ్డిరాజులు మఱికొందరి ప్రోద్బలముచే విద్రోహమొనర్చిరనియు జెప్పబడి యున్నది. వీనినుండి గండికోటలో నొక ప్రబల విద్రోహము జరగియుండినటుల స్పష్టమగు చున్నది. అన్నమరెడ్డి, గణపరెడ్డి మున్నగు మహాసామంతు లీ ప్రాంతములనే యుండుట యు, చక్రవర్తి పద్మనాయకులయెడ జూపిన పక్షపాతము వీరి పౌరుషాభిమానముల బ్రజ్వరిల్లజేసి యుండుటచే వీరలాతనిపై విరోధ భావముబూనియుండుటయు సమన్వయించి నచో, నీ వడ్డిరాజుల తిరుగుబాటునకు ప్రోద్బలమొసంగినది రెడ్డిసామంతులేయని తోచు చున్నది. విద్రోహమింత ప్రబలమగుట చేతనే ప్రతాపరుద్ర చక్రవర్తి దాని నణంచుటకు స్వయముగ బయల్వెడలి యుండును. పై చర్చనుండి క్రీ. శ. 1313-14 లో రెడ్డినాయకులు దమ యాశాభంగమునకు బ్రతీకారముగ గండికోటప్రాంతమున చక్రవర్తిపై తిరుగుపాటు చేసియుండిరని స్పష్టమగుచున్నది.

ఈపరాజయమువలన నిరుత్సాహులుగాక రెడ్డినాయకులు మఱియొక సమయమునకై వేచియుండిరి. క్రీ. శ. 1320.వ సంవత్సరమున మఱియొకతూరి తురుష్కులాంధ్రదేశముపై దండెత్తివచ్చిరి. దక్షిణమున పాండ్యులు కాంచీనగరము నాక్రమించి యందలి యాంధ్రప్రతినిధిని బారదోలిరి. మహ్మదీయుల యొత్తిడి యధికమగుటచే, ప్రతాప . రుద్రచక్రవర్తి పాండ్యుల విజయములను సరకు సేయక సామ్రాజ్యమునందలి సైన్యముల నెల్ల నుత్తర భాగమున గేంద్రీకరించి తురుష్కులతో హోరాహోరిగి బోరు చుండెను. ఇటు లాంధ్రదేశమును, కాకతీయరాజవంశమును చాపుబ్రతుకులకు లోనై యుండి తమస్వాతంత్ర్యయమునకై పోరుచుండిన క్లిష్టసమయమున స్వార్థపరులగు రెడ్డి నాయకులు కేవలస్వాభిమానపూరితులై చక్రవర్తిపై దమ పగనుదీర్చికొన మంచిసమయము దొరకినదని సంతసించిరి. అప్పుడు ప్రోలయవేమారెడ్డి బంధుమిత్రపరివారసహితుడై ధరణికోటప్రాంతమున కేగి యచ్చట విజయపతాకను నెలకొల్పి స్వాతంత్ర్యమును బ్రకటించెను. అనుభవజ్ఞులు విశ్వసనీయులు మహాశూరులునగు గుండయనాయకసోమయనాయకాది కాకతీయసేనానులు గతించి యుండిరి. ఇతరసేనానులు నితరబలములు నెల్లరుత్తరమున తురుష్క సమరమున నిమగ్నులై యుండిరి. దానజేసి ప్రోలయవేముని స్వాతంత్ర్యస్థాపనమనాయాసముగ నెఱవేఱినది. అయినను చక్రవర్తి యొకసేనను ధరణికోటపై కంపియుండెను. అల్పసంఖ్యాకులగు వీరిని మహాసూరుడును ప్రబలుడునగు వేమారెడ్డి త్వరలో నిర్జించి తన మార్గమును నిష్కంటకము నొనర్చుకొనియెను.

ప్రతాపచరిత్రమునుండి స్వార్థపరులగు నీ రెడ్డినాయకు లొనర్చిన మఱియొక స్వామిద్రోహకార్యముగూడ దెలియనగుచున్నది. ప్రోలయవేముని స్వాతంత్ర్య ప్రకటనమున గాకతీయులకొదవిన నష్టము ధరణికోటప్రాంతము తమ సామ్రాజ్యమునుండి యపహరింపబడుట మాత్రమే కాని, పై వంశచరిత్రమున బేర్కొనబడిన బొబ్బారెడ్డియను నాతడొనర్చిన కృత్యముచే కాకతీయచక్రవర్తి తురుష్కులకు బందీ

యగుటయు, నాంధ్రదేశ స్వాతంత్ర్యము నశించుటయుగూడ సంభవించినవి. క్రీ. శ. 1323 లో పరాజయపరంపరలకు వెనుదీయక,నీతూరి నిశ్చయముగ రుద్రదేవుని నాతని సామ్రాజ్యమును జయింపవలెనను పూనికతో తురుష్కులును, బ్రాణములనైననొసంగి తమ దేశగౌరవమును దమ చక్రవర్తిని రక్షించు పూనికతో నాంధ్రులును, వెనుదీయక రణరంగమున పెనగులాడుచుండిరి. విజయలక్ష్మి యాంధ్రులవంకకే తన కటాక్షవీక్షణముల బఱుపజొచ్చెను. ఇటులు, యుద్ధపరిణామ మాంధ్రులకు ప్రమాదకరమగు స్థితినిదాటి యనుకూల్యతను వహింపగనే, యాంధ్రబలములలో జాతిభేదమూలకములగు నీ పద్మనాయకరెడ్డినాయక వైషమ్యములు పొడసూపినవి. రాజాదరణము ననుభవించుచు, మొక్కవోవని సాహసమును జూపి శత్రుమారణము నొనర్చుచుండిన పద్మనాయకులు దమ సామర్థ్యవిశేషముల నించుక నుత్ప్రేక్షించియుండిరి. బహుశః చక్రవర్తిగూడవీరిని బ్రత్యేకముగ బ్రశంసించియుండును. ధరణికోటకేగినవారలు గాక మఱికొందఱు రెడ్డినాయకులు బొబ్బారెడ్డియను నాతని నాయకత్వమున జక్రవర్తి పక్షమునందుండిరి. వారలకీ పద్మనాయక విజృంభణ మసూయను గల్పించెను. ఇంతకుముం దిటులే ప్రత్యర్థికృత గౌరవవిశేషమునకును దమ కొనర్పబడిన నిరాదరణకును బ్రతీకారముగ ప్రోలయవేమారెడ్డి యొనర్చిన స్వాతంత్ర్యప్రకటనము వీరలకు బ్రబలమగు నాదర్శముగనుండెను. ఈ కడసారియుద్ధమున బొబ్బారెడ్డి మున్నగు రెడ్డినాయకులు చక్రవర్తికడకేగి యుద్ధమున విజయమాంధ్రుల కెటులైనను నిశ్చితమేయనియు, మహాప్రతిభావంతులగు పద్మనాయకులే దానిని సమకూర్పగలరనియు, నట్టిచో దాము సమరమున బాల్గొనకుండినను నష్టముండదనియు వినయోక్తులనాడి, నాటికి రెడ్డిబలములు విశ్రాంతిననుభవింపననుజ్ఞనిమ్మని ప్రార్థించిరి. ఇంతకుమునుపే బొబ్బారెడ్డి తురుష్కసేనానివద్దనుండి కొంత ద్రవ్యమును బడసి, నాడు యుద్ధమున పాల్గొన కుండుటకై యొడంబడికను చేసికొనియుండెను. ఈకుట్రి నెఱుగని చక్రవర్తి, విజయమీవఱకే తనకు గరతలామలకమై యుండెనని దలంచుచు, రెడ్లకు విశ్రమింప ననుజ్ఞనొసంగెను. యథాపూర్వముగ యుద్ధమారంభమాయెను. తురుష్కులు నాంధ్రులును ప్రాణములకు తెగించి పోరుచుండిరి. అయిన నొకేసారిగ మహాశూరులగు రెడ్డినాయకులెల్ల రంగమునుండి నిష్క్రమించుటచే దురుష్కు లినుమడించిన యుత్సాహముతో బోరుచుండ నాంధ్రసైన్యములు విస్మయమునంది కొంచెము వెనుకంజవేయ దొడంగినవి. ఈయుపద్రవము నుపలక్షించి చక్రవర్తి మదగజారూఢుడై వెంటనుండిన పరివారముతో యుద్ధరంగమున బ్రవేశించి తన సైనికులను ప్రోత్సహింపదొడంగెను.

ఇట్టి పరిస్థితి నిదివరకే యుపలక్షించి యందులకు సంసిద్ధుడై యుండిన తురుష్కసేనాని యాంధ్రసైన్యములెల్ల చెల్లాచెదరై మైమఱచి పోరుచుండుటను, స్వల్పపరివారావృతుడై ప్రతాపరుద్రదేవుడు రణరంగమున కేతెంచుటను, గాంచి యొక్కసారిగ నాతనిపై బడి యాతని నాతని యనుచరులను బందీకృతుల జేసెను. ఇటు లతిశీఘ్రముగ దన కార్యము సఫలమగుటచే సంతసమందియు రణనీతిజ్ఞుడగు నీ తురుష్కసేనాని సైనికులెల్లరకు నీసంగతి తెలియక పూర్వమే బందీయగు రుద్రదేవ చక్ర

వర్తిని గతిపయ తురుష్క సేనలతో గూడ రహస్యమార్గముల దేవగిరి మార్గమున బంపివైచెను. పిదప నీ విషాదకరమగు వార్త యాంధ్రబలములకు దెలియవచ్చుటచే వారలప్పుడే జీవములబాసి నిమిత్తమాత్రములగు తురుష్క ఖడ్గములకు దమ తనువుల నర్పించివైచిరి. ఇప్పటికి దామొనర్చిన యకార్యమునకు బర్యవసానముగ నాంధ్రసామ్రాజ్యమును దదధీశుడుగూడ నశించిరను పశ్చాత్తాపము రణమునకు దూరమునందుండిన రెడ్డి నాయకుల కొదవినది. ఒకేసారిగ తురుష్కులపై బడి, యోపినంతవరకును శత్రుసంహార మొనర్చి, వారలు దమ యేలికను విముక్తునిజేయ ప్రయత్నించిరి. కాని, ప్రతాపరుద్ర దేవుడు తురుష్క శిబిరమునం దాసమయమున బందీగనుండు టెంతనిజమో యీయావేశపూరిత సమరమున రెడ్డిరాజుల విజయముగూడ నంత సాధ్యముగనే యుండెను.

ఒకప్పుడు పిల్లలమఱ్ఱి బేతిరెడ్డి కాకతి రుద్రునికి దక్షిణహస్తమై యొప్పి, దనరాజును దన దేశమును రక్షించుటకునై ప్రాణమును సహితము యాదవులతోడి యుద్ధమున ద్యజించియుండెను. అటులనే రుద్రరెడ్డి గణపతిదేవుడు దేవగిరిలో బందియై యుండుతరి నాంధ్రదేశమును గబళింప నేతెంచిన నాగతిరాజాది శత్రువీరుల ననేకుల నిర్జించి, యాంధ్రభూమిని దన బాహుబలమున బరిరక్షించి, గణపతిదేవుని వశముచేసి కాకతిరాజ్య స్థాపనాచార్యుడై వాసికెక్కి, కళింగదేశాది వివిధ రాజ్యముల దన యేలికకై జయించియుండెను. ఇట్టి మహారాజభక్తిపరాయణులగు నీ రెడ్డి నాయకులకు ప్రతాపరుద్ర చక్రవర్తి కాలమున బదచ్యుతి పూర్వకమగు మహాపరాధమొనర్పబడియెను. పద్మనాయకుల బ్రోత్సహించుటచే, చక్రవర్తి తమ కపచారమొనర్చుటచే రెడ్లకు పద్మనాయకుల యెడను, చక్రవర్తిపైనను, సహజమగు ద్వేషముద్భవించెను. దీనిని వారలు క్రీ. శ. 1314 లో విద్రోహముఖమున వెలిబుచ్చి యుండిరి. పద్మనాయక పాటవమునం దత్యంతవిశ్వాసముగల చక్రవర్తి వీరియెడ సానుభూతిని జూపక దండనీతి నవలంబించుటచే, చేయునదిలేక నవమానపూరితమగు గాకతీయసామ్రాజ్యవాతావరణమునం దుండజాలక, ననుకూలపరిస్థితు లుద్భవించినతోడనే రెడ్లుస్వతంత్రించి స్వరాజ్యమును నెలకొల్పిరి. ప్రతాపరుద్రదేవుని యనంతరమున గాకతీయసామ్రాజ్యమస్తమింప, దత్సామ్రాజ్యమున బ్రబలులై యుండిన పద్మనాయకులును రెడ్డినాయకులు నాంధ్రదేశమున కధికారులై యుత్తరదిశ నొకరును, దక్షిణభాగమునందొకరును స్థిరపడి, యాంధ్రభూమి నేలదొడగిరి. ఇదేసమయమున బ్రతాపరుద్రుని కోశాధ్యక్షులుగనుండిన సోదరు లిర్వురు దక్షిణపశ్చిమ దిశకేగి విజయనగరరాజ్యమును నెలకొల్పిరి. ధరణికోటలో విజయమును బ్రకటించిన ప్రోలయవేమారెడ్డి వినుకొండదుర్గమునను, పిమ్మట కొండవీటిదుర్గమునను, దన రాజ్యమును స్థాపించెను. ఈరెడ్డిరాజ్యము దినదినాభివృద్ధినంది యొకటిన్నర శతాబ్దములకాల మాంధ్రదేశమును తురుష్కులబారినుండి పరిరక్షించినవిధము రెడ్డిసామ్రాజ్య చరిత్రమునం గాంచనగును.

XV విశేషాంశములు

వరంగల్లుజిల్లా ఖాజీపేటగ్రామములో నొక దర్గాలో బిగింపబడిన శాసనమొకటిగలదు. దానినుండి కాకతీయులనుగూర్చి వింతచరి

త్రాంశములు దెలియుచున్నవి. ఇటీవల బయల్వెడలిన యీవిషయములు లేనిచో గాకతీయుల చరిత్రము సమగ్రముకానేరదు. గాన వాని నీక్రింద పొందుపరచుచున్నాము—

1. వంశావళి:—ఇంతకుబూర్వము కాకతిబేతరాజే యీవంశీయులలో మొదటిరాజని చరిత్రకారులు దలచిరని చెప్పి, యతనికిముందాతనితండ్రియగు మొదటి ప్రోలరాజు రాజ్యమేలెనని సప్రమాణముగ నిరూపించియుటిమి. ఈఖాజీపేట శాసనమా నిర్ధారణమును బలపఱచుచు మొదటి ప్రోలరాజుతండ్రి బేతరాజు మఱియొక డుండెనని దెల్పుచున్నది. ఇందుచే గాకతీయవంశావళి మఱియొక పురుషాంతరము ముందుకు జరుగుచున్నది-

2. కాలనిర్ణయము:— వంశవృక్షమునుబట్టి కాకతీయరాజుల కాలనిర్ణయముగూడ నాశాసనము వలన మారుచున్నది. ఇంతకుబూర్వము వేంగీచాళుక్యరాజగు రెండవ అమ్మరాజు కాలమున కాకర్త్యగుండ్యన బ్రశంస చేయబడినదనియు, నాగుండ్యన క్రీ. శ. 950—999 ప్రాంతమువాడనియు, నటుపై క్రీ. శ. 1050-1080 నాటి మొదటిప్రోలరాజునుగూర్చియే మన మెరుగుదుమనియువ్రాసియుంటిమి. దానిని బట్టి గుండ్యినకును ప్రోలరాజునకును నడుమ 50 సంవత్సరములకాలము గలదనియు, నప్పటిచరిత్రము మనకేమియు దెలియదనియు చెప్పియుంటిమి. ప్రకృతఖాజీపేటశాసన మాకొఱతనుదీర్చుచున్నది. ఇందుండి దెలియనగు బేతరాజు, త్రిభువనమల్ల బేతరాజునకు తాతయగుటచే నాతనిని మొదటి బేతరాజని పిలువవచ్చును. అప్పుడీ మొదటి బేతరాజు క్రీ. శ. 1020-1050. నాటివాడగును. ఈవిధముగా గుండ్యనకు నీతనికి యిరువది సంవత్సరముల వ్యత్యాసముండును. సామాన్యముగ చరిత్రకారులు బురుషాంతరమునకు ముప్పదిసంవత్సరములనంతున బరిగణింతురు. కాని కాకతీయరాజులందరును సుదీర్ఘకాలము రాజ్యమేలినవారే. గాన నీమొదటి బేతరాజు క్రీ.శ. 1000-1050 ల నడుమ రాజ్యమేలెనని చెప్పవచ్చును. అప్పుడు గాకతీయుల వంశకాలముల నీక్రింది విధమున నిర్ణయింపవచ్చును—

కాకర్త్యగుండ్యన

* * *

మొదటిబేతరాజు (1000—1050)

|

మొదటిప్రోలరాజు (1050—1080)

|

రెండవబేతరాజు (1080—1115)

|

రెండవప్రోలరాజు (1115—1158)

|

రుద్రదేవుడు (1158—1195)	మహాదేవుడు (1195—1199)

|

గణపతిదేవుడు (1199—1261)

|

రుద్రాంబ (1258—1296)

|

ప్రతాపరుద్రదేవుడు (1290—1326)

(3) మొదటి బేతరాజు:—ఈతడు "కాకతిపురాధినాథు" డని పేర్కొనబడియున్నాడు. దానికి కాకతిపురమను గ్రామమునకు నాథుడని యర్థము చెప్పినచో నా గ్రామ మెచ్చ

టిదను సమస్య బయల్వెడలును. ఇంతకు బూర్వము మైసూరు రాజ్యములో "కాగతి" గ్రామము గలదనియు, గాకతీయులకు దానితో నేమైన సంబంధముండుననియు, వ్రాసియుంటిమి. ఈ ఖాజీపేట శాసనములోని "కాకతి పురాధినాథ" యను విశేషణ మీయూహను బలపరచుచున్నది. మఱియు నీ బేతరాజు "చోడక్ష్మాపాళ చమూవార్ధి ప్రమథన సమార్జిత...లక్ష్మీః" యని చెప్పబడినాడు. అనగా 11-వ శతాబ్ది ప్రారంభమున నాతనికి చోళులతో వైరమేర్పడెనని యర్థము. దీని నొక విధమున సమన్వయింపవచ్చును. చాళుక్య అమ్మరాజు మరణానంతరము వేంగిదేశమునందల్లకల్లోలము జరిగినది. ఆ సమయమున గాకర్త్యగుండ్యనయు నాతని వంశీయులును స్వతంత్రులై దమ యధికారమును నెలకొల్పిరని యిదివరలో వ్రాసియుంటిమి. మొదటి ప్రోల రాజిటులే కాంచీపుర చోళులతో బోరెను. 11-వ శతాబ్దారంభమున దాక్షిణాత్యచోళులు వేంగీదేశముపై దండెత్తి వచ్చిరి. ఆ సమయమున స్వార్థము నుద్ధరించుకొన యత్నించుచు గుండ్యనకు దరువాతి వాడగు నీ మొదటి బేతరాజుగూడ చోళులతో బోరి, స్వార్థమును రక్షించుకొనెనని తోచుచున్నది.

(4) మొదటి ప్రోలరాజు:—ఈతనిని గూర్చి యపూర్వములగు విషయము లెన్నియో దెలియుచున్నవి. ఇతడు "నిర్వక్రీకృత చక్రకూట విషయు"డు. ఈప్రోలరాజునకుసమకాలికముగ క్రీ. శ. 1060.ప్రాంతమున వేంగీచాళుక్యరాజరాజును, అతనిపుత్రుడును, పిమ్మట కులోత్తుంగ బిరుదముతో నాంధ్ర ద్రావిడదేశముల నేలినవాడునగు యువరాజరాజేంద్రుడును, చక్రకూటముపై దండెత్తిరని వేంగీచాళుక్య చరిత్రమునుండి తెలియుచున్నది. ఇదేకాలమున ప్రోలరాజు నానగరముపైనే దాడివెడలుట వింతగనున్నది. ఇంతకుబూర్వ మీ ప్రోలరాజు చరిత్రను వ్రాయుచు కులోత్తుంగునికి సాయమొనర్చినవారిలో నీతడుగూడ నుండెనని చెప్పియుంటిమి. రాజరాజు మరణించునాటికి రాజేంద్రుడు చక్రకూటమునందుండెను. ఆతడటనుండి మరలినపిమ్మటనో, లేక నాతనికి సహకారిగనో, యీప్రోలరాజు చక్రకూటముపై దండెత్తెనని యూహింపవచ్చును. మఱియు నీప్రోలరాజు "భద్రంగ విద్రావణు"డట. నైజాంరాష్ట్రములోని బెక్కల్లుగ్రామ మందలి యొకశాసనమున "భద్రంగ పురవరాధీశ్వర" బిరుదాంచితులును, "రావుతు" శబ్దవాచ్యులునగు గొందరు మండలీకులు బ్రశంసింపబడియున్నారు. వారు కాకతిరుద్రునికి సామంతులు. దీనినుండి ప్రోలరాజీ మండలీకులను జయించెనని తెలియుచున్నది. ఇంతియగాక నీరాజు కొంకణమండలమును జయించి, కొడవర్తి దుగ్గరాజు కొడుకునుజంపి, పురకూదేశమును, గొన్నరాజునుజయించి మఱికొంతభూమిని వశపఱచుకొని, యీప్రదేశముగల అనుమకొండ విషయమును, త్రైలోక్యమల్లుని వద్దనుండి శాసనపూర్వకముగా బొందెను. ఈత్రైలోక్యమల్లుడు బశ్చిమచాళుక్యరాజు. దీనినుండి గొన్నివిశేషములు దెలియుచున్నవి. రెండవబేతరాజు త్రిభువనమల్ల విక్రమాదిత్యునికి సామంతుడు. మొదటి ప్రోలరాజు విషయమై యిట్టిదేమియు నింతవరకును దెలియదు. పశ్చిమచాళుక్యులలో విక్రమాదిత్యునికి బూర్వమీతనియన్న రెండవ సోమేశ్వరుడును, తత్పూర్వము వారి తండ్రియగు మొదటి సోమేశ్వరుడును రాజ్యమేలిరి. రెండవ

బేతరాజును విక్రమాదిత్యుడును సమకాలికులైనచో, బేతరాజు తండ్రియగు మొదటి ప్రోలరాజు, రెండవ సోమేశ్వరునికి సమకాలికుడును, సామంతుడునైయుండును. హనుమకొండకన్నడశాసనములో వైజదండాధినాథుడు దనయేలికయగు రెండవ బేతరాజుచే "త్రిభువనమల్లునికి మొక్కించి యాతని కాచక్రవర్తి సబ్బిసాయిరమండలము నిచ్చునట్లొనర్చె"నని చెప్పబడియున్నది.

దీనినుండి యీపూర్వ కాకతీయరాజులు బశ్చిమ చాళుక్యులకు లోబడి, చాళుక్యసామ్రాజ్యములోని భాగములనేలుచు, దమకు ప్రాగ్దిశనున్న వేంగీరాజ్యముపై దండెత్తివచ్చినవారిని దఱుముచు, నాత్మరక్షణనుజేసికొనుచు, వీలగునపుడెల్ల దూర్పుతీరమున రాజ్యమును సంపాదించుచుండిరని స్పష్టమగుచున్నది.

నైజాంరాష్ట్రములోని సూర్యాపేట తాలూకాలోని జలాల్‌పూరుగ్రామములో నొక శాసనముగలదు. అందు "బాణస్వరేశాన" పరిమితమగు శకవత్సరమున "రుద్రదేవనృపతికి సామంతుడగు చెఱుకు బొల్లిరెడ్డి చేసినధర్మము దెలుపబడియున్నది. దీనికాలము శా.శ. 1175 కు సరియగు క్రీ. శ. 1253 అగుచున్నది. ఈ కాలమున రుద్రదేవాభిదులు రుద్రాంబ తప్ప నింకెవ్వరునులేరు. ఈమె క్రీ. శ. 1260 లో గాక క్రీ. శ. 1258 నుండియు రాజ్యమేలుచుండినదని యింతకుముందు చెప్పియుంటిమి. ప్రకృతశాసన మారాజ్ఞి క్రీ. శ. 1253 నుండియే యిట్టి కర్తవ్యమును నిర్వహించుచుండెననియు నా సంవత్సరమునుండియే గణపతిదేవ రుద్రాంబికలు సంయుక్తపరిపాలన మొనర్చిరనియు స్పష్టమగు చున్నది.

XVI ఉపసంహారము.

సుమారు మూడువందల సంవత్సరముల కాలము రాజిల్లి యాంధ్రులకీర్తిని దిగంతవిశ్రాంత మొనర్చినది గాకతీయ సామ్రాజ్యము. వేంగీచాళుక్య సామ్రాజ్యాంత్యకాలమున దలయెత్తి, యపుడాంధ్రదేశమునం దొదవిన యల్లకల్లోలములనుగడచి, యథాసాధ్యముగ స్వార్థము నభివృద్ధిపఱచుకొనుచునప్పటికి బ్రబలురుగనుండిన బశ్చిమచాళుక్యులనాశ్రయించి దన్మూలమున నాంధ్రదేశమున నీ వంశీయులు స్థిరవసతిని గల్పించుకొనిరి. 11-వ శతాబ్ది యుత్తరార్ధ మంతమగుసరికి బశ్చిమచాళుక్యసామ్రాజ్యమే యస్తమయావస్థనందుటచే, నిటనుండియు గాకతీయులు చాళుక్యమండలీకులను జయించివారి మండలములను దమరాజ్యమున గలిపికొని, అనుమకొండనుండి దమప్రభావము నెల్లెడలను విస్తరించుకొనిరి. పిమ్మట నీకాకతీయవాహిని దూర్పుతీరమును గలంచి, దత్తమండలములపై గూడ బడినది. 13వ శతాబ్దిలో గణపతిదేవచక్రవర్తి కాలమున ప్రకృతనైజాంరాష్ట్రమునందలి తెలింగానాప్రాంతమును, దూర్పుతీరమున గోదావరి కృష్ణాగుంటూరు నెల్లూరుమండలములును, దత్తమండలములలో విశేషభాగమును, గాకతీయ సామ్రాజ్యముగ మారినవి. అంతియగాక కాంచీపురమువరకును గల భాగము గూడ గొంతకాల మాంధ్రుల వశముననుండినది. ప్రతాపరుద్రచక్రవర్తి యీసామ్రాజ్యమునంతటిని బరిపాలించి, దూర్పున సింహాచలమువరకును, దక్షిణమునం దొకప్పుడు శ్రీరంగమువరకును, బశ్చిమమున మైసూరురాష్ట్రములోనికి గూడ దనరాజ్యమును విస్తరింపజేసెను.

సామ్రాజ్యముతోబాటుగ విజ్ఞానముగూడ నశించినది. జైనశైవమత సంఘర్షణము గొంత వరకును, రెడ్డిపద్మనాయకవైషమ్యములు గొంతవరకును, ప్రతాపరుద్రచక్రవర్తి యసూయాపరుడై యితరరాజుల సాహాయ్యమును గోరకుండుటయు, వారలు శత్రువులతో జేయు కుట్రలయెడ నిర్లక్ష్యము వహించుటయు, దక్షిణాపథమును జయించునెడ మహమ్మదీయులొనర్చిన ప్రయత్నములును, యేకకాలముననే సామ్రాజ్యపు బ్రాగ్పశ్చిమ దక్షిణముల నలజడిగలిగి, యదే సమయమునం దుత్తరమునుండి తురుష్కులు దండు వచ్చుటయు, కడకు సామ్రాజ్యము జీవన్మృత్యుసమస్యకు లోనైయుండునెడ రెడ్లొనర్చిన ద్రోహము గొంతవరకును, మహోన్నతమగు నీయాంధ్రసామ్రాజ్యము నశించుటకు గారణములు.

మొట్టమొదట నాంధ్రభాగమునంతటిని తమ యేకఛత్రాధిపత్యమునకు దెచ్చి, సాంఘిక రాజకీయ మతార్థిక వాఙ్మయ శిల్పములలో నూతనాదర్శములను నెలకొల్పి, యాధునికాంధ్రుల కనేకవిధముల మార్గదర్శకులై యొప్పిన యీకాకతీయాంధ్రచక్రవర్తులు చిరస్మరణీయులై యొప్పుదురుగాక!

సామ్రాజ్యముతోబాటుగ విజ్ఞానముగూడ నశించినది. ఆంధ్రవాఙ్మయాభివృద్ధికి రుద్రదేవు డేర్పరచిన యంకురము క్రమాభివృద్ధి నంది బ్రతాపరుద్ర దేవుని కాలమున సుమనోహరముగ బుష్పించినది. ఆంధ్రకవితల్లజు లేకశిలానగరమున గీర్వాణాంధ్రభాషాయోషలకు విలాసగమనములను నేర్పిరి. శిల్ప నాట్యకళ లపూర్వమగు నభివృద్ధిని గాంచినవి. కాలముయొక్కయు బ్రకృతియొక్కయు క్రౌర్యమును బ్రతిఘటించి, ప్రాచీనాంధ్రుల నిర్మాణ కౌశలమును, కాకతీయచక్రవర్తుల కళాభినివేశమును, వేనోళ్ళజాటు కట్టడము లనేకములు నేటికిని నిలచియున్నవి.

ఈచక్రవర్తులకడ సామంతులుగను, యుద్యోగులుగనుండి, యప్పటి వైజ్ఞానికాసక్తిని జవిచూచిన ప్రోలయవేముడును, హుక్కబుక్క రాజసోదరులును, పిమ్మట దామునిర్మించిన రాజ్యముల కేకశిలానగరసామ్రాజ్యమునే యాదర్శముగ గొనిరి.

ఇటులపూర్వశోభాయుతమై, నిరుపమమైవెలుగొందిన గాకతీయసామ్రాజ్యము, కడకు దైవోపహతులగు నాంధ్రుల బుద్ధిమాంద్యమువలననే

220 XV వ ప్రకరణములోని ఖాజీపేటశాసనము నాచే J. A. H. R. S. Vol, VII, p 2 లో బ్రకటింపబడినది.

కాకతీయరాజధాని ప్రశంసా. *

శ్రీయుత విద్వాన్ మదిగొండ వీరేశలింగశాస్త్రిగారు.

ఉ. ఎయ్యది కాకతీయనృప ♦ తీశ్వర పాణిపయోజమాలి క
న్నుయ్యెలలూపగా బడెనొ ♦ యుజ్వలదైశికగీతికాతతిన్
ఎయ్యది రుద్రమాంబ మహ ♦ నీయ పవిత్రచరిత్ర కాలయం
బయ్యెనొ యట్టియీపురి మ ♦ హత్వవిలాసము లెంచ శక్యమే.

సీ కాకతీయనృపాల ♦ కాలనిర్మిత రమ్య, శిల్పంబుకనుల వీ ♦ క్షించు నపుడు
వేయి స్తంభంబుల ♦ విలసిల్లు నిచ్చటి, దేవాలయంబున ♦ దిరుగునపుడు
పద్మాక్షి సిద్ధేశ ♦ వరశంభులింగాది, వివిధాలయముల సే ♦ వించునపుడు
ఏకశిలాస్థలి ♦ శ్రీకలితానంద,కరసౌధ దుస్థితి ♦ గాంచునపుడు
చిత్రపటమందు బోలెను ♦ జిత్రితమయి, హృదయకుడ్యంబునందు స్తంభించు ప్రకృతి
తనువు గిక్కరించు గద్గద ♦ ధ్వని జనించు, సరసగుణులార యో సభా ♦ స్తారులార.

సీ. సారస్వతారామ ♦ సరణిలో వెలసిన, గొనబైన మల్లెపూ ♦ గుత్తియనగ
మార్దంగికధ్వని ♦ మరపించి కలికించు, కమనీయ శరదభ్రి ♦ కళిక యనగ
కవిమానససరోజ ♦ కాండ సత్పథగతి, నామోదమందురా ♦ యంచయనగ
లక్ష్మీవిలాసస ♦ లలితసర్మక్రీడ, నచ్యుతుం డాడెడి ♦ హారమనగ
దిశల నాత్మీయకాంతులు ♦ దేజరిలగ, నెలమి నానందవారిధి ♦ నీదులాడి
విశ్రమించెను కాకతి ♦ విపులకీర్తి, సరసగుణులార యో సభా ♦ స్తారులార.

సీ. కవికులతిలకుడై ♦ గ్రాలువిద్యానాథు, కవిత విహారంబు ♦ గనినచోటు
మైలారుభటుల వి ♦ స్మయకర సాహస,కార్యముల్ జరిగిన ♦ ఘనతలంబు
వీరశైవులు భక్తి ♦ పారవశ్యత గండ,గత్తెరల్ గొన్నట్టి ♦ కమ్రభూమి
శివదేవకవివర్యు ♦ స్థిరమైన నయలక్ష్మి, తాండవమాడిన ♦ ధరణితలము
సోమనాథాది కవిబుధ ♦ స్తోమచరణ, కమలవిన్యాసపూతమే ♦ కశిలపురము
గనిన నెవ్వని చిత్తంబు ♦ గరగకుండు? సరసగుణులార సత్సభా ♦ స్తారులార.

---

* ఈపద్యములు కాకతీయ వర్ధంత్యుత్సవసభలో జదువబడినవి.

"సంపాదకుడు"

కాకతీయరాజుల విజయబిరుదప్రశస్తి.

శ్రీయుత డాక్టరు బుర్రా శేషగిరిరావుగారు.

శ్రీ

స్వస్తి। సమస్త పంచమహాశబ్ద। మహామండలేశ్వర। రాజపరమేశ్వర। ఉద్దండమండలాగ్ర ప్రచండ। నెలవీడుగండ। ఫెషిణిహన్మంత। అద్రికటకవజ్రప్రాకార। త్రిభువనీరాయ రాహుత్తరాయ। ధనుర్విద్యావిహారణ। విజయప్రతీకాతిషణ్ముఖ। వివేకనారాయణ। ఆశ్రితజనకల్పవృక్ష। అన్యఘనశూర రాయమానమర్దన । అష్టదిగ్రాయాంచాన్ల । అహిపటవతేరాయాంచాన్ల। దేచబహుత్రోక్కు రాయాంచాన్ల। దంపుగంపుశాచ్చుళోరాయాంచాన్ల। కటిలదేదెబాదుదేదె। కొమరమీసరగండ। హోనమండలీకాంచాన్ల। యియ్యణెరాణివాస ముఖతగతేరాయాంచాన్ల। బిరుమనియ్యకొని మన్నియమచ్చణ। డికాతెఘనాతె కుమారారరయాంచాన్ల। శ్రీయోగానంద నరసింహదేవర దివ్య శ్రీపాదపద్మారాధకులైనశ్రీకాకతిరాజుల అన్వయబిరుదప్రశస్తి। విజయీభవ॥ దిగ్విజయీభవ॥ *

---

* శ్రీ కాకతీయ వర్ధంత్యుత్సవాహ్వాన సంఘాధ్యక్షులకు ఆంధ్రభారతీతీర్థప్రధాని విజయవిభవాశీర్వచన ములతో, వినయపూర్వకముగా, సహర్షముగా, మంగళాచరణరూపకముగా, సగౌరవముగా చదివించుటకై శ్రీఏక శిలానగరమునకు పంపినది.

(ఇది శ్రీ కీర్తిశేషులైన గురుజాడ వేంకట అప్పారావుగారి "విజయనగరం చరిత్రరికార్డు" లోనుండి వ్రాయించినది)

ప్రతాపరుద్రునికాలపు మఖ్తాసనదు.

శ్రీయుత ఒద్దిరాజు రాజేశ్వరరావుగారు, బి. ఏ, యల్. యల్. బి.

(వరాహముద్రిక.)

స్వస్తి శ్రీ విజయాభ్యుదయ విజితాఖిలభూపగణ శ్రీసమధిగతపంచమహాశబ్ద మహామండలవీర ఏకశిలానగరవరవీర మహావీర పతిహితచరిత వినయవిభూషణ శ్రీమన్మహామండల వీరసమరోద్దండ వీరప్రతాపరుద్రమహారాజుగారు దిగ్విజయవిజయరాజ్య ముత్తరోత్తరోత్తరాభివృద్ధి ప్రవర్తమాన మాచంద్రతారార్కముగా నేకశిలానగరమునందు సుఖసంపదవినోదంబున రాజ్యంబుసేయుచు శాలివాహనశకవరుషంబులు ౧౨౩౦ యగు విజయనామ సం॥ వైశాఖ శు ౧౫ గురువారంనాడు వుదయరాజువీరభద్రయ్యగారికి పడమర పుట్టకెకందకందిగువను హనుమత్ గిరిచెర్వు నీరుముప్పుమీది కుంట ప్రతి సం॥ మూడువరహాల పైకం చెల్లించడంకు నిబంధనంచేసి ఇచ్చిన జీవన్మఖ్తాసనదుపత్రిక యిందుకు వుండబడిన హద్దుల నిర్ణయం.

తూర్పు స్తంభంభావిదగ్గరి, శాసనం. యీశాసనం చాలున దక్షిణం కుంటకొమ్ముకు తూర్పుశాసనం. యీశాసనంచాలున పడమర గుండుమీదబద్దులు యీబద్దుల నైరుతిదిశ యకునేల పర్వుబండమీద చాలుబద్ది యీచాలుబద్దినకుంటకొమ్ము దక్షిణదిశకు వెన్నుగడ్డను శాసనం. యీశాసనంచాలున పడమర వుసికికోలుదగ్గర శాసనం. యీరెండు శాసనములమధ్య చాకిరాజుకుంటపొలిమరకు బుడుగున గుంటచెందుని శాసనం. యీశాసనం గర్భంచాలున పడమర గుండంకొమ్మున శాసనం యీశాసనం చాలున వుత్తరం చెఱువున కోలుగడ్డను శాసనం. యీశాసనంచాలున తూర్పు కుంటకొమ్ముకు వుత్తరంశాసనం, యీశాసనంచాలున ప్రథమ శాసనంకలియ యీచో॥ చతురాశ్రమం శాసనంలు లోగావుండబడిన భూమిలో త్రికాలముల యందు ఫలించేధాన్యములు ఫలపర్చుకొని మీపుత్రపౌత్రపరంపరం ఆచంద్రార్కం అనుభవించుతూ నిరంతరం ఆశీర్వచనం చేస్తూ వుండవలసినది. ఇది సత్యశాస్వితం.*

---

*దిని మాతృక ఒద్దిరాజువారింట గలదు.

హనుమకొండ స్థానికచరిత్రము.

శ్రీయుత పింగిలి వెంకటేశ్వరరావుగారు

ప్రస్తుతము మనము నివసించుచున్న భూభాగము భరతఖండములోఁ ద్రిలింగదేశమను నామాంతరము గలదై, యాంధ్రదేశమై, చరిత్రలలో సుప్రసిద్ధముగ నున్నది ఈ ఆంధ్రదేశమునకు ఏకశిలానగరంబు యెను నోరుగల్లు రాజధానిగ నుండుటకుఁబూర్వము యీ అనుమకొండ (హనుమకొండ) రాజధానిగ నుండి ప్రసిద్ధచారిత్రము గలదై యుండినది.

ఈస్థలమునకు సమీపమున కనఁబడుచున్న హనుమద్గిరి పర్వతమునకును, మఱియు దానికి పడమర దిశనుగనబడుచున్న పద్మాక్షీ దేవ్యాలయమునకును, మధ్యననున్న ప్రదేశమున "ఎఱుకుదేవరా" జను బేరుతో వ్యవహరింపఁబడు కిరాతకుఁ డొకఁడు శ్రీశైలప్రాంతారణ్య ప్రదేశంబుల స్వేచ్ఛా విహారము సలుపుచు, తన యనుచరులతో గూడి యిటకేతెంచి యొక గ్రామమును నిర్మించి, క్రమక్రమముగ విస్తరింపఁజేసెను.

ఇతనికి "అనుమఁడు, కొండఁడు" అను నిద్దఱు పుత్రులు జనించిరి. ఈ యిరువురి పేరట నీరాజధానీనగరమునకు "అనుమకొండ" యను నభిధానము గలిగినది. ఎఱుకుదేవరాజుకు పిమ్మట అనుమఁడు కొండఁడును, అటుపిమ్మట నాగఁడు, గార్గేయుఁడు ననువారలు నీదేశమును ౧౮౬ సంవత్సరములు పరిపాలన జేసిరని చరిత్రలలో దేలుచున్నది.

ఈ కిరాతకులకుఁ బిమ్మట కందారమను పట్టణమును రాజధానిగఁ జేసుకొని పాలించుచున్నట్టి చంద్రవంశజుఁడైన సోమదేవరాజు కుమారుఁడైన మాధవవర్మకు భాగమువశమయ్యెను ఇతనితల్లి "సిరియాలదేవి". ఈమెనుగుఱించి యొక కథ గలదు. కాని వ్యాసవిస్తరభీతిచే నిట వదలితిని. మాధవవర్మ శా. శ. ౨౩౦ వ సంవత్సరము మొదలుకొని శా. శ. ౩౯౦ వఱకు పాలనముజేసియుండెను. తదుపరి చంద్రవంశరాజులు యీ అనుమకొండ పాలనము జేసినట్లు చరిత్రలయందు సూచింపఁబడియున్నది. కాని కాలనిర్ణయములో చరిత్రకారులు భిన్నాభిప్రాయులై యున్నారు.

క్రీ.శ. ౨౩౦ మొదలుకొని క్రీ.శ. ౧౦౬౭ వఱకు నిజమైనచరిత్ర వివరముగఁ దెలియు సాధనములు లేవు గాని, కొన్ని శాసనములను బట్టి ఐదవ శతాబ్దమునుండి ఎనిమిదవ శతాబ్ది మధ్యవఱకు బశ్చిమ చాళుక్యులును, పదియవ శతాబ్దాంతమువఱకు రాష్ట్రకూటులును, తరువాత మఱల పశ్చిమచాళుక్య చక్రవర్తియగు త్రిభువనమల్ల విక్రమాదిత్యుఁడు పదకొండవ శతాబ్దమధ్యమువఱకు, అనగా క్రీ శ. ౧౦౭౬ నుండి క్రీ శ. ౧౧౨౭ వఱకు, రాజ్యపాలనము జేసెను. అప్పుడీభాగమంతయు వివిధ భాగములుగ నేర్పడి వేర్వేఱు మండలాధిపతులచే పాలింపఁబడు చుండెను. వీరిలో "కాకతీయులు" నొకరుగా నుండిరి. వీరు మొదట మహారాజులవద్ద గొప్ప యధికార పదవులు సంపాదించి వారియనుగ్రహముచే సేనాధిపతులుగను, మంత్రులుగను, సామంతమాం



వారంగల్ కోట—వెంకటేశాలయములోని స్తంభము.

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.



పాకిస్థాన్ గ్రామాలయమునకు — ఎల్లోరా గిల్పము.



పాకిస్థాన్ గ్రామాలయమునకు ప్రవేశము.

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.

డలికులుగనుండి, క్రమక్రమముగ చాళుక్య చక్రవర్తులు క్షీణించినకొలఁది బలవంతులై, త్రైలింగసామ్రాజ్య స్థాపకులై మూఁడు శతాబ్దములపర్యంతపరాక్రమముతో, జనమనోరంజకముగ, శత్రుభయంకరముగను రాజ్య పరిపాలనముజేసి తమ యశస్సును, కీర్తిని నలుగడల వ్యాపింపఁజేసి శాశ్వత యశంబుఁ గాంచిరి.

పశ్చిమ చాళుక్య చక్రవర్తియైన యాఱవ విక్రమాదిత్యుని కాలమున "కాకతి బేతరాజు" ఆంధ్రదేశములోని "సబ్బిసాయిర" మను మండలమును సామంత మాండలికుఁడై పాలించుచుండెను. ఇతనిమరణానంతర మీతనికుమారుఁడు "కాకతి ప్రోలరాజు" రాజ్యభారము బూని, బుద్ధి చాకచక్యమువలనను, రాజ్య తంత్రజ్ఞానమువలనను, చక్రవర్తి మహాప్రధానులలో నొకఁడై యుండి, చక్రవర్తి మరణానంతరము స్వతంత్రుఁడై త్రిలింగ సామ్రాజ్యము నిర్మించుటకు పునాదు లేర్పఱచి, సామంతమాండలికులను, చక్రవర్తి సేనానాయకులను గెలిచి, "జగత్ కేసరి" యను బిరుదమును వహించి యుండెను. ఈ ప్రోలరాజునే త్రైలింగ సామ్రాజ్య స్థాపకునిగను, మూలపురుషునిగను యెన్నుకొనుట యుక్తముగ గన్పట్టుచున్నది. ఈప్రోలరాజునకు యితని భార్య "ముప్పమ్మ" వలన నైదుగురు పుత్రులు జనించినట్లున్నది. మొదటి యిద్దరి నామములు "రుద్రదేవుఁడు, మహాదేవుఁడు". కడపటి ముగ్గురి నామములు చరిత్రలయం దెక్కడను గానరాకున్నవి.

ప్రోలరాజు బహుకాలము పరిపాలనము జేసిన తరువాత నొకనాడు ఆతని పెద్దకుమారుఁడైన రుద్రదేవుఁడు దేవాలయమున గాఢ నిద్ర జెందియున్న కాలమున ప్రక్కనుండి పోవుచు నాతనిస్పృశించెను. రుద్రదేవుఁడు మేల్కొని తనను చంపవచ్చియుండెననిభ్రమజెంది కోపోద్దీపితుఁడై మొలలోని కైజారుచే పొడిచెను. తండ్రి నేలఁబడుటఁ జూచి తెలివిగాంచి చేసినహత్యకుఁ బశ్చాత్తప్తుఁడై దుఃఖింపసాగెను. ఇది భ్రమ ప్రమాదవశమున జరిగినదని తండ్రియెఱిఁగి కుమారుని శిక్షింపక రాజముద్రికను, రాజ్యమును యొప్పగించి ప్రాణములవిడిచెను. అనంతరము రుద్రదేవుఁడు పట్టాభిషిక్తుఁడై తండ్రియేర్పఱచిన త్రైలింగ సామ్రాజ్యపు పునాదులపై సామ్రాజ్యభవన నిర్మాణము గావించి, క్రమక్రమముగ రాజ్యమును విస్తరింపఁజేయుచు, రాజ్యపాలనము జేసియుండెను. ఇతని కాలనిర్ణయములో చరిత్రకారులు భిన్నాభిప్రాయులై యున్నారు. అయినను క్రీ. శ ౧౧౮౦ మొదలు క్రీ.శ. ౧౧౯౬ వఱకునని వేయికంబముల దేవాలయములోని శిలాశాసనాధారమునఁ జేయఁబడిన కాలనిర్ణయమే సమంజసముగనున్నది.

ఇతఁడు మైళగిదేవునితో యుద్ధముజేసి పాలవాసదేశమును, వేంగిదేశాధీశుఁడైన వీరచోడ భూపాలుని సేనాధిపతియైన మేడమార్యుని, నైజాముర్రాష్ట్రములోని వనపర్తిసంస్థానమునకు సమీపమున శిథిలమైయున్న "వడ్డమాని"యను నామాంతరముగల "వర్ధమానపుర" పాలకుఁడైన భీమచోడుని, వర్ధమాన పురమునకు ౨౦ మైళ్ళ దూరముననున్న కందనూరు పశ్చిమచాళుక్యచక్రవర్తి కుమారుడైన "తైలపదేవుని", మఱియు మంత్రికూటాధీశ్వరుఁడైన గుండమనాయని, ఆంధ్రదేశమందు పశ్చిమచాళుక్యచక్రవర్తుల పాలనమునకు లోఁబడియున్నభూభాగములనన్నిఁటిని, స్వాధీన

ముఁ జేసికొని, కేసరిసంభూత కడపటి రాజైన సూరవకేసరినిఁ జయించి "జగపతి" బిరుదమును వహించి, స్వతంత్రుఁడై మహారాజాధిరాజై, మహామండలేశ్వరుఁడయి, యవక్రపరాక్రమంబున పరిపాలించుచు బొగడ్తకెక్కెను.

వర్ధమానపురపాలకుఁడైన భీమచోడుఁడు తనసహోదరుఁడైన గోకర్ణచోడుని భోజనసమయంబునఁ జంపి, సవతితల్లికిఁ బతియై, కందనూరు పాలకుఁడైన తైలపదేవుని రాజ్యమాక్రమించుకొని, దుష్టప్రవర్తనగలవాఁడై రుద్రదేవునితో వైరము గలిగించుకొని, నిరంకుశాధికారము నెరపుచుండ, యీ పరమదుర్మార్గునిపై దండెత్తి యతనిరాజ్యమును స్వాధీనము చేసికొని, యతనికూతురైన బద్మావతిని బెండ్లియాడి, యానగరిమధ్య నొక తటాకమును ద్రవ్వించెను.

ఇతఁడు ప్రపంచతంత్రజ్ఞానము గలవాఁడై శౌర్యపరాక్రమంబులకు వాసికెక్క, పారమార్థిక జ్ఞానముగలవాఁడై, దైవభక్తి పరాయణుఁడయి, తండ్రిని భ్రమప్రమాదవశమున జంపిన పాపకృత్యమునకుఁ గుందుచు, ఎన్ని దిగ్విజయములు జేసినను సంతసింపక, పాపభీతిచే వగచుచు, అట్టి దోషపరిహారార్థమై గురుజనబోధప్రకారము జైనమతద్వేషియై, శైవమత మవలంబించి, శైవమతమం దభిమానముగలవాఁడయి, తనకుమాఱుగ పితృతర్పణంబులు జేయుటకును విశ్వేశ్వరస్వామికి నభిషేకంబు జేయుటకును ౧౦౦ గురు బ్రాహ్మణుల కాశికిఁ బంపుటయేగాక, యోరుగంటి కాఱు కోసుల దూరముననున్న అయినవోలు గ్రామమందు మైలారుదేవున కాలయంబు గట్టించి, చిత్రవిచిత్రములైన నాలుగు శిలాద్వారంబుల నిర్మింపజేసి, అనుమకొండకు రెండుమైళ్ల దూరముననున్న వొడ్డిపల్లెను ఆలయమును నిర్మించి, అందు బుద్ధగణపతిని ప్రతిష్ఠించి, మఱియు అనుమకొండకు మూడు క్రోసుల దూరముననున్న మొగిలిచర్ల గ్రామమున ఆలయముఁ గట్టించి, ఏకవీరమహాశక్తిని ప్రతిష్ఠింపించి, అనుమకొండ సహస్రస్తంభ మండపమును నిర్మింపించి, యది గాక యింకననేక సుందరదేవాలయములను నిర్మింపించి, కోనేరుల త్రవ్వించి, తటాకములవేయించి, ఆయాదేవళములకు నిత్యోత్సవములకుగాను ౮౮ గ్రామముల నొసంగెను.

పూర్వకాలములో ఈగ్రామమున నా మహారాజన్యునిచే నిర్మింపఁబడిన "సహస్రస్తంభ మండపము" ప్రస్తుతముశిథిలమైయున్నను, నేటివఱకును చూచువారికి ఆకాలమునాటి శిల్పనైపుణ్యమును వేనోళ్ళ పొగడునట్లున్నదని వ్రాయుట యతిశయోక్తి కాజాలదు.

ఈమహావీరుని కాలమున పశ్చిమ చాళుక్యసామ్రాజ్యమును, ప్రాచ్య చాళుక్య చోడ సామ్రాజ్యమును అంతరించినవి త్రైలింగ సామ్రాజ్యము విస్తరిల్ల నారంభించెను. ఇతనిరాజ్యముయొక్క విస్తీర్ణము అనుమకొండ శాసనములో నొకశ్లోకమున క్రీ శ ౧౧౬౨ వ సంవత్సరమువరకు తూర్పున సముద్రమువరకును, దక్షిణమున శ్రీశైలమువరకును, పడమట పశ్చిమచాళుక్యరాజధానియగు కళ్యాణపురమను నామాంతరముగల కటకము వరకును, ఉత్తరమున మధ్యమాగాణములలోనిమాల్యవంతమువరకును, వ్యాపించియుండెనని చెప్పియున్నది.

ఈకాకతి మొదటి ప్రతాపరుద్రుఁడు క్రీ. శ. ౧౧౯౬ వరకు పాలనము జేసి సంతానహీనుఁడై మృతినొందగ తమ్ముఁడైన మహాదే

దేవరాజుపట్టాభిషిక్తుఁడై, మూఁడునత్సరము లుమాత్రమే రాజ్యమేలిమృతినొందెను. కాని యామూఁడుసంత్సరముల కాలములోనే శౌణ దేశాధీశుండును యాదవసంభూతుఁడునైన "జైత్రపాలుడు" అనుమకొండపై దండెత్తి వచ్చి చేసిన ఘోరయుద్ధమందు మహాదేవ రాజు వీరమరణము నొందెను ఆతని కుమారు డైన గణపతిదేవుఁడు చెఱబెట్టఁబడి తదుపరి విడుపఁబడెను

ఈగణపతిదేవరాజు మహాదేవరాజునకు "బయ్యమాంబిక" వలన జనించినవాఁడు. ఇతఁ డుతనతండ్రికి జైత్రపాలునితో జరిగినఘోర యుద్ధములో తనతండ్రి వీరమరణము నొందిన తరువాత తానుపట్టుబడివిడిచిపెట్టబడినయవమా నమును భరింపఁజాలక క్రీ. శ. ౧౧౯౯ వ సంవత్సరములో పట్టాభిషిక్తుఁడైన తక్షణమే పగ దీర్చుకొనదలఁచి, గొప్పసైన్యముతో దాడివె డలి శత్రురాజైన జైత్రపాలునితో యుద్ధము జేసి గెలిచి, అమూల్యమైన ధన రత్నవస్తువా హనాదుల గ్రహించి, నిజరాజధానికి మరలి వచ్చెను

ఇంతియేగాక నాంధ్రభాషను మాతృభా షగా జేసికొన్న మహాజనుల నెల్లరను, యాం ధ్రదేశమునంతను— కృష్ణానది మొదలుకొని కాంచీపురమువఱకు, రెడ్లపాలనము నందుగల కృష్ణాతీర తూర్పుభాగ మంతయును-యేకచ్ఛ త్రముగ ఆంధ్రసామ్రాజ్యముక్రింద దీసికొనిరా గోరి జయించి, సేవణ, కర్ణాట లాట, కళింగ, చోడరాజులను జయించి, క్రీ శ. ౧౨౨౨ వ సంవత్సరము వఱకు వెలనాటి సీమను సంపూ ర్ణముగ జయించి, అక్కడి సైన్యాధ్యక్షుఁడై న పిన్నచోడుని కూతురైన "నారాంబ, పే రాంబ"లను వివాహమాడి, యాసుందరీమ ణుల ద్వితీయ సోదరుడైన జయపనాయకుని తనగజ సైన్యమున కధిపునిగావించి, బిరుదము నొసంగి, చక్రవర్తిపదమును వహించి, యాంధ్ర భూస్థలి నంతట సప్తమ చక్రవర్తి యని గొని యాడబడుచుండెను.

ఆంధ్రసామ్రాజ్యమును జయింప వలె నని ఢిల్లీచక్రవర్తులకుగల యీర్ష్యను జెల్లనివ్వ కుండుటకై అనుమకొండనుండి రాజధానిని ఓరుగల్లుకుమార్చి, ఉన్నతములైన రాజభవన ములను, సంరక్షణార్థమై దుర్గములను శిలా ప్రాకారములను గట్టించెను

ఈగణపతి దేవచక్రవర్తి యిప్పటి వరంగల్ జిల్లా మొలుగు తాలూకాలో జేరినగణపపుర (కణపర)మును నిర్మించి, అక్కడ ఒక పెద్దత టాకమును వేయించెను మరియు చింతపల్లిస్టేష నుకు సమీపముననున్న యెల్గూరు గ్రామమును నిర్మించి, అదేపేరున యొక పెద్దతటాకమును వే యించెను. వీటియన్నిటికన్న ప్రసిద్ధి గాంచిన పాఖాల చెరువును యితనే వేయించియుండెను. ఈవిషయమైన చిత్రకథ జనులు వాడుకొనుట యేగాక, వ్రాతదృష్టాంతరములుగలవు కానిగ్రం థ విస్తర భీతిచే కథ నిటవదలి ప్రస్తుతాంశ మును వ్రాసితిని.

ఈచక్రవర్తి సేనాధిపతులలో కాటచమూప తి, భాండచమూపతి, మొలుగు తాలూకాలోని రామప్పదేవాలయమును కట్టించినట్లు అక్కడి శాసనమువలన తెలియుచున్నది. మరియు కొండపర్తిలో శా శ. ౧౧౬౨ సంవత్సరమున దేవాలయము గట్టించి త్రిమూర్తుల ప్రతిష్ఠించి, బెల్లుచెరువు గ్రామమును దేవునికైంకర్య మునకై దానముజేసినట్లు చరిత్రవలన దెలియుచున్నది.

ఈచక్రవర్తి గూడ తండ్రివలె శైవమత

పక్షపాతియు జైనమతద్వేషియు నై జైనులసామ్రాజ్యమునుండి పారదోలుటయేగాక, జైనుల ౩౬ గ్రామములనుధ్వంసపరచినట్లుగూడ చరిత్రములవలన దేలుచున్నది.

ఇతడు దుర్గములు, రాజభవనములు, గ్రామములు, తటాకములు, శివమందిరములునిర్మించి, ప్రజలకు పాపభీతియు, దైవభక్తియు గరపుటకు బోధకులను నియమించి, ప్రజాసౌకర్యార్థము అరణ్యప్రదేశములలో మంచిబాటలజేసి, త్రాగజలముదొరకని ప్రదేశములలో తటాకముల ను చలివందిరులను వేయించి, ప్రజలగన్నబిడ్డల మాదిరి పోషించుచుండెను. ఈకాలములో ౭౨ నియోగములుగలవనియు వానిని విచారించ తగినయధికారులుగలరనియు, చరిత్రములు చాటుచున్నవి. మరియుశ్రీగంధము, పచ్చకర్పూరము, చీనీకర్పూరము, ముత్యాలు, పన్నీరు, జవాజి, మొదలుగాగల సుగంధద్రవ్యములు వాణిజ్యమున కై దిగుమతి యగుచుండెడివి.

ఈచక్రవర్తికి బుత్రికాసంతానమేకాని పుత్రసంతానము లేకయుండెను. ఈయనకు గణపాంబ, రుద్రాంబ, యనునిర్వురు కుమార్తెలు గలరు. పెద్దకుమార్తెయైన "రుద్రాంబ"ను కుమారునిగభావించుకొని యామెకు విద్యాబుద్ధులు గరపించి, తనకపిమ్మట నామెయే సింహాసనారూఢయై యాంధ్రసామ్రాజ్యమును పరిపాలింప నియమించి, ౬౮ సంవత్సరములు ప్రజారంజకముగ నిరంకుశపాలనము జేసి, వృద్ధుడై క్రీ. శ ౧౨౯౦ వ సంవత్సరమున స్వర్గస్థుడై యశముగాంచెను.

తదుపరి యాతనిపుత్రికారత్నమగు "శ్రీరుద్రదేవి" క్రీ. శ.౧౨౬౧వ సంవత్సరమున వజ్రసింహాసనారూఢయైయాంధ్రసామ్రాజ్యపరిపాలనాభారమును వహించెను. కాని యామె గణపతిదేవచక్రవర్తి భార్యకుని కొంతమంది యపోహ పడియుండిరి. మ. రా. శ్రీ. చిలుకూరి వీరభద్రరావుగారు గుంటూరుజిల్లా మంగళగిరి తాలూకా మల్కాపురగ్రామ ఆలయములోనిశాసన మాధారముగ కూతురని నిర్ధారణ జేసినదే సమంజసముగ గన్పట్టుచున్నది. ఇదియునుగాక రుద్రమదేవి భర్త "మల్లదేవరా" జని ఆంగ్లేయభాషలో వ్రాయబడిన "ఓరుగల్లు గణపతులు" యనుగ్రంథములో యున్నది. కావున ఈపైన నుదహరింపబడిన ప్రమాణముల ననుసరించి, రుద్రమదేవి గణపతిదేవ చక్రవర్తి కూతురని నిర్ధారణ జేయుటయే సమంజసనీయము.

ఇతియేగాక ఈమె "రుద్రదేవ మహారాజు" అనునామముతో వ్యవహరింపబడుచు పురుషవేషముతోకొల్వుకూటమునకు నేతెంచి, మిత్రులతో రాజ్యాంగవిషయములనుగూర్చి ముచ్చటించు చుండినట్లు సంస్కృత ప్రతాపరుద్రీయము, త్రిపురాంతక శాసనము మొదలుగాగల వాటియందు వ్రాయబడియున్నది.

ఈమె తండ్రివలన రాజ్యతంత్రజ్ఞానము సంపూర్ణముగ అభ్యసించినందున ప్రజాను రంజకముగ పరిపాలనము జేయుచు, శిథిలమైన దుర్గభాగములను సవరించి, పుట్టకోట, మంటికోట మొదలుగాగల కోటలను నిర్మించెను.

యాదవసంభూతుండును, దేవగిరి పరిపాలకుండునగు మహాదేవరాజు మూడులక్షల సైన్యములతో దండెత్తివచ్చి ఓరుగల్లును ముట్టడించి, ౧౫ దినములు ఘోరయుద్ధము జరిపియుండెను. ఈమె ధాటికి నిలువజాలక యాదవసైన్యము పలాయనంబయ్యెను. రుద్రదేవి యింతటితో తృప్తినొందక వెంటా దేవగిరివఱకుందఱుమ, దేవగిరిరాజు శరణుజొచ్చి, కోటి

ద్రవ్యంబుఅపరాధముగా జెల్లించి సంధిజేసుకొ నియుండెను అపుడు రుద్రమదేవి మహాదేవరాజు దేశమునకు సరిహద్దుగా జయస్తంభమును పాతించి, దానిపై శాసనమొకటి వ్రాయించెను. పూర్వకాలమున స్త్రీలుగూడ యుద్ధనైపుణ్య ధైర్యసాహసములను రాజ్యతంత్రజ్ఞానమును గలిగియుండిరని తెలియుచున్నది. ఈమె పరాక్రమవంతురాలై శత్రురాజుల నోడించి, యాంధ్రసామ్రాజ్య పరిపాలనము జేసెనని చరిత్రకారులు వర్ణించియుండిరి. ఈమెకును బుత్రికాసంతానమేకాని బుత్రసంతానములేదు. ఉమ్మక్క, రుయ్యమ్మయను నిరువురు బుత్రికలు కలరు. ఉమ్మక్క పెద్దకుమార్తుడైన ప్రతాపరుద్రుడను దౌహిత్రునకు ౧౨౯౫ సంవత్సరమున నీమె పట్టము గట్టెను.

మనస్థానిక చరిత్రలో కడపటి నాయకుఁడగు ప్రతాపరుద్రుడు చరిత్రములలో రెండవ ప్రతాపరుద్రుడుగ పరిగణింపఁ బడుచున్నాడు. ఇతడు ౧౩వ శతాబ్దాంతమున క్రీ. శ. ౧౨౯౫ సంత్సరమున త్రైలింగ సామ్రాజ్య సింహాసనారూఢుడై, వైభవమునుబూని రుద్రమదేవి కాలమున దేశమునకు బాధకలిగించుచుండిన సామంతనృపాలుర జయించెను. అప్పుడాంధ్రసామ్రాజ్యము నవలక్ష సేనాపతులతో నొప్పుచు,నుత్తర హిందూదేశమునతురుష్కరాజధానీ నగరమైన ఢిల్లీనగరముకన్న నైశ్వర్యప్రభావంబుల వన్నెకెక్కియుండెను. వల్లభామాత్య కవిచే రచియింపబడిన "క్రీడాభిరామ" గ్రంథమున నిమ్మహాసామ్రాజ్యవైభవప్రాశస్త్యములు వర్ణింపబడియున్నవి.

సంస్కృతాంధ్రకర్ణాటకభాషలయందభిమానముగలిగి పండితపక్షపాతియై యనేక యుద్గ్రంథముల రచించి, విద్యాభూషణుఁడను బిరుదమును వహించిన రుద్రదేవునివలెను రుద్రమదేవివలెను, ఆంధ్రభాషాభిమానిగను ఆంధ్రభాషాపోషకుడుగ నుండి, మనచరిత్రనాయకుఁడగు రెండవ ప్రతాపరుద్రదేవచక్రవర్తి యాబాల్య కవితారసజ్ఞుఁడును, విద్వద్గోష్ఠిప్రియుండును నగుటచేత సంస్కృతాంధ్రభాషాభివృద్ధికొరకు మిక్కిలి తోడ్పడి, తన యాస్థానమున మహాకవులనేకులను నిలిపి పోషించి యుండుటచే, నితని కాలమున సంస్కృతాంధ్రభాషలు రెండును వర్ధిల్లెనని దెలియుచున్నది. ఇదియునుగాక యీచక్రవర్తి స్వయముగా ప్రతాపమార్తాండమను గ్రంథమును రచించినట్లు చరిత్రల మూలమున తెలియుచున్నది.

ఇతడు తన మాతామహితండ్రియగు గణపతిదేవచక్రవర్తివలెనే జైనమత ద్వేషియై, శైవమతాభిమానియై యనేకశివమందిరములనిర్మించియుండెను.

క్రీ. శ. ౧౨౯౯ వ సంవత్సరమున అలావుద్దీన్ ఖిల్జీ తండ్రిని జంపించి ఢిల్లీ సింహాసనమెక్కెను. ఇతఁడు భరతఖండము నేకసామ్రాజ్యముగనేలదలంచి, యనేక రాజుల జయించి ఆంధ్ర సామ్రాజ్యమును గెలువవలయునని క్రీ. శ. ౧౩03 సంవత్సరాంతమున మలిక్ కాఫరు అధ్యక్షతక్రింద పదివేల గుఱ్ఱపుదళమును, నలుబదివేల పదాతివర్గము గిచ్చి ఓరుగంటి రాజ్యముపై బంప, యీవిషయమును ప్రతాపరుద్రుడు తన చారులవలన తెలుసుకొని తన సోదరుఁడయిన అన్నమదేవభూపాలుని ఆధిపత్యముక్రింద పేరుబొందిన కమ్మరెడ్డి సేనానులను మలికాఫర్‌ను నెదురుకొనబంపగా, గోదావరియొడ్డున ఘోరయుద్ధముజరిగి మలికాఫర్ పరాభూతుఁడై ఢిల్లీకి పారిపోయె

ను. ఈపరాభవమువలన మలికాఫర్ రెండ వసారి క్రీ. శ. ౧౩౦౭ వంవత్సరమున ౩౦ వేల గుఱ్ఱపుదళముతోను లక్ష కాల్బలముతోను వచ్చి యుండియాతడవగూడ పరాభూతుఁడై డిల్లీకిపారిపోయెను.

ఈ రెండుసారులు గలిగిన పరాభవమువల న మహమ్మదీయులు తమ పట్టువదలక క్రీ. శ. ౧౩౦౯ సంవత్సరమున ౪౦ వేల ఆశ్వికదళము ను,లక్షకాల్బలమును వెంట తీసుకొని దండెత్తి వచ్చి కోటనుముట్టడించిరి. కోటలోనివారు అనేకదినములు ఘోరముగా యుద్ధముజేసిరి. కాని కటకరాజును, కాకతీయ శత్రు వగు దేవగిరియాదవరాజును, తురుష్కులకు స హాయపడుటచేతను, అణగ ద్రొక్కబడిన జై నులు యీసందర్భమున విజృంభించి రాజ్యర హస్యముల దురుష్కులకుఁ జెప్పుటచేతను, సంధిజేసుకొనకుండుట నీతికాదనియు నపాయ కరమనియు నిశ్చయించి, ప్రతాపరుద్రుఁడు డిల్లీశ్వరునకు కప్పము చెల్లించునట్లు సంధి చేసుకొనెను.

ఖిల్జీవంశముకుతరువాత సింహాసనారూఢుడై గయాసుద్దీనుతొగలకు తన జ్యేష్ఠకుమారుఁడై న అలఫుఖానును క్రీ. శ. ౧౩౧౭ సంవత్సరము న ౧౦ వేల గుఱ్ఱపుదళము లక్షకాబ్బలము నిచ్చి ఓరుగంటిపై బంపెను. కోట ముట్టడించి ఘోరయుద్ధముజేసినను తుదకాతనికి పరాభ వమేసంభవించెను జరిగిన పరాభవమును భరిం పజాలక రెండుమాసములకేతిరిగి తురుష్కులు దండెత్తి వచ్చిరి. తురుష్కులు స్వల్పకాలము లోనే వత్తురనియాంధ్రు లూహించియుండ నందునను, సుప్రసిద్ధ సేనానాయకులును సేన లును వీరమరణము నొందుటచేతను, క్రొత్త మార్పులు చేసికొనుటకవకాశము జిక్కనందు నను, యాంధ్రసామ్రాజ్యం మహాలక్ష్మి కా కతీయం ధరణీనాయకుల విడనాడినది.

ఓరుగల్లు మహమ్మదీయుల వశమయ్యెను. ఇమ్మహానగరమునకు అలఫ్ఖాన్ "సుల్తాన్పూ" రను పేరుబెట్టి, ఇమాదుల్ముల్కును ప్రాంతాధి కారిగ నియమించెను. ప్రతాపరుద్రుఁడు చెఱ బెట్టఁబడి డిల్లీకిగొంపోబడినతరువాత నతనిమం త్రి యుగంధరుఁడు యుక్తిప్రభావముచే మఱల దీసికొనివచ్చినట్లు పురాతన కథలు గలవు. అవి యెంతవరకు విశ్వసనీయములో తెలియదు

ఈచక్రవర్తి చెఱపెట్టఁబడి డిల్లీకి గొంపో బడిన తరువాత వీరభద్రుఁడురాజ్యాభిషిక్తు డైనట్లు వ్రాయఁబడి యున్నది. కాని యితఁ డు సోదరుఁడని కొందఱు, కుమారుఁడని కొరదఱు భిన్నాభిప్రాయులై యున్నారు.

ప్రతాపరుద్రమహారాజు చెరపెట్టబడి ఢిల్లీకి గొంపోబడినపిదప నాతని తమ్ముడగు వీరభ ద్రుడు రాజ్యమునకువచ్చెను. అతనికాల ములో ఢిల్లీచక్రవర్తియగు మహమ్మదు తోగ్లకు దండెత్తివచ్చెను. వోరుగల్లుసైన్య మాతని సైన్యము నాపెను. కొన్నిమాసముల వరకు తోగులకు సైన్యము కోటవెలుపలనుండి పోరెను కాని జయింప వీలుపడకుండెను. అంత ట వేసవికాలమగుట మారి వ్యాధి ప్రబలి, సైన్యనష్టము మిక్కుటము గాజొచ్చెను. ఇక నిచ్చట నిల్వడము హానికరమని తలంచి తోగులకు దేవగిరికి మరలెను, కాని వెంటనే మరుసటిసంవత్సరము దండెత్తివచ్చెను. ఆతనిచేతలవలన సర్వజనులు అసంతుష్టి నొందిరి. అట్టితరుణమున వీరభద్రుడు గుల్బర్గసుల్తానుడగు హసన్‌గంగు బహమనీ సహాయమున రాజ్యమాక్రమించుకొని చక్ర వర్తిసేనల పారతోలి స్వతంత్రుడాయెను. హ

సన్‌గంగుబహమిని ఢిల్లీచక్రవర్తుల కిచ్చు కప్పము గుల్బర్గరాజుల కిమ్మని వోరుగల్లు వారిని కోరెను. కాని యాతడు సమ్మతించ నందున వుభయులకు సమరమేర్పడెను. హసన్‌గంగు పరాభవమొందెను

హసన్‌గంగు మరణానంతర మాతని ప్రథమపుత్రుడైన మహమ్మదుషా పట్టాభిషిక్తుడాయెను. యీరాజుకాలమున యీవోరుగల్లు విజయనగరపురాజన్యులు హసన్‌గంగు ఆక్రమించుకొనిన వారికోటలు వారికి తిరిగి యిప్పించగలందులకై మహమ్మదుషా వద్దికి రాయభారము పిరి. కాని అప్పుడాతని స్థితి బాగుగలేనందున రాయభారులను కొంత కాలము తనవద్దనే వుంచుకొని, సేనాదళములు సిద్ధపర్చుకొనిన పిదప, తమకు చెల్లించని కప్పములున్ను, మంచి యేనుగులున్ను, బంగారమున్ను పంపించగలందులకు వర్తమానమంపెను. అప్పటికి మహమ్మదుషా యేలుబడిలోజేరియున్న 'కవులాస' ముట్టడించ పంపించెను. కాని వోరుగల్లు సైన్యములు మహమ్మదీయులబలముయెదుట నిలువజాలక పరాభవమొందినవి అంత మహమ్మదీయులు వోరుగల్లువరకును సాగివచ్చి వోరుగల్లురాజులను బాకీపడిన కప్పములు చెల్లించడమునకై నిర్బంధపరిచిరి. తదుపరి క్రీ. శ. 1371 లో కొందరు గుఱ్ఱములవర్తకులు గుల్బర్గరాజులకు గుర్రములతెచ్చుచుండగా మార్గమధ్యములో వోరుగల్లురాజు వారిని ఆపుకొనినందున వోరుగల్లువారికిని బహమినీరాజుకును యుద్ధముజరిగెను. అందు వోరుగల్లురాజు పుత్రుడైన 'వినాయకదేవుడు' వారు బంధించి తీసికొనివెళ్ళిరి. గుఱ్ఱముల నిట్లేల యావుదల చేసితిరని యడుగగా వోరుగల్లురాజు తిరస్కరించి బదులుచెప్పెను. అందులకై బహమినీ రాజాగ్రహవంతుడాయెను. తదుపరి వారు తిరిగి కలబర్గకు వచ్చుచుండ వోరుగల్లువారు వారిని ముట్టడించిరి. మహమ్మదుషా కొకగాయము తగిలెను.

అట్టి అపజయముకున్ను, తన కొమారుని దుర్మరణమునకు చింతిల్ల వోరుగల్లురాజు ఢిల్లీశ్వరుని సహాయమువేడుచు బహమినీ రాజ్యము నంతరించడమునకు వారి సైన్యమునకు తాను సహాయముచేయుమనని వ్రాసుకొనెను. యీవార్త మహమ్మదుషా బహమినీ యెరింగి కవులాస, గోలకొండల వైపునుండి వోరుగల్లుపై దాడివెడలెను. వోరుగల్లువారు మూడువందల యేనుంగులు, రెండువందల మంచి గుఱ్ఱములు ముప్పదిమూడులక్షల రూప్యములిచ్చి, గోలకొండప్రాంతము యికముందు బహమినీరాజ్యమున కిచ్చునట్లుగా క్రీ. శ. 1364 సవత్సరములో సంధిచేసికొనిరి,

యీమధ్యకాలములో బహమనీసుల్తానులు విజయనగరమువారితో పోట్లాడుచుండిరి. మహమ్మదుషాబహమని తదుపరి క్రీ. శ. 1421 లో విజయనగరాధీసులు కప్పముచెల్లించక తిరుగుబాటుచేసినందున వారి యొద్దకప్పములు సేకొనుటకై దాడివెడలి, అపరాధముగా మరికొంత ధనమునేకాక కొంత భూభాగము, కొన్ని మంచి కౌటలూ లాగుకొని, అచ్చటనుండి వోరుగల్లుపై దాడివెడలి బలహీనమైయున్న కాకతీయసామ్రాజ్యము నంతరింపజేసెను.

విద్యానాథుని కాకతీయాన్వయ నిరూపణము.

శ్రీయుత రుద్రరాజు నరసింహరాజుగారు.

శ్రీమదాంధ్రదేశమును క్రీస్తుశకము పం డ్రెండు, పదమూడు శతాబ్దుల ప్రాంతమున దాదాపు రెండున్నర శతాబ్దులవరకు నేకచ్ఛత్రాధిపత్యముగనేలి, యాంధ్రుల ప్రతిభను దేశదేశముల ఁజాటిన కాకతీయ చక్రవర్తుల కులము క్షత్రమా? లేక క్షత్రేతరమా? యని జరుగుచు వచ్చిన వాదప్రతివాదము లాంధ్రసాహితీపరిచితులకు గొత్తలుకావు. విద్యానాథ మహాకవిరచితమైన ప్రతాపరుద్రీయ యశోభూషణమును నామాంతరముకల ప్రతాపరుద్రీయమను సంస్కృతాలంకార గ్రంథము కాకతీయులను క్షత్రియేతరులనుగాఁ దెలుపుచున్నదని క్షత్రియేతరవాదులును, క్షత్రియులనుగానేఁ పేర్కొనుచున్నదని క్షత్రియవాదులును జేసిన వాదప్రతివాదములు రెంటియందును నది ప్రధాన ప్రమాణస్థానమునే యాక్రమించియున్నది. ఆవాద ప్రతివాదములు కాకతీయవంశమును గూర్చి ప్రతాపరుద్రీయ మేమిచెప్పుచున్నదో నిర్ణయించుటకుఁ దగినంత సమర్థములుగా ఁగూడనున్నవి. అయినను గొందఱి కింకనీ విషయమున భ్రమలువీడినట్లు కాన్పింపదు.

రాజమండ్రీలోని యాంధ్రాహిస్టారికల్ రీసెర్చిసొసైటీవారి జర్నల్ 4 వ సంపుటము, 3&4 వ సంచికయందు శ్రీజయంతిరామయ్యపంతులుగారు మాల్కాపురశాసనమును బ్రకటించుచుఁ దచ్చర్చాసందర్భమునఁ గాకతీయులు క్షత్రియులగుదురా? యనువిషయమును గూర్చి కొంతఁ బ్రస్తావించియున్నారు. అందుఁ గాకతీయులు సూర్యవంశమువార మనిచెప్పుకొను చోడులను జయించిన తరువాతఁ దమ్ము గూర్చి సూర్యవంశము వారినిఁగాఁ జెప్పుకొనియుందురనియు, గాకతీయ వంశమునుగూర్చి ప్రచురితమైన గుమ్మడితీఁగకథ తద్వంశపరిశుద్ధతకుఁ గళంకమునాపాదించునదిగానే యున్నదనియు, మొదలుగా వారొనర్చిన విశ్వాసార్హములగు నూహాకల్పనములను ద్రోసిపుచ్చినచో వారును ముఖ్యముగాఁ ప్రతాపరుద్రీయము మీదనే యాధారపడి కాకతీయులను క్షత్రియులుగారనుచున్నారని బోధపడగలదు.

శ్రీశేషాద్రిరమణకవులుకూడ నాంధ్రపత్రిక ప్రజోత్పత్తిసంత్సరాది సంచికయందుఁ 'గాకతీయరాజులు' అనువ్యాసమున 'అనుమకొండశాసనములో నున్న రుద్రదేవుని 'క్షుద్రక్షత్రికులోన్న తికయకృతః' అనువిశేషణము, ప్రతాపరుద్రీయములోని 'క్షుద్రక్షత్రియపక్షశిక్షణవిధౌ' 'సోమార్కాభిజనంతమద్యజయతి శ్రీకాకతీయాన్వయం' 'అత్యర్కేందు కులప్రశస్తి మసృజ ద్యంకాకతీయాన్వయం' 'సూర్యసోమాన్వయామాత్య మహత్తాద్యాధరీకృతా' అనునవి కాకతీయవంశము సూరచంద్రవంశములకు భిన్నమైనదనియు, క్షత్రియేతరమనియు విశ్వసింపనవకాశము నొసంగుచున్నవి." అనివ్రాసియుండిరి. పిమ్మట భారతి యందుఁగూడఁ దమపూ

ర్వాభిప్రాయమునే స్పష్టీకరించియుండిరి. ఇందువలన నేఁడుకూడఁ సుప్రసిద్ధచరిత్రజ్ఞులు ప్రతాపరుద్రీయము కాకతీయులను క్షత్రియేతరులనుగానే నిరూపించుచున్నదని యెంచుచున్నట్లు స్పష్టమగుచున్నది.

అటుల వారభిప్రాయపడుట యెంతవరకు సయుక్తికమో, నిజమునకుఁ బ్రతాపరుద్రీయమువలనఁ గాకతీయవంశమునుగూర్చి యేర్పడు నిర్ణయమేమియో ప్రస్తుత మీవ్యాసమునఁ జర్చింపఁబడును.

విద్యానాథుఁడు ప్రతాపరుద్రీయమునందచ్చటచ్చటఁ గాకతీయవంశమును వర్ణించియున్నాఁడు. [1]

ఈతనిచే గాకతీయవంశము సూర్యచంద్రవంశభిన్నముగ వర్ణింపఁబడినదనియు, క్షత్రియులెల్లరు సూర్యచంద్రవంశములలో నేదో యొకదానికిఁ జేరియే యుండవలయునుగానఁ గాకతీయులు క్షత్రియులేయైనచో వారిని విద్యానాథుఁడు సూర్యవంశ్యులనుగానో చంద్రవంశ్యులనుగానో తప్పక వర్ణించియుండుననియుఁ, గాకతీయులు క్షత్రియులు కారుకనుకనే వారిని విద్యానాథుఁ డిట్లు సూర్యచంద్రవంశభిన్నులనుగా వర్ణించినాఁడనియు, నిందువలనఁ బ్రతాపరుద్రీయము కాకతీయులను క్షత్రియేతరులనుగానే తెలుపుచున్నదనియు, క్షత్రియేతరవాదుల వాదము. మఱియుఁ బ్రతాపరుద్రీయమున నాయక, కావ్యప్రకరణములలో "క్షుద్రక్షత్రియపక్షశిక్షణ విధౌ ప్రోక్షిప్తకాక్షీయకాః" అనియు, నాటకప్రకరణమున "క్షుద్రక్షత్రియాన్ విజిత్య" అనియు, గాకతీయులు క్షత్రియవిరోధులుగా వర్ణింపబడుట కూడ వారివాదమునే బలపఱుచుచున్నదందురు.

ఇఁక క్షత్రియవాదులన్ననో యాప్రతాపరుద్రీయమునందే నాటకప్రకరణమున 'అజ్ఞాక్షత్రియమౌళిమండన మణేస్తాతస్యసానుగ్రహా' అనియు, 'అస్మాభిర్నిజదోః ప్రసూతిమధునా ధన్యామజోమన్యతే' అనియు, 'స్వయంభూదేవవరానుకూలానాం భవదాశీర్వాదానాం ఫలమిదం యత్కాకతీయక్షాత్రం వర్ధతే' అనియు, నిట్లు కాకతీయమును క్షత్రియవంశముగ విద్యానాథుఁడే స్పష్టముగాఁ జెప్పియున్నాఁడనియుఁ, కనుకఁ బ్రతాపరుద్రీయమునఁ గాకతీయులు క్షత్రియులుగానే చెప్పఁబడిరనియు, గొన్నిచోటులఁ గాకతీయము సూర్యచంద్రవంశభిన్నముగ వర్ణింపఁబడినను నయ్యది

1 తాదృఙ్మధ్యమలోక భాగ్య విభవా దింద్రాది బృందారకైః
క్షోణ్యాంక్రీడితు మిచ్ఛుభి శ్చిరతరం సంప్రార్థితః పద్మభూః
అత్యర్కేందు కులప్రశస్తి మసృజద్యం కాకతీయాన్వయం
తస్మిన్ సంప్రతి వీరరుద్రవపుషా జాగర్తి లక్ష్మీపతిః ||నాటకప్రకరణము||
సోమార్కాభిజనం తమద్యజయతి శ్రీకాకతీయాన్వయః ||నాటక ప్రకరణము||
సూర్యసోమాన్వయామాత్య మహత్తాద్యాధరీకృతా
అస్మాభి రధికుర్వాణైః, కాకతీయలకుస్థితిమ్." ||నాటకప్రకరణము||
సాహసాంశవ మైందవంచ మహతీ యేద్వేకులే నిర్మితే
తేజాతేలఘునీ గుణైర్విజయిని శ్రీకాకతీయాన్వయే
భూపాలేషు భవత్ప్రతాప యశసా పూర్ణార్కచంద్రశ్రియోః
ప్రాప్యానుగ్రహ మూర్జితేషు పునస్త్యేతే లభేతేస్థితిమ్.|| ||నాటకప్రకరణము||

క్షత్రతాబాధకము కాదనియు, సూర్యచంద్ర వంశములకంటె వేరైన క్షత్రియములు గొన్ని కలవనియు, నట్టివంశములలోఁ గాకతీయ మొకటియనియు విద్యానాథుని తలంపైయుం డవచ్చుననియు, జెప్పియున్నారు.

ప్రతాపరుద్రీయమే కాకతీయులను క్షత్రి యులని పైరీతిని స్పష్టముగఁ బేర్కొనున నుట క్షత్రియేతరవాదులకు బ్రబల ప్రతి రోధకమైన విషయమైనను, విద్యానాథుఁ డిట్లు కాకతీయులను క్షత్రియులనుట, కవి తన సంర క్షకుని కొఱకుఁజేసిన యతిశయోక్తివర్ణనము కాని యన్యముకాదని సమాధానముచెప్పు టతో శ్రీ రామయ్యపంతులుగారు సంతృప్తి వహించుచున్నారు.

ఈవాదప్రతివాదములవలన— గాకతీయము సూర్యచంద్రవంశభిన్నమనుటయు, గాకతీ యులు క్షుద్రక్షత్రియ విరోధులనుట యుఁ గాకతీయులు క్షత్రియులుగారని సిద్ధాంతీకరిం చునా? విద్యానాథుఁడు కాకతీయము క్షత్రి యవంశమే యైనచో నేల సూర్యచంద్రవంశ భిన్నముగ వర్ణించినాఁడు? కాకతీయము క్షత్రియవంశము కానప్పుడు పైరీతినిఁ గాక తీయమును నర్కేందుకులభిన్నమని చెప్పియుం డియుఁగూడ విద్యానాథుఁడు స్వవచోవ్యా ఘాతముగ నేల మరలఁ గాకతీయులను క్షత్రి యులని కంఠోక్తిగఁ బేర్కొనినాఁడు? ఈపే ర్కొనుట కృతిపతియొక్క గొప్పకై చేసిన యతిశయోక్తివర్ణనమేనా? ఇట్లు విద్యానాథుఁ డొకేగ్రంథమున వ్రాసిన పరస్పరవిరుద్ధములైన వ్రాతలకు సమన్వయమెట్లు?—మొదలగు సంశ యములేర్పడి సహృదయులకు పరిశీలనా ర్హములగుచున్నవి.

బ్రతాప రుద్రీయమునఁ గాకతీయవంశము విద్యానాథోక్తరీతిని సూర్యచంద్రవంశభిన్నమ నుటనిజమే. కాని క్షత్రియేతరమని యిందువ లనఁ దేలుచున్నదా?

సూర్యచంద్రవంశముల కంటెభిన్నములైన క్షత్రియవంశములుకలవా? యనివిచారింతము.

మనపురాణములు సూర్యవంశపుగాథలనే విరివిగవర్ణించుచున్నను దదితరక్షత్రియకులము లులేవని చెప్పుటలేదు. మహాభారతమునందు[2] నైలేక్ష్వాకవంశములు (చంద్రసూర్యవం శములు) మాత్రమేకాక యింకను క్షత్రియ వంశములున్నటులఁ జెప్పబడినది. మఱియు రఘువంశము ౬ వసర్గము ౪౯ వ శ్లోకములో నీపాన్వయమని మఱియొక క్రొత్తవంశము పేర్కొనఁబడినది. పురాణములయందును చరిత్రములందును బ్రసిద్ధములైన శిశునాగ, మౌర్య, శుంగ, ఆంధ్ర, గుప్త, మౌఖ, ర్యాదివంశములును సూర్యచంద్రవంశములకుఁ జెందినవిగాఁ బేర్కొనఁబడని క్షత్రియవంశ ములై యున్నవి. ఉత్తరహిందూస్థానమునందలి క్షత్రియవంశములలోఁ గొన్ని "ఛత్రీస్ రా జకుల్" (ముప్పదియాఱురాజకులములు) అ నుపేరుతోఁ బిలువఁబడుచున్నవి. ఇది యిప్ప టిమాటయేకాదు, దాదాపు పండ్రెండవ శతాబ్దికిఁజెందిన కల్హణపండితుఁడు తన రాజత రంగిణియందుఁగూడ నీఛత్రీస్ రాజకుల్ ప్రశంస చేసియున్నాఁడు

2 వ. తొల్లి జమదగ్నిసుతుండయిన రామునిచేత ధాత్రి యపగతక్షత్రంబయిన నాతనుండి యైలవంశంబును నిక్ష్వాకువంశంబును దక్కఁదక్కిన క్షత్రియవంశంబులెల్లం గృత్రిమంబులుగాని విమలకులార్హంబు లుగావు.

ఈముప్పదియాఱు రాజకులములలో ౧౬ రాజకులములు సూర్యచంద్రవంశములకుఁ జెందనివిగాఁ జెప్పఁబడుచున్నవి. 3

కనుక సూర్యచంద్రవంశములకంటె భిన్నములుగ బేర్కొనఁబడిన క్షత్రియవంశములు లేవని చెప్పవలనుపడదు.

వంశమునుగూర్చి పరస్పరవిరుద్ధములగు పెక్కుగాథలేర్పడుట కవకాశము కలదు. అట్టి కథలు జనారూఢములై పూర్వసందర్భములు విస్మృతములైనప్పుడు తద్వంశములు ప్రత్యేక వ్యక్తిత్వమునువహించి మూలవంశములకంటె భిన్నములుగఁ బరిగణింపఁబడును. అట్టివంశములలో మనకాకతీయముకూడ నొకటియైయుండవచ్చును కాని వాదమున కొకవేళ క్షత్రియేతరవాదుల వాదమే యంగీకరించుదమన్నను, కాకతీయులను క్షత్రియులనుటకు సూర్యచంద్రవంశభిన్నములైన క్షత్రియకులములు లేవను నమ్మిక వారినెంతగా బాధించుచున్నదో, యంతకంటె నెక్కువగఁగూడ బాధించు ప్రతిబంధకము మరియొకటి యున్నది అదియెట్టిదనఁ గాకతీయులు సూర్యచంద్రవంశములకంటె గొప్పదైన వంశమువారనగా వారేవర్ణము వారు?

ఈప్రశ్నలకు క్షత్రియేతరవాదులు నిరుత్తరులు కాకతప్పదు. క్షత్రియేతరములగు ననేక వంశములు—సుప్రసిద్ధములైన బ్రాహ్మణ వైశ్యశూద్రవర్ణములకుఁ జెందినవి—కావ్యశాసనాదులయందు ననేక కవులచే నెంతెంత యతి [illegible] మోకి భూయిష్ఠముగ వర్ణింపఁబడినను, [illegible] శు నిట్లు సూర్యచంద్రి [illegible] దిగ వర్ణింపఁబడియుండ లేదన నింకవర్ణముపేరైనఁ బేర్కొనకుండ నిట్లు వర్ణింపఁబడిన వంశము లేదని వేఱెచెప్పనక్కఱలేదు కనుక ప్రతారుద్రీయము నందు మాత్రమే యున్న యిట్టిలోకవిరుద్ధవర్ణనమును వారెట్లు సమర్థింపఁగలుగుదురు?

కాకతీయులు శూద్రులని తెలుపుటకై విద్యానాథుడిట్టి మార్గమవలంబించెనని క్షత్రియేతరవాదుల భ్రమయైయున్నది. కాని యెందరు కవులు తమయాశ్రయ శూద్రప్రభువులను శూద్రులనుగానే కావ్యశాసనాదులయందు వర్ణించియుండలేదు? సూర్యచంద్రవంశములకంటెను గొప్పవంశమని వర్ణించినంత మాత్రమున శూద్రవంశమని రూఢ్యర్థములేకుండుటచేఁగవి తనయుద్దేశ్యమునెట్లువ్యక్తీకరింపఁగలిగెను? కనుక విద్యానాథుఁడు కాకతీయులను శూద్రులనుగాఁజెప్పనుద్దేశించియీక్రొత్త పుంతఁద్రొక్కెనని చెప్పవలనుపడదు.

మఱి విద్యానాథుఁడు కాకతీయులను క్షత్రియేతరులని తెలుప నుద్దేశించి మాత్రమే యటుల వర్ణించినాఁడనుటయు విశ్వసనీయము కాఁజాలదు. విద్యానాథుఁ డటులుద్దేశించుట కా కాలమునఁ గాకతీయులు క్షత్రియులని వాడుక యుండవలయును. అట్టివాడుక లేనిదే తన్నివారణోద్దేశము విద్యానాథునికిఁగలుగఁ జాలదు. ఆకాలమున క్షత్రియులని వాడుక యున్నపుడు విద్యానాథుఁడు తనయాశ్రయ ప్రభువునుగూర్చి ప్రజలవాడుకకు విరుద్ధముగ నట్లేలవర్ణించును?

విద్యానాథునిఁ బిచ్చివాఁడని యనుకొనకున్నచో నిట్లు కాకతీయులను క్షత్రియులనియు క్షత్రియేతరులనియుఁగూడ వర్ణించి యుండు

పయంతః సంభూతిం, షట్టింశతి కులేషు యే
భాస్వతోపి, సంహతేనోచ్చకైస్థితిమ్" ॥రాజతరంగిణి, సప్తమరంగము

నని యెవరు నంగీకరింపఁజాలరు.

విద్యానాథుఁడు కాకతీయులను క్షత్రియులనుట కేవలము ముఖస్తుతికొఱకని శ్రీరామయ్యపంతులుగారు వ్రాయుచున్నారు. ఉదాహృతశ్లోకములలో ముఖస్తుతియేలేదు. "క్షత్రియశ్రేష్ఠుఁడైన తండ్రియాజ్ఞ" యనుటయు, "మాపుట్టుకవలన బ్రహ్మతన దోఃప్రసూతిని ధన్యమైనది గాదలంచుచున్నాఁడ" నుటయు ముఖస్తుతులగునా? పంతులుగారికొకవేళ వీనియందు ముఖస్తుతియే కనఁబడుచున్నచో నిట్టిముఖస్తుతిని క్షత్రియత్వకథనము లేకుండఁగనే నిర్వహించుట కనేకావకాశములుండుచుండఁగా—నాకాలమునఁ గాకతీయులు క్షత్రియులని వాడుకయున్నను గాకతీయక్షత్రియేతరత్వద్యోతనమునకై నడుముకట్టిన విద్యానాథుఁడట్లేల నిజోద్దేశవిరుద్ధముగఁ బ్రవర్తించును? కవియైనవాఁడెవఁడైనఁ దానునుతించు ప్రభువును దనపుస్తకమునం దంతటనొకేకులమువానిఁగ వర్ణించునుగాని, యిటులనొకచోట క్షత్రియునిఁగను మఱియొకచోటఁ దద్భిన్ననిఁగను వర్ణించునా? అట్లు వర్ణించినచోనది ముఖస్తుతి యగునా? ఏకృతిభర్తయైన నిట్టి ముఖస్తుతి నామోదించునా?

ఇదిగో విద్యానాథుని ముఖస్తుతి మచ్చునకు 4 "మాకుల పతియు స్వయంభువునగు నాశివుఁడు స్వయముగా మాకుఁగర్తవ్యమునుపదేశించుటచేఁ గాకతీయవంశము నేఁడుసూర్యచంద్రవంశములకంటె మిన్నయగుచున్నది. భూకాంత ఇప్పుడు మాయందుఁ బాతివ్రత్యమును బొందుచున్నది బ్రహ్మ మావలన నేఁడు తన దోఃప్రసూతిని ధన్యమైన దానిని గాఁదలంచుచున్నాఁడు".

ఈ ప్రకారము విద్యానాథుఁడు కాకతీయమును క్షత్రియవంశము కాదని చెప్పినాఁడు. వెనువెంటనే మఱల క్షత్రియవంశమని చెప్పినాఁడు. ఇది ప్రతాపరుద్రుని కొఱకు విద్యానాథుఁ డొనర్చిన ముఖస్తుతియఁట! మఱియు మంత్రికాని వానిని మంత్రిగను, ప్రభువుకాని వానినిఁ బ్రభువుగను, దాతకాని వానిని దాతగను, శూరుఁడుకాని వానిని శూరునిఁగను నీరీతిని వర్ణించిన యతిశయోక్తులు కలవుగాని, యెక్కడైనఁ గులమునఁ నతిశయోక్తియున్నదా? కనుక నెన్నివిధముల నాలోచించినను బైక్షత్రియత్వకథనము ముఖస్తుతిగాని, సత్యేతరముకాని కాఁజాలదు. అందువలన నొకచోటఁ గాకతీయులను క్షత్రియులని చెప్పిన విద్యానాథుఁడు వారిని క్షత్రియేతరులని చెప్పనుద్దేశించెననుటయు యుక్తియుక్తముకాదు. నిజమునకు విద్యానాథునియం దెట్టి స్వవచోవ్యాఘాత దోషమునులేదు. అతఁడు క్షత్రియవంశమని కంఠోక్తిగఁ జెప్పినాఁడు. కాకతీయము క్షత్రియవంశము కనుకనే క్షత్రియవంశములలోఁ బ్రసిద్ధములైన సూర్యచంద్రవంశములతోఁ బోల్చి కాకతీయమునకు ఘనతసంపాదించినాఁడు. "ఎక్కువప్రశస్తికలది, జయించుచునది. దీనిముందది వెలవెలబోవుచున్నదని" యీరీతిగ వర్ణించుట పోలికనుసూచించును5

---

4 దశరవిసూం, దశచంద్రసూం, ద్వాదశఋషిప్రమాణ
నారసూం, బ్రహ్మహోమసే,యహ ఛత్రీ సబఖాఽ ॥రుద్రక్షత్రియపత్రికా (హిందీ).॥

5 "సోమార్కాభిజనం తమగ్యజయతి శ్రీకాకతీయాన్వయః
పాతివ్రత్యముపైతి సాంప్రతమమీ ష్వస్మాసు విశ్వంభరా
అస్మాభిర్నిజదోః ప్రసూతి మధునా ధన్యామజో మన్యతే
యత్కర్తవ్యముపాదిశత్కులపతి ర్దేవ స్స్వయంభూ స్వయమ్"

ఇట్టి[5a] గాకతీయము సూర్యచంద్రవంశముల ప్రశస్తి కంటెనెక్కువప్రశస్తికలది, సూర్యచంద్రవంశముల జయించుచున్నది కాకతీయము గుణోన్నతి వహించియుండ సూర్యచంద్రవంశములు లాఘవమును బొందుచున్నవి యని వర్ణింపఁబడుటవలన నది సూర్యచంద్రవంశములతోఁ బోల్పఁబడుచున్నదని గుర్తింపవలయును. కాకతీయము క్షత్రియవంశము కనుకనే క్షత్రత్వాది సాధర్మ్యము కలిగి క్షత్రియవంశములలో సుప్రసిద్ధములైన సూర్యచంద్రవంశములతోఁ బోల్పఁబడెను. క్షత్రేతరమే యైనచో నిటులుసూర్యచంద్రవంశములతోఁ బోల్పనవసరమే కలుగదు. అందువల్లనే యింతవఱకు నెవ్వరు నేక్షత్రేతరవంశమును సూర్యచంద్రవంశములతోఁ బోల్చియుండలేదు. క్షత్రియవంశముమాత్రము మఱియొకటియిట్లు సూర్యచంద్రవంశములతోఁ బోల్చివర్ణింపఁబడెనా యని ప్రశ్నింపవచ్చును. ఆ! కలదనియేప్రత్యుత్తరము. కవిరాజు తనసంస్కృతరాఘవపాండవీయమునందుఁ గృతిభర్తయగు కామదేవునివంశము నిట్లు వర్ణించియున్నాఁడు.[6] మఱియు విక్రమసంవత్ 1442 సం॥ నకుఁ జెందినదియు, ప్రభాస్‌పాటన్‌లోదొరికినదియు, నగు యాదవ భీముని శిలాశాసనములో రాష్ట్రకూటవంశముకూడ నిట్లేపోల్పఁబడెను.[8] కనుక సూర్యచంద్రవంశములకంటె భిన్నములైనక్షత్రియవంశములు సూర్యచంద్రవంశములతోఁ బోల్పఁబడుట యుక్తి యుక్తమును, కవిజనాదృతమునై యున్నది. విద్యానాథుఁడు కూడఁ గాకతీయము క్షత్రియ వంశమని తలంచుటవలననే సూర్యచంద్రవంశములతో, బోల్చియుండెను. పోల్చుటయేకాక స్పష్టముగఁ గూడ క్షత్రియవంశమని చెప్పియున్నాఁడు. క్షత్రేతరమే యని యెంచినచో నిట్లు లోకవిరుద్ధముగ సూర్యచంద్రవంశములతోఁ బోల్చియుండఁడు. మఱియు క్షత్రియవంశమని కూడఁ జెప్పియుండక యుండెడిని.

ఇఁకఁగాకతీయము క్షత్రియవంశమే యైనచో సూర్యచంద్రవంశములకంటె భిన్నమైన యదెట్టివంశము? దాని యుత్పత్తి యెట్లు?

☞ 127వ పేజీలోని 3వ Foot note ను 126వ పేజీలో రెండవకాలం చిగురున "చేసియున్నాడు" వద్దన; 128వ పేజీలోని 4వ Foot note ను 127వ పేజీలో 3వ Foot note గాను; 128వ పేజీలో 5వ Foot note ను అదే పేజీలో 4వ దానికి బదులుగాను—చదువుకొనవలెను—

॥కా॥ సం॥ సం॥

5a స్పర్ధతే జయతి ద్వేష్టి, హసతీర్ష్యత్యసూయతి
తదన్వేత్యనుబధ్నాతి, తచ్ఛీలతి నిషేధతి
తచ్చానుకరోతీతి, శబ్దాస్సాదృశ్యవాచకాః॥

॥కావ్యాదర్శము॥

6 ఆదిత్యస్యాన్వయో జయతి రఘుపతే ర్జన్మ నో జృంభితశ్రీ
స్తత్సామ్యం సోమవంశశ్శ్రయతి సురభితః పాండవానాం యశోభిః
ధత్తేతత్సామ్యమద్య స్మరహరధరణీ సంభవస్యాన్వయో
యస్యాలంకారభావం భజతి కృతధియాం కామదః కామదేవః॥

తాత! త్వాం ప్రాప్య చిరాత్ఫలు రాజశ్రియాఘటితౌ తేజోమయౌ సకలజగద్గీయమాన బుధకర్ణానందకారి గుణగణౌ సోమసూర్యవంశౌ వివ పుష్పభూతి ముఖరవంశౌ॥ ॥హర్షచరిత 14-6 పుట॥

8 వంశౌ ప్రసిద్ధౌహి యథాగ్నీంద్రో, రాష్ట్రోడవంశస్తు తథాతృతీయః
॥బొంబేగెజటీయర్ 1 వాల్యూం 2 భాగము 208 పుట॥

ఈవిషయమున విద్యానాథుఁడు చెప్పినదేమి? యనువిషయములను గూర్చి చిర్చింపవలసియున్నది. సూర్యచంద్రవంశములు రెండును బ్రహ్మయొక్క మానసికసృష్టిలోఁజేరినవి. బ్రహ్మయొక్క మనస్సునందు మరీచ్యత్రిమహర్షులు పుట్టిరి. అందు మరీచికిఁ గశ్యపుఁడును గశ్యపునికి సూర్యుఁడును సూర్యునినుండి సూర్యవంశక్షత్రియులు కలిగిరనియు, నత్రిమహర్షికిఁజంద్రుఁడును జంద్రునినుండి చంద్రవంశక్షత్రియులు పుట్టిరనియు వాని వంశక్రమమై యున్నది. దీనికంటె వేఱగు మఱి యొక సృష్టిక్రమము ఋగ్వేదము, తైత్తిరీయసంహిత, మనుస్మృతి మొదలగు గ్రంథములయందును బురాణాదుల యందు నుల్లేఖింపఁ బడియున్నది. బ్రహ్మయొక్క ముఖమునుండి బ్రాహ్మణులును, బాహువులనుండి క్షత్రియులును బుట్టిరనునది యట్టి సృష్టిక్రమమైయున్నది.

కాకతీయు లదినరకు తామవలంబించిన బౌద్ధజైనమతములవీడి మరల వైదికమతమవలంబించు సందిగ్ధకాలములో వారివంశమునుగూర్చి పైనఁబేర్కొనినటులఁ బెక్కుగాథలేర్పడెను. కొన్నిశాసనములలో వారు సూర్యవంశమువారని పేర్కొనఁబడిరి. కొన్నిపుస్తకములలోఁ జంద్రవంశము వారని వ్రాయఁబడినది. కొన్నియెడల బ్రహ్మబాహుజనితులగు దుర్జయవంశము వారని చెప్పఁబడిరి. ఇటులభిన్నగాథ లేర్పడుటకుఁ గారణము వారుదీర్ఘకాల మన్యమతానుయాయులై యుండి యాకాలమున మఱల వైదికమతమునఁజేరుటయు, రనుటకేవలము నప్పటికి వారి పూర్వవంశావళి విస్మృతమగుటయునై యున్నది. కేవల మప్పటికి వాడుకయందున్న కాకతీయ పదమును బట్టియు, తమకుఁ దట్టిన యాయాయూహల ననుసరించియుఁ గవులిట్టి భిన్నగాథలఁ గల్పించిరి. ఇటులనే యాకాలమునఁ జాళుక్యులు, పరమారులు పరిహారులు, చౌహానులు మొదలగు క్షత్రియజాతులవారలఁ గూర్చి కూడ వారి వంశనామముల ననుసరించియు, నాయాకవుల యూహలఁ బట్టియుఁ బరస్పరభిన్నములగు పెక్కువంశోత్పత్తి కథనము లేర్పడియున్నవి. ఇట్టిగాథలయొక్క పరస్పరభిన్నత వలనను, విశ్వాసానర్హతవలనను నసలువంశమునకు లోపమాపాదింప వలను పడదని పైన వ్రాసియేయున్నాము.

మనవిద్యానాథుఁడీ గాథలలోఁ గాకతీయులు బ్రహ్మయొక్క దోఃప్రసూతికిఁ జెందిన వంశమువారనుగాథనే స్వీకరించెను.[9] మాల్కాపురశాసనమునఁగూడ బ్రహ్మయొక్క బాహువులనుండి పుట్టిన క్షత్రియజాతులలో సూర్యవంశమొకటి యనియు, దుర్జయులగు కాకతీయులా సూర్యవంశమునకుఁ జెందినవారే యనియుఁ బేర్కొనఁ బడినది.[10] దుర్జయులమని చెప్పుకొనిన నతవాటిసీమరాజులు మొదలగువారును దమశాసనములలో దుర్జయులు బ్రహ్మబాహుజనితులని చెప్పుకొనియున్నారనుట శాసనపరిశోధకులకుఁ దెలియనిదికాదు. కనుక కాకతీయులు బ్రహ్మయొక్క దోఃప్రసూతివా విద్యానాథోక్తమేకాక త

---

9 అస్మాభి ర్నిజదోఃప్రసూతి మధునా ధన్యామజో మన్యతే॥

10 శ్లో॥ అస్తి స్వస్తి మతీ తనుర్భగవతో దేవస్య తస్య స్ఫుర
న్నాభీపంకజ సంభవస్య భుజతో యేక్షత్రియా జజ్ఞిరే
తేషాం తిగ్మమరీచి సంతతి భువో యేదుర్జయాః క్షత్రియా
స్తేషా మస్తి కులం కళంకరహితం శ్రీకాకతీభూభుజామ్॥

త్కాల కవిజనాదృతవిషయమేయని బోధపడ గలదు. కాకతీయులనుగూర్చి పెక్కులుత్పత్తి గాథలున్నను విద్యానాథుఁడీగాథనే స్వీకరించుటకుఁగారణము కాకతీయవర్ణనమునందెక్కువ చమత్కృతుల వెల్లడించుట కనువగుటయే. త్రేతాయుగమున సూర్యవంశమును ద్వాపర యుగమున చంద్రవంశము నెట్లుసకలక్షత్రియ వంశములలోఁ బ్రసిద్ధివడసెనో, యటులనే యాయాయుగములబై వంశములు శ్రీమహా విష్ణువు తమయందు శ్రీరాముఁడుగను, శ్రీకృష్ణుడుఁగను నవతరించుటచే నెటులఁబావనముల య్యెనో, అటులనే కలియుగమున కాకతీయ వంశము తనయందు మహావిష్ణువు త్రిలోచనుఁడుగ నవతరించుటచే సూర్యచంద్రవంశములవలెఁ బ్రసిద్ధమును బవిత్రము నయ్యెనని యీరీతిగా నెన్నియో చమత్కారవర్ణనముల గావించియున్నాఁడు. 11

ఇట్టివర్ణనములు కాకతీయమును సూర్యవంశముగానో, చంద్రవంశముగానో, వేరొకనచో మొలకెత్తియుండవు. కేవలము వర్ణనాచమత్కృతి కొఱకుఁ గాకపోయిన, గాకతీయుల యొక్క సూర్యచంద్రవంశభిన్న బ్రహ్మదోః ప్రసూతిత్వ కథన మవ్వటికి బాగుగాఁ బ్రచారమునందుండుట చేతను, దనవర్ణనా చమత్కృతి కుపయోగించునదగుట చేతను గూడ విద్యానాథుఁ డీమార్గమునే పట్టెననుటలో సందియముండదు. విద్యానాథుఁడైనను మఱి యొకరైనను గాకతీయులు సూర్యచంద్ర వంశములకు చెందని వేరొక క్షత్రియవంశము వారని యెంచుటకు గారణమేమియో యూహింపవలసియున్నది. సూర్యవంశమువారితో సూర్యవంశమురివాకిని, చంద్రవంశమువారితోఁ జంద్రవంశమువారికిని సంబధములుండవని లోకములో నొకభ్రమకలదు. అదియేపైన నేనువ్రాసినటుల సీతను చంద్రవంశ దీపికనుగాఁ బేర్కొజేసినఁనది. ఏతాదృశేతద్భ్రమా ఫలితము లింకను బెక్కులుకలవు. వానినన్నిఁటి నిచటఁ బేర్కొనుట విస్తృతికి హేతువగును. ఈభ్రమయే కాకతీయులు సూర్యవంశ్యులగు చోడులతోడను చంద్రవంశ్యులగు చాళుక్యాదులతోడను సంబధ బాంధవ్యములు కలిగియుండుటచే వీరు తద్వంశములకంటె భిన్నమగు వేరొక వంశము వారుగాఁ బేర్కొనఁ జేసియుండును. మఱియుఁ బురాణాదులయందుఁ గలియుగమున సూర్యచంద్రవంశములు లేవను నర్థభ్రమనిచ్చు కొన్నివాక్యములు కలవు. అట్టివాక్యములవలనఁ గలియుగమున సూర్యచంద్రవంశములులేవని యేర్పడిన యపభ్రమ కూడ కాకతీయులను సూర్యచంద్రవంశ్యులనుగాఁ బేర్కొనక పోవుటలోఁ గొంతతోడ్పడియుండును. అదియుకాకజైనబౌద్ధమతముల నవలంబించిన క్షత్రియులు మఱల వైదికమతమునఁ జేరునప్పుడు వారివారి యాశ్రితకవులు తమ ప్రభువంశముల కపూర్వత్వమును కలిగించుటకుగాను నూతన కల్పనములు చేయఁ జొచ్చిరి. ఆమార్గము నవలంబించియే యాకాలమునఁ కవులు చాళుక్య, చౌహాన, పరమార, పరిహారవంశముల పుట్టుక వసిష్ఠుని యగ్నికుండమున నయ్యెనని కల్పించి యున్నారు. అటులనే కాకతీయవంశనకుఁ గూడ నప్పూ

11 "క్షోణ్యాం క్రీడితు మిచ్ఛభిః" "(నాయకప్రకరణే ౧౩)" "కౌసల్యా సీత్ప్ర ధమజనసే" "(నాయకప్రకరణే ౨౧)" "సోమార్కాభి జనం తమద్య జయతి" "(నాటకప్రకరణే ప్రథమాంకే ౧)" "సాహసాంశవమైందవం చతు హతీ" (చతుర్థాంకే ౧౬)

ర్వత నాపాదించుటకునై కవులీక్రొత్తమార్గ మును (గుమ్మడితిగె కథవలెనే) ద్రొక్కియుం దురు.

ఇఁకను జర్చింపవలసినది కాకతీయులు క్షత్రియులే యైనచో విద్యానాథుఁడు కాకతీయ విరోధులును క్షుద్రక్షత్రియులనునా? యను నది. కాని కాకతీయ విరోధులును క్షత్రియు లైనచో వారికి క్షత్రియ విరోధులుండ కూడ దా? ఉన్నచో వారివిషయమున క్షుద్రశబ్దము ను బ్రయోగింపగూడదా? క్షత్రియులకు క్ష త్రియ విరోధులుండరని చెప్పవీలులేదు. ఉం డరనుటకెట్టి యాధారమునులేదు. ఉండరనుట గతచరిత్రమున కంతకును ప్రబలవిరుద్ధము. ఉన్నను దనప్రభువుయొక్క సాటికులమువారిని క్షుద్రక్షత్రియులనుట విద్యానాథునికిని, తన సాటికులమువారినిఁ దనకవిచే క్షుద్రక్షత్రి యు లనిపించుట ప్రతాపరుద్రునికిని తగనిపని కానేరదు. కవులు తమ యాశ్రయదాతను గొప్పగను నతని శత్రువులను క్షుద్రులనుగను వర్ణించుటయుఁ బ్రభువులటుల వర్ణింపించుకొ నుటయు లోకాచారమే యైయున్నది. ఆయా చారమునను సరించియే విద్యానాథుఁడు కూడ తనప్రభువుల 'క్షత్రియ మౌళిమండనమణు' లనియు, వారిశత్రువులను 'క్షుద్రక్షత్రియు' లనియు వాక్రుచ్చియున్నాఁడు. కనుక విద్యా నాథుఁడు కాకతీయశత్రువులను క్షుద్రక్షత్రి యులనుట కాకతీయక్షత్రియత్వమునకు బాధ కముకానిఁ క్షత్రియేతరత్వమునకు సాధకము గాని కానేరదు.

జివరకుఁ దేలిన పరపసానమే మనఁ గా—విద్యానాథుఁడు కాకతీయులను క్షత్రియు లనుగానే గుర్తించి యుఁన్నాడనియు, దనపుస్త కమున క్షత్రియులనుగానే తెలుప నుద్దేశించి, క్షత్రియులనుగానే పేర్కొని యుఁన్నాడనియు, క్షత్రియేతరులని తెలుప నుద్దేశించుట కాని, క్ష త్రియేతరులనుగాఁ బేర్కొనుటగాని, జరిగి యుండలేదనియు ముమ్మాటికిని సత్యమై యున్నది. ప్రతాపరుద్రీయము వలనఁ గాకతీ యులు క్షత్రియేతరులుగాఁ దేలుచున్నార నుట నేఁటి మనపరిశోధకుల యపూర్వపరిశో ధనా విలసనము దక్కవేరొందుకాదు.

కాకతీయ సామ్రాజ్యాంధ్ర వాఙ్మయము.

శ్రీయుత నిడుదవోలు వెంకటరావుగారు బి. ఏ.

చిరస్మరణీయమగు ప్రాచీనాంధ్ర సామ్రాజ్య వైభవము బునరుద్ధరించి, రెండుశతాబ్దముల పర్యంత మాంధ్రదేశము నవిచ్ఛిన్నముగఁ బరిపాలించి, యశఃకాయులైన కాకతీయుల చరిత్ర మాంధ్రమహాజనుల కవశ్యపఠనీయమై యమితోత్సాహ జనకమై యలరారుచున్నది. కాకతీయులేవంశజులైనను సాహసౌదార్య విక్రమంబున, సాహిత్యవిద్యా పరిపోషణంబున సామ్రాజ్యాధి నాథులైవన్నెకెక్కి, యాంధ్రులఁ ప్రత్యేకవ్యక్తిత్వముఁ బ్రతిపాదించి, యాంధ్రజాతీయాభ్యుదయమునకుఁ దోడ్పడిరి. అట్టి కాకతీయులకాలపు టాంధ్రవాఙ్మయమును గూర్చి యీవ్యాసమున జర్చింపబడును.

ఆంధ్రవాఙ్మయమున క్రీ.శ. 1100_1350 వఱకునుగల కాలము కాకతీయయుగమని చెప్పనొప్పును. మఱియు నాంధ్రవాఙ్మయ చరిత్రమున నన్నయతిక్కనల నడిమికాలమునఁ గల కవులఁగూర్చియుఁ గావ్యములఁగూర్చియు మనకుఁ దెలుపుచేయునదీయుగమే.

కాకతీయులలోఁ బ్రథముఁ డగు మొదటి ప్రోలరాజుకు సమకాలికుఁడై, వైదికధర్మరక్షణ తత్పరుఁడై, మహాభారతాంధ్రీకరణ కర్తయగు తూర్పు చాలుక్యచక్రవర్తి రాజరాజనరేంద్రుఁడు క్రీ. శ. 1022_1063వఱకును నలువదేండ్లు వేఁగిదేశమునుఁ బరిపాలించెను. రాజరాజనరేంద్రుని పాలనమున శాంతియు సౌఖ్యమును నెలకొనినకతన భాషావాఙ్మయాభివృద్ధియయ్యెను. నన్నయ, నారాయణభట్టు, పావులూరి మల్లన, మొదలగు కవులు గ్రంథరచనమునకుఁ గడగిరి. రాజరాజు కవులయందాదరముగలవాఁడై వారినిగౌరవించెను. నారాయణభట్టునకు నందమపూఁడి, పావులూరిమల్లన్నకు నవఖండవాడయును దానముచేసినట్లు శాసనములు సాక్ష్యమిచ్చుచున్నవి. కాని క్రీ. శ. 1063 సంవత్సరమున రాజరాజనరేంద్రుఁడు మరణించిన వెనుక వేఁగిదేశమునందంతఃకలహములు ప్రారంభమైనవి.

వేఁగిదేశమునకు వెనుక వెలనాఁటిసీమ యాంధ్రసారస్వతమునకు రంగస్థలమైనది. వెలనాఁటి చోడులుదేశమును క్రీ. శ. 1036 వఱకును పాలించిరి. వెలనాఁటిని క్రీ. శ. 1117 మొదలు 1132 వఱకుఁ బరిపాలించిన మొదటివెలనాటి చోడుని మంత్రియగు నందూరి కొమ్మయామాత్యుని మనుమనికి మంచనకవి తన కేయూరబాహుచరిత్రము నంకితముఁగావించియున్నాఁడు. సంస్కృతమునఁగల నాటకముల గావ్యపద్ధతి ననువదించినవారిలో నితఁడే ప్రథముఁడు. కేయూరబాహుచరిత్రమునందలి యవతారికయందు వెలనాఁటిచోళులఁగూర్చి యెన్నియో చారిత్రకవిషయములు తెలియుచున్నవి.

వెలనాఁడునకు వెనుక పాకనాడాంధ్రకవితాకన్యక కాస్పదమైనది. పాకనాఁటి యందు తొలుత తెలుఁగు చోడులు పరిపాలించిరి పాకనాఁటికి ముఖ్యస్థానమగు నెల్లూరును బేటరాజు క్రీ. శ. 1121 సంవత్సర ప్రాంతమునను, విమలాదిత్యుఁడు. క్రీ. శ. 1126 సంవత్సర

ప్రాంతమునను, మనుమసిద్ధిరాజు క్రీ. శ. 1189 సంవత్సర ప్రాంతమునను బరిపాలించిరి. మనమసిద్ధి కొమరుఁడు తిక్కభూపతి. ఈతఁడు క్రీ. శ. 1230-సంవత్సరప్రాంతమువాఁడు. ఈతఁడు సకలవిద్యాపరిశ్రాముఁడై కవిసార్వభౌమ బిరుదముకలవాఁడని తిక్కనమహాకవి కృతనిర్వచనోత్తరరామాయణము తెలియఁజేయుచున్నది. [1]

విక్రమార్కచరిత్రమును రచించిన ఒక్కయకవి ప్రపితామహుఁడగు పెద్దయామాత్యుఁడు తిక్కభూపాలునాస్థానము నలంకరించినట్లు విక్రమార్కచరిత్రమునందలి యొక పద్యము వలనఁ దెలియుచున్నది [2]

తిక్కభూపాలుని కొడుకు మనుమసిద్ధి. ఈతనికాలముననే కవిబ్రహ్మయు, నుభయకవిమిత్రుఁడునగు తిక్కనసోమయాజి యుండినది. మనుమసిద్ధి కాకతీయగణపతి దేవునికి సమకాలికుడై యుండుటచే క్రీ. శ. 1260 సంవత్సర ప్రాంతమువాడగుచున్నాడు.

ఆంధ్రభాషావాఙ్మయచరిత్రమునకు వీరశైవమతవ్యాపన మత్యంతముఖ్యమైనది. శైవకవులు జనసామాన్యమునకు మతవిషయములు బోధింపవలసిన వారగుటచేత, మాతృభాషయగు తెలుఁగుభాషయందు నభిమానముగలిగి, తెలుఁగు భాషాప్రాశస్త్యమునుఁ దెలిపిరి. ఈశైవకవులు విలసిల్లిన కాలము కాకతీయ రాజ్యకాలమే. కర్మజ్ఞానప్రతి పాదకమగు వైదికమతమునకు సంస్కృతమెట్లో భక్తిప్రతిపాదకములగు శైవవాదిమతములకు దేశభాషయట్టులని చెప్పవచ్చును. నన్నయభట్టారకుఁడు సంస్కృత ఛందోమర్యాదల ననుసరించి సలక్షణవృత్త కవిత్వముతో తత్సమయుతమగు భాషలో నాంధ్రమహాభారతము రచించెను. శివకవులు జానుతెనుఁగు నాధారముగఁగొని, సంస్కృతభూయిష్టరచన సర్వసామాన్యముగామిచే దేశీయఛందస్సు ననుసరించి కావ్యములు రచియించిరి—కావున క్రీ. శ. 1350 సంవత్సర ప్రాంతమువఱకు నీదేశికవితయే దేశమున వర్ధిల్లుచున్నట్లు తెలియుచున్నది. కాకతీయసామ్రాజ్యానంతరము రెడ్డిరాజుల పరిపాలనమునను, నంతకుకొంచెము ముందుకాలమునను, తిరిగి మిశ్రకావ్య వాఙ్మయము, సంస్కృతభాషా వాఙ్మయప్రోద్బలము తలయెత్త నారంభించినవి. కాకతీయ యుగమునందు వెలసిన యాంధ్రవాఙ్మయ గ్రంథములన్నిటినిఁ బరిశీలించిన మనకీవిషయము సువ్యక్తముకాగలదు ఆకాలమునఁగల గ్రంథములింకను బెక్కులు ముద్రణము గావలసియున్నవి. ఇఁక కాకతీయులకాలమునఁగల యాంధ్రకవులఁ గూర్చియు, వారిగ్రంథరచనఁ గూర్చియుఁ గొంతతెలిపి యీవ్యాసమును ముగించుచున్నాఁడను కాకతీయ యుగమున శైవకవులే మొదటివారుగావునను, నన్నయభట్టారకాదులతో సమకాలికులగు కవులఁ గూర్చి యీవఱకే వ్రాసియుండుటచేతను శైవకవులతో నీచరిత్రము ప్రారంభించుచున్నాడను.

శ్రీపతిపండితుఁడు:—ఈతడు తెలుఁగుదేశమున శైవపండితత్రయమునఁ బ్రముఖుఁడు. మనకుఁ దెలిసిన కాకతీయసామ్రాజ్యాంధ్ర

---

1 సకలవిద్యాపరిశ్రాముఁ డెల్లగ నేల, కవిసార్వభౌమాంక మవనిఁ జెల్ల.

2 గీ. అనుచు నెల్లూరి తిరుకాళమనుజవిభుని, సమ్ముఖమ్మున సాహిత్యసరణి మెఱసి,
మహిమ గాంచిన పెద్దయామాత్యసుకవి, మనుమడవు నీవు నీవంశమహిమయొప్పు

కవులలోఁ దొలివాఁడు. ఈతనినివాసస్థలము తొల్లి విజయవాటిక యనఁబరఁగిన బెజవాడ. ఈతఁడత్యద్భుత శివభక్తుఁడై శివుఁడొకఁడే దైవమని తెలుపుటకు కొంగుననిప్పులు మూటఁగట్టిన మహానుభావుఁడు. ఈతని పండితారాధ్యులు శివతత్త్వసారమున ప్రశంసించియున్నారు. [3]

పాల్కురికి సోమనారాధ్యుని పండితారాధ్యచరిత్రమునను[4] శివభక్తవిజయమునను గూడ నీతఁడు వినుతిగావింపఁబడినాఁడు. [5]

ఈతఁడనంతపాలుని యాస్థానమునను న్నట్లు బసవపురాణమునుండి తెలియుచుండుటచే నీతఁడు రెండవప్రోలరాజునకు సమకాలికుఁడు గాని కొంచెము పూర్వుఁడుగాని యైయుండవచ్చును. అనంతపాలుఁడు చాలుక్యదండనాథుఁడై కొండపల్లిప్రాంతములఁ బరిపాలించుచుండెడివాఁడు. ఈతని మేనల్లుఁడగు గోవిందరాజును రెండవప్రోలరాజు జయించెనని యొక శ్లోకము తెలుపుచున్నది. [6]

అనంతపాలుని శాసనములు క్రీ.శ.1120-23 సంవత్సర ప్రాంతములఁ గానవచ్చుచుండుటచే నితఁ డా కాలమువాఁడని నిశ్చయముగ చెప్ప నొప్పును. ఈతఁడు శైవుఁడగుటచేతను శైవులాకాలమున మతవ్యాపనమునకై తెలుఁగున గ్రంథములు రచియించుటచే నీతడేమేని తెలుఁగుగ్రంథములు రచియించి యుండును. అవి యిప్పుడు కానవచ్చుటలేదు. ఈతఁడు శివదీపికయను గ్రంథము రచియించినట్లు శివకవి కంఠాభరణమున చెప్పఁబడియున్నది. [7]

ఈతనికవిగా పాల్కురికి సోమనారాధ్యుఁడు పేర్కొనినాఁడు. ఈతనివంశ మవిచ్ఛిన్నముగ నున్నట్లు వీరనారాధ్యకృత భద్రాయుశ్చరిత్రమువలనఁ దెలియుచున్నది. [8]

శివలెంక మంచన పండితుఁడు:— ఇతఁడు శైవపండితత్రయమునఁ ద్వితీయుఁడు. ఈతని కథ బసవపురాణమున వర్ణితము. మల్కాపుర శాసనమున జెప్పఁబడిన కాలాముఖ మతాచార్యుఁడగు సోమశంభువనునత డీతఁడని బసవపురాణ పీఠికయందుఁ జెప్పఁబడినది. సోమశంభుఁడు కేయూరవర్షుని కాలమునకుఁ దరువాతను, కాలచురిరాజగు కర్ణదేవుని కాలమునకు ముందును నున్నవాఁడగుటచే, నీతఁడు క్రీ. శ. 1050 ప్రాంతమువాఁడగును. కావున శివలెంక మంచనపండితుఁడు శ్రీపతిపండితునకు వృద్ధాప్యమున నాతనికిఁ గాలీనుఁడై యుండి, యాతనికి కొంచెముతరువాత ప్రసిద్ధికెక్కియుండవచ్చును. పండితారాధ్య లీతనిఁ బేర్కొనలేదు. పాల్కురికి సోమనారాధ్యుఁడు

---

3 కం॰ ఒక్కఁడె దైవము శివుడని, నిక్కముసేయుటకు ముడిచె నిప్పులు చీరన్
నుక్కక శ్రీపతిపండితుఁ, డక్కజముగ విజయవాడ నల జమ్మి శివా.

4 ద్వి. కడునద్ధి యుత్పత్తికర్త నాబ్రహ్మ, వడిబ్రహ్మమను బ్రహ్మవాదులదుర్గించి
హరుభక్తి యుత్పత్తికధిపతి నాగ, బరగె దాదొల్లి శ్రీపతిపండితయ్య.

5 కం॰ అతులితశివభక్తునితోఁ, బ్రతిసేయగరారు కోటి బ్రాహ్మణులనిశ్రీ
పతిపండితయ్య నిప్పుల, కుతుకమతి న్మూటగట్టె కొంగునను శివా.

6 శ్లో॥ యోకుంతోపరితేరకుంత పరశుశ్లక్ష్ణాగ్రధారోల్లస, ద్ధారాపాత ని పాతనైకచతురంగోవిందరాజాహ్వయమ్
బద్ధ్వోన్మచ్యతదోనయక్షితి భృతేరాజ్యమ్ దదౌలీలయా, లుంఠాకో విషయస్యతస్యసమరేపద్వీరదీక్షాగురుః

7 శ్రీపతిపండితకవి శివ, దీపిక విరచించి శైవదీక్షాగురుఁడై
చేపట్టె ముక్తి పేరిటి, రాపట్టిని విజయనగర రామయలింగా।

8 క్షితికర్త హరు నుమాపతికి మ్రొక్కించి, క్షితివిష్ణువాదుల గీటడగించి
చెనసి భక్తిక్రియాస్థితికర్త యనగ, జనియెను లెంకమంచన పండితయ్య.

పండితారాధ్య చరిత్రమున మంచెనపండితునిఁ గూర్చి చెప్పినాఁడు.[9]

ఈతఁడు రెండవప్రోలరాజు కాలమున నుండి యుండవచ్చును. ఈతఁడు రచియించిన తెలుఁగుగ్రంథములు చిక్కుటలేదు. ఈతఁడు "యత్సంవిత్" అనువాక్యమునకు గౌళభట్టారకునివలె నాలుగువేల గూఢార్థములఁ జెప్పినట్లు శివకవికంఠాభరణము నుడువుచున్నది[10]

మల్లిఖార్జున పండితారాధ్యుఁడు:- ఈతఁడు శైవపండితత్రయమునఁ దృతీయుఁడు. పాల్కురికి సోమనాథుని పండితారాధ్యచరిత్రమునకుఁ గథానాయకుఁడు. బసవన స్థాపించిన శైవమతమును వైదికముగ సంస్కరించి, యారాధ్య శైవమతసాంప్రదాయమునకు మూలపురుషుఁడైనవాఁడు. ఈతఁడు వెలనాఁటిచోడుఁడు. (క్రీ. శ. 1163-1181) పానుగంటి ఉదయావనీశుఁడు (క్రీ. శ. 1162) బుద్ధరాజు (1171) మొదలగువారి సమకాలికుఁడగుటచే రుద్రదేవుని సమకాలమువాఁ డగును. ఈతని గ్రంథము శివతత్త్వసారము (అసంపూర్ణప్రతి) ఆంధ్రసాహిత్య పరిషన్మూలమునఁ బ్రకటితమైనది. ఈతఁడు కర్ణాటకభాషయందుఁగూడ బసవనివిభూతిచేఁ గవిత్వము సెప్పనేర్చి గణసహస్రనామము మొదలగువానిని రచియించెను. మరియు నమరేశ్వరాష్టకము, లింగోద్భవదేవు గద్యము మొదలైనవి చెప్పినట్లా రాధ్యచరిత్రమునుండి తెలియుచున్నది. ఈతఁడు శ్రీముఖగద్యయను మఱియొక చిన్న గ్రంథము రచియించినట్లు బసవపురాణపీఠిక వ్యక్తముచేయుచున్నది. ఈతఁడాకాలమున బౌద్ధపదాచార్యులతో వాదమొనరించి వీరశైవమతమును సంస్కరించిన సుప్రసిద్ధ పండితుఁడు. ఈతఁడు శివుఁ డితరులనుకొనునట్లు సంహారకర్తయగాక సృష్టిస్థితిలయకారకుఁడని నిర్ణయించినట్లు సోమనాథుఁడు చెప్పినాఁడు.[10]

ఈతని చరిత్రమగు పండితారాధ్యచరిత్రమున నెన్నియో మహత్తరవిషయములు తెలియుచున్నవి. ఈతని మహిమయంతయు సువ్యక్తమగుచున్నది. ఈతఁ డాంధ్రదేశమున మతసంస్కర్తలలో నగ్రగణ్యుఁడై యాంధ్రులందఱకు బూజ్యుఁడగుచున్నాఁడు. ఈతఁడు రుద్రదేవునికి సమకాలమువాఁడయ్యు నాతనిచే పూజింపఁబడినట్లు తెలియుటలేదను విషయమీవఱకే వ్రాసియుంటిని. ఈతనివెనుక నీతని కుమారుఁడు కేదారయ్యయు నాతని తనయులైన మనుపండిత, భీమపండిత, మహాదేవపండితఁ, చెన్నపండితులును, కేదారయ్య శిష్యుఁడైన యివటూరి సోమనాథయ్యగారు నాయన తనయులు సూరీశ్వరుండును, విశ్వనాథప్పయ్యగారును, సింగనమంచిగారు నాంధ్రదేశమున పండిత స్థాపిత సంప్రదాయముల స్థిరముగ నిల్పిరి.

రుద్రదేవుఁడు:— కాకతి రుద్రదేవుఁడు విద్యాభూషణ బిరుదాంకితుఁడై సంస్కృతాంధ్రభాషాకవులఁ బోషించెను. ఈతఁడు నీతిసారమను గ్రంథము నాంధ్రభాషలో రచియించినాడు. అందునుండి సకలనీతిసమ్మత

---

9 కం మునుయత్సంవిత్తను వా, క్కునకుఁజెప్పి నాల్గువేల గూఢార్థములన్
ఘనుఁడు శివలెంకమంచన, రనయనఫాలాంగ విజయ రామయలింగా॥

10 ద్వి గాథమై సంహారకర్తయయనుచు, సాధారణముగనీశ్వరుబల్కు భక్తి
దూరాన్యసమయసంహారుడై చనియె, శూరుండు మల్లిఖార్జున పండితయ్య॥

మున మడికిసింగన పెక్కుపద్యము లుదహరించినాఁడు. రుద్రదేవకృతమగు "ఉషాపరిణయము" అను సంస్కృతనాటక మొకటి గలదనియు, నది రచించినవా డీతఁడగుట విశదముకాలేదనియు, శ్రీయుతమానవల్లి రామకృష్ణకవి ఎం. ఏ. గారు సకలనీతిసమ్మతము పీఠికయందు వ్రాసియున్నారు. కాని యయ్యది భాస్కరరామాయణమునం దయోధ్యాకాండము రచించిన కుమారరుద్రదేవ కృతమే మోయని సందియముగలుగుచున్నది. అతఁడైన కాకతీయయుగమునకు సంబంధించినవాఁడే యగుచున్నాఁడు.

నన్నెచోడమహాకవి:— నన్నెచోడమహాకవి కుమారసంభవమహాకావ్యకృతికర్త. ఈతనికాలము నిశ్చయముగ మనకు తెలియకపోయినను పండ్రెండవశతాబ్దముకంటె పూర్వుడనియు, రుద్రదేవాదుల రాజ్యారంభకాలమున నున్నవాఁడనియు, గొన్ని నిదర్శనములచే నూహింపవచ్చును. ఈతఁడు తన కావ్య మంకితమిచ్చిన మల్లిఖార్జున శివయోగి కాలాముఖమతానుసారియైనట్లు నిదర్శనములు గలవు. కవితాగౌరవమునందును కావ్యరచనమునందును కవి రాజులయందేమి రాజ కవులయందేమి, యీతఁ డగ్రగణ్యుఁడు. ఈతడు కుమారసంభవమేకాక కళావిలాసమను కావ్యమును రచించినట్లు రామకృష్ణకవిగారు కుమారసంభవ ప్రథమభాగపీఠికయందు వ్రాసియున్నారు.

పాల్కురికి సోమనాథుఁడు:— ఈతఁడు బసవన పండితారాధ్యులతరువాత కర్ణాటాంధ్రదేశముల వీరశైవమతమును వ్యాపింపఁజేసిన మహనీయుఁడు. శైవకల్ప పౌరాణికుఁడై యష్టభాషాకవిత్వరచనా విశారదుఁడై వేదవేదాంతేతిహాస సకలాగమశాస్త్ర విజ్ఞానసంపన్నుఁడై, బహుగ్రంథరచయితయై నెగడినవాఁడు. ద్విపదకవితా సామ్రాజ్యమునకు సార్వభౌముఁడగు నీతని ద్విపదకావ్యములీతని సర్వతోముఖపాండిత్యము విశదము చేయుచున్నవి.

బసవపురాణము, పండితారాధ్యచరిత్రము, అనుభవసారము, వృషాధిపశతకము, సోమనాథ స్తవము, చెన్నమల్లు సీసములు మొదలగు బహుగ్రంథముల, నుదాహరణములను, అష్టకముల, గద్యల, రగడల, పెక్కింటి రచియించి మించినాఁడు. ఈతని కాలము క్రీ. శ. 1190—1250 ప్రాంతమగును.

యథావాక్కుల అన్నమయ్య— ఈతఁడు వీరశైవమతప్రతిపాదకమగు సర్వేశ్వర శతకమును క్రీ. శ. 1242 లో రచియించుటచే నీ కాలమువాఁడు. ఈతని శతక మనే కాంధ్రశతకములకు మాతృక. ఆంధ్రసాహిత్య పరిషత్ప్రకటితమగు సర్వేశ్వరశతక పీఠిక యందీకవి యుదంతమంతయుఁ గలదు.

బద్దెన—భద్రభూపాలుఁడను నామాంతరముగల యీతఁడు గణపతిదేవ సామంతులలో నొకఁడు. ఈతఁడు నీతిశాస్త్రముక్తావళిని సుమతి శతకమును రచియించెను.[11]

ఈతని నీతిశాస్త్రముక్తావళినుండి మడికి సింగన తన సకలనీతి సమ్మతమున పద్యము లుదహరించుటచే నీగ్రంథము పూర్వము

11 శ్రీవిభుఁడగర్వితారి, క్ష్మావర దళనోపలబ్ధ జయలక్ష్మీసం
భావితుఁడ, సుమతి శతకముఁ గావించినప్రోడ కావ్యకమలాసనుఁడన్॥

ప్రఖ్యాతమైయుండెనని చెప్పనొప్పును.

మరియు నకలనీతిసమ్మతమున నుదహరింపఁబడిన ముద్రామాత్యమును విరచించి క్షేమేంద్రుడని ప్రఖ్యాతికెక్కినలక్కాభట్టును, చారుచర్యను విరచించిన యప్పనమంత్రి మొదలగువారికాలమువారలే యగుదురు.

శివదేవయ్య—కాలాముఖమతాచార్యుడును గణపతిదేవ చక్రవర్తికి దీక్షాగురువునగు విశ్వేశ్వరశివదేశికులే యీతడని చరిత్రజ్ఞులు నిర్ణయించి యున్నారు అట్లయినచో నీతని కృతులు పురుషార్థసారము, శివదేవధీమణి శతకము రెండు గలవు. సకలనీతిసమ్మతమున సింగన పురుషార్థసారమునుండి మెండుగ పద్యములుదహరించినాఁడు. శివదేవయ్య రాజ్యపరిపాలనా పద్ధతుల నెఱింగిన వాడగుటచే నాతఁడను భవమునకుఁ దోడు శాస్త్రజ్ఞానము నుపపాదించి పురుషార్థసారసత్కృతిని రచియించి యుండును. ఈతఁడు పరతత్త్వరసాయనమను మఱియొక గ్రంథముగూడ రచించినట్లు తెలియుచున్నది

రంగనాథుఁడు— రంగనాథ రామాయణమనుపేరఁ బరఁగు ద్విపదకావ్యమున కీతఁడు కృతికర్తగా గన్పట్టుచున్నాఁడు, కాని యాశ్వాసాంతములయందు గోనబుద్ధభూపతి తన తండ్రియగు విఠలరాజునకు నంకితముగా దీనిని రచియించెనని స్పష్టపడుచున్నది. మఱియు నుత్తరరామాయణమును ద్విపదగ రచియించిన కాచవిభుఁడును పినవిఠలరాజును దమతండ్రి బుద్ధరాజనియు, నాతఁడు కోటగన్న క్షితీంద్రునకు నన్నమాంబకుఁ దనయుఁ డనియుఁ జెప్పినారు.

సువ్రసిద్ధపరిశోధకులగు రామకృష్ణకవి గారు కోనగన్నా రెడ్డియు విఠలనాథులు సోదరులనియు, పినతండ్రి పెదతండ్రులను గూడ తండ్రులనిచెప్పి నాచారము గలదు గావున గన్నయ్యరెడ్డి కుమారుఁడైన బుద్ధారెడ్డి పినతండ్రియగు విఠలధరణీశునకుఁ గృతినొసంగుచు తండ్రియని పేర్కొనెననియు, నూహించుచున్నారు ఈ యూహ యెంతయు సమంజసముగ నున్నది.

కోనబుద్ధారెడ్డి రుద్రమదేవి కాలమువాఁడని యాతని కూతురు కుప్పమాంబ క్రీ. శ.1265 సంవత్సరమున వేయించిన శాసనమువలననేమి, యితర చరిత్రలవలననేమి స్పష్టపడుచున్నది. రంగనాథుఁడు రామాయణము రచియించి, వారిపేరుపెట్టియో లేక వారికిఁ జాల సహాయకారిగనో యుండి యుండును, కావున రంగనాథుఁ డీకాలమువాఁడేయగుట నిస్సంశయము రంగనాథుని శివస్తుతిరూపకములగు తోటకవృత్తములను లాక్షణికు లుదాహరించిరి. త్రిపురహరణమును వర్ణించు పద్యము రంగనాథునిది యని వ్రబంధరత్నాకరియందు జగన్నాథు డుదహరించి యున్నాడు.[12]

తిక్కనసోమయాజి:—తిక్కనసోమయాజి గణపతిదేవుని సామంతుఁడగు మనుమసిద్ధి కాలమువాడగుటచే నతఁడు కాకతీయయుగమువాడేయగుచున్నాఁడు. మఱియు సిద్ధేశ్వరచరిత్రమునందక్కన బయ్యనలను మనుమసిద్ధి దాయా

12 చ॥ అదలని తేరు, తెనసునాదరులై తగు విల్లువింటికిం
గుదురగునారి, నారిపయిగూర్కు శరంబు, శరంబుబొడ్డునం
బొదలినయంత, యంతముఖుల్ నిజవాసములైన గట్టముల్
చెదరక నీకునెట్లు పనిసేయునయా గిరిజేశనాయకా॥

దు లాతనిపై దండెత్తి వచ్చి, యాతని రాజ్యపద భ్రష్టునిఁగావింప, మంత్రిశిఖామణియగు తిక్కన యోరుగంటికిబోయి గణపతిదేవచక్రవర్తికి దానుబూర్తి చేసిన భారతాఖ్యానము విని పించి, యాతనిసహాయముఁగొని, యక్కనబయ్యనల ను పాఱఁద్రోలి, మనుమసిద్ధినిరాజ్యమునకుఁ బునరభిషిక్తునిఁగావించెనని చెప్పబడియున్నది పై విషయమంతయుఁ దిక్కన క్రీ. 1210-1290 ప్రాంతములనుండినట్లు తెలుపుచున్నది. తిక్కనతనకాలమునందు కృతికర్తయు కృతిభర్తయు నై వెలసినవాఁడు. నిర్వచనోత్తరరామాయణము మున్నగు గ్రంథములు రచియించుటయేగాక భారతమందలి పదియేనుపర్వము లాంధ్రీకరించి, యాంధ్రభాషావాఙ్మయము తోఁగూడ తనపేరు శాశ్వతముగ నిల్పినవాఁడు.

కేతన:—కేతన దండివిరచిత దశకుమార చరిత్రము బద్యకావ్యముగఁ దెలిగించి తిక్కన సోమయాజి కంకితమిచ్చుటచే నీతఁడాకాలము వాఁడేయగును. మఱియునీతఁడు విజ్ఞానేశ్వరమను ధర్మశాస్త్రగ్రంథము, నాంధ్రభాషాభూషణమను వ్యాకరణగ్రంథమును, రచించినవాఁడు. వేఁగివిషయమునఁ గల వెఱ్ఱిరాలను నగ్రహారమునకు నగ్రణి, అభినవదండి బిరుదాంకితుఁడు.

బయ్యన:—ఈతఁడు తిక్కనసోమయాజి కాలమున నున్నట్లు నాతనిచే 'భవ్యభారతి' యని బిరుదము నొందినట్లును, తనకు ముత్తాతయైనట్లును, యనంతకవి తనభోజరాజీయమునఁ జెప్పినాఁడు

మారన:—ఈపండితుఁడు తిక్కనసోమయాజికి శిష్యుఁడై మార్కండేయపురాణము నాంధ్రీకరించి, ప్రతాపరుద్రుని సేనానియగు నాగయ గన్నని కంకితముఁగావించియున్నాడు. ప్రతాపరుద్రుఁడు క్రీ. శ. 1290-1326వఱకు ను పాలించిటచే నితఁడా కాలమువాఁడు.

భాస్కర రామాయణ గ్రంథకర్తలు:—ప్రతాపరుద్రునియశ్వసైన్యాధ్యక్షుఁడగు సాహిణిమారని కంకితముగా భాస్కరుఁడనుకవి, తన పుత్రుఁడగు మల్లిఖార్జున భట్టును, సాహిణిమారుని కుమారుఁడగు కుమారరుద్రదేవుని, అయ్యలార్యుని దోడుసేసికొని రామాయణము రచించెను వీరందరు కాకతీయయుగమువారును నోరంగల్లుప్రాంతము వారేయగుదురు. రామాయణమేకాక దశగతులను గ్రంథము వ్రాసి సాహిణిమారుని కంకితమిచ్చెనని విద్వద్వర్యులగు శ్రీరామకవిగారికుమారుడు భవపీఠికయందుఁదెల్పియున్నారు. ఇంతమంది రచించినను భాస్కరునికిముందు రంగనాథరామాయణమును వెనుక నెఱ్ఱాప్రెగ్గడ రామాయణమును వెలయుటచేతను, భాస్కరుఁడుముఖ్యుఁడగుటచేత నీతరువాతివారు భాస్కర రామాయణమని దీనిని వ్యవహరించిరి.

కాకతీయ యుగమునందు వీరుగాక వేములవాఁడ భీమకవి, యధర్వణుఁడు మొదలగువారు గలరు. వారికాలములింకను సునిశ్చితములు గాలేదు. అయిననుఁ జరిత్రాంశములు పరిశోధింప వారు కాకతీయయుగమునకు సంబంధించినవారుగనే కానవచ్చుచున్నారు

తెనుఁగుకవులేగాక, సంస్కృతకవులుగూడ కాకతీయయుగమునకు సంబంధించినవారు పెక్కుఱుగలరు. నృత్తరత్నావళిరచియించిన జాయసేనాపతి, వీరభల్లటదేశికుఁడు, నిరోష్ఠ్యరామాయణమునురచియించిన శాకల్యమల్లభట్టు, ప్రతాపరుద్రయశోభూషణకర్తయగు విద్యానాథుఁడు మొదలగు మహాకవులెందఱేని యాకాలమునవెలసియుండిరి. వీరుగాక రుద్రదే

వుని యనుమకొండ శాసమునురచించిన రామ దీక్షితుఁడు మొదలగు సుప్రసిద్ధులెందఱేని సంస్కృతమున రసవత్కవిత్వముచెప్పఁగలిగిన వారా కాలమున నుండిరి.

సంస్కృతాంధ్ర భాషా పరిపోషణంబున నింతమందిమహాకవులుగల యుగమును కాకతీయయుగమని యాంధ్రవాఙ్మయ చరిత్రకారులు నామకరణము సేయుదురుగాత!

కాకతిప్రోలరాజాదులప్రశంస.

శ్రీయుత చాగంటి భాస్కరలింగంగారు

శా. ఇన్నూటేబది శంభుదేవళములన్, యెంతేని నిర్మించె వె
న్నున్నూరింట ప్రతిష్ఠజేసె, గిరిజన్ గూర్మిన్ గనన్ యేబదిం
ట న్నిల్పెను గణనాథ ముఖ్యుల బ్రతిష్ఠల్ జేసె దిక్సంఖ్యలన్
ఎన్నన్ కాకతిప్రోలరా జపరదేవేంద్రుండు సామాన్యుడే.

సీ. భాసురంబౌ శిలాప్రాకారరాజంబు, నిర్మించి మించె నేనిర్మలుండు
ద్విసహస్ర సంఖ్యాక వసుమతీనాథుల, శాసించె నేచండశాసనుండు
మమతతో శ్రీశైలమల్లిఖార్జునదేవు, సేవించె నేభక్తశేఖరుండు
పండితారాధ్య గుర్వంఘ్రుల్ భజించి, దీక్షను బొందె నేరాజసత్తముండు
ఎవ్వడట్టి మహామహుఁడెంచి చూడ, వానిగొనియాడ జెల్లును వసుధలోన
భూవరబిడౌజు గణపతిదేవరాజు అభ్యుదయులార! నైజాముసభ్యులార!

మ. విమతున్ దేవగిరిప్రభున్ గెలిచి వేవే కాన్కగా కోటిద్ర
వ్యమునందెన్ గొలిచెన్ సహస్రసళినీవారంబునన్ సిద్ధలిం
గము పద్మాక్షికి భానురోత్సవము వీకన్ జేసె నెంతేని రు
ద్రిమహాదేవితలంప నీపెకెనయే, రాజన్యచూడామణుల్.

సీ. గిరిరాజకన్యతో సరివచ్చు ముమ్మాంబి, కడుపార నెవ్వానికన్నతల్లి
అమరావతికిసాటి యనవచ్చు, నోరుగల్ లాలసంబుగ నెవ్వడేలుపురము
సురనదికెనవచ్చు ధరకాశికాగంగ, యెవ్వాని పానార్హశుద్ధజలము
శివునిజోడనవచ్చు శివదేవయఖ్యాత, సద్విజుండెవ్వాని సచివమౌళి
ఎవ్వడట్టి మహామహుండెంచిచూడ, వానిగొనియాడ జెల్లును వసుధలోన
భూపచయపట్టభద్రప్రతాపరుద్రి అభ్యుదయులార! నైజాము సభ్యులార!

కాకతీయులనాటి సాంఘికచరిత్ర.

శ్రీయుత అంబడి సుబ్బరాయచెట్టిగారు ఎం. ఏ. బి. ఇడి.

ఆంధ్రచక్రవర్తులై 1050 సం॥లు. మొదలుకొని 1326 వఱకు ఓరుగల్లురాజధానిగా పాలించిన కాకతీయుల నాటి రాజకీయ, సాంఘిక, సారస్వతాది పరిస్థితులు విస్మృతములై యింతవఱకును చరిత్రకువేద్యంబులు గాకున్నవి. కాన నాటి యాంధ్రుల సాంఘికాది పరిస్థితులిట వర్ణింపబడుచున్నవి.

1 ప్రజాసామాన్యజీవితము:—ఆకాలమందు పెద్దపెద్ద పట్టణములదక్క, దక్కిన పల్లెలలో సామాన్య జీవనము కేవలము నిరాడంబరమైయుండెను. ఇప్పటికాలమున పల్లెలయందు బీద లుపయోగించురీతి నీరుఁదెచ్చుటకు మట్టికుండలు, కడవలు, దిగుడుబావులు, పండుటకు నులకమంచములు, నివసించుటకు పూరిండ్లు, కట్టుటకు నూలుచీరలు, ధరించుటకు సామాన్యములైన సొమ్ములు నపుడుండినవి. పట్టణముల నుత్తమ తండులాన్నమును, గోధుమవంటకములను దినుట వాడుకయై నప్పటికి పల్లెలయందు భాగ్యవంతులుకూడ కొఱన్నముకూడ దినుచుండిరి. వారికి పాయసము, పులగము మున్నగునవి ప్రియాహారములై దేవతానైవేద్యములందును, పర్వదినముల యందును వాడబడుచుండినవి. వరి, చెఱకు, ప్రాసగులు, కొఱ్ఱలు, పెసలు, గోధుమలు మున్నగు ధాన్యముల పైరులుబెట్టి పండుపుసంతలుగూడ జరుగుచుండెను. బెల్లము, పంచదార మున్నగు భోజ్యవస్తువులనుగూడ తయారుజేయుచుండిరి.

వక్కలు, తమలపాకులు భోగ్యవస్తువులై యుండినవి వలయుసామాను లెద్దులబండ్లపైనను, బండ్లుపోనిమార్గముల దున్నపోతులపైన, నెడ్లపైన గొనిపోవుచుండిరి. ప్రజలు తమ్ము బరిపాలించు రాజులయెడ మిగుల భక్తిగలవారై యుండిరి.

2 సంఘము:—సంఘమునం దన్నికులముల నంతర్కులభోజనము ప్రోత్సహింపబడుచుండెను. అన్నికులములందు వివేకవంతులు రాజ్యమందున్నత పదవు లందుచుండిరి. సర్వకులముల వేశ్యవృత్తి ప్రబలియుండెను. రాజులయందుగూడ బాల్యవివాహములు మెండుగా జరుగుచుండెడివి పల్నాటి వీరుడగు బాలచంద్రుడు బాల్యక్రీడాతత్పరుడగు నప్పటికే వివాహితుడై యుండెను. అప్పటి కతడు పదునాలుగేండుల యీడునందుండెను.[1] ఇంతయేగాక నాకాలమందు సహగమనమను హిందువుల పూర్వమతాచారము వాడుకయందుండెను. పల్నాటివీరుడగు రాచమల్లుడు యుద్ధములో నిహతుడుకాగా నతనిపత్ని "పేరమ్మ" అను సతీతిలకము భర్తనుదహించుచితిపైనబడి యసువుల వీడెను హీనకులజు

1.Cf. పల్నాటి వీరచరిత్రము.

లయిన మాలలగూడ వైష్ణవుల గావించి యున్నతపదవుల నిచ్చి యంతర్వర్ణపంక్తిభోజనముల బ్రోత్సహించి రేచెర్ల బ్రహ్మనాయుడు, సర్వకులనమత్వభావము విజృంభింప జేయుచుండెను. కన్నమనాయుడను మాల బ్రహ్మనాయునికి బ్రియశిష్యుడై పల్నాటి రణరంగమున జాలదోడ్పడెను. ఆమాల వీరుఁడు "నాయుఁడు" అనగా పాలించువాడు అని పిలువబడుట, ఎఱుకులసానులు యుద్ధరహస్యములగనుటకు నేర్పఱుపబడుట, భట్టువారల రాయభారములకు బంపుట మున్నగు విషయము లాకాలమున నంత్యకులజులు వహించిన యున్నతస్థితిని సూచించుచున్నవి. కన్నమనాయుడు కార్యమపూడి రణరంగర హస్యవృత్తాంత మొక యెఱుకలసానినుండి గ్రహించెను. బ్రహ్మనాయుడు నలగామ రాజుకడకు బంపిన రాయభారి భట్టుకులము వాఁడు. కాకతీయనృపతియగు ప్రతాపరుద్రుడు తన సేనలగూర్చుటయందు గులభేదముల బాటింపక వీరులై తగినవారల నెల్లర జేర్చుకొనుటగూడి[2] నీవిషయమునే సూచించుచున్నది. బ్రహ్మనాయుడు పలుకులముల లలనల వివాహమాడి బిడ్డలగనుట, బాలచంద్రుడు వివిధవర్ణములవారితో స్నేహము గావించుట మున్నగు విషయము లాకాలమందు కులభేదములంతగా పాటింపకుండు యములందు బవినీలేకాక మాలెతలు, కాపు సకాలమున సంస్కర్తలెల్లరిచే దూష్యమైన "ఉంకువ" లేక "ఓలి" (అనగా భర్త భార్య తలితండ్రులకిచ్చు రొక్కము) ఆచారమందుండెను. బాలచంద్రుడు తన వివాహకాలమందు తన మేనమామల కోలియిచ్చినట్లు చెప్పియున్నాడు.[3] సామాన్యప్రజలకుఁజేరిన టిట్టిభసెట్టి మొదలుకొని రాజకులజులగు ప్రతాపరుద్రాదులవఱకును, బాలుఁడగు బాలచంద్రుడు మొదలుగా నతని తండ్రియగు బ్రహ్మనాయునివఱ కెల్లరు జారులై యుండుట ఆకాలమందలి జారత్వప్రాబల్యము జాటుచున్నది. తిరుణాళ్లు, పూటకూటియిండ్లు నిట్టి యసహ్యముల కిప్పటివలె యప్పుడుకూడ లోనై యుండుట స్పష్టముగా దెలియుచున్నది.[4]

ఇంతియేగాక యిప్పటివలె నాఁకాలమున గూడ గంగమ్మ, కాకతమ్మ, పోలేరమ్మ మున్నగు శక్తిదేవతల జాతరలు విరివిగా జరుగుచుండెడివి. అందు బోనగావళ్లు, కుంభము, దున్నపోతుల బలియిచ్చుట వాడుకయందుండెడివి.

ఇప్పటి "ఆసాదువారి" సుద్దులవలె యాకాలమున బవినీలనెడువారు "ఏకవీర" మున్నగు దేవతల జాతరలయందు కథలఁ జెప్పుచు ప్రేక్షకుల నాహ్లాదనిమగ్నుల జేయుచుండినట్లు దెలియుచున్నది. ఈ దేవతలకథ నీజాతరసమయములందు బవినీలేకాక మాలెతలు, కాపు టాడవాండ్లు, జక్కలపురంధ్రులు మున్నగు

---

2. "The Political History of the Kakatiyas" by Mr. M. Rama Rao J.A.H.R.S Vol V pt3.

3. "మాకులంబుననోలి మాడలుగలవు." ||పల్నాటివీర చరిత్రము||

4. గీ|| సంధివిగ్రహయానాది సంఘటనల
బంధకీజారులకు రాయబారియగుచు
పూటకూటింట వర్తించు బుష్పశరుడు" "క్రోడాభిరామము"

స్త్రీరత్నములు పాటలుబాడుచు, చిందులు ద్రొక్కుచు చూపఱులకు వింతగొల్పుచుండిరి. సంతానకాంక్షతో వచ్చిన పడఁతులుగూడ వీరిఁజేరుచుండిరి. కాకతమ్మ కాకతీయుల వంశ దేవతగా గొలువఁబడుట, "ఏకవీర" యీకాకతమ్మకు సైదోడని పిలువఁబడుట, యాదేవతల యాలయములు ఓరుగల్లుపురమున వెలయుచు నుండియుండుట, పల్నాటివీరుడగు బ్రహ్మనాయుఁడు కారెమపూడి రణరంగమున కేగుతరి దున్నపోతును బలియిచ్చుట, మున్నగు విషయము లాకాలమందు జాతరలలో ప్రజాసామాన్యముననేగాక రాజులకుఁ గూడఁ గల భక్తి విశ్వాసములఁ జాటుచున్నవి.

ద్యూతవ్యసనముకూడ యానాటి ఆంధ్రుల నలయించుచున్నట్లు పెక్కు దృష్టాంతములు గలవు. మొలలఁ గోచిపాటలుమాత్రముఁ దక్కునంతవఱకు పన్నిదములొడ్డి జనులు పాడుచుండిరి.[5] కేవలము నేద్యము వృత్తిగాఁ జరించు హాలికులుగూడ నీపణములకై పచ్చడము లమ్ముకొని చలికాలమున బాధపడుచుండిరి.[6] ఇట్లుసర్వజను లీ జూదపుపిచ్చియందు మునిగి బజారులందే పన్నిదములొడ్డుచుండుట, కోడిపందెములు, మేషయుద్ధములు విరివిగా జఱుపఁబడు చుండుట,[7] యాకోడిపందెములు పల్నాటివీరుల యుద్ధమునకుగూడ యొకకారణముగా నేర్పడుట, మున్నగువిషయములఁ దఱచిచూచిన జారత్వమునకుఁబలె ద్యూతమునకుఁగూడ రాజులే మార్గదర్శకులైరని దెలియును. ఈకోళ్ళపోరితనము, మేషయుద్ధములు, కేవలము పన్నిదములకే గాక, వినోదములకుగూడ జరుపఁబడుచుండినవి. ఇట్టిజీవహింసాన్వితములగు వినోదములు నెఱపుచుండినందువలనను, జాతరలందు దున్నపోతులఁ బలియిచ్చుచుండి నందువలనను, భూతదయాబుద్ధి, అహింసాచింతన యంతగా నప్పటిజనులచే తలఁపబడియుండినట్లు తోచదు.

అప్పటి జనసామాన్యము పెక్కువినోదములఁ గాలముఁబుచ్చుచుండిరి. ఆకాలమందు యిప్పటివలె నాగస్వరముఁ జేబూని దానివాయించుచు పాములాడించుకొనుచు వచ్చు పాములవాండ్రు నుండిరి. ఓరగల్లుపురవీథియందిట్టియాట జరుగుచుండ గోవిందశర్మ టిట్టిభసెట్టికిఁ జూపించెను. ఇప్పటి దొమ్మరివడుచులు చేయువింతలననుకరించి, మొగ్గవాలుచు, గొరగపడుచులును, వివిధములగు వింతలజేయుచు మైలారవీరభటులునునాకుఁ బ్రజలకానందముఁ గొల్పుచుండిరి. ఇక్కాలమున దత్తమండలములలో భిక్షకై వచ్చి పలువిధములగు గంతులు రంతులొనర్చు మొండిపకీరులను బోలె వివిధములగు గంతులచేఁ జూపఱ నలరించు తూర్పునాటి గడీడులనువార లోరగల్లుఁవంటి పట్టణములనుండిరి. నేటితందనాల పాటకులఁ బోలె వీరులఁగూర్చి పురుషులేగాక స్త్రీలుగూడ నర్తనకీర్తనలఁ జేయుచుఁ గాలముఁబుచ్చుచుండిరి. ఈవీరపూజ జైనమతము క్షీణించి శైవమతము ప్రబలుకొలది ద్వితీయ

---

5. పాపద్యూతమీ పన్నిదం బంగీకారము సేయువారి మొలలఁ బ్రాపించు గౌపీనముల్" Ibid

6. గీ॥ మాఘమాసంబు.....
బచ్చడం బమ్ముకొన్నాడు పణములకును" Ibid

7. cf హా! ఖగేంద్రములార Etc. Ibid

ప్రతాపరుద్రుని కాలమునాటికి శైవమతయుక్తములగు భైరవ, మైలార దేవపూజలతో కూడి, (బ్రాహ్మణేతరులలో) మతింతయెక్కువయ్యెను.[8] కేవల మాటపాటలనేగాక దేవాలయములఁగట్టి, విగ్రహములఁ బెట్టి, యుత్సవముల జేయుచు నీవీరపూజ చేయుట వలన యా కాలమందు వీరులఁ బూజించుటయందు, వారిననుకరింప వలయునను నాయాశయమునందునుఁ బ్రజలకుఁగల యాసక్తి విశదమగు చున్నది.

3 పరిశ్రమలు:—పైనుడువబడిన విధమున గానుగ, కుట్రవు (సాధారణమగు) వృత్తులేగాక, లోహపరిశ్రమగూడ ప్రథమప్రతాపరుద్రునిసమకాలీనులై పల్నాటిసీమ నేలిన పల్నాటి వీరులరాజ్యమునఁ జాలప్రసిద్ధిఁగాంచెను. ఇనుము, ఇత్తడి మున్నగు పంచలోహములు ప్రబలముగా దొరకుచుండెడివి. గుత్తికొండలోని గొలుముల పాడెమని యొకభాగమునకు బేరొందుటచేతను, యందలి యొకకొండ కినుపకొండయని నామముంటచేతను, యొకపుడు పల్నాటి సీమ లోహపరిశ్రమకు ముఖ్యస్థానమై చుట్టునున్న దేశమునకుఁగావలసిన యినుము, రాగిమొదలగు లోహములఁబంపుచు, వ్యాపారాశ్రయమైయుండి యుండెనని గ్రహింపదగి యున్నది. ఇంతియేగాక గణపతిదేవునికాలమందు ప్రస్తుతపు గుంటూరుజిల్లాలోని మొట్టుపల్లె యొకరేవుపట్టణముగానుండి విదేశవ్యాపారమున కాశ్రయమై యుండెను. గణపతి విదేశవ్యాపారము వృద్ధిపొందించుటకు గానువరదేశవర్తకుల కభయశాసనమిచ్చి నియతములగు సుంకములమాత్రము రాబట్టుచువచ్చెను. ముందువలె వారివస్తువులఁగొల్లకొట్టకుండునట్లాజ్ఞాపించెను. ఈవిదేశవస్తుసుంకములేకాక, యాకాలమున, నూరిలోనికిఁబండ్లపైనఁ గొనివచ్చు సామానులపైన సుంకములు (Tolls) తములపాకులుమున్నగు భోగ్యవస్తువులపై విధింపబడు పన్నులు, పుల్లరిపన్నులుమున్నగునవి రాబట్టబడుచు, చాలవఱకు దేవతార్చనాదికములకు వినియోగింపఁబడుచుండెను.

4 మతము:-కాకతీయులు మొదట జైనులుగానుండితరువాత వీరశైవులైరి. పోలిరాజు గొందఱు జైనుఁడనియు మఱిగొందఱు శైవుడనియందురు. ఏదియెట్లున్నను ప్రథమప్రతాపరుద్రునికాలమునుండి శైవవైష్ణవ మతములు తలయెత్త జైనమత మడుగంటఁజొచ్చెను. అతని సమకాలీనుడును, పల్నాటివీరవతంసుడునగు బ్రహ్మనాయుఁడు వైష్ణవుడై నిమ్నజాతులనుండి యగ్రజాతివఱకు నందఱ వైష్ణవులఁగావించి యంతర్వర్ణపంక్తి భోజనములకైగూడ ప్రేరేపించెను. పల్నాటిసీమయందీనాటికతని విష్ణునియవతారుడనికొనియాడుటగాంచిన యాతనియొక్కయు వైష్ణవమత ప్రచారముయొక్కయు యానాటి యున్నతస్థితి తెలియగలదు. ఆనాటినుండి యీవేదమతములు క్రమముగా వృద్ధిగాంచి యాంధ్రరాజ్యమునుండి జైనమతమును బాఱదోలినవి. వీనియందు వీరశైవము మిన్నయై కాకతీయ నృపతుల యాదరమునకుఁ బాత్రమై యాంధ్రరాజ్యమునందు విరివిగా వ్యాపించెను. గణపతియు ద్వితీయప్రతాపరుద్రుడును వీరశైవుల యుద్బోధనఁజేసి జైనుల హింసించిరని కొందఱు చరిత్రకారులు తెల్పియున్నారు. కాని నిజముఁదఱచిచూచిన నిదిసత్యముకాదు.

8. "The political History of the Kakatiyas" J.A.H.R.S. Vol VII pt i,

ఎందుకన, గణపతి సోదరియగు మైల మదేవికుమార్తె బయ్యలమహాదేవికి భర్తయై, ధాన్యకటకమేలిన రాజగు కోటకేతరాజు భార్యాసహితముగా బుద్ధభక్తుడై బౌద్ధచైత్యములకు బలువిధములగు బహుమతులఁ గావించెను. ద్వితీయప్రతాపరుద్రుని కాలమందోరగల్లుపురమునగోవిందశర్మయు,టిట్టిభసెట్టియు కేవలము శైవదేవాలయములగు భైరవవీరభద్రాలయములేకాక, చండేశ్వరమహాశక్త్యాలయము, బౌద్ధవిహారము, పాండవుల గుడి, తురకల మసీదు, కేశవస్వామి గుడి మున్నగు వివిధమతాలయములఁ జూచిరి. ఈవివిధదేవతాలయముల యునికి యా యోరగల్లున వివిధమతముల యునికిని సూచించుచున్నది ఈవిషయములు గణపతి ప్రతాపరుద్రుల పరమతసహనముఁ జాటుచున్నవి. ఇంతియేగాక ప్రజలుగూడ జాతిమతభేదములులేక తమ పితృదైవభక్తితో గూడ, రాజభక్తిఁగూడ జాటువారై వివిధదేవతాలయములకు గుళ్ళు, చేలు, నర్పించుచుండిరి. అట్టి పరమతసహనభావముగల మహీపతుల యుడ, జైనులు పూర్వరీతిఁ దామాదరింపఁబడమికసూయజెంది రాజద్రోహకరకార్యములేవేని జేయనుద్యమించియుండవచ్చును. కాని మతవైషమ్యమునఁ జేసి వారు పీడింపఁబడియుండరు.

5 రాజులు:-రాజులుపైనజెప్పినట్లుమొదట జైనమతమును దరువాత వైదికమతముల, నందుముఖ్యముగా వీరశైవమతము నెక్కువగా నాదరించుచు, వీరశైవకవులగు పాలకురికి సోమనాథుడు, మల్లికార్జునుఁడు శివదేవయ్య మున్నగువారిఁ బోషించిరి. గణపతిరుద్రుడు మొదలుగా నందరు శైవగురువులఁగలిగి శివాలయములకును, శైవగురువులకును మాన్యములిచ్చి యాదరించుచు కేవలమును, శైవాదరణయేకాక విష్ణ్వాలయములకుఁ గూడ దానములిచ్చి శైవకవులనేగాక తిక్కనాది హరిహరోపాసకులఁ గూడ నాదరించిరి. ఈరీతి కవుల నాదరించుటయేకాక తామేకవులై కూడ వాఙ్మయవృద్ధికిఁ దోడ్పడిరి. ప్రథమప్రతాపరుద్రుఁడు విద్యాభూషణ బిరుదాంకితుఁడై నీతిసారమను గీర్వాణగ్రంథము రచించెను. ద్వితీయ ప్రతాపరుద్రుఁడు విద్యానాథాదులఁ బోషించుటయే గాక ప్రతాప మార్తాండమను గ్రంథమునకుఁ గర్తయయ్యెను. ఇటుకవులై, కవిజనపోషకులై, వారి మంత్రిసామంతులకు మార్గదర్శకులైరి. బద్దెనభూపాలుఁడు, బుద్ధరాజు మున్నగు సామంతులును గుండమంత్రి, గన్నమంత్రి, సాహిణిమారుఁడు మున్నగు సేనాపతులును, శివదేవయ్య, తిక్కనాదికవి మంత్రిసత్తములును, గ్రంథకర్తలై గ్రంథభర్తలై యాంధ్రగీర్వాణ వాఙ్మయాభివృద్ధిఁ గావించి, యక్కాలపు శాస్త్రకళా వికసనమునకుఁ దోడ్పడిరి.

ఇంతియేగాక నప్పటిరాజులు సంఘసంస్కర్తలు. పల్నాటి వీరుఁడగు బ్రహ్మనాయుఁడు మాలలను బ్రాహ్మణులను సమముగా వీక్షించుచుఁ బంక్తిభోజనములఁ బ్రోత్సహించుట విదితమే. కాకతీయనృపతులుగూడ వెలమ, రెడ్డి మున్నగు నిమ్నజాతులవారికి సేనాపతిమున్నగు గొప్పపదవులనిచ్చి యాదరించిరి. ద్వితీయ ప్రతాపరుద్రుఁడు మాచల్దేవియను వారాంగనాసక్తుఁడై యుండినట్లు గోవిందశర్మ ప్రసంగవశమునఁ బేర్కొనియున్నాడు.[9] పల్నాటిజేడగు బ్రహ్మనాయుఁడు పలువురభా

9. శా॥... ... ...ప్రతాపరుద్ర॥ ధరణీశోపాత్త గోష్ఠీ ప్రతిష్టాపారీణ॥... ...మాచల్దేవి వారాంగనన్.

లర్యలఁ బెండ్లాడెను. అతనికుమారుఁడు బాల చంద్రుఁడు పదునాలుగేడుల ప్రాయముఁ గల వాడైనను "సబ్బాయి" యను వారస్త్రీవలలో జిక్కియుండెను. 'రాజవేశ్యావిటప్రాభవప్రకట' అనియానాడు రాజులఁ బ్రశంసించు వాడుకఁ జూడ, నప్పటిరాజుల స్త్రీవిలోలత బాగుగాఁ దెలియఁగలదు.

6 కవులు—అక్కాలమందు కవులకుఁగల గౌరవప్రతిష్టలు మఱియొక్కరికి యుండియుండ వని తలచుట యతిశయోక్తి కాదు. ఎందుకన, కవులు కేవలము గ్రంథకర్తలై యుదరపోషణ జేసుకొనువారుగానే యుండలేదు. పైనఁజెప్పి నట్లు వారు మంత్రులుగాను, రాజకీయతంత్రి జ్ఞులుగానే కాక, రాజగౌరవముఁగూడ నందు చుండిరి. మనుమసిద్ధి తిక్కనను మామయని సంబోధించెను. అందలములు గొడుగులు మున్నగు రాచపదవులెల్లఁ బడసెను. మనుమసిద్ధి మహీశ సమస్తరాజ్యభార ధౌరేయుఁడై, నీతి చాణుక్యుఁడై, వెలసెను. రంగనాథుడు కవిరాజగు బుద్ధరాజుయొక్క సభాస్థానమునఁగాంచిన గౌరవము బుద్ధరాడ్కృతమగు రామాయణమునకు రంగనాథరామాయణమని పేరిడుటయె చెప్పకఁ జెప్పుచున్నది. మఱియు నాటికవులు పెక్కురు కుకవితిరస్కృతి జేయని విశాలమనస్కులు; పరస్పరముఁ బ్రేమగౌరవములఁ జూపుచు, దమగ్రంథములఁగూడ కవులకే యంకిత మిచ్చుచుండిరి. షష్ఠ్యంతములచే గ్రంథభర్తల మితిమీఱి పొగడుటగాని, వివిధదేవతల సంకుచితబుద్ధివర్ణించి గ్రంథమునిం కరణమందుఁగూడ స్వతంత్రబుద్ధిఁజూపి గాలానుసరణి మార్పుజేసి యుక్తియుక్తముగాఁ గవితనల్లశక్తిఁ గలవారు.[10] తమ్ముపోషించిన గ్రంథభర్తలనైన నిటీవలికవులఁవలె మితిమీరు వర్ణనలను లేని పోని కట్టు కథల రాజులఁజేయక, శూద్రుడైన శూద్రుఁడుగానే చెప్పిన యాత్మగౌరవాభిలాషులు, సత్యవచస్కులు. ఉదరపోషణార్థమై తమకర్తవ్యము విడనాడక, దమకు నుత్తమముగా తోచిన మతము లోకోపకారార్థముగాఁ గ్రంథరూపమునఁదెల్ప నుద్యమించిన స్వతశ్చలనపారీణులును, ఆత్మత్యాగులునై యుండిరి. ఇంతియేగాక యాశుకవితానైపుణిచే రాజుల, విజ్ఞులఁగూడ నలరింపగలిగిన సమర్థులై, తమవచోపటిమచేఁ చక్రవర్తులఁగూడ మెప్పించి, తమ్మునాదరించు నృపతులు దురవస్థలపాలైనపుడుగూడ కాపాడగలిగిన ధీరులును, స్వామిభక్తిపరాయణులునై యుండిరి. అందువలననే యాకాలము కవి బ్రహ్మఁనుగనఁ గల్గిననోమునోచుకొనెను. అట్టి సత్కవులు విరాజిల్లుచుండిన దేశమగుటచేతనే యాంధ్రులాత్మగౌరవరక్షణార్థముఁ బోరాడితు రకలఁదాడిని చాలకాలమోర్పున నిల్పఁగలిగిరి.

7. స్త్రీలు:—బాల్యవివాహములు మెండుగానుండి బాలవితంతు ప్రాబల్యమునకు గారణభూతము లయ్యెననియు, సహగమన దురాచారము కొంతవఱకు పాటింపఁబడు చుండెననియుఁ బైన చెప్పియున్నాము. అయిన నప్పటిస్త్రీలు కొందఱు శూరురాండ్రై, కుట్రలఁబన్ని నేర్పరులై, యుద్ధముఁజేయ సామర్థ్యముఁ గల్గియుండిరి. భారతకర్తయు,

---

10. దశకుమారచరిత్ర—ఇందు కవి తిరస్కృతి లేదు,
నిర్వచనోత్తర రామాయణము—షష్ఠ్యంతములు లేవు,
భాస్కరరామాయణము—ఇందు రెండును లేవు.

మనుమసిద్ధి నృపాలుని మంత్రిసత్తముండునగు తిక్కనసోదరుఁడగు ఖడ్గతిక్కన యుద్ధమున నోడి యింటఁదాగియుండుతరి, నతని మిక్కిలి బ్రోత్సహించి యుద్ధమునకుఁబంపిన దత నితల్లియు భార్యయునను టెల్లరికిఁ దెలిసినవిష యమే. పల్నాటియుద్ధమునకుఁ గారణభూతు రాలై కారెమపూడి రణరంగమున ఘోర ముగాఁ బోరాడిన నలగామరాజు నాయకసాని బాలనాగమ్మ నాటి వీరనారీమణియే. తాను యువతియైనను, భర్త చిన్నవాడైనను, యత డు విషయలోలుఁడై రణము మఱచియున్న తరి, బాలచంద్రుని యుద్ధమునకుఁ బ్రేరేచిన దతనిపత్ని మాచాలి నాటివీరపత్నియే. ఇంతి యేగాక వారు రాజకీయ వ్యవహారములఁ గూడ మిగుల బుద్ధిబలముఁజూపి రాజ్యములఁ గూడ చాలనేర్పుననేలిరి. విద్యానాథుని వాక్యానుసరణి నర్ధనారీశ్వరుడు సంపూర్ణస్త్రీ రూపముఁదాల్చి భువిఁ జరింపవచ్చినాడో యనఁ నవక్రవిక్రమ పరాక్రమాతి శయమున 38 సంవత్సరములు కాకతీయ సింహాసన మధి ష్ఠించి యాంధ్రులనేలిన రుద్రాంబయు, ధాన్య కటకనృపతియైన బేతరాజునకు భార్యయై భర్త గతించిన యనంతరము ధాన్యకటకమేలిన కోటగణపమ్మయు (కాకతీయ గణపతికుమా ర్తె)నాటి భూపాలనా విచక్షణలగు వనితామ ణులే. పల్నాటియుద్ధము నెన్నేని యుక్తులచే తను, మాయోపాయముల చేతనుఁ జరుగు నట్లుగావించిన బాలనాగమ్మవంటి రాజ్యతం త్రజ్ఞ లింకెవరుందురు.

అయినను స్త్రీజాతికి సహజములగు కొన్ని క్రీడలు, వృత్తులుఁగూడ వారుమఱువక ననుస రించుచుండిరి. వారియాటలు:—(1) పాత్రి గొండ్లి యనగా గుండలాకారముగా నృత్యము సల్పుట. (2) పేరణియన భాండముపై నదిపగులకుండునట్లు మృదువుగా నృత్యము సేయుట. (3) కోలాటము. (4) గొబ్బిళ్ళు పెట్టుట. (5) గుఱ్ఱముభంజళి యనగా పాము వలె వంకరగాబోవుచు నశ్వగమనమున నాటా డుట—మున్నగునవి. ఇందు రెండవదితప్ప మి గతనాల్గునుఁ గొంతవఱకు మనపల్లెలయందలి స్త్రీలు వ్యాసపూర్ణిమ మున్నగు పర్వదినము ల దేవాలయములయందాడుట నేటికిని చూ డనగును.

వారుఁ చేయుచుండిన వృత్తులు:—(1) కట కారవృత్తి యనగా నేటి మేదరవాళ్లువలె చాపలు, బుట్టలు మున్నగునవి యల్లుట. (2) పుష్పలావికలుగా నుండుట. (3) నుసర భేత్తు మున్నగుమందులు సంతలయందమ్ముట. (4) తెలికెస్త్రీలు గానుగదిప్పుట. (5) సంపె గనూనెకూడ (పరదేశములనుండి వచ్చుట లేదు) తెలికెస్త్రీలే గానుగలందుఁ దయారు చేసి బజారులం దమ్ముచుండుట ఇయ్యవి గ్రీడాభిరామమునుండి దెలియుచున్నవి.

స్త్రీలయుడుపులు, భూషణములుము క్కున ముత్యాలముంగర, జెవులకమ్మలు, భవిరెలు, కుంటేఱ్ఱు జడయందు ముత్యాల కుచ్చులు, జేతులకు దండకడియములు నీలా లగాజులు, పచ్చలకంకణాలు, చామలాకడి యములు, వేళ్ళకుంగరములు, నడుముకు గజ్జ లుగల బంగారపు టొడ్డాణము, పువ్వులర వికె, తగటుచీర మున్నగునవి సామాన్యస్త్రీ యగు తెలికెస్త్రీ గూడకట్టిన చీరకట్టుతీరు నేటినవనాగరికుల యందుఁగాని బొడగానము.

8. పురుషులు:—వీరులై, పరాక్రమమునఁ బేరెన్నిక గన్నవారును, రాజులునుఁ దత్సా చకముగా వారికాలియందు కడియాలు ధరిం

చుచుండిరి.[11] వీనిఁగాలికడియాలని చెప్పుచుండిరి. ఇప్పటికిఁ బల్లెలలో బాహుబలమునఁ బేరెన్నికఁ గన్నవారును, కుస్తీలయందు జయముఁగాంచువారును, మిగులఁబరువు మోయ సమర్థులైనవారు నీకాలికడియాలు ధరించుట వాడుక. ఇదియొకగొప్ప గౌరవముగా వాడబడుచున్నది. మఱియు మురుగులు, గొలుసులు, ఉంగరాలు ధరించుచుండిరి.[12] వేషాడంబరమున స్త్రీలకెంతమాత్రము దీసిపోకుండున ట్లప్పటిపురుషులుగూడ పైజెప్పిన యాభరణములకుఁ దోడుగా తగటుకూసములుఁ బంగారుదుప్పట్లు ధరించుచుండిరి. ఈయాడంబరరీతులు నలగామరాజాదిరాజులు, ధనికులు నవలంభించుచుండిరి. గోవిందశర్మవంటి సామాన్యజనులు రసికులైనను, నీర్కావిధోవతి పింజెవిడిచికట్టు సాధారణాచారములే యవలంభించుచుండిరి.

9 విశేషములు:— అక్కాలమున నిట్టి యానందదాయకములగు వినోదములేగాక, యిప్పటి మనకు నాశ్చర్యముగొల్పు కొన్ని వింతలుగూడ నుండెను. ప్రజలకు వలయు భోజనపదార్థములు సరవరాజేయు కొన్ని సంతలుండెడివి. ఇట్టి సంతలు రెండువిధములు వానిలో మొదటిది మడిసంత రెండవది మైలసంత ఈసంతలు పదునారవ శతాబ్దమున విజయనగరమున నదేపేర్లతో వెలయు సంతలఁబోలి ఓరగల్లుపురమున జరుగుచుండినట్లు టిట్టిభట్టి గోవిందమంచనశర్మ సంభాషణల నుండిగ్రహింపనగును.[13] ఈమైలసంత యూరికిబయట వెలిపాళెమున జరుపఁబడుచుండెను. ఇందు నిమ్నజాతులకు వలయు మత్స్యమాంసాదులు విక్రయింపఁబడుచుండెను. ఉన్నతవర్ణస్థులకు వలయు కూరగాయలు మున్నగునవి మడిసంతయందు దొరకుచుండెను. ఆమడిసంత యూరిమధ్య జరుగుచుండివి. మఱియు నిప్పటివలె యక్కాలమునగూడ కాపుటాండ్లు యిఁటిముంగిట గోమయపిండములు రచించుచుండిరి. ఇంతియేగాక నక్కాలమున చిత్రవస్తుప్రదర్శనశాలలుగూడ నోరుగల్లుపురమున నుండెడివి. యప్పటి "బాడ్మింటన్"నుబోలి యప్పటి స్త్రీలు కందుకక్రీయముతో బంతులాట నాడుచుండిరి.[14]

---

11. "కరమున గుజ్జరి కడియముల్ మెరయ
ఘనమైనదేహంబు కాలిపెండేరము"

"పల్నాటివీరచరిత్రము"

12. "మురుగులు గొలుసులు మంజేతులందు
దిరముగా వ్రేళ్ళ ముద్రికలను బెట్టి
... ...
గండపెండేరంబు కాలికిదాల్చి" Ibid

13. "యింతులకు బ్రీతిగా మైలసంతలోన"

"క్రీడాభిరామము"

14. కాంచీనూపుర కంకణక్వణనముల్ గర్జింపబాలాజనం
... ... గ్రీడించెదర్చూడుమా
... ... కాంచనకందుక క్రియముతో Etc. Ibid

మఱియు కాలమానము దెల్పునట్టి ఘటికా యంత్రములు (గడియారములు) కూడ యక్కాలమున నిప్పటి కచ్చేరీలయందువలె రాజభవనముల నెలకొల్పబడియుండినవి. మఱి యొకవిశేషమేమన పరస్థలములనుండి వివిధ కార్యోద్యోగులై పట్టణములకు రాకపోకలఁ జరుపువారికి భోజనవసతులఁ గల్పింపఁగల పూటకూటియిండ్లుకూడ యుండినవి. ఈపూటకూటియిండ్లయం దొకరూకకే కప్పురభోగి వంటకములు చక్కని గోధుమపిండి వంటకము మున్నగువానితోఁగూడిన కలమాన్నము వడ్డింపబడుచుండెను. విటసంగమార్థమైతత్పూర్వము ముకురవీక్షావిధానమను నొక కర్మము వేశ్యలొనరించుచుండిరి. వారి యత్యాచారము లడచుటకుగా జారధర్మాసనమను నొక నియమమేర్పడియుండెను. మఱియు నిప్పటి దర్జీవారిఁబలె మోహరివాడల నుద్యోగముఁ జేయు కుట్రిపుపనివాండ్లు (Military outfitters and military tailors) కూడ యక్కాలమున నుండిరి. మఱియు నిపుడు సతు లింటిలోపల గోప్యముగా నొనర్చుకొను "ఊరీర్చుట" "పసుపునూరుట" మున్నగు కృత్యములు బజారునందే యందఱు చూచునట్లు గా నక్కాలమున స్త్రీలుఁ జేయుచుండినట్లు గోవిందమంచనశర్మ ప్రశంసించియున్నాడు. ఈవిషయము లన్నియు క్రీడాభిరామమునుండి తెలియుచున్నవి.

10 ఇతర విషయములు:—వాద్యములు—తప్పెట్లు, కాలికొమ్ములు, బూరలు, డమాయీలు, డోళ్ళుమున్నగు వాద్యసాధనములు వాడబడుచుండెను-సంగీతసాధనములు-వీణమృదంగము, తాళము సంగీతసాధనములై వెలసినవి. ఇప్పటిహార్మోనియమువలె నుతికినై ముఖవీణ అనుమఱి యొకసాధనముపయోగింపబఁడుచుండెను. నేటికిని దత్తమండలములఁ గొన్ని పల్లెలయందీముఖవీణ వాడఁబడుచున్నది.

బాలురు బొంగరములాడుచుండిరి. ఇయ్యది రాజబాలకుడగు బాలచంద్రుఁడుగూడ యాడుచుండుటచే మిక్కిలి ప్రాముఖ్యము వహించిన బాలక్రీడగా నుండియుండవలెను.[80] ఆకాలమున బంగారు కుదువబెట్టుట, ముఖశుద్ధిచేయకముందే ప్రొద్దుననే వీడెమువేయుట యాచారమందుండియుండుట కాబోలు, బద్దెభూపాలుడు తన శతకరత్నమున నటుచేయుట పాడిగాదని నీతిపద్యముల వ్రాసెను.

ప్రతాపరుద్రప్రశస్తి

శ్రీయుత మారేమండ రామారావుగారు. బి. ఏ. ఆనర్సు, బి. ఇడి.

క॥ ఆనంద వత్సరంబున, ఘనముగ తర్కాబ్ధిరుద్ర గణితంబైతా
నెనయు శక వర్షమందున, ననఘా! యల చైత్రశుద్ధ పంచమినాటన్॥

సీ॥ ముత్తాతగణపతి ముచ్చేటల్ దీరంగ, రుద్రాంబ నోములు రూఢికెక్క
చాళుక్యమహాదేవు జన్మంబు దరియింప, ముమ్మడంబా సాధ్వి మోదమంద
శివదేవధీమణి చేయు నాశీర్వాద, ఫలమిదేయని జనుల్ బల్కునటుల
త్రైలింగసామ్రాజ్య ధౌరేయతాఖ్యాతి, దిఙ్నగాగ్రములందు దేజరిల్ల
ఘనతజనియించి చాళుక్య కాకతీయ, వంశములు రెండు దరియించి వాసికెక్కి
తీవు, చలమర్తిగండ! యోదివ్యతేజ! వినుతగుణభద్ర! కాకతి వీరరుద్ర!

సీ॥ కాంచీపురాధీశు నంచితసౌధాన,గదిలె నీదుపతాక గరిమమీర
కంపిలరాజ్యంబు గడియలోన జయించి, పాతినాడవు జయధ్వజము నచట
అటుకళింగము బాహుపటుదర్పమున జుట్టి, గండికోటను బట్ట గలిగినావు
అరుల నెందరినేని యసిలోన నిర్జించి, ప్రక్కలో వారికి బల్లెమయితి
ఇట్టి వీరప్రతాపాన కెవరుసాటి, పరమ మాహేశ్వరాచార! భవ్యచరిత!
మూరురాయరగండ! యో ముల్లోకవీర! వినుతగుణభద్ర! కాకతి వీరరుద్ర.

మ॥ నరసింహుండును, విద్యనాథకవియు న్మారన్న, రుద్రుండు, భా
స్కరుడున్, దేశికు, డప్పయార్యుడొకడున్, శాకల్య మల్లన్న, ప
ల్వురు సంగీత కవిత్వ వేత్తలలరన్ పూర్ణప్రభావంబునన్
వరలెన్నీసభ నీవె శిష్టకవివై వర్ధిల్లితింతేటికిన్॥

ఉ॥ అన్నయమంత్రి, ముప్పిడి మహామహుడున్, శివదేవ కామయల్
గన్నయ గుణ్డయల్, మఱి యుగంధరప్రజ్ఞుడు మాచనాయడున్
మన్ననలన్ మెలంగి దగ మంత్రిముసేయగ రాజ్యమేలి ము
న్నెన్నడులేని వైభవము నేర్పడజేసితివయ్య భూవరా!

ప్రతాపరుద్రునిపై మహమ్మదీయుల దండయాత్రలు.

శ్రీయుత గొర్తి వెంకట్రావుగారు ఎం. ఏ. ఎల్. ఎల్. బి.

మహమ్మదీయులు దక్షిణాపథముపై దండెత్తినప్పుడు వింధ్యపర్వతముల దక్షిణమున నున్న హిందూదేశము నాలుగు ముఖ్యభాగములుగా విభజింప బడియుండెను. మహారాష్ట్రమనబడు పశ్చిమభాగమును దేవగిరి ముఖ్యపట్టణముగా యాదవనాయకుడగు రామదేవుడను నామాంతరముగల రామచంద్రదేవుడు పరిపాలించుచుండెను. అతడు క్రీ. శ. 1271 మొదలు 1309-10 వరకును రాజ్యమేలెను. తూర్పుభాగమగు తెలింగానా ప్రాంతమును కాకతీయవంశీయుడైన ప్రతాపరుద్రు డేలుచుండెను. అతడొరంగల్లు రాజధానిగా జేసికొని క్రీ. శ. 1291 మొదలు 1323 వరకును పాలించెను. గోవానుండి పెన్నా యుత్తరభాగమున కొంకగీత గీసినయెడల నాగీత యీ రెండు రాజ్యములకు దక్షిణపుటెల్లయై యుండును. ఈ గీతకు దక్షిణభాగమున హోయిసాల పాండ్యరాజ్యములు ప్రబలియుండెడివి. ద్వారసముద్రము, మధురయును క్రమముగా నీరెండు రాజ్యములకును ముఖ్యపట్టణములు. ఆకాలమున హోయిసాల రాజ్యమునకురాజు మూడవ వీరబల్లాలుడు. అతడు క్రీ.శ. 1291 మొదలు 1342 వరకును పరిపాలించెను. క్రీ. శ. 1268 మొదలు 1311 వరకును పాండ్యరాజ్యము నేలినవాడు మొదట మారవ వర్మ కులశేఖరుడు. పైనిచెప్పిన రాజులు గాక వారికి లొబడియున్న సామంతనాయకులు మఱికొందఱుండిరి.

ఈ రాజ్యములన్నియు నార్థికముగ మిక్కిలి యుచ్చ దశలోనుండినవి. రాజులును వారిప్రజలును మిక్కిలి ధనాఢ్యులై యుండిరి. రాజుల ధనాగారము లన్నియు భర్మమణిపూర్ణములై యుండెను. వ్యవసాయము, వర్తకము, విద్య, కళ ఇవియన్నియు చాల యభివృద్ధిలోనుండెను. రాజధానులు వర్తకమునకును నాగరికతకును నిలయములై యుండెడివి.

కానిదురదృష్టవశము వలన కాదాచిత్కములగు రాజకీయాందోళనములచేతను, ఘోరయుద్ధములచేతను, నీసమిష్టిభావము చెదరిపోవుచుండెడిది. కాకతీయులు యాదవులతోడను తరతరములనుండి దీక్షతో పోరాడుచుండిరి. ఈవైరములు చాలపాతుకొని పోయివిదేశీయులుదండెత్తి వచ్చినప్పుడు సైతము మరువరానివయ్యెను. ఇట్లొకరి నాశనమున కొకరు కారకులై తుదకందఱును యవనసేనా వాహినిచే నూడ్చికొనిపోబడిరి.

ఎట్లయినను దక్షిణహిందూదేశ చరిత్రలో శూరత్వమునకును ధార్మికత్వమునకును గాకతీయులు సుప్రసిద్ధులు. వారిలో రెండవ ప్రతాపరుద్రునినామ మున్నతస్థానము నాక్రమించును. దాక్షిణాత్యభూపతులలో నాతడొక మహనీయమూర్తి. మహమ్మదీయుల భయంకర ధాటినుండి తనరాజ్యమును కాపాడుకొనుటకితడు మహాత్యాగమును గావించినాడు. ఇస్లాము మతస్థులదాటి కొక్కరొక్కరుగా రాజులందఱు దలలు వంచిరి. కాని ప్రతాపరుద్రు డే కాక

యయ్యు నిరువది యేండ్లు పోరాటము గావించె ను. తుదకు రాజ్యము, స్వాతంత్ర్యము, ప్రాణము లనుగూడ కోల్పోయెను. కాని యాతనిత్యాగము ధైర్యము నాతని నామమునకు దక్షిణ హిందూదేశచరిత్రమున జిరస్థాయిత్వము గల్పించినవి. ప్రవర్తనయందును ప్రజ్ఞయందు నీతని నారవవిక్రమాదిత్యునితోడను, మొదటి కులోత్తుంగునితోడను సరి చేయవచ్చును. కాని యాతని కీర్తి నజరామరముగావించుటకు బిలహణుడుగాని జయమగొండారుగాని లేకపోయెను. అతని సంగరములను గూర్చి మనకేమి తెలియవచ్చినను తురకల వ్రాతలనుండియే. ఆరోజులలో నేదియైనను మతముతరువాతనే అగుటయు మహమ్మదీయచరిత్రకారులు తమ పోషకులగొప్పకై యదార్థమును మరుగుపరచుటకు వెరువరైరి. అందుచేత ప్రతాపరుద్రుని యుద్ధములను గూర్చిమనకు యథార్థచరిత్రములభించుట దుర్లభమగుచున్నది. కనుక నీపాక్షికములైన గాథలనుండియే మనము సాధ్యమైనంతవరకు చరిత్రమును గ్రహింపవలసి యున్నది.

దాక్షిణాత్యభూపతు లందఱిలోను కాకతీయులు విదేశీయుల దండయాత్రలవలని యపాయములను మిక్కిలి విస్పష్టముగ గ్రహించినట్లు తోచుచున్నది. పదుమూడవ శతాబ్ద మధ్యమున కాకతీయగణపతి తనరాజధానిని రక్షించుటకయి యొకపాషాణ ప్రాకారమును నిర్మింప నారంభించెను. అతనికుమార్తెయగు రుద్రమదేవి దానిని పూర్తి చేయుటయే గాక దానిచుట్టును మృణ్మయప్రాకారము నొకదానిని కట్టించెను. శిలాకుడ్యముయొక్క పరిధి 4 మైళ్ళ 630 గజములు. మృణ్మయకుడ్యముచే నావరింపబడిన స్థలవైశాల్యముయొక్క వ్యాసముపొడవు రెండుమైళ్ళు. "దాని యన్నిప్రక్కల యందును రెండుమైళ్ళ దూరమువరకు సౌఖ్యపిపాసువుల తృప్తిపరచుటకై చెలమలును ఆరామములును గలవు. అందు మామిడిపండ్లు, అరటిపండ్లు, పనసపండ్లును పండెడివి. హైందవ సౌందర్యమునకు తార్కాణములగు చంప, కుంద, కేతకీ సుమములచ్చట మెండుగా నుండెడివి."[1] అని అమీరు ఖుస్రూ వ్రాసియుండుటచే రుద్రమదేవి మనుమడగు రెండవ ప్రతాపరుద్రుడు మఱికొన్ని యితరసౌకర్యములను గల్పించినట్లు కన్పించుచున్నది. దుర్గముయొక్క బలమును వర్ణించుచు నతడు మఱియొకగ్రంథమున నిట్లు వ్రాయుచున్నాడు. "ఒరంగలు చుట్టునుగల కుడ్యము మృణ్మయమయ్యు సుక్కబల్లెములు గూడ చొరజాలనంత దిట్టముగా నుండెను. పాశ్చాత్య యంత్రసాహాయ్యమువలన రాతిగుండ్లు త్రోయబడినచో నవి బాలకులాడుకొను బంతులవలె వెనుదిరిగివచ్చును."[2]

నిపుణురాలగు తనమాతామహి జీవితకాలముననే రెండవప్రతాపరుద్రుడు రాజ్యమునకు వచ్చెను. ఆమె క్రీ. శ. 1981వ సంవత్సరమున రాజ్యము నాతనికి వశపరచినట్లు తెలియుచున్నది. ఆమెశాంతి సంరక్షణమునందును యుద్ధవిధానము నందును అసామాన్య ప్రతిభగల వీరవనిత. సుశిక్షణమును, సహవాసమును, మనుజనిశీలమును బాగుపరచు స్వభావము గలిగినవియగుట నిజమేయగునెడల నామె శిక్షణము మూలముననే ప్రతాపరుద్రుడు

1 Amir Khusru : Nub Sipihr (Elliot, III, P. 559)
2 Amir Khusru : Tarikh-i-Alai (Elliot, III P. 80)

మంచియోధుడును రాజనీతికోవిదుడు నయ్యెనని మన మెప్పుకొనవచ్చును. ఇట్లతడొక విశాలరాజ్యమునకును, అమూల్య కోశాగారమునకును అధిపతియయ్యెను. విప్లవములుగాని, బంధువుల కుట్రలుగాని, పరదేశీయుల యుద్ధములుగాని యాతడు సింహాసనము నధిష్ఠించినకాలమున దేశశాంతికి భంగకరములుగాలేదు. సర్వమును పురోవృద్ధిసూచకమై యుండెను. 10 సంవత్సరములపాటతడు నిర్విఘ్నముగ రాజ్యపాలన విధానమును చక్కబెట్టుటయందును, ప్రజలసౌఖ్యము నభివృద్ధి పరచుటయందును తనకాలమును గడపుటకు వీలుకలిగెను. తరువాత తురుష్కులాతని దేశముపై దండెత్తివచ్చుటచే నతడు తన పరిశిష్టరాజ్యకాలమును దేశమతసంరక్షణార్థమై వినియోగింపవలసి వచ్చెను.

క్రీ. శ. 1303 వ వంత్సరములో గాకతీయసామ్రాజ్యము అలావుద్దీను ఖిల్జీదండయాత్రకు గురియయ్యెను. యువరాజుగానున్న కాలమున నాతడు దక్షిణాపథముపై దండెత్తి రామదేవుని యొద్దనుండి వెండి, బంగారు, మణులరూపమున నింతింతనరాని ధనమును, ఎలిచిపురమునుండి వచ్చు శిస్తునిచ్చుటకు వాగ్దానమును, గ్రహింపగలిగెను. ఆతడీధనమంతయు పినతండ్రినిచంపి ఢిల్లీరాజ్యమును సంపాదించుటకొరకు వినియోగించెను. ఆతని రాజ్యమునందలి క్లిష్టపరిస్థితులెల్లపుడు, నతనికి ధనావశ్యకతను గల్పించుచుండెడివి. దేవగిరిపై మరలదండెత్తుటచే నతని కేవిధమయిన లాభమును లేకుండెను. అందుచే ధనరాసులను వశపరచుకొనుటకై ఫకూరుద్దీన్ జూనా, మలిక్, ఛజ్జూల నాయకత్వముక్రింద, ప్రతాపరుద్రుని పాలనలోనున్న కాకతీయ సామ్రాజ్యమును ముట్టడించుటకై గొప్పసైన్యమును బంపెను. ఈసైన్యములు పూర్వమార్గమునగల బెంగాలు, ఒరిస్సా, రాజ్యముల గుండ పోవలసివచ్చెను. ఈసైన్యచలనము యొక్క సంపూర్ణచరిత్ర మెచ్చటను వ్రాయబడి యుండలేదు. కాని యీదండయాత్ర ఫలితము పరాజయమేయని చెప్పుటకు మాత్రము సందియము లేదు. ఈపరాజయమునకు కారణములు వివరించుచు బరానీయిట్లు వ్రాయుచున్నాడు. "వారచ్చటికి జేరినంతనే వర్షఋతు వారంభించుటచే సైనికు లేమియును చేయజాలరైరి. అందుచే శిశిరారంభమునందే మిక్కిలినష్టమును పొంది వారు హిందూస్థానమునకు దిరిగి పోవలసివచ్చెను." కాని యతడు సంపూర్ణసత్యమును చెప్పినట్లు తోచదు. ఏలనన తురుష్కుల పరాజయమునకు నొరంగలుదుర్గ ప్రాబల్యమును, కాకతీయ సార్వభౌముని యమేయప్రయత్నమునుగూడ కారణములై యుండిన యుండవచ్చును.

కాని యీదాడి ముందుజరుగబోవు తురుష్కదండయాత్రానాటకమునకు నాందివంటిది. అల్లావుద్దీను మొదట దక్షిణమునకు దాడివెడలి నప్పటినుండియు దక్షిణాపథద్వారములెన్నడును మూయబడియుండలేదు. ఆంతరములైన తిరుగుబాట్లును, బాహిరములైన దండయాత్రలును అతని ధనాగారమును శూన్యముగావించినవి. అందుచే నతడు కోశాగారమును పునఃపూరితముగావింప వలసివచ్చెను. రాజభక్తిపథమునుండి తొలగువారిపై జరిమానాల రూపమునను, వారి యాస్తి సంక్రమణరూపమునను విశేషధనము సమార్జింపబడెను. రామదేవుడు ఎలిచి పురపుభూములమీది శిస్తును పంపకుండుట తిరుగుబాటుగా పరిగణింపబడె

ను. అందుచే నతనిని శిక్షించి యాతని ధనాగారముల వశపరచుకొనుటకై క్రీ శ. 1307 వ సంవత్సరమున మల్లిక్ కాఫరు పంపబడెను. కాఫరుదేవగిరి పట్టణమును సమీపించి దాని పరిసరప్రాంతములను నిధనోన్ముఖముల గావించెను. అతడు హిందువులను జయించి, విశేషధనమును లోబరచుకొని రామదేవుని ఢిల్లీకి ఖైదీగా దీసికొనిపోయెను. సుల్తానాతని నిక్షమించి సామంతరాజుగానుండి యాతని రాజ్యమునేలుకొనుటకై గౌరవపురస్సరముగ మరల బంపివేసెను. ఇట్టి సమాదరణముచే సుల్తాను యెడ రామదేవుడు యకుంఠిత రాజభక్తిని వహించెను. రామదేవుడప్పటి నుండియు మహమ్మదీయులు తన సోదర భూపాలురపై దండెత్తి వచ్చినప్పుడు సైతము వారికి తోడ్పడుటకు సంకోచపడలేదు.

మహమ్మదీయ దండయాత్రల యపాభారము ననుభవించిన తరువాతిరాజు ప్రతాపరుద్రుడు. అల్లావుద్దీను కాకతీయసామ్రాజ్యములోని ధనాగారములన్నిటిని దోచుకొనుటకై క్రీ. శ. 1309వ సంవత్సరమున రెండవ మారు ప్రయత్నించెను. మల్లిక్ కాఫ రొరంగలు మీదికి దండెత్తి పోవునప్పుడల్లావుద్దీ నాతనికి గఱపిన యుపదేశము లాతని ముఖ్యోద్దేశము ధనార్జనమేకాని రాజ్యసంక్రమణము కాదని వ్యక్తీకరించుచున్నవి. అతడు కాఫరునకీక్రింది విధమున నుపదేశించెను.[3] "రాజు ధనకనకవస్తువాహనములనొసంగుటకును, మరు సటిసంవత్సరము కప్పముగట్టుటకు, నొప్పుకొనినయెడల నాత డేవిధముగను నిర్బంధింపబడరాదు. పరిస్థితులను విషమములనుగా నొనరించక యాతనితో నేదో యొకవిధమున సంధి కుదుర్చుకొనుట.....లాభకరము. ఒకవేళ నాతడట్లొనరింపలేకున్నచో రాజును ఢిల్లీకి దోడ్కొనివచ్చి తనపేరు నిలబెట్టుకొనవలయును."[4] కాఫరును, క్వాజాహాజియును పెద్ద సేనతో ఢిల్లీని విడచి యడవులనుదాటి రామదేవుని చల్లనిరాజ్యమును ప్రవేశించిరి. రామదేవుడు సుల్తానునకును నాయకులకును ఉపాయనములను పంపి వారికి స్వాగతమొసంగెను. తురుష్కసేనలు రాజ్యములోనుండి పోవుచున్నప్పుడాత డొరంగల్లు పరిసరములనున్న గ్రామములకు దనసేవకులను బంపి, తురుష్కసేనల కేవిధమగు లోటును జరుగకుండ జేయించెను. కాఫరునకు సహాయము చేయుటకై కొంత మరాఠీదండును కొన్ని మరాఠీగుఱ్ఱములను వారికి సమకూర్చి, తాను కొంతదూరమువరకును వారిని సాగనంపెను. ఇట్లెల్లయెడల రామదేవుని సహాయము నందుచు తురుష్కసేనలు కాకతీయులకుచెందిన సర్బరు (శ్రీపురము) కోటను సమీపించి తక్షణమే కోటను ముట్టడించినవి. మహమ్మదీయులాగ్నేయాంబకముల నుపయోగించుటచే కోటలోని కొన్నిగృహములకు నిప్పంటుకొనెను చాలమంది ప్రజ లాయగ్నిజ్వాలలలో బడి దగ్ధులైరి మిగిలినవారు క్రూరులగు తురుష్కులచే ఖండింపబడిరి ఈకోట ముట్టడి యయిపోయినతరువాత మల్లిక్ కాఫ రచటి నుండి సాగి ఓరుగల్లుపట్టణమును సమీపించెను. అనుమకొండనుండి చూచినయెడల నొరంగల్లులోని దివ్యభవనములును ఆరామములును స్పష్టముగా దృగ్గోచరములగును.

---

3 తురుష్క గ్రంథకర్తలు ప్రతాపరుద్రదేవుని 'అడ్డరుదేవ' అని వ్రాసిరి.

4 Barani—Tarikh-i-Firoz-Shahi (Elliot, III, P. 21

గాన నచ్చటికి మల్లిక్ కాఫరిద్దరు సేనాధికారులను గుఱ్ఱపునిలుకాండ్రతో నంపెను. తాను కాకతీయులకు రాజధానియగు నొరంగల్లును ముట్టడించుటకై బయలుదేరెను.

ప్రతాపరుద్రుడు నిర్వ్యాపారుడై యుండలేదు. ఇరుగుపొరుగురాజులు తనకు సహాయముచేయుదురన్న యాశ యాతనికి లేనే లేదు. యెందుచేతనన రామదేవుడు పూర్తిగా మహమ్మదీయ పక్షమునవలంబించెను. మిగిలిన దాక్షిణాత్య భూపతు లతనియెడల నంతప్రత్యయము గలవారుకారు. పరిస్థితులిట్లున్నను మహమ్మదీయసేనల యసంఖ్యాకతచే ధైర్యమును గోల్పోక కోటనుముట్టడించు తురుష్కసైనికులపై బడుట కొకనాటి రాత్రి యేర్పరచుకొనెను. వినాయకదేవుడు 3000 గుఱ్ఱములతో గోటవెలువడివచ్చెను. కాని మహమ్మదీయులు మిక్కిలి జాగరూకతతో నుండుటచే నాతడు వారికేవిధమైన హానియును చేయజాలకపోయెను. పైగా తానే గొప్పనష్టమును భరింప వలసిన వాడాయెను. మల్లిక్ కాఫరు మిక్కిలి పట్టుదలతో దనప్రయత్నముల సాగించుచు చివరకు మృణ్మయకుడ్యముపై నన్నివైపులనుండియు పాశ్చాత్య పాషాణఖండములను విసరుట కాజ్ఞయొసంగెను. తురుష్కశిలాఖండములు బలవత్తరములైన రజ్జువుల సాహాయ్యముచే మిక్కిలి యెత్తుగాత్రోయ బడుచుండెను. హైందవుల శిలాఖండములు యజ్ఞోపవీతక్షిప్తములువోలె మిక్కిలి నెమ్మదిగా బోవుచుండినవి.[5] చివరకు కుడ్యమున ననేక రంధ్రములుచేయబడెను కొలదికాలములో, నే తురుష్కులు బహిఃప్రావరణమునంతయు నాక్రమింపగలిగిరి. తరువాత వారికి శిలానిర్మితమును, పరిఖాప్రావృతమునగు నంతర్దుర్గముదృష్టిగోచరమయ్యెను. ఆయగడ్డ జేరినంతనే వైరిసేనలు దానిని తరించి, శిలాకుడ్యమున నొకభాగమును పట్టుదలతో ముట్టడింప నారంభించినవి. ఇది ప్రతాపరుద్రునికిదుర్భరముగకన్పించెను. శత్రువులను తరిమివేయుటయం దతనికి గలయాశ పటాపంచములయిపోయెను. అతనికి తన దుర్గముయొక్క యసాధ్యత్వమునం దపార ప్రత్యయముకలదు. కాని బలవత్తరములైన మహమ్మదీయుల ముందవి యాగలేకపోయెను. ఇంకను ఆలస్యమొనరించిన యెడల తన దేశమునకే నాశనము ప్రాప్తించునను భయముచే దానులోబడి కప్పము కట్టుటకంగీకరించుచు మల్లిక్కాఫరుకడ కొకదూతను పంపెను. ఆశాపనద్ధబుద్ధియగు తురుష్కసేనాపతి సంధివెలగా నితనిరాజ్యములోని ధనము నంతయు నిమ్మనియడిగెను. పైగా "నతడేమైనదనకొరకొ నిల్వయుంచుకొన్నట్లు గనబడినచో ఘోరహత్యలు ప్రారంభింపబడునని బెదరించెను."[6] ప్రతాపరుద్రుడీ కఠినసనిబంధనముల కన్నిటికి నొప్పుకొని 300 ఏనుగులను, 7000 గుఱ్ఱములను ధనాభరణరాసులను అతనికి వశపరచెను. మఱియునతడుప్రతిసంత్సరమునుతనధనములో గొంతభాగమును, కొన్నియేనుగులను, ఢిల్లీకి పంపుటకు వాగ్దానముచేసెను. క్రీ. శ.1310 వ సంత్సరములో కాఫరు విశేషధనముతో[7]

---

5 Amir Khusru—Tarikh-i-Alai (Elliot, III P. 81)

6 Ibid P. 84.

7 Ibid, Page 92 బరానీప్రకారము 612 ఏనుగులు, 96000 మణుగుల బంగారము, అనేకాభరణ పేటికలు, మణులు, 20000 గుర్రములు

నొరంగల్లును విడచి దేవగిరి రాజ్యములోని నగరముల గుండప్రయాణముచేయుచు ఢిల్లీని చేరెను.

కోయిలోలుగను తమిళగ్రంథము ప్రతాపరుద్రుని పరాజయము గూర్చియు, నతనికోశాగారముల యాక్రమణమును గూర్చియుఁ మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసిన వ్రాతలను బలపరచుచున్నది.[8] ఈదండయాత్రలోవిజయము నొందుటకు ఢిల్లీసేనలలోగలిగినజననష్టమునుగూర్చిగాని, వస్తునష్టమునుగూర్చిగాని, మహమ్మదీయ చరిత్ర కారు లేమియును వ్రాసియుండలేదు. కాని "రాజు తనసర్వస్వమును శాకఖనిజంతుసముదాయములతో గూడ సుల్తానునకు వశపరచవలెను"[9] అని మల్లిక్ కాఫరు పరాజితులపై బ్రయోగించిన విషమ నిబంధనముల బట్టి సుల్తాను సేనలలోగూడ గొప్ప నష్టము సంభవించి యుండవచ్చునని యూహింపవచ్చును. ప్రతాపరుద్రుడు కాలవైషమ్యముచే బ్రస్తుతము మహమ్మదీయులకు లోబడియుండుట కొప్పుకొనినను, వారియధికారమును తొలంగిచుటకయి తగినసమయమును ప్రతీక్షించుచుండకపోలేదు.

జయములు లభించినకొలదిని అల్లావుద్దీను ధనతృష్ణ మితిమీరిపోయెను. తరువాత రెండు సంత్సరములపా టాతనిసేనలు దక్షిణదేశసౌభాగ్యమును కొల్లగొట్టుటకై నియోగింపబడెను. మధురాద్వారసముద్రాది పాలకులు పరాజితులైరి. వారు తరతరముల నుండి కూడబెట్టినయమే యసంపదలు తురుష్కవశములైపోయెను. చిదంబరము శ్రీరంగము మధురమొదలగు పట్టణముల యందలి సుప్రసిద్ధ దేవాలయములు కొల్లగొట్టబడెను. అందలివిగ్రహములు అడవుల పాలాయెను. విజయశీలములగు తురుష్కవాహినులు 512 ఏనుగులను 5000 అశ్వములను 500 మణుగుల యాభరణములును తమతోగూడదెచుచ్చు క్రీ. శ. 1311 వ ప్రాంతమున ఢిల్లీజేరెను.

ఇట్లు వింధ్యకు దక్షిణముననున్న హిందూదేశమంతయు గొల్లగొట్టబడి మహమ్మదీయులకు లొంగిపోయెను. మహమ్మదీయాధికారముపై తిరుగబడుట కెవ్వరును సాహసింపలేదు. రామదేవుని తరువాత రాజ్యమునకు వచ్చిన శంకరుడు క్రీ. శ. 1312 వ సంవత్సరప్రాంతమున గొంతవరకు తిరుగుబాటుచూపించెను. అందుచేత తక్షణమే మాలిక్ కాఫరు డేగవలె యాతనిపై కిలంఘించి యతనిని చంపుటయేగాక, యల్లావుద్దీను దక్షిణరాజనీతికి వ్యతిరిక్తముగ నాతని రాజ్యమును ఢిల్లీకి కలుపుకొనెను.

కాని యల్లాఉద్దీను క్షీణించుచున్న యారోగ్యమును, మల్లిక్ కాఫరు యొక్క కుట్రలును ప్రభుత్వాధికారము సరిగా సాగుట కాటంకమును గలుగజేసెను. సామంతరాజులు స్వాతంత్ర్యము సంపాదించుకొను నుద్దేశ్యముతో తమబలములను గూడబెట్టుకొనసాగిరి. క్రీ. శ. 1315 లో నల్లావుద్దీను దివంగతుడగుటచే రాజ్యమునందెల్లయెడల నల్లరులు బయలుదేరినవి. గుజరాతు బహిరంగముగా తిరుగబడెను. రామదేవుని జామాతయగు హరపాలదేవుడు మహమ్మదీయరక్షణసేనను దేవగిరినుండి వెడలగొట్టెను. ఇంతవరకును స్వాతంత్ర్యము నవలంబించుటకయి సమయమును నిరీక్షించుచున్న

8 K. V. S, Iyer: Historical Skches of Ancient Deccan Page 301
9 Amir Khusru—Tarikh-i-Alai (Elliot, III Page 84)

ప్రతాపరుద్రుడు ఢిల్లీకి కప్పమును పంపుట విరమించిఁ తనరాజ్యమును దక్షిణమున తిరుచునాపల్లి కాంచీనగరముల వరకును వ్యాపింపజేసెను. ఢిల్లీ పరమక్షోభమునబడి మగ్గుచుండెను. కాఫరు రాజ్యమునందలి యధికారమునంతయు స్వహస్తగతముజేసికొని సింహాసనమునకు వారసులైన వారినందఱినికండ్లుపొడిచిగాని, కారాగృహములోనుంచిగానిబాధించెను.

అయినను హిందువుల జయములు చిరకాలము సాగలేదు. 35 రోజులు పాలించిన తరువాత కాఫరు నిజానుచరులచేతనే నిహతుడయ్యెను. తరువాత నల్లావుద్దీను కుమారులలో నొకడు 'ముబారక్ షా' యను బిరుదముతో ఢిల్లీసార్వభౌమపదవికి నభిషిక్తుడాయెను. ఇతడు తన రాజ్యారంభదినములలో దక్షిణహిందూదేశముయొక్క పునర్విజయమున కారంభించి తనతండ్రివోలె మేదురమగు శక్తిమత్తను ప్రదర్శించెను. క్రీ. శ. 1317 వ సంవత్సరమున నాతడు గుజరాతునందలి తిరుగుబాటు నడచివైచెను. దేవగిరి రాజగు హరపాలదేవు నోడించి సజీవుడైయుండగనే యతని చర్మము నొలిపించెను. తరువాత ప్రతాపరుద్రునిపై కసితీర్చుకొనుటకు తన కిష్టుడగు మల్లిక్ ఖుస్రు నాయకత్వముక్రింద నొక గొప్పసైన్యమును పంపెను.

ప్రతాపరుద్రుడును తదితర దాక్షిణాత్య భూపతులును పూర్వలబ్ధములచే నెట్టి నీతిపాఠమును గ్రహించినవారుకారు. ఏలనన నల్లావుద్దీను మొదట దండెత్తివచ్చినసమయమునందువలెనే వారు ఇప్పుడుగూడ వేఱువేఱుగ నైకమత్య విహీనులైయుండిరి. కాని కాకతీయ సార్వభౌముడగు ప్రతాపరుద్రుని విషయమై యతడు విశేషమైన పోరాటములేకుండ శత్రువులకు లోబడలేదనిమాత్రము చెప్పవలసియున్నది. అమీరుఖుస్రూ వ్రాతప్రకారము హైందవాశ్వికులు 10 వేలకు నెక్కుడుగను, వారి పదాతిగుణము ల సంఖ్యేయములుగను ఉండెను. మహమ్మదీయులందరును కలసి 300 లో లేక యంతకు తక్కువగనో యుండిరి. అయినను మహమ్మదీయులు హిందువులను సంపూర్ణముగ పరాజితుల నొనర్చుటయేగాక వారిని దుర్గద్వారమువరకును తరిమివేయగలిగిరని చెప్పబడియున్నది.[10] కాని యిచ్చట నమీరుఖుస్రూ తురుష్కయోధుల ప్రతిభను సర్వతోముఖము గావించుసుద్దేశముతో బుద్ధిపూర్వకముగ వారి సేనాసంఖ్యను స్వల్పీకృతము గావించినట్లు కన్పించుచున్నది. ప్రతాపరుద్రుని సేనానాయకులును యుద్ధభటులును అతిస్వల్పసంఖ్యాకులగు మహమ్మదీయ సైనికులుమాత్రమే తరిమినేయగలిగినంత బలహీనులుగను, పిరికిపందలుగను ఉండిరని విశ్వసించుటకు వీలులేకున్నది. అయినను మిగిలినదండయాత్రా క్రమమంతయు మల్లిక్ కాఫరు దాడివెడలినప్పటివలెనే యుండి యట్టి ఫలితములతోనే ముగిసెను. చుట్టునున్న మృణ్మయప్రాకారమును, లోపలనున్న శిలాకుడ్యమును ముట్టడింపబడినతరువాత రాజునకు వినాశము రానున్నదని స్పష్టముగా గోచరించెను. ఇంక శత్రువుల నెదిరించుట సర్వథా నిష్ఫలమని యాతనికి నమ్మకముపుట్టెను. అందుచే నతడు సంధిసంరభమును చేయమొదలిడి తన సర్వసంపదను 100 ఏనుగులు, 12000 అశ్వములను సంధికి వెలగానిచ్చుట కంగీకరించెను. ప్రతాపరుద్రుడు తనకియ్యకుండ నేదియు

10 Amir Khusru--Nub Sipihr (Elliot, III Page 560)

స్వప్రయోజనమునకై దాచుకొనలేదని ప్రత్యయముగల్గినప్పుడు తురుష్కసేనాని యతని యొద్దనుండి ప్రతిసంవత్సరమును కప్పముగట్టుట కొకలిఖితమైన యొడంబడికగైకొని ఒరంగలునుండి నిర్గమించగా ప్రతాపరుద్రునికి భయముపోయి ఊరకొనెను.

కాకతీయ భూపతిని లోబరచుకొనినతరువాత నమీరుఖుస్రూ మాబారుపై దండెత్తి దాక్షిణాత్యభూపతు లందఱిపైనను ఢిల్లీసార్వభౌముని యధికారమును పునఃప్రతిష్ఠితము గావించెను.

కాని ఖుస్రూకు దక్షిణదిగ్విజయముతో సంతృప్తిగలుగలేదు. అతడు మల్లిక్ కాఫరువలెనే తన జయముల నన్నిటిని ఢిల్లీసింహాసనోపగమనమునకు సోపానమార్గములుగా దలపోసెను. తగినసమయమునుజూచి తన ప్రభువును వధించి 'నాసిరుద్దీను సుల్తానన్'ను బిరుదముతో తానే సార్వభౌముడనని ప్రకటింపజేసెను. కాని అతని పరిపాలనావిధానము మహమ్మదీయులకు దుస్సహముగా నుండుటచే నతడు రాజ్యము నాక్రమించిన మూడునెలలలోనే పంజాబీయుడగు 'ఘూజీ' తుగ్లక్‌కతని నోడించి గయాసుద్దీను తుగ్లకను నామముక్రింద తానే సుల్తానాయెను. (1320)

ఢిల్లీలోని యీవిప్లవము లన్నియు సుల్తానునకు కప్పముగట్టుట మానివేసి, స్వాతంత్ర్యావలంబన ప్రయత్నముల నొనరించుటకయి ప్రతాపరుద్రునికి రెండవ యవకాశమును గలుగజేసినవి. అతడు తన కోటను బలపరచుకొని హైందవరక్షణ సేనలను నియమించి సర్వమునకును సంసిద్ధుడై వేచియుండెను. ఢిల్లీసుల్తానులు తన రాజ్యమునుండి కప్పమునుగైకొనక మానరనియు, నెట్టి పరిస్థితులలోనైనను దాని నమలులోపెట్టుటకు ప్రయత్నించితీరుదురనియు నతడు పూర్వానుభవములన నెఱిగియుండెను. మొదటి తుగ్లకురాజు ఉల్లావుద్దీనువలె మిగుల శక్తిసంపన్నులును, దక్షిణదేశవిషయమైన వ్యాపారములలో నతనికంటె నెక్కుడు దురాశాపూరితులు. "తనకు గావలసిన సువర్ణముకొఱకయి దక్షిణాపథమును పాలిచ్చెడు యావును (Milch cow) వలె నుపయోగించుటతో" నల్లావుద్దీను సంతుష్టిపడెను. కాని తుగ్లకు దక్షిణాపథమునందలి సువర్ణమును, రాజ్యములను గూడ సంపాదింపనిచ్ఛించెను. అందుచే హిందూరాజులెవరైన స్వాతంత్ర్యము నవలంబించినచో వారొకనిమిషమేనియు నోర్వలేకపోయిరి.

క్రీ. శ. 1321 వ సంవత్సరమున గయాజుద్దీనుతుగ్లకు కాకతీయ భూపతిని శిక్షించుటకయి ఉలుగ్ ఖానను బిరుదుగలిగిన ఫకూరుద్దీను జూనా యను తనకుమారుని ఓరుగల్లుపంపెను. అతడు తనవంశమునకును తన పూర్వుల వంశమునకు చెందిన చాలమంది భూస్వాములను, ఉద్యోగస్థులను, నతనితోగూడ గొంపోయెను. యువరాజు మహావైభవముతో బయలుదేరి దేవగిరి జేరుసరికి అచ్చటి యధికారులును సేనలును అతనిని కలసికొనిరి. ఒరంగల్లు యథాపూర్వముగ ముట్టడింపబడెను. శత్రువులుపై బడినప్పు డచ్చటి హిందువులు వారిని మిక్కిలి పట్టుదలతోనడ్డగించిరి. ప్రతిదినమును రెండు పక్షముల వారికిని తీవ్రయుద్ధములు జరుగుచుండినవి. కోటనుండి యగ్ని సమాక్షిప్తమై యుభయసేనలలో చాలమందిని దగ్ధులనొనరించెను. కాని కాలము గడచినకొలదిని మహమ్మదీయులు హిందువులకంటె నెక్కుడు ప్రాబల్యమును సంపాదింప దొడగిరి. అందుచే ప్ర



రామప్ప దేవాలయాంతర్భాగము

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.



రామప్పదేవాలయము—గర్భాలయద్వారము

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.

తాపరుద్రు "దమూల్యములగు నాభరణము లను, ఏనుగులను, ధనరాసులను ఇచ్చుట కను మతించి అల్లావుద్దీను రాజ్యకాలమున మల్లిక్ కాఫరువలె నీవుగూడ కప్పమును గ్రహించి తి రిగిపొమ్మని యువరాజు నభ్యర్థించెను"[11] కాని జూనా యీప్రార్థనమును సగర్వముగ తిరస్క రించి కోటను వశపరచుకొని, రాజునుఖైదీగావ ట్టుకొనుటకై నిశ్చయముచేసికొనెను.

ఇంతలో ఢిల్లీకిని, ఓరుగల్లు సమీపముననున్న తురుష్క శిబిరమునకును మధ్య నుత్తరప్రత్యు త్తరము లరికట్టబడెను. ఇదిగాక సుల్తాను మర ణించెననియు, ఢిల్లీసింహాసనము వేరొకనిచే నాక్రమింపబడెననియు నొకకింవదంతి బయలు దేరెను వైరిసైనికులలో నల్లకల్లోలముగల్గిం చుటకై ప్రతాపరుద్రుని యనుచరులచేతనే యిట్టిది కల్పింపబడియుండవచ్చును.

జూనా యల్లావుద్దీనుకాలమునాటి భూస్వా ములననుమానముతో జూచుచుండుటచే వారిని కారాగారనిబద్ధులజేసి చంపయత్నించుచుండె నని దుర్మార్గులు కొందఱు మఱియొక మిథ్యా వృత్తమును వ్యాపింపజేసిరి. అందుచే తురు ష్కసేనాసమూహములలో నొకపెద్దయలజడి కలిగెను. భూస్వాము లొకరితరువాతనొకరు జూనాను విడిచి పోవనారంభించిరి. గాన ఒరంగల్లుముట్టడి వదలుకొని దేవగిరిచేరుటదప్ప రెండవమార్గము లేకపోయెను. అప్పుడు హిందువులు కోటవెలుపలికివచ్చి వెనుదిరిగి పోవుచున్న మహమ్మదీయ సైన్యములను వెం బడించి యసంఖ్యాకములగు నాయుధములను, యోధులను, తురంగములను పట్టుకొనిరి. పరా జయము విజయముగా మారిపోయెను. ప్రతా పరుద్రుడు పోరాటమునుండి పూర్ణవిజయము తో బహిర్గమించెను.

ఈపరాజయము సుల్తాను హృదయమును దహించి వేయుచుండెను. అందుచే నతడు క్రీ. శ. 1323 లో నొరంగల్లును వశపరచుకొనుట కై జూనానాయకత్వముక్రింద బలవత్తరము లైన భటసమూహములను రెండుమార్లు సం ప్రేషించెను. అచిరకాలముక్రిందటనే పరాజి తులైన మహమ్మదీయులు మరల నింతత్వర లో దిరిగి వచ్చెదరని ప్రతాపరుద్రుడెన్నడును తలంచలేదు. మేలైన యాయుధసంభారముగల వారగుటచే మహమ్మదీయులు బహిరంతఃకు డ్యములను సునాయాసముగా వశపరచుకొనగ లిగిరి. ప్రతాపరుద్రుడు సకుటుంబముగ శత్రు లచేతులలోబడి ఢిల్లీకిపంపబడెను. కాకతీయసా మ్రాజ్యమునందలి ధనరాసులును, కరితురంగ ములును, మహమ్మదీయులకు వశంగతములై పోయినవి. ఓరంగల్లు ఢిల్లీసామ్రాజ్యమునకు గలుపబడెను. ప్రతాపరుద్రుడు ఢిల్లీకి బో వుచు మధ్యేమార్గమున పరమపదించెను.[12]

---

11 Barani—Tarikh-i-Firoz Shahi (Elliot, III Page 231)
12 Shams-i-Siroj Afif: Tarikh-i-Firoz Shahi (Elliot, III P. 367

కాకతీయుల ఆంధ్రభాషాసేవ.

శ్రీయుత దూపాటి శేషాచార్యులుగారు (శేషాద్రిరమణకవులు)

క్రీ. శ. ౧౧-౨౦ ప్రాంతమునుండి పశ్చిమ చాళుక్యచక్రవర్తియగు త్రిభువనమల్లవిక్రమాదిత్యుని రాజ్యము క్షీణదశకువచ్చెను. అదియే కాకతీయుల విజృంభణమున కారంభకాలము. అంతవరకు సామంతుడుగను, సేనానాయకుఁడుగ నున్న ప్రోలరాజు ఆంధ్రసామ్రాజ్యమునకు బునాదివేసెను. దాదాపుగా నీతనిపూర్వుల శాసనములన్నియుఁ గన్నడభాషయందే యున్నవి. ఈతనికాలమునఁగూడ గొన్నికన్నడశాసనములు పద్మాక్షి, గూడూరు, ప్రాంతములనుండుటచేతఁ దొలుత నీతడు కర్ణాటభాషకే ప్రాధాన్యతనిచ్చినటుల నూహింపవచ్చును. ఇనుగుర్తి, మాటేరులలోనున్న తెలుఁగుశాసనములలో కాకతిప్రోలుని యాలయప్రతిష్టలు బేర్కొనఁబడినవి. ఇవియే యీతని ప్రథమాంధ్రశాసనములైనచో నిటనుండి కాకతీయులుగావించిన ఆంధ్రభాషాసేవ సంగ్రహముగ నెఱుంగవచ్చును.

ప్రథమప్రతాపరుద్రుఁడని చరిత్రవిదులు ప్రశంసించు రుద్రదేవచక్రవర్తి ఆంధ్రమున కెంతయో సేవఁగావించెను. ఈతనిమంత్రి శాసనమందును, సేనానాయకుఁడగు రుద్రసేనానికి ప్రతినిధియు మంత్రియునగు రాజప్రగడ నెలకొల్పిన ఉప్పరపల్లిశాసనమునందును, ఆంధ్రకవితాసంపద వెల్లివిరిసినది. ముఖ్యముగ గంగాధరుని శాసనమందు గొన్ని విలక్షణభాషాస్వరూపములుగూడ గోచరించుచున్నవి. తృతీయావిభక్తిలోని 'చేత' అను ప్రత్యయాంతముగా నాలుగుపద్యములు రచియించి యేవంగుణవిశిష్టుఁడగు రుద్రభూపతిచేత మంత్రిపదవి చేకొంటినని గంగాధరుఁడు చెప్పినాఁడు. 'చేసితిన' అనియు, 'మనోమోదకరు'డనుటకు, 'మనోముదకరుం'డనియుఁ, గొన్నివిలక్షణరూపములు బేర్కొనినాఁడు. ఈతని శాసనకర్తపేరు దెలియకున్న నానాటి వాఙ్మయస్వరూపము సర్వతోముఖముగ వెలుగొందెననుటకు నగునూరుశాసనము నందలిపద్యములే చాలును.[1] మఱియు రుద్రసేనానిమంత్రియగు రాజనాయకుని యుప్పరపల్లి శాసనమందలి పద్యములుకూడ నాకాలపు వాఙ్మయ పరిపక్వమునకు దార్కాణములు కాగలవు.[2]

---

1 "శ్రీరామాధిపుఁ డింద్రనీలనిభ శారీరుం, డుదారుండు, గౌ
రీరామాధిపుఁ డుజ్జ్వలస్ఫటిక శారీరుండు, ధీరుండు, భా
షారామాధిపుఁ డబ్జకేసరలసచ్ఛాయాశరీరుండునుం
గారుణ్యంబున మాకు నీవుత సదాకాలంబుఁ గామ్యార్థముల్ ॥

2 "ప్రతిపక్షక్షితిపాల కుంజర మదప్రారంభ సంరంభ ము
దతబాహానిహిత ప్రచండపిసితోర్వ్య త్తడ్గధారాసఖా
హతిభేదింప యఖర్వగర్వ బలశౌర్యస్ఫూర్తి కంఠీరవా
కృతియై యున్నతవృత్తిఁ దాల్చి వెలసెన్ రేచెర్లరుద్రుం డిలన్ ॥

రుద్రదేవమహారాజు క్రీ. శ. ౧౧౪౦ మొదలు ౧౧౬౦ వఱకు రాజ్యము నేలెను. ఈతఁడు విద్యాభూషణ బిరుదాంకుడనియు, నీతిసారమనుపేర నొక యమూల్యగ్రంథము విరచించెననియు వినుచున్నారము. వీరశైవవాఙ్మయ నిర్మాతయగు పాలకురికి సోమనారాధ్యులు కూడ నీకాలముననే దన కవితామృతముచే నాంధ్రసామ్రాజ్యమును ముంచియెత్తెను. ఆకాలపు శాసనములవలన రామేశ్వరభట్టారకుఁడు, కవిచక్రవర్తి, మల్లికార్జున పండితారాధ్యులు, బాలసరస్వతి మున్నగుకవులు కొందరున్నటుల దెలియవచ్చుచున్నది. సిద్ధేశ్వరాలయము చెంతగల గుహలోని గండశిలపై హన్మకొండ సామ్రాజ్యమును వర్ణింపదొరకొనిన యొక ప్రౌఢకవి కవిత సంపూర్ణముగ గోచరించుచున్నది. అందుఁగూడ రుద్రదేవునికాలపు టాంధ్ర వాణీవిలాసచ్ఛాయలు గలవు.

కాకతిగణపతి దేవుఁడు క్రీ. శ. ౧౧౯౯ మొదలు ౧౨౬౦ వఱకు రాజ్యమును పరిపాలించినాఁడు. ఈతని శాసనములు కొన్ని తెలుగునను, కొన్ని సంస్కృతముననుగలవు. విశేషించి ఆంధ్రశాసనములు గద్యరూపములు ఆనాటి వాఙ్మయమును గుర్తింప నివి మిక్కిలి యుపకరించును. రుద్రదేవుని కాలమునుండి గణపతిదేవుని కాలమువఱకు విస్తరించిన కాకతీయశిల్పములకు లక్షణగ్రంథమని చెప్పఁదగు నృత్తరత్నావళి వెలువడిన దీకాలముననే. ఏతత్గ్రంథకర్తయగు జాయసేనాపతి గణపతిదేవుని బావమఱది. అంతియేకాదు ఆతని గజసైన్యాధిపతిగూడ నై యున్నాఁడు. ఈగ్రంథము గీర్వాణభాషలోనున్నను ఆంధ్రశిల్పములను గూర్చియు, ఆంధ్రనృత్యమునుగూర్చియు, వివరములు గలిగి యుండుటచే నిది యొక యపూర్వనృత్తవాఙ్మయ చరిత్రమని చెప్పవచ్చును. విశ్వేశ్వరదేశికుఁ డాకాలపుశైవపీఠాధికారి. గణపతిదేవుఁ డీతనికుమారుఁడని మల్కాపురముశాసనము వాకొనుచున్నది. బహుశః అనుభవసారమురచించిన ఆంధ్రప్రౌఢకవి యీతని కాలమువాడేమో? గణపతిదేవుని వాఙ్మయసేవదెలుపు ప్రత్యేకగ్రంథము లేవో తెలియరావు కాని ఈతడు రసికశేఖరుఁడనుటకు సందియములేదు. తిక్కనసోమయాజి కార్యార్థియై దర్శనమునకేతెంచ నాదరించి భారతము నాలించి తద్రచన కబ్బురపడి కామితము నొసంగుటయే యీతని వాఙ్మయాభిమానమునకు బ్రబలదృష్టాంతముగఁజెప్పవచ్చును. గణపతిదేవుని కాలమునఁ గూడ గవియైయుండి కవితాజీవనము, ఖడ్గజీవనము సమముగ నిర్వహించికొనినాఁడు. మారనమహాకవి గణపతిదేవునికాలమున బాలుఁడై యుండి, తిక్కనసోమయాజికడ శుశ్రూషఁగావించి, ప్రతాపరుద్రుని యనుఁగు గన్నయ సేనానికాలమున నిరర్గళ కవితాపరిపాటి గడించినట్లు మార్కండేయపురాణమువలన దెలిసికొనవచ్చును దాదాపుగా నీతని కాలమువాఁడే కొలనిరుద్రదేవుఁడు కూడను. ఈతఁడు వ్యాకరణబ్రహ్మయను బిరుదమువహించి గ్రంథరచనలో నారితేరినట్లుగూడ గొన్ని యైతిహ్యములుగలవు. ఆకాలపుజైనులకు శైవులకు బద్ధమత్సరముండుటవలన గలిగిన యన్యోన్యకలహములచే గొంతవాఙ్మయము నశించినది.

గణపతిదేవుడు ఈమతవిప్లవములలో శైవపక్షపాతియని తెలియుచున్నది. అందుచే జైనవాఙ్మయము నశించునవకాశము తటస్థించినది. శివదేవకవికృతమగు పురుషార్థసారము వాఙ్మయమున కపూర్వభూషణము. ఈగ్రంథ మా

కాలపురాజనీతుల వెల్లడించు రాజనీతిశాస్త్ర మనుటకు సందేహములేదు.[3]

శివదేవధీమణియను మకుటముగల శతకమునుగూడ నీతఁడు రచించినట్లు లక్షణ గ్రంథములవలన దెలియుచున్నది. ఈరెండు గ్రంథములు, ఈయన శతకమును నేటివఱకు కనుపలభ్యములే. శతవర్షజీవియై గణపతిదేవుని కాలమున ప్రతాపరుద్రుని కాలమునను గూడ రాజకీయచాకచక్యము వెల్లడించిన ట్లు స్థానికచరిత్రము వెల్లడించుచున్నది. శివయోగి ప్రతాపరుద్రదేవునకు బసవవిజయము నివేదించెననియు, దానిని తాను బద్యకావ్యముగ రంచించితిననియు తుమ్మలపల్లి నాగభూషణకవిచెప్పియున్నాఁడు. దీనినిబట్టిచూడ శివదేవుఁడు ప్రతాపరుద్రునికి శివమంత్రోపదేశికుఁడేకాక విద్యాగురువని కూడతోచుచున్నది. రంగనాథుఁడను నొకకవి యీకాలమునందు గలఁడు. ఈతఁడు తొలుత వైష్ణవుఁడై యుండి శివనిందనుగావించి గ్రుడ్డివాఁడై "నయనగతిరగడ" అనునొకకృతిరచించి లబ్ధచక్షుష్కుఁడైనటుల నైతిహ్యములుగలవు.

ద్రిమదేవిచక్రవర్తిని క్రీ. శ. ౧౨౬౧మొ ౧౨౯౫ వఱకు రాజ్యమేలినది ఈమె గణపతిదేవుని రాజ్యాంతమునను ప్రతాపరుద్రుని రాజ్యారంభమ ననుగూడ నుండెను. ప్రత్యేకముగ నీయమగావించిన భాషాసేవను గమనింపజాలము. కాని యీమెపరివారముమాత్రము యెంతయో సారస్వతసేవకు దోడ్పడెను. రంగనాథరామాయణ నిర్మాతలగు కోనబుద్ధారెడ్డియు, రావిపాటి త్రిపురాంతకుఁడును, భాస్కరరామాయణ నిర్మాతలగు భాస్కరాదులును, నలకీర్తి కౌముదిరచించిన అగస్త్యేశ్వరుఁడును, దాదాపుగ నీకాలమువారే. భాస్కరరామాయణమున గొంతభాగమును బూరించిన శాకవల్లి మల్లికార్జున భట్టు బహుగ్రంథనిర్మాత. యీతఁడు రచించిన "అభిషిక్తరాఘవము" అను సంస్కృతకావ్యము హృదయంగమమై యీతనియొక్క యుభయభాషానైపుణ్యమునకు దార్కాణముగ నున్నది. ప్రతాపచరిత్రమువలన మల్లికార్జునభట్టారకుఁడు కవితావిషయముననేగాక రాజకీయ తంత్రనిర్వహణమునగూడ నప్రతిమానుఁడు అని గ్రాహ్యమగుచున్నది. ఇంకనునందు మల్లికార్జునుని యమానుషచర్యలు ఆశుకవితానైపుణ్యములుగూడ బేర్కొనబడినవి. ఈతని భాషాసేవగుర్తింపపరిశోధకులు ప్రత్యేకకృషిచేయవలసియున్నది కుమారరుద్రదేవుఁడు, హుళక్కి భాస్కరుఁడు, అయ్యలార్యుఁడు, భాస్కరుఁడు మున్నగు కవులచరిత్రములు నేటివఱకు మరుగుపడియున్నవి.

రుద్రమదేవి యనంతరము ౧౨౯౫ మొదలు౧౩౨౩వ వఱకు నామెదౌహిత్రుఁడగు ప్రతాపరుద్రుఁడురాజ్యమేలెను. ఈమధ్యకాలముననే విద్యానాథమహాకవిచే ప్రతాపరుద్రీయమను నలంకారగ్రంథ మాతని కంకితముగావింపబడినది. ఆంధ్రుల బలపరాక్రమములు సామ్రాజ్యవిస్తృతియు నందుప్రశంసింపబడినవి. ప్రతాపరుద్రుని యాస్థానమున రెండువందలమంది కవులుండిరని స్థానికచరిత్రము చెప్పుచున్నది.

---

3 ధరణి మదములేని కరులనుబోలె, దంష్ట్రములు లేని పన్నగములు వోలె
అరయ దుర్గరహితులైన ధాత్రీశ్వరు। లవనికెల్ల నసము లగుదు రెపుడు
పరులకు దుర్గమువలతే। హరువరమున భువనవిజయుఁడగు రావణుడున్
శరధిగిరి ప్రాకారో। త్కర పరివృతమైన లంకఘనమై యుండెన్.

ఇందతిశయోక్తియున్నను, పలువురు మహాకవుల కాశ్రయుండనుట మాత్రము సత్యము. ప్రతాపరుద్రుఁడు స్వయముగ కవియుబండితుఁడునై ప్రతాపమార్తాండము, వ్యాకరణవార్తికము, మున్నగు సంస్కృతగ్రంథములరచించెనని గ్రంథాంతరములగ దు. ఇప్పుడాగ్రంథములు మృగ్యములు. ప్రతాపరుద్రునికాలమున దేవతోత్సవములయందు ప్రేమాభిరామమను రూపకము ప్రదర్శిప బడుచుండెడిది. దీనిని రచించినకవి రావిపాటి త్రిపురాంతకుఁడు. అది ప్రకృతముకానరాకున్నను దాని యాంధ్రీకరణమగు క్రీడాభిరామముచే ప్రతాపరుద్రునినాటి యోరుగంటి మహావైభవము తెలియుచున్నది. ప్రతాపరుద్రుఁడు బంధితుడగుటతో ఆంధ్రసామ్రాజ్యము భిన్నమైనది. ఆంధ్రశిల్పము, వాఙ్మయమునశించినవి. ప్రధాననగరమున నెలకొల్పబడిన గ్రంథభాండారములు భస్మీపటలములగుటచే వాఙ్మయమున కింతంతయునరానియపకారము వాటిల్లినది. సామ్రాజ్యోపజీవులగు మాధవవిద్యారణ్యులు, నాచనసోముఁడు, అగస్త్యేశ్వరుఁడు మున్నగు ప్రముఖులు స్థానాంతరముల కేగవలసివచ్చెను. నాటివగుచు నుపలబ్ధగ్రంథములలో భాస్కరరామాయణము బహుకర్తృకము. ప్రేమాభిరామ మదృశ్యము. పురుషార్థసారము నామమాత్రశరణ్యము. ఈరాష్ట్రమున సమగ్రమగు వాఙ్మయ పరిశోధనము జరుపఁబడక పోవుటచే హతశేషమగు గ్రంథసముదాయమును గుర్తింప నేటికిఁ అవకాశము చిక్కలేదు.

శ్రీమద్గణపతి క్ష్మోణీపతి ర్జయతి జిత్వరః।
యచ్చిత్తేపి వశం నీశో నముంచత్యచలస్థితిం॥
తద్భక్తస్య ప్రవీరస్య శ్రీమద్రుద్ర చమూపతేః।
రేచెర్లస్వామినో వంశం వక్ష్యే విఖ్యాత్యముత్తమం॥
శ్రీమద్బ్రహ్మాఖ్య సేనానీర భూద్భూరిగుణాన్వితః।
నిజప్రతాప ప్రాకార పరిత్రాత మహీతలః॥

తూర్యప్రణాద సమనంతరమేవ తూర్ణ
మాక్షిప్యయో యవనికా సదృశం కవాటం।
కాంచీపురస్య సమపాదయ దాశువీర
లక్ష్మీవివాహ మిహ కాకాతివల్లభస్య॥

॥ పాలంపేట శాసనము శ్లో 5,9-11

కాకతీయ ప్రశంసా పంచరత్నములు.

శ్రీయుత సాగి వెంకటనరసింహముగారు ఎం. ఏ.

సీ॥ ఆంధ్రక్షమామండలాఖండలుండైన ♦ రుద్రభూపాలు నిర్నిద్రశక్తి
స్వీయరాజ్య ప్రజామేయ రక్షణశీల ♦ గణపతీంద్రుని లోకవినుతకీర్తి
రుద్రమాంబాకటాక్షార్ద్ర సుధాసార ♦ సిక్తవర్ధిత లోకచిత్తరక్తి
వీరప్రతాపరుద్రారూఢ సింహాస ♦ నాసక్త వరదండనాథభక్తి
గీ॥ కారణములుగ నెలకొనగలిగి సార్వ ♦ కాలికానూనకీర్తిని గంటివమ్మ
మమ్ముధన్యులజేసె నీ స్మరణనేడు ♦ రమ్ము తల్లిరో! కాకతిరాజ్యలక్ష్మి.
సీ॥ భాషించితివి శైవఫక్కి సోమనలీల ♦ జానుతెన్గుల తేనెసోనగురియ
వచియించితివి సొంపువచరింప నభినవ ♦ దండిపోకడల నఖండసరణి
పోషించితివి రామభూవిభుకథ భాస్క ♦ రాది కవీశ్వ రామోదఫణితి
ఉత్సహించితి యజ్ఞ సత్సాహసంబున ♦ నుభయ భాషాప్రౌఢి సభలుమెచ్చ
గీ॥ రంగనాథ రామాయణ రమ్యకావ్య ♦ సారమున బెంచితివి నుడికార మార!
మమ్ముధన్యులజేసె నీస్మరణ నేడు ♦ రమ్ము తల్లిరో! కాకతిరాజ్యలక్ష్మి.
సీ॥ చాళుక్యధరణీశ సద్భక్తి యుతదత్త ♦ భద్రేభసంతతి బాళెముండె
పాండ్యావనీశ సంపాదితాఖిల రత్న ♦ చిహ్నితరథములు సిద్ధమయ్యె
రాష్ట్రపాలకజిత రాజ్యసంప్రేషిత ♦ కరములు ధనపరంపరలు వచ్చె
నానావిదేశాగతానూన వస్తువుల్ ♦ వర్తకానీతమై ప్రాప్తమయ్యె
గీ॥ కనులపండువుగా నిన్ని గాంచినట్టి ♦ విమలశీతలదృష్టి ప్రభావమేమొ
మమ్ముధన్యులజేసె నీ స్మరణనేడు ♦ రమ్ము తల్లిరో! కాకతిరాజ్యలక్ష్మి.
సీ॥ అరిరాజ రక్తారుణాంబు వర్షమెగాని ♦ కరుణలే దాజిని గాంచినపుడు
ఘనరత్నమణివస్తుకనక దానమెకాని ♦ 'నాస్తి' లేదర్థుల గాంచినపుడు
నవసుధాస్పదకృతు లవధరించితిగాని ♦ కనలేదు నీరసకావ్యమెపుడు
సత్యధర్మాది ప్రశస్తరీతులెగాని ♦ వినలేదు దుర్జనవిధములెపుడు
గీ॥ చంద్రచందన నిర్మలసాంద్రకీర్తి ♦ గాని దుష్కీర్తి నెన్నడు గాంచలేదు
మమ్ము ధన్యులజేసె నీ స్మరణనేడు ♦ రమ్ము తల్లిరో! కాకతిరాజ్యలక్ష్మి.
సీ॥ నీ మంగళారావ నినద పరంపర ♦ భావిసంపదల సంప్రాప్తి జేయు
నీసూరవర ఘోరసిష్ఠుర వీర్యంబు ♦ వేడిక్రొన్నెత్తురుల్ విరియజేయు
నీయాంధ్రి సత్సుధానిర్మల సూక్తులు ♦ కావ్యకౌతుకలక్ష్మిఁ గ్రాలజేయు
నీ మతాచారసందీప్త ధార్మికజీవ ♦ మార్యమతాసక్తి నలరజేయు
గీ॥ నిన్నుధ్యానింప మోక్షసౌధోన్నత ప్ర ♦ శాంత తత్త్వాత్మ కానందసరణిగూర్చు
మమ్ముధన్యులజేసె నీ స్మరణనేడు ♦ రమ్ము తల్లిరో! కాకతిరాజ్యలక్ష్మి.

కాకతీయులు రెడ్లు.

శ్రీయుత బి. కృష్ణమూర్తిగారు.

నిఖిలప్రజాను రంజనంబుగను నిరుపమాన చరిత్రము"లో కాకతీయులు చతుర్థాన్వయులనియు, శూద్రులనియు తేల్చిరి. కాకతీయులు సూర్యవంశజులమని యొక్క గణపతిదేవ చక్రవర్తి శాసనములయందు పేర్కొనంబడినందు వల్లను, అంతకుపూర్వము నేశాసనమునందును తాము సూర్యవంశజులమని కాని, చంద్రవంశజులమని కాని వ్రాసికొని యుండక పోవుటవల్లను, నదికాక విద్యానాథుఁడు తన త్రితాపరుద్రీయమునఁ గాకతీయులు పైనుద హరించిన రెండువంశజులును గాక రెంటి నతిశయించిన వర్ణమునకు జెందినవారని వర్ణించుటను, బట్టిచూడ శూద్రులగు కాకతీయులు క్షత్రియులై రనుటకుఁ గారణము వర్ణాశ్రమ ధర్మములోజేరిన కులముచేతగాక, క్షాత్రము నుదాల్చి భూమినిజయించి పాలించుటయని యూహింపదగును. లేదా కాకతీయులు క్షత్రియులనువారి వాదమునుబట్టి చూచినను మొట్టమొదటిరోజులలో ననగా రుద్రుని కాలమువరకును కాకతీయులు క్షత్రియులే యనుకొనినప్పటికిని, తరువాత, ననగా గణపతిదేవచక్రవర్తి కాలమునుండియో, లేక ప్రతాపరుద్రుని కాలమునుండియో కాలానుసారముగ జేసిన సంబంధబాంధవ్యములవల్ల నొకప్పుడు క్షత్రియులుగ నుండినను తదుపరి శూద్రప్రాయులై పోయిరని యేలనూహింపరాదో తెలియకున్నది.

కాకతీయులు మొదట రెడ్లుగానుండి తదు

నిఖిలప్రజాను రంజనంబుగను నిరుపమాన దోర్వీర్యసన్నాహ బంధురంబుగను త్రిలింగ సామ్రాజ్యంబును మూడుశతాబ్దంబులు దేదీప్యమానంబుగ సాగించిన కాకతీయ చక్రవర్తులజాతిని దెలిసికొన బలువురు సముపజాత కుతూహలులై యున్నారు. అట్టివారికి కాకతీయజాతిని సువ్యక్తముచేయుట ప్రస్తుత కర్తవ్యమై యున్నది.

కొందరు చరిత్రకారులు కాకతీయులు సూర్యవంశజు లనియుఁ కొందరు చంద్రవంశజులనియు నభిప్రాయ పడుచున్నారు. కాకతీయులు గణపతిదేవచక్రవర్తి శాసనములకుఁ బూర్వపు శాసనములలో తాము సూర్యవంశజులమని కాని చంద్రవంశజులమని కాని చెప్పుకొన యుండలేదు. కాని వారు దుర్జయవంశజులమని చెప్పుకొనినంత మాత్రముననే క్షత్రియులని తలచుటదుర్లభము. ఏలనన పెక్కు తెగలవారు దుర్జయకులస్థులమని చెప్పుకొన్నవారు విష్ణుపాదోద్భవులమనియు చతుర్థాన్వయులమనియు వ్రాసికొనియున్నారు. అటుల జెప్పుకొనినరాజులే, నతవాటిసీమను రుద్రుని కాలమునఁ బరిపాలించుచుండిరి. వారిలో కాకతీయులకు బంధువగు దుర్గరాజుకొడుకు బుద్ధరాజొకడు. కాన నతవాటిసీమరాజు లెటువంటి దుర్జయవంశజులో కాకతీయులు నట్టివారని తేలుచున్నది.

చిలుకూరి వీరభద్రరావుగారు, "ఆంధ్రుల

ఇట్లు రెడ్లు కాకతీయచక్రవర్తుల కాలములో గొప్పసైన్యాధిపతులుగా నుండి వారిమన్నన బడయుటయేగాక వారితో సంబంధ బాంధవ్యములు చేసినట్లు పెక్కు నిదర్శనములు కలవు

కాకతిగణపతిదేవచక్రవర్తి పరిపాలనకాలమున కృష్ణానది మొదలుకొని కాంచీపురము వరకుగల తూర్పుతీరమునంతను కమ్మనాటి రెడ్లు, పాకనాటిరెడ్లు, రేనాటిరెడ్లు చోడుల నుపేరుతో బరిపాలనము చేయుచుండిరి. వీరినందరిని జయించి, ఏకఛత్రము క్రిందికిదీసికొని రావలయునని నిశ్చయించి, తదనుగుణముగా సమర్థులైన మంత్రులను సేనాధిపతులను, నియమించుకొనుటకు నానావర్ణంబుల వారికిని గణపతి నాయకత్వంబిచ్చినట్లుగా సోమదేవరాజీయములో నొక వచనమునుబట్టి దోచుచున్నది. అట్లుజయించిన రెడ్డిరాజులతో కాకతీయులు సంబంధములు నెఱపియుండవచ్చును. లేదా తమస్థానమును బలపరచుకొనుటకై వారు రెడ్లతోసంబంధములు చేసియుండవలెను, గణపతిదేవుడు వెలనాటిని జయించినప్పుడు యాభాగమునం దధికారము ధృఢముగనాటుకొన్నట్లు సేయుటకు వెలనాటి సైన్యాధిపతులతో బాంధవ్యముచేసినట్లు గాన్పించుచున్నది.

పైనుదహరింపబడిన కారణములబట్టియు కాకతీయులు రెడ్డిరాజులతో సంబంధబాంధవ్యములు నెఱపినందునను కొందరు నామాంత్యమున "రెడ్డి" పదమునుజేర్చి వ్యవహరించుటను బట్టియు, కాకతీయులు మొట్టమొదట రెడ్లుగా నుండిరని స్పష్టమగుచున్నది.

——

శ్రీమత్రోల నృపాల సైన్యపతినా విఖ్యాతవిక్రాంతినా
యుద్ధే యేన మహాబలేన సహతే మంథన్యగుండాధిపే।
అన్యే వైరినృపాలకాః ప్రతిదిశం ప్రాదుద్రువం స్తత్క్షణా
త్సింహేనేవ నిపాతితే గజపతా శేషాగజాః క్షుద్రకాః॥

తత్కులే ద్విషతాం జేతా కాటయాఖ్య శ్చమూపతిః।
విచిత్రసంపదాం పాత్రం ప్రసూతః సజ్జనప్రియః॥
తత్పుత్ర శ్చిత్రచారిత్రః కామనామా చమూపతిః।
లోకనాథ పదాంభోజ పూజా నిర్మలమానసః॥

పాలంపేట శాసనము. శ్లో 12, 14, 15

——

కాకతీయరాజ్యము: భౌతిక స్వరూపము

శ్రీయుత రాళ్లబండి సుబ్బారావుగారు. ఎం. ఎ. ఎల్. టి. ఎం. ఎ. యు. యస్.

కాకతీయవంశపురాజు లేలినప్రదే అందుండితిరిగి అమరోటివరకును వ్యాపించిన శము యొక్క సరిహద్దులు, నైసర్గిక స్వరూపము, శీతోష్ణస్థితి, విస్తీర్ణము, రేవు పట్టణములు, వర్తకము, నాగరికత, మొదలగు విషయములు తెలుపుటయే యీవ్యాసము యొక్క ముఖ్యోద్దేశ్యము.

సరిహద్దులు:- దేశచరిత్రకుగలసంబంధము ఇంపీరియల్ గెజిటీరు, చెన్న రాజధాని మొదటి సంపుటము 18వ పుటనుండి, ఈక్రిందివిషయములు తెలియుచున్నవి. కర్నాటకదేశము బీడర్ పట్టణమునుండి దక్షిణదిక్కుగా అనవోని, అనంతపురం, పట్టణములమీదుగా మహిషమండలములోని నందిదుర్గము వరకును వ్యాపించి, అచ్చటనుండి తూర్పుకనుమలనంటి కోయంబత్తూరువరకును వ్యాపించి, అచ్చటనుండి ఉత్తర పశ్చిమదిక్కుగా పడమటి కనుమలనంటి కృష్ణానది పుట్టుస్థలమువరకును వ్యాపించి, అందుండి తిరిగి ఆనదితీరముననే బిడరుపట్టణమువరకునువ్యాపించియుండెను. ఈ సరిహద్దులమధ్యనున్న ప్రదేశమే మొట్ట మొదట కర్ణాటకదేశమని పిలువబడెను. మరియు, అదేసంపుటము 188పుటనుండి, మహారాష్ట్రదేశమున కుత్తరమున నర్మదానది సరిహద్దనియు, దక్షిణమున కృష్ణానదియనియు, పశ్చిమమున అరేబియా సముద్రమనియు, తూర్పున బీడరుపట్టణము మొదలు కొనితూర్పుఉత్తరముగా నందేరు వరకును ప్రదేశము, సరిహద్దనియు తెలియును. ఈ సరిహద్దులకుమధ్యనున్న దేశమే మొదటిమహారాష్ట్రదేశము. ఇట్లు దక్షిణాపథముయొక్క పశ్చిమోత్తరప్రదేశమున, అనగా, మహారాష్ట్రదేశమున దేవగిరినుండి యాదవులును, వారికి దక్షిణమున అనగా కర్నాటకదేశమున ద్వారసముద్రమునేలు హొయసలులును, ఈరెండువంశములవారికిని తూర్పు గాత్రిలింగ లేక ఆంధ్రదేశమున ఓరుగల్లు కాకతీయులును, రాజ్యము చేసిరి.

పై విషయములే కొంత మార్పులతో కేంబ్రిడ్జిహిందూ దేశచరిత్ర మూడవసంపుటము, పుటలు 485- 493లో మూడవ వర్ణింపబడినవి. క్రీ॥ శ॥ 1292 లో హొయసలులకును యాదవులకును మధ్యసరిహద్దుకృష్ణానదియని తలంపవచ్చును. దక్షిణాపథము యొక్క పశ్చిమార్ధభాగమున యాదవ రాజ్యముండెను. దానితూర్పుసరిహద్దు, బీజపూరునకు తూర్పున నుండిగుల్బర్గ, యాదగిరి, కల్యాణి, పట్టణములమీదుగా తూర్పు ఉత్తరముగా మొహర్ పట్టణము వరకును, అందుండి యింకను తూర్పుఉత్తరముగకొనగీతగీసినట్లూహించినచో నేర్పడుచున్నది. ఈగీతకు పశ్చిమముననుండు ప్రదేశము దేవగిరి యాదవులకు చెందెను. తూర్పుననుండు ప్రదేశము కృష్ణానదీముఖమువరకును ప్రప్రథమమున అరుముకొండ రాజధాని

గాగల కాకతీయులదై యుండెను. క్రమముగ వీరు తూర్పుచాళుక్యులరాజ్యమును కబళించి యుండిరి. కాకతీయగణపతిదేవచక్రవర్తి కాలమున జటావర్మసుందరపాండ్యుడు నెల్లూరు తెలుగు చోళవంశపురాజులను జయించుట చేత దక్షిణసరిహద్దు కృష్ణానదీ ముఖప్రాంతమున స్థిరపడెను. నెల్లూరు,దత్తమండలము లనేలిన తెలుగుచోళులదేశము, ఉత్తరమునున్న కాకతీయులకును తూర్పుతీరమునంటి దక్షిణమువరకును వ్యాపించినపాండ్యులకును మధ్యనుండుటచే రెండువంశములవారివల్ల నాటుపోటులను తినుచుండెను. కృష్ణానదికి కొంత దూరముననున్న అదవోనిపట్టణము మొదలుకొని హొయసలపాండ్యుల సరిహద్దుతూర్పు కనుమలనంటివ్యాపించి, తర్వాత మహిషమండలముయొక్క తూర్పుభాగము నంటిపోయి,తర్వాత పశ్చిమముగ నీలగిరి పర్వతములవరకును వ్యాపించెను. ఈప్రకారము హొయసలులు చుట్టుప్రక్కల మూడుదిక్కులనుండువంశములవారినుండితమసరిహద్దులను కాపాడుకొనుచుండిరి. వీరు తరుచు కాకతీయులతోకంటె యాదవులతో పోరాడుచుండిరి. ఈనాల్గువంశములవారి యభిమతములు భిన్నములగుటచేత మహమ్మదీయులుదండెత్తి వచ్చినను వారందరును కలసి వారినియోడింపలేకపోయిరి.

కాకతిరుద్రదేవుని క్రీ॥ శ॥ 1162నాటి అనుమకొండ వెయ్యి స్తంభముల గుడి శాసనము నందలి 4 వ శ్లోకమును బట్టి ఆకాలమునాటి కాకతీయ రాజ్యపు సరిహద్దులు యీక్రిందివిధమున తెలియుచున్నవి:

శ్లో॥ రాజ్యం ప్రాచ్యాం లవణజలధేస్తీర
పర్యన్తమస్య। శ్రీశైలాన్తాం ప్రచర
తిసదా దక్షిణాశాంసమగ్రాం। ప్రాతీ
చ్యాన్తా కటకనికటస్తాయి నీ రాజ్య
లక్ష్మీః। కౌబేర్యాశా తట విలసితే
మాల్యవన్తం ప్రదేశే॥

అనగా, తూర్పున బంగాళాఖాతము వరకును, దక్షిణమున శ్రీశైలము వరకును, పడమట (కల్యాణి) కటకము వరకును, ఉత్తరమున మాల్యవంతమువరకును రుద్రదేవుని కాలమున కాకతీయ రాజ్యమువ్యాపించెను.

క్రీ॥ శ॥ 1180 ప్రాంతమున తూర్పు గోదావరిజిల్లాలోని ద్రాక్షారామమున కాకతి రుద్రదేవుని శాసనములు కనబడుటచేత ఆతని రాజ్యము ప్రాగ్దిశను గోదావరి ముఖద్వారము వరకును వ్యాపించెననుట సత్యము. అకాలముననే త్రిపురాంతకమున గూడ ఆతని శాసనములు కనబడుటచేత శ్రీశైలపు ప్రాంతముగూడ కాకతీయ రాజ్యము లోనిదనుటస్పష్టము. ఇంతేకు పూర్వము గుంటూరు మండలము మొదలుకొని కర్నూలుజిల్లాలోని త్రిపురాంతకము వరకును గలప్రదేశము వెలనాటిచోడులస్వాధీనమునందుండుటచేత కాకతీయుల రాజ్యము ఆభాగమున కుత్తరమునవ్యాపించియుండెను. కాని గణపతిదేవుని రాజ్యకాలమున (1199—1261) ఆతని సేనానాయకుల విజయముల చేతను, ఆతని రాజకీయ సంబంధమైన వివాహముల చేతను ప్రాగ్దేశమునన్న గుంటూరు మండలము నందలి నతవాటి, అమరావతి, రాజులతనికి వశులైరి. ఆతని కాలమునాటి ఉప్పరపల్లి, మోటుపల్లి, ఏకామ్రనాథ, శాసనములాతని యములను తెలుపును. కొలని గణపతిదేవుని శివయోగసారమున సోమమంత్రి ఓరుగంటికి తూర్పుభాగమును అనగా



ఓరుగల్లు కోట.

[By courtesy of H. E H. The Nizam's Archaeological Department.]



యాదగిరిదుర్గము.

[By courtesy of H. E. H. The Nizam's Archaeological Department.]

170B

వేంగిదేశమును, కళింగముయొక్క దక్షిణభాగమును (తూర్పుగోదావరి మండలమును) జయించినట్లు కలదు. రుద్రమదేవికాలమున మొదట త్రిపురాంతకమునేలిన కాయస్థరాజులును, పాండ్యరాజులును, కాకతీయమండలికులును దక్షిణమునను ప్రాగ్దిశను, స్వతంత్రులైనను, తర్వాత ఆమెసేనానాయకులు ఇందులూరి అన్నయదేవుడు, కొలని రుద్రదేవుడు దక్షిణదేశమును (కంచి వరకును) తూర్పు దేశమును(సింహాచలపర్యంతమును,) జయించి ప్రతాప రుద్రుని కాలమునగూడ మంత్రులుగ నుండి కాకతీయ రాజ్యవిస్తీర్ణము తగ్గకుండ ప్రయత్నించిరి. గనుక రుద్రదేవుని కాలమునన్న పశ్చిమోత్తర సరిహద్దులు ప్రతాపరుద్రదేవుని కాలమున గూడ మారకపోయినను, ప్రాగ్దక్షిణదిశలందు మార్పులుగల్గుచు తుదకు దక్షిణమున కంచివరకు కాకతీయసామ్రాజ్యము వ్యాపించియుండెను.

క్రీ॥ శ॥ 1316 లో ప్రతాపరుద్రుని సైన్యాధిపతియగు ముప్పిడినాయకుడు కేరళాధిపతియగు రవివర్మను కంచిదేశమునుండి తొలగించి చోళవంశీయుడగు మానవీరుని కంచిమండలాధిపతిగా నియమించినట్లును, అరులల్ పెరుమాళ్లాలయమునకు రెండు గ్రామములు దానమిచ్చినట్లును, తెలియుచున్నది.(Ep. Ind.Vol 7, P p 128-132).

జంబుకేశ్వరాలయమునన్న ప్రతాపరుద్రుని శాసనమునుబట్టి 14వశతాబ్దాదిని కాకతీయరాజ్యము దక్షిణమున తిరుచునాపల్లివరకును వ్యాపించినట్లు తెలియుచున్నది. (Ind. Ant. Vol XXI, P. 200). కాని కంచికి దక్షిణభాగము సుస్థిరముగ కాకతీయుల పరిపాలనమునన్నుండలేదు. ఇట్లే శివయోగసారమునుబట్టి రుద్రమదేవి, ప్రతాపరుద్రదేవుల రాజ్యకాలములలో సింహాచలపర్యంతముగల కళింగదేశము కాకతీయరాజ్యమున నిమిడియుండెనని తెలియుచున్నను వారిశాసనములు గంజాం, విశాఖపట్టణము జిల్లాలలో కనబడకుండుటచేత వారు దండయాత్రలను మాత్రము జరిపిరనియు, ఆభాగములు సుస్థిరముగ వారి యాధీనమున నుండలేదనియు స్పష్టము. గణపతిదేవుని కాలమునుండి కళింగములోని దక్షిణమండలమగు ప్రస్తుతపు తూర్పు గోదావరిజిల్లా మాత్రము కాకతీయుల స్వాధీనమునందుండెననుటకు అచ్చట దొరికిన వారి శాసనములే తార్కాణము.

నైసర్గికస్వరూపము-

కొండలు, నదులు, సరస్సులు.

ప్రస్తుతపు నైజాము రాజ్యములోని రెండు—మూడవవంతు తూర్పు భాగము, అనగా, రాయచూరునుండి కల్యాణిమీదుగా గోదావరిని దాటి అదిలాబాదువరకుగల ప్రదేశమునకు తూర్పుననున్న భాగముబంగాళాఖాతమువరకును, ఉత్తరమున మాల్యవంతము మొదలుకొని దక్షిణమున కంచివరకును (దత్తమండలములు, గంజాం,విశాఖపట్టణం, జిల్లాలుతప్ప) మిగిలిన ఉత్తరసర్కారులు కాకతీయరాజ్యమున నిమిడియుండెను. ఈప్రదేశముదక్షిణ పీఠభూమియొక్క దక్షిణతూర్పుభాగముననున్నది. చాలభాగముపర్వతారణ్యమయమైయున్నది. నైజామురాజ్యములోని దేశముయొక్క సగటు ఎత్తు 1300 అడుగులు. తక్కిన భాగముయొక్క ఎత్తు800 అడు

గులు. భూభాగము గోదావరి పైన్ గంగ నదులకు త్తరముననున్న అజంతా కొండలు, దక్షిణముననున్న బలఘాటు కొండలుమొద కొని తూర్పుతీరమువరకును అనగా, పశ్చిమోత్తరదిశనుండి ప్రాగ్దక్షిణదిశగా వాలియున్నది. అందుచేతనే నదులుగూడ అట్లే ప్రవహించుచున్నవి. గోదావరినది అట్లుప్రవహించి ఉత్తరమున పైన్‌గంగ, దక్షిణమున మంజీరయను ఉపనదులను చేర్చుకొని, కాకతీయరాజ్యమునకు పశ్చిమోత్తర దిశను సరిహద్దగుచున్నది. మంజీరనది గోదావరివి కలియుప్రదేశమునకు సమీపమున ఇందూరనుపట్టణము (నిజామాబాదు) గలదు. యాదవ రాజ్యము ఈనదులకు పశ్చిమమున బలఘాటు, అజంతకొండలనంటివ్యాపించెను. 1292—1308 సం॥ లలో అల్లాఉద్దీన్ యాదవరాజ్యమునుజయించి, దేవగిరి మీదుగా గోదావరినిదాటి, కాకతీయరాజ్యపు సరిహద్దుపట్టణమగు ఇందూరునుముట్టడించి పట్టుకొని, తర్వాత ఓరుగల్లు చేరెను. (కేంబ్రిడ్జి హిందూదేశచరిత్ర, మూడవ సంపుటము, పుట 115). ఇట్లే 1309-10సం॥లో మాలిఖాఫూర్, నర్మదానదిని దాటిన 8 రోజులకు దేవగిరి సరిహద్దుననున్న నీలకంఠ లేక నెలగొండగ్రామము చేరి అందుండి విజనగరము మీదుగా (యషార్ బరుజ నదుల మధ్యగా) సిరిబార్ లేక సిరిపురము (ఇదిప్రస్తుతము ఖరీం జిల్లాలోనున్నది)కోటనుముట్టడించిపట్టుకొని, బస్తరురాజ్యములోని సునర్‌పాలు పట్టణము మీదుగా గోదావరినదిని దాటి ఓరుగల్లు కోట ముట్టడించెను. ఈ దండయాత్రలను బట్టి దేశమెట్లు వాలినదో, నదు లేదిక్కుగా ప్రవహించు చున్నవో, ఆప్రకారమే శత్రువాహినులుగూడ నడుచుచుండెనని తెలియుచున్నది. నదులు, పర్వతములు, తదితర నైసర్గిక స్వరూపములు చరిత్రవిషయముల కిట్లేసంబంధమును కలియుండును.

కాకతీయ రాజ్యముయొక్క తూర్పు భాగము(గోదావరిజిల్లా మొదలుకంచివరకును గల తీరప్రదేశము) 600 మొదలు1000అడుగుల ఎత్తుననుండును. ఈభాగమునకు పశ్చిమమునగల పర్వత పంక్తికే తూర్పుకనుమల నిపేరు. ఈపంక్తికి శిరోభాగముననే మాల్యవంతముగలదు. గంజాంజిల్లాలో మహేంద్రగిరి (4000 అడుగుల కన్న ఎక్కువఎత్తు), గోదావరి జిల్లాలో పాపి కొండలు (రమారమి 2000 అడుగుల కన్న ఎక్కువ ఎత్తు) కర్నూలు జిల్లాలో నల్లమలెకొండలు (3000 అడుగులకన్న ఎక్కువ ఎత్తు) ఇవి తూర్పు కనుమల లోని ముఖ్యభాగములు. తూర్పు కనుమలగుండా గోదావరి,కృష్ణా, ఉత్తరపినాకిని, పాలారునదులు విశాలమగు మార్గములను చేసికొని బంగాళాఖాతములో కలియుచున్నవి. ఆనదులయొక్క లోయలలో పచ్చిక బయళ్లు, కారడవులు, పంటభూములు గలవు. గోదావరినది రమారమి 200 మైళ్లు కాకతీయ రాజ్యమునకు పశ్చిమోత్తరదిశలయందు ప్రవహించి, సహజమైన సరిహద్దుగ నేర్పడి, యాదవ, మహమ్మదీయ దండయాత్రలకు గట్టియాటంకములను బెట్టెను. ఈనదికి కుడివైపున నుండు గొప్ప యుపశాఖ మంజీర. ఇదియాదవ కాకతీయ రాజ్యములకు క్రాంతవరకు పశ్చిమ సరిహద్దుగా నుండెను. కృష్ణానది కాకతీయ యాదవ రాజ్యములకును, హొయసల కర్ణాటరాజ్యములకును

మధ్య సరిహద్దుగనుండెను. ఈనది కాకతీయ రాజ్యమునకు మొదటి దక్షిణపు సరిహద్దుగా 400మైళ్ళు ప్రవహించెను. దీని యుపనదులు తుంగభద్ర, మలప్రభ, భీమ. కాకతీయ రాజ్యము యొక్క దక్షిణ పశ్చిమభాగములందు ప్రవహించిన ఈనదీప్రదేశములు కొంతకాలము హొయసల, యాదవ, కాకతీయ రాజులకు యుద్ధకారణములయ్యెను. తుదకు కృష్ణానది యాదవులకు, హొయసలులకు మధ్య సరిహద్దయ్యెను. రాయచూరు మండలము మొదలుకొని కల్యాణిమీదుగా ప్రాగుత్తరమునను న్న ఇందూరు, ఆదిలాబాదు వరకుగలప్రదేశము యాదవులకు కాకతీయులకు సరిహద్దయ్యెను. అనగా, తుంగభద్ర-కృష్ణలోయయు, కృష్ణ-భీమ లోయయు, మంజీర-గోదావరి లోయయు, గోదావరి-పైన్ గంగలోయయు, కాకతీయరాజ్యమునకు వరుసగా దక్షిణ, పశ్చిమ, పశ్చిమోత్తర దిశలయందు సహజమైన సరిహద్దులుగా నేర్పడెను. హైదరాబాదు మీదుగా ప్రవహించి కృష్ణా నదిలో కలియు ఉపనది మూసి. ఇట్లే, అనేక ఉపనదులు దేశమునగల కొండలలో పుట్టి, దేశము పీఠభూమి యగుటచేత విశేషముగా వ్యవసాయమున కుపయోగపడక బహువేగముగ ప్రవహించుచున్నవి. ఇట్టిదే హారంగల్లుజిల్లాలోని మోర్వంచనది. ప్రతాపరుద్రుని సైన్యాధిపతియగు రేచెర్లరుద్రారెడ్డి ఈనదికి కట్టుకట్టి, రామప్ప చెరువు నేర్పాటు చేసెను. దేశమునందనేక బావులు, చెరువులు, సరస్సులు, కాలువలు గలవు. ఓరుగల్లు జిల్లాలోని ములుగు తాలూకాలో రామప్ప, లక్నవరం సరస్సులును, పాఖాల తాలూకా లోని పాఖాల సరస్సును గొప్పవి. రామప్ప చెరువు 82 చతురపు మైళ్ల విస్తీర్ణముగల భూమినుండి వచ్చు నీటిని నిలవచేయును. చెరువుక్రింద ఆయకట్టు 5046 యకరములు. చెరువుక్రిందనే రామప్ప దేవాలయము కలదు. ఇందు రేచెర్ల రుద్రి సేనాని శిలాశాసనముగలదు. ప్రతాపరుద్రుని కాలమునందిదియొక గొప్ప సైన్యపు విడిదిగా నుండెను. భూమి సుద్ద ప్రదేశము. ఇందు ముఖ్య పంటకు తబియని పేరు. ములుగు తాలూకాలోని లక్నవరం సరస్సు 75 చతురపు మైళ్ల విస్తీర్ణముగల భూమినుండి వచ్చు నీటిని నిలవ చేయును. ఈప్రాంతములందు సంవత్సరమునకు సగటున వర్షపాతము 32 అంగుళములు. రమారమి 1400 యకరములనేల దీనికింద తడువు. దీని ఆయకట్టు 3535 యకరములు. ఈ సరస్సునకు అడ్డముగా కట్టుకట్టి అనేక పంటకాలువల ద్వారానీటినిపంటలకుపయోగించుచున్నారు. పాఖాల సరస్సు, కృష్ణానది కుపనదియగు మానేరు నదియొక్క నీటిచేత పోషింపబడుచున్నది. ఇది ఓరుగల్లునకు 32 మైళ్లదూరమున తూర్పుగా నున్నది. దీని చరిత్ర ఆసరస్సు గట్టుపై గల శిలాశాసనమున గలదు. ఈ ప్రాంతమున సంవత్సరమునకు సగటున వర్షపాతము 40 అంగుళములు. 80 చతురపు మైళ్ల విస్తీర్ణముగల ప్రదేశమునుండి వచ్చు నీరు నిలవ చేయబడును. 17258 యకరముల భూమి దీని నీటిచే తడియుచున్నది. ఈసరస్సు క్రింద ముఖ్య పంటలు వరి, చెరుకు, తమలపాకులు. ఈ ప్రాంతము నందనేక శిథిలములైన కట్టడములు, ఆలయములు, గ్రామములు గలవు. ప్రస్తుతము కారడవులతో

నిండిప్రజాహీనముగానున్నను ప్రతాపరుద్రుని కాలమునందీభాగ మున్నతదశ ననుభవించె ననుటకు సంశయము లేదు.

ఈప్రకారము కాకతీయ రాజ్యము నంతనేక భాగములలో ఇంకననేక సరస్సులుం డెడివి. అట్టివి జగత్కేసరి చెరువు, కాట సముద్రము, సబ్బిసముద్రము, చౌండ సముద్రము, ఎఱకసముద్రము మొదలగునవి.

శీతోష్ణస్థితి, వర్షములు, జనసంఖ్య.

కాకతీయరాజ్యముత్తరమున 20 వ అక్షరేఖకును (పైగంగనదికిని, బస్తరు దేశమునకును పైభాగము), దక్షిణమున 14వ అక్షరేఖకును (దత్తమండలమునకును, నెల్లూరు మండలమునకును క్రిందిభాగము), ఒకప్పుడు 13వఅక్షరేఖకును(కంచిమండలమునకుదక్షిణ భాగము) మధ్య వ్యాపించినట్లు వారిశాసనములే నిదర్శనములు. మరియు, పశ్చిమమున 77వ విషువాంశరేఖకును (బల్లారి, రాయచూరు, కల్యాణి, నిజామాబాద్‌లేక ఇందూరు, అదిలాబాద్, మండలములకు పశ్చిమభాగము), తూర్పున 82వ విషువాంశరేఖకును (తూర్పు సముద్రపుతీరము) మధ్యని మిడియున్నది. చాలప్రదేశముదక్షిణాపథపు పీఠభూమిపైని సగటున 1300 అడుగుల కెక్కువ యెత్తున నుండుటచేత శీతోష్ణస్థితి బాగుగ నుండును. గాలియందు తడిలేక చల్లదనముండును. దేశమునందెడారులులేని కారణమున వేడిగాల్పులు తగలకున్నను వేసవికాలమునందు ఎండవేడిమి విశేషముగా నుండును. సంవత్సరమునకుసగటువేడిమి 82° మాత్రమే. దేశముయొక్క ఉత్తరభాగమున చలిమెండు. దేశమునందడవులు విశేషముగానుండుటచేత ఈశాన్యమూలనుండి వీచు వర్షవాయువు లెక్కువవర్షమును, నైఋతి మూలనుండి వీచువర్షవాయువులు కొద్దివర్షమును ఇచ్చుచుండును.

సంవత్సరమునకు వర్షపాతము దేశము యొక్క ఉత్తరభాగమున 60 మొదలు 120 అంగుళముల వరకును, తక్కిన భాగమున 40 మొదలు 60 అంగుళముల వరకును ఉండును. తూర్పుతీరమున (కంచిమొదలు గోదావరిమండలమువరకు) వర్షములెక్కువగ నుండుటచేతను,నదులు కాలువలు చెఱువులు మెండుగ నుండుటచేతను, భూమి పీఠభూమిగాక నల్లరేగడి నేలయగుట చేతను, ఫలవంతమగుటచేతను, ధాన్యము ప్రత్తి చెఱుకు పైరులు ముఖ్యముగ పండును. పశుసమృద్ధి గల్గియుండుటచేత వ్యవసాయమునకు చాల అనుకూలము. దత్తమండలమున వేరుశనగ, ప్రత్తి ,నీలిమందు, జొన్న ముఖ్యమైన పంటలు. నైజాంరాజ్యమునందలి కాకతీయ రాష్ట్రమున పశ్చిమోత్తరభాగమున ప్రత్తియు తక్కిన భాగమున రాగి, నువ్వు, ధాన్యము, నీలిమందును పండును. అడవులు విశేషముగా నుండుటచేత చేకు, మద్ది, సాలకర్ర, విశేషముగా వారుకును. శింగరేణి యందటివల రాక్షసిబొగ్గు దొరికినది. కాకతీయుల రాజ్యమున బంగారము, వజ్రములు దొరుకు గనులుండెననియు, ఆకారణమున రాజులు విశేషధనవంతులుగ నుండిరనియు, ఢిల్లికి తర్వాత హిందూదేశమున భాగ్యవంతమైన గొప్పపట్టణమోరుగల్లే యనియు, తెలియును.

జనసంఖ్య తూర్పుతీరపు మండలములలోనే ఎక్కువగ నుండెను. ప్రజలు

ద్రవిడ జాతికి చేరిన హిందువులు. తెలుగు వారు గోల్కొండ నుండి తూర్పుతీరము వరకు నివసించిరి. పశ్చిమోత్తరమున మహారాష్ట్రులు (శక-ద్రవిడులు), దక్షిణ పశ్చిమ భాగమున కర్నాటకులు, నెల్లూరు మొదలు కంచి వరకుగల ప్రదేశమున అరవలు, నివసించుచుండిరి. ఆయా జాతులచేత వారివారి భాషలు మాట్లాడబడుచుండెను. ద్రవిడ జాతులే గాక అడవిప్రాంతములందు అనాది జాతులవారు నివసించుచుండిరి. నల్లమలె కొండలలో చెంచులును, ఓరుగల్లుప్రాంతమునందు ఎఱుకలును, గోదావరిమన్యప్రాంతములందు కోయలును, వారివారి భాషల నువాడుచుండిరి. జనసంఖ్య రమారమి నూరులక్షలుండెను.

విస్తీర్ణము, వర్తకము, రేవుపట్టణములు, నాగరికత.

రాజ్యముయొక్క దక్షిణ పశ్చిమ మూలనుండి (బల్లారిరాయచూరుమండలములనుండి) బస్తరు వరకు 500 మైళ్ళుదూరముండును. ఇట్లే అదిలాబాదుమొదలు కంచివరకునురమారమి 500మైళ్ళు. రాజ్యముయొక్క విస్తీర్ణ మొకలక్షమైళ్ళు. ప్రస్తుతపు నైజాం రాష్ట్రముకన్న ఎక్కువ విరివిగల్గియుండెను. కాకతీయుల శాసనములు దత్తమండలమునను, చిత్తూరు చంగల్పట్టు, నెల్లూరు,జిల్లాలయందును, గంజాం విశాఖపట్టణంజిల్లాలు తప్ప మిగిలిన ఉత్తరసర్కారులలోను, నిజాం రాష్ట్రములోని తూర్పుననున్న 7 జిల్లాలలోను దొరికినవి. గనుక, ఈభాగమంతయు వారి రాజ్యమున నిమిడియుండెను. అనగా, ప్రస్తుతపు నిజాంరాష్ట్రమునకు $1\frac{1}{2}$ రెట్లు పైగా విస్తీర్ణము గల్గియుండెనని చెప్పవచ్చును.

గణపతిదేవునికాలమున తూర్పుతీరమును జయించినతోడనే విదేశములతో వర్తకము విరివిగా సాగనారంభించెను. గుంటూరు జిల్లాలోని మోటుపల్లి గొప్ప రేవుపట్టణము. తూర్పున బర్మా, చైనా, తూర్పుదీవులు, సింహళముతోడను, పశ్చిమమున అరేబియా పారసీకము, ఈజిప్టు, దేశములతోడను వర్తకము సాగుచుండెను. గణపతిదేవుని మోటుపల్లి శాసనమునుబట్టి, విదేశవర్తకమువృద్ధి చేయుటకై యాతడు కూఫశుల్కముతప్ప తక్కిన పన్నులనన్నిటిని కొట్టివేసినట్లును, వర్తకులను వారి యోడలను రక్షించినట్లును, తెలియును. ఓడదొంగలను శిక్షించెను. ఆయా వస్తువులపై సుంకములను నిర్ణయముచేసెను. ఆకాలమున శ్రీగంధము, కర్పూరము, ముత్యాలు, దంతము, లోహములు, నూలుబట్టలు, కంబళ్లు, సుగంధద్రవ్యములు, మిరియాలు, రత్నములు, ఎగుమతి చేయబడుచుండెను. పట్టుసామానులు, గాజు, చీనాకర్పూరము, పంచదార, గుఱ్ఱములు దిగుమతి యగుచుండెను. ఇట్లే, మచిలీపట్టణముకూడ ఆకాలమున గొప్ప యోడరేవుగాను వర్తకస్థలముగా నుండెను.

కాకతీయుల యొక్కయు యాదవుల యొక్కయు నాణెములు విశేషముగా దొరికినవి. బంగారము, వెండి, రాగి నాణెములు అనేకరకములవి, విలువగలిగినవి, యుండెను. ఆకాలమున మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసిన వ్రాతలను బట్టియు,మార్కోపోలో మొదలగువిదేశయాత్రికులవర్ణనలనుబట్టియు క్రీడాభిరామమును శాసనములను బట్టియు, మాడలనియు, గండ గోపాల మాడలనియు,

ప్రతాపమాడలనియు, రుద్రిమాడలనియు, నిష్కములనియు, రూకలనియు, ద్రిమ్మములనియు, ఫణములనియు, టంకములనియు, వరహాలనియు, చిన్నములనియు, పేర్లుగల నాణెములుగలవని తెలియును. హనుమకొండనుండి యోరుగల్లునకు బోవుమార్గముననున్న ఖాన్ సాహెబ్ తోటవద్దనున్న శిలాశాసనమునుబట్టి గణపతిదేవుని కాలమున వర్తక సామగ్రిపై నియమితములైన సుంకములు వసూలుచేయబడెననియు తెలియును దక్షిణహిందూదేశశాసనావళిలోని 734 నంబరు శాసన మిదియె. దానినిబట్టి ఈక్రిందివిషయములు తెలియుచున్నవి—

"శ్రీమన్మహామండలేశ్వర కాకతీయపురవరాధీశ్వర గణపతి దేవమహారాజులు సర్వధారి సం॥ న, శ్రీ వీరభద్రేశ్వరదేవరకు భోగమున కిచ్చిన ఆయం సుగంధములందు మాడకు పాతిక; మిరియాలు, తేనె మొ॥ వాటియందు మాడకు పాతిక; తగరం, సీసం, రాగి, మొ॥ లోహాలందు తులానకు పలము; చందనమున తులానకు పలము; కర్పూరమున వీశకు 2 చిన్నములు; జవాదిమాడకు పరక; పట్టునూలు చవరాలు, తులావకు చిన్నము; పసుపు, మాడకు అరవీసము, దంతము పట్టు-మాడకు పాతిక, పవడములు వీశెకు చిన్నము; ముత్యము, రుద్రాక్ష, కాటుపూసలు, మణులు; మాడకు వీసము; నీలిమందు మాడకు రెండు వీసములు; పోకలు లక్షకు పాతిక; ఫలజాతులు, ఊలుగాయలు బండికి పాతిక; అపరాలు మానెడు ఈమొదలుగా సుంకనిర్ణయము చేయబడినది.

అనేకరకముల పరిశ్రమలు దేశమునందు వృద్ధిపొందుచుండెను. క్రీడాభిరామమునందు వర్ణింపబడిన సంతలు, వృత్తులు, పలురకములనగలు, వీటినన్నిటినిబట్టి చూడగా ఆకాలమున వర్తకము దేశములోని వేరువేరు రాజ్యములతోడను, విదేశములతోడను, విరివిగా జరుగుచుండెననియు, ప్రజలుపలుసౌఖ్యములననుభవించుచు నాగరికులై యుండిరనియు, తెలియును.

WR NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.



నాలుగవ శాలభంజిక.

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.





హనుమకొండ సహస్రస్తంభదేవాలయము—ఒకస్తంభము.

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.

కాకతీయులు : కళింగము.

మ. రా. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు.

ఓరుగల్లు రాజధానిగా ఆంధ్రదేశమును బరిపాలించిన కాకతీయులకును, గంగవంశ భూపతులచేత పరిపాలితమైన కళింగమునకును ఎట్టిసంబంధము కలదో ఇంతవర కెవ్వరును చర్చించి యుండలేదు. కాకతీయులు కళింగమును గూడ పరిపాలించియుండరా? కళింగగజపతులు కాకతీయ సామ్రాజ్యమున ఎప్పుడైన అధికారము నెఱపియుండిరా? ఈవిషయములు ఇంతవఱకు చక్కగ పరిస్ఫుటముగాని రహస్యములుగనే యున్నవి. వీటికి సంబంధించిన యాకరములను సాధ్యమైనంతవరకు సేకరించి, వీటినిగుఱించి చర్చించుటయే యీవ్యాసము యొక్క యుద్దేశము.

కాకతీయులకును, కళింగమునకునుగల సంబంధమును గుఱించి చర్చించుటకు పూర్వము కళింగముయొక్క సరిహద్దులను గుఱించి యించుక తెలిసికొన వలసియున్నది. కళింగదేశమేది? దానిసరిహద్దులేవి, యను విషయమున చాలయభిప్రాయభేదములుకలవు. తమ ఒరిస్సా దేశచరిత్రమున యమ్. యమ్. గంగులీగారు కళింగమునకు సరిహద్దులనిట్లు తెలిపియున్నారు: (౧) ఉత్తరమున వైతరణీనది (౨) దక్షిణమున గోదావరినది (3) తూర్పున బంగాళాఖాతము (౪) పశ్చిమమున ఒరిస్సాసామంతసంస్థానములు. ఫ్లీటుదొరగారుకూడ "కర్ణాటకమును బరిపాలించిన పాలకవంశములు" అనుతమ గ్రంథమున మహానదీ గోదావరులకు నడుమ వ్యాపించియుండిన దేశము కళింగమని చెప్పియున్నారు. ఉత్తరసర్కారులుకూడ కళింగముననే చేరియుండినట్లు డాక్టరు భండార్కరుగారు తమ 'డక్కనుదేశ ప్రారంభ చారిత్రము' నజెప్పియున్నారు. కాప్టన్ దొరగారు మహానది గోదావరీనదులనడుమనున్న దేశమే కళింగమని తమ 'ప్రాచీనహిందూదేశ' మను గ్రంథమున వ్రాసియున్నారు. కళింగదేశము యొక్క సరిహద్దులను గుఱించి ఇట్లు అభిప్రాయభేదములు చాలకలవు. పశ్చిమోత్తరపు సరిహద్దులవిషయము ఎటులున్నను, మనకుముఖ్యముగ గావలసినది కళింగము దక్షిణపుసరిహద్దును గుఱించియే. కళింగము గోదావరినది వరకు వ్యాపించియుండెనా? లేదా? చాలమంది గోదావరినదివఱకు వ్యాపించియుండినట్లే చెప్పుచుండుటచేత మనమును అదిసరియైనదే యని ప్రస్తుత మంగీకరింతము. వ్యాసము ప్రధానముగ కళింగము సరిహద్దులనుగూర్చినది కాదు కనుక, ఈచర్చ యింతటితో కట్టిపెట్టి, అది యొకవేళ గోదావరినదివరకు గూడ వ్యాపించియుండెననియె నమ్ముదము. ఈనమ్మకమునకు గూడ మనకించుక ఆధారము లేకపోలేదు. క్రీ.శ. పదుమూడవశతాబ్దిలో నుండిన మంచన కవి తనకేయూర బాహుచరిత్రమున పిఠాపురము కళింగములోనిదిగనే వర్ణించియున్నాడు. అదియునుంగాక కళింగదేశమును పరిపాలించిన మాఠర వంశప్రభువైన వాశిష్ఠీపుత్రశ్రీశక్తివర్మమహారాజు రాజధాని పిఠాపురమే. ఈకారణములవలనగూడ పిఠాపురము మొదలుగాగల యుత్తరదేశమైమును కళింగములోనిదిగనే నిర్ణయింపవచ్చును.

కాకతీయుల శాసనములేవియు కళింగమున గనబడకపోవుట వలన దానికి సమీపస్థదేశమునందలి శాసనముల వలననే కాకతీయులకు, కళింగమునకు గల సంబంధమును

నిశ్చయింపవలసి యుండును.

కాకతీయుల మొట్టమొదటి శాసనము కళింగప్రాంతమున, అనగా గోదావరి మండలములోని ద్రాక్షారామమున త్రిభువన చక్రవర్తి రాజరాజదేవర ౧౩వ విజయరాజ్య సంవత్సరమున గాన్పించుచున్నది. ఇందు అన్నకొండ రుద్రదేవుని పెద్దగడ ఇనంగల బ్రిమ్మరెడ్డి దాక్షారామ భీమేశ్వరునికి దీపదానము చేసినట్లు కలదు.[1] కాకతి రుద్రదేవరాజు దేదాక్షారామమున మఱియొకశాసనముకలదు.[2] అది రాజరాజు ౨ (3)వ విజయరాజ్య సంవత్సరమునాటిది. కాకతి రుద్రదేవరాజుల పెండ్లము దన్నమదేవులు భీమేశ్వరునికి దీపదానముచేసెనని యీశాసనము తెలుపుచున్నది. ఈ రెండు శాసనములలోను శకవర్షసంఖ్య లేకపోయినను, రాజరాజదేవని విజయరాజ్య సంవత్సరములు తెలుపబడి యుండుటచేత శకవర్షమును దెలిసికొనవచ్చును. పై శాసనములందు పేర్కొనబడిన రాజరాజదేవరు రెండవ కులోత్తుంగుని యనంతరము చోళరాజ్యమును పరిపాలించినవాడు. శాసనములనుబట్టి యతడు శకవర్షము ౧౦౬౭—౧౦౬౮ లో సింహాసనమునకు వచ్చినట్లు తెలియుచున్నది. దీని ప్రకారము కాకతిరుద్రదేవుని మొదటి శాసనము శకము ౧౦౮౦-౧౦౮౧వలోను, రెండవశాసనము శకము ౧౦౮౦-౧౦౮౧లోను వేయబడినవని తేలును. ఈ పై రెండు శాసనములునుగాక, ఈతని శాసనములు దాక్షారామమున మఱి రెండుకలవు. అందొకటి శకము ౧౧౦౧ నాటిది.[3] రెండవది శకము ౧౧౦౮ నాటిది.[4] ఇవి రెండునుగూడ భీమేశ్వరస్వామికి చేయబడిన దానములనే తెలుపుచున్నవి. అడప, దడప రుద్రదేవని శాసనములు మనకు దాక్షారామమున గాన్పించుచునే యున్నను, ఇప్పటి గోదావరీ మండలపు సరిహద్దుల కావలిదేశమున మాత్రము ఒక్కటియు గనబడదు. ఇన్ని శాసనము లున్నను అవి యొక్క చరిత్ర విషయమునైన దెలియజెప్పుట లేదు.

ఈ కాలమున వేంగిదేశ మంతయు వెలనాటిచోళుల స్వాధీనముననుండెను. వెలనాటి చోళులకును, కాకతీయులకును గల సంబంధ మెట్టిదియో మనకు తెలియదు కాని శాసన సహాయమున మనమీవిషయములు గొంత తెలిసికొనవచ్చును. పల్నాడు, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, కొంతవఱకు నర్సారావుపేట తాలూకాలు—గుంటూరు మండలములోని వన్నియు—వెలనాటిచోళుల యధికారమునే దలదాల్చెను. ఈరీతిని గుంటూరు మండలమేకాక కర్నూలు మండలములోని త్రిపురాంతకము వఱకు వారిరాజ్యమువ్యాపించియుండెననుటకు త్రిపురాంతకములోని వారిశాసనములే తార్కాణము. త్రిపురాంతకము వఱకు వ్యాపించిన వెలనాటి చోళరాజ్యమునకు కాకతీయరాజ్యము సరిహద్దుననున్నది. మొదటికాకతి ప్రతాపరుద్రుని శాసనములు త్రిపురాంతకమునను, తూర్పున గోదావరిజిల్లాలోనుకూడ గనబడుటచేత, కాకతీయులు తమరాజ్యమును ప్రాగ్దిశ విస్తరింపజేసికొనుటకై కాకతి ప్రోలరాజు నుండియో, లేక యాతనికొడుకగు మొదటి ప్రతాపరు

---

1 S. I. I nsc, Vol IV. no 117.
2 S. I. I nsc Vol IV. no 1095.
3 Elliot's collection, 15—6—26, P 207.
4 S. I. I nsc, Vol IV, no 1155.

ద్రుని కాలమునుండియో, ప్రయత్నింపుచు వచ్చిరనుటకు సందియములేదు. ఈప్రయత్నము కాకతి ప్రోలరాజు కాలముననే జరిగియుండ వచ్చును. కాని తండ్రికంటె కొడుకేఎక్కువ జయశీలుడనియు, తండ్రివేసిన పునాదులను బలపఱచి సామ్రాజ్యమును నిర్మించుటకు కొడుకే గొప్పప్రయత్నము చేసెననియు, శాసనములను బట్టి మనము నిశ్చయింప వచ్చును. ఈవిధమైన ప్రయత్నములలోనే కాకతీయులకును వెలనాటిచోళులకు నొకరికొకరికి శత్రుత్వ మేర్పడెను. ఇట్లనుటకు మనకొక యాధారముకూడ గలదు. వెలనాటి రెండవ చోడయరాజు (శక ౧౦౮౫–౧౧౦3) శాసన మొకటి దాక్షారామమున గలదు.[5] అది శక వర్షము ౧౦౯౧ నాటిది ఆశాసనము నందలి ప్రశస్తిలో చోడయరాజు "కాకతిప్రోల నిర్దహన" అని కీర్తింపబడి యున్నాడు. దీని ననుసరించి యతడు కాకతి ప్రోలరాజును దహించినవాడు అని తేలుచున్నది. కాకతిప్రోలరాజు శాసనములు ఇంతవఱకు రెండుమాత్రమే తెలియవచ్చినవి. (౧)శకము ౧౦32 నాటిది.[6] (౨) శకము ౧౦3౯ నాటిది.[7] వీటిలో మొదటిశాసనమున నొక ప్రోలరాజు పేర్కొనబడెను. అతడితడగునా కాదాయని యించుక సంశయింపవలసి యున్నను రెండవది యాతని దగుట నిశ్చయము. ప్రోలరాజకుమారుడైన మొదటి రుద్రదేవని మొదటిశాసనము శ ౧౦౮౦ నాటిదే.[8] రుద్రదేవరాజు ఎప్పుడు రాజ్యమునకు వచ్చినదియు మనకు నిశ్చయముగ దెలియదు. వెలనాటి చోడడు కాకతిప్రోలని దహించిన దెప్పుడో మనము నిశ్చయముగ జెప్పలేముకాని యీపని నాతడు యువరాజుగనుండినప్పుడో లేక, సింహాసన మెక్కిన మొదటిదినములలోనో, చేసియుండవచ్చును. వెలనాటిచోళులకును, ఓరుగంటి కాకతీయులకును ప్రోలరాజునాటినుండియు శత్రుత్వముండుటచేతను, వెలనాటిచోళరాజ్యమైన దాక్షారామప్రాంతమున ప్రోలరాజు కుమారుడైన రుద్రదేవుని శాసనములు కాన్పించుచుండుటచేతను ఆప్రాంతమునకు రుద్రదేవరాజు దాడివెడలియుండుననియే యూహింపదగి యున్నది. ఈప్రాంత మంతయు నీతడు జయించినందువలననే ఈతని రాజ్యమునకు దూర్పుదిశను లవణజలధియే సరిహద్దయ్యెను. ఈతనిరాజ్యవిస్తృతి అనుమకొండ శాసనమునకు నిట్లు తెలుపబడినది.

రాజ్యం ప్రాచ్యాం లవణజలధే స్తీరపర్యన్తమస్య
శ్రీశైలాన్తం ప్రచరతిసదా దక్షిణస్యాం సమగ్రం
ప్రాతిచ్యాన్తా కటకనికటస్థాయినీ రాజ్యలక్ష్మీః
కావేర్యాశాంతవిలసితా మాల్యవన్తం ప్రదేశే

శకము ౧౧౦౮కి పిదప రుద్రదేవనిశాసనములు గోదావరిమండలమున గానరావు. ఈ శాసనములవలన కాకతీయులు కళింగము సరిహద్దులవఱకు వచ్చిరని స్పష్టపడుచున్నను, కళింగముపై దండెత్తిరో లేదో, తెలియుటలేదు.

మొదటి ప్రతాపరుద్రుని యనంతరము రాజ్యమున గొంత సంక్షోభము కలగెను. మహాదేవచక్రవర్తి రాజ్యభారమును వహించెను. ప్రతాపరుద్రుడు గతించిన సంవత్సరమేదో, ఆతని సోదరుడు మహాదేవరాజు రా

5 S. I. I. Vol IV, no 1242.
6 Ep. coll. 316-1915.
7 Ep. Ind. Vol IX, P 256.
8 S. I. I. Vol IV. no 1107.
9 Ind. Ant. Vol. XI.

జ్యమునకు వచ్చిన సంవత్సర మేదో, మనకు స్పష్టముగ దెలియదు. శకము ౧౧౧౭ వఱకు మొదటి రుద్రదేవుడు రాజ్యము చేయుచుండినట్లు శాసనముల నిదర్శనము కలదు.[10] గణపతిదేవ చక్రవర్తి యొక్క ౬౨వ విజయరాజ్యసంవత్సరము శకవర్షము ౧౧౮౨ అయినట్లు ఆతని త్రిపురాంతక శాసనము[11]వలన దెలియుచుండుటచేత అతడు శకవర్షము ౧౧౨౦లో సింహాసన మెక్కినట్లు స్పష్ట మగుచున్నది. కావున శకవర్షములు ౧౧౧౭, ౧౧౨౦ల లోపుననే మొదటిరుద్రదేవుడు కాలముచేయుటయు, ఆతనివెనుక మహాదేవరాజు సింహాసనమెక్కి కొంతకాలము రాజ్యముపాలించి కాలవశుడగుటయుసంభవించినట్లు తెలియదగియున్నది. మహాదేవరాజు మూడునాలుగు సంవత్సరములకంటె ఎక్కువ కాలము రాజ్యముచేయలేదు. మొదటి రుద్రదేవుని మరణానంతరము కాకతీయసామంతులు కొందరుతిరుగబడి దేశము నల్లకల్లోలముకావించిరని పాలంపేట శాసనములోని[12] యీక్రిందిశ్లోకమువలన దెలియుచున్నది.

శ్రీమద్రుద్రనరాధిపే రిపుమహీపాలాది ప్రజ్రా
వమ్ యాతే కాకతి నాథభోగ్యవిలసత్ పృథ్వీకరా
కర్షణేసంభ్రాంతాః సమముత్థితాః సరభసం వైరి
క్షమాపాలకాః యేక్రగిరి—రణాంగణేషు విజితా
విఖ్యాత? (వికాం)తినా॥

మహాదేవరాజు రాజ్యము కూడ ప్రశాంతముగ నుండినట్లుగనబడదు. కాకతీయులకును, యాదవులకును యుద్ధములు జరుగుచుండెను.[13] ఈకారణమువలన సమయము కనిపెట్టినవారై ప్రాగ్దేశముల నున్న మాండలికులు స్వాతంత్ర్య పతాకములనెత్తిరి. వీరి నందఱను జయించి రుద్రదేవుని సామ్రాజ్య సంస్థాపన ప్రయత్నమును సఫలముచేసి రాజ్యమును, తాతతండ్రుల పేరుప్రతిష్ఠలను, గాపాడవలసిన భారము గణపతిదేవునిపై బడెను. రాజ్యమున కంటకములవలె నున్న యీ మాండలికులనుజయించుటకుపూర్వముగణపతిదేవుడు చుట్టుపట్టులనున్న సామంతులు కొందఱితో సంబంధబాంధవ్యములుచేసితనస్థితిని, రాజ్యమును కట్టుదిట్టముచేసికొనెను.[14] రాజ్యము నీరీతినికట్టుదిట్టము చేసికొనినపిదపఆతడుపూర్వ దిగ్విజయ యాత్ర సాగించెను. శకవర్షము ౧౧౦౮కితరువాత దాక్షారామమునగానవచ్చు మొదటి కాకతీయశాసనము శకము ౧౧౩౪ నాటిది. ఇది 'కాకతిరాజ్యసమర్థు' డని బిరుదందిన రేచర్ల రుద్రారెడ్డి సామంతుడు రాజ

10 ఆంధ్రపత్రిక, సారస్వతానుబంధము, రుధిరోద్గారి, భాద్రపదమాసము.

11 Ep. coll. 196 (1905).

12 Hyderabad Archaeological Series, No. 3, P 4 Verse 21.

13 Historical Sketches of the Ancient Dekkhan K. V. S. Aiyer, Bhandarkar's Early History of the Dekkan.

14 వెలనాటిని జయించి గణపతిదేవుడు జాయపనాయనుని వశపఱుచుకొని, ఆతనిసోదరీమణులైననారమ పేరమలను వివాహమాడి, జాయపనాయనుని తనగజసైన్యమున కధిపతిం గావించెను. E P. Ind. Vol III, P 84. గణపతిదేవుడు తనసోదరి మేలాంబికను నాతవాటివిషయాధిపతియైన బుద్ధరాజు కొండవకోటగల వక్కడి మల్లరాజునికిచ్చి పెండ్లిచేసి, నాతవాటిరాజులతో బంధుత్వము నెఱపెను. (EP. coll. 204-1903) ఇందువలన నేనతవాటి రుద్రుడు గణపతి మఱందియని శాసనముల పేర్కొనబడెను. EP. Ind. Vol IV, P 159. Text line 8). ఇట్టి సంబంధములమూలమున నే గణపతికూతురు గణపాంబ అనురావతి ప్రభువయిన కోటబేతరాజు భార్యయయ్యెను. (EP. Ind. Vol III, P 94). కొట్ట కొండవకోటరాజు భార్యలలో కాకతివంశపు నాగమయొకతె (EP. coll, 261, 262-1897); (కాని యీమెకును గణపతికినిబంధుత్వ మున్నదో లేదో?)

నాయకునిది. ఇందువలన రాజనాయకుని సైన్యాధిపత్యమున కాకతీయవాహిని కళింగ ప్రాంతములను జయించినట్లు తెలియుచున్నది. గణపతిదేవుని ఉప్పరపల్లిశాసనము15 కూడ పై విషయమును ధ్రువపఱచు చున్నది. అందు రేచర్లరుద్రునకు ప్రధానియైన రాజనాయకుడిట్లు కీర్తింపబడి యున్నాడు.

కులతిలకుడు వసుధామర
జలధి సుధాకరు శేషజన నుతచరితుం
డలఘుడు రిపుతరుదావా
నలుండనగా బరగె రాజనాయకుడన్వన్.

ఈతని విజయములు పైనుడివిన శాసనమున ఇట్లు వర్ణితములైనవి.

"బొక్కెరలోని వీరభటావలి వధించి గోధుమ
ప్రాతి తలదెంచి ఉదయగిరి సాధించి పడిరాయ
దిందోలి దక్షారామ భీమేశ్వర దేవగ కక్షయ
దీపంబులు నిల్పె..."

బొక్కెర అనునది గంజాంజిల్లా ఆస్కా తాలూకాలోని బొక్కెరయని శాసనపరిష్కర్తలు వ్రాసియున్నారు. వారు ఉదయగిరి రూపాంతరముగ నున్న ఉదగిరిని నెల్లూరు మండలములోని ఉదయగిరిగ గుర్తించుచున్నారు; కాని యది పొరపాటగునేమో? ఇదికూడ విశాఖపట్టణమండలములోనిదిగాని, గంజాంమండలములోనిదిగాని, యగునని నాయూహ. ఉత్తరమున కళింగజైత్రయాత్రకువెళ్ళి బొక్కెరను, ఉదయగిరినిజయించి తిరిగి దాక్షారామము వచ్చి, భీమేశ్వరునికి అక్షయదీపంబులు నిల్పి, రాజనాయకుడు పిదప ఓరుగంటికి మఱలిపోయెననుటయే సమంజసముగ గన్పట్టుచున్నది. జయించినట్లు తెలుపబడిన రాజులైనను ఎవరో, ఎక్కడివారో, తెలిసికొనుట కవకాశము లేనందున వారి మూలమునకైనను స్థలనిర్దేశము చేయుటకు వీలుకలుగుటలేదు. ఎట్లయిననేమి, ఈశాసనాధారమున కాకతీయులు కళింగమును జయించిరని నిశ్చయింపవచ్చును. పైనుడివినదే గాక కాకతిగణపతిదేవుని కళింగయుద్ధములను బేర్కొను శాసనము లింకను గలవు.16 గణపతిదేవుని మోటుపల్లిశాసనమున 17 గూడ అతడుకళింగముపై దాడివెడలినట్లు సూచించు నీకింద్రిశ్లోకము కలదు.

కుండలాఖండ వైరావణ కటకరణక్షోభసంభ్రాంత
భృంగీ సంగీతాకల్పకల్ప ద్రుమవనవిటప వ్రాతదో
లాధి రూఢాః గాయం గాయం రమతే సురపుర
సదృశో విక్రమం యస్యతాద్య క్సం గ్రామారంభ
లరి బాపటహారవసురాతంకతామృత్కలింగం॥

గణపతిదేవుని ఏకామ్రనాథ శాసనమున18

యదుదయకృత చేతోరింధణ స్సింహనాదో య
చ్చటుల సుభటధాటీ దత్తభంగః కళింగః
అపిచయ దుపసేవాజీవినో లాటగౌడా
గణపతినృపతేః కః శ్లాఘతేవిక్రమాయ॥

అని కలదు. ఇదియు కళింగవిజయసూచకమే. గణపతిదేవుని పాఖాలశాసనములో 19 కూడ

కాశీనాథః కళింగః శశధరణి పతిర్మాలవః కేరళేశస్తామ్రాణోహూణభూపః కురుపతి రరిమర్దాధిపోమాగధేశః నేపాళశ్చోళ పృథ్వీపతిరితి వినతా
నగ్రతో రాజవర్గాన్ నామగ్రాహంగృహీత్వాసదసి
సదసి యద్దర్శకాదర్శయంతి॥

అని కళింగ విజయ సూచనకలదు కాని కాశీనాథ, శశధరణిపతి, మాలవ, కేరళ, కురుపతి, మాగధేశము, నేపాళాధిపతులను, అందఱినివరుసపెట్టిజయించినట్లుండుటచేత ఈవిజయ

15 Hyderabad Archaeological Series, No. 3, P 16.
16 EP. Ind. Vol III. P 84; Ind. Ant. Vol XXI, P 188.
17 EP. Ind. Vol XII. P. 188. 18 Ind Ant. Vol XXI, P 197.
19 Hyderabad Archaeological Series, No 4 P 5.

ములని చెప్పుకొనబడిన వన్నియు వట్టిబూట కములుగనే పరిగణింపవలసి యుండుననుటకు సందియములేదు. అయినను తుమ్మాణ, కళింగములు సరిహద్దు రాజ్యములగుటచే నిందు రవంతయేని సత్యముండకపోదని యనుమానింపవచ్చును. ఇదియునుంగాక, ఒడ్డాది మత్స్య వంశజుడైన అర్జునదేవని 'దిబ్బిడ' తామ్రశాసనమున వీరపల్లి తాలూకాలోని 'దిబ్బిడ' గ్రామము సరిహద్దులలో "కాకతిఖండి' అనునది, యొకసరిహద్దుగ దెలుపబడినది. అదిగ్రామమో యేమో? ప్రాయికముగ కళింగమున ఆసరిహద్దువఱకు అనగా విశాఖపట్టణమండలములోని వీరవల్లి తాలూకావఱకు కాకతీయ రాజ్యము వ్యాపించి యుండెనేమో! రాజనాయకుని దాక్షారామ శాసనము శకవర్షము ౧౧౩౪ నాటిది. గనుక కాకతీయులకు కళింగ విజయము అంతకుపూర్వమే సంభవించినదని చెప్పవచ్చును. కాకతీయులు కళింగమును జయించి పరిపాలించిరనుటకు పూర్వోదాహృతో దాహరణము లన్నిటికంటెను బలవత్తరమైన మఱియొక ప్రమాణముకలదు. కొలని గణపతిదేవుని 'శివయోగసారము'న, ఇందులూరి పెదమల్లవిభుని కుమారుడైన సోమమంత్రి కాకతి గణపతిదేవునికి ప్రధానమంత్రి యనియు, దండనాథుడనియు, ఇతడు ఓరుగంటికి దూర్పుభాగమున నుండెడి దేశములను మాత్రమే కాక కళింగములోని భూములను గూడ జయించెననియు, నిట్లు వర్ణింపబడియున్నాడు.[20]

ఇటబవరుసైన్యముల్ గొలువ నేకశిలాపురి తూర్పు
దిక్కునం గలరిపు భూములెల్ల గొని గర్వముమై...
...మండలీకుల నవలీల దోలి సురిగోగుల నా
డుకు గొల్నివీడు నావెలసిన దుర్గమున్గొనుచు వేగ
మె గౌతమిదాటి యిమ్మలన్||
మాడియు రెండుంగొని యూ
డాడెడి పన్నెండు మన్నియముల నొడిచితా
నాడె కళింగయ సీమకు
గూడిన భువిగొనియె సోమకుల ముఖ్యుడొగిన్
లీలగొలనుమండ లీలల వెలదోలి
గొలనివీడు దాను గొనుటజేసి
కాకతీశుడైన గణపతి యుండను
కొలని సోముడనగ వెలసె జగతి||

సోమమంత్రి కళింగమును జయించుటే కాక కృష్ణాగోదావరీనదుల నడిమి దేశమును, కొలనినాయకులచే పరిపాలితమగు దానినికూడ జయించినట్లుపై పద్యములవలన దెలియుచున్నది

ఈ కాలమున కాకతి గణపతిదేవునికి సమకాలికులై కళింగమును బరిపాలించుచుండిన గంగ వంశపురాజులు ఇరువురు కలరు. (౧) మూడవ అనంగ భీమదేవు. ఇతడు మహామోహన చక్రవర్తిగారి పరిగణనము ప్రకారముశకవర్షము ౧౧౩౩ మొదలు ౧౧౬౦ వఱకు పరిపాలించెను (౨) అతనికొడుకైన మొదటి నరసింహదేవు చక్రవర్తిగారి పరిగణనమునను సరించి శకవర్షము ౧౧౬౦ మొదలు ౧౧౮౬ వఱకు పరిపాలించెను. కాకతీయులు కళింగముపై దండెత్తి జయించుటకు వీరిరువురిపరిపాలనకాలమే చాలయుక్తముగనుండెను. ఏలయన ఉత్తరహిందూస్థానమున కంతకు సంభవించిన మహమ్మదీయ విప్లవోపద్రవము ఈయనంగభీమదేవుయొక్కయు, ఈతని తండ్రి రాజరాజుదేవు యొక్కయు, కాలముననే సంభవించెను, బఖ్తియార్ ఖిల్జీ ప్రాపక పోత్సాహములవలన మహమ్మదీయులు ఉత్తర పుతట్టునుంచి కళింగ గంగవంశపురాజ్యము

20 శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారి వ్యాసము; ఆన్నయదేవుడు, వింతచరిత్రాంశములు, సుభాషిసం ౧ పుట ౨౫.

నెదుర్కొనుచుండిన కాలముననే కాకతీయులు ఉత్తరముగదమరాజ్యమును కళింగమున వ్యాపింపఁజేసుకొనుచుండిరి. ఈమూడవ యనంగ భీమదేవుకాలమునను, అతనికుమారుడు మొదటి నరసింహదేవు కాలముననుగూడ మహమ్మదీయ సేనావాహిని తడవతడవకు సముద్రపు పొంగువలెవచ్చి, కళింగోత్తరభాగముపై ప్రవహించి దానిని ముంచెత్తుచునే యుండెను. మహమ్మదీయులతోడి యాపోరాటములలో వారిని జయించి కొంచెము విశ్రాంతిగైకొని తేరుకొన్నమీదట గంగవంశ భూపతులు వేంగీదేశముపై దృష్టిమఱల్చిరి. ఈ కాలమున అనియంకభీముని శాసనములు రెండు దాక్షారామమున గాన్పించుచున్నవి. అందొకటి శకము ౧౧౫౨ నాటిది.[21] రెండవది శకము ౧౧౫౫ నాటిది.[22] మొదటిది అనంగభీముని దండాగ్రేసర వల్లభుడును, ఖడ్గసింహుని అగ్రపుత్రుడును అయిన "శ్రీచజ్జెస్రాజ"కుని ధర్మశాసనము. రెండవశాసనము చెడిపోయినది. ఇందు రాజరాజు కుమారుడును, హరిపద ప్రియరావుతాఖ్యుడును అగు "అనింకభీముడు" (అనంగ భీముడు లేక అనియంకభీముడు) పేర్కొనఁబడియున్నాడు. అటుపిదప దాక్షారామ భీమేశ్వరునికి చేయఁబడిన దానమును వర్ణించునందర్భమున కొన్నియక్షరములు పోయినవి. తరువాత.,,,. ...స్రజకేన,ద్రుతజితవిలసద్వేంగిభూమండలేన, అనికలదు. అంతటితోనిశాసనము ముగియును. అనియంకభీముని దండాగ్రేసర వల్లభుడు "జెస్రాజకు" డని మనకు దెలియునుగనుకను, శకవర్షకాలముకూడ మొదటి శాసనకాలము నకు సమీపమున నుండుటచేతను రెండవశాసనమందలి ,,. స్రజకేన యనునది "జెస్రాజకేన" అని యుండదగునని నానమ్మకము. తరువాతి "ద్రుతజితవిల సద్వేంగీమండలేన" అనునది "జెస్రాజకు"నికి విశేషణము. ఈవిశేషణము ననుసరించియే అనియంకభీముడు వేంగీమండలమును మఱల కాకతీయులనుండి జయించెనని నిశ్చయింపవచ్చును. దక్షిణకళింగముననే కాక అనంగభీముడు వేంగినిగూడ కాకతీయులనుండి జయించెననుటకు ఈశాసనములే మనకాధారములు.

కాకతిగణపతిదేవని ప్రధానియైన మల్లల హేమాద్రిరెడ్డియొక్కయు, కాకతిగణపతిదేవ రాజుల గజసాహిణియు అనుంగు అయిన జాయపనాయకుని యొక్కయు, శాసనములు దాక్షారామమున వరుసగా శకము ౧౧౫౯ లోను,[23] శకము ౧౧౭౫ లోను,[24] మనకు కాన్పించుచున్నవి. వీటిమూలమున వేంగివైపు కాకతీయుల యుత్తరపు సరిహద్దు సురక్షితముగ నుండలేదనియు, స్థానికులైన సామంతులవలననో, లేక కళింగాధిపతుల వలననో, వారి మండలికులవలననో, కాకతీయుల యుత్తర రాజ్యమునకు ఉపద్రవము సంభవించుచునే యుండెననియు, ఆకారణముననే కాకతిగణపతి మహాప్రధాని మల్లల హేమాద్రిరెడ్డియు, అనుంగుజాయపనాయకుడు నిటుగావలసివచ్చెననియు, వారి శాసనములు దాక్షారామమున గనబడుటకు ఆప్రాంతపు 'కల్లోలము'లే కారణములై యుండుననియు, ఊహింపదగియున్నది ప్రాయికముగ, కాకతీయరాజ్యమిట్టి విపత్పరంపరలకు లోనైన కాలముననే

---

21 S. I. I. Vol IV. No 1360.
22 S. I. I. Vol IV. No 1252.
23 S. I. I. Vol IV. No. 1339.
24 S. I. I Vol. IV. No 1045.

కావచ్చును, పాండ్యదేశాధిపతియైన జటావర్మసుందరపాండ్యుడు విక్రమించి, కాకతీయ సామంతులను కంచినుండి తరుమగొట్టి దానిని స్వాధీన పఱచుకొనెను. ఈకాలముననే గణపతి దేవచక్రవర్తి పాదపద్మారాధకుడైన కాలపనాయకుడు వేంగీవిషయమునకు అధిపతిగ నియమితుడయ్యెను. శకవర్షము ౧౧౭౬ నాటి ఆతని యొకశాసనమున[25] అతనికి 'వేంగీ విషయాధినాథ' యను బిరుదముండుటయే యిట్టి యూహ కెడమిచ్చుచున్నది.

కాకతి గణపతి దేవచక్రవర్తి శకవర్షము ౧౧౮౯ లో కాలగతినొందెను. అతని యంత్యకాలమునను, ఇంచుక అనంతరమును గూడ కాకతీయ సామంతులు అవన్యవనోద్భవులైన మహారాజ సింహాదులు వేంగీవిషయము కళింగ గంగభూభుజులకు వశముగాకుండ దానిని గాపాడుచునే వచ్చిరి. వీరిశాసనములును[26] దాక్షారామమున శకవర్షము ౧౧౮౪ ప్రాంతముల గానవచ్చుచునే యున్నవి.

గణపతిదేవచక్రవర్తి యనంతరము ఆతని కూతురు ఓరుగంటిసింహాసనము నధిష్ఠించెను. కాకతీయ సామ్రాజ్యమునకు మఱల శత్రువుల వలన ఉపద్రవము సంభవించెను. ఈసమయమున కాకతీయ మండలికులుకూడ గొందరు తిరుగబాటుచేసిరి. దక్షిణదిశనుండి కాకతీయ సామ్రాజ్యమును పాలించుచుండిన కాయస్థ కులాన్వయులును, బ్రహ్మరాక్షస గండబిరుదాంచితులునైన జన్నిగ దేవమహారాజు త్రిపురాంతకదేవ మహారాజు, అంబదేవ మహారాజు మొదలైనవారు రుద్రమదేవి యధికారమును ధిక్కరించి స్వాతంత్ర్యధ్వజమును బ్రతిష్ఠించిరి. వీరు తమ శాసనములందెచ్చటను తాము రుద్రదేవ (రుద్రమదేవి) పాదపద్మారాధకులమని చెప్పుకొని యుండలేదు. ఇదియేసమయమని కంచిని జయించిన జటావర్మసుందర పాండ్యుడు మహారాజసింహుని గూడ లోబఱచుకొని, యాతని మైత్రిసంపాదించుకొని, ఆంధ్రదేశముపై దాడివెడలి విక్రమసింహ పురమున (నెల్లూరు) వీరవిజయాభిషేకము గావించుకొనెను.[27] సుందరపాండ్య మహారాజసింహులు నెల్లూరికుత్తరమున కృష్ణానదీతీరము వఱకుగల దేశమునుగూడ జయించిరని చెప్పుటకు దగిన యాధారములు లేవుగాని, నెల్లూరివరకుగల దక్షిణాంధ్ర దేశము వారి స్వాధీనమయ్యెనని చెప్పుటకు సంశయములేదు. కృష్ణానదీ ప్రాంతములనున్న కాకతీయ మండలికులు-గుంటూరువారు కూడ-విప్లవపు బావుటాలనెత్తియుందురు. వీరు భారద్వాజగోత్రులు, ఖట్వాంగధ్వజులు, కాంచీపురవరేశ్వరులు, కడువాయ పఱఘోషణులు, పల్లవకులతిలక పదాంబుజసేవితులు. గణపతి దేవచక్రవర్తి కాలమున వీరు అడగిమడగియుండి, యాకాకతిమార్తాండు డస్తమించిన వెనుక వీరును, స్వాతంత్ర్య ప్రయత్నముల దగిలియుందురు. ఈకారణమునంజేసియే యైయుండును, రుద్రమదేవి సేనానులు వీరిపై దృష్టిమరల్చిరి. కాకతి గణపతిదేవచక్రవర్తి యంత్యకాలమున నుండిన గుంటూరిమండలికుడు నాగదేవరాజు. రుద్రమదేవియొక్క సకల సేనాధిపతి పట్టసాహిణియైన పడికము

25 S. I. I. Vol IV. No 602.
26 S. I. I. Vol IV. Nos 1341, 1342-A, 1342-B.
27 శ్రీయుత పెంకటరమణయ్యగారి ధాన్యకటకము; కొప్పెఱుంజీంగడు, భారతి సం॥ ౫౪ ౨ పుట 644.

బాప్పదేవునికి అతని త్రిపురాంతకము శాసనమున[28] "గోదావరీతీర సమరగాండీవి' యనియు, 'గొంటూరి నాగదేవతల గొండుగండ' యనియు, "కళింగమండలిక ధాటీసమర్థరాయ కువరు తొండపొడి రాయకు వరు పడీ ఘూణమల్ల' యనియు, 'కాకతీయగణపతిదేవ మహారాజదివ్య శ్రీపాదపద్మారాధక'యనియు బిరుదములుకలవు. రుద్రమదేవి సింహాసనమెక్కి నరెండవయేట; అనగా శకవర్షము ౧౧౮౦లో వేయంబడిన శాసనముననే యవి యన్నియు గనబడుటచేత, గోదావరీతీర ప్రాంత మెంత సంక్షుభితముగ నుండినదియు మనము దెలిసికొనవచ్చును. అదియునుంగాక ఈకాలమున కళింగమండలికు లాప్రాంతమును కలవరపఱచుచుండినట్లు తెలిసికొనుటకుగూడ ఆశాసనముననే సూచనలుకలవు.

కాకతీయసామంతుల శాసనములు దాక్షారామమున శకవర్షము ౧౧౬౧ వఱకు గానవచ్చుచున్నవి. ఈప్రాంతమున శకవర్షము ౧౧౯౬ ప్రాంతమున కళింగ గంగవంశప్రభువైన గజఘటాపతి మొదటి భానుదేవుని యొక్కయు, కళింగమండలికులైన చాళుక్య విజయక్షితీశ, ఒడ్డాది అర్జునదేవుల శాసనములు[29] గాన్పించుచుండుటచేత వీలుచిక్కినప్పుడెల్ల కళింగ మండలికులును, దేశాధిపతులును గూడ కాకతీయ భూపతులకే ప్రాంతమున గొంతయేలజడిని కలిగించుచునే వచ్చినట్లు మనము విశ్వసింపవచ్చును. పైనడివిన వీరశాసనములన్నియు శకవర్షములు ౧౧౯౬ ౧౧౯౭, ౧౨౦౯ నాటివి. ఈయేలజడికాలమున విక్రమ పౌరుషములు నెఱపి పేర్పడ్డ కళింగ మండలికులు కొందఱుండిరని కాకతీయ శాసనములు తెల్పుచున్నవి. రుద్రమదేవి సామంతులలో పోతినాయకుడొక్కడు. ఇతనికి సూరప, పోతయ, మారయ అను కొడుకులుకలరు. వీరందఱును కళింగ గజపతులతోడి యుద్ధములందు విజయమునొంది సుప్రసిద్ధులైనవారలే. పోతయ, మారయలీరువురికి "కటకము' నాశనముచేసిన వారనియు, గజపతియను ఏనుగుకు సింహమువంటివారనియు, బిరుదములు కలవు. ఈబిరుదములను పేర్కొనుశాసనము[30] శకవర్షము ౧౧౯౯నాటిది. అందువలన వారీయేలజడి కాలమున సామ్రాజ్యమునకు జేసినసేవవలననే వారీ బిరుదగౌరవము లభించినట్లు విశ్వసింపవలసియుండును. ఈయేలజడికాలమున సామ్రాజ్యమును రక్షించినవార లితరులిక నెవ్వరును లేరనికాని, ఇక నెవ్వరు నటువంటి వీరకృత్యములు జరుపలేదనికాని, భావింపరాదు. ఈకాలమున నిట్టి బిరుదములతో శాసనములవలన దెలియవచ్చిన వారు వీరేయగుటవలన వారేయచట పేర్కొనబడిరి. ఇంకను ఇట్టివారు సామ్రాజ్య సంరక్షకులుండక పోలేదనుటకు నేనుబ్రకటించిన పులిదండి శాసనమే[31] తార్కాణము. ఇది శకవర్షము ౧౨౦౦ నాటిది. ఇందలి దాతయైన నల్లపనాయుని ప్రోలినాయునికి "పాణ్యాంధ్రాళరాయ ధూమకేతు', 'కాళవరాయ దిశాపట్ట', "సేవణరాయ లవణి పాంచణు (?) ఒడ్డియరాయ మానమర్దన' మొదలైన బిరుదములుకలవు. కళింగ గంగవంశభూపతియే యాబిరుదములలో "ఒడ్డియరాయ' డని పేర్కొనబడియున్నాడు. కళిం

28 Ep. colln. 194 of 1905. 29 S. I. I. Vol. IV. Nos 1084, 1162, 1368, 1373.
30 Ep. colln 333 of 1915. 31 ఆంధ్రపత్రిక. సార్వస్వతాను బంధము, దుండి భికాట్టక బ్రాంశ.

ధ్రరాజ్యమును స్థాపించుటకు బ్రయత్నించెను. పశ్చిమచాళుక్యరాజులను లక్ష్యపెట్టక స్వతంత్రరాజునని ప్రకటించెను. అనుమకొండను ముట్టడివేసిన చాళుక్యపక్షీయుఁడైన జగద్దేవుని సంపూర్ణముగా నోడించెను. ఇతఁడు చాళుక్యరాజులకు గొప్పహానినిఁగలిగించి వారిని లోబరచుకొనెను. పశ్చిమచాళుక్యచక్రవర్తుల సేనాధిపతియైన గోవిందరాజును జయించెనని అనుమకొండలోని రుద్రదేవుని శాసనములో నొక శ్లోకమున జెప్పబడినది. [1]

అందులోఁ బేర్కొనఁబడిన గోవిందరాజు, పశ్చిమచాళుక్య చక్రవర్తియగు నారవ విక్రమాదిత్యుని సేనాధిపతియైన అనంతపాలుని సోదరిపుత్రుఁడని శాసనములో నున్నది. ఈగోవింద దండనాయకుఁడు క్రీ. శ. 1126—27 సంవత్సర ప్రాంతమున నాంధ్రదేశములోని కొండపల్లిసీమకుఁ బరిపాలకుడుగ నుండెను. పోలరా జీతని జయించి యితనిరాజ్యమును చోళరాజు కుటుంబములో నొకని కిచ్చివేసెను. నూజివీడుజమీందారీలో నున్న మంతెనను (మంత్రికూటము) సంపాదించి కాకతీయరాజ్యముతో గలిపెను. ఇతఁడు వ్యవసాయదారులను సంపన్నులనుగా జేయుటయందు మిక్కిలి అభిలాషగలవాడు. వ్యవసాయమున కుపయోగించు నొకపెద్దచెఱువును ద్రవ్వించెను.

ఇట్టిపరాక్రమముగలవాడును బహుసంగ్రామ విజేతయునగు పోలరాజు తనకుమారునిచే నిహతుడయ్యెనని యొకకథ కలదు. అదియెంత మట్టుకుసత్యమో మనము నిశ్చయింపనేరము. ఒకదివసంబునఁ బ్రతాపరుద్రదేవుడు దేవాలయంబున గాఢనిద్రనున్న సమయమున తండ్రియైన పోలరాజతనిప్రక్కనుండి బోవుచుండగా నితనికాలతనికిఁ దగిలెనట. అంతట నతడు మేల్కాంచి శత్రుడెవ్వఁడో తన్నుముట్టుకొన వచ్చెననియెంచి తనమొలలోనున్న ఛురికముచే నతనినిఁబొడిచెను. అంతట తండ్రి నేలంగూలజూచి తెలివినొంది చేసిన పితృవధ కర్మకుఁ బశ్చాత్తప్తుఁడై దుఃఖింపసాగెను. ఇది భ్రమప్రమాదవశమున సంభవించినదని యెఱింగినవాడై పోలరాజు కుమారుని శిక్షింపక యోదార్చి రాజముద్రికనొసంగి రాజ్యమునొప్పగించి ప్రాణములను విడిచెను.

వానితరువాత రాజ్యమునకు వచ్చినవాఁడు రుద్రదేవుఁడు. ఇతడు 1160 మొదలుకొని 1196 వరకు రాజ్యమేలెను. ఇతనినాడు కూడఁ బశ్చిమచాళుక్యులతో యుద్ధ మనువృత్తమయ్యెను. దొమ్మఅనువాని రాజ్యమును దనరాజ్యముతోఁ గలుపుకొనెను. భిల్లమఅనువానికి ముందువాడైన మల్లుగియను యాదవరాజును జయించెను. ఈతనికిఁ బ్రతాపరుద్రుడని నామాంతరముకలదు. ఇతడు పరాక్రమమునందు తండ్రినిసయితము మించినవాడు. ఈరుద్రదేవుడు చాళుక్య సైన్యపాలకుడైన తైలపదేవుని, కర్ణాటకచోడులైన భీమచోడ ఉదయ చోడులను, మంత్రికూటాధీశుడైన గుండమనాయని తక్కిన శత్రురాజవర్గమును జయించి, యాంధ్రదేశమందు పశ్చిమచా

1 "యోకుంభోరిపతే ర కుంభపరశుశ్లక్ష్ణా గ్రధారోల్లస
ద్ధారాపాతనిపాతనైక చతురం గోవిందరాజాహ్వయం
బధ్వోన్మృజ్య తదోదయక్షితిభృతే రాజ్యం దదౌ లీలయా
ఖుంఠాకోవిషయస్య తస్య సమరే స ద్వీరదీక్షాగురుః"

ఖుర్య చక్రవర్తుల పరిపాలనమునకు లోబడి యున్న భూభాగములనన్నిటిని స్వాధీనము చేసికొని, మహామండలేశ్వరుఁడై రాజాధిరాజై ప్రాగడ్డ కెక్కెను.[2]

కాకతిరుద్రదేవునిరాజ్యము తూర్పున సముద్రమువరకు, దక్షిణమున శ్రీశైలమువరకు, పడమట కటకమువరకు, ఉత్తరమున మాల్యవంతమువరకు, విస్తరించి యుండినది.

ఇతనికాలమందు శైవమతము మిక్కిలి వృద్ధినొందెను. శైవులమతబోధనములను విని శైవమతమం దభినివేశము గలవాడయ్యెను. నిర్నిమిత్తముగా దానుతండ్రినిజంపిన మహాపాప మెట్లుపోవునో దానికితగినయుపాయము లజెప్పుడని శైవగురువులనడిగెను. వారు "ఓయి ప్రోలమహారాజా! దేశాటనము సలిపి దివ్యనదులగుర్రించి, లింగముల బ్రతిష్ఠింపించి, పంచామృత దివ్యతీర్థములసేవించి, దివ్యలింగముల బ్రతిష్ఠింపించి పంచామృతముతో సదాశివుని కభిషేకముగావించి, భక్తితోసేవించిన సర్వపాపహరంబగు"నని చెప్పిరి. అందుపై రుద్రదేవుడు నూరుగురు బ్రాహ్మణోత్తములను గాశికి బంపించి యచట విశ్వేశ్వరున కభిషేకము జేయ నియమించి విశేష ధనంబులొసంగి వారలచే దనకుగాను పితృతర్పణము జేయించెను. తన రాజ్యములో బ్రతిగ్రామమందు శివాలయములను నిర్మించి వానిపూజాదుల కొరకు భూములనొసంగెను.

ఈతడు సంస్కృతాంధ్రకర్ణాట పండితులరావించి యాదరించుచు, పండితపక్షపాతియై తానును పండితుడు కవియునై, బహుగ్రంథములఁ బఠించుటయేగాక గ్రంథరచన యందు గూడ ప్రౌఢత్వముగల వాడై యున్నట్లు కానవచ్చుచున్నది. ఇతనికి విద్యావిభూషణుడను బిరుదుకూడగలదు. ఇతడు నీతిసారమను నొక గ్రంథము నాంధ్రభాషలో రచించినటులదెలియవచ్చుచున్నది.[3]

కాకతిమహాదేవరాజు.—ఇతడు కాకతి రుద్రదేవుని తమ్ములలోఁ బెద్దవాడు. ప్రోలరాజు ద్వితీయపుత్రుఁడు. తనయన్నయగు రుద్రదేవుడు 1196 వరకు రాజ్యముచేసిమృతినొందగామహాదేవరాజు సింహాసనారూఢుడై, మూడుసంవత్సరములు మాత్రమే రాజ్యమేలెను. ఇతడు తన యన్నగారైన రుద్రదేవ రాజు తండ్రిని జంపి రాజ్యము చేయుచున్నాడను ద్వేషముచేత నతని జంపి రాజ్య మాక్రమించు కొనవలయునని పలుమారుప్రయత్నించెను. గాని యట్టివైపరీత్యము జరుగకుండ మంత్రులు మొదలగువారు వారించుచుండిరి. తన్ను జంపుటకై తమ్ముడుచేయు దురాలోచనలను సహించి రుద్రదేవుడు వానిని క్షమిం

---

2 శ్లో॥ రాజ్యంప్రాచ్యాం లవణజలధే స్తీరపర్యంత మస్య శ్రీ
శైలాన్తం ప్రచలతి సదా దక్షిణస్యాం సమగ్రం
ప్రాతీచ్యాన్తా కటకనికటస్థాయినీ రాజ్యలక్ష్మీః
కౌబేర్యాశాతట విలసితా మాల్యవంతం ప్రపేదే॥

3 "చ॥ పరువడి నాంధ్రభాషగల బద్దెనసీతియు సంస్కృతంబులో
బరగఁబ్రతాపరుద్ర నరపాలునిచే రచియింపబడ్డ యా
నరవరు నీతిసారము వినం జదువంగడు మంచిదంచు చె
చ్చెరగ వినీతిపద్ధతులు చేసె వినోదము బాలబోధకున్॥"

చుచువచ్చెను. అట్లుసైచుట యుక్తముకాదని మంత్రి పురోహితాదిజనంబు లెంతచెప్పినను రుద్రదేవుడు వారిమాటలను బెడచెవినిబెట్టి తమ్ముని నాదరించుచు వచ్చెను. రుద్రదేవుని యనంతరము మహాదేవరాజు రాజ్యభారమును వహించి మూడుసంవత్సరములు మాత్రమే రాజ్యముచేసెను.

శౌణదేశాధీశ్వరుండైన జైత్రపాలుడను యాదవరాజు తనతండ్రియగు సింగభూపతి యనంతరము 1193 సంవత్సరమున రాజ్యభారమును వహించి త్రిలింగదేశముపై దండెత్తి వచ్చెను. అప్పుడు జైత్రపాలునకు మహాదేవరాజునకు జరిగిన ఘోరయుద్ధమందు మహాదేవరాజు చేంపఁబడెను.

యుద్ధములో మహాదేవరాజు మృతినొందిన తరువాత నతనికుమారుడైన గణపతిదేవుడు రాజ్యభారము వహించెను. ఇతడు మహాదేవరాజునకు బయ్యమాంబికవలన జనియించినవాడు. ఇతడు తనజ్యేష్ఠ పితృవ్యుడైన రుద్రదేవునిచే స్థాపింపఁబడిన త్రైలింగ సామ్రాజ్యమును నల్దడల విస్తరింపజేసి, చక్రవర్తిపదమును వహించి, సప్తమచక్రవర్తియని యాంధ్రభూస్థలి నంతట శ్లాఘింపబడుచుండెను. యుద్ధములో నితఁడు శత్రువులచే జిక్కవడి, విడిచిపెట్టబడిన తరువాత నాయవమానమును సహింపజాలక అసంఖ్యాకములైన సైన్యములం గూర్చుకొని యాదేశముపై దండెత్తివెళ్ళి, యాదవులతో యుద్ధముచేసి శౌణభూపతిని జయించి, యతనివలన నమూల్యములైన రత్నరాసులను ధనములను బడసి, నిజరాజధానికి మరలివచ్చెను. అప్పటినుండియు యాదవు లనేకపర్యాయము లాంధ్రదేశము నాక్రమించుకొనుటకై ప్రబలప్రయత్నములు చేయుచువచ్చిరిగాని తెలుగువారు వారిని గోదావరినదినిదాటి దిగువకు రానియ్యక నాపివేసిరి. పశ్చిమచాళుక్య సామ్రాజ్యమంతరించినవెనుక కర్ణాటదేశమున కధిపతులైన భళ్ళాణరాజులుసైతము తెలుగుదేశమును వశపర్చుకొన వలయునని ప్రబలప్రయత్నములు గావించిరి, గాని తెలుగువారి పరాక్రమముముందట నవియన్నియు భగ్నములైపోయినవి. గణపతిదేవుడు సింహాసన మెక్కిన తోడనే మండలేశ్వరు లనేకులచే బరిపాలింపబడుచున్న యాంధ్రదేశమునంతయు నేకచ్ఛత్రాధిపత్యము క్రిందికిదీసికొని రావలయునని నిశ్చయించి తదనుగుణముగా సమర్థులైన మంత్రులను సేనాధిపతులను గూర్చుకొని వారలసాహాయ్యముచే దండయాత్రలు ప్రారంభించి యొక్కొక్క మండలేశ్వరుని జయించి వశపర్చుకొని, సామంతునిగ జేసికొనుచుండెను. గణపతిదేవుడు రాజ్యతంత్రజ్ఞానము గలవాడుగావున నేపనిప్రారంభించిన నతనికి విజయమే లభించుచుండెను.

ఈగణపతిదేవుడు వ్రాయించిన యనేకశాసనములు దక్షిణహిందూస్థానమందు బహుళముగా గానవచ్చుచున్నవి. ఇతడుమహాపరాక్రమశాలి గొప్పవారైన యాంధ్రదేశపురాజు లందరితోను వివాహసంబంధములను జేసెను. వారంద రితనికి యుద్ధములయందుదోడ్పాటు గావించుచుండిరి దక్షిణపుజిల్లాలపై దండెత్తివెళ్ళి కొణిదెన, అద్దంకి, మలికినాడు, పొట్టపినాడు, రేనాడు, గండికోట, జయించెను.

ఈ సమయమందు చోళరాజ్యము గందరగోళములో నుండెను. పలుమారుత్తరముగా దండెత్తివెళ్ళి నెల్లూరును కూడ బట్టుకొన్న పాండ్యులను ఘోరముగా బరిభవించెను.

ఇదివరకే రాజధానియైయున్న ఒరంగల్లులో నొక గొప్పకోట గట్టెను. ఇతడు తన రాజ్యమందు పూర్ణమైన స్వాస్థ్యమును నెలకొల్పి అవ్యాహతముగా దనయాజ్ఞ చెల్లునట్లుచేసెను. మంచిబాటలను సత్రములను నిర్మించెను. ఇతడు శైవమతావలంబి జైనమత విరోధి. జైన భక్తుల ననేకుల గఠినముగా హింసించి చంపెను. వారు నివసించు ముప్పదియారు గ్రామములను, వారి దేవాలయములను నశింపజేసెను. అతని రాజ్యపాలనవరకును కంసాలివారు గ్రామకరణములై యుండిరి. తరువాత వాండ్రు జైనమతస్థులని తెలుసుకొని, వారి నాయుద్యోగములనుండి తప్పించివేసి, వారి స్థానమందు నియోగిబ్రాహ్మణులను బెట్టెను. ఇప్పటికి నివారన్ని తెలుగుజిల్లాలలోను కరణములుగా నున్నారు. అతడు చేసిన యన్నిపనులలోను సమర్థులైన మంత్రులు, యిప్పటికి ననేక ప్రదేశములయందు గానవచ్చు శాసనములను వ్రాసిన పండితులు, సహాయమొనర్చిరి. అతడు వణిక్కులకు గొప్ప మిత్రుడై యుండెను. పూర్వశతాబ్దములయందు వాణిజ్యస్థలముగా బ్రసిద్ధికెక్కినది కృష్ణానదీ ముఖద్వారమందున్న మోటుపల్లియను సముద్రతీర పట్టణము. నౌకాచోర (Pirates) బాధచే బాడయ్యెను. గణపతి యాస్థలమందున్న వర్తకులను గాపాడుట కనేకప్రయత్నములను గావించెను. ఎరుమతీ దిగుమతీలమీద పన్నులను తగ్గించెను. గంధపు చెక్కలు, కర్పూరము, పన్నీరు, గజదంతము వచ్చలు, పట్టుబట్టలు, మొదలయ్యవన్నియుదూరదేశములనుండియీ రేవుపట్టణముద్వారా దేశములోనికి బంపబడుచుండెను. గణపతి విద్వత్పోషకుడు. అతడు మంత్రులలో నొకడైన శివదేవయ్యచే పురుషార్థసారమనెడు నొక శైవగ్రంథమును వ్రాయించెను.

క్రమముగా గణపతిదేవమహారాజు కీర్తిశేషుడయిన పిమ్మట నతనికుమార్తె రుద్రమదేవి సింహాసనము నెక్కెను ఈ గణపతిదేవునికి పుత్రసంతానము లేకపోవుటచే నీమెనే పుత్రునిగా జూచుకొనెను. పూర్వగ్రంథకర్తలు నూతనగ్రంథ కర్తలు రుద్రాంబిక గణపతిదేవుని భార్యయని భ్రాంతినొందిరి. మల్లినాథసూరి పుత్రుడగు కుమారస్వామి ప్రతాపరుద్రీయమునకు వ్రాసినవ్యాఖ్యలో నొకచోట.

"పురాకిల కాకతికులసంభూతే గణపతి నామ్ని మహారాజే దుహితృమాత్రి సంతానే కదా చి ద్దైవయోగేన కాలపరిపాక ము పేయుషి, తన్మహిషీ రుద్రమదేవీనామరాజ్ఞీ బహువర్షాణి త్రిదాజ్య మకంటకం పరిపాల్య పరిణతాసతీ, దౌహిత్రే ప్రతాపరుద్రే రాజ్యధురాం నిదధే. తామిమాం కథాం మనసి నిధాయాహ 'యోరుద్రఇతి" 4

రుద్రమదేవి గణపతిరాజు భార్యయని అనేకకులు భ్రమపడిరి. విద్యానాథుడు వ్రాసిన ప్రతాపరుద్రీయమును జక్కగా బరిశోధించి రుద్రాంబిక గణపతిదేవుని కుమార్తెయని Hultzsch అనుజర్మ

4 "శ్లో॥ యోరుద్రో రజతాచలే స్థితి మగా దర్థాంగనారిః పురా
సోయం సంప్రతి కాకతీశ్వరకులే సర్వాంగనారిస్థితః।
స్థానే యద్విషమావలోకన కళామాత్రేణ భస్మీకృతా
న్యాస స్త్రైపురాణి చిత్రమధునా ఖడ్గే విషంధార్యతే॥"

నీదేశపు పండితుడు. ఈవిషయమే ప్రతాపరుద్రీయములో నాటక ప్రకరణమందున్నది.[5]

కావున గణపతిచక్రవర్తికి రుద్రాంబిక కూతురనియు, పుత్రులు లేనికారణమున నామెను పుత్రునిగా జూచుకొనియాతడామెకు రుద్రదేవుడనియె పురుషనామ ముంచెననియు, స్పష్టమగుచున్నది.

ఈమె తండ్రిచే శిక్షింపబడినదియై రాజ్యపరిపాలనమందు మిక్కిలి ప్రసిద్ధికెక్కిన సామర్థ్యముగలదియై యుండెను. ఈమె రాజ్యపరిపాలనారంభమందే యాదవరాజు వరంగల్ పైకి సైన్యముతో దండెత్తివచ్చి, యసంఖ్యాకములైన సైన్యముతో రాజధానిని ముట్టడివేసెను. పదునైదు దినములు జరిగిన ఘోరసంగ్రామమందు యాదవరాజుసైన్యములు పరాజయమునొంది కాందిశీకులైనవి. యాదవరాజుబలమైన నష్టమునచ్చుకొనెను. ఆసామ్రాజ్యములో గొంతభాగము వరంగలును సామర్థ్యముతోఁ గాపాడిన ధైర్యవంతులైన సైనికుల కిప్పించబడెను. ఆదుది రాజ్యమేలుచున్నదియని కొందరు గొప్పవారసూయావిష్టులై రుద్రమదేవి మీద తిరుగబడిరి. కాని యామె వారినందరినీ అణగగొట్టెను.

ఈమెకు సమర్థులైన మంత్రులు సేనాధిపతులు ననేకులుండిరి. వారిలో ముఖ్యులు జన్నిగదేవసాహిణి, గంగయసాహిణి, త్రిపురాంతకదేవ మహారాజు, గోనగన్నారెడ్డి, నాగదేవమహారాజు, మొదలగువారు.

రుద్రాంబిక రాజ్యపరిపాలన కాలమందే మార్కోపోలోఅనునాతడు ఆంధ్రదేశమునకు వచ్చెను. అతడు తనప్రయాణ వృత్తాంతములను దెలియజేయు పుస్తకములో నాంధ్రదేశ వృత్తాంతమును జక్కగావివరించెను. తండ్రివలెనే రుద్రాంబ శైవులమీద నిష్టముగలది. ఈమెకాలమందు రంగనాథ రామాయణమను కావ్యము రచింపబడెను. రంగనాథుడను నాతడు రామాయణమును ద్విపదకావ్యముగా రచించెను. కనుకనే యాగ్రంథమునకు రంగనాథ రామాయణమని పేరుకలిగినది. కాని గ్రంథాంతమందు గోనబుద్ధరాజు రచించినట్లు గానవచ్చుచున్నది మనుమూరి సంస్థానాధిపతియగు బుద్ధరాజున కాశ్రితుడైన రంగనాథుడు దీనిని తనప్రభువుపేరిట రచించెనేకాని బుద్ధరాజు రచింపలేదనియు, బుద్ధరాజు రచించియుండెనేని బుద్ధరాజ రామాయణమనుపేరే యీగ్రంథమునకు వచ్చుచుగాని రంగనాథ రామాయణమను పేరుకలుగుటకు కారణము గానరాదనియు గొందరు చెప్పుదురు. ఎవ్వరు రచించినను యిందలి కాండాంతమున నిట్లున్నది.[6]

---

5 మంత్రిణః। "ఏవమేవైతత్। అన్యథా కథమీశ్వరస్య ప్రసాదాదృతేనిరంకుశం స్త్రీవ్యక్తివిశేషస్యలోకాధిపత్యం। ఏవంమానుషశంభునా గణపతిమహారాజేన అభ్యంతరస్వానుభవ మహిమ్నః సదృశ మత్రపుత్ర ఇతి వ్యవహారః కృతః తదనుగుణా చ రుద్ర ఇతి వ్యవహారః కృతః। తదనుగుణా చ రుద్రఇత్యాఖ్యా॥

6 "అనియాంధ్రభాష భాషాధీశవిభుడు, వినుతకావ్యాగమ విమలమానసుడు
పాలితాచారు డపారధీశరధి, భూలోకనిధి కోన బుద్ధభూవిభుడు
తమతండ్రి విఠ్ఠల ధరణీశుపేర, నాచంద్రతారార్క మైయొప్పుమీర
నసమానలలిత శబ్దార్థ సంగతుల, రసికమైచెలువొందు రామాయణంబు
పరగనలంకార భావనల్ నిండ, గరమర్థి.....కాండంబుసెప్పె"

గోనబుద్ధరాజు తన తండ్రి విఠ్ఠలధరణీశు పేర రచియించినట్టే వ్రాయబడి యున్నది. 1291 సంవత్సరములో రుద్రమదేవి స్వర్గతి నొందెను.

ఈ మహారాజ్ఞికి దరువాత ఇట్లు పద మూడవ శతాబ్దము నంతమున రుద్రమదేవికి దౌహిత్రుడును దత్తపుత్రుడునైన వీరప్రతాపరుద్రదేవమహారాజు ఆంధ్రసామ్రాజ్యభారమును వహించెను. ఇతడు 1295 మొదలుకొని 1321 వరకు రాజ్యమేలెను. ఇతడు రుద్రదేవికాలమందు దేశమునకు బాధగలిగించు సామంత నృపతులను జయించి, యాంధ్రసామ్రాజ్యము వృద్ధినొందునట్లు చేసెను. ఈతని రాజధానియగు నేకశిలానగర మాకాలమం దుత్తర హిందూదేశంబునందు మహమ్మదీయుల రాజధానియగు ఢిల్లీపురముకంటె నధికైశ్వర్యసంపన్నమై ప్రకాశించుచుండెను.

ప్రతాపరుద్రుని మంత్రులలో ముఖ్యుడగువాడు నాగయగన్నమంత్రి. ఇతనికి యల్లయనాయకుడు మేచయనాయకుడు నని యిరువురు సోదరులుండిరి. వీరిద్దరుగూడ ప్రతాపరుద్రునికి సేనాధిపతులుగ నుండిరి. ఈగన్నయమంత్రి మడికిసింగనకవి విరచితమైన పద్మపురాణకృతికి భర్తయైన కందనమంత్రికి చిన్నతాతయని శ్రీ వీరేశలింగముపంతులుగారు ఆంధ్రకవిజీతములలో మడికిసింగనకవిగూర్చి వ్రాయుసందర్భమున జెప్పిరి. ఈగన్నయమంత్రిని వారునియోగిబ్రాహ్మణుడని యభిప్రాయపడిరి. కాని యదిసరికాదు. ఈగన్నయమంత్రి చతుర్థకులజుడని మారనవ్రాసిన మార్కండేయపురాణములో స్పష్టముగా దెలుపబడియున్నది. ఇతనికి నాయకత్వము ప్రతాపరుద్రునివలననే లభ్యమైనట్లు మార్కండేయ పురాణమున జెప్పబడియున్నది.[7]

ప్రతాపరుద్రుసిసైన్యాధ్యక్షులలో నొకడుగానుండి, యోరుగంటియొక్క తూర్పుగవని మొదలుకొని తూర్పున సింహాచల పర్యంతము గల భూభాగమున కంతకు రాజప్రతినిధియై పరిపాలనము చేసినట్టు గనబడుచున్నది.[8] ప్రతాపరుద్రుని మహామాత్యులలో నొక్కడగు నీ రుద్రరాజునే కొలనుప్రతాపరుద్రుడందురు. కొలను అనునది కృష్ణామండలములోని యేలూరుకు నామాంతరము.

కాశ్యపగోత్ర సంభూతుడైన పోలయామాత్యునకు ద్వితీయపుత్రుడైన బెండపూడి అన్నయమంత్రి వీరప్రతాపరుద్రుని రాజ్యభార ధురంధరులలో నొకడు. శ్రీనాథమహాకవి తన భీమఖండమును ఈ యన్నయమంత్రి మనుమడును అల్లయ వీరభద్రారెడ్డి మంత్రియునగు అన్నమంత్రి కంకితము చేసెను.

---

7 చ॥ ఎలమి బ్రతాపరుద్ర మనుజేంద్రుని చేఁ బడసెం బ్రధానుఁడై
కొలిచియు శౌర్యలీల రిపుకోటి రణావని గీటడంచియు
న్బలరిపుతుల్యవిక్రముడు నాగయ గన్నవిభుండు తేజము
న్విలసిత రాజచిహ్నములు విశ్రుతలక్ష్మియు నాయకత్వముఁ॥ ॥మార్కండేయపురాణము॥

8 తే॥ గీ॥ అనఘచరితుడు కొలనిరుద్రావనీశు
డఖిలజనులును వినుతింప నమలమహిమ
జెలగి యేకశిలాపురి సింహపురధర
పరిమితాన్తర భూభాగ భరముదాల్చె॥ ॥శివయోగసారము॥

భాస్కరరామాయణ కృతికి బతియైన సాహిణిమారుడు ప్రతాపరుద్రుని యశ్వసైన్యంబున కధ్యక్షుడుగ నుండెను.

ఈ ప్రతాపరుద్రునిరాజ్యము తూర్పున సముద్రమువరకును, దక్షిణమున కాంచీపురము వరకు, పశ్చిమమున గళ్యాణ కటకము వరకు, ఉత్తరమున కళింగదేశములోని సింహాచలము వరకు, వ్యాపించి యుండెను.

1308 సంవత్సరములో మహమ్మదీయులు కాకతీయరాజ్యముపైకి దండెత్తి వచ్చిరి. కాని వర్షాధిక్యముచే మార్గమందు వారికి ప్రబలమైన ఆటంకములు గలుగుటచే నేమియు జేయనేరక ఢిల్లీకి మరలిపోయిరి 1309 లో మహమ్మదీయులు రెండవసారి పెద్దసైన్యముతో దండెత్తివచ్చి తెలింగానా సరిహద్దులవిడిసి, వారి మార్గమందనేక స్థలములబట్టికొని, కొనకువరం గలునెదిరించిరి. ఆకోటకన్నిప్రక్కలను ముట్టడి వేసిరి. ఆకోటను గాపాడుసైనికులు తమశక్తి వంచనలేకుండ తమభుజశౌర్యమును గనపర్చిరి. గాని మహమ్మదీయసైనికులు లక్ష్యముసేయక ముందుకు ద్రోసికొనివచ్చి కొన్నిపరిఖలను దాటివచ్చి కోటయొక్క లోపలిభాగములను బట్టుకొనిరి. అందుపైన బ్రతాపరుద్రుడు జయాశను బొత్తిగావిడిచికొని ఢిల్లీచక్రవర్తికి లోబడెను. సాంవత్సరికకరము నిచ్చుటకు బ్రతిజ్ఞచేసెను. దానికి మొదటివాయిదాగా నమితమైన ధనమునొసంగెను. ఈపని జరిగినవెంటనే ఒరిస్సారాజైన గజపతి వరంగల్ మీదికి యుద్ధమునకు వచ్చెను. అతడు పరాజయమునొందెను. ఇంతలో ద్రవిడదేశపు పరగణాలలో కొన్ని అల్లరులుపుట్టెను. కేరళదేశపురాజైన రవివర్మకులశేఖరుడు కాంచీపురమును బట్టుకొనెను. 1316 సం॥లో ప్రతాపరుద్రుడు ముప్పిడినాయకుడను తనదళవాయిని దాక్షిణాత్య శత్రువులపైకిబంపి, వారువశపర్చుకొన్న దేశభాగమునంతయును మరల స్వవశము జేసికొనెను. చోళరాజ్యములో నవశిష్టభాగమును, పాండ్యదేశములోని కొన్ని భాగములను, తనరాజ్యములో గలుపుకొనెను. ప్రతాపరుద్రుడు కొంతకాలము క్రిందట ఢిల్లీచక్రవర్తికిచ్చెదనని వాగ్దానముచేసిన పన్నును చెల్లించుట మానివేయునంత బలవంతుడయ్యెను.

ఈసమయమందు ఢిల్లీలో కిల్జీవంశమువారు టాగ్లకువంశమువారికి తావిచ్చిరి. మొదటిటాగ్లక్ చక్రవర్తియగు గాజీఉద్దీన్ ప్రతాపరుద్రునితో యుద్ధముచేయుటకొక లక్షపదాతిసైన్యమును, పదివేల గుఱ్ఱపుదండునిచ్చి తన కుమారుడైన ఉలుగ్ ఖానుని పంపెను. 1321 సం॥లో వరంగల్ పట్టణమునుజయించి, మహమ్మదీయులాదేశమునంతయును యథేచ్ఛముగా దోపిడిజేసిరి. ఇట్టిసమయమందు బ్రతాపరుద్రు డెవ్వరికి జొరశక్యముగాని వరంగల్కోట లోదాగియుండి ప్రాణములను గాపాడుకొనెను. దానినిగూడ శత్రువులు ముట్టడించిరి. ఆయుద్ధమం దుభయపక్షముల వారును జయాశతో ఘోరముగా బరాక్రమించిరి. రెండుపక్షములవారికి నమితనష్టములు కలిగినవి. అట్టి సమయమందు ఢిల్లీచక్రవర్తి మృతినొందెనని యొకకీవదంతి ఆకస్మికముగా వ్యాపించెను. ఇదివరకే ఆమహమ్మదీయులు రోగములవలనను, శీతభాధవలనను, దుస్సహపీడనొందిరి. అందుచే వారతిశీఘ్రముగా దేవగిరి మార్గముగుండా స్వస్థానమునకు బోవలసివచ్చెను.

కొన్నినెలలతరువాత ఉలుగ్ ఖానుడు పితృమరణవార్త కల్లయని తెలిసికొని మునుపటికంటె బలీయమైన యుద్ధసన్నాహముగల సై

న్యములదోడ్కొని వరంగలుకు వచ్చెను. ఇది ఎరకే పట్టువడిన వరంగలును ముట్టడించి తెలింగానా సరిహద్దుననున్న బీడరుదగ్గిర పటాలములనుంచెను. వెలమలు, పద్మనాయకులు, కమ్మలు, రెడ్లుమొదలగు నన్నిజాతులవారు నైకమత్యమునొంది మహాశౌర్య ధైర్యములను వెల్లడించుచు నొకమనుష్యునివలె విదేశీయశత్రువులతో బోరాడిరి, కాని శ్రమమంతయు వ్యర్థమయ్యెను. ఫిరంగిగుండ్ల వర్షమును గురిపించి దుర్భేద్యమైన వరంగల్‌కోటను ధ్వంసముచేసి లోనికిబ్రవేశించి ప్రతాపరుద్రుని యతని కుటుంబజనమును ఖయిదీలగా బట్టుకొని ఢిల్లీకిగొనిపోయిరి. ఖయిదీగా జేయబడిన యీమహారాజు గోదావరియొడ్డుకు వచ్చినపుడు విడువబడెననియును, విరక్తుడై నిజాయుశ్శేషము నంతయును బైరాగియై గడిపెననియు నొకయైతిహ్యము గలదు. అతనిరాజ్యము టాగ్లకురాజ్యములో గలిపివేయబడెను. స్వతంత్రాంధ్ర రాష్ట్రముయొక్క కీర్తిప్రతిష్ఠలతనితో నస్తమించినవి.

ప్రతాపరుద్రీయము.

శ్రీయుత మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు

ప్రతాపరుద్రయశోభూషణము లేక ప్రతాపరుద్రీయము అను నీయలంకారశాస్త్రమును రుద్రదేవుని యాస్థానమందున్న విద్యానాథుడను మహాకవి రచించెను. ఇది భట్టుని కావ్యప్రకాశికను, విద్యాధరుని ఏకావళినిజూచి యారీతిగా వ్రాయబడినది. దీనిని కోలచల మల్లినాథసూరి పుత్రుడగు కుమారస్వామిశాస్త్రి వ్రాసిన తరళయను వ్యాఖ్యానమూర్చి K. P. Trivedi (కే. పి. త్రివేదుడు) బొంబాయిలో బ్రకటించెను. దీనిది ప్రకరణములుగా విభజింపబడి ప్రథమ ప్రకరణమందు నాయకుని వర్ణింపబడియున్నవి. అందుచే నాయకప్రకరణమని పేరు. అలంకారములను వ్రాసిన పూర్వపుగ్రంథకర్తలందరు దానితో సంబంధించిన సకలాంశములను ప్రతిపాదించిరి గాని తమగ్రంథములను నాయకునితో గూర్చలేదు. గ్రంథములయొక్కయు గ్రంథకర్తల యొక్కయు గొప్పతనము నాయకగుణవర్ణనమునకు నాయకునికి ఆధీనమైయున్నదని యీదిగువవ్రాసిన శ్లోకములో జెప్పియున్నాడు.

శ్లో॥ గుణాలంకారాణాం రసమహతి కావ్యే విలసితం స్ఫురచ్ఛబ్దార్థాభ్యాం తదపి హృదయానంది భవతి। తయోరప్యున్మేషస్య వదమృతమాధుర్యసుభగః పరం పుణ్యశ్లోకం చరితమనుబధ్నన్విజయతే॥* ఆహేతువుచేతనే యీగ్రంథకర్త కృతినాయకుని కావశ్యకమయిన గుణములను ప్రథమప్రకరణమందే వర్ణించియున్నాడు. నాయకుని సామాన్యగుణము

లను వానిలక్షణములను చెప్పి, నాయకులు ధీరోదాత్త ధీరోద్ధత ధీరశాన్త ధీరలలితులని నాలుగుతెగలని వారియవాంతర భేదముల తో జెప్పెను. తరువాత నాయికలను వారి యవాంతర భేదములను వారిలక్షణములను బ్రతిపాదించెను.

రెండవప్రకరణము కావ్యప్రకరణము. ఇందులో గావ్యలక్షణము శబ్దార్థభేదములు, వృత్తులు, రీతులు, శయ్య, పాకము, కావ్యభేదములు, అవాంతరభేదములు, ఆఖ్యాయిక, కథ, చంపు, ఉద్ధరణము, భోగావళి మొదలగు ఖండకావ్యములు వానిలక్షణములు వర్ణింపబడినవి.

మూడవ ప్రకరణములో వివిధములైన రూపకములు, వానిలక్షణములు, ముఖ్యముగా నాటకము, పంచసంధులు, వానిఅంగములు, వానిలక్షణములు, వీనికన్నిటికి నుదాహరణభూతమైన ప్రతాపరుద్రీ కళ్యాణమను నొకకళ్యాణము ప్రతిపాదింపబడినది

నాల్గవప్రకరణము రసప్రకరణము. ఇందులో నవరసములు, వానిలక్షణములు, భేదములు నిరూపింపబడినవి. అయిదాఱు ప్రకరణములలో దోషములు గుణములు నుపపాదింపబడినవి. ఏడు, యెనిమిది, తొమ్మిది ప్రకరణములలో క్రమముగా శబ్దాలంకారములు, అర్థాలంకారములు, ఉభయాలంకారములు చెప్పబడినవి.

కావ్యప్రకాశికకంటె, ఏకావళికంటె నిందులో గావ్యాలంకార లక్షణము, నాటకలక్షణముకూడ ప్రతిపాదింపబడి యుండుటచే గ్రంథము విపులతరముగానున్నది. విశ్వనాథకవి రాజప్రణీతమైన సాహిత్యదర్పణము కూడ నిట్టిదే. చూడగానే మనస్సున కారోహించు నీనిలక్షణమేమనగా గ్రంథమందంతట బ్రతాపరుద్రునికీర్తి ప్రతాపవర్ణనము గ్రంథమందు బ్రతిపాద్యములైన సకలవిషయముల కుదాహరణములుగ నియ్యబడిన శ్లోకములన్నియు బ్రతాపరుద్రుని ప్రతాపమును, శౌర్యమును వదాన్యత్వసుగుణసంపదను వర్ణించుచున్నవి. కావుననే యీగ్రంథమునకు గవి ప్రతాపరుద్ర యశోభూషణమని పేరిడెను. ఈగ్రంథనామము నరసింహకవి రచించిన నంజరాజ యశోభూషణమను పేరుకు సదృశముగానున్నది. విద్యాధరుడు వ్రాసిన ఏకావళిలో నుత్కలదేశాధీశ్వరుడైన నరసింహరాజు, పురోహితదైవ శంకరనానాభాయి వ్రాసిన అలంకారమంజూషలో పేష్వాలైన మొదటి మాధవరావు, అతనిపినతండ్రి రఘునాథరావు వర్ణింపబడిరి.

మల్లినాథుడు రఘువంశాది మహాకావ్యములకు దానువ్రాసిన వ్యాఖ్యానములలో నీగ్రంథశ్లోకములను బహుళముగా నుదాహరించెను.[1]

మల్లినాథుడీ గ్రంథశ్లోకముల నుదాహరించిన స్థలములయందు గ్రంథముపేరుగాని గ్రంథకర్త పేరుగాని యెచ్చటను చెప్పలేదు. హిందూదేశపు దక్షిణభాగమం దీగ్రంథము, గ్రంథకర్త సుప్రసిద్ధముగా నుండుటచే టిపేర్లను చెప్పకపోవుట వాస్తవమని మహించుకొనవచ్చును. శేషగిరిశాస్త్రి టికి నీగ్రంథము దక్షిణహిందూస్థాన ప్రతిసంస్కృత విద్యాధిచేతను గృ

1 కుమారసంభవ వ్యాఖ్యానము సంజీవినిలో, కిరాతార్జునీయవ్యాఖ్య ఘంటాపథములోను, శిశుపాలవధ వ్యాఖ్యానము సర్వంకషలోను, భట్టి కావ్యవ్యాఖ్యానము సర్వపథీనములోను.

బడుచున్నదని సంస్కృతగ్రంథశోధననివేదికలో వ్రాసియున్నాడు విశ్వేశ్వర పండితుడు తనఅలంకార కౌస్తుభములోను, అప్పయదీక్షితులు చిత్రమీమాంసలోను, ప్రతాపరుద్రీయ శ్లోకముల నుదాహరించియున్నారు. "కతి పయదివసైః క్షయం ప్రయాయా త్కనకగిరిః కృతవాసరావసానః। ఇతిముదముపయాతి చ క్రివాకీ వితరణశాలిని వీరరుద్రదేవే" అను శ్లోకము నప్పయదీక్షితులు కువలయానందము లో సంబంధాతిశయోక్తి కుదాహరణముగా నిచ్చెను.

విద్యానాధుడు:—ప్రతాపరుద్ర యశోభూషణమను నీగ్రంథముతప్ప మరియేగ్రంథమునువ్రాసినట్లుకనపడదు. D R. Anfrecht ప్రతాపరుద్రకళ్యాణమును వ్రాసెనని చెప్పియున్నాడు కాని యదిప్రతాపరుద్రీయములో జెప్పబడిన నాటకలక్షణమును సంధులను స్పష్టముగా దెలియుట కుదాహరణముగా వ్రాసిననాటకముగాని స్వతంత్రగ్రంథముకాదు.

గ్రంథకర్త కాలము గ్రంథముయొక్క అంతరంగసాక్ష్యమువలనను (Internal evidence) ఏకశిలానగరము లేక ఒరంగలులో రాజ్యపరిపాలనముచేసిన కాకతీయరాజుల శాసనము వలనను సులభముగానిణయ యింపబడినది. అలంకారశాస్త్రచరిత్రను వ్రాసిన (Sushil Kumar De M. A. Ph. D.) సుశీలకుమారడెగారు ప్రతాపరుద్రుని కాలమును గురించియు, విద్యానాధునికాలమును గురించియు నిట్లువ్రాసియున్నారు.

He (Prataparudra) is described as a Kakatiya King whose Capital was Ekasila-nagara in the Tilingana or Andhra country and who is said to have vanquished among other kings the princes of the Yadava family. All these and other details have led Trivedi to identify Vidyanatha's patron with Prataparudra the seventh Kakatiya King of Ekasila or Orangal whose inscriptions date between 1298—1317 A. D. and who is placed by Sewell between 1295-1323 A. D. and by Seshagiri Sastri between 1268 and 1319 A. D. The Yadava King referred to therefore seems to be Ramachandra, sixth ruler of the yadavas of Devagiri, whose dates are 1271 to 1309 A. D. We may, therefore assign Vidyanadha approximately towards the end of the 13th and the beginning of the 14th century.

"ఒకపెద్దబండరాయి" అనునర్థమిచ్చు "ఒరుక్కల్" అనుపదము మహమ్మదీయుల ఉచ్చారణాసౌష్టముచే "వరంగల్" అయినది. అదియే సంస్కృతములో "ఏకశిలా "అయినది. ఒరంగల్ శబ్దమున కనేక విధోచ్చారణములు కలవు ఎట్లనగా—వొరంగల్లు, వొరంగోలు, ఒరంగల్లు, ఒరంగోలు, వోరువకల్లు, వోరువకల్లి, ఈవిశేషము లన్నియును, Sewell దొరగారువ్రాసిన "దక్షిణహిందూస్థానరాజవంశసంగ్రహము (Sketch of the Dynasties of Southern India) P 32) లోవ్రాసియున్నారు. ఆంధ్రదేశపుచరిత్రములో ఒరంగల్లుఅను రూపమున్నది. ఒకరాయి యని దానియర్థము, అదియే సంస్కృతభాషలో "ఏకశిలా "అయినది.

విద్యానాధుని కాలమీగ్రంథస్థసాక్ష్యమువలననే నిర్ణయింపబడుచున్నది. ఈగ్రంథమువలననే యీగ్రంథకర్త ప్రతాపరుద్రునికి సమకాలికుడని స్పష్టమగుచున్నది. ఈయలంకార

శాస్త్రము వలనను, శాసనముల వలనను. ప్రతాపరుద్రుని కాలము, చరిత్రము పూర్ణముగా దెలియబడుచున్నవి ఇతడు కాకతీయవంశపురాజు. ఏకశిలానగరమందు బ్రతిష్ఠింపబడిన వారికులదేవతయగు "కాకతి" యనుదుర్గనితడు పూజించువాడు గావున కాకతిరుద్రుడని వ్యవహరింపబడెను (రత్నాపణమను వ్యాఖ్యానము— "కాకతిర్నామ దుర్గాశక్తి రేకశిలానగరేశ్వరాణాం కులదేవతా, సాశక్తి భక్తజనీయా అస్యేతి కాకతీయః) ఎకశిలానగరము ఆంధ్రదేశమునకు రాజధానియైయుండెను. "శ్రీశైలము, కాళేశ్వరము, దాక్షారమము" అను స్థలములయందు మూడులింగములుండుచే త్రిలింగమని యీదేశమునకు బేరొదవినది గౌతమీనది, హనుమదచలము (అనుమకొండ) రాజధానికి అనగా వరంగలుకు దగ్గిరగానున్నవి. దుర్గాదేవి యీ కాకతీయవంశము వారికి కులదేవతగా వర్ణింపబడినది. "కాకతికుల దుర్గాదేవీసమారాధనేన విజయుపస్థాన మంగళంకృత్వా" ప్రతాపరుద్రునికివీరరుద్రుడని, రుద్రుడని నామాంతరములు కలవు ఇతనితండ్రిపేరు మహాదేవుడు. తల్లిపేరుముమ్మడి లేక ముమ్మడంబ.[2]

ఇతడు సూర్యునివలె బ్రకాశమానుండై యుండుటవలన బ్రతాపరుద్రుడనియు[3] కలియుగమందు ముమ్మడి పుత్రుడగుటచే త్రేతాయుగమం దవతరించిన రాముడనియు, ద్వాపరయుగమం దవతరించిన శౌరి (కృష్ణుడు) యనియు విద్యానాథుడీ గ్రంథమందు వ్రాసెను. ఈప్రతాపరుద్రుడు తనకాలమందు విద్యలను వృద్ధినొందించెను. తానుస్వయముగా పండితుడై యుండెను.[4]

అతనిభటు లంధ్రక్షమాభృద్భటులని చెప్పబడుచున్నారు[5] ప్రతాపరుద్రుడు వరాహధ్వజుడైనట్లొక శ్లోకముచెప్పుచున్నది.[6]

ప్రతాపరుద్రుని శత్రువులతని యనుగ్రహమును సంపాదించుటకు నాతని ధ్వజచిహ్నమైన వరాహమును తమగుండెలపై ధరించుచున్నట్లు వర్ణింపబడెను

ఇతడు "చలమర్తిగండ" యని బిరుదువ

---

2 (కావ్యప్రకరణము—20 శ్లోకము) "కౌసల్యా సీత్ప్రథమజననీ దేవకీచద్వితీయా విష్ణోర్మాతా తదనుమహితా ముమ్మడంబా తృతీయా"

3 తనుజాతం సముద్వీక్ష్యక్షోణ్యాం రవిమివోదితం।
ప్రతాపరుద్ర ఇత్యాఖ్యామకరో త్కాకతీశ్వరః।
విష్ణార్విశ్వైకవీరస్య కాకతీయ కులేస్థితం]
అవతార మమాంజ్ఞాత్వా వీరరుద్రం ప్రచక్షతే॥ (నాటక—ప్ర—11—12 శ్లో)

4 గోష్ఠీభిఃపరితోషయ న్బుధగణాన్షడ్దర్శనీ సీమభిస్సత్సాంప్రత మార్గదర్శన చణైస్సూక్తైఃక వీన్వ్రీణయన్ సంగీతోపనిష ద్రహస్య పిశునైరాతోద్యయోగ్య క్రమైర్దివ్యక సంసదివైణికాన్విహరతే శ్రీకాకతీం ద్రోనృపః॥

5 యోద్ధారోవయ మిత్యరీనభి భవంత్యంధ్ర క్షమాభృద్భటాః॥

6 "మన్దానాచల మూలమేచకలా సంఘట్టనశ్యామికా కారం యత్తుహినద్యుతౌ స్ఫురతి తత్సారంగ మాచక్షతే। మన్యేవన్విహ వీరరుద్రనృపతేః కీర్తిశ్రియానిర్జిత స్తన్ముద్రాంక వరాహమిందురు రసాబిభ్రత్సముజ్జృంభతే॥"

హించినట్లీ గ్రంథమందున్నది. "చలమర్త్య గండ" అనగా యుద్ధమునుండి పారిపోవు మర్త్యులకు పెద్దపాషాణము, లేకయుద్ధమునుండి యెప్పుడుమరలని ధైర్యము గలవాడని యర్థము.[7]

ఇంతియకాక నాటకప్రకరణములో నుదాహరణముగా వ్రాయబడిన ప్రతాపరుద్రీకళ్యాణమను నాటకము ప్రతాపరుద్రుని గురించియు, కాకతీయవంశపు రాజులనుగురించియు, గొంతవృత్తాంతమును దెలియజేయుచున్నది.

స్వయంభువు (శివుడు) కుటుంబస్థుల కందరికి వారివారి కృత్యములయందు దగినయుపదేశము లొనర్చు నిష్టదైవముగా నున్నట్లు చెప్పబడియున్నది.

వ్యాఖ్యాతయగు కుమారస్వామి చెప్పినట్లామె నిజమైనపేరు రుద్రాంబ, కాని ప్రతాపరుదీయవ్యాఖ్యాత యీరుద్రాంబ గణపతిరాజు భార్యయని భ్రమజెందినట్లు రుద్రాంబికావర్ణనశ్లోకావతారికవలన స్పష్టమగుచున్నది ఎట్లనగా:—

"పురాకిల కాకతికులసంభూతే గణపతి నామ్ని మహారాజే దుహిత్రమాత్ర సంతానే కదాచిద్దైవ యోగేన కాలపరిపాకముపేయుషి తన్మహిషీ రుద్రమదేవీ నామరాజ్ఞీ బహూనివ ర్షాణి తద్రాజ్య మకంటకం పరిపాల్య" (Professor Trivedi's Edition— P. 147—నాటకప్రకరణము చూచునది) రుద్రమదేవి గణపతికుమార్తెగాని భార్య కాదని నవీన చారిత్రాంశ శోధనవలన (Historical Research) దెలియవచ్చినది. మనుష్యులలో 'సోమ'యని వ్యవహరింపబడు నామె యీరుద్రాంబికతల్లి. సాక్షాత్తుగా ఉమ. గణపతినామమును ధరించిన ఆమెతండ్రి సాక్షాత్తుగా శివుడగుటచేత నామెగొప్పతనము చూపింపబడెను. గణపతిదేవుని యనంతరమందామె సింహాసనమెక్కెను. రుద్రదేవునికి శివుడు స్వప్నమందు దర్శనమిచ్చి ప్రతాపరుద్రుని గొప్పతనమును స్తుతించి మనుమడైన యతనిని బుత్రునిగా దత్తతచేసికొమ్మనియు రాజ్యభారమతనియందుంచమనియు జెప్పెను.[8]

తరువాత నీప్రతాపరుద్రుడు యౌవరాజ్య పట్టాభిషిక్తుడు కాకమునుపే దిగ్విజయార్థముబయలువెడలెను. మొదట తూర్పుదిక్కుకు బయలుదేరి కళింగదేశమును జయించెను. కళింగదేశమనగా నిప్పటి యుత్తరసర్కారులు. పిదప దక్షిణముగా బ్రస్థితుడై పాండ్యదేశమును వశపర్చుకొనెను. పాండ్యదేశమిప్పటి మధుర. పిదప బశ్చిమదిక్కును గెలిచెను. అనంతరము నర్మదదాటి యుత్తరదిక్కునకు బోయెను. అచట నంగవంగ మాళవరాజులు ముగ్గురేకమై యతనినెదిరించిరి. అందుపై ప్రతాపరుద్రుని సేనాధిపతులు స్పర్థాళువులై వారిని నిందించిరి. ఈయుద్ధమునందు ఘూర్జ

7 "చలానాం రణభీతానాం మర్త్యానాం గండః స్థూలోపల స్తద్వన్నాశకః। యత్రకుత్రా ప్యస్యప రాభవా భావాచ్చలమర్త్యగండఇతి అభీరుతోపలబ్ధిః"। కొన్నిచోట్ల చలమర్త్యగండి యనికూడ బ్రయోగమున్నది. "కుర్వంత్యశ్చల మర్త్యగండినృపతే జైత్రప్రయాణోద్యమాః॥"

8 "స్వీకృతే పుత్రభావేన దౌహిత్రే పాణ్మమాజ్ఞయా। అస్మిన్నిధేహిధౌరేయే గుర్వీమూర్వీధురామితి"

(నాటకప్ర—29 శ్లో)

రులు, లంపాకులు, వంగదేశస్థులు, కొంకణులు, హూణులు, మహారాష్ట్రులు, గెల్వబడిరి. చోళ కాశ్మీర నేపాళ సుహ్మకాంభోజ సేవన (నాసిక మొదలుకొని దేవగిరివరకు వ్యాపించిన దేశమునకు పేరు) గౌడలాట సింహళ కర్ణాట భోజ కేరళ పాంచాల కీకట దేశములను ప్రతాపరుద్రుడు జయించెను.[9]

యాదవవంశపు రాజులకు శిరోరత్నమైన సేవనుడనురాజు మహాపరాక్రమవంతుడైనను ప్రతాపరుద్రుని రణభేరీధ్వనిని విని పారిపోయెనని వర్ణింపబడినది.

ఈసందర్భమున జెప్పబడిన సేవణరాజే ప్రతాపరుద్రుని సైనికులచే నధిక్షిప్తుడై పారిపోవుట గౌతమినదికూడ నెరిగియున్నదని మఱియొకచోట వర్ణింపబడియున్నది.[10]

యాదవరాజు ఏకశిలానగరమువద్ద గౌతమీనదినిదాటి వచ్చుచుండగా వీరరుద్రుని సేనాధిపతి తిరిగి యానదినిదాటి తనరాజ్యములోనికిబోవునట్లు చేసెను. ఈయాదవరాజు పేరు రామచంద్రుడు లేక రామదేవుడు. ఇతడు దేవగిరిలోనేలిన యాదవరాజులలో నారవవాడు. వీనికాలము 1271—1309.

గణపతిరాజు గణపేశ్వరుని విగ్రహమును ప్రతిష్ఠచేయించెనని ప్రతాపరుద్రకళ్యాణనాటకములో జెప్పబడియున్నది.[11]

నాటక ప్రకరణములో గనపర్చబడిన ప్రతాపరుద్రుని వంశవృక్షము మీరీతిగానున్నది.

గణపతి (సోమను పెండ్లియాడెను)
|
రుద్రాంబిక (రుద్రయని ప్రసిద్ధి)
|
ముమ్మడంబ (మహాదేవునిభార్య)
|
ప్రతాపరుద్రుడు

---

9 నాటక—ప్ర॥ 14 శ్లో॥ రేరేగూర్ఘుర జర్ఘురోసి Etc.

10 రాజ్ఞోయాదవ వంశపార్థివమణేః ప్రఖ్యాతశౌర్యశ్రియః। స్త్వంగత్తుంగతరంగసైన్యమహతో మాసైకవిత్తస్యచ। సద్యో రుద్రనరేంద్రనాయకచమూనాథేనకేనాప్యధిక్షిప్తస్యాచరితాని సేవణపతే ర్జానాతిసాగౌతమీ॥

11 నాటక—ప్ర—21 శ్లో॥ యస్త్వద్గోత్రమహత్తరస్య జగతాంత్రాతు స్స్వయంభూవిభో।స్తత్తాదల క్ష్మీతాదృభతైర్మహిమభి స్స్వీయైర్విధీతీయోఽభవత్। దేవోఽసౌగణపేశ్వరః ప్రతికలంస్వాగప్రసాదో స్మ్మఖో। నప్తుస్తే కులమండనస్య మహతీం పుష్ణాతు రాజ్యశ్రియమ్॥

ఓరుగల్లు చరిత్ర.

మౌల్వీసయ్యద్ అహమదుల్లా ఖాదిరీసాహెబ్ గారు.

౧

ఓరుగల్లు దక్షిణహిందూస్థానమం దొక ప్రసిద్ధి వహించినట్టి చారిత్రకనగరము. ఈ నగరమును కాకతిప్రోలరాజు క్రీ. శ. (1150 1163) నిర్మించెను. ఇతనికనేకశతాబ్దముల పూర్వ మీ రాజ్యము ఆంధ్రరాజులచే బాలింపబడినది. తర్వాత కాకతీయులు దాని నాక్రమించుకొనిరి.

ఓరుగల్లు ప్రకృతము నిజామురాష్ట్రమునకు దక్షిణభాగమందున్నది. దీనిచుట్టును చాందాజిల్లాయు, కృష్ణాగోదావరీ నదులు, నల్లగొండ, అత్రాపుబల్దాజిల్లాలును, మెదకు కరీంనగరు జిల్లాలును గలవు. ఇది సముద్రమునకన్న సుమారు ౨౦౦౦ అడుగులయెత్తున నున్నది. తర్వాతికాలములో ముసల్మానులు దీనిని వారంగల్ అని పేర్కొనినను ప్రాచీనమున దీనిని ఓరుగల్లు అనియే వ్యవహరించిరి. రఘునాథభాస్కరుని కోశములో దీనిపేరు సంస్కృతమున ఏకశిలానగరమని భాషాంతరీకరణమొనర్చిరి. ఏకశిలయన "ఒకగుండు" అనియర్థము. ఓరుగల్లుయొక్క శిఖస్థాపన మొకపెద్దగుండుపై చేసినందున నీపేరువచ్చినదని యూహింపబడుచున్నది. యూరపు ఖండమున సుప్రసిద్ధుడగు డాక్టర్ లాసేనుగారు తనభూగోళములో దీని ప్రాచీననామము 'అరణ్యకొండ' అని వ్రాసినారు. ఇదిపొరపాటు. ఏలనన బహుకాలము క్రితము బెంగాలురాయల్ ఏషియాటిక్ సొసైటీ జర్నలులో దీని విషయమై గొప్పచర్చజరిపి తుదకు దీనిప్రాచీననామము అర్మనకొండ (అనమకొండ లేక హనుమకొండ) అని నిర్ణయించిరి. బత్లీమూసుయొక్క భూగోళములో పేర్కొనబడిన "కోరంకోల" అనునదియే యీ ఓరుగల్లు అని జనరల్ కన్నింగుహాముగారు నుడివియున్నారు.

౨

దక్షిణ హిందూస్థానమందు ఆంధ్రుల యధికారము క్షీణించినకాలమందు కాకతీయ గణపతివంశము ఓరుగల్లు పై రాజ్యము చేయదొడగెను. ఇదొక్కవంశమే దక్కనులో మామూలుకన్న నెక్కుడు ప్రఖ్యాతివహించినట్టిది. ఆంధ్రులయొక్కయు చాళుక్యులయొక్కయు ప్రభుత్వముల యనంతరము, ముసల్మానుల యాక్రమణానంతరముసహిత మీ సామ్రాజ్య మొకవిధముగా తంశక్తిని నధికారమును నిలుపుకొనగలిగెను. దీనిస్థాపన విషయమై చరిత్రకారులలో బహు భేదాభిప్రాయములు కలవు. కొందఱిది క్రీస్తుశకము ౧౨ వ శతాబ్ద మధ్యకాలమందు వృద్ధిపొందెనందురు. అనేకులు దీనియత్యంత ప్రాచీనత నొప్పుకొందురు. ఈరెండవ పక్షమువారి యభిప్రాయమున నీసామ్రాజ్య ప్రారంభము క్రీ. శ. ౭వ శతాబ్దికన్న పూర్వమునుండియే కలదని వాదింపబడుచున్నది. ఏలన క్రీ. శ. ౭వ శతాబ్దమందు సుప్రసిద్ధుడగు చీనాయాత్రికుడగు హ్యూన్‌షాంగ్ హిందూస్థానమందు

సంచారముచేసి దక్కనులోని రాజ్యములను గురించి చెప్పుచు నొకచో "దానా కాకతీయ వంశము"యొక్క సూచన చేసియున్నాడు. దీనిప్రాచీనతకు రెండవసాక్ష్య మేమన హిజిరీ ౧౨వ శతాబ్దిలో ప్రఖ్యాత చరిత్రకారుడగు "బదీవానీ" దీనిప్రారంభము క్రీ. శ. 2వ శతాబ్దముకన్న మున్నేయని నుడివియున్నాడు. ఇతడీవంశము తనకాలమువరకే ౭౦౦ ఏండ్లనుండి రాజ్యముచేసినట్లు చెప్పియున్నాడు.

ఈ వంశమునుగుఱించి తెనుగు అరవ భాషలలో నేప్రకారము విశేష చర్చ కలదో యట్టి దేయితరభాషలందును లేనట్లు తోచుచున్నది అయినను హిజిరీ ౧౩ వ శతాబ్ద మధ్యాంత్యకాలములలో తెనుగు అరవము కన్నడములోనుండి ఉర్దూ, ఫార్సీభాషలలోని కనువదింపబడిన యీవంశచరిత్ర కొంత విపులముగా లభ్యమగుచున్నది. ఎట్లన ౧౨౯౯ హిజిరీలో మున్షీఖాదిర్ ఖాన్ (బిద్రీ)అనునతడు ఖుతుబుషాహీ సుల్తానుల చరిత్ర నొక దానిని వ్రాసెను. దానిపేరు "తారీఖెఖాదిరీ."ఇందు వరంగల్ రాజుల విషయములు కూడగలవు. నిజమేమన, నీచరిత్ర తెనుగులో నుండిన"ప్రతాపచరిత్రము" నుండి గ్రహింప బడినది. ఈవంశము యొక్క ప్రారంభమును గురించి యందిట్లు వ్రాయబడినది—

"నందగిరి (ప్రకృతపునాందేడు) లో నందుడను పేరుగల యొక రాజుండెను. అతనియనంతరము యతని రాజ్యమును తన యిద్దఱు కుమారులు పంచుకొనిరి. ఒకడు "హనుమంతగిరిని" (ఇదియే హనుమకొండ) పాలించెను. ఇంకొకడు ఖందహారును తనరాజధానిగా జేసికొనెను (ఈఖందహారు నిజాముర్రాష్ట్రమందలి నాందేడు జిల్లాలోని పశ్చిమదిశయందలి తాలూకాయైయున్నది) మొదటి రాజు వంశము సంతానహీనమై నిలచిపోయెను. రెండవ వాని వంశము బాగుగా వర్ధిల్లెను. వీని ప్రతాపమును కటకము రాజు విని వీనిపై దండెత్తివచ్చెను. ఈ యుద్ధములో ఖందహారు రాజు సైన్యమోడెను. రాజుచచ్చెను. తదనంతర మాతని భార్య గర్భవతి యచ్చటి నుండి హనుమకొండకు పారిపోయి యొక బ్రాహ్మణు నింట దాగి యచ్మటమాధవవర్మ యను బాలుని గనెను. ఇతడే కాకతీయవంశ మూలపురుషుడు." "తారీఖెఖాదిరీ" గ్రంథకర్త ప్రతాపచరిత్రనాధారముగా గొని యీవంశ విషయమై యిట్లు చెప్పుచున్నాడు—

"ఓరంగల్ రాజుల వంశమని పేరుగాంచిన యీవంశము చోళవంశముతో సంబంధము కలది. దీనిమూలపురుషుడు మాధవవర్మ చోళరాజులయింటి కన్యనొకదానిని వివాహమాడెను."

డాక్టర్ బర్నెల్ యీవంశనామమగు "కాకతీయ" పదమును గురించి బాగుగా చర్చించి యిట్లువ్రాసియున్నాడు—

"కుమారస్వామిగా రనినట్లుగా యీవంశ నామము దుర్గాదేవియొక్క నామము ననుసరించి యేర్పడినది."

3

మొదటి వరంగలురాజులు సామంతరాజులుగా నుండిరి. విటపిరాజ్య మంతమొందినపుడు దానిని రాష్ట్రకూటు లాక్రమించుకొనిరి అదేసమయమున వరంగల్ రాజులు తమస్వాతంత్ర్యమును బ్రకటించుకొనిరి. క్రమేణ వారిసామ్రాజ్యము చాలవిస్తృతి నొందగా కొలదికాలములోపలనే దక్కను భాగమున కంతకు సమ్రాట్టులయిరి. ఈవంశపు మొద

టిరాజు త్రిభువనమల్లుడు. ఈతని ప్రశంస చరిత్రలో చాలకొలదిగా గాననచ్చు చున్నది. మఱియు అనేకచరిత్రకారు లితనికి వంశముతో సంబంధములేదనియే నిర్ణయించి నారు.

ఇతనియనంతర మితనికొడుకు ప్రోలరాజు (౧౧౫౦—౧౧౯౩ క్రీ. శ.) రాజ్యాభిషిక్తు డయ్యెను. ఇతడు చాళుక్యరాజగు తృతీయ తైలపుని యుద్ధమందోడించెను. ఇతని కాలమందే వరంగల్ అపూర్వాభివృద్ధి నొందెను. ఇతనిజీవనము విశేషభాగము యు ద్ధములందే వినియుక్తమయ్యెను. ఇతని విజయ ములపట్టిక చాలపెద్దది. తనకుప్రతికూలుడై యాచరించిన గోవిందరాజును సంపూర్ణముగా పాదాక్రాంతునిగా జేసి, యతనిజెరపట్టి, వాని రాజ్యమును యాదవరాజు కొకనికిచ్చెను. అ తని రెండవయుద్ధము ఇప్పుడు విస్తృతమైనట్టి "మండకోట" (మాన్యఖేట ?)పై జరిగెను. ఈప్రోలునే కాకతీయులలో బ్రథమునిగా నెంచుచున్నారు ఇతడే వరంగలు రాజ్యస్థాప న గావించెను.

ఇతనియనంతరము ప్రథమ రుద్రదేవుడు రాజయ్యెను ఇతడే వేయిస్తంభముల దేవా లయమును గట్టినవాడు. ఇతనిచరిత్రాంశములు హనుమకొండలోని శాసనమున గననగును. యాదవవంశమందు పదునారవరాజగు "మల్లు గి" రాజుయొక్క ముఖ్యపట్టణమగు "సీనదే శ" మును నితడు జయించెను. మరియు పొ లవాసిరాజు నొకగొప్పయుద్ధమందు నిర్జించెను. చోళచాళుక్యరాజ్యములపై ప్రభుత్వము చేకుచుండిన భీమరాజు నోడించి యతని రాజ్యమందలి కొంతభాగమును తనరాజ్యము లో గలుపుకొనెను.

ఇతనికాలములో గొప్పగొప్ప దేవళములు సుందరమైన మందిరములు నిర్మింపబడెను. ముఖ్యముగా నితడు వరంగలు సరిహద్దుల నే విధముగా విస్తరింపజేసెనో యావిషయమితని నెల్లప్పుడును స్మరింపజేయునట్టిది. ఇతడు చని పోయినప్పు డితనికి సంతానము లేకండెనని యు, మహాదేవుడను నొకతమ్ముడుండెననియు ప్రతాపచరిత్రమందు వ్రాయబడినది

మహాదేవునియనంతర మతని కుమారుడు గణపతిదేవుడు రాజ్యమునుబాలించెను. ఆది నుండియు దేవగిరి యాదవులకును కాకతీయుల కును మనస్తాపములుండుచు యుద్ధములు జరు గుచుండెను. కాని యిప్పుడీ గణపతి శాంతిప్రి యుడై యాదవులతో సంప్రీతించియుండెను. స్నేహమును వృద్ధిపఱచు నిమిత్తమై యాదవుల కన్యనుబెండ్లాడెను. ఈరాజు పరిపాలనమందును దిగ్విజయమందును ప్రథమరుద్రదేవునితోస మానుడు. ఇతడు పరదేశములజయించి వానిని నాశనము చేయనొల్లడు. ఎందుజూచినను సుంద ర నిర్మాణములనుజేసి శిల్పకళలకును సంగీత సాహిత్యములకును పోషకుడయ్యెను. ఇతనికి సాహిత్యమందు మంచిఅభినివేశముండెనని ప్ర తాపచరిత్రకారుడు వ్రాసినాడు. ఇతనియాస్థా నమందు గొప్ప గొప్ప పండితులు గుమికూడి యుండిరి. ఇతడే ఓరుగల్లు చుట్టును దిట్టమైన (జబర్దస్తు) కోటను నిర్మించెను. ఓరుగల్లు కో టలో నిప్పుడసంపూర్ణమై శిథిలమై యుండు దేవాలయ మితనిరసికతకు నిదర్శనము. ఇది అసంపూర్ణమైనను నేటికాలమందును సీద్ధేవా లయము దక్కనులోని వేళ్లలెక్కింపదగి న శిల్పరాజములలో ముఖ్యమైనది. ఇతని కాలములో వరంగల్లు రాజ్యవిస్తీర్ణము మరిం త వృద్ధిగాంచెను. దక్షిణగుజరాతు రాజ్యము

ను బెంగాలురాష్ట్రమును నితనికి లోబడిపో యెను. ఇతనిరాజ్యపు సరిహద్దు దక్షిణమున నెల్లూరు వఱకు వ్యాపించెను. తూర్పుదిక్కున నుండు రాజ్యములును ఇతనికి లోబడెను. ఇతడు క్రీ. శ. ౧౨౫౭ లో మరణించెను. కాని కొందఱుచరిత్రకారు లితడు ౧౨౬౧ లో చనిపోయెననివ్రాసిరి. ఈరాజుకు సహితము సంతానములేకుండెను. ఇతని యనంతర మితని భార్య(?) రుద్రమదేవి (క్రీ. శ. ౧౨౬౧-౧౨౯౪) రాజ్యముచేసెను. ఈమె విషయమై మార్కోపోలో తనగ్రంథమందిట్లు వ్రాసెను- "ఈరాణి రాజ్యమందీమె భర్తకాల మందునులేని వ్యవస్థ యేర్పాటుచేయబడియుండెను" ఈమె 32 ఏండ్లురాజ్యము చేసెనని డాక్టరు హేగువ్రాసినాడు. గణపతి ౧౨౬౧ లో చనిపోయెనని నిర్ణయించిన నీమె 33 ఏండ్లురాజ్యముచేసినట్లు నిశ్చయమగును. ౧౨౭౪ లో నీమె రాజ్యభారము వదలుకొనెను. ప్రతాపరుద్రుడు రాజయ్యెను. ఇతనికాలములో రాజ్య విస్తీర్ణము పాలేరు గోదావరీ నదులమధ్యభాగనుగూడికొని పడమటికనుమలవరకు వ్యాపించెను. ప్రతాపరుద్రుని కాలమున వరంగల్లు రాజ్యముక్షీణత నొందజొచ్చెను. మొట్టమొదటి మారు ౧౩౦౩ క్రీ. శ. లో ముసల్మానుల దాడిప్రారంభమయ్యెను. కాని ముసల్మానులు జయముపొందజాలరైరి. 7 వత్సరముల తర్వాత మరల క్రీ. శ ౧౩౧౦ లో మలిక్ కాఫూర్ దండెత్తివచ్చి యీరాజు సామంతుడగుట కొప్పుకొనుటచే నీతని విడిచిపుచ్చెను. కాని తర్వాత నీరాజు తనపేరు ప్రతిష్ఠలు నిలుపుకొనుటకై తనస్వాతంత్ర్యమును బ్రకటించికొనెను. అందుచే మరల రెండవమారు సుల్తాన్ మహమ్మదుతొగ్లకు అమీర్ గయాసుద్దీన్ యొక్క అనుమతిచే దాడివచ్చి, ప్రతాపరుద్రుని జయించి, వరంగల్లును ఢిల్లీసామ్రాజ్యములో కలుపుకొని, రాజును బందీకృతుడజేసి ఢిల్లీకి పంపెను. కాని గయాసుద్దీనింతటిగొప్పరాజు నీస్థితియందుజూడ నొల్లక త్వరలో నాతని వదలిపెట్టెను. మరియు వరంగల్లునుగూడ వాపసుఇచ్చెను. ఈ కారణముచే వరంగల్లు కళాహీనమై దానియంగము లాకురాలిన వృక్షమువలె నొకటొకటిగా జారిపోయెను.

ప్రతాపరుద్రుని యనంతరము వీరభద్రుడు లేక కృష్ణుడు అనునతడు రాజయ్యెను. ఇతడీ వంశసంబంధీకుడు. కాని యితడు కొంతకాలములోపలనే రాజ్యకాంక్షవదలి విస్మృతుడయ్యెను. ఇతనియనంతర మీవంశముయొక్క విషయములు మనకేమియు తెలియవు. అయినను తెలింగానా హిందువులు క్రీ.శ. ౧౩౨౩-౧౩౪౪ ప్రాంతములలో మహమ్మదు తుగ్లకు యొక్క అంత్యకాలములో తిరుగుబాటు చేసినట్లు కనబడుచున్నది. ఈవంశమువాడగు కన్నయ్య నాయకుడనువాడు ముసల్మానుల పారతంత్ర్యమును ద్రోసిపుచ్చి తన స్వాతంత్ర్యమును బ్రకటించికొనెను. తుగ్లకు ఈతని మరలజయించి తన యధికారమును పునస్థాపన చేసెను. కాని మహమ్మదుతుగ్లకు వంశమందు సామర్థ్యము క్షీణింపగా, అలాలుద్దీన్ హసిన్ బహామనీ వరంగలురాజులను ఢిల్లీసుల్తానులకు మారుగా దనకే కప్పముకట్ట నిర్బంధించెను. అటుపిమ్మట క్రీ. శ. ౧౪౨౨ లో బిదరులోని బహామనీసుల్తానులకు వరంగలు వశమయ్యెను. తర్వాత నిది గోలకొండ ఖుతాబుషాహీలకు లోబడెను. ఇప్పుడిది అసిఫియావంశమువారి పరిపాలనలో నున్నది.

పాలకురికి సోమనాథకవి

శ్రీయుత బండారు తమ్మయ్యగారు.

ఉ॥ తేనియ సోనలం జిలుకు ♦ తేటగు జాను దెనుంగుఁబల్కులన్
వీనులఁ దన్పు కబ్బముల ♦ నిక్కపు దేసితెనుంగుఁ గైతకున్
బ్రాణము వోసినట్టి బుధ ♦ వంద్యుని శ్రీబసవేశచి తనా
మౌనృతచిత్తుఁ బాల్కురికి ♦ సోమకవీంద్రుని సంస్మరించెదన్॥

కాకతీయులు శిల్పకళతోపాటు కవితా శిల్పమునుగూడ ననల్పముగఁబోషించిన మహానీయులు. ఆంధ్రగీర్వాణవాఙ్మయములకు వారొసంగిన యవలంబము చిరస్మరణీయము. రెండవప్రతాపరుద్రుని యాస్థానకవిగా నుండిన విద్యానాథుఁడు రచించిన ప్రతాపరుద్రయశోభూషణమను నలంకారగ్రంథ మా ప్రతాపరుద్రచక్రవర్తి కీర్తి రమకేగాక సంస్కృతాలంకార వాఙ్మయలక్ష్మికెల్ల శాశ్వతామూల్య విభూషణమయి వెలుఁగొందునట్లే, మొదటి ప్రతాపరుద్రుని యాశ్రయము నొంది పాలకురికి సోమనాథుఁడు రచించిన బసవపురాణ పండితారాధ్య చరిత్రము లాంధ్రకవితాసతి కనుపమానాలంకారములయి విరాజిల్లుచున్నవి. కాకతీయులనాఁటి గీర్వాణ వాఙ్మయమునకు విద్యానాథుఁ డెట్టివాఁడో యాంధ్రవాఙ్మయమునకు సోమనాథుఁ డట్టివాఁడు.

కాని యీ సుకవిసోముఁడు వీరశైవప్రతిశీలుఁడయి కేవలము తన్మతగ్రంథములనే రచించినవాఁ డవుటచే జనసామాన్యమున కాతనినామ మంతగాఁ బరిచితము కాకపోయెను. భాషావిశేషములు, చారిత్రక విషయములు తెలిసికొనఁగోరు నేకొలఁది భాషాసేవకులకో తప్ప వీరశైవ మతాంతరులలో నెవరికి నీతని గ్రంథములను జదువు నాసక్తి లేకుండుటయు, ఆంధ్రభాషాభిమానమున కవలంబములయిన యివ్వటి శుద్ధాంధ్ర మండలములలో వీరశైవ మతమిప్పుడు విశేషవ్యాప్తిలో లేకుండుటయు, ఆమండలములలో స్వల్పసంఖ్యాకులయి యున్న తన్మతస్థులయినను బలువు రిప్పుడు విద్యామతములు రెంటియందును వెనుకఁబడి యుండుటయు, రానురా నాంధ్రవాఙ్మయమున నిరసనమునకు గురియయిన ద్విపదలో నీతఁడు తన ప్రధాన గ్రంథములు వ్రాసియుండుటయు, అచ్చుపడిన యీతని గ్రంథములయినను బరిశుద్ధముగ ముద్రింపఁ బడకుండుటయు, నీతఁడును నీతనికావ్యములును వెనుకఁబడుటకు ముఖ్యకారణము లయినవి. వీరశైవ మతాభిమాను లొక్కరికేగాక యాంధ్రభాషాభిమాను లందఱకుఁగూడ నీకవివరుని గ్రంథము లవశ్యపఠనీయము లని విన్నవింపఁ దగియున్నది. తేనెలొలుకు తెలుంగుబాస నుడికారపు సొంపును, సహజమాధుర్య విలాసములను జవిచూచి, యాంధ్రకవితాసతి యథార్థస్వరూపమును దిలకింపఁ గోరువారెల్ల నీ సు

కవిచంద్రుని బసవపురాణ పండితారాధ్య చరిత్రములను జదివినఁగాని కృతార్థులు కాఁజాలరు. తెలుంగుకవితను మూఁడుపాళ్ళు సంస్కృతపదములతో నిర్మించిన నన్నియభట్టారకుని మార్గమునకు వన్నియ వెట్టఁదలంచి, తెలుంగుకవిత నిక్కంపువిన్నాణము, ప్రాణము, తేనియలొలుకు తెలుఁగుఁబలుకు బడులలోనే కలదని గ్రహించి, మూఁడుపాళ్ళు రసోచితములగు జానుతెనుంగు నుడులతో నాంధ్రీకరణ యుగారంభముననే స్వతంత్రి కావ్యరచనమునకుఁ గడంగి, యాంధ్రకవితామహౌషధికి జీవనము వోసిన కళానాథుఁడు పాలకురికి సోమనాథుఁడే. అసదృశ నైపుణ్యముతో రస మొలుకు దేశీయపదజాలమును గూర్చి జాతీయకవితా నిర్మాణమొనర్చిన నన్నెచోడ, తిక్కన, నాచన సోమనాథాది మహాకవులకెల్ల మన సుకవిసోముఁడే మార్గదర్శకుఁడనుట సత్యదూరము కాదు. నిక్కమగు తెలుఁగుకవితకు మూలస్తంభమయి వెలసినవాఁడయ్యు నీమహనీయుఁడు పూర్వోక్త కారణములచే విస్మృతప్రాయుఁ డగుటచేఁ గవిచరిత్రకారులగు శ్రీవీరేశలింగముపంతులుగారు తమ గ్రంథమున నీతని కర్హగౌరవ మొసంగి యీతని కవితావిశేషాదికములను దగువిధమున వెలయింపరయిరి శబ్దరత్నాకరకారు లీతని గ్రంథములను దలస్పర్శముగఁ బరిశీలించి యాంధ్రవాఙ్మయమున నీతనికిఁగల స్థానమును గుర్తింపనేరక తమనిఘంటువునం దీతనిని సామాన్యకవులతోపాటు కడపటి తరగతిలోఁ జేర్చిరి. కావున నీతనిజీవితమును గవితావిశేషాదికములను లోకమున కుచితరీతిని దెలియఁబఱచి యీతని గ్రంథములు సత్వరముగఁ బండిత పరిష్కృతములయి పరిశుద్ధముగఁ బ్రకటింపఁబడవలసిన యావశ్యకతను హెచ్చరించుటకయి ఆంధ్రపత్రిక దుందుభి సంవత్సరాది సంచికలో నొకచిన్నవ్యాసముఁ బ్రకటించితిని. ఈకవివరుని బసవపురాణమును, వృషాధిపశతకమునుమాత్ర మిప్పటికిఁ బరిశుద్ధముగఁ బరిష్కృతము గావించి ప్రకటించిరి. చరిత్రాభిమానులకు నీమహాకవి చరిత్రాదికములు మఱింత విపులముగఁ దెలియుటకయి యిప్పుడీవ్యాసమును బ్రకటించు చున్నాను.

సోమనాథుని స్థలము:—ఈఁతడు కాకతీయ రాజధానియగు నేకశిలానగరమునకు సమీపమందున్న పాలకురికి గ్రామవాస్తవ్యుఁడయినట్లు లీతని గృహనామమునుబట్టియు, నీతనిశిష్యప్రశిష్యుఁడు పిడుపర్తి సోమనాథకవి యీతని కంకితముగా రచించిన పద్య బసవపురాణము యొక్క యవతారికనుబట్టియుఁ దెలియును గును. ఈతని శిష్యప్రశిష్యకోటిలోఁజేరిన మరియొక కవి యీతనికంకితముగా రచించిన అన్యవాద కోలాహలమను సీసశతకము నందలి పద్యమువలనఁగూడ నీవిషయము విశదము కాగలదు.[1] పాలకురికియందు వెలసిన శివలింగ

1 సీ॥ భవదీయ సంబంధ బంధురంబయ్యెనే। భాగ్యంబు చేసెనో పాలకురికి
భవదంఘ్రిపూజనా పరులకిమ్మయ్యెనే। భాగ్యంబు చేసెనో పాలకురికి
యుష్మద్విహారసంయుక్తమై వెలసెనే। భాగ్యంబు చేసెనో పాలకురికి
యుష్మదీయాశ్రమాత్యున్నతిఁ బొందెనే। భాగ్యంబు చేసెనో పాలకురికి
గీ॥ పాలకురికి యెట్టి భాగ్యంబు చేసెనో నీస్వనామపూర్వ నిహితమయ్యె
నీహితానుషంగ! యేకామ్రగురుచిత్త నలినభృంగ! సోమ నాథలింగ॥

మునకు సోమేశ్వరుఁడనిపేరు. ఆదేవుని నామ మును బట్టియే మనకవి తలిదండ్రి లాతనికి సోమనాథుఁడని పేరిడినట్లు కాననగును. ఈసోమేశ్వరస్వామి కంకితముగానే సోమనాథస్తవమను చిన్న ద్విపదకృతి యొకటి సోమనాథుఁడు తన ప్రథమవయస్సులో రచించియున్నాఁడు.

సోమనాథుని కాలము:—సోమనాథుని యనంతరము రమారమి మూఁడువందల సంవత్సరముల కనఁగా క్రీ. శ 1520 ప్రాంతమునకుండిన పిదుపర్తి సోమనాథకవి తన పద్యబసవపురాణావతారికలో మన పాలకురికిసోమనాథుడు రచించిన ద్విపదబసవపురాణము నోరుగల్లులో స్వయంభూదేవు మంటపమున నొకనాఁడు భక్తులు చదువుచుండగాఁ గాకతిప్రతాపరుద్రుఁ డచ్చటికేతెంచెననియు, నప్పుడు ధూర్తవిప్రుఁడొకఁ డాగ్రంథమును నిందింపఁగా నీ వార్తవిని, సోమనాథుఁడోరుగంటి కేతెంచి బ్రాహ్మణులనోడించి ప్రతాపరుద్రునిచే సత్కారముల నొందెననియుఁ జెప్పినాఁడు. మఱియు సోమనాథుని శిష్యుఁడును బ్రతాపరుద్రుని మంత్రియునగు ఇందులూరియన్నయచేఁ దనపూర్వులగు శివరాత్రి కొప్పయ్య మున్నగు సోమనాథుని శిష్యులకు దోకిపట్లుగ్రామము నగ్రహారముగా నిప్పించెననియు, దేశము త్వరలోఁదురుష్కాక్రాంతము కానున్నదనియు, చెప్పి సోమనాథుఁడు తన యాచారవ్యవహారముల కచ్చట భంగము వాటిల్లునని తలఁచి యటనుండి వెడలి కర్ణాటదేశమున శివగంగకు సమీపమునన్నున్న కలికెమను గ్రామమున సమాధి నేర్పఱచుకొని, కొన్నాళ్ల కచ్చట సిద్ధినొందెననియు వ్రాసియున్నాఁడు. ఈకథను బట్టి సోమనాథుఁడు రెండవప్రతాపరుద్రుని (క్రీ. శ. 1290—1326) కాలమువాఁడనుట సంగతముగా నుండును. ఈప్రతాపరుద్రుని యనంతరమే కాకతీయసామ్రాజ్య మస్తమించి దేశము తురుష్కుల యధీనమయ్యెను. ఇందులూరి యన్నయదేవుఁడు రెండవప్రతాపరుద్రుని మాతామహియగు కాకతి రుద్రమదేవి కొమరిత రుయ్యాంబికను వివాహమై రుద్రమదేవి కాలమునను రెండవప్రతాపరుద్రుని కాలమునను దన యనన్యక్రవిక్రమంబున గాకతి సామ్రాజ్యమును విస్తరింపఁజేసిన పరాక్రమశాలి. ఈతనిశాసనములు క్రీ. శ. 1290—1295 ప్రాంతమునఁ గానవచ్చుచున్నవి. కావునఁ బయికథనుబట్టి సోమనాథుఁడు రెండవప్రతాపరుద్రుని కాలమువాఁడని పలువురు తలంచుచుండిరి. శ్రీవీరేశలింగము పంతులుగారు కవులచరిత్ర మొదటిముద్రణములో నట్లేలిఖించిరి. కాని యటుతరువాత రచింపఁబడిన కర్ణాటకవి చరిత్రములోఁ దచ్చరిత్రకారులు, శాలివాహనశకము 1144 (క్రీ. శ. 1222) సంవత్సరమునఁ దనగ్రంథమును రచించితినని విస్పష్టముగాఁ జెప్పికొనిన యుద్భట కావ్యకర్తయగు కన్నడకవి సోమరాజు తన గ్రంథములో "సముదంచ ద్వృషభస్త వామర మహీజారామనం సోమనం" అని పాలకురికి సోమనాథుని నుతించినట్లు ప్రమాణమును జూపి, సోమనాథుఁడు మొదటి ప్రతాపరుద్రుని కాలముఁ క్రీ. శ. 1195ప్రాంతమున, నుండియుండునని నిరూపించిరి. దీనితో సోమనాథుఁడు రెండవప్రతాపరుద్రుని కాలమువాఁడను పూర్వాభిప్రాయము పరాస్తమయ్యెను. కర్ణాటకవి చరిత్రకారుల యీనిర్ణయము ననుసరించి శ్రీవీరేశలింగముగారు 1917 సంవత్సరమునఁ బ్రకటించిన కవులచరిత్ర పునర్ముద్రణములో సోమనాథుఁడు మొదటిప్రతాపరు

దుర్గిని కాలమున క్రీ. శ. 1195 సంవత్సరము న కించుకపూర్వమే, క్రీ. శ. 1180 సంవత్సర ప్రాంతమున నుండియుండునని లిఖించిరి. క్రీ.శ. 1222 నాఁటికిఁ గవిస్తుతికెక్కిన సోమనాథుఁడు మొదటిప్రతాపరుద్రుని (క్రీ. శ. 1140_1196) కాలముననుండి యుండవలెననుటయే సర్వవిధములను సంగతముగానుండును. కాని కర్ణాటకవిచరిత్రకారులు సోమనాథుని పండితారాధ్యచరిత్రమును స్వయముగాఁ జూడక నందుకు గురు రాజకవియొసర్చిన సంస్కృతానువర్తనమునందలి[2] శ్లోకముల నుదాహరించి, వానినయినను సరిగా నర్థముచేసికొనక, కింకరుఁడను నర్థమిచ్చు భుజిష్యశబ్దమును శిష్యశబ్ద పర్యాయముగా భ్రమించి, క్రీ. శ. 1168 ప్రాంతమున లింగైక్యమయిన బసవేశ్వరునికి శిష్యపుత్రుఁడయిన సోమనాథుఁడు క్రీ. శ. 1195 ప్రాంతమువాఁడయి యుండునని తమ నిర్ణయమును సమర్థించుకొనిరి. శ్రీవీరేశలింగముగారు కూడఁ బయిశ్లోకములకు మూలములగు సోమనాథుని పండితారాధ్య చరిత్రమందలి ద్విపదపంక్తులను జూడక కర్ణాటకవి చరిత్రకారుల వాక్యములనే యనువదించుట శోచనీయము. సోమనాథునకు వీరశైవ మతోద్ధారకుఁడగు బసవేశ్వరునందలి భక్తిపారవశ్యమపారము. బసవశబ్దశ్రవణమాత్రముననే యీతఁడొడలు మఱచును. పండితారాధ్యచరిత్రము నీతఁడు బసవేశ్వరునకే యంకితమొనర్చినాఁడు.[3]

పురాతన వీరశైవులకుఁ దాముపుత్రులమని, బంటులమని, బానిసలమని, తద్భక్తులమని, ఇత్యాదిగా భక్తిభావమునఁ జెప్పుకొనుట వీరశైవులకు మతసంప్రదాయము. బసవేశ్వరునిగూడ నీతఁడిట్లేవృషాధిప శతకములో బురాతనశివభక్తులకుఁ బుత్రునిగాను, సేవకునిగాను బహువిధములుగా వర్ణించియున్నాఁడు. ఇంతియేగాదు బసవేశుని పుత్రుఁడనని చెప్పికొనుటయేగాక "మునుబసవపురాణ మున నెన్నఁ బడిన। పెనుపారుభక్తుల పెంపుడుకొడుక" ననికూడ సోమనాథుఁడు చెప్పికొనినాఁడు. కావున బసవేశ్వరునియెడ నీతఁడు చెప్పికొనిన సంబంధములఁ బట్టి యీతని కాలనిర్ణయమొనర్చుట ప్రమాదమని వేఱెచెప్పనక్కఱలేదు. కర్ణాటకవి చరిత్రకారులుగ్రహించిన "బసవేశభుజిష్యాత్మభవః" అనునది "బసవన యిలుపుట్టి బానిసకొడుక" అనుదానికి గురు రాజకవియొసర్చిన సంస్కృతీకరణము. సోమనాథుఁడు బసవేశ్వరపండితారాధ్యులను స్వయముగా నెఱింగిన తత్సమకాలీనుఁడు కాఁడనియే నాయభిప్రాయము. బసవచరితమును దాను భక్తులచేవిన్నవిధమునఁ బురాణముగా

---

2 "గురులింగార్యస్య దయూహస్త గర్భపముద్భవః। బసవేశస్య తనయః బసవేశ్వర గోత్రికః। బసవేశభుజిష్యాత్మభవో బసవకింకరః"

3 "బసవనిపుత్రుండ బసవగోత్రుండ। బసవేశు శ్రీపాదపద్మశేఖరుఁడ। బసవనిఁబొగడఁ బాల్పడు కవీంద్రుండ। బసవని బొగడ బాల్పడు పాఠకుండ। బసవన్న దూత నే బసవన్నబంట। బసవన్న యిలుపుట్టు బానిసకొడుక । బసవన్న లెంక నే బసవన్న లెంగి। బసవన్న పన్నల పన్నగావునను। బసవన్న పేరిడఁ బ్రాప్తవ్యమగుట। మసలక మాచెన్న మల్లికార్జునుని। బసవనామంబిడి భక్తి పెక్కువను। బసవలింగంబని ప్రణుతించువాఁడ"

రచించితినని సోమనాథుఁడే చెప్పికొనినాఁడు.[4] కావున నీపరిస్థితులనెల్ల బర్యాలోచించి, సోమనాథుఁడు బసవవేశ్వరుఁడు లింగైక్యమయిన క్రీ. శ. 1168 సంవత్సరమున కించుకముందో తరువాతనో జనసమొంది, మొదటి ప్రతాపరుద్రుని రాజ్యావసాన కాలమున క్రీ. శ. 1192 ప్రాంతమునాఁటికిఁ బ్రసిద్ధుఁడయి యుండునని దుందుభిసంచికలో నొకవ్యాసమున వ్రాసి యుంటిని. ఇట్టియాతఁడు ప్రథమ ప్రతాపరుద్రునికాలమున నుండెననుట నిర్వివాదాంశమనియు, పిమ్మట సోమనాథుఁడు మనసోమనాథునకుఁ దరువాత మూఁడువందల సంవత్సరములకు వెలసినవాఁడవుటచే నాతఁడు తన విసికిడిని బట్టి పద్య బసవపురాణావతారికలో వ్రాసిన సంగతులలోఁ గొన్నివ్యత్యాసములు చేరియుండునుగావున నవి ప్రమాణములు కావనియుఁ బలువురు తలంచుచున్నారు. కానినామిత్రులు శ్రీ నిడదవోలు వెంకటరమణగారు సోమనాథుఁడు మొదటి ప్రతాపరుద్రుని కాలములో క్రీ. శ. 1192_1195 ప్రాంతములకే ప్రసిద్ధుఁడయి యుండఁడనియు, క్రీ. శ. 1190 ప్రాంతమునజనించి 1225 సవంత్సరప్రాంతములకు బసవపురాణాది కరచనములచేఁ బ్రసిద్ధుఁడయి సమకాలీనుఁడగు కన్నడకవిసోమరాజుచే స్తుతింపఁబడి యుండుననియు, నాతనికాలము క్రీ. శ. 1190_1250 అని నిర్ణయించుట సంమంజసమనియు, రక్తాక్షిసంత్సరములోసారస్వతసర్వస్వము(సం 1 సం 11&12)లోఁ బ్రకటితమయిన "శ్రీపాల్కురికి సోమనారాధ్యుల కాలము" అను వ్యాసమునందులిఖించిరి. వీరి ట్లుతలంచుటకు ముఖ్యకారణము క్రీ. శే. శ్రీకొమర్రాజు వెంకటలక్ష్మణరావుపంతులుగారు శివతత్త్వసారపీఠికలో మల్లికార్జున పండితారాధ్యుని కాలము క్రీ. శ. 1120_1190 అని నిర్ణయించుట యేయునితోఁచుచున్నది. పండితారాధ్యుఁడు క్రీ. శ. 1190 వఱకు జీవించి యున్నప్పుడు సోమనాథుఁడు క్రీ.శ. 1192 నాఁటికేప్రసిద్ధుఁడయినచో నితర గురువుల నాశ్రయించుటమాని పండితారాధ్యుని యొద్దనే విద్యనేర్చియుండఁడాయని, శ్రీలక్ష్మణరావుపంతులుగారు పండితారాధ్యుఁడు క్రీ. శ. 1190 వఱకు జీవించెనని తలంచుటకుఁ దగిన యాధారములు లేవు. బసవేశ్వరుని నిర్యాణకాలము క్రీ. శ. 1168 అని వారంగీకరించిరి. అట్టిచోఁ బండితారాధ్యుఁడు బసవేశ్వరుని యనంతరము 22 సంవత్సరములువఱకు జీవించెనని వారుతలంచుట యసంగతము. బసవేశ్వర పండితారాధ్యులఁ గూర్చి తెలియుటకు వారియనంతర మతిసమీప కాలముననే రచింపఁబడిన సోమనాథుని గ్రంథములకంటెఁ బ్రబలప్రమాణములు లేవు. పండితారాధ్యుఁడు వెలనాటిచోడుని యాస్థానములో బౌద్ధులను జయించి మహిమాదికములఁ గనఁబఱిచి బసవేశ్వరుని దర్శించుటకుఁ గల్యాణపట్టణమునకేఁగుచు వనిపురమను గ్రామమున నుండఁగా నప్పటి కెనిమిది దినములయి బసవేశ్వరుఁ డవతారమును జాలించి సంగమేశ్వరునం దైక్యమయ్యెనను సంగతిఁ దెలియవచ్చి మిక్కిలి ప్రలాపించెననియు, అటుతరువాత నటనుండి కదలి శ్రీశైలమునకేఁగుచు

4 "ప్రస్తుతింపంగ సద్భక్తివిస్ఫురణఁ। బ్రస్తుతికెక్కిన బసవనిచరిత। చెప్పితిభక్తులచే విన్నమాడ్కిఁ। దప్పకుండంగను దాశక్తిఁజేసి"

వెల్లటూరునందు నివసించి, నిజశిష్యుఁడగు దోనయ్యను శ్రీశైల ప్రదక్షిణముసేయ నియమించి, శివరాత్రి మహోత్సవము నాతనిచే నిర్వర్తింపఁజేసి, శ్రీశైల యాత్రాఫలమును గాంచెననియు, బసవేశ్వరుఁడు వెడలిపోయినప్పుడు తానీప్రపంచమున నుండియుఁ బ్రయోజనము లేదుఁగావునఁ దన్నుఁగూడ బసవేశ్వరునివలె నైక్యమొనర్చు కొమ్మని శ్రీశైల మల్లికార్జునునిఁ బ్రార్థించి, భార్యాపుత్రి సహితముగ నామహాదేవునం దైక్యమయ్యెననియుఁ బండితారాధ్య చరిత్రమున వర్ణింపఁబడినది. దీనినిబట్టి బసవేశ్వర పండితారాధ్యుల నిర్యాణకాలములకు మధ్య నొక్క శివరాత్రియేగాని పెక్కు శివరాత్రులు గడచియుండ నేరవని స్పష్టమగును. కావునఁ బండితారాధ్యుఁడు బసవేశ్వరుని తరువాత నత్యల్పకాలములోనే క్రీ. శ 1169_1170 సంవత్సరములలో శివైక్యమయ్యెనని తలంపనగును. వెలనాటి చోడుఁడును నాతనిసంతతియుఁ బండితారాధ్యుని శాపమహిమచే నిర్మూలమయిరని పండితారాధ్య చరిత్రములో నున్నది. వెలనాటిచోడుని శాసనములు క్రీ. శ. 1163_1180 వఱకును నాతనిసంతతివారి శాసనములు 1185 వఱకును గానవచ్చుటచే వారందఱు నశించువఱకుఁ బండితారాధ్యుఁడు జీవించియుండవలెనని యెంచి శ్రీలక్ష్మణరావుగారు తనినిర్యాణకాలము క్రీ. శ. 1190 వఱకుఁ బొడిగించినట్లు తోచుచున్నది. అట్లుతలంచుట యనవసరము. అతని శాపమహిమచే వారు తరువాత నశించినను బండితుఁడు వారికంటె ముందుగనే బసవేశ్వరుని నిర్యాణవార్త విని తానుగూడ సత్వరముగనే నిర్యాణము నొందెనని యెంచుట కెట్టియభ్యంతరమును లేదు. కావున బసవేశ్వరపండితారాధ్యు లించుమించుగ నేకకాలముననే లింగైక్యమయియుందురనియు, సోమనాథుఁడు వారిరువురిలో నెవరినిగూడ స్వయముగ నెఱింగియుండఁడనియుఁ దలంచుటయే సమంజసము. సోమనాథుని గ్రంథములలోఁ బండితారాధ్య చరిత్రమే కడపటి గ్రంథముగాఁ గాననగును. అప్పటికిఁ బండితారాధ్యుని మనుమలు మనుమపండితుఁడు మున్నగు నలువురును, పండితారాధ్యుని పుత్రుఁడగు కేదారయ్య శిష్యుఁడు ఇవటూరి సోమనాథయ్యయు, నాతని పుత్రులు సూరీశ్వరుఁడు మున్నగు ముప్వురును శైవ ప్రపంచమునకు గురుపట్టమునొంది వెలయుచున్నట్లు గ్రంథాంతమునఁ జెప్పబడినది. మఱియు సోమనాథుఁడు గురుప్రశంసలో "పేరెన్నబడిన శ్రీ చెలిదేవవేమ|నారాధ్యు ఁడను పర మారాధ్యదేవు | మనుమనిశిష్యుండ" నని చెప్పికొనినాఁడు. చెలిదేవ వేమనారాధ్యుఁడు బసవేశ్వర పండితారాధ్యులకు సమకాలీనుఁడయినట్లు పండితారాధ్య చరిత్రమున వర్ణితమయిన యాతని చరితమునుబట్టి గాననగును. మఱియు సోమనాథుఁడు బసవపురాణ కథాసూత్రములఁ దనకెఱిఁగించి యాగ్రంథమును రచించుట కాజ్ఞయొసంగిన పెద్దలలోఁ గరస్థలి సోమనాథయ్యగారిని గూడఁ బేర్కొనుచు బసవపురాణావతారికలో నాతనిని బ్రశంసించినాఁడు.[5]

---

5 "జంగమరత్నంబు శరణసమ్మతుఁడు। లింగైక్యవర్తి గతాంగవికారి। పండితారాధ్యకృపా సమృద్ధుఁడు । మండితసద్భక్త మార్గప్రచారి । విలసితపరమ సం విత్సుఖాంభోధి। నలిఁగరస్థలి సోమనాథయ్యగారు"

అందలి "పండితారాధ్య కృపాసముద్గతుఁడు" అనుదాసికిఁ బండితారాధ్యునివలన దీక్ష నొందిన శిష్యుఁడని యర్థము. ఈపండితారాధ్యుఁడు మల్లికార్జున పండితుఁడే కాఁదగును. ఆతనిశిష్యుఁడగు కరస్థలి సోమనాథయ్య బసవపురాణ రచనాకాలమునకు వృద్ధుడయినట్లు కాననగును. ఈతఁడు సోమనాథుని కవితాగురువగు కరస్థలి విశ్వనాథుని జ్యేష్ఠసోదరుఁడు కానోపును. కావునఁ బయిసంగతుల నెల్లఁ బర్యాలోచింపఁ బండితారాధ్యుని శిష్యునకు, మనుమలకును, పండితారాధ్యుని సమకాలీనుఁడగు చెలిదేవ వేమన మనుమనికిని, సమకాలీనుఁడయిన మనసోమనాథుఁడు క్రీ. శ. 1160 ప్రాంతమున జన్మించి, బసవేశ్వర పండితారాధ్యుల నిర్యాణకాలమునకు బాలుఁడయి, క్రీ. శ. 1192_1195 ప్రాంతముల మొదటి ప్రతాపరుద్రుని రాజ్యకాలమున బసవపురాణాదికములను రచించి, యటుతరువాత వయస్సు గడచినకాలములో క్రీ. శ. 1230 ప్రాంతమునఁ బండితారాధ్య చరిత్రమును రచించి, యటుపిమ్మటఁ గొలఁది కాలములో సిద్ధినొంది యుండునని తలంచుటయే సర్వవిధములను సమంజసముగా నుండునని నాయభిప్రాయము. సోమనాథుఁడు తనగ్రంథములలో అనుభవసారమునకు గోడగిత్రిపురారిని, బసవపురాణమునకు గొబ్బూరి సంగనామాత్యుని, పండితారాధ్య చరిత్రమునకుఁ బాలుకురికి సూరనామాత్యునిఁ గథాశ్రోతలుగాఁ గూర్చికొనినాఁడు. వీరికాలములు మనకుఁ దెలిసినచో సోమనాథుని కాలమును నిర్బాధకముగ నిస్సందేహముగ నిర్ణయింప వీలుండును. కాని యందు కాధారములు గానరావు. వీరాకాలమున దృఢవీరవ్రతముచే వన్నెకెక్కిన వారయ్యుఁ జారిత్రకముగఁ బ్రసిద్ధినొందిన వారుకారు. కావున సోమనాథుని గ్రంథముల మూలముననే మనకెఱుకవడినవా రయినారు కాకతీయ శాసనము లిప్పటికిఁ జాలవఱకు లభ్యములయినను మనసోమనాథునకుఁ బ్రతాపరుద్రునకుఁ గల సంబంధమును బ్రకటించు శాసనప్రమాణ మొకటియు నింతవఱకు లభింపకుండుట శోచనీయము. కొండవీటి దండకవిలెలో మాత్రము శకసంవత్సరము మున్నగు వివరములు లేని యొకశాసన ముదాహరింపఁ బడినది.[6]

సోమనాథుని కులగోత్రములు:—సోమనాథుఁడు బ్రాహ్మణుఁడని కొందఱు, ఆరాధ్య బ్రాహ్మణుఁడని కొందఱు, సహజవీర శైవుఁడగు జంగముఁడని కొందఱు తలంచుచున్నారు. ఈతఁడు సహజవీరశైవుఁడగు జంగముఁడనఁగా వీరశైవమతస్థులగు లింగాయతులకు గురుస్థానమును వహించు మఠస్థులు లేక మాహేశ్వరులని వ్యవహరింపఁబడు శాఖకుఁజెందినవాఁడని నాదృఢాభిప్రాయము. ఆరాధ్య బ్రాహ్మణులు లింగధారణాది వీరశైవ ధర్మములను స్వీకరించినను లింగముతోపాటు యజ్ఞోపవీతమును ధరించి యుపనయన సంస్కారమును గ్రహింతురు. లింగధారులుకాని బ్రాహ్మణులు చెప్పికొను ఋషిగోత్ర సూత్రములనే వీరును జెప్పుకొందురు. వీరిలో నిప్పటికి

6 శ్లో॥ దదౌ ధరణికోటాఖ్యం। బ్రహ్మప్రీత్యా పురంముదా॥ చంద్రార్థమకుటప్రీత్యా। చంద్రనాదిపురం దదౌ। కేశవార్పణ బుద్ధ్యావై। దదావిక్షు పురంభువి। సోమనారాధ్య గురవే। పిడపర్తి పురందదౌ। ఆదౌప్రతాపరుద్రాఖ్యో। భూపాలో ధర్మపూర్వకం। సప్తర్షిసంఖ్యయా గ్రామాన్। దదౌసప్తద్విజాయతే.....ఏవం ప్రతాపరుద్రాఖ్యః। కృతవాన్ రుద్రసంఖ్యయా॥

నిట్టి గోత్రసూత్రవ్యవహారమే జరుగుచు న్నది. ఇఁక గేవల వీరశైవులగు లింగాయతు లకు జంగములకు లింగమే యజ్ఞోపవీతము. లింగముతోపాటు వేఱొక జందెమును వారు ధరింపరు. కేవలము పంచాక్షరీమంత్రమునే గాని గాయత్రిమొదలగు నితరమంత్రము లను వీరు జపింపరు. వీరికి గోత్రకర్తలు గౌత మభారద్వాజాది మునీశ్వరులుగాక శివుని పంచవదనములనుండి యుద్భవించిన వృష నందీశ్వరాది పంచాచార్యులు. సూత్రములు కూడ దత్సంబంధికములే. ఇందుకయి సుప్రబోధాగమ ప్రమాణములను జూడ వచ్చును.[7] అందుదాహరింపఁబడిన వృషుఁ డు, నంది, భృంగి, (భృంగిరిటి) వీరుఁడు, స్కందుఁడు, అను నయిదుగురే వీరశైవ గోత్రకర్తలగు పంచాచార్యులు. వీరికే యుగ భేదములఁబట్టి నామభేదము లేర్పడినవి. రేవణ సిద్ధ, మరుళసిద్ధ, ఏకోరామ, పండితారాధ్య (మల్లికార్జున పండితుఁడు కాఁడు) విశ్వారాధ్య అనునవి క్రమముగ వీరికలియుగవ్యవహారనా మములు. రంభాపురి (కొలనుపాక), ఉజ్జయిని, కేదారము, శ్రీశైలము, కాశి అను క్షేత్ర ములందున్న పంచసింహాసనములకు వీరధీశ్వ రులు. ఇందుచే వీరిగోత్రజులగు కేవల వీర శైవులు తాము శివకులీనులమనియు, ఈశ్వర కులజులమనియుఁ జెప్పికొనెదరు. ఇందుకను గుణముగనే మన సోమనాథుఁడు తనకు బసవే శ్వరుని సంగతి యంతగాఁ దెలిసి యాతనియం దు భక్తిపారవశ్యము కలుగని ప్రాథమిక వ యస్సులో రచించిన అనుభవ సారమను చిన్న కృతియందుఁ దనకులగోత్రములను చెప్పికొని నాఁడు.[8] దీనినిబట్టియే యీతని శిష్యప్రశి ష్యకోటిలోఁ జేరి యీతనిని కులగురువుగా నారాధించుచు నీతనిద్విపద బసవపురాణము ను బద్యకావ్యముగా నొనర్చిన జంగముఁడు. పిడుపర్తి సోమనాథకవి యీతనిని దనగ్రంథ ములో "భృంగిరిటి గోత్రసంభవ। జంగ మ పాదార్చనా విశారద విలస। త్సంగీత శా స్త్రపారఁగ। గంగోత్పత్తి ప్రకార కావ్యధు రీణా" అని స్తుతించినాఁడు. అన్యవాద కోలా హల శతకకర్త యీతనిని "ఏకామ్రగురు చిత్తనలినభృంగ సోమనాథలింగ" అని సంబో ధించినాఁడు. కలియుగమున వీరశైవ పంచా చార్యులలోఁ దృతీయాచార్యుఁడగు ఏకోరా మాచార్యుఁడు భృంగిగోత్రజులకెల్ల గురువు. పయిశతకకర్త యుపయోగించిన "ఏకామ్ర" శబ్దము "ఏకోరామ" శబ్దమునకుఁ బద్యమున నరిపడునట్లు లాతఁడు చేసికొన్న హ్రస్వీకరణ మని నాయభిప్రాయము. ఇట్లు సోమనాథుఁడు నాతని శిష్యప్రశిష్యులు నాతఁడు శివకులీనుఁ డు, భృంగిగోత్రజుండునని స్పష్టముగఁ జెప్పి యుండఁగా నాతఁడు బ్రహ్మకులీనుఁ డనియుఁ నాగాధ్య బ్రాహ్మణుఁడనియు వాదించుట వట్టి బేలతనమని చెప్పనక్కరలేదు. తరువాతఁదరు వాత నీతనికి బసవేశ్వరునందు భక్తిపారవశ్య ము గలిగినపిమ్మట రచించిన బసవపురాణ

---

7 శ్లో॥ సద్యోజాతశ్చ ప్రథమో। వామదేవో ద్వితీయకః। అఘోరస్తు తృతీయశ్చ। తత్పురుషశ్చతుర్థకః ఈశానః పంచమశ్చేతి। ముఖానిమమ సర్వశః। తాన్యాననాని గోత్రాణి। వేదోక్తాని న సంశయః। వృషోనందీతథాభృంగీ। వీరశ్చస్కంద ఏవచ। మత్స్వరూపాత్సముత్పన్నాః-పంచగోత్రాధికారిణః-

8 క॥ భృంగిరిటి గోత్రుఁడను గురు।లింగతనూజుండశివము వీనుఁడదుర్వ్యా। సంగవివర్జిత చరితుఁడ।జంగమ లింగప్రసాద సత్ప్రాణుండన్॥

పండితారాధ్య చరిత్రములలో "ధరనుమామా తా పితారుద్ర యనెడు। వరపురాణోక్తి నీశ్వర కులజుండ" అని చెప్పికొని బసవనిపుత్రుండ, బసవగోత్రుండ, బసవనిదూత, బసవనిబంట, బసవనయిలుపుట్టి బానిసకొడుక, ఇత్యాదిగాఁ జెప్పికొనినాఁడు. బసవగోత్రమనునది వీరశైవులలో వ్యవహారమున లేనేలేదు. పైనిజెప్పిన యయిదు గోత్రములుతప్ప వేఱుగోత్రములు వారికిలేవు. సోమనాథుఁడు బసవనికి సమకాలీనుఁడే కాఁడనియు నాతనియెడఁ జెప్పికొనిన యాయా సంబంధములన్నియు నాతనియందలి భక్తిపారవశ్యమునఁ జెప్పికొనినవేగాని మఱొకటి గాదనియు వెనుకనే నిరూపించియుంటిని గదా! సోమనాథుఁడు సహజవీరశైవుఁడగు జంగముఁడని తలంచుటకాతని యద్వితీయ పాండిత్యము, వేదవేదాంగాది వైదుష్యము, కూడఁ బెద్దబాధకములని ప్రతిపక్షులవాదము. ఇట్టివి యాకాలమునందు అబ్రాహ్మణులకుఁ దరానివిగా నుండెనని వారితలంపు. ఇది కేవలమవిచారమూలకము. వీరశైవులకు లింగమే యజ్ఞోపవీతమని మొదటనే మనవిచేసియుంటిని. బ్రాహ్మణుల కుపనయనాదికముతోఁ గలుగు వేదాధికారములు మున్నగునవి లింగధారణ దీక్షతోఁ దమకును గలుగునని వీరశైవుల సిద్ధాంతము. బ్రాహ్మణులు కర్మపాశబద్ధులనియుఁ దాము వారికంటె నధికులమనియు వారి మతము. కావుననే సోమనాథుఁడు తన గ్రంథములలో బ్రాహ్మణులను బతితులయు, తాళి బ్రాహ్మణుఁడని వాదింపఁ జూచెదరు. కాని టిమాలలనియు, పచ్చిమాలలనియుఁ గర్మచండాలురనియుఁ బలుతావుల నిరసించినాఁడు. శివుని నిశ్వాస జనితములని చెప్పఁబడు నిగమములకును, ఆతని వదనసంజనితులమని చెప్పికొను వీరశైవులకును సాజాత్యము స్వతస్సిద్ధము. శివార్చనమున కవసరమయినంతవఱకు వీరు వేదమంత్రములను గ్రహింతురు. కావునఁ బయివాద మసంగతము. జంగములలోఁ బూర్వకాలమున వేదవిద్యాసంపన్నులనేకులుండెడివారు. అందునను మతప్రచారమునకు దొరకొను సోమనాథుఁడుమున్నగు వారలకు వేదవేదాంగములేగాక నితరమతవాఙ్మయములుగూడ సవిమర్శముగఁ జదివితెలిసికొనుట యావశ్యకముగనుండెడిది. ఇప్పటికిని కర్ణాటదేశమున నీవీరశైవులలో వేదవిద్యాసంపన్నులు పలువురున్నారు. వారుస్థాపించి నిర్వహించుచున్న వేదపాఠశాలలున్నవి. లింగాయతశ్రేష్ఠుఁడు శివతత్త్వ రత్నాకరకర్తయునగు కెలది బసవప్పనాయకుని యప్రమేయపాండిత్యము జగద్విశ్రుతము. సోమనాథుఁడు పండితారాధ్యుని, ఆవస్తంబసూత్రుఁడనియుఁ హరితస గోత్రుఁడనియుఁ జెప్పి యాతనిని శ్రోతగాఁ గూర్చికొనిన కారణములను వివరించినాఁడు.[9]

అందులో నారాధ్య బ్రాహ్మణుఁడగు సూరనామాత్యునిఁ దనమఱఁదియని చెప్పుటచే సోమనాథుఁడు కూడ నాతనివలెనే యారాధ్య

---

9 "నీరపోచేశ్వర విశ్రుతాచార్య- కారుణ్యహస్తాబ్జ గర్భసంభవుఁడ- చరలింగ గురులింగ సాహిత్య లింగ - చిరసచునిష్ఠిక శీలవర్ధనుఁడ - కడుమించి శివునకుఁ గన్నులర్పించి - పడసిన దృఢవీరభక్తివర్ధనుఁడ - నీవృగర్పిత వున రాదాన రతికి - నీదాన ధర్మవినీతికి మెచ్చి - బసవేశు తక్కిన భక్తుండవయ్యు నసద్భశలీల మాకనుగలంబనియు। మచ్చిక నామద్దు నఱఁదివీ వనియు- నెచ్చెలికాఁడవు నీవకావనియు- చాతుర్యసాహిత్య శాకివీవనియు - శ్రోతృత్వమునకుఁ బాత్రుండవీవనియు"

యిదియు వట్టిభ్రమయే. "శ్రీనృపాధీశ సంచిత దయాపాంగ! భావుకమంత్రీశ పాల్కురికి సూర! శ్రీగురులింగ సంచిత దయాపాంగ! భాగమహోదార పాల్కురికిసూర" అను సంబోధనములచే నీసూరనామాత్యుని యింటి పేరుగూడఁ బాల్కురికివారని స్పష్టమగును. సోమనాథ సూరనామాత్యు లిరువురు నేకవర్ణస్థులయి సంబంధబాంధవము నెఱపికొన్న నిక్కంపు మఱఁదులయినచో నొక్కయింటి వారెట్లగుదురు? సోమనాథుఁడు తనకు శివగోత్రమును జెప్పికొని సూరనామాత్యునకు ఋషిగోత్ర సూత్రములఁ జెప్పనేల? వీనినెల్లఁ బర్యాలోచింప వీరిచ్చిపుచ్చుకొను సంబంధమున నయిన మఱఁదులుగాక యఱలేని మచ్చికకలిమి బావమఱఁదుల వరుసను బిలిచికొనెడి నెచ్చెలికాండ్రనియు, ఈసంబంధము తిక్కన మనుమసిద్ధుల మామయల్లుర సంబంధమువంటిదే యనియుఁ దెల్లమగును. మచ్చిక నా ముద్దుమఱఁది వనుటయు, నెచ్చెలికాఁడ వనుటయు, మరల మహిమప్రకరణాంతమున, అఱలేని సఖుఁడ సూ రార్య నాముద్దు మఱఁదివి మహిని అని సంబోధించుటయు నీయర్థమునే తేటపఱుపఁగలవు. ఆకాలమున నారాధ్యబ్రాహ్మణు లుపనయనమునువీడి బసవేశ్వరుని వలెఁ గేవల వీరశైవులలోఁ గలియకపోయినను, భవులగు బ్రాహ్మణులతో నెట్టి సంపర్కమును లేక సహజవీరశైవులగు జంగములతోడనే యెక్కువ సాహచర్యమును గలిగియుండిరి. అందుచేతనే వీరొకరివలన నొకరు విద్యలను బడయుచుండిరి. సోమనాథుఁ డారాధ్యపదసంకలితుఁడుగఁగూడ వ్యవహరింపఁబడుట యాతని యారాధ్య బ్రాహ్మణత్వమునకు సాధకమనియు జంగముల కారాధ్యపద మెప్పుడు వర్తింపలేదనియుఁ గొందఱివాదము. ఇదివట్టియబద్ధము. వీరశైవ పంచాచార్యులందఱు నారాధ్యపద సంకలితులు కావున వారివంశజులగు జంగములకే యారాధ్య నామము మొదట వ్యవహరింపఁబడు చుండెడిది. అట్టియారాధ్యుల మతధర్మములను స్వీకరించినవారవుటచే మామూలు బ్రాహ్మణులనుండి వివక్షింపఁబడుటకయి యారాధ్య పదమును యారాధ్య బ్రాహ్మణులుకూడ గ్రహించిరి. శిష్యసంతతిచే నారాధింపఁబడు ధర్మ మీయిరుశాఖలవారికిని సమానమే. ఇప్పటికిని జంగములలోఁ "ఆరాధ్యుల, పరమారాధ్యుల" అనుగృహనామములు కలవారుకూడ నున్నారు. శ్రీశేషాద్రిరమణకవులు వరంగలు ప్రాంతమునను న్న వేల్పుకొండ వాస్తవ్యులు కౌండిన్యసగోత్రులు, ఉత్తమరాజు వారను నియోగిబ్రాహ్మణులు సోమనాథుఁడు మొదటఁ దమవంశమువాఁ డనియుఁ, దరువాత శిఖాయజ్ఞోపవీతముల విడనాడి జంగములలోఁ గలిసిపోయెననియుఁ దమతోఁ జెప్పినట్లువ్రాసిరి. శ్రీకాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు సోమనాథుఁడు మొదట నారాధ్య బ్రాహ్మణవంశజుఁడయి, బసవేశ్వరుని యందు వ్యామోహ మెక్కువయి జ్ఞానము హెచ్చినకొలది జంగములలోఁ గలసిపోయి, అనుభవసార రచనమునాఁటికి ప్రథమ గణపరమయిన భృంగిగోత్రమును జెప్పికొనియుండునని యభిప్రాయపడిరి. శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు సోమనాథుఁ డాజన్మాంతము బ్రాహ్మణుఁడుగనేయుండెనను

డి వింతసిద్ధాంతమును బ్రకటించిరి. అసలు సోమనాథుని యింటిపేరు ఉత్తమరాజువారయిన చో నాతఁడు వీరశైవమును స్వీకరించి నంత మాత్రమున నాతనిగృహనామము పాల్కురికి వారని మాఱుట యసంభవము. సోమనాథుఁడు మొదట వ్రాసిన గ్రంథములలో ఋషిగోత్రాదికములను, యొకగృహనామమును జెప్పికొనియున్నచో నిట్టి యూహాల కవకాశముండునేమోగాని యట్టి గ్రంథములేమియుఁ గానరావు. సోమనాథుఁడు తన కులగోత్రములను గృహనామముతోఁగూడ జెప్పికొన్నయనుభవసారమను చిన్నకృతియే యుపలబ్ధములయిన యాతని కృతులలో మొదటిదని నాయభిప్రాయము. దానినాతఁడు తన ప్రథమ వయస్సులో రచించియుండెను. దానిలోనాతఁడు మల్లికార్జున పండితుని మూఁడుపద్యములలో స్తుతించియు బసవేశ్వరునిపేరయిన నెత్తలేదు. కారణమువిస్పష్టము సోమనాథుఁడాంధ్రుఁడు. బసవవేశ్వరుఁడు కర్ణాటుఁడు. అనుభవసారమును రచించునాఁటి కీతఁడష్టభాషాకవితాప్రవీణుఁడుకాఁడు. కర్ణాటాదిభాషల నేర్వలేదు. బసవేశ్వరుని కర్ణాటగ్రంథములఁజదువుటగాని యాతనినిగూర్చి యంతగాఁదెలిసికొని యాతనియెడ భక్తికుదురుటగాని సోమనాథుని కప్పటికిఁ గలుగలేదు. కావున సోమనాథుని ప్రథమకృతియగు నీగ్రంథమువలననే పయియభిప్రాయముల యప్రామాణ్యము వ్యక్తముకాఁగలదు.[10] మహాకవు లేకులమువారయినను వారి కవితా గౌరవమును బట్టి యందఱకును బ రమపూజ్యులు.

సోమనాథుని తలిదండ్రులు, గురువులు.:— అనుభవసారపద్యమున సోమనాథుఁడు "గురులింగతనూజుండ" ననివ్రాయుటచేఁ బలువురీతనితండ్రి గురులింగార్యుఁడని భ్రమించిరి. గురులింగమనునది తమ దీక్షాగురువులకు వీరశైవులు వ్యవహరించు విశేషణము. గురువే లింగము, లింగమేగురువు, ఇరువురకు నభేదము. అంతేకాదు. చరలింగము అనగాజంగమము (భక్తుఁడు) నకుఁగూడ నభేదమని వారి మతము.[11] గురువుదీక్షయొసంగునపుడు హస్తమస్తకసంయోగమొనర్చి భౌతికశరీరమును లింగశరీరముగ మార్చినంతనే తమకు వేఱొకజన్మముకలుగుననియుఁ, గావున గురుఁడే జనకుఁడనియు, నాతని హస్తాంబుజమే తమకు జన్మభూమి యనియుఁ దలంచుట వీరశైవుల మతసంప్రదాయము. సోమనాథుఁడు బసవపురాణమున[12] జెప్పికొనిన వాక్యములఁ బట్టి పైయర్థము తేటపడి గురులింగమనునది దీక్షాగురువు

10 ఇందుఁగూర్చి విశేషాంశములు తెలియఁగోరువారు, ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక సం 19 సంచిక 3,లో బ్రకటింపబడిన "పాలకురికిసోమనాథకవి; కులగోత్రప్రశంస" అనువిపులవిమర్శనావ్యాసమును జదివిన సకల సంశయనివారణము కాఁగలదు.

11 ఉ॥ శ్రీగురులింగ జంగమవిశిష్ట మహామహిమంబు వేడెదన్
శ్రీగురులింగ జంగమముఁ జెప్పఁ ద్రిమూర్తి నిగూఢమై చనున్
శ్రీగురులింగ జంగమవిశేషము లేకముగాఁదలంచి యా
శ్రీగురులింగ జంగమ వశీకృతమా మదిఁగొల్చి సమ్మతిన్॥
క॥ పరమ పరుంబర మేశ్వరుఁ బరమానంద స్వభావు భక్తి నుతింతున్
గురులింగము హరలింగముఁ జరలింగము శాంత్యతీతు శంభున్ శరణున్॥ ॥అనుభవసారము॥

12 "శరణగణాశ్రయ సకలస్వరూప । గురులింగ వరకరోదర జనితుండ" ననియు, పండితారాధ్యచరితమున "మద్గురులింగ । ఘనకరుణాహస్త గర్భసంభవుఁడ" ననియుచెప్పబడినది,

న కాతఁడు ప్రయోగించినవిశేషణము మాత్ర మేయని విశదముకాఁగలదు. పలువురు భక్తు లనాతఁడు గురులింగకరోదర జనితులనియే పర్ణించినాఁడు. ఇఁక సోమనాథుని నిక్కంపుఁ దలిదండ్రులు శ్రీయాదేవీ విష్ణురామదేవులని బసవపురాణమందలి వాక్యములవలనఁ దెలియనగును.[13] ఈతని కవితాగురువు కరస్థలి విశ్వనాథకవీంద్రుఁడయినట్లు, అనుభవసారమందలి, "విమలచిత్ప్రపూర్తి విశ్వేశుమూర్తి వినయవర్తి భువనవినుతకీర్తి, విభుకరస్థలంబు విశ్వేశుకారుణ్య జనిత వినుత కావ్యశక్తియుతుఁడ" అను పద్యమునుబట్టియు, "సుకృతాత్ముఁడగు కరస్థలివిశ్వనాథ ప్రకటవరప్రసాద కవిత్వయుతుఁడగు" నను బసవపురాణవచనమును బట్టియు, బసవపురాణాశ్వాసాంతగద్యము లందలి "చరలింగ ఘనకరస్థలి విశ్వనాథ వరకృపాంచిత కవిత్వస్ఫూర్తిఁజేర్చి" అను ద్విపద పాదములను బట్టియు స్పష్టపడును. "ఖ్యాతసద్భక్తిమెఁగల కట్టకూరి। పోతిదేవరపదాం బుజషట్పదుండ" అను బసవపురాణ వాక్యమునుబట్టియు, "పరమారాధ్యదేవు।మనుమని శిష్యుండ" నను పండితారాధ్య చరిత్ర వాక్యమునుబట్టియు, కట్టకూరి పోతిదేవరయు, బెలిదేవవేమనారాధ్యునిమనుమఁడునుగూడ నీతని గురువులయినట్లు తెలియనగును. సోమనాథుఁడు వీరియొద్ద వేదవేదాంగాది విద్యలను నేర్చియుండును.

సోముని యాచారవ్యవహారములు:—ఈతని వీరమహేశ్వరాచారసంపత్తి వర్ణనాతీతమయినది. వీరశైవ సమ్మతమగు చతుష్షష్టి శీలముల యాచరణ మీమహనీయునితో నంతరించెనని పలువుర యభిప్రాయము. వీరశైవ పరిభాషలో లింగధారి కానివానిని భవియని వ్యవహరింతురు. అట్టివారి ముఖదర్శన స్పర్శనాదులనయిన నీతఁడొప్పెడివాఁడు కాఁడఁట. మతాంతరులతో మతవివాదము లొనర్చునపుడు ముఖావరణ మొనర్చుకొని కాండవటము వెనుకనుండి వాదించెడివాఁడని చెప్పెదరు. పిడుపర్తి సోమనాథుఁ డీతని వర్ణించుచుఁ దనపద్య బసవపురాణమునను,[14] పండితారాధ్య చరిత్రమున సోమనాథుఁడు స్వయముగను వ్రాసిన వాక్యములనుబట్టి యీతనిశీల మూహింపఁదగును. ఈతఁడిట్టి మహాఘోర వీరశైవాచార ధౌరేయతమైఁ గాలము గడపుచు వృద్ధదశలోఁ గర్ణాటభూమియందలి కలికెమను గ్రామమున సమాధి నేర్పఱచుకొని బసవపదధ్యానాంతరంగుఁడయి తపమొనర్చుచు శివసాయుజ్యము నొందెనని చెప్పుదురు.

సోమనాథునిగ్రంథములు; వానిపౌర్వాపర్యము—పిడుపర్తి సోమనాథకవి తనపద్యబసవపురాణావతారికలో సోమనాథుఁడు రచించిన

---

13 "భ్రాజిష్ణుఁడగు విష్ణు రామదేవుండు। జష్ణువగు శ్రీయా దేవి యమ్మయును। గారవింపఁగ నొప్పు గాదిలిసుతుఁడ। వీరమాహేశ్వరా చారతంత్రుండ".

14 "నిర్మలప్రపటీపట లావృత దేహు" "భువిజనసమాదరణ, సంభాషణాది, సంసర్గదూరగుఁడు"
(బసవపురాణము,)

"భవివృతా రంభసంభవధాన్యనిచయ। భవినిరీక్షణరస పాకవితాన। భవిహస్తగతఫల పత్రశాకాది। భవిగృహక్షేత్రాది పథవర్జితుండ। భవిజనదర్శన స్పర్శనాలాప। వివిధదానాదాన విషయదూరగుడ"
(పండితారాధ్యచరిత్రము)

గ్రంథములను పేర్కొనినాఁడు.[15] శ్రీవీరేశ లింగముపంతులుగారు తమకవులచరిత్రనూత్న ముద్రణములో నీపద్యమును బేర్కొనుచుఁ గర్ణాటకవిచరిత్రకారుల వాక్యముల ననుసరించి కాఁబోలు "ఈకవి గ్రంథములలో బసవపురాణము, పండితారాధ్యచరిత్రము, అనుభవసారము తెలుఁగు; అన్యవాదకోలాహలము, బసవపంచగద్య, సోమనాథ భాష్యము, సంస్కృతము. తక్కినవి గన్నడము" అనిలిఖించిరి. ఇవి సోమనాథుని గ్రంథముల సరిగాఁజూడక వ్రాసిన వ్రాఁతలని చెప్పుట కెట్టిసంశయము నులేదు. కర్ణాటకచరిత్రకారులు నాంధ్రకవి చరిత్రకారులుగూడ సోమనాథుని గ్రంథముల ను సరిగాఁజూడక యాతని చరిత్రమును నిర్మించుట శోచనీయము. పయి పద్యములో అన్యవాదకోలాహల ముదాహృతముకాకపోయిన ను నది సంస్కృతమనియు సోమనాథకృతమని యుఁ బంతులుగారెట్లువ్రాసిరో? ఇట్టి సోమనాథకృతి కానరాదు. సోమనాథుని శిష్యప్రశిష్యకోటిలోఁజేరిన కవియొకఁడు సోమునికంకితముగా అన్యవాదకోలాహలమను తెనుఁగు సీసశతకము రచించెనని వెనుకఁజెప్పితిని. అదియే ముద్రితమయి ప్రచారములోనున్నది. పయి పద్యమునఁ బేర్కొనబడిన కృతులలో బసవపురాణము, పండితారాధ్యచరిత్రము, అనుభవసారము, చతుర్వేదసారము, బసవరగడ, చెన్నమల్లుసీసములు, వృషాధిపశతకము తెలుఁగులోనే రచింపఁబడినవి. బసవోదాహరణయుగ్మములో నొకటితెలుఁగు రెండవది సంస్కృతము. సోమనాథభాష్యము, రుద్రభాష్యము, బసవాష్టకము, బసవపంచకము సంస్కృతభాషారచితములు. పంచప్రకారగద్య నమస్కారగద్య, అక్షరాంకగద్య యనునవి ఆంధ్రగీర్వాణకర్ణాట చ్ఛందస్సంప్రదాయముల ననుసరించి మాత్రాగణబద్ధములుగ రచింపబడిన విలక్షణాంధ్రకృతులని నాయభిప్రాయము. అక్షరాంకపద్యములు సంస్కృతశ్లోకములుగనే యించుమించుగఁబరిగణింపఁదగినవి. బసవమధ్యరగడ, గంగోత్పత్తిరగడ, సద్గురురగడ తెనుఁగుకృతులో కన్నడకృతులో చెప్పఁజాలను. అవినాకు లభ్యము కాలేదు.

ఇఁక నీగ్రంథములేగాక మఱికొన్ని గ్రంథములనుగూడ సోమనాథుఁడు రచించియుండునని పయిపద్యమందలి "ఆదియగుకృతుల్" అను పదముచే గ్రహింపఁదగును. బసవపురాణపీఠికలో శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు దాహరించిన బసవాష్టోత్తర శతనామ గద్యము, వృషభాష్టకము, అనునవి యిందుకు దాహరణములు. ఇవిగాక "సోమనాథస్తవము" అను చిన్నద్విపదకృతియు, మల్లమదేవీ

---

15 సీ॥ బసవపురాణంబు ♦ పండితారాధ్యుల చరితంబు ననుభవ ♦ సారమును జ
తుర్వేదసార సూ ♦ క్తులు సోమనాథభాష్యంబు శ్రీరుద్రభా ♦ ష్యంబు బసవ
రగడ గంగోత్పత్తి ♦ రగడ బసవాఖ్య రగడయు సద్గురు ♦ రగడ చెన్న
మల్ల సీసములు న ♦ మస్కార గద్య వృషాధిపశతకంబు ♦ నక్షరాంక।
గీ॥ గద్యపద్యము ల్పంచప్ర ♦ కారగద్య యష్టకము పంచకము నుదా ♦ హరణయుగ్మ
మాదియగు కృతులు భక్తహి ♦ తార్థబుద్ధిఁ జెప్పె నవి భక్త సభలలోఁ ♦ జెల్లుచుండు॥
ఆంధ్రపత్రిక ప్రజోత్పత్తి, ఆంగీరస, శ్రీముఖసంత్సరాదిసంచికలలో వీనిని బ్రకటించుచు నేనువ్రాసిన వ్యాసములనుగూడ జూచునది.

పురాణమను నాలుగాశ్వాసముల ద్విపదకావ్యముగూడ సోమనాథుని కృతులుగా దెలియవచ్చుచున్నవి. ఈ రెండవగ్రంథమును నందికోటుకూరులో నొకలింగాయతుని యింటఁ జూచితిమని నామిత్రులు శ్రీ పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వ్రాసినారు. "సోమనాథస్తవము" పాలకురికి సోమేశ్వరస్వామిపయిఁ జెప్పఁబడినది. దానిలోఁ గర్తపేరునాకు రాదు. కాని యిదిమన సోమనాథకృతమేయని పలువురు తలంచుచున్నారు. ప్రభాకరశాస్త్రిగారు మాత్రము తగుకారణములను జూపకయే యిది సోమనాథకృతము కాదనిరి. ఈ గ్రంథమును సోమనాథుఁడే అనుభవసారమును రచించిన తరువాతఁ గొలదికాలమునకుఁ బసవేశ్వరునిఁ గూర్చియు నాతని సమకాలికులగు కొందరుభక్తులఁ గూర్చియుఁ దనకుఁ దెలియవచ్చినరీతిని సులభశైలిని రచించియుండునని నాయభిప్రాయము.[16] ఉపలబ్ధములయిన సోమనాథుని గ్రంథములలోనెల్ల అనుభవసారమే మొదటికృతియనుటకుఁ గలకారణముల నీవఱకే కొంతవివరించియుంటిని. ఆగ్రంథముయొక్కశైలియు పదలాలిత్యముగూడ నీ విషయమును నిరూపించఁగలవు. ఆగ్రంథమును సోమనాథుఁడు క్రీ. శ. 1180—1185 ప్రాంతముననే రచించియుండును. అప్పటి కాతఁడు సంస్కృతాంధ్రములను, వేదపురాణములను గొంతవఱకభ్యసించి, మల్లికార్జున పండితుని శివతత్త్వసారాదులను జదివి యాతనియెడ భక్తిగలిగియుండును. అప్పటి కీతనికి బసవేశ్వరుని సంగతి యంతగాఁ దెలిసినట్లు కానరాదు కావుననే మల్లికార్జున పండితుని నీ గ్రంథములో మూఁడుపద్యములలోఁ బ్రశంసించియు బసవేశ్వరుని పేరయిన నెత్తలేదు. తన యితరకృతులవేనిని నందుఁ బేర్కొనలేదు. తరువాత బసవేశ్వరుని యొక్కయు నాతని సమకాలీనులగు భక్తుల యొక్కయుఁ జరిత్రములు తనకుఁ దెలియవచ్చిన తొలుదొలుత టి దినములలోఁ దన గ్రామమందలి సోమేశ్వరస్వామి కంకితముగాఁ బయినిబేర్కొనిన సోమనాథస్తవమును రచించి, బసవేశ్వరునిమీఁద భక్తిముదిరినకొలఁది నీతఁడు సంస్కృతపదభూయిష్ఠములగు పంచప్రకారగద్య మున్నగు గద్యకృతులలోను, ఉదాహరణము, అష్టకము, పంచకము, రగడ మొదలగు గేయకృతులలోను బసవస్తోత్రముల నేర్చిన, నవి జనసామాన్యమునకు సుబోధకములయి తనమతప్రచారమున కంతగా నుపకరింపనందున దేశీయచ్ఛందమగు ద్విపదలోఁ దనప్రధానగ్రంథములను వ్రాయనెంచినట్లు కాననగును.[17]

కావున సోమనాథస్తవ రచనమునకు బసవపురాణ రచనమునకు మధ్యకాలమున గద్యకృతులు, రగడలు, అష్టకములు, పంచకములు మున్నగు బసవస్తోత్రములు రచింపఁబడిములను గొంతవఱకభ్యసించి, మల్లికార్జున యుండును. తరువాత క్రీ. శ. 1192—1195

---

16 ఈవిషయమునఁగల సాధకబాధకములు, ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక సం 21 సంచిక 3 లోఁబ్రకటితమయిన "సోమనాథస్తవము" అనునావ్యాసమునఁ దెలియనగును.

17 "ఉరుతరగద్యప । దోక్తులకంటె సరసమై పరఁగిన। జానుతెనుంగు
చర్చింపఁగా సర్వ । సామాన్యమగుటఁ గూర్చెద ద్విపదలు। కోర్కెదైవార॥ [బసవ పు॥]
ఆరూఢగద్య ప।ద్యాది ప్రబంధ పూరితసంస్కృత । భూయిష్ఠరచన
మానుగా సర్వసా । మాన్యంబు గామి జానుతెనుఁగు విశే। షము ప్రసన్నతను [పండి॥ వ॥]

ప్రాంతమున బసవపురాణ రచనము జరిగి యుండును. ఆపిమ్మటఁ గ్రమముగ వృషాధిప శతకము, చతుర్వేదసారము, రుద్రభాష్యము, సోమనాథభాష్యము నను గ్రంథములు బసవ పురాణ రచనమునకుఁ బండితారాధ్య చరిత్ర మునకు నడుమ రచితములయి యుండును. "బసవఁడు ప్రీతిఁగైకొనియె భక్తమెయిన్ రచియింప నాఁడు ముక్। బసవపురాణ మంచు నను బ్రస్తుతిసేయుదు రట్లుగాన....." అను వృషాధిప శతకవాక్యమును, "నూతనంబుగ జగన్నుతముగా మున్ను-బసవపురాణ మొప్పగ రచించితివి.....వరవీర భక్తిస- వైదికంబు గను-విరచించితివి చతు ర్వేదసారమున- బస వన్నమహిమ శుంభద్భక్తియుక్తి- బ్రసరించి తివి గద్య పద్యాదికృతుల....."అను పండి తారాధ్య చరిత్రవాక్యములు నిందుకు నిదర్శ నములు. పండితారాధ్య చరిత్ర రచనమునాఁ టికి సోమనాథుఁడు వయస్సు మీఱినవాఁడ యి యుండును. అదియే యాతనికడపటికృతి. చెన్నమల్లు సీసముల నీతఁడు తనసిద్ధిసమయ మునఁ జెప్పెనని కొందఱు వచింతురు. కాని యాపద్యములనుబట్టి యట్టియూహ కవకాశ ము గానరాదు.

సోమునిపాండిత్యము, బిరుదములు:—సో మనాథుఁ డసాధారణ ప్రతిభా సమన్వితుఁడు, చతుర్వేదపారగుఁడు, అష్టభాషా కవితాప్ర వీణుఁడు, స్మృతిశాస్త్ర పురాణాగమేతి హాసా దులను నితరమత సిద్ధాంతములను సంపూర్ణ ముగ నాకళించిన విద్యావిశారదుఁడు. ఈతని ప్రతిభాపాండిత్యములకు సర్వతోముఖములగు నీతని గ్రంథములే నిదర్శనములుగ నున్నవి.[18] వృషాధిపశతకమందలి బహుభాషాస్తుతు లీత ని యష్టభాషాకవితాప్రావీణ్యమును మచ్చు చూపనేర్చును. నందీశ్వరావతారమగు బస వేశ్వరుని చరిత్రమును లోకమున వెలయింప నీశ్వరాజ్ఞచే భృంగియే యీతఁడయి యవత రించెనని వీరశైవుల విశ్వాసము.

అసదృశ పాండితీవిభవంబున నీతఁడాకాల మందలి ప్రతివాదులకెల్లఁ బ్రక్కలోని బల్లె మై, బౌద్ధ జైన చార్వాకాద్వైత మాయా వాదులనెల్ల నుద్భటవివాదముల నోడించి వీర శైవ మతవ్యాపన మొనరించినాఁడు. ప్రత్య క్ష భృంగీశావతార, కవితాసార, తత్త్వవి ద్యాకలాప, అన్యవాద కోలాహల ము న్నగు బిరుదము లీతనికిఁగలవని కర్ణాటకవి చరిత్ర నుడువుచున్నది. పిడుపర్తిసోమ నాథుఁ డీతని శక్తిసామర్థ్యములను ప్రశం సించినాఁడు[19] సంగీత శాస్త్రమునందుఁగూడ

---

18 ఈతని చతుర్వేదపారగత్వమును "నవిఁబాల్కురికి నాథుఁడనంగ। వెలయువాఁడును జతుర్వేదపా రగుఁడ" అని పండితారాధ్యచరిత్రమున నీతఁడు చెప్పుకొన్న వాక్యమును' ఆగ్రంథమున నసంఖ్యా కములుగ నుదాహృతములయిన శ్రుతిప్రమాణములను, బసవలింగ శతకమను నామాంతరముగల చతుర్వేదసారమును, బసవరాజీయమని వ్యవహరింపఁబడు సోమనాథభాష్యమును నీతనిగ్రంథము లు బ్రకటింపఁగలవు.

19 సీ॥ లిపిలిఖింపకమున్న ♦ యపరిమితాగ్రోక్తి శక్తియాతని జిహ్వ ♦ జరుగుచుండు
ఛందోధికరణాది ♦ సరణిచూడకమున్న మదినుండుఁగావ్యని ♦ ర్మాణశక్తి
భాష్యసంతతులు చె ♦ ప్పంగఁజూడకమున్న, రుద్రభాష్యక్రియా ♦ రూఢి వెలయు
తర్కశాస్త్రాదివి ♦ ద్యలు పఠింపకమున్న, పరపక్షనిగ్రహ ♦ ప్రౌఢి వెలయు
గీ॥ అతనినుతియింప నాబోటి ♦ కలవియగునె, "జైనమస్తకవిన్యస్త ♦ శాతశూల
కవితబిజ్జల తలగుండు ♦ గండ" బిరుదశోభితుఁడు పాల్కురికి సోమ ♦ నాభిధుండు॥

నీతఁ డపారపాండిత్యము గలవాఁడు "విలస త్సంగీత శాస్త్రపారగ" అను పిడుపర్తి సోమనాథుని సంబోధనమును, బసవపురాణ మందలి సకలేశ్వర మాదిరాజయ్యగారి కథ యు నీవిషయమును వ్యక్తమొనర్చును. వేయే ల! ఆంధ్రకవులలో నిట్టి యపారపాండితీ విక్ర మ సంపన్నులు మిక్కిలి తక్కువయనుట సత్యదూరముకాదు. నన్నెచోడకృత కుమార సంభవపీఠికలో శ్రీ మానవల్లి రామకృష్ణకవి గా రాంధ్రకవులలో సర్వజ్ఞులనఁదగినవారు నన్నెచోడుఁడు, నాచన సోమనాథుఁడు, తి క్కన, ఎఱ్ఱాప్రగ్గడ, నలువురుమాత్రమే యని వ్రాసి మనసోమనాథుని విస్మరించుట ప్రమాదము. కవితాపథమున వీరందఱకు మార్గదర్శకుఁడయి, సర్వజ్ఞానుచరుఁడగు భృం గి యవరావతారమయి, తనసర్వజ్ఞతను గ్రం థముఖమునను, బండితవివాద రూపమునను బహువిధములఁ బ్రదర్శించిన యీవిద్వత్క వీంద్రునిఁగూడఁ జేర్చినఁగాని రామకృష్ణ కవిగారిపట్టిక పరిపూర్ణముకానేరదని నామనవి.

సోమనాథుని కవితావిశేషములు:—తె లుంగుకవిత తీయందనము, జాతీయములు, ర సోచితములగు తెలుఁగుఁ బలుకబడులలో నే కలదనియెంచి, నన్నియభట్టారకుని మార్గ మునకు వన్నియవెట్టి, నిక్కమయిన తెలుంగు కవితను వెలయించి, జాతీయకవితా నిర్మాణ విషయమునఁ దిక్కనాది మహాకవులకు మా ర్గమును దీర్చినది యీసుకవి సోముఁడేయని వెనుక విన్నవించితిని. సోమనాథుని కాలము నాఁటికి సంస్కృత పదభూయిష్ఠములగు గద్య పద్య రచనలు మెండుకొని, దేశీయచ్ఛందో నిబద్ధములు, జాతీయతా విలసితములునగు పదరచనముల (ద్విపదలు, తుమ్మెదపదములు మున్నగునవి) పయి నొకకరణి నిరసనము ప్ర జలలోఁ బ్రబలినట్లు కాననగును. సోమనా థుఁడుకూడ మొదట సంస్కృత భూయిష్ఠము లగు గద్యపద్యరచనల కలవడి, యవి జనసా మాన్యమునకు సుబోధకములయి తనమత ప్రచారమున కంతగా నుపకరింపకపోవుటచే జాతీయచ్ఛందమగు ద్విపదలో జానుతెనుంగుఁ గవితను నిర్మింపదొరకొనిన తెఱఁగు నీవఱకుఁ గొంతవివరించితిని. ద్విపద కావ్యములపయిఁ బ్రజలలో నప్పటికే గలిగిన నిరసనభావమును నిరసింపనెంచి "అల్పాక్షరముల ననల్పార్థర చన। కల్పించుటయకాదె కవి వివేకంబు" అని ఘోషించి, సత్కృతిలక్షణముల కనువగునట్లు "తొమ్మిదిరసము లు తొలకాడుదాని। నిమ్మడి వర్ణన లెసగంగ ద్విగుణ। మగునలంకారంబు ల నలారుదాని। ద్విగుణార్థభావముల్ దీటుకొ నంగఁ। దేటతెనుంగున ద్విపద రచింతు" నని వచించి "అదియునుగా కైహి కాముష్మికాది పదహేతువగుట ద్విపదనాఁగఁబరఁగు" అని తనద్విపదకావ్య రచనమును సమర్థించినాఁడు. "క్రియాసిద్ధి స్సత్త్వేభవతి మహతాం నోపక రణే" అనుసూక్తి యెంతయు సమ్మతమయి నది. కావుననే సోమనాథుని ప్రధానకావ్యము లగు బసవపురాణ పండితారాధ్య చరిత్ర ములు ద్విపదలోఁ గూర్పఁబడినను నాతని య సాధారణ నైపుణ్యముచేఁ బయినిఁజెప్పినట్లు తొమ్మిదిరసములు, పదునెనిమిది వర్ణనలు, ముప్పదియాఱలంకారములు, డెబ్బదిరెండు భావములు చిప్పిలఁగ సత్కృతులలో నగ్రగ ణ్యములయి మనయాంధ్రభాషలోఁ దరువాత వెలసిన కావ్యపు మెఱుంగులకెల్ల జీవనౌష ధులయి విలసిల్లినవి. కావ్యవ్యాకరణజ్ఞులు శ్రీపంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు

ఆంధ్రపత్రిక పదియవ సంవత్సరాది సంచికలో "ద్విపదకవిత్వము" అను వ్యాసమున నీగ్రంథములనిట్లు బ్రశంసించియున్నారు.

"ఈ రెండు గ్రంథములు నెక్కడఁజూచిన నక్కడ నవసరములు పొంగి పొరలిపోవునట్టి రసోదంచితములుగ ద్విపదలలోఁ గూర్పఁబడినవి. హిమవద్భూధర గుహాగ్రములనుండి యనర్గళముగా దుమికివచ్చెడు గంగాప్రవాహముంబోలె నీమహామహుని కవిత్వము పాఠకులమనంబుల నానందపూరమున నోలలాడించుచుండును. భక్తశిరోమణియగు పోతన భక్తిపారవశ్యపుఁ గవిత్వమునకును, కవిసార్వభౌముఁడగు శ్రీనాథ మహాకవి సుడికారముల గడుసుఁదనంపుఁ జిన్నెలకును, కర్ణాటరాజ్యరమానాథుఁడు నాంధ్రభోజుఁడు నాంధ్రకవియునగు కృష్ణదేవరాయ మహారాజుల యాముక్తమాల్యద మున్నగు కృతులలోని యద్భుతవర్ణనా పటిష్ఠములగు సందర్భములకును, దీనికి దానికనియేల, ఇంతదనుక మనయాంధ్ర సారస్వతమునఁగల హృద్యములగు రసవద్వర్ణనో దంచితములగు కావ్యపుమెఱుంగు లన్నిటికిని, ఈ రెండు ద్విపదకావ్యములే మార్గదర్శకములయి రాజిల్లినవనుటలో నేమియు సందియములేదు." బసవపురాణ తృతీయాశ్వాసమందలి రుద్రపశుపతి, బెజ్జమహాదేవి, గొడగూచి, కన్నప్పమున్నగు ముగ్ధభక్తుల చరితములఁ బరికించిన నీయంశము తేటపడును. ఈ గ్రంథమిప్పుడు పరిశుద్ధముగ ముద్రితమయినది కావునఁ జదువరుల నాయాతావులఁ దిలకింపఁ బ్రార్థించి స్థలసంకోచమున వానినిచ్చట నుదాహరింప మానుచున్నాను.

బుద్ధికెంతయో శ్రమదెచ్చుకొని యుత్ప్రేక్షాద్యలంకారములతో, అల్లసానిపెద్దన, రామరాజభూషణుఁడు, పింగళిసూరన కోఁడికూఁతను వర్ణించుచు వ్రాసినపద్యము లాంధ్రవాఙ్మయమున సుప్రసిద్ధములు. కాని వీని కంటె మనసోమనాథుఁడు జిలిబిలిపలుకులతోఁ గూర్చిన స్వాభావికవర్ణన మెంతయు మనోహరముగ నున్నది.

స్వాభావికములగు ప్రకృతివర్ణనము లీతనికి మంచినీళ్లప్రాయములు. కవితచిత్రకళయని యెఱింగి చిత్తరువులందు లిఖించినట్లు పాత్రముల రూపవర్ణనమొనర్చి చదువరులహృదయఫలకముల వానిని జిత్రించు విన్నాణ మీతని కలవడినట్లు మఱియొకనికిఁ గలుగలేదనుట యతిశయోక్తి కాదు. సోమనాథుని సర్వజ్ఞత వెల్లడించు వర్ణనములను గ్రంథవిస్తరభీతిచే నిచ్చట వివరింపమానితిని. చౌర్యము, ద్యూతము, విటత్వము, రసవాదము మొదలగు ననేకాసాధారణవిషయములను సందర్భోచితముగ వర్ణించు పట్టులను జూడఁ జదువరులీతని సర్వంకషప్రతిభ కాశ్చర్య చకితులు కాకమానరు. పండితారాధ్య చరిత్రమున వాదప్రకరణమున వివరింపఁబడిన వివిధమత వాదఖండనము లీతని యపారపాండిత్యమున కాదర్శకములయి యున్నవి. చక్కని లోకోక్తులను జాతీయములను సందర్భోచితముగ నుపయోగించువిన్నాణమునం దీతఁడు నెఱజాణయని చెప్పవచ్చును. సోమనాథుని కవితయందలి ముఖ్యగుణము లనన్యసామాన్యములగు సౌందర్య మాధుర్యములు. ఆతఁడు తన గ్రంథములను భక్తిరసపరవశుఁడయి రచించుటయు, భావమునే ప్రధానముచేసికొని శ్లేషయమకాద్యలంకారములకయి తడవులాడకుండుటయు, జాతీయతనే యెక్కువగ గణించి దేశీయచ్ఛందమగు ద్విపదలోఁ దీరుతీయము

లుగల తెలుఁగుఁ బలుకుబళ్లను మేలుగజాలు వార్చుటయు నిందుకుఁ బ్రధానకారణములు. సరసమయినజానుఁ దెనుంగుపయి నతఁ డెక్కువగ వలపుగొనినను, సహజగంభీరతాప్రసన్నములగు సంస్కృతపదములపయిఁ గూడ నాపఁడు వ్యామోహము విడువలేదు. జాతీయత వలసిన పట్టుల నాతఁడు నూటికిఁ దొంబది పాళ్లు జానుఁదెనుగును బ్రయోగించును, గాంభీర్య ప్రకటన మవసరమయిన మతవివాదములు మున్నగుతావుల సంస్కృత పదబాహుళ్యమును బ్రదర్శించును. మఱికొన్నిసందర్భములఁ దెలుఁగుపదములనుసంస్కృతపదములను సమానముగఁ బ్రయోగించును. అతఁడు రసైకపరతంత్రుఁడు. రసవిజృంభణమున కయి యెచ్చట నెట్టి పదజాలమును బ్రదర్శింపవలెనో యాతఁ డెరింగినట్లు మనమెఱుంగఁ జాలము. శబ్దాలంకారములలో, అనుప్రాసము కయి సోమనాథునికి మక్కువయెక్కువ. బసవపురాణ పండితారాధ్యచరిత్రము లందలి యాశ్వాసాంతభాగములను, పంచప్రకారగద్యమున్నగు గద్యకృతములును, వృషాధిపశతకమును నీయంశమును వ్యక్తమొనర్చును. ఈ యనుప్రాసములయినను భావావేశములో వానియంతట నవి సహజముగ దొరలివచ్చినట్లే గోచరమగును గాని ప్రత్యేకదృష్టితో వానినాతఁడు బ్రయత్నపూర్వకముగఁ బ్రవేశపెట్టినట్లు గానరావు. ఈతని తరువాత వెలసిన బమ్మెరపోతన మున్నగు నిజాముర్రాష్ట్రకవులయనుప్రాసప్రియత్వమున కీతఁడే మార్గదర్శకుఁడు కానోపును.

తిక్కన నాచనసోమనాది మహాకవుల జాతీయకవితానిర్మాణమునకు మనసోమనాథుఁడెంతపఱకు మార్గదర్శకుఁడయినది యాతని గ్రంథములను వారికావ్యములను సూక్ష్మముగఁ బరిశీలించినఁ దెల్లమగును. కుమారసంభవకర్తయగు నన్నెచోడుని కాలమింతవఱకు నిర్వివాదముగ నిదమిత్థమని నిర్ణయింపబడలేదు. నన్నెచోడుని కావ్యమును మనసోమనాథుని పండితారాధ్యచరిత్రమును లెస్సగాఁ బరికించిన నొకరినొక రనుకరించిన పట్టుల నన్నెచోడుఁడు సోమునిద్విపదలనే సులువుగఁబద్యములలోఁ బెట్టుకొనెనేమోయని నాయనుమానము. నన్నెచోడుఁడు క్రీ శ. 1170 ప్రాంతమువాఁడగును. అనఁగా మనసోమనాథున కించుమించుగా సమకాలీనుఁడన్నమాట కుమారసంభవము క్రీ శ. 1170_1180 ప్రాంతమునఁ బాకనాటిసీమలో నన్నెచోడునిచే రచింపఁబఁడియుండునని తలంచినను దానిప్రతులు నలుబదియేండ్లలోనే సోమనాథుఁడు తనవార్ధకదశయందు వసించిన కర్ణాటదేశమున వ్యాప్తమగుటయు, నందలి పద్యములను క్రీ॥ శ॥ 1220 ప్రాంతమున రచించిన పండితారాధ్యచరిత్రమున సోమనాథుఁడు ద్విపలదలలోఁ గూర్చికొనుటయు జరగియుండునాయని నానందేహము. సోమనాథునియెడ భక్తి గౌరవముల నెఱపుచు నాతనితరువాత వెలసిన సుప్రసిద్ధకవులొనర్చిన యనుకరణములకుఁ గొన్ని స్థూలదృష్టాంతములమాత్రమొసంగెదను. శ్రీనాచన సోమనాథునకుఁగూడ మనబాల్కురికి సోమనాథుఁడే మార్గదర్శకుఁడని పాఠకులెఱుంగుదురుగాక! శతకకవులుగూడ నీమహాకవిగ్రంథములను జదివి యాతని ననుకరించిన జాడలు పెక్కులు చూపవచ్చును. శతకవాఙ్మయములో నద్వితీయమగు నీతని వృషాధిపశతక మటుతరువాత వెలసిన భక్తిరసపూరితములగు దాశరథీశతకము మున్నగు పెక్కుశతకములకు

మార్గదర్శకమయినవిధము నాయాశతకముల సవిమర్శముగఁ దిలకించినఁ దెలియనగును.[20] నీతిపద్యశతకములను వ్రాసిన కవులుగూడఁ బలువురు సోమనాథుని రచనముల ననుకరించిరి. మచ్చునకుఁ గాకతిరుద్రాంబికకు సామంతుఁడును సుప్రసిద్ధశతకరాజమగు సుమతిశతకమునకు గర్తయునగు బద్దెన యీతని ననుకరించిన విధముచూడవచ్చును [21]

మఱియు సోమనాథుని యనుభవసారమందలి కందపద్యములు పెక్కులు బద్దెననీతిసారము సుమతిశతకములలోని కందపద్యములకు మార్గదర్శకములయినట్లు కాననగును. వేమన యోగిగూడఁ దన పద్యములలో సోమనాథుననుకరించిన జాడ లనేకములుగలవు.

వేయేల! శ్రీ ఆదినారాయణ శాస్త్రిగారు చెప్పినట్లు మనభాషలో హృద్యములును రసవద్వర్ణనోదంచితములునగు కావ్యపుమెఱుంగులు జూపిన మహాకవులకెల్ల నీసుకవిసోముని గ్రంథములే జీవనౌషధములని నిరూపించుటకసంఖ్యాకములగు దృష్టాంతములను జూపవచ్చును.

ద్విపదలలోఁ బ్రాసయతిఁగూర్చుటయు, వ్యాకరణ విషయములలోఁ గొంత స్వాతంత్ర్యమును గొనుటయు సోమనాథుని బహుభాషాసంప్రదాయజ్ఞతను, స్వాతంత్ర్యప్రియమును బ్రకటించి యాతని పాండిత్యమునకు మఱింత వన్నె వెట్టునేగాని దానినించుకయుఁ గొలదివఱువనేరవు. ద్విపదలలోఁ బ్రాసయతి నంగీకరించుట ప్రాచీనకవిసమ్మతమే. "అనియతగణైః" "యతిర్వా" "ప్రాసోవా" అని సోమనాథుఁ డుదాహరించిన ప్రాచీన సూత్రములిందుకు నిదర్శనములు. సోమనాథుని శిష్యుఁడును సమకాలీనుఁడునగు రంగనాథునిచే రచింపఁబడిన రంగనాథ రామాయణములోఁ

---

20 సోమనాథ నన్నెచోడుల యాశ్వాసాంత గద్యములను, పండితారాధ్యచరిత్రము 121 పుటలోని "నెట్టనేలకు" మొదలగు ద్విపద పంక్తులనిరువదిని, "నేలయు నింగియు" నను నన్నెచోడుని సీసపద్యముతోడను, తిక్కన విరాటపర్వము రెండవ యాశ్వాసములోని "నేలయు నింగియు" నను పద్యము తోడను, సరిపోల్చునది. సోమనాథుని చతుర్వేదసారమునందలి "రాకామలజ్యోత్స్న" మొదలగు నాల్గుపంక్తులకును, పోతనరచించిన "మందారమకరంద" యను పద్యమునకును పోలికకలదు. శ్రీనాథుని హరవిలాసము 3వఆశ్వాసములోని "అనువుదప్పిరినొచ్చి" యను సీసమునకును, శివరాత్రిమాహాత్మ్యము 4వఆశ్వాసమునందలి "విచ్ఛిన్నబాహూరుచరణ"యను బద్యమునకును నాచన సోముని యుత్తర హరివంశమునందలి "ఇరువురు మెయిమఱంచి" మున్నగు పట్టులకును, బసవపురాణము ఆ 7పుటలు 189, 190, 216, పండితారాధ్యచరిత్రము పుటలు 83, 134, 135, లలోగల సోమనాథుని పద్యములకును సామ్యముగలదు.

21 "కసుఁగాయఁ ద్రించినఁ గాయగుఁగాక। పసనిపండగునయ్య భ్రాంతిఁబొందినను"
(బ॥ పు॥ పే 98)

క॥ కసుఁగాయ కఱచిచూచిన। మసలక యది పగరుఁగ క మధురంబగునా॥ (సుమతిశతకము)

"సల్లవో భామల యుల్లంబెఱుంగక। గొల్లవాఁడైనను గోరునే కలియ
నొల్లనివెలయాలి నొల్లని నృపతి। నొల్లనిచెలిఁబాయ నొల్లఁడేనియును
గొల్లండువాఁడుగా కెల్లెడుజాతి। గొల్లఁడు గొల్లండె గొల్లఁడేనియును"॥ (పండి॥ చ॥ పుట 115)

క॥ ఒల్లనిసతి నొల్లనిపతి। నొల్లని చెలి కానివిడువ నొల్లనివాఁడే
గొల్లండు గాకధరలోఁ। గొల్లండును గొల్లడౌనె గుణమున సుమతీ॥ (సుమతిశతకము)

గూడఁ బ్రాసయతిప్రయోగములు క్వాచిత్కముగఁ గాననగును. ఇంతకు సోమనాథునికాలమునాఁటి యాంధ్రచ్ఛందోవ్యాకరణాదికలక్షణగ్రంథము లింతవఱకు లభింపలేదు. ఆంధ్రశబ్దచింతామణీ కర్తృత్వవిషయ మింకను గందరగోళములోనే యున్నదికదా! బసవపురాణపీఠికలో శ్రీ ప్రభాకరశాస్త్రిగారు సోమనాథుఁడు యతిప్రాసాదికవిషయములలోఁ గొన్ని యెడల నన్నయాదుల మార్గము నతిక్రమించెనని వ్రాసిరి. అది యవిచారమూలకము. వారి వ్రాతలసంగతములు[22].

భాషావ్యుత్పత్తి యందు సమధికుఁడయి, పాండితీవిక్రమంబున నజేయుఁడయి, జాతీయ కవితానిర్మాణమున నగ్రేసరుఁడయి, రసపోషణము నం దసమానుడయి, యాంధ్రీకరణయుగారంభముననే స్వతంత్రగ్రంథరచనమునకుఁ గడగిన యీమహాకవి కావ్యగుణములను గూర్చి యెంతవ్రాసినను దనివితీఱదు. కవితాప్రాశస్త్యమున నీతఁడు తిక్కనాదులతోఁ దులఁదూఁగి మొదటి తరగతిలోఁ జేర్పఁ దగినవాఁడు.

కాకతీయ యుగాంధ్రకవినాథుఁడగు సోమనాథుఁడు మనభాషకొనర్చిన మహోపకారము పారము, అద్వితీయము, చిరస్మరణీయము. అయినను నాతని గ్రంథములలో బసవపురాణ వృషాధిపశతకములు దక్కఁ దక్కినవి యింకను గూడబరిశుద్ధములుగఁ బరిష్కృతములయి ప్రకటింపఁబడకుండుట శోచనీయము. ఆంధ్రసోదరులు, కాకతీయ చరిత్రాభిమానులు శ్రద్ధవహించి యీలోపమును నివారించి సోమనాథుని గ్రంథములను బఠనపాఠనయోగ్యముగ బహుళప్రచారమునకుఁ దెచ్చి యాతని ఋణమును దీర్చికొందురుగాక యనిప్రార్థించుచున్నాను.

---

22 "పాలకురికి సోమనాథకవి- కావ్యవిశేషములు" అను పేర ది 30-7-32, 3-8-32 6-8-32 తేదుల సమదర్శనీపత్రికలోఁ బ్రకటితమయిన నావ్యాసము జదివినఁ దెలియఁగలదు.

కాకతీయ నాణెములు.*

శ్రీయుత ఎస్. టీ. శ్రీనివాసగోపాలాచార్యులుగారు ఎం. ఎల్.

ఈవిషయమై మనకు విశేషసామగ్రి లభింపకున్నను, లభ్యమగు దానిని బరిశీలించుటతోనే తృప్తినందవలసియున్నది. కాకతీయుల నాణెములనుగూర్చి చేయబడిన మొదటి ప్రశంస 1844_47 సంత్సరములలో గాంచేనగుచున్నది. ఆకాలపు బొంబాయి రాయల్ ఏషియాటిక్ సొసైటీవారిపత్రికలో[1] దక్షిణ కొంకణదేశమున హుల్ అనుగ్రామమున దొరకిన 10 నాణెములనుగురించి యొకవ్యాసము వ్రాయబడియున్నది. ఈనాణెముల కొకవైపున 'క' 'చ' యను సాంకేతికాక్షరములును, మధ్యలో నొక వలయము నుండినవనియు, రెండవప్రక్క సాధారణముగా నొక వలయములో 'రుద్ర' యను శాసనము, ఒకదానిపై మాత్రము ద్రిశూలమును 'శ్రీమన్యదేవయ' యను వ్రాతయు నుండినవనియు జెప్పి యా వ్యాసకర్త యీనాణెములు వారంగల్ రాజులగు కాకతీయులకును, వారిలో ముఖ్యుడగు రుద్రదేవునికిని చెందునని వ్రాసియున్నాడు.

పిమ్మట సర్ వాల్టరు ఎలియట్ అను పండితుడు 1886 లో ప్రకటింపబడిన "దక్షిణహిందూదేశపు నాణెములు" అను తనగ్రంథములో కాకతీయనాణెముల ప్రశంస చేసినాడు.[2] అందొక రాగినాణెము వర్ణింపబడియున్నది. దానిపై నొకప్రక్క గూర్చొనియున్న నందియు, రెండవవైపున "శ్రీమత్ ...క...క తి.....ప్రతాప... ర...య" లేక "కకత...శక...2" అను శాసనము నున్నవట. పై ఎలియట్ పండితుడు ఒకప్రక్కను లింగమును నందియు, మరియొకవైపున తెనుగువ్రాతయుగల మరిరెండు నాణెముల నుదహరించెను. కాని యివి కాకతీయులనాణెములు గావనియు, 17, 18 శతాబ్దములనాటి మధుర, తిరునెల్వేలి నాయకుల నాణెములనియు స్పష్టముగ దెలియుచున్నది.[3]

తరువాత నాణెములను బరిశోధించినవారు గూడ గాకతీయ నాణెముల బ్రశంస చేసిరి. రాప్సన్‌గారు ఎలియట్ వ్రాతలనే బరిగ్రహించిరి.[4] జాక్సన్ గూడనటులే చేసెను.[5] బ్రౌన్‌దొరగారు "హిందూదేశపునాణెములు" అనుపుస్తకములో[6] "ఒకప్రక్క నాసీ

*J. A. H. R. S VI-3&4. లోని యాంగ్లవ్యాసమున కనువాదము—(సంపాదకుడు)

1 J. Bo. B. R. A. S, II P. 63.

2 Elliot—Coins of Southern India Pl. iii nos 93—95.

3 I. A. 1903 P. 315. Loven Holl--Coins of Tinnevelly vol IV nos 92—123

4 Rapson—Indian Coins P. 38

5 Br. Numis. Jour 1912, P. 314—315

6 Browne—The Coins of India. P. 60

నయైన నందియు, మరియొకవైపున నాగరీవ్రాత లుగల పగోడాలును, ఫణములును, రాగి నాణెములును కాకతీయుల వని నిశ్చయింపవచ్చును'' అనివ్రాసిరి. కానియీవ్రాత కాధారములు కానరావు.

ఇటీవల Indian Antiquary పత్రికలో నొకరు[7] బ్రౌన్‌దొరగారి నిర్ణయమును నిరసించిరి. కాకతీయులకు వరాహముద్రిక యుండుటచే, వారినాణెములపై నందియుండుటకు వీలులేదని పై వ్యాసకర్త వాదము. కాని కాకతీయులు శివభక్తులయు, శివాలయనిర్మాతలనియు జ్ఞప్తికి దెచ్చికొనినచో, వారినాణెములపై నందివిగ్రహముండుట యసంభవము కాదని దెలియగలదు. పై వ్యాసకర్త నెల్లూరు జిల్లా కైవల్యదవల్లిగ్రామమున నొకబంగారునాణెము దొరకినదనియు నదికాకతీయులదనియు వ్రాసియున్నాడు. అందు వలయమున ధ్యగా నొక యడ్డుగీతగలదనియు, దాని కిరుపార్శ్వములను 'శ్రీ' యను నక్షరములును, పైభాగమున 'కతి' యనుమాటయు, క్రిందిభాగమున "గణ" యనుమాటయు గలవనియు, తక్కినచోటులో తెరచిననోరును, మెత్తినపంజాను, తిరిగిన తోకను గలసింహములో పెద్దపులులో గలవనియు, వ్రాసియున్నాడు. ఈ సింహ(వ్యాఘ్రి?) లాంఛనము పల్లవకదంబాదివంశములకు జెందినదేయైనను, కాకతీయులు పూర్వికుల నాణెములనుగైకొని వాని పై దమ చిహ్నములను ముద్రించి, వాడుకలో బెట్టిరని యూహింపనగునని పై వ్యాసకర్తయభిప్రాయము. కాని యీవిషయమున జాగరూకులమై యుండవలెను. నందివిగ్రహముగల నాణెములను చోళ[8] విజయనగర[9] సేతుపతి[10] వంశీయులు వాడియుండిరి.

పై చర్చనుండి యింతవరకును మనకు విశ్వసనీయములగు గాకతీయనాణెములు దొరకి యుండలేదని స్పష్టమగుచున్నది.

---

7 I. A. vol 66. P. 186—194.
8 Elliot—Pl Iv nos 167, 169, 173
9 I. A. Sep. 1891 pl II no 23
10 MDS. Jour. Lit. Sc. Fig nos 1,2, 3, 4, 6.

కాకతీయులు—ద్రవిడవాఙ్మయము.

శ్రీయుత సోమసుందర దేశికగారు.

౧

అమూల్యములగు చరిత్రాంశములను దెల్పునవయ్యు నింతవరకును సరిగా బరిశీలింపబడని ద్రావిడగ్రంథములలో 'నావలర్ చరిత్రై' అనునదొకటి. అందు సుమారిరువదినల్గురు కవులచరిత్రములు గాంచనగు చున్నవి. అట్టి వారిలో కంబకవిముఖ్యుఁడు. ఈతని రామాయణము సువిఖ్యాతము ఇయ్యది వాల్మీకి గ్రంథముకంటె గొప్పదిగ నెంచబడుచున్నది. ఇందలి యొకపద్యమును ఓరుగంటిరుద్రుని బ్రశంసించుటకై కంబకవి రచించెనని ప్రతీతి గలదు. ఈకవియెడ దనకుగల భక్తి గౌరవములను జూపుటకై రుద్రుడాకవితో చోళ రాజాస్థానమున కేతెంచెనని దీనిభావము.

పైపద్యమునందలి విషయము నవగతము జేసికొనుటకు కంబనిజీవితచరిత్రము దోడ్పడ గలదు ఈకవి "ఒచ్చ" యను పూజారికుటుంబమున జన్మించెను. చిన్నతనముననే తలి తండ్రులను గోల్పోవుటజేసి యీతడు సదయుడనువాని పోషకత్వమున దంజావూరు మండలమున బెరిగెను. కాలక్రమమున నీతడు ద్రవిడ వాఙ్మయమున విశేషపరిచయమును గల్గించుకొని వాణీప్రసాదమునుగూడ బొందెను. అనతికాలముననే కంబడు కవిచక్రవర్తియై చోళ రాజుల యాస్థానకవి యయ్యెను. కొన్నికారణములచే గొంతకాలము పాండ్యులకడ నుండినను కంబకవి తిరిగి చోళులజేరెను. ఒకనాడు విలాసప్రసంగ మొనర్చుచు రాజు హాత్తుగనవ్వెనట. కంబకవి దానికి గారణము డుగగా రాజు "నేనొక సామాన్యమానవుడనైనను, నాకు నిరంకుశమగు రాజ్యాధికారము లభించినది చూడు"మని సగర్వముగ బదులుపల్కెనట. అంతట కంబడు "ఓయీ! అట్టినీవు సామాన్యకవినగు నాకు లోబడియుంటి"వని చెప్పెనట. దీనికి గుపితుడై రాజు కంబకవిని దేశమునుండి బారదోలి యాతని యాస్తి నాక్రమించెనట. ఇట్లవమానింపబడినకవి "ఈరాజునకు రాజగువానిని నా యనుచరునిగా గొనివచ్చిగాని నేనీచోళరాజ్యమును దిరిగి బ్రవేశింప"నని ప్రతిజ్ఞచేసి వెడలిపోయెనట అనంతరమీతడు చేరదేశమున కేగెనని గొందరును, పాండ్యరాజ్యమున కేగెనని గొందరును చెప్పుదురు.

మహావిద్వాన్ రాఘవయ్యంగారు కంబని గూర్చి మరిరెండుగాథలను దెల్పియున్నారు. అందొకదానినిబట్టి, అంబికాపతియను కంబని పుత్రుడు చోళరాజపుత్రికను బ్రేమించెనని యు, దానికై యాతనిశిక్షించు నుద్దేశ్యముతో రాజు గవికుమారుని ముక్తినిగూర్చి యాశువుగా నూరుపద్యములుజెప్పి తనప్రాణ ను గాపాడు కొమ్మనెననియు, నీపద్యములను వినుచు బ్రార్థనాశ్లోకమునుగూడ లెఖ్ఖించి 99 వ పద్యమునే 100 వ దానిగా బరిగణించి రాజపుత్రిక సోత్సాహముగ నాస్థానమున దొంగిచూచెననియు, నంత నంబికాపతి శృంగారరసమును వర్ణింపమొదలిడ రాజాతని నచటనే జంపించెననియు, నీచోళరాజు మూడవరాజరాజ చోళుడనియు, దెలియుచున్నది. మఱి

యొక గాథవలన కంబనికూతురగు కావేరి యనునామెను మోహించి చోళరాజపుత్రి డామెకై బ్రియత్నించెననియుఁ నామెదీనికి బ్రతీకారముగ నాత్మహత్య చేసికొనెననియు, నీయుదంతము దెలిసి కంబకవి రాజును దూషించి, చోళరాజ్యమును వదలి కాకతీయుల యాస్థానమున కేగెననియు స్పష్టమగుచున్నది.

'నావలర్ చరిత్రె'నుండియుదాహరింపబడిన పైపద్యభావము నీరెండవగాథయు నొకేవిధమున నున్నవి. రాఘవయ్యంగారు కాకతీయులు చోళులకు బ్రభువులనియు, నప్పటి చోళరాజు మూడవరాజరాజనియు, కంబకవి దర్శించినది కాకతీయులలో మొదటిరుద్రుడనియు, నాతడు కంబనితో చోళరాజధాని కేతెంచుట క్రీ. శ. 1162—97 నడుమ జరగియుండుననియు నభిప్రాయపడి యున్నారు.

ఈయభిప్రాయము నంగీకరించుటకు గొన్ని ప్రతిబంధకములు గలవు—(1) కంబకవి కాంధ్రభాషయందును గాకతీయులకు ద్రవిడభాషయందును విశేషమగు పరిచయము, అనగా రామాయణమంతటి యుద్గ్రంథమునకు బాత ప్రవచనముల జేయుటకు సరిపడునంత, ఆకాలముననుండియుండవలెను. కంబకవి "అక్కటా" "ఉండు" మున్నగు కొన్ని తెలుగుపదములను బ్రయోగించియుండిననుగూడ నయ్యవి పాండితీద్యోతకములనుట కాధారములు లేవు. (2) మూడవగాజరాజు 1146—1162ల నడుమ రాజ్యమేలి, తనయంత్యకాలమున ప్రాచీనదాక్షిణాత్య చోళవంశీయుడగు నల్లమాన్ అనువానికి రాజ్యము నప్పగించెను. పిమ్మట నల్లమాను సోదరుడగు కుమార మహీధరుడనువాడు తృతీయ కులోత్తుంగాభిధుడై రాజ్యమేలెను. రాజరాజుత్తరసర్కారులపైనను తుంగభద్రాకన్యాకుమారీమధ్య దేశముపైనను రాజ్యమేలెను. కులోత్తుంగుడు దక్షిణ దేశమునంతటిని జయించి త్రిభువనవీరదేవుడను బిరుదము నందెను. అట్టిచో చోళులు గాకతీయుల కీసమయమున సామంతులుగనుండుట పొసగనేరదు. (3) కంబకవి తనరామాయణములో చోళరాజును పేర్కొనియుండలేదు. అట్టిరాజొకడుండినచో నాకవి నామమును దప్పక చెప్పియుండును. దీని కుత్తరముగ గొందరు కిష్కింధాయుద్ధకాండముల లోని రెండు పద్యములను జూపవచ్చును. గాని అందొకటి 'సెన్నెయ్' అని చోళుని సామాన్యముగ బేర్కొనును. మరికొందరు రామాయణము వైష్ణవగ్రంథమనియు, చోళులు శైవులనియు నందుచే చోళప్రశంస యాగ్రంథమున లేదనియు జెప్పుదురు ఇదియు నసమంజసమే. రాజరాజు వైష్ణవమతోద్ధారకుడుగ బ్రశంసింపబడి యున్నాడు. నావలర్ చరితమున కంబకవి చోళరాజ్యము 240 మైళ్ళువైశాల్యముగలదియని చెప్పియున్నాడు. దీనిని బట్టి రామాయణ రచనాకాలమునకు చోళులు దమ ప్రాముఖ్యతను గోల్పోయి యనామధేయులుగనుండిరని తోచుచున్నది. (4) 1158-1195 నడుమ రాజ్యమేలిన కాకతిరుద్రుడు తన రాజ్యము నాంధ్రదేశముదాటి విస్తరింపలేదు, అట్టిచో నాతనికి జోళుల సంపర్కముండుట కల్ల (5) ఈచోళ కాకతీయ సంబధమును బేర్కొను పద్యముగల నావలర్ చరితము గాథాసమూహము. ప్రాచీనమగు సంగకాలమునుండి 16 శతాబ్దమువరకు నాగాథలకు బరిమితిగలదు. అది యవిశ్వాస్యము. (6) కంబకవి కాలమునుగూర్చి యభిప్రాయ భేదము లున్నవి. కొందరీతడు 12 వ శతాబ్దమునందుండె

ననితలంచినను, సాధారణముగా 9 వ శతాబ్దమే యీతని జీవితకాలమని పండితులంగీకరించుచున్నారు. (7) పై నావలర్ చరిత్రలోని పద్యమునకు కంబకవినిగూర్చిన గాథలను జేర్చిననే యీచోళకాకతీయ సంబధమేర్పడునుగాని స్వతంత్రముగ నయ్యది యాసంబంధమును జూపుటలేదు.

౨

కుమారసరస్వతి, తత్వప్రకాశ అను నిరువురు ద్రావిడకవులు చెఱియొక పద్యమును ఓఢ్రులు దక్షిణదేశమును పీడించుటను, కృష్ణదేవరాయలు వారిని జయించుటను బ్రశంసించియుండిరి. క్రీ. శ. 1575లో రాయలోఢ్రులను జయించుట చరిత్రవిదితము. నిజమిటులుండినను దాక్షిణాత్యులు కృష్ణదేవరాయలు కాకతీయులను జయించెనని నమ్ముదురు.

3

"నేను మూఢుడనుగాను" అనుటకుఅరవమున "నాన్ కాకటియన్ పొక్కట్టియన్ అల్ల" అను నొక సామెతగలదు దానికి "నేను కాకతీయుడను అనగా నిస్సహాయుడనుగాను" అని యర్థము. ఈసామెత యెట్లువచ్చినదో తెలియదు.

గణపతి దేవప్రశంస.

శ్రీయుత నేదూరి గంగాధరం గారు

సీ॥ కాకతి సద్వంశ ♦ కమలాకరమునకు, నుదయభానుండయి ♦ యొప్పుమీరె
రాజన్మహాదేవ ♦ రాజబయ్యమగర్భ, పాథోధిచంద్రుఁడై ♦ ప్రభవ మొందె
వశితనంబున యాద ♦ వనృపులచెరజిక్కి,పదివత్సరంబులు ♦ బాములందె
గణపరుద్రాంబికా ♦ ఘనవీరనారుల,కడుపార నర్మిలి ♦ గాంచిమించె
ఆ॥ వె॥ పెద్దతండ్రి రుద్ర ♦ పృథ్వీశు త్రైలింగ్య,రాజ్యవృద్ధిజేసి ♦ రాజదరుల
మండలేశ్వరులను ♦ దండించి రణరంగ,భీష్ముఁడనగ నితఁడు ♦ పేరునందె॥

సీ॥ గెలిచెను కొలనిమాండలికుల జాయసే,నానిని నాజి వె ♦ ల్నాటిసీమ
కొలనిసోమయమంత్రి ♦ బలముచే గాంగుల,భంగించి గొనగ క ♦ ళింగసీమ
కొణిదెన పొత్తపి ♦ తెనుగుచోడుల బట్టి,వీరుడై గెల్చె నె ♦ ల్లూరుసీమ
ఘనమహారాష్ట్రగాం ♦ గయల నోర్చి మనుమ, సిద్ధింబ్రతిష్ఠించె ♦ సింహానగరి
తే॥ గీ॥ పల్లవుల గూల్చి పాండ్యుల ♦ భంగపరచి, కంచికృష్ణానదీమధ్య ♦ గలుగు రెడ్ల
దరిమి నెల్లూరుసింహాభూ ♦ ధరసమస్త,వేంగిదేశము పాలించె ♦ వీరుడగుచు॥

గీ॥ పద్మనాయకకాయస్థ ♦ వంశభవుల, నరయగా నిందులూరుమ ♦ ల్యాలవారి
మానధనులైన పిల్లల ♦ మరిరెడ్ల ,నిలిపె నలచమూపతులుగ ♦ నేర్పెసంగ
పోతమంత్రియు తిక్కచ ♦ మూపతియును, అన్నభాస్కరమంత్రులు ♦ నర్కసములు
మేచగోవిందనాయకుల్ ♦ మేరుధైర్య, శౌర్యగాంభీర్యధనులునా ♦ సచివులరయ॥

సీ॥ తెగువ దేశీయవి ♦ దేశీయవాణిజ్య,సంస్థల పేర్మితో ♦ సంఘటించె
జైనమతమణంచి ♦ శైవంబు వెలయించి,హాణిగట్టించె శి ♦ వాలయములు
సత్రముల్ చెరువులు ♦ చలిపందిరులు బాట,లధ్వగులకు నిల్పె ♦ నటవులందు
గోళగీరామప్ప ♦ పాలము పేటల,గట్టె గుళ్లను నోరు ♦ గల్లునందు

ఆ॥ అరువదొక్కయేడు ♦ లవనిబాలించుచు,నెనుబదేండ్లు బ్రతికె ♦ నింపెలర్ప
వసుధ పదియురెండు ♦ వందలర్వదియేట, స్వర్గమేల జనియె ♦ శౌర్యధనుడు.

మ॥ కలధాత్రీశులు మౌళిరత్నమకుటా ♦ గ్రస్తోమముల్ సోక నం
ఘ్రుల సేవింపగ సత్కవుల్ వొగడ ది ♦ క్కుల్ కీర్తి నిండారగా
కళలం బెంచి యపూర్వశౌర్యమహిమన్ ♦ గర్వారులన్ గూల్చి యాం
ధ్రుల బాలించిన కాకతీయకులచం ♦ దుర్గ్ భక్తి గీర్తించెదన్.

కాకతీయులసాటి సాంఘికచరిత్ర.

శ్రీయుత సురవరము ప్రతాపరెడ్డిగారు బి.ఏ., బి.ఎల్.,

కాకతీయసామ్రాజ్యమును గూర్చిన సాధనములు—శాసనములు, తాళపత్రగ్రంథములు, ప్రబంధములు, శిల్పములు, విదేశచ్ఛారిత్రికుల ప్రశంసలు, నాణెములు— మున్నగునవి అప్పుడప్పుడు మనకు లభించుచున్నవి. ఈవంశపురాజుల రాజ్యకాలమునందు ప్రజలయొక్క రాజకీయ, నైతిక, విద్యావిషయక, సాంఘికజీవనము లెట్టివో మనకు గొంతకొంత విశదమగుచున్నది. కాకతీయవంశరాజులు శాలివాహన శకారంభముండి వరంగల్లుప్రాంతమందే రాజ్యము చేసిరని స్థానికచరిత్రయగు ప్రతాపరుద్రచరిత్రమను గ్రంథము చెప్పుచున్నది. కాని యదివిశ్వసనీయముకాదు. ఏదియెట్లున్నను, నీవ్యాసమందు పోలరాజు కాలమునుండి ప్రతాపరుద్రుని యనంతరమువరకు, అనగా క్రీ. శ. ౧౧౦౦ నుండి ౧౪౦౦ వరకు కాకతీసామ్రాజ్యమునందలి జనుల సాంఘికజీవన మెట్లుండెనో చర్చింపబడును.

మతము:— మొదలాకాలమందలి జనుల విశ్వాసము లెట్టివో పరికింతము. కాకతీయుల కాలమం దాంధ్రదేశమందు జైనశైవమతములు విశేషముగా ప్రచారమందుండినవి ఒకకాలమం దాంధ్రభూభాగమంతయు జైనమతమునకు లోబడియుండెను. కాకతిపోలరాజు కాలమువరకు కాకతీయులు జైనులై యుండిరి. వారియింటిపేరు కాకతీయనుజైనదేవతనుండి యేర్పడెను. కాని జైనవాఙ్మయ మందు కాకతియను దేవతపేరుకానరాదు. అయినను కాకతి జైనదేవతయేయని యూహింపవచ్చును. ఆకాలమందలి వాఙ్మయమందును కాకతియన నొక శక్తియని పేర్కొనబడియున్నది. ప్రతాపరుద్రీయమను గ్రంథమునందును, "కాకత్యాః పరశక్తేః కృపయా కూష్మాండవల్లికాకాచిత్। వృత్రిమసూత తదేత త్కుల మనఘం కాకతిసంజ్ఞ మభూత్" అని యనితల్లి కలువచేరు శాసనము నందును గాకతిప్రశంస గలదు.

కాకతీయులు మొదట హిందువులై యున్నప్పుడు క్షత్రియులై యుందురు. కాని జైనులైనతర్వాత శైవులైనందున నీయుభయమతములందును చాతుర్వర్ణవ్యవస్థ యంగీకారము కానందున వీరిని చతుర్థవర్ణులనుగా శాసనములందును, బ్రబంధములందును బేర్కొనిరి ప్రతాపరుద్రీయకర్త యటు వీరిని క్షత్రియులని చెప్పనొల్లక, నిటు శూద్రులని చెప్పజాలక, గోడమీదిపిల్లివలె "అత్యర్కేందుకులప్రశస్తిమసృజ ద్యం కాకతీయాన్వయం" అని రెంటికిని తప్పినవాడునను నర్థముగూడ దోపవక్రోక్తిగా వర్ణించెను. పోలరాజుతో జైనమతావలంబనము నిలచిపోయెను. అతనిపుత్రుడు శైవుడయ్యెను. నాటినుండి తర్వాతిరాజులందఱును శైవులై శైవనామమునే స్వీకరించుచు శైవవాఙ్మయమును, శైవదేవాలయములను, శైవసాంప్రదాయములను వృద్ధిచేయుచు వచ్చిరి. కాకతీయ రాజులు శైవులైనతర్వాత జైనమతము క్షీణించిపోయెను. మఱియు శై

వ జైనమతములకేకాక శైవబ్రాహ్మణ మతములకును ప్రతిస్పర్ధలేర్పడెను. కాకతీయులు శైవుల యనుయాయులై జైనులను పీడించుట కాకతీయసామ్రాజ్యపతనమున కొక హేతువని చెప్పుదురు. శైవులు వర్ణాశ్రమాచార పద్ధతి నంగీకరింపక సర్వవర్ణస్థులనుగూడ లింగవంతులనుగా జేయుచు దుటవలన పూర్వాచారులగు హిందువుల కది సరిపడకుండెను. పిడుపర్తి సోమనాథుని బసవపురాణములోని "ఒకనాడుశివభక్తు లోరుగంటను" అను పద్యమునుండి యాకాలమున శైవపురాణమందు శివభక్తుల కాదరమును, విప్రులకు నిరసనము నుండెననియు, ద్విపదకవిత్వమా దరణీయముగా నుండలేదనియు, విశదమగును.

"అనుమకొండనివాసులైనట్టి బౌద్ధ జనుల రావించి వారి దిక్కున మనీషి తోడవాదింప జేసిన..." అను సోమదేవరాజీయమునందలి పద్యమునుండి తిక్కన సోమయాజి అనుమకొండకు వచ్చెననియు, బౌద్ధజైనులతోడ వాదించెననియు దెలియుచున్నది. అప్పుడు బౌద్ధదేవాలయముల గూలద్రోయించి గణపతిదేవరాజు సోమయాజుల పటువాక్యశక్తికి మెచ్చికొనెను. జైనబౌద్ధులు హింసింపబడిరనుట కింకొక నిదర్శనము "జినసమయార్థుల శిరముల దునిమి, విద్వేషబౌద్ధుల విలుమాడి" యను సిద్ధేశ్వరచరిత్రలోని ద్విపదపాదము. ఓరుగల్లుసామ్రాజ్యమును శైవుల కాటపట్టయ్యెను. బసవేశ్వరుడు, పండితారాధ్యుడు, పాల్కురికి సోమకవి-ఈముగ్గురును నసామాన్యశక్తియుక్తులు. వీరీ సామ్రాజ్యమందు చాల ప్రచారము చేసిరి.

ఈకాలమందలి జనుల మతవిశ్వాసముల గురించి క్రీడాభిరామమునుండి మరికొన్ని విషయములు లభించుచున్నవి. ముఖ్యముగా నపుడు పూజలొందుచుండిన దేవతలలో నీక్రిందివారు పేర్కొనదగియున్నారు

(1) ఏకవీరాదేవి-ఈదేవత జైనదేవతయో యెవరో చెప్పశక్యముగాదు. తర్వాత శైవదేవతయైనట్లున్నది. ఏలనన వల్లభరాయడు "కాకతమ్మకు సైదోడు యేకవీర" అని వర్ణించినాడు. ఈమెగుడి "ని బపల్లవనికురంబ సంధానిత వందనమాలి కాలంకృతద్వారంబు"గా వర్ణింపబడినది. ఈదేవిని మాహురమ్మయనియు పిలచిరి. మాహురమను గ్రామమందు నిలచిన దగుటచేత నీపేరువచ్చెను. ఈమె "యధోహ్రీంకారమధ్యయు" "వ్రీడాశూన్యకటీరమండల" యునట. ఈమె యే రేణుకయట. ఈనగ్నత జైనసాంప్రదాయమునుండి వచ్చియుండును.

(2) మైలారుదేవుడు—ఇతడును ఏకవీరవలెనే జైనదేవుడై తర్వాత శైవుడైనట్లున్నది. "భైరవునితోడుజోడు మైలారదేవు" డని వల్లభరాయడు వర్ణించినాడు (3) ఇతరదేవతలు—భైరవుడు, చమడేశ్వరీశక్తి, వీరభద్రుడు, బౌద్ధదేవుడు, ముసానమ్మ, కుమారస్వామి, పాండవులు, కేశవశ్రీస్వయంభుదేవులు. ఇంతియకాదు, ఆకాలమున వీరపూజలు గ్రామ గ్రామ మందు జరుగుచుండెడివి. పల్నాటి వీరుల కొకయాలయముకూడ ఓరుగంటి పట్టణమున నుండెను. మఱియు నావీరుల పటములను పలకపై చిత్రించి యుండిరట. ఈ వీరులను గురించినకథలు ద్విపదగీతములతో బాడుచుండిరి.

కాకతీయులకాలములో హిందువులలో ౧౮ కులముల వారు ప్రాధాన్యము వహించిన వారుగానుండినట్లు తెలియవచ్చెడి. నాగులపాటి శాసనములో "అయూరి పదు

నెన్మిది సమయాల సమస్తప్రజాను రంగ భోగానకై" అని యున్నది అందీక్రింది జాతులు పేర్కొనబడినవి "కోమట్లు" "ఈద అవారు" "గొల్లవారు" "అక్కలవారు" (అగసాల) "సాలెవారు" "మంగలులు" "కుమ్మరవారు".

సంఘసంస్కారము:—ప్రతిశతాబ్దమందును మన దేశమున జైనమతప్రారంభము నాటినుండియు సంఘసంస్కారము లేదో యొకరీతి జరుగుచునే యుండినవి. కాకతీయుల కాలమందును సంఘ మందనేకమార్పులు కలిగినవి. జైనశైవసాంప్ర దాయములు కట్టుబాట్లను ద్రెంచుచుండినవి. అనులోమ ప్రతిలోమ వివాహములును, సర్వ వర్ణపంక్తిభోజనములును జరుగుచుండినట్లు కొ న్ని నిదర్శనములు కానవచ్చుచున్నవి. ఇందు లూరువారను సుప్రసిద్ధకుటుంబమువారు కా కతీయుల మంత్రులు. అందు రుద్రమదేవిమం త్రియగు అన్నయదేవుడు ఆరాజ్ఞి రెండవ బిడ్డయగు రుయ్యమ్మను వివాహమాడెను. బ్రహ్మనాయుని సైన్యములో యుద్ధసమ యములందు పంక్తిభేదములేక అందఱును గలసి భుజించుచుండిరి. ఈవిషయమే కాబోలు రెడ్లకును వెలమలకును భేదముక లిగించినది. అంతకుపూర్వము రెడ్లును వెలమలు నొక తెగవారై యుండియుందురు. పల్నాటి యుద్ధవీరులలో నానాజాతులవారు నుండిరి. మాదిగయైన కన్నమనాయుడు వెలమలతో గలసి భుజించుచుండెను బ్రహ్మనాయుని దం డ్రిగాజెప్పుకొనియుండెను. పల్నాటియుద్ధము నకు "చాపకూడు" ఒక కారణమయ్యెను. "ఇచ్చోట భుజియించి రేకకార్యస్థులై సామంత నృపతులు చాపకూడు" అని యొకపద్య మున క్రీడాభిరామకర్త స్థలనిర్దేశమును గూడ చేసియుండెను. పూర్వకాలమందు పా లెగార్లు అనువారు రాష్ట్రపుసరిహద్దులందు కోటలు గట్టికొనిసైన్యయుక్తులై శత్రువులు లోపలికి రాకుండునట్లు సామ్రాజ్యమును గాపాడెడివారు. ఈపాలెగార్లసైన్యమందువి శేషముగా మాలమాదిగలును, బోయలును, నుండెడివారు. నేటికినిమాలమాదిగలగోత్ర ములలో 'పింజలవారు' 'తప్పెటవారు' 'కొ మ్మువారు' 'కత్తారివారు' ఇత్యాదిపేరులు న్నవి. మొన్నమొన్నవరకును బ్రిటీషువారి సామ్రాజ్యముస్థాపితమై, పాలెగార్లుమాయమ గువరకు నీమాలమాదిగలేవీరభటులు. అందు చే వారిలో తక్కినహిందువులకన్న నెక్కుడు క్షాత్రగుణ మిప్పటికిని గనబడుచున్నది.

శైవమతమందు చాకలి, మంగలి, మాల, మాదిగమున్నగు జాతులువారందఱును గల రనుటకు పాల్కురికిసోమనాథకృతమగు బసవ పురాణమం దనేకనిదర్శనములుకలవు. మన కాలములో సత్రిభోజనము సాధారణముగా బ్రాహ్మణులకేపెట్టబడుచున్నది. కాకతీయుల కాలమున కొన్నితావుల సర్వవర్ణములవారికిని భోజనములు పెట్టబడుచుండెనని మల్కాపుర శాసనమువలన దెలియుచున్నది. శైవసాంప్ర దాయరీత్యా చండాలురకుగూడ నన్నవస్త్ర దానము సత్రములందు జరుగునేర్పాట్లు చేయ బడియుండెను. ఆకాలమందు బ్రాహ్మణుల కును శూద్రులకునుగల నైతికసంబంధమును గుఱించి యొకయంశము గమనింపదగియున్నది.

"మరియు నొక్కనాడు సంతూరను గ్రామంబున కృష్ణమాచార్యులతమ్ముడనంతా చార్యులు రజకస్త్రీతోగూడెను. ఆరజకుడి ద్దరిని బొడిచెను. అంత వారు మరణించిరి. ఆవు రి విప్రు లదిశూద్రుపీనుగుతో గూడియున్నది

కనుక మేము మొయ్యమనిరి. అది విని కృష్ణ మాచార్యులు తనమదిని విచారించి వాసుదేవమూర్తిని కీర్తించెను. శవంబు దనంతటతానుకాష్టంబువరకు జరిగిపోయెను" ఇదిప్రతాప చరిత్రమందున్నది. సుమారురెండు సంవత్సరముల క్రితము ఓరుగల్లుకోటలో నొక భూగృహము బయలుపడినది. అందు ప్రతాపచరిత్రలో రజకసంబంధపుకథ గోడలపై వ్రాయబడియున్నది.

నాగరికత

ఏజాతియైనను తనశిల్పములచేతను వాఙ్మయముచేతను శాస్త్రాభివృద్ధిచేతను గుర్తింపబడును. కాకతీయులమ ఖ్యపట్టణమైన ఓరుగల్లా కాలమం దద్వితీయమైన నగరముగా సమకాలికులచే వర్ణింపబడినది. గణపతిదేవుడు మొదట ఓరుగంటికోటను కట్ట బ్రారంభించెను. రుద్రమదేవి దానిని బూర్తిచేసెను. లోపలి రాతికోటను "పెద్దకోట" యనియు బయటి మట్టిప్రాకారమును "భూమికోట" యనియు బిలుచుచుండిరి. ఈభూమికోట మట్టితోకట్టబడినదైనను సామాన్యమైనదికాదు. సుల్తాన్ అల్లావుద్దీన్ ఖల్జీ (౭౦౬)హిజ్రీకి సరియగు క్రీ. శ. ౧౨౯౬ లో మలిక్ నాయబ్ కాఫర్ అను సేనానిని తెలంగానాపై (ఓరుగల్లుపై) దాడివెడల నియోగించెను. అతనిసైన్యము మట్టి కోటపై బడి దానిని బడగొట్టచూచిరి. కాని "ఉక్కబల్లెములతో దానిని బొడిచినను బీటకూడ రాలకుండెను. పాశ్చాత్యవడిసెళ్లతో గుండ్లను దానిపై విసిరిన నవి పిల్లలాడు గోలీలవలె వెనుకకు తిరిగి వచ్చుచుండెను. (చూ.ఖజానుల్ ఫుతూహ్—అమీర్ ఖుస్రు) ఈకోటగోడ వైశాల్యము ౧౨౫౬ అడుగులు. తురుష్కులతో యుద్ధములం దుపయోగించిన సాధకములుకూడ కొన్నిమనకు తెలియవచ్చుచున్నవి. ఓరుగల్లుకోటనుండి నిప్పుతో కరిగినవేడిద్రవమును తురుష్కసేనపై పోయుచుండిరట. తురుష్కులు "మాంజనీకు" లుపయోగించిరి. ఓరుగల్లువారు అరడ్డలుపయోగించిరి ఈరెండును రాళ్లను రువ్వుటకై యేర్పాటుచేసిన వడిసెలలవంటివి కావచ్చును. ఏలనన ఖుస్రూ వాటినిగురించి యిట్లు వ్రాసియున్నాడు. "ముసల్మానుల రాళ్లు వేగముతో నాకాశమం దెగురుచుండెను. హిందువులగుండ్లు బ్రాహ్మణుల జందెములనుండి విసరబడినవాసివలె బలహీనములై యుండెను." (తారీఖ ఫిరోజ్ షాహి—బర్నీ) ఈ మంజనీకులు పాశ్చాత్యదేశమునుండి వచ్చినవి. ఉభయసైన్యములవారునుపయోగించిరి. అగ్నితో యుద్ధముచేయుట ఓరుగల్లు ముట్టడిలోనే ప్రారంభమయ్యెను. తర్వాత నేర్పడిన తుపాకులకిది ప్రస్తావమైయుండును.

"ఆతిష్ మీరేఖ్తండి" (ఉభయులు అగ్ని నెగరగొట్టుచుండిరి) యని ఫార్సీచరిత్రకారుడు వ్రాసినాడు. యుద్ధకాలములందు హిందూసైన్యములో స్తోత్రపాఠకులును తమనేర్పును జూపుచుండిరి. వారిని "బర్దులు" అనుచుండిరట. (ఖతాబా తె హిందూకె గోయంన్ బర్దష్)

ఆకాలమం దాంధ్రు లెట్టియుద్ధపరికరములుపయోగించుచుండిరో ప్రతాపరుద్రీయమునుండియు, తద్వ్యాఖ్యానమునుండియు బోధపడగలదు. రత్నాపణవ్యాఖ్యాన మందిట్లున్నది. తోమరః=దండవిశేషః ,కౌక్షేయకాః=ఖడ్గాః ముసుందయః=దారుమయా యుధవిశేషః, కార్ముకం=ధనుః, గదాః= ప్రసిద్ధాః ప్రాసాః, కుంతా=పరంపరాయాక్షేపణీయా ఆయుధవిశేషాః, పట్టసః=లోహదండో యస్తీక్ష్ణధార



వరంగల్లుకోట—కుష్మీమహల్ లోభాగము.

[By courtesy of H. E H. The Nizam's Archaeological Department.]

కాకతీయ సంచిక.

వరంగల్లుకోట—తూర్పుద్వారము

[By courtesy of H. E. H. The Nizam's Archeological Department.]

కురోపమః॥ (నాటకప్రకరణము 11 శ్లోకము) ఈయాయుధములన్నియు నుపయోగింపబడు చుండెనో లేక కవికపోలకల్పితములో చెప్ప జాలము. కొన్నియైనను వాడుకలోనుండి యుండును.

ఇట్టి యోరుగల్లుకోట ముసల్మానులుధ్వం సముచేయకపూర్వము బహువిస్తారము కల దై సర్వనాగరికచిహ్నములతో కూడినదై యుండెను. క్రీ. శ.౧౩౨౧లోతురుష్కసేనాని అలుఫ్‌ఖాన్ యొక యున్నతస్థానముపై నెక్కి ఓరుగల్లు కోటలోని విశేషములు చూడగా నాతని కిట్లు కనబడెను. "ఏదిక్కుచూచినను రెండుమైళ్లపొడవున నీటినాళములు (fountains) తోటలు నుండెను. వానిలో మామిడి, అరటి, పనసపండ్లుండెను. పుష్పములన్నియు హిందూపుష్పములే. చంపక, మొగలి, మల్లె పూలుండెను. (నూహె సిపెహర్‌—అమీర్ ఖుస్రూ) ఓరుగల్లునగరమందు "రాజ మార్గంబు వారణఘటా ఘోటకశకటికాభ టకోటిసంకులంబు" గానుండెను. మరియు నగర మనేకపేటలుగా విభజింపబడియుండెను. ఒకచోట అక్కలవాడ (పూటకూళ్ల యిండ్లు) ఉండెను. ఇంకొకచోట వేశ్యవాటిక యుండె ను. వెలిపాళెము అని యొకపేట యుండెను. అం దు శూద్రులు నివసించుచుండిరి. నగరిబయటి ప్రదేశమందు మైలసంత జరుగుచుండెను. ఇది వెలిపాళెమునమీపమున జరుగుచుండె ను. దాని సమీపమున మేదరవాడయుండెను. నగరములో మోహరివాడ యని యొకపేట యుండెను. ఈతీరుగా నానాజాతుల కుపయో గములగు స్థలములు నిర్ణయింపబడి యుం డెను. మహారాజుగారి మొగసాలపై గడియార ముండెను. ఆకాలమున ౬౦ గడియలలెక్క ప్రకారము పగలు 30 రాత్రి 30 గంటలు కొట్టుచుండిరి. దూరదూరప్రదేశవార్తలను తెచ్చువారుండిరి. వారిని జాంఘికులని (జంఘ యా చరత ఇతి జాంఘికా వార్తాహారాః) అని ప్రతాపరుద్రీయకర్త వర్ణించినాడు.

పరిపాలనావద్ధతి:— ఓరుగల్లుప్రభువులు తమ ప్రజలకెన్ని సౌకర్యములవసరము లో వా నిని జేసి యుండిరి. ఈకాలములో ప్రభుత్వము వారు చికిత్సాలయములు మున్నగున వెట్లు స్థాపించిరో ఆకాలమందును కాకతీయమహా రాజులు ఆరోగ్యశాలలను, ప్రసూతిశాలలను, సంస్కృతభాషను వేదవేదాంగముల బోధిం చుటకై కళాశాలలను, స్థాపించియుండిరి. శా. శ ౧౧౮౩ లోరుద్రమదేవిచే దానము చేయబడిన వెలగపూడిగ్రామములో గావిం చిన ఏర్పాటులు మల్కాపుర శాసనము [J. A. H. R. S. సం. 4. పే. 147—162] లోకలవు. ఈశాసనము చాల ముఖ్యమైన ది. ఈగ్రామమందొక మఠము, సత్రము, స్థా పింపబడెను. సత్రభోజనము సిద్ధపఱచుటకై ౬ బ్రాహ్మణపాచకులుండిరి. గ్రామములో కాయ స్థవైద్యు డేర్పాటుచేయబడెను. గ్రామరక్షణ కై ౧౦ వీరభద్రులుండిరి. ౨౦భటులు (తలారు లు)ండిరి. వీరిని వీరముష్టివారని పిలుచుచుండి రి. వీరభద్రులు నేరములు చేసిన వారికి నా నావిధశిక్షలను ఆజ్ఞాప్రకారమువిధించుచుండిరి.

కాకతీయ చక్రవర్తులు తమప్రజల యార్థి కాభివృద్ధికి చాలతోడ్పడిరి. నాటికిని నేటికిని మ న దేశమందు వ్యవసాయమే ప్రజల ప్రధానజీ వనోపాధి. కాకతీయులును, వారి సామంతులు ను, అధికారులును, రాజ్యమం దనేకస్థలముల లో చెరువులు కుంటలుత్రవ్వించి వ్యవసాయాభి

వృద్ధి చేయించిరి. గణపతి సేనానియగు రుద్రుడు పాఖాల చెరువు త్రవ్వించెను. జగత్కేసరి చెరువు, కాటసముద్రము, చౌడసముద్రము నను చెరువులుకూడ నీకాలములో కట్టింపబడినవి. కాటసముద్రము కాటచమూపతి చేతను, చౌడసముద్రము చౌడచమూపతి చేతను నిర్మింపబడెను. మరియు నాగులపాటి(నల్లగొండజిల్లా) శాసనములో "చింతల చెర్వును" "నామసముద్రమును" "విశ్వనాథ సముద్రమును" పేర్కొనబడినవి. ఈ చెరువులక్రింద "చెరుకుదోటలు" "ఆకుందోటలు" ఉన్నట్లు అదేశాసనమందు కలదు. సోమవర శాసనములో "ఒరపాలూంగాంచెఱ్వు" పేరుకలదు. పిల్లలమఱ్ఱి శాసనములో నామిరెడ్డి సబ్బిసముద్రమనునొక పెద్దచెరువును, గౌరసముద్రము, కోమటి చెరువు అనువానిని కట్టించి వృత్తులొసంగినట్లున్నది. ఎఱ్ఱక్కసానమ్మ తనపేరయెఱికసముద్రమును కట్టించినట్లు పిల్లలమఱ్ఱిలోని ఎఱ్ఱక్కసానిశాసనములో నున్నది. అంబదేవుడు అను కాయస్థుడు కాకతీయసామ్రాజ్యములో భూమిని కొలతవేయించి పన్నులనేర్పాటుచేయించెను. ఆకాలమందు భూమిని గొలుచుటకు "పెనుంబాకమానదండము" అనునదినుపయోగించెడి మైయుండెను. (చూ. మల్కాపుర శాసనము)

కాకతీయుల కాలములో బంగారు వెండి నాణెము లుండెను. అవియెటివో యింతవరకు నూహింపరానివంచమందే యున్నను, సుమారు 80, 90, సంవత్సరములకు పూర్వము కొన్ని "రుద్రదేవుని" ముద్రలుగల బంగారు నాణెములు లభించినవి. ఆకాలపుకావ్యాదులలో నాణెముల చర్చ యచ్చటచ్చట కనబడుచున్నది. కాని ఆ నాణెముల విలువయెంతనో, యవి యెట్టివో మనకింకను సరిగా తెలిసినది కాదు. స్థానిక చరిత్రయగు ఏకామ్రనాథుని ప్రతాపరుద్రచరిత్రములో "సువర్ణనిష్కములమాట పలుతావులకలదు. ప్రోలరాజు కాలమందు తూకములపద్ధతి యిట్లుండెను.

౧౨౦ గురిజలు = ౧ తులము
౧౨౦ తులములు = ౧ వీసె
౧౨౦ వీసెలు = ౧ బారువ

మరియు పై గ్రంథమందే వరహాలచర్చయు కలదు. క్రీడాభిరామమందు మంచనశర్మ టిట్టిభసెట్టి యొక్క వ్యవహారములందు "శాటీహాటక నిష్కములను" కర్ణాటవేశ్యనేకరించినది.

ఒక రూకకు నానావిధములగు భోజనములు పూటకూటింట దొరకుచుండెను. జారవ్యవహారములకు రెండు సొన్నాటంకములిచ్చిరి. వరహాలను గురించిన సూచన నాగులపాటిశాసనము (నల్లగొండజిల్లా) లో కలదు.

భూములను కుదువపెట్టుటలో రూకలతో వ్యవహారములు జరుగుచుండెననుటకు క్రీడాభిరామములోని "ఆటలెట్టితి జొన్నగడ్డాగ్రహారవృత్తి యేనూరురూకల వృత్తమునకు" అను వాక్యమేప్రమాణము.

మరియు చిన్నము అను నాణెముకూడ నుండెను. ఖాన్ హెబుతోటలోనిశాసనములో సుంకములవిధించుచో చిన్నము రెండుమూడుమారులు పేర్కొనబడియున్నది.

ప్రజల వినోదములు:— ఓరుగల్లుపట్టనమున నాగరికునికి గావలసిన సామగ్రియంతయునుండెను. మేదరవాండ్లుకలరు. కుట్రిఫువారుకలరు. వేశ్యలుతమరవికలను కుట్టుపనివారిచేతనే కొలతలిచ్చి కుట్టించుచుండిరి. జూదములాడు వినోదస్థానములుండెను. గాండ్లవారుకలరు తందానకథలు, సోదులు,సుద్దులు

చెప్పెడివారుకలరు. చిత్తరువులువ్రాయు వారుకలరు. పాములాటలు, కోడిపందెములు పొట్టేళ్లయుద్ధములు, స్త్రీలబంతులాటలునుండినవి. గ్రామములందలిజనుల జీవితపద్ధతి మనకంతగా తెలియకున్నను క్రీడాభిరామమందలి యొక పద్యము కొంత తెలుపుచున్నది. సాధారణముగా ప్రతిగ్రామమందు దశవిధ శిల్పులుండిరి. ధనికులైనవారు అందలముల (పల్లకీల)లో వెడలుచుండిరి. తిక్కనసోమయాజి గణపతిసభకు పల్లకీలో నెడలెను.

ప్రతాపరుద్రుని యుద్యోగులగు "దేవస్థానంబుల కధికారులు పచ్చలపాలకీలెక్కి చనుదెంచిరి". మరియు ధనికులగువారు "కాలాగుర్వనులేపనములు", "సూలద్విత్రిపిటావకుంతనములు" "దట్టువున్నుమృగనాభియు జారును" "కస్తూరి" మున్నగు వస్తువుల నుపయోగించుచుండిరి. బ్రాహ్మణాదిజాతులవారు "క్రొత్తమలకవాళ్లకిఱుచెప్పులు దొడగుచుండిరి. స్త్రీలు తాటంకము, "ముత్యాలకమ్మలు" "కంచీనూపురకంకణములు" "త్రిసరములు" "వెలదిమొఱవంకకడియములు" మున్నగునవి ధరించుచుండిరి.

వేశ్యలు:—ప్రాముఖ్యతను బట్టి యిచ్చట వారిగుఱించి చెప్పవలసియున్నది. ఓరుగల్లులోని వేశ్యలవాడ సామాన్యస్థలముకాదు "అవి విద్వేషిభువనజిగీషారంభవిజృంభమాణ రుషధ్వజభుజపరాక్రమసముత్సాహ నాటకప్రస్తావనాప్రథమనాందీ శ్లోకంబులగు వేశ్యవాటికానికటంబులు".

కాకతీయులకాలములో నాంధ్రులే దైశికాధికరణమందు మంచి ప్రవేశముకలవారుగా గన్పట్టుచున్నారు. ఆకాలమువారువేశ్యాసంబంధమును బ్రకటించుకొనుట లేక పొగడించుకొనుట మంచిపురుషలక్షణమని భావించినట్లున్నది. ప్రతాపరుద్రమహారాజుయొక్క యుంపుడుగత్తెమాచల్దేవి. ఆమెవైష్ణవము కవిహృదయైకవేద్యము. చందనంబున గలయంపిచల్లినారు ముగ్గులిడినారు కాశ్మీరమున ముదమున వ్రాసినారిందు రయమున రంగనల్లి కంబముల దోరణంబులగట్టినారు." ఆమెకు "గలవాసిద్ధి ఢిల్లిసురతాణికిని లేదు" మఱియునగరమందలియొకవేశ్య తనబిడ్డను గుఱించియిట్లనుచున్నది. "నీకుంజేసినశాస్తి యెట్టిదియొ తుండీరద్విజశ్రేష్ఠమా రాకాచంద్ర నిభాన్యకాకతి మహారాజేంద్రు బుత్తెంచినం గైకోడెట్టులునే మిసేయుదును.

రాజులేయిట్టి శృంగార పురుషులు గానున్నప్పుడితని మంత్రి సామంతులు వారికి దీసిపోవుదురా? నాగన్నమంత్రి "ప్రతాపరుద్ర దేశసామ్రాజ్యవర్ధన స్థిరవినీతికరణ కుశలుండు" "అంగనాహృదయ సరోజషట్పదము" అని తనకవిచే పొగడించినాడు. హిందువులలో దేవాలయములలోని దేవతల వినోదార్థమనివేశ్యల నేర్పాటుచేసి వారికి మాన్యములిచ్చు నాచారము బహు ప్రాచీనమునుండి వచ్చుచున్నది. నేటికిని పూర్వపు రాజులిచ్చిన మాన్యముల ననుభవించు వేశ్యలకుటుంబములున్నవి. రుద్రమదేవియిచ్చిన మల్కాపురదానశాసనములో సహితము ౧౦ మంది వేశ్యలు దేవాలయమువద్ద నాడుటకు, ౧౮ మంది పాడుటకు నేర్పాటు చేయబడియుండిరి. బహుదూరదేశమునుండి (తుండీరసిమనుండి) యొకఁడు ఓరుగంటిలో వేశ్యబొందు నేర్పాటు చేసికొనుటయు వేశ్యమాత కాంట్రాక్టునకు విరుద్ధముగా నడచుటయు నందుపైతలవరులకు వా

రి నప్పంగించుటయు, జారధర్మాసనమునతీర్పు చేయుటయు మున్నగు విషయములు క్రీడాభిరామమున వర్ణింప బడినవి.

ఓరుగల్లు నగరమున "అగణ్య వస్తువాహన శోభితంబైన వేశ్యాగృహంబులు ౧౨౦౦౦ ఉండినవ"ట. ఇది అతిశయోక్తియే. అయిన నీ సంఖ్య వీరి ప్రాముఖ్యతను దెలుపును

చేతివనుల వ్యాపారము:—మనదేశము పూర్వము పరిశ్రమలకును, వ్యాపారమునకును చాలప్రసిద్ధి వహించి యుండినది. కాకతీయ చక్రవర్తులును పరిశ్రమల పోషించునెడ మిగుల ఖ్యాతివహించిన రు. మట్టెవాడ యనునది ఓరుగంటి సమీపగ్రామమునకు చేరువ. అందు కాకతీయులకాలములో మట్టెలు అమ్ముచుండిరనియు నందుచే దానిని మట్టెల వాడయని వాడుచుండిరనియు రానురానా పదము మట్టెవాడ యయ్యెననియు జనులు చెప్పుదురు

ఆకాలములో నాంధ్రదేశమందు నానా విధములగు వస్తువులు సిద్ధమగుచుండినవి. ఓరుగల్లునగరమందు మంచి యున్నికంబళములును జంఖానములును నేయబడుచుండెను. ఈవిషయమునే క్రీడాభిరామమందలి "హా! హా! నృపాలసింహాసనాధిష్ఠాన రత్నకంబళ కాభిరామరోమ" అనుపద్యము తెల్పుచున్నది. ఈకంబళములనేయువృత్తిని ఓరుగల్లును జయించి యటనే నిలచిపోయిన ముసల్మానులు స్వీకరించిరి. వారిసంతతి నేటివరకును దానిచేతనే జీవించుచున్నది.

క్రీ. శ. ౧౪ శతాబ్దాంతమందు హిందూస్థానమందు సంచారముచేసిన మార్కోపోలో యిట్లు వ్రాసియున్నాడు. "ఈ(కాకతీయుల) రాజ్యములో శ్రేష్ఠమై సన్ననైనట్టి వస్త్రములు నేయబడుచున్నవి. వీనిక్రయము చాల ప్రియము. నిజముగా నాబట్టలు సాలిపురుగు జాలెవలె నుండును. ఆవస్త్రముల ధరింపనొల్లని రాజుగానిరాణిగాని ప్రపంచమందుండరు. "మచిలీపట్టణము, చుట్టుపట్టప్రాంతములును మస్లిన్ బట్టలకును, రంగులచీటీ బట్టలకును బహుకాలమునుండి ప్రసిద్ధివహించియుండెను. ఓరుగల్లుజిల్లాలోనుండు నిర్మలసమీపమందు కూనసముద్రమను గ్రామముకలదు. అచ్చట బహుశతాబ్దములనుండి ప్రసిద్ధివహించిన డెమస్కస్ ఉక్కుకత్తులకు కావలసిన ముడియినుము సిద్ధమగుచుండెను.

కాకతీయుల కాలములో నాంధ్రదేశవ్యాపారము హిందూస్థానమందేకాక విదేశములందును విశేషముగా వ్యాపించియుండెను. ఓరుగల్లు దక్షిణాపథమం దద్వితీయనగరరాజమగుటచేతను, మహారాజుల నివాసస్థానమగుటచేతను, నగరమందు గొప్పవ్యాపారము జరుగుచుండెను. నగరముబయట గొప్పసంత జరుగుచుండెను. అది ప్రతివారము (దేశాచారరీత్యా) జరుగుచుండెనేమో చెప్పజాలము. ఆసంతను మైలసంతయనుచుండిరి. ఏస్థలమందా సంతజరుగుచుండెనో యాస్థలములో నొకశాసనము చెక్కించి నిలిపియుంచిరి. ఆశాసనమిప్పటికి నదేస్థలమందున్నది. ఆశాసనము చాల ముఖ్యమైనది.

ఆస్థలము నిప్పుడు "ఖాన్ సాహెబుతోట" యందురు. ఆశాసనమందీవిషయములుకలవు. "దేశిపరదేశిబేహారులు" విశేషముగా నల్కాలువ్యాపారముచేయుచుండిరి. "ఆకులు కూరగాయలు" "నారికేళములు మాదీఫలములు "మామిడిపండ్లు" "చింతపండుమొదలు గాగల

ఫలములు, "నువ్వులు, గోధుములు, పెసలు, వడ్లు,జొన్నలు" మొదలుగాగల బుసిబండాలు, నూనె, నెయ్యి, ఉప్పు, బెల్లము, ఆవాలు మిరియాలు, తగరము సీసము రాగి, చందనము, కర్పూరము, జవాది కస్తూరి, మంజిష్ఠి,దంతము,పట్టు,పసవు,ఉల్లి, అల్లము" మున్నగు వస్తువులపై సుంకము ఎంతెంతతీసికొనవలెనో వివరముగా వ్రాయబడియున్నది. ఈ శాసనములో తులములు, మాడలు, పఱక, ఆయము, చిన్నము వీసము, పలము మొదలగు వ్యవహారపదములు గమనింపదగినవి. ఈమైలసంతలో "నుసిరభేత్తను" వస్తువు యమ్మబడుచుండెను.ఇందు "బెద్దయేనుగుదంతంబు పెట్టి" గమనింపదగినది. అల్పక్రయముగలమందును పెద్దదంతపు పెట్టెలో బెట్టికొని యమ్ముటనుజూడ నాకాలమందు దంతపువస్తులుచాల చౌకగా దొరకుచుండెనేమో. "ఓరుగంటి పురంబులో నోరగ్రింత బెద్దయెలుంగుననమ్మె సంపెంగనూనె" అనియు వర్ణింపబడినది.

మోటుపల్లియు మచిలీపట్టణమును నాకాలములో సుప్రసిద్ధమగు నోడరేవులు. అచ్చటికి పర్షియా, అరేబియా, చీనాదేశపుసరకులు వచ్చుచుండెను. ఓరుగల్లుమైలసంత శాసనమునకు తోడుగా మోటుపల్లిశాసనము చాలప్రాముఖ్యమైనది ఆశాసనమందు ఓడరేవులద్వారా విదేశములనుండి వచ్చు సరకులపై యెంతెంతపన్ను తీసికొనవలెనో యందఱకును దెలియనటుల వ్రాయించబడినది. ఈశాసనమువలన నాంధ్రదేశమునకువిదేశములకును కర్పూరచందనాది సుగంధ ద్రవ్యములలోను, దంతము, ముత్తెములుమున్నగు వస్తువులలోను, పట్టుమున్నగు వస్త్రములలోను వ్యాపారము విశేషముగా జరుగుచుండెనని విశదమగును.ఈశాసనము గణపతికాలములో స్థాపింపబడినది.

శిల్పములు. ఈయంశము ముఖ్యమైనది. కాకతీయులకాలమందు శిల్పసునానాముఖములనభివృద్ధినొందెను. వాఙ్మయమందు, దేవాలయాది నిర్మాణములందు, చిత్రలేఖనమందు కాకతీయులు చాల యభివృద్ధి కలిగించిరి.

కాకతీయులకాలములో సంస్కృతాంధ్రవాఙ్మయము వృద్ధినొందెను. ప్రతాపరుద్రుడు స్వయముగా సంస్కృతపండితుడు. అతడు రచించిన గ్రంథములు మాత్రము లభించినవి కావు. అతని యాస్థానమం దనేక పండితులుండిరి. అందు విద్యానాథుడు ప్రతాపరుద్రీయమును రచించెను. అదినేటికిని పండితజనాదరణీయమైయున్నది. శైవవాఙ్మయము చాల యభివృద్ధినొందెను. ముఖ్యముగా పాల్కురికిసోమనాథుడు పేర్కొనదగినవాడు. అతడుబహుగ్రంథకర్త. వేదవేదాంగపారగుడు. తిక్కన సోమయాజి యనుగు శిష్యుడగు మారన మార్కండేయపురాణమును ప్రతాపరుద్రుని సేనానియగు నాగయమంత్రి కంకితమిచ్చెను బద్దెనసీతిశాస్త్రముక్తావళినివ్రాసెను. సుమతి శతకమతనిదేయందురు. ఇతడు కాకతీయులసామంతరాజు.

చిత్రలేఖన మా కాలమందు సర్వసామాన్యవిద్యగా నుండినట్లున్నది. ఓరుగల్లున "చిత్తరువువ్రాసే ఇండ్లు ౧౫౦" అని ఏకామ్రనాథుడు నుడివియున్నాడు. చిత్రలేఖనమును గురించి క్రీడాభిరామమందు మంచినిదర్శనములుకలవు. ప్రతాపరుద్రుని యుంపుడుగత్తె చిత్రశాలను సిద్ధముచేయించి దాసవ్రవేశమహోత్సవము అతివైభవముతో జరిపెనట! ఇకప్రతాపురుద్రుని చిత్రశాలలెట్లుండెనో యేమో! కేవలము వేశ్యలకేయీచిత్తరు

వులు ప్రాముఖ్యముగానుండెనని తలపజనదు. దేవాలయములం దాకాలము చిత్తరువులవ్రాయుచుండిరి.

మహమ్మదీయుల యాక్రమణానంతరము జనులకీకళపై యభిమానముపూర్తిగానశించినటులభావింపనగును.

కాకతీయులువాస్తు శిల్పముపై జాలయభిమానము కలవారు. మొదట జైనమతానుయాయులగు కతన జైనదేవాలయములు, పార్శ్వనాథాది దేవతలవిగ్రహములు విరివిగా నిర్మించిరి. తర్వాత శైవులగుటజేసి శైవాలయములు విశేషముగా నిర్మించిరి. రాజులనుజూచి రాజాశ్రితులుకూడ మంచిమంచి నిర్మాణములను గావించిరి. అవిముసల్మానుల యాక్రమణానంతరము శైథిల్యమొంది యనశిష్టములైన విప్పటికిని సుందరములై దర్శనీయములై యాశ్చర్యము గలిగించుచున్నవి. అందు ముఖ్యమైనది హనుమకొండలోని వేయిస్తంభముల దేవాలయము. దీనిని రుద్రదేవుడు శా. శ. ౧౦౮౪(క్రీ. శ. ౧౧౬౨) లో కట్టించెను. మఱియు ఓరుగల్లునకు సుమారు ౪౦ మైళ్ళదూరములో నుండునట్టి "రామప్పగుడులు" అనుదేవాలయములు వర్ణించుటకు మారుగా చూచియేతీరవలయును. ప్రధాన దేవాలయ మంటపస్తంభములపై నాట్యశాస్త్రము నుదహరించు ప్రతిమలు నాట్యముయొక్క నానాంగములను నిరూపించునవై యున్నవి. ఈవిగ్రహములు కాకతీయుల కాలమందలి యొకపండితునిచే విరచితమైన నాట్యశాస్త్రము ననుసరించి చెక్కబడినవందురు. ఆశాస్త్రమిప్పుడు తంజావూరు గ్రంథాలయములో నున్నదందురు. ఇచ్చటి దేవాలయవిగ్రహముల కుపయోగించినరాయి నల్లరాయి. అది మెరుగుగలది. చూచువారిప్రతిబింబములందుగానవచ్చును. విగ్రహములు చాలసుందరములైనవి. అందుముఖ్యముగా "త్రిభంగీ" విలాసమును బ్రకటించు స్త్రీవిగ్రహములు (అవి సన్నముగానే యున్నవి.) సచేతనులను గూడ మోహింపచేయుననుటకు ముఖ్యనిదర్శనమేమన ౨౫ సంవత్సరములకుబూర్వము ఓరంగల్లుజిల్లా తాలూకాకు Collector గా నుండిన నొకమునల్మాను యుద్యోగి యొక విగ్రహమును దానిస్థానమునుండి యతిప్రయాసముతోలాగించి తనయిల్లు జేర్చికొన, కొందరుమతాభిమానులు పూర్వపు నిజాముప్రభువులతో మొరబెట్టుకొన మరల యావిగ్రహమాదేవాలయమం దుంచునటుల చేసిరి. ఈ దేవాలయములయొక్క గోపురముల కుపయోగించిన ఇటికెలు విచిత్రమైనవి. అవికొన్నికొన్ని సుమారొక యడుగు చౌకమును నాలుగంగుళముల మందమును కలవై యున్నను నీటిలోవేసిన పైకితేలునేకాని మునుగవు.

ఓరుగల్లుకోటలో నాలుగుదిశలందు నాలుగుద్వారములు గణపతిచే నిర్మింపబడెనందురు. ఆద్వారములు చాల సుందరములైనవై శిథిలావస్థయందున్నవి. ఒకదానిపై నుండిన హంసలు మొన్నటివరకు జాగీర్దారగు నొకమునల్మాను నింటిముంగిట నలంకరించియున్నవి. ఈశిథిలమైన యాంధ్రనగరమం దిప్పుడు వ్యవసాయముకూడ జరుగుచున్నది. అందందు అప్పుడప్పుడు శిథిలములైన శిల్పశకలములు బయటికి నిక్కిచూచుచున్నవి. కాని యాదరించువారులేరు. ఇటీవలనే ప్రభుత్వమువారు ఈనగరమందలి దిబ్బలత్రవ్వింప నిశ్చయించినారనినినుటకు సంతోషము కలుగుచున్నది.

ప్రస్తుతము నల్లగొండజిల్లాలో చేరిన సూ



రాయచూరు దుర్గము—దూలములను మోసికొనిపోవుట.



(కాకతీయసంచిక.)

రాయచూరు దుర్గము—రథయాత్ర.

[By courtesy of H. E. H. The Nizam's Archaeological Department.]



రాయచూరు దుర్గము—హిందువులగోడ.

[By courtesy of H. E. H. The Nizam's Archeological Department.]

MEMORIAL LIBRARY
NARLA
R. D. P. R. I.
Acc. No.

ర్యాపేట తాలూకాకు ౪ మైళ్లదూరములో పిల్లలమఱ్ఱియను స్థలముకలదు. ఈపిల్లలమర్రి వాడే పినవీరన. ఈనల్లగొండజిల్లా యంతయు కాకతీయుల సామ్రాజ్యమందు చేరియుండెను.

ఈపిల్లలమర్రిలో నామిరెడ్డియను వెలమ ప్రభువుచే నిర్మితమైన దేవాలయము శిథిలా స్థలోనుండినను నందలిశిల్పములు అత్యంత సుందరములై యున్నవి. ఇట నుపయోగించిన రాయియు నల్లనిది, నునుపైనది.

ఇదేవిధమున నాగులపాటిలోని శిల్పములును యున్నవి. కాకతీయుల శాసనములు త్రిపురాంతక మందును గానవచ్చుచున్నవి. అందువీరు "విమాన"మును నిర్మించినటుల నిదర్శనములు కలవు.

ఇంకొకయంశము ముఖ్యముగా పేర్కొనదగినది. కొండిపర్తిలోను, బూదుపురము లోను నిదేకాలములో సుందరములగు దేవాలయములునిర్మింపబడెను. బూదుపురము ప్రస్తుతము నిజాంరాష్ట్రములోని మహబూబు నగరము (జిల్లాస్థానము) నకు [illegible] మైళ్లదూరములోనున్న చిన్నగ్రామము. ఇందలి దేవాలయమే యిప్పుడు చాలశిథిలావస్థయందున్నది. ఈగ్రామములో ననేకశాసనములున్నవి.

ఇట్లు నానాప్రాంతములందు శృంగారమైన శిల్పములచే నలరారు నిర్మాణముల కాకతీయులు గావించి కీర్తినిగడించిరి. మొత్తముపై కాకతీయుల కాలమందలి జనుల సాంఘిక చరిత్ర చాలముఖ్యమైనభాగము. ఈచరిత్ర భాగమును బాగుగా పరిశోధనచేసి వ్రాసిన చరిత్రకారులకు జాలయుపయోగ మగుననుటలో నేమియుసందేహములేదు.

వినుకొండ వల్లభరాయని క్రీడాభిరామము.*

శ్రీయుత టేకుమళ్ళ అచ్యుతరావుగారు ఎం. ఏ. ఎల్.టి.

మహమ్మదీయుల దండయాత్రలకుపూర్వము దక్షిణహిందూస్థానములో కాకతీయ రాజ్యమునకు ముఖ్యపట్టణమగు ఓరుగల్లును, భల్లాణరాజ్యమునకు రాజధానియగు ద్వారసముద్రమును గొప్పప్రతిష్ఠననుభవించుచుండెను. ఓరుగల్లు సంగీతసాహిత్యాదిలలితకళలకును, ద్వారసముద్రము రాజనీతిశాస్త్రములకును పేరొందియున్నట్లు పదమూడవ శతాబ్దియంతమందుండిన కొఱవి గోపరాజు అను ఆంధ్రకవివరుడు తన సింహాసనద్వాత్రింశికకథలను ప్రబంధములో అభివర్ణించెను.[1] ఇట్టి యోరుగల్లుపురముయొక్క వైభవమును, రాజకీయసాంఘిక మతపరిస్థితులును పౌరులయొక్క వర్ణభేదములును, కులాచార విషయములును, దైనిక జీవితమును, వినోదములును, ఆటపాటలు యిత్యాది విషయ

---

* క్రీడాభిరామమును గురించి యింకను యెక్కువ విషయములు తెలిసికొనగోరువారు నా 'విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్రము' ప్రథమభాగమందలి అయిదవయధ్యాయమును చదువుకొనవలెను. టే. అ.

1. ఆం. సా. ప. పత్రిక. సంపుటము 22 సంచిక 4

ములను వినుకొండ వల్లభరాయడను ఆంధ్ర కవివరుని సహాయమున క్రీడాభిరామమందు మనకండ్లకు కట్టినట్లు చూడగలుగుచున్నాము.

వినుకొండవల్లభరాయడు కడపజిల్లా పులివెందల తాలూకాలోని మోపూరుగ్రామమునకు అధిపతిగానుండెను. ఈతని తండ్రియగు తిప్పన్న గుంటూరుజిల్లాలోని వినుకొండకు ప్రభువుగానుండి [3] విజయనగరరాజైన రెండవ హరిహరరాయలయొద్ద రత్నభాండాగారాధిపతిగా నుండెను. వీరి పూర్వులు విజయనగర రాజులయొద్ద గొప్ప యుద్యోగములుచేసిన వారే. క్రీ. వె. 1404-22 వఱకు రాజ్యము చేసిన మొదటి దేవరాయలకును, అతని పౌత్రుడగు రెండవదేవరాయలకును (1423-46) సమకాలికుడైన వినుకొండ వల్లభరాయడు దేవరాయలచే కనకాభిషేక గౌరవముబొందిన శ్రీనాథునికినిగూడ సమకాలము వాడని నిర్ణయింపవచ్చును. వల్లభామాత్యుడు కామకాయనన విశ్వామిత్రగోత్రముగలవాడు, మోపూరుభైరవస్వామి భక్తుఁడు. [4]

ఇతడు క్రీడాభిరామమను వీథినాటకమును నాంధ్రమున రచించెను. ఈగ్రంథమందలి ప్రస్తావన పద్యములవలనఁ దత్కవి గొప్పపండితుడనియుఁ జక్కని కవిత్వముఁజెప్పగలవాడనియు తెలియవచ్చుచున్నది. ఇంతియెగాక ఋగ్వేదము కరతలామలకముగా పఠించి భైరవస్వామికృపవలన సారస్వతసిద్ధియనగాఁ గ్రంథకర్తృత్వ సంపత్తిబొందెను.

క్రీడాభిరామము.

క్రీడాభిరామమొక వీథినాటకము. వీథి యనగా దశరూపకములలో నొకటియైన చిన్న నాటకస్వరూపము. దానియందు నొకరుగాని యిద్దరుగాని విలాసపురుషులగు నాయకులు శృంగార విహారపరులై యొకానొక పట్టణమందును, దత్పరిసరమందును దిరిగి యచ్చట చ్చట బొడసూపెడు ఆటలు, వినోదములు, యుత్సవములు యిత్యాది విశేషములను దిలకించి మదమొందుచు శృంగార భోగపరాయణులై వేశ్యవాటికాపరిభ్రమణమున మదనావిష్టమానసులై యారేయి గడపి మరునాడు తమదారిని దాఁబోదురు. ఇట్టివీథి నాటకములను పదునాల్గు పదునేనుశతాబ్దములలోని మనదేశమందలి గీర్వాణకవులు వ్రాసి ప్రదర్శించి రాజులను, ప్రజలను సంతోషపెట్టుచుండిరి.

రావిపాటిత్రిపురాంతకదేవుడనుకవీశ్వరుడు ప్రేమాభిరామమను నాటకమును సంస్కృతమున రచించెను.[5] దాని ననుసరించి వల్లభరాయఁడు తెలుగున క్రీడాభిరామమనురూపకమును రచియించెను. ఏతద్గ్రంథము వల్లభామాత్యుడు రచించినట్లు గ్రథమందలిప్రస్తావన బట్టియు దెలియవచ్చుచున్నది. అయిన మఱికొందఱు లాక్షణికులు ఈ యభిప్రాయమునకు భిన్నముగాఁ దమ గ్రంథములయందు కవిసార్వభౌముఁడగు శ్రీనాథుడే యీనాటకమును రచించెనని సూచించియున్నారు. ఇట్లాంధ్రలక్షణ గ్రంథములలోనున్న భిన్నాభిప్రాయములమూలమునను మఱికొన్ని కారణములవల్లను యీగ్రంథకర్తృత్వము విషయము వాదప్రతివాదముల కాస్పదమయ్యెను.

---

2. క్రీడాభిరామము (వే॥ ప్ర॥ శా ప్రకటితము) పుట 8
3. Ibid పుట 8
4. Ibid పుట 12

తొలుతల్లి యీగ్రంథమును ముద్రించిన శ్రీమానవ రామకృష్ణకవిగారు ఉభయపక్షములఁజెప్పదగిన హేతువులను వారికి సహజమగు నిష్పాక్షికమగుబుద్ధితోఁజెప్పిరి. బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'శృంగారశ్రీనాథ' మందు అనేక నుపపత్తులను జూపుచు క్రీడాభిరామకర్త శ్రీనాథుడని తెలియజేసిరి. ఈయుభయుల యభిప్రాయములను ఖండించుచు కొన్ని నూతన విశేషములను గనపరచుచు బ్రహ్మశ్రీ వేమూరి విశ్వనాథశర్మగారు 1927 సం॥ ఏప్రిల్ భారతిలో క్రీడాభిరామకర్త వల్లభామాత్యుడేయని కంఠోక్తిగా నుడివిరి. ఈపండితుల వాదప్రతివాదముల నిచ్చటసంక్షేపముగా తెలియజేయుచున్నాను.

1. పూర్వకవిలాక్షణికులగు చిత్రకవిపెద్దన ముద్దరాజు రామన, గణపవరపు వెంకటకవి, పెదపాటి జగన్నాథకవి మొదలగువారు క్రీడాభిరామమునుండి తమ గ్రంథములలో నుదహరించిన పద్యములు వల్లభరాయనివేయనిచెప్పినట్లు శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు వ్రాసినారు. కాని అప్పకవి, లింగమగుంట తిమ్మకవి మున్నగువారీపద్యములు శ్రీనాథునివని నుడివినారు.

2. క్రీడాభిరామములోనున్న ఒండురెండు పద్యములు శ్రీనాథుని గ్రంథములో నున్నవి. మఱియు క్రీడాభిరామములోనివైన కొన్నివాక్యములు, వర్ణనలును శ్రీనాథుని వాక్యములను వర్ణనలను గాఢముగా ననుకరించుచున్నవనియు, కావున శ్రీనాథుడే యేతద్గ్రంథకర్తయని సిద్ధాంతీకరింపబడవచ్చుననియు, ఋజువుచేయుటకు శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు చాలవఱకు శ్రీనాథుని గ్రంథములనుండి సామ్యశబ్దసామగ్రిని సేకరించి విపులముగ విశదపరచినారు.

క్రీడాభిరామ ప్రస్తావనయందున్న కృతిపతిస్తుతియు, గ్రంథాంతమునన్నున్న భరతవాక్యమును వల్లభరాయని గుణగణములగుఱించి స్తోత్రపాఠములగుటచే వల్లభరాయడే తన్నుతా బొగడుకొనునాయని సందేహింపదగియున్నదని శ్రీప్రభాకరశాస్త్రిగారివాదము. ఈపద్యములన్నియు సూత్రధారుడు పల్కినవిగాన ననౌచిత్యదోషములేదని శ్రీశర్మగారివాదము. ఉభయపక్షముల వాద ప్రతివాదముల సారాంశమిదియేయని నాయభిప్రాయము.

గ్రంథమునుగుఱించి యొండు రెండువిషయములకు బ్రాముఖ్యమివ్వక పోవుటచే నీయభిప్రాయభేదమున కవకాశము గలిగెనని యూహించుచున్నాను. ఈగ్రంథము రూపకముగాని కేవలము ప్రబంధముగాదు. ఇది హాస్యరసప్రధానమైన క్షుద్రకావ్యముగాని యున్నతాదర్శముగల యుత్తమమైన కావ్యముగాదు. దీనిని అట్లు పలక్షించిన యెడల శ్రీనాథుడు గాక శ్రీనాథుని భాషావేషము గొంతవఱకును ధరింపగల మరియొక కవి రచించి యుండునని మనకుఁ దోచును. శ్రీప్రభాకరశాస్త్రిగారి వాదములో ముఖ్యాంశమేదన శ్రీనాథుడును, వల్లభరాయుడును సమకాలికులగుటయు, శ్రీనాథునివాక్యచయ మెంతయేని యీగ్రంథమునగాన్పించుటయు నీరెండుకారణములచేతనే తద్గ్రంథము శ్రీనాథుడే రచించి యుండెనని తలంపు.

గ్రంథమందున్న సాక్ష్యము రెండువిధములుగా నున్నది. 1. గ్రంథకర్తను గుఱించియు 2. గ్రంథశైలిని గుఱించియు.

గ్రంథకర్త.

కృత్యాదినున్న యవతారికపద్యములలో

వల్లభమాత్యుడు తన్నుగుఱించియే అధికముగ జెప్పుకొనెను. వల్లభమాత్యుడే ఈగ్రంథమును వ్రాసినయెడల నిట్లు తన్నుఁదా బొగడికొని యుండునాయని కొందఱిచే యాక్షేపింప బడినది. ఈయాక్షేపణకు రెండుసమాధానములు. 1. ఈగ్రంథము వీథినాటకముగా నుండునట్లు వ్రాయబడినది. కాన కృతికర్తస్తవము నాటకప్రస్తావనయందు సూత్రధారుడు చెప్పినట్లు గానూహింపవలసియున్నది. సూత్రధారునిద్వారా యెంతెంత విపులముగాను విపరీతముగాను నాటకర్తలు తమ్ముదాగొండాడుకొనియుండి రో మనసంస్కృత నాటకములఁ జదివినఁ దెల్లమగును.

వల్లభామాత్యుడే యీగ్రంథమును రచించియుండనియెడల సూత్రధారుడతని కవితాస్వారస్యమును, భాషావైదుష్యమును గుఱించి కడుంగడు నుత్ప్రేక్షించి సంస్తవించుట యసందర్భముగా నుండును. ఈగ్రంథమును వల్లభామాత్యుడే ప్రత్యేకముగ రచియించెనని స్పష్టముగా సూత్రధారుడు ప్రేక్షకులకు జెప్పుచున్నాడు. కాన ప్రభాకరశాస్త్రిగారు దీని విషయమై వ్యతిరేకముగాచెప్పుట సమంజసముగా కన్పడదు.

ఈవీథినాటకమునకు భరతవాక్యమని చెప్పదగిన కృత్యంత పద్యములో మోపూరి భైరవస్వామి యీ "కవీంద్రకాంక్షితత్రిదశమహిరుసారమైన" వల్లభరాయనిబ్రోచుగాతయనిచెప్పబడినది. ఈపద్యమును వల్లభరాయడే వ్రాసిన యెడల తుమ్ముకొని తానేశతాయువనుకొన్నట్లుండునని శ్రీప్రభాకర శాస్త్రిగారాక్షేపించిరి. అయితే వల్లభరాయడాపద్యమును వ్రాయనియెడల శ్రీనాథుడు వ్రాసెనని చెప్పుటకు దగినహేతువున్నదాయని విచారింపదగినది. ఏనాటకమందైనను భరతవాక్యమందు కృతిభర్తను గుఱించి వ్రాయుట శాస్త్రసమ్మతముగాని సంప్రదాయసిద్ధముగాని యైయుండలేదు. కనుక ఈఅశాస్త్రీయమైన పనియు, సాంప్రదాయ విరుద్ధమైన పనియు శ్రీనాథుడు చేసెననుటకంటె వల్లభరాయడు చేసెననుటయే సబబు.

గ్రంథశైలి

శైలీ సామ్యమునుబట్టి ఈగ్రంథము శ్రీనాథునిదే అని కొందఱి వాదము. దీనికి నేజెప్పునదేమన ఏగ్రంథముయొక్కశైలి ఆగ్రంథస్వభావమునుబట్టియు, ఆగ్రంథకర్తప్రతిభను బట్టియు నిర్ణయమగునని సర్వవిదితమే. క్రీడాభిరామము క్రీడావిషయములుగల హాస్యగ్రంథము కావున హాస్యరస ప్రతిపాదనకొఱకు హాస్యవిషయము లేగాక హాస్యరసజనకపరిభాషకూడ వాడుక చేయవలసియుండును. లేనియెడల హాస్యరసము జనింపదు.[5]

ఈగ్రంథమందలి శైలి సంస్కృతభూయిష్టము. ఇట్టి పదకాఠిన్యము కేళీవినోదముల గుఱించియు నీచసందర్భములగుఱించియు వినియోగింపబడినది. ఈగ్రంథశైలియందలి యేతద్వైపరీత్యమునకు రెండుహేతువులుండవచ్చును. ౧. ప్రథమమున రావిపాటి త్రివురాంతకుడు తనప్రేమాభిరామమును సంస్కృతమున వ్రాసెనుగాన నాపద్యములనుదెనిగించిన కవి సంస్కృతసమాసముల నట్లేదిగవిడచియుండవచ్చును. ౨. లేదా, ఎవరోయొకకవి కీర్తికాముడగు సామాన్యుడు తనభాషావైదగ్ధ్యమును బ్రకటించుటకు నౌచిత్యపరిజ్ఞానము లేకుండ పదబంధము క్లిష్టతమముగఁ జేసియుం

5. చూ. క్రీడాభిరామము (వే॥ ప్ర॥ శా ప్రకటితము) పుట 21



పరకాల కోట — కొండపర్తి గుడి

[By courtesy of H. E. H. The Nizam's Archaeological Department.]



వరంగల్లుకోట—కీర్తిమహల్ ద్వారము.

[By courtesy of H. E. H. The Nizam's Archaeological Department.]

246B

డవచ్చును. తనవాగ్వైభవమునుగుఱించి మహాతిశయముగఁ జెప్పికొనిన వల్లభామాత్యుఁడే యీయప్రసక్తమైనట్టియు, అప్రశస్తమైనట్టియు శైలీదోషమునకుఁ కారణభూతుడయ్యెను గాని యుచితజ్ఞుఁడగు మహాకవి శ్రీనాథుడు గాడని యూహించుట యెక్కువ న్యాయము గాదా?

ఈగ్రంథములో శ్రీనాథుని పద్యములు, వర్ణనలు గానంబడుచున్నవనుట వాస్తవము. అయిననాకారణమున శ్రీనాథుఁడే యీగ్రంథమును వ్రాసెననుట మాత్రము సాహసము. శ్రీనాథునిశైలి ననేకమంది మహాకవులనుకరించిరి. అట్టియెడ వల్లభరాయడుగూడ శ్రీనాథునిశైలిననుసరించెనని చెప్పినచో నాశ్చర్యమేమియులేదు.

ఈవిధముగ నీగ్రంథము శ్రీనాథకృతమని గాక వల్లభరాయని కృతమని యంగీకరించుటయే యెక్కువ న్యాయమని యూహించుచున్నాను. వల్లభరాయడీ గ్రంథమునుఁ దెనిగించి తనస్నేహితుడగుశ్రీనాథునిచేఁ గొంతసాయయముబొందియుండవచ్చుననికూడ మనమూహించినను తప్పులేదు.

కథాసారము.

కాసలనాటి గోవింద మంచన్నశర్మయను శ్రోత్రియ బ్రాహ్మణుడును, అతనిచిన్నతనపు చెలికాడగు టిట్టిభశెట్టియను వైశ్యుడును ఆంధ్రనగరమను బ్రసిద్ధివహించిన యొరుగంటి పురవీథులలో విలాసార్థము విహరించి, యచ్చటగోచరించెడు క్రీడావినోదములను, ఆటపాటలను సావకాశముగ దిలకించి, యానందించవలెనను నుద్దేశముతో నొకనాడు శుభముహూర్తముజూచుకొని ప్రభాతమున బయలుదేరిరి.

మున్ముందుగ నొరుగంటి పురపరిసరమున నున్న వెళిపాళెము బ్రవేశించి యచ్చటనున్న నొక మేదరిసానిని, తర్వాత నొకచండాలాంగనను, యటుపైని నొకకర్నాటస్త్రీని వారు చూచిరి. అటుతర్వాత మరికొంత దూరము బోవ నొక 'కాపు' కులాంగనయు, కర్ణాట వేశ్యయును వారిదృష్టి నరికట్టిరి. వీరినిజూచి సంతసించుచుండగ సంపెంగనూనెనమ్ముచున్న తేలియువతి వారికన్నుల కగుపడెను. ఆమె సొబగును వీక్షించి మోహారివాడలోనికి బ్రవేశించుటకై చుట్టునున్న యగడ్తను దాటి, పైడితలుపులు బిగించిన వంకరదారిగుండరాజమార్గముఁజేరిరి. ఆ "రాజమార్గము వారణఘటాఘోటక, శకటికాభటకోటిసంకులంబు గాన నందు బోవవలదు, క్రంతత్రోవల కలకలంబులులేక సుఖవినోదములు గలుగును" అని సందుచాయలబోవుట సుఖమని వారు నిశ్చయించి యాదారినిబట్టిరి. అటుబోవంబోవ వారియెదుట పల్నాటి వీరపురుషుల కథనమును పాడుచున్న వేటగాండ్రి నుపలక్షించి కొనియాడి, ముందుకుసాగ నేకవీరాదేవి దేవళమును, మాహురమ్మగుడియుఁ గాన్పించినవి. ఈదేవతల సేవలనుజూచియు, జక్కులవాండ్రును, మైలారభటులును జేయుచున్నజాతరలను వీక్షించియు, చమడేశ్వరీయాలయమును, బౌద్ధవిహారమును, ముద్దరాలుమసానమ్ము నివాసమును, కుమారస్వామిదేవళమును, పాండవులగుడియు, కర్తారుని మశీదును మున్నగు వివిధదేవాయతనములనుఁ దిలకించి, యెదుటనున్న స్వయంభూకేశవ స్వాములకు గేల్మోడ్చి, మహాభైరవేశ్వరునకు నమస్కరించి, నిరీక్షించుచుండ నాంధ్రేశ్వరుని మొగసాలపైనున్న గడియారము పదునారు ఘడియలుగొట్టెను. ద్వారపడి బ్రాహ్మవీథికేగి లక్ష్మణయొజ్జ

లయింట నొక్కొకరూకనిచ్చివారు మృష్టాన్న ముభుజించి తిరిగి పురవీథులకుమొగముద్రిప్పిరి.

పూలయంగడికిబోయి పుష్పలావికలప్రౌఢ వచోవిలాసములనాకర్ణించి వేశ్యవాటికం బ్రవేశించి, యచట నేదోయొక యుత్సవంపు కలకలము వీక్షించి, ప్రతాపరుద్ర మహారాజుగారి యుంపుడుకత్తెయగు మాచలదేవి వారాంగన చిత్రశాలాప్రవేశముజేయుచున్నయదిగాన పుణ్యాహవచన సమయమిదియని దెలిసికొనిరి. అచ్చటకొంతకాలమునిలిచి యారారాజు మన్నించు వన్నెలాడిని సందర్శించి కొంతతడవు సంభాషించి వెండియు బోవంబోవ మంచనశర్మయొక్క పూర్వంపుగారాబు వెలవెలందియగుగాంధారి యగుపడెను. ఆమెయొద్ద గొంతసేపువారు సేదదీర్చికొని తిరిగి బయలువెడలి నాగస్వరమును బాడుచున్న నాగులవానిని, యటుతర్వాతగొఱెపందెములను, కోడిపందెములను జూచి, యుత్సాహమును బొంది మంచనశర్మ ప్రియురాలగు కామమంజరిగృహము బ్రవేశించిరి. ఆచ్చట నారేయియంతయు సుఖనిద్రను గడపి తరువాత తమ దారిని దాబోయిరి.

గ్రంథవిమర్శనము.

ఈ గ్రంథము క్రీడావిషయములతో నిండియున్న చిన్ననాటకము. ఆనాటి సాంఘిక జీవిత మిందులో పూర్తిగా వర్ణింపబడినది. గోవిందమంచన శర్మయు, టిట్టిభశెట్టియు చూడదలచినది యుత్కృష్టజీవితముగాక ఆదర్శవిహీనమైన జఘన్యజీవితము. కావుననేబయలు దేరునపుడు టిట్టిభశెట్టి తనయనుంగుచెలికానితో నోరుగంటిపురమునందలి మన్మథుని విజయచిహ్నములను బ్రస్ఫుటముగ వర్ణించెను. ఈవిధమైన నికృష్టజీవితమును తనివిదీరజూచుచు పోవుచున్నను మధ్యమధ్యను మరికొన్ని సాంఘిక స్వరూపములువారిదృష్టికి పొడసూపినవి. మనయదృష్టవశమున వారి క్రీడాపరాయణత్వము ఇట్టి దృశ్యములపైనగూడ బ్రసరించినది. పల్నాటివీరుల వర్ణనము, మైలారభటుల వర్ణనము, ఏకావీరాదేవి సేవాప్రసంగము ఇత్యాది విషయములు వర్ణింపబడినవి. ఎఱిగియో యెఱుగకయో వల్లభామాత్యుడు తనచిన్ననాటకమును కేవలము హాస్యశృంగారరసపూరితముగ జేయక యచ్చటచ్చట నుదారభావస్ఫురితముగఁగూడ జేయగలిగెను.

శిష్టాచారసంపత్తిలో నగ్రస్థానమలంకరించినను కొందఱు బ్రాహ్మణులు నీతిబాహ్యమగు కాముకవ్యాపారమునందుగూడ నగ్రస్థానము నలంకరించియుండ మతమునకును, శీలమునకునుగల వైరుధ్యము నేటికాలమునందుండినట్లే యాకాలమునందునహిత ముండెను. ఈగ్రంథమందలి కవిత ధారాళమై రసపుష్టికలిగియున్నది. శృంగారవిషయముల నత్యుత్కటముగ స్పృశింపకపోయినయెడల నిది సర్వజనాదరణీయమగు గ్రంథములలో జేర్చుకొన దగినదే. కాని శైలియెంతమనోహరముగనున్నను విషయములు నిరంకుశములై రసభావములు చాలవఱకు వ్రీడావిహీనములై యుండుటచే గొంత యేవగింపుగలిగించుచున్నది. తత్కారణమున నీగ్రంథమున కున్నతస్థాన మిచ్చుటకు వలనుపడదు. ఐనను మేలైన యాంధ్రచారిత్రకవిషయముల నెక్కుడుగనిచ్చుటచే నీగ్రంథ మాంధ్రుల కనూనమగు సాయమొనరించుచున్నది. కాన దీనిని నమూల్యాంధ్రగ్రంథములలో నొకటిగాఁ బరిగణింప దగును.

ప్రతాపచరిత్రము.

—:o:—

శ్రీయుత కె. రాఘవాచార్యులుగారు, ఎం. ఏ., బి. ఎల్.

దేశచరిత్రరచనమునకు గేవలము శాసనాదికములేగాక స్థానికచరిత్రములు, వంశావళులు, కావ్యములు మున్నగునవిగూడ ముఖ్యమయినయాధారములుగ గన్పట్టుచున్నవి వీనిలోని చరిత్రాంశము లతిశయోక్తులతోడను, కల్పనములతోడను గూడియుండుటచే మనము చారిత్రక దృష్టితో విమర్శించి నిజమును గ్రహింపవలసి యున్నది. కాకతీయ సామ్రాజ్యచరిత్రమున కుపకరించుగ్రంథములలో ప్రతాపచరిత్రము, సోమదేవరాజీయము, సిద్ధేశ్వరచరిత్రమును ముఖ్యములయినవి. అందు సోమదేవరాజీయము కూచిమంచి జగన్నాథకవిచేతను, సిద్ధేశ్వరచరితము కాసెసర్వప్పచేతను ప్రతాపచరితము ననుసరించి వ్రాయబడినవి. ప్రతాపచరిత మేకామ్రనాథునిచే రచియింపబడినది. అతనికాలము నిదమిత్థమని నిర్ణయించుటకు దగినయాధారములు గానరావు. ఆతడు ప్రతాపరుద్రుని నిర్యాణమును, యాతని కొమరుడగు వీరభద్రుడు ఓరుగల్లు పురమును వదలి పురజనులతోను నరపతిరాయలతోను కొండలపైనుండుటను, నేకశిలా నగరము ఢిల్లీసుల్తాను వశమగుటను, వర్ణించియుండుటచే నీగ్రంథము ప్రతాపరుద్రుని యనంతరము రచియింపబడి యుండవలెనని తోచుచున్నది.[1] ఏకామ్రనాథుడు ప్రతాప రుద్రునికాలమువాడనుటకు దగిననిదర్శన మేదియును లేదు.

శాసనాదికములవలన గాకతీయులచరిత్రము మొదటి ప్రోలరాజు (సుమారు క్రీ. శ. 1050) కాలమునుండియే తెలియుచున్నది. అంతకు పూర్వవృత్తాంతములు తెలియుటలేదు. ప్రతాపరుద్రదేవుడు క్రీ. శ. 1326 వరకు కాకతీయ సామ్రాజ్యమును పాలించినటుల నిశ్చయింపనగును. కాకతీయులు ప్రథమమున మాండలికులుగనుండి కాకతి ప్రోలుని యనంతరము సామ్రాజ్యస్థాపన మొనర్చిరా? యను విషయము విమర్శింపవలసియున్నది. బేతరాజే వంశమునకు మూలపురుషుడుగాడనియు నతని తండ్రియగు ప్రోలరాజు మోటుపల్లి మున్నగు శాసనముల బేర్కొనబడెననియు మనకు దెలిసిన విషయమే. బేతరాజు పశ్చిమచాళుక్య చక్రవర్తియు, త్రిభువనమల్ల బిరుదాంకితుడునగు నాఱవ విక్రమాదిత్యుని (క్రీ. శ. 1076—1127) కాలమున నాతనికి సామంతుడై సబ్బిసాయిరమండలము నేలుచుండెనని యనుమకొండలోని కన్నడశాసనమున గలదు.[2] ప్రతాపచరిత్రమున గాకతీయులపూర్వచరిత్రము గూడ వర్ణింపబడినది. దానిని సంగ్రహముగ వివరింతును. కృష్ణా గోదావరీ మధ్య దేశంబున హనుమద్గిరిప్రాంతమును హను

1 ప్రతాపచరిత్ర మాంధ్రసాహిత్య పరిషత్కార్యాలయము వారిచే బరిషత్పత్రిక 6, 7 సంపుటముల లోను యిటీవల వరంగల్ శైవప్రచారిణీగ్రంథమాలయందు మూడవయనుబంధముగను బ్రకటింపబడినది. కాని యీరెండు ప్రతులకును కొన్ని స్థలముల భేదములు గలవు.

2 Ep. Ind. vol, ix. p. 256.

మడు, కొండడుమున్నగు నెఱుకరాజులు 180 సంవత్సరములు పాలించిరి. వీరి యనంతరము కాకతి రాజులు వేయేండ్లు పాలించి, యేకశిలానగనరమునునిర్మించి పెక్కు శాత్రవుల నిర్జించిరి. వారి వంశక్రమమీ విధము. చంద్రవంశంబున జనమేజయుండు, నతనికి శతానీకుడు, నాతనికి క్షేమాంకుడును గల్గిరి. (క్షేమంకరుడని ఓరుగల్లు ప్రతియందు గలదు.) అతనికి విజయాంకనాథుడు (విజయార్కుడు) సోమేంద్రుడు నను పుత్రులు జన్మించిరి. అందు సోమేంద్రునకు విష్ణువర్ధనుడు జనించి ధర్మపురిప్రాంతమున రాజ్యమొనర్చెను. అతని కుమారుడగు నందుడు నందగిరిపురంబు రాజధానిగా రాజ్యము పాలించెను. అతడు తన కూతురగు వసుమతిని యదువంశతిలకుడగు సత్యభానునకు వివాహమొనరింప వారలకు వృషసేనుండను కొమరుడు కలిగెను. వృషసేనుని వంశంబున కన్నమదేవుడు జన్మించి కందారంబు రాజధానిగా రాజ్య మొనర్చెను. అతని కుమారుడగు సోమదేవుడు పెక్కుసారులు కటకేంద్రునితో బోరి నిహతుడయ్యెను. అతని భార్యయగు సిరియాలదేవి గర్భవతి యగుటచే దనశిశువునురక్షించు కొనుటకై హనుమద్గిరిలోనుండు యెఱుకురాజుల శరణంబువేడ, వారు గజపతి నెదిరింప ధైర్యముచాలక సిరియాలదేవిని యామెతోనుండు బ్రాహ్మణులను పురి వెడల నడిచిరి. అంత సిరియాలదేవి యెఱుకరాజుల పురోహితుండగు మాధవశర్మను శరణువేడి యతనియింట వసింపుచుండెను. మాధవశర్మయు నామెను దన కుమార్తె యని ప్రకటించి, యామె వడ్డించిన దానును మిగిలిన బ్రాహ్మణులును భుజియించి, గజపతిని కటకంబునకనిపి యామెను రక్షించెను. కొంతకాలమున కామెకు మాధవవర్మయను పుత్రుడుదయించి, పద్మాక్షీ వరప్రసాదంబున రాజ్యాభిషిక్తుడై, దిగ్విజయమొనర్చి, కటకేంద్రుని జంపి పగదీర్చుకొనెను. మాధవవర్మకు పద్మసేనుండును, నతనికి వెన్నమరాజు, నతనికి గుండమరాజునుజనించిరాజ్యపాలన మొనర్చిరి. గుండమరాజు తరువాత నాతనిపుత్రుడగు ఎఱుకు దేవరాజు రాజయ్యెను. అతడు బాలుడగుట నాతని మేనత్తయగు కుంతలిదేవి కొంతకాలము రాజ్య మొనర్చెను. ఎఱుకు దేవరాజునకు భువనైకమల్లుడు, నతనికి త్రిభువనైకమల్లుడును గల్గిరి. త్రిభువనైకమల్లునకు గాకతిదేవి వరప్రసాదంబున ప్రోలరాజుదయించెను. ఈతడే చరిత్రకారులచే బేర్కొనబడిన రెండవ ప్రోలరాజు. ఈతని తండ్రియగు త్రిభువనమల్లుడే పశ్చిమచాళుక్యచక్రవర్తియగునాఱవవిక్రమాదిత్యుని సామంతుడై యాతని త్రిభువనమల్లబిరుదమును వహించిన బేతరాజు.

ప్రతాపచరిత మీరాజుల వృత్తాంతమును దెల్పుటయేగాక వారి రాజ్యపాలనకాలముల దెల్పుచున్నది. కాకతీయులు మాధవవర్మ మొదలు ప్రతాపరుద్రునివరకు వేయిసంవత్సరములు రాజ్యముపాలించిరని గలదు. కాని యిందుదహరింపబడినకాలనిర్ణయము సరికాదు. ప్రతాపచరితాదులవలన మనమీక్రిందివిషయములు గ్రహింపవలసియున్నది.

(1) ఓరుగల్లు ప్రతియందలి పొరికివెన్నమరాజు పరిషత్ప్రతియందు గాననగుటలేదు. సోమదేవరాజీయమున నుండుటచే నిదివ్రమాదవశమున విడువబడినదని తోచుచున్నది. మరియు నీగ్రంథముల బ్రతాపరుద్రుడు దిగ్విజ

యమునకేగ నాతనిసోదరుడగు అన్నమదేవుడు 12 సంవత్సరములు రాజ్యపాలన మొనర్చెనని కలదు. దీనిని నిర్ణయించుటకు దగినయాధారములులేవు. మాధవవర్మ శా. శ. 291 సంవత్సరమున రాజ్యమునకు వచ్చెననియు, ప్రతాపరుద్రదేవుడు శా. శ. 1282 వరకు రాజ్యమొనర్చి శా. శ. 1291 లో స్వర్గస్థుడయ్యెననియు నోరుగల్లుగ్రంథమున గలదు. శాసనాధారములవలన బ్రతాపరుద్రుడు క్రీ. శ. 1326 వరకున్నటుల నిర్ణయింపబడినది.[3] ప్రతాపచరితాదులందుగల కాలనిర్ణయము ప్రమాదభూయిష్ఠము. చరిత్రకారులు బేతరాజుమొదలు ప్రతాపరుద్రునివరకు నేర్పరచిన రాజ్యకాలములు ప్రతాపచరితమునందుగలవానితో సరిపోవుటలేదు. శాసనములవలన క్రీ. శ. 1050 మొదలు 1326 వరకే కాకతీయులకాలమని నిర్ణయింపబడినది.[4] కుతుబుసాహీ సుల్తానుల చరిత్రమును (తారీఖేఖాదిరీ) రచించిన మున్షీ ఖాదరుఖాను నందునియొక్కయు మాధవవర్మ యొక్కయు వృత్తాంతమును దెల్పియున్నాడు. ఇది స్థానికచరిత్రలపై నాధారపడి యుండనోపు. ఇటియు మహమ్మదీయ గ్రంథకారులు కాకతీయులు మహమ్మదీయుల దండయాత్రి నాటి కేడువందలసంవత్సరములనుండి రాజ్యముచేయుచున్నట్లు వ్రాసియున్నారు. ప్రతాపచరితాదులవల్లను స్థానికగాథలవల్లను మనము తెలిసికోదగిన విషయము కాకతీయులు మాండలికులుగనైననేమి, స్వతంత్రరాజులుగనైననేమి సుమారు పేయిసంవత్సరములు అనుమకొండరాజ్యమును పాలించిరనుటయే.

(2) త్రిభువనైకమల్లుడు బేతరాజనియు నాతడు దనయేలికయగు విక్రమాదిత్యుని బిరుదమును వహించెననియు దెల్పియుంటిమి. ఆతని తండ్రియగు భువనైకమల్లుడే మొదటి ప్రోలరాజు, ఇతడు రెండవసోమేశ్వరునివలె భువనైకమల్ల బిరుదమును వహించెను. వేంగీ చాళుక్యరాజగు రెండవఅమ్మరాజుకాలము నాటి తామ్రశాసనములో[5] గాకర్త్యగుండ్యన యొకడు పేర్కొనబడెను. (క్రీ. శ. 956) ఈతనికాలము గుండమరాజుకాలమునకు సరిపోవుచున్నది. కాని గుండముని తండ్రితాతలు వెన్నమరాజు, పొరికివెన్నమరాజు అని స్థానికచరిత్రములయందుండ, శాసనమున ఎఱియు, గుండియ రాష్ట్రకూటులని గలదు. ఈగుండ్యన యెవరో యింకను నిర్ణయింపవలసియున్నది. మఱియు ఖాజీపేటశాసనమునం దొకదానిలో మొదటిప్రోలరాజుతండ్రి బేతరాజని యున్నదట.[6] ప్రతాపచరితమున నెఱుకదేవరాజని కలదు. ఇదియు విమర్శనీయము. బెజవాడ మల్లేశ్వరాలయమునగల శాసనమున శా. శ. 1171 ప్రాంతమున నొకమాధవవర్మ గలడని వ్రాయబడినది. అతడే కాకతీయుల మూలపురుషుడనుటకు దగినయాధారము లింకను దొరకియుండలేదు. మాధవవర్మకాలము శా. శ. మూడవశతాబ్దమని ప్రతాపచరితాదులయందు గలదు.

---

3 ఈ సంచిక ౭౯ పుటను చూచునది.

4 J. A. H. R. S. vi—2 p. 124.

5 C P No. 1 of 1916-17- Ep Report-1917

6 ఈ శాసనమూలము J.A.H.R.S. Vol. vii. p. 2. p. 115 లో నాచే బ్రకటింపబడినది- (సంపాదకుడు)

(3) కాకతీయుల కాపేరెందులకు వచ్చినదో, కాకితమ్మ(కాకతమ్మ) యననెవరో, మనము విచారింపవలపియున్నది. ఈసందర్భమున జరిత్రకారులు పెక్కువిషయముల నుద్ఘాటించుచున్నారు. మనకు దెలిసినవిషయముల జర్చించి యామె జైనదేవతయా? కాదాయని విమర్శింపనగును. అనితల్లికలువచేరుశాసనమున[7] "కాకత్యాఃపరశక్తేఃకృపయా కూష్మాండవల్లికాకాచిత్ పుత్రమసూత, తదేతత్కుల మనఘం కాకతీయసంజ్ఞమభూత్" అనికలదు. రెండవప్రోలరాజు పద్మాక్షీ దేవాలయశాసనమునందలి జినేంద్రస్తుతిచే జైనమతావలంబకుడని యూహింపబడుచున్నాడు. ఇరువది రెండవ తీర్థంకరునిదేవి కూష్మాండీనియని జైన గ్రంథములు దెలుపుచున్నవి. వీనినొకదానితో నొకటి ముడివెట్టి, కాకతి జైన దేవత యనియు, నామెయే కూష్మాండిని యనియు, గాకతియన గుమ్మడితీగ యనుట దీనినిబలపఱచుచున్నదనియు వ్రాయుచున్నారు. కాకత (కాకిత) యనునది జైన దేవత యని యెచటను దెల్పబడి యుండలేదు. జైనగ్రంథముల గాకతి యను పేరుగానరాదు. కాకతియన గుమ్మడితీగయని నిఘంటువులగాని మరి యే యితర గ్రంథముల గాని లేదు. విద్యానాథకృత ప్రతాపరుద్రీయమున 'కాకతీయకులదుర్గాదేవీసమారాధనేనవిజయప్రస్థానమంగళం కృత్వా' అని కలదు. రత్నాపణ వ్యాఖ్యానమున 'కాకతిర్నామదుర్గాశక్తి రేక శిలానగరేశ్వరాణాం కులదేవతా, సాశక్తిర్భజనీయా అస్యేతికాకతీయః' అనియున్నది. క్రీడాభిరామమున నీమె ఏక వీరకుకై దోడని వర్ణింపబడినది. ప్రతాపచరితమున తమయిలువేల్పయిన కాకితమ్మకు ఉత్సవములుచేయించి, 'కాకితదేవివరప్రసాదంబున ఒక్కసుతునిం గని కాకితప్రోలాజు అను నామకరణ మొనర్చి' అని వ్రాయబడినది. కలువ చేరుశాసనమున గూడ నీమె శక్తి స్వరూపిణి యని కలదుగదా. వీనివలన గాకతియనునది దుర్గకపరనామధేయమనియు, నామెయే కాకతీయుల కులదేవత యనియు స్పష్టము. మఱి కూష్మాండవల్లరి నుండి కాకతీయు లుద్భవించిరను శాసనభాగమును బరిశీలింప నది స్థానికగాథలపై నాధార పడియున్నట్లు తోచుచున్నది. మాధవవర్మ కుమారుడు పద్మసేనుడు సంతానంబులేమి బుధానుమతంబున సిద్ధేశ్వర శ్రీమన్మహాదేవుని నిత్యంబును గూష్మాండ ఫలంబుల బూజింప దత్ప్రసాదంబున నొక్క సుతుడు గలిగెనని ప్రతాపచరితాదుల గలదు. ఇదియేకూష్మాండ వల్లరీ గాథకు మూలమని తోచును. పై విషయముల బరిశీలింప గాకతి జైనదేవత యనుటకు తగిన యాధారములు లేవు. అవి దొరకు వరకు నామె దుర్గయే యనియు, నామెను భజించుటచే గాకతీయులకా పేరు గలిగెననియు మనమూహింప వలసియున్నది. కాగతియను గ్రామమునుండి కాకతిశబ్దము పుట్టినదనియు కొందరు వ్రాయుచున్నారు.[8] అది సరికాదని తోచుచున్నది. నా మిత్రులలో నొకరు బౌద్ధ వాఙ్మయమున గాకతియను దేవతయున్నదని తెల్పియున్నారు. ఇదియు భావివిమర్శనము వలన దేలవలసియున్నది. ప్రోలరాజు రాజైను

---

7 ఆ. సా. ప. vol II -పు96-112.

8 ఈసంచికలోని నా వ్యాసమున ర వ పుటను గాంచునది. (సంపాదకుఁడు.)

డగుటచే గాకతియు జైనదేవతయైయుండు నని విల్సనుగా రభిప్రాయపడియున్నారు.[9]

(4) ఈసందర్భమున మరియొకవిషయము ను మనము విమర్శింపనగును. ప్రతాపచరిత మున గణపతి రుద్రునికుమారుడనియు, మహా దేవరాజీతనికి పినతండ్రియనియు వ్రాయబడి నది. కొన్నిశాసనముల గణపతి మహాదేవరాజు కుమారుడని యుండుటచే జరిత్రకారులు రుద్ర దేవునికి సంతానములేదనియు, నతనితరువాత మహాదేవరాజు నాతనియనంతర మతనికుమా రుడగు గణపతిదేవుడును రాజ్యపాలన మొన ర్చిరనియు నిశ్చయించియున్నారు. కరీంనగర మండలమునందలి యుస్పరపల్లె శాసనమున గణపతిదేవుడు రుద్రనరేంద్రుని పుత్రుడని స్పష్టముగ దెలుపబడినది.[10] మహాదేవరాజు రుద్రునిజంపి రాజ్యమాక్రమింపబోవ బ్రజలా తని యన్యాయమునుగాంచి రుద్రునినుతుండగు గణపతికి పట్టముగట్టి యువరాజై యుండుమని యతనికి బోధించిరనియు, యతడట్లే గణపతి సహితంబుగా మూడువత్సరములు రాజ్యమొ నర్చి, దేవగిరిరాజులతో యుద్ధముచేసి సమసె ననియు బ్రతాపచరితమున గలదు. ఈవిషయ మింకను విమర్శింపవలసియున్నది.

(5) కాకతిప్రోలరాజు తన యవసానకాల మున బ్రమాదవశమున రుద్రనృపునిచే జంప బడెననియు, రుద్రదేవుని రాజ్యకాలమున నా తనిసోదరుడగు మహాదేవరాజాతని నెదిరించి యతని జంపెననియు స్థానికచరిత్రాదులవలన దెలియుచున్నది. ఇందలి సత్యాసత్యములింకను పరిశోధకులు నిర్ణయింపనగును.

(6) కాకతీయులకు బ్రథమమున ననుమ కొండయే రాజధానియైయుండెను కాకతిప్రోల రాజు ఓరుగల్లుపురమును నిర్మించెననియు, గణ పతిదేవు డాపట్టణమునకు ప్రాకారాదులను నిర్మించి యోరుగంటికోటను గట్టించెననియు బ్రతాపచరితాదులయందు గలదు. శివయోగ సారమను గ్రంథమున రుద్రదేవుడనుమకొండ నుండి యోరుగల్లునకు రాజధానిని మార్చినట్లు వ్రాయబడినది. కొన్నిశాసనముల గణపతిదేవు డు ఓరుగంటిపురాధీశ్వరుడని యుండుటచేతను, యంతకుపూర్వము హనుమకొండయే రాజ ధానియని యుండుటచేతను, ఓరుగల్లు క్రీ. శ. 1254 ప్రాంతముననే రాజధానియయ్యెనని తెలియ నగును. ప్రతాపచరితాదులవలన ఓ రుగల్లుపుర మదివరకోనిర్మింప బడెననియు, గణపతికాలమున గోటనిర్మింపబడుటచే నాతని కాలమునుండియే శాసనముల నది రాజధాని యని యుదహరింపబడినదనియు నునమూహిం చుట యుక్తియుక్తము.

స్థానికచరితములనుండియు, బ్రతాపచరిత ము సోమదేవరాజీయము మున్నగు గ్రంథము లనుండియు, జెక్కుసమస్యలు బయలుదేరుచు న్నవి. ప్రతాపచరితాదుల సహాయమువలన మనము త్రిభువనమల్ల బేతరాజునకు బూర్వపు కాకతీయరాజ్యచరిత్రమును నిర్మింపవలసి యున్నది.

---

9 Mackenzie collection vol. I Intro. P. 128. Edited by H. H Wilson (1828)

10 Hyderabad Archaelogical Series No. 3.

కాకతీయులచరిత్రము—విశేషాంశములు.

శ్రీమాన్ దూపాటి రమణాచార్యులుగారు.

కాకతీయు లాంధ్రదేశమునకు సంఘమున కుమారుఁడైన ప్రోలరాజు..... ఈకాకతిప్రోలరాజు శాసనమునందు మొదట త్రిమూర్తులయిన బ్రహ్మవిష్ణు మహేశ్వరులలో నెవరిని స్తుతింపక శ్రీమజ్జినేంద్రునిమాత్రమే స్తుతించి యుండుటచేత నితఁడు జైనమతావలంబియని స్పష్టముగా బోధపడుచున్నది."

కాకతీయులచరిత్రము కాకతీయు లాంధ్రదేశమునకు సంఘమున కుమారుఁడైన ప్రోలరాజు..... ఈకాకతిప్రోలరాజు శాసనమునందు మొదట త్రిమూర్తులయిన బ్రహ్మవిష్ణు మహేశ్వరులలో నెవరిని స్తుతింపక శ్రీమజ్జినేంద్రునిమాత్రమే స్తుతించి యుండుటచేత నితఁడు జైనమతావలంబియని స్పష్టముగా బోధపడుచున్నది."

కాకతీయులమత మెద్ది? కూటస్థుఁడెవఁడు? వీరలవంశమెద్ది? యనునంశములు సందిగ్ధములుగ నున్నవి. వీరికులమునుగూర్చి ఇదమిద్థమను నిర్ణయమింకను జరుగలేదు. కొన్నిశాసనములు దుర్జయవంశజుఁడగు బేతరాజును గూటస్థునిగను, మఱికొన్ని దుర్జయునితావున బేతరాజునుజెప్పి అతనిపుత్రుఁడగు ప్రోలరాజును గూటస్థునిగఁ బేర్కొనినవి. ఈప్రోలునివంశమున రుద్రదేవుడు జనించెననుటచే బేతరాజునకు ముందొక ప్రోలరాజీవంశమున గలఁడనుట సత్యము. మొత్తముమీఁద నీభిన్నభావములు సమన్వయించి చరిత్రచతురాననులగు శ్రీవీరభద్రరావు పంతులువారు ఈక్రిందివిధమునఁ జరిత్రమును నిర్ణయించిరి—

"దుర్జయునితరువాత కాకతీయవంశమున మొదటి ప్రోలరాజు జనించెను. అతఁడు అరికేసరియను గొప్పచెఱువు త్రవ్వించెను. ఇతనికిఁ త్రిభువనమల్ల బేతరాజు జనించెను. త్రిభువనమల్లుఁ డనునది బేతరాజునకు బిరుదనామము .....మహామండలేశ్వర కాకతిబేతరాజునకు బిమ్మట రాజ్యభారము వహించినవాఁ డతని అదృష్టవశమున ఖాజీపేటలో నొక సమాధియందు రెండుశాసనశిలలు స్తంభములుగా నుపయోగింపఁబడినవని తెలియవచ్చెను. పోయి పరిశీలింప నందపూర్వ చరిత్రాంశము లున్నట్లు నవి చరిత్రమున కమూల్య పరికరములనియుఁ దెలిసెను.

ఈ రెండుశాసనములకును బయిని ఒక మూరపొడవు గలభాగము విరుగఁగొట్టఁ బడుటచే శాసనశిలలయందలి యాద్యంతములకుఁ బొత్తు కుదురకున్నది.[1]

తెలిసినభాగమువలన రాష్ట్రకూట వంశజుఁడగు అమోఘవర్ష పృథ్వీ వల్లభ దేవుఁడు మనకుఁ బరిచితుఁడైనాఁడు. ఈతఁడు తనకుఁ బ్రతినిధిగ అనుమకొండ రాజ్యమునకు సత్యాశ్రయవంశజుఁడు చాళుక్యుఁడునగు భీమరసును నుంచెను. అమోఘవర్షపృథ్వీవల్లభ దేవుఁడు క్రీ. శ. 878 ప్రాంతమున అనుమకొండ రాజ్యమును బాలించుచుఁ దన ప్రతినిధి నుంచుటచేఁ దొమ్మిదవ శతాబ్దమునఁ బశ్చిమ చాళుక్యులనుండి రాష్ట్రకూటులు త్రిలింగ సామ్రాజ్యమును హరించి యొక పశ్చిమచాళుక్యవంశజుని రాజప్రతినిధిగనుంచిరని తెలిసినది. ఆ కాలమున అనుమకొండకు వ్యవహార నామము "అమ్మకొండ".

రెండవశాసనము కాకతిబేతరాజుది. నాలుగువైపుల నీశాసనము వ్రాయఁబడియున్నది. తలభాగము ఒకమూరవరకుఁ దెగఁగొట్టఁబడుటచే ఒకచివరగల యంశము వేఱొకప్రక్కతో జతకుదరకయున్నది. ఇది యొక శాసనమా, రెండుశాసనములా? యను సందియముఁగూడఁ గలుగుచున్నది. ఇందొకభాగము కన్నడపద్యములతో నున్నది. మఱియొకభాగము శ్లోకములతో నున్నది. తొలుత శ్లోకభాగములోని సారాంశము వివరించెదము. ఇందు మొదట బేతరాజు, తరువాత పోలరాజు, పిదప బేతరాజు వరుసగాఁ బేర్కొనబడిరి.[2] ఇందలి చివరబేతరాజే త్రిభువనమల్లబేతరాజు. ఇతని కుమారుఁడే పోలరాజు, త్రిలింగరాజ్యనిర్మాత. శాసనమునఁ బయిభాగము బోవుటచే ముందుఁగల యంశములు దుర్గ్రాహ్యములైనవి. ఉన్నంతలో బేతరాజు కాకతిపురాధినాథుఁడు, చోళరాజుల సేనాసముద్రమును మథించి లక్ష్మి నార్జించినాఁడు. ఈబేతరాజు త్రిభువనమల్ల బేతరాజునకుఁ దాత. క్రీ. శ. 975-1025 వఱ కితని రాజ్యకాలము. పాలెంపేటశాసనమునందును పిల్లలమఱ్ఱి శాసనమునందును రేచర్లబ్రహ్మసేనాని కాంచీనగరమును జయించి కాకతీయరాజుల కర్పించినటులఁ గలదు. కాంచిరాజులు చోళులుగానను ఈబేతరాజు తాను చోడవార్ధి జయించి లక్ష్మిని గడించితిననుటచేత నీతఁడు రేచెర్లబ్రహ్మనాయని సహాయమున కాంచి జయించిన వీరుఁడని నిశ్చయింప వచ్చును.

పైఁజెప్పిన మొదటి బేతరాజుకుమారుఁడు మొదటి పోలరాజు. ఈయన మహావీరుఁడు. కొడ్వత్తిదుగ్గరాజు కుమారుఁడగు గొన్న

---

1 " ♦ ♦ ♦ ♦ నన్దనయె
1 మ్బసంవత్సరమాగ క
2 న్నెయోళ్ బృహస్పతిప్రవ
3 తిసే స్వస్త్యమోఘువ
4 షశ్రీపృథువీవల్లభ
5 మహారాజాధిరాజపర
6 మేశ్వరభట్టరర పాద
7 పద్మోపసేవిత లబ్ధ
8 సమధిగతపఞ్చమ
9 మహాశబ్ద మహాసామన్తా
10 ధిపతి సత్యాశ్రియ
11 శ్రీమధ్భీమరుస స్సర్వగు
12 ణజనసంస్తూయమానధ
13 మ్మసారతి చతుస్సమ
14 యాశ్రియ సకళభువ
15 నవిఖ్యాతకీర్తి శ్రీమ
16 దమ్మ కొణ్డగె శ్రావణ-

2 ఈ శాసనము అనుబంధమున 1 నవంబరుశాసనముగా బ్రకటింప బడినది.

రాజును జంపి పరకూదేశము నాక్రమించెను. ఈ ప్రోలరాజు మహావీరుడుగాననే పాకాల శాసనము నందుఁ గాకతీయవంశమునకుఁ గూటస్థుఁడుగాను, చేఁబ్రోలు, ఖాజిపేటనాకా, అనుమకొండ వెలిపోలము శాసనములలో నీతడు ప్రఖ్యాతుఁడుగను జెప్పఁబడినాఁడు. ఈతఁడు నిర్మించిన అరికేసరి తటాక ప్రశంస చేఁబ్రోలు శాసనమందె గాక ఖాజిపేటనాకా శాసనమునందు సైతము గలదు. క్రీ. శ. 1025–1076 ఈతని కాలము కానోపును. చక్రకూటవిషయము నీతఁడు జయించి నాఁడు. భావిపరిశోధనమున నీతని వీరచరిత్రము గోచరింప వచ్చును. ఈతనికాలమునఁ గల త్రైలోక్యమల్ల భూవిభుని చరిత్రమింకను శోధింపవలసి యున్నది. ఈ రెండవ బేత రాజే హనుమకొండ రుద్రదేవుని శాసనమున త్రిభువన మల్లదేవుఁడని కేవల బిరుదనామము తోడనే వ్యవహరింపఁబడినాఁడు. ఈయన కట్టించినది బేతేశ్వరాలయము. ఇపు డది నశించినది. ఈయన గట్టించిన శివపురప్రశంస కిద నుదాహరింపఁ బోవు వేఱొకశాసనము నందుఁ గూడఁ గలదు. ఇపు డీగ్రామము రూపుమాసెనో, పేరు మాసెనో యెఱుంగుట దుష్కరము. బేతభూపతికి 'పరశు' అను బిరుదము గలదు. ఇంతియే గాక విక్రమచక్రి యను బిరుదుసైతము గలదు. ఈబిరుదము హనుమకొండ వెలిపోలము నందలి పుట్టుజాతి పయిగల యొకశాసనమునందు జెప్పఁబడినది.

పై శాసనశ్లోకమునందలి విక్రమచక్రిపదము పాశ్చాత్యచాళుక్య చక్రవర్తి త్రిభువనమల్లుని దెల్పునదియని కవిగారు వ్రాసిరి. అది సరి గాదు. బేతభూపతినిగూర్చినది గాకున్నచో అన్వయము కుదురదు. పూర్వోదాహృతమగు మాశాసనశ్లోకములోని విక్రమచక్రిపదము బేత భూపతికి బిరుదుగాన నిదియు బిరుదమనియే నిశ్చయింపవచ్చును. బేతభూపతికాలము క్రీ. శ. 1025 మొదలు 1076 వఱకుఁ కావచ్చును లేదా 1090 వఱకు నైనను గావచ్చును.

ప్రకృతశాసనమునఁ గొంత కన్నడభాగము గలదని తెలిపియుఁటిమి. అందు బడుమటి వైపున శాసనకాలము ౧౦౧౨ ప్రమోద సంవత్సరము కార్తిక బహుళ ౧౫ ఆది వారము సూర్యగ్రహణకాలమని కలదు. అచటనే కాలాముఖతపోధనాచార్యుఁడును, శ్రీశైల మల్లికార్జున శిలామఠాచార్యుఁడును నగు రామేశ్వర భట్టారకుని ప్రశంసయుఁ గలదు. బేతభూపతి మల్లికార్జునునకు రామేశ్వర భట్టారకునకునుఁ బాద ప్రక్షాళనము గావించి యొనరించిన ధర్మము చెప్పఁబడినది. 4 ఇంతియ గాక దుగ్గనృపతియే త్రిభువనమల్లుఁడనియుఁ బేర్కొనఁ బడినది. ఈశాసనమునందు బేత భూపతి ప్రశంసఁ గలదు.

---

4 10 స్వస్తిశ్రీ సమస్త భువనాశ్రయ
11 శ్రీ పృథ్వీవల్లభ మహారాజా
12 ధి రాజ పరమేశ్వర పరమ
13 భట్టారక సత్యాశ్రయకుల
14 తిలక చాళుక్యాభరణ శ్రీమ
15 త్త్రిభువనమల్లదేవర విజ
16 యరాజ్యాభ్యుదయ మాచం
17 ద్రార్క్క తారం సలుత్తమిరే తత్పాద
18 పద్మోపజీవి సమధిగత పంచ
19 మహాశబ్ద మహామణ్డలేశ్వర
20 నమ్మన్ కొండవురవరేశ్వరం పరమ
21 మహేశ్వరం పతిహితచరి
22 తం వినయవిభూషణం శ్రీ
23 మన్మహామణ్డలేశ్వరం కాకతీ
24 యబేతరసన నన్మకొండపుర

'పరమమాహేశ్వరం' అను నితని బిరుదము ప్రత్యేకించి పరిశీలింపఁదగినది. బసవేశ్వరుని వీరశైవమతము ఉద్భవింపకముందునుండియు కాకతీయులు శైవమతమువారనుమాట సత్యము. బేతభూవల్లభుని గురువగు రామేశ్వరపండితుఁడు, మల్లికార్జునుఁడును శైవమతాచార్యులుగానఁ గాకతివంశజులు శైవులనియే తోఁచుచున్నది. బేతభూవిభునిశాసనములిప్పటికి మూఁడుగోచరించినవి. ఇవి యన్నియు శివాలయముల కొనరింపబడిన దానమును దెలుపునవేగాన బేతభూవల్లభునినాటనుండి కాకతీయులు శైవులనియు, నంతకుమున్ను శైవులని విశ్వసింపఁదగిన యాధారముల నార్జింపవచ్చుననియు మాతలంపు. కాకతీయ వంశమునఁ గూటస్థుఁడు దుర్జయుఁడు. అతని యన్వయమునఁ దొలుత మొదటి బేతరాజునతనికి మొదటిప్రోలరాజును జనించిరి. మొదటి ప్రోలరాజునకు రెండవబేతరాజును, ఆతనికి రెండవప్రోలరాజుననుక్రమము ఖాజీపేటరోడ్డు ప్రక్కను, వడ్డెపల్లిచెఱువుకొమ్మునఁగల శిథిల శాసనమునందును గలదు.[5] కేసరితటాకనిర్మాతయగు మొదటిప్రోలరాజే ఈశాసనధర్మకర్తతండ్రి. కేసరితటాకనిర్మాణమునే ఈ శాసనముచెప్పుచున్నది గానఁ క్రిందఁజెప్పఁబడు ప్రోలరాజు మొదటి ప్రోలరాజనుట నిస్సంశయము. తరువాత త్రిభువనమల్లదేవుని పాదపద్మోపజీవులగు(రెండవ) బేతరాజు,(రెండవ) ప్రోలరాజుగావించిన వరుణప్రతిష్ఠ చెప్పఁబడినది. ఈరెండుశాసనము లీయంశమును నిర్ణయింప నాధారపడుచున్ననుఁ దొలుతఁజెప్పిన దరగాశాసనము విపులముగను చరిత్రాత్మముగ నుంటచే దానికి రెండవశాసనము బలము కలుగఁజేయునదిగా నున్నది. కాకతీయవంశవృక్ష మీనూతనాధారములతో రుద్రదేవుని వరకు నీక్రిందివిధముగా నిర్ణయింపవచ్చును.

దుర్జయవంశము
|
బేతరాజు I క్రీ.శ 975–1025
|
ప్రోలరాజు I క్రీ.శ 1025–1076
|
బేతరాజు II క్రీ.శ. 1076–1126
|
ప్రోలరాజు II క్రీ.శ 1126–1140
|
రుద్రదేవుఁడు. క్రీ శ1140–1196

రుద్రదేవుని యావలివంశక్రమమును కాలములును రూఢములగుటచే నుదాహరించుట మానితిని.

కాకతీయులలో రెండవప్రోలరాజు పద్మాక్షిగుడిముందటి శాసనమున జైనస్తుతి గావించుటచే జైనుఁడని వీరభద్రరావుగారు తలంచిరిగాని యాస్తుతి ప్రోలునిదిగాదు. అతని మంత్రిభార్యయగు మైళమాంబ గావించినది. మైళమయు, అమెపుట్టినింటివారును, భర్తయు జైనులని యాశాసనమున స్పష్టముగఁ గలదు. దీనితో బ్రోలరాజునకు సంబంధములేదు. అందుచే నీశాసనము రెండవప్రోలుని మతని రూపణమున కుపకరింపదని మున్నే చెప్పియుంటిని. ఇపుడు రెండవ ప్రోలుఁడేకాక ఆతని పూర్వులుసైతము ఆర్షమతమువారను బలవత్తరములగు ప్రమాణలు లభించినవి.

రెండవ బేతరాజునకు రెండవప్రోలరాజునకు గురువగు రామేశ్వరదీక్షితులచరిత్రము కొంత యీసందర్భమునఁ దెలిసికొనఁ గొన్ని యవకాశములు లభించినవి. రుద్రదేవుని యనుమకొండశాసనములో రామేశ్వరదీక్షిత

5. అనుబంధము 5వ నంబరు శాసనము.

ప్రశంసగలదు. స్థూలదృష్టి నీభాగమునుగాంచి పల్వురుశాసనగ్రంథకర్తలు రామేశ్వరుడనిభ్రమ పడిరి. రుద్రదేవునకుఁ జాలకాలమునకు ముందే రామేశ్వరదీక్షితుఁ డుండెను. శాసనగ్రంథకర్త రామేశ్వరదీక్షితునికుమారుడు నద్వయామృతయతి శిష్యుఁడునగు అచింతేంద్రనరుఁడు. శాసనగ్రంథకర్త యగు అచింతేంద్రవరుడు రుద్రదేవుని సమకాలికుఁడుగాన నతని తండ్రి రామేశ్వరదీక్షితుఁడు ప్రోలరాజుకాలమువాఁడనుట స్పష్టము. రెండవబేతరాజు ఉత్తరకాలమునను, రెండవప్రోలుని మధ్యకాలమున నీరామేశ్వరదీక్షితుఁ డుండుటవలననే దరగాశాసనమున రామేశ్వరదీక్షితునకుఁ బాదప్రక్షాళనము గావించి రెండవబేతరాజు దానము లొనరించుట పొసఁగినది. రామేశ్వరదీక్షితుఁడు వైదికమతమువాఁడుగావున నాతని పాదములను గడిగి దానమొనర్చిన రెండవబేతరాజును వైదికమతమువాఁడే. కాన రెండవ బేతరాజుకాలమునుండి కాకతీయులు తప్పకవైదికమతమువారనియే విశ్వసింపవలయును. రామేశ్వరదీక్షితుని చరిత్రము ఒకశాసనఖండమున వ్రాయబడియున్నది.[6] ఈశాసనము కాకతిరెండవప్రోలునినాఁటిది. మాదిరెడ్డికుంటయను ననుమకొండ చెఱువునందుఁగల బాళ్ళు పరిశోధించుతఱి నీశాసనశిల మాకు గోచరించినది. స్థానికప్రముఖులసహాయమున బాయి నిలువఁబెట్టి ప్రతిగైకొంటిమి. ఈశిలయొక్క పయిభాగము విరుగఁగొట్టఁబడుటచే ముందుఁగల చరిత్రాంశములు తెలియకున్నను రామేశ్వరదీక్షితుని చరిత్రము, వైదుష్యము, కాలము గ్రహింప నీశాసన మెంతయో సహకారికాఁగలదు. రామేశ్వరదీక్షితుఁడు మహావిద్వాంసుఁడు. ఈయన యొకయాలయము గట్టింపఁగ దానికి త్రిభువనమల్లుఁడు (బేతరాజు) తండ్రిగాఁగలవాఁడు (ప్రోలరాజు) దానముగా శివపురము సమర్పించినాఁడు. రామేశ్వర దీక్షితుఁడు మాహేశ్వరగ్రామణి, అనఁగా శైవుఁడు. శాస్త్రసిద్ధాంతమున కాయన ప్రమాణభూతుఁడు. ఈయనశిష్యుఁడే కాకతీయప్రోలరాజు. ఈప్రోలరాజు చలమర్తిగండబిరుదాంకుఁడు. ఈయన స్తంభమును స్థాపించినాఁడు.

ఇందుఁ బేర్కొనఁబడిన ప్రోలరాజు రెండవ ప్రోలరాజే. రామేశ్వరదీక్షితుని కుమారుఁడు రుద్రదేవునికాలమునందుండుటవలనను, రెండవ బేతరాజుకాలమునఁగూడ రామేశ్వరదీక్షితుఁ డుండి యతనివలనఁ బాదపూజలు గాంచుటవలనను, ఈశాసనము రుద్రదేవుని శాసనలిపిని సర్వవిధములఁ బోలినందునను, వక్ష్యమాణ ప్రోలరాజు రెండవప్రోలరాజనుట నిర్ధారితము. ఇంతకుఁ దేలిన నిర్ధారణాంశము బేతరాజు కాకతి (రెండవ) ప్రోలరాజు శైవులు. వీరలు శివాలయములకు శైవమతాచార్యులకు విశేషించి తోడ్పడి ఆలయప్రతిష్ఠలు గావించిరి. ప్రోలరాజు బ్రాహ్మణశిష్యుఁడుగానను, ఆబ్రాహ్మణుఁడగు రామేశ్వర దీక్షితుఁడు మహేశ్వరగ్రామణికావునను, బేతరాజునకుఁ రామేశ్వరదీక్షితునకు సంబంధముగలదు గానను, కాకతీయులు రెండవబేతరాజు కాలమునుండి

6. శ్లో॥ భారద్వాజకులశ్రియః పరివృఢశ్రౌతక్రియా కర్మఠః
శ్రీ రామేశ్వర దీక్షితో జనయితా యస్య క్షితా వగ్రణీః
సోఽచింతేంద్రవరో ద్వయామృతయతే శ్శిష్యో యతిశ్రద్ధయా
శ్రీమద్రుద్రనరేశ్వరస్య సుమతే ర్వంశావళిం వర్ణయే॥

శైవులని నిష్కర్షగాఁ దెలుపవచ్చునని మాతలంపు.

కాకతీయవంశము విచ్ఛిన్నమగుటచే సేనానులు తమబిడ్డల నొసంగి రాజవంశము నిలిపినటులఁ గూడూరుమాటేరుశాసనములలోఁగొన్ని సూచనలు కలవు.[7] వీనిలోని రెండవబేతరాజును గామమ్మసాని కని కాకతీయ సామ్రాజ్యమునకు రాజునుజేసెననియుఁ, బేతని రాజుచేతఁ బెట్టి, పల్లవులవిజృంభణము నడంచెననియుఁ, దన కాన్పును కాకతి రాజునుజేసి కాకతీయవంశము నిల్పుట కోటిసేయుననియుఁ దోఁచుభావము విమర్శింపవలసియున్నది.

ఎటులైన నేమి ఉపలబ్ధశాసనాధారములవలనఁ గాకతీయచరిత్రమునఁ గొందఱుప్రసిద్ధుల వృత్తములు దెలసినవి. ఈవంశమున రెండవ బేతరాజునకుఁ బూర్వముఁ గూడ రాజ్యప్రతిని ధిత్వము గలదనియు, వీరల చరిత్రముతోఁ జాళుక్యరాజుల కెంతకాలమునుండియో సంబంధము గలదనుటయు వాస్తవము. కాకతీయులెన్నఁడు జైనులో ఎన్నఁడుశైవులో గ్రహించుటకింకను శాసనపరిశోధన మవసరము. కాకతిపురము అనునామము తొలుతఅనుమకొండకును, బిమ్మట రాజధాని మారినపిదప వరంగల్లునకును నున్నటుల శాసనములందు గలదు. ఈనామాంతరము కాకతీయు లేర్పఱచినదే. తొమ్మిదవశతాబ్దమునకుముం దీభాగమును రాష్ట్రకూటులు, పశ్చిమచాళుక్యులు బాలించుచున్నందునను, రెండవబేతరాజుకాలమునుండి కాకతీయులు శైవులని తెలియుటవలనను, కాకతిపురమను వ్యవహారము తొమ్మిదిపదిశతాబ్దములలోనిదేయనియు, గణపతిదేవాదులు పరంపరగ నా నామమునే వంవహరించిరనియుఁ, బ్రతాపరుద్రదేవుని కాలమున నాపేరు ఆకారణముననే ప్రతాపరుద్రయశోభూషణమునగూడఁ జేర్పఁబడెననియుఁ దెలియుచున్నది.

కాకతీయుల కులనిరూపణమున కిదివఱకు లభించిన సందిగ్ధాంశములేగాని క్రొత్తవి లభింపలేదు. రెండవప్రోలరాజునకు చలమ రిగండబిరుదము గలదు. ఇది [రెండవ]ప్రతాపరుద్రునివఱకుఁ బరంపరగా వచ్చినటుల గ్రంథాంతరములందును, శాసనాంతరములందును నాధారములు గలవు.

మొదటిప్రోలరాజు త్రైలోక్యమల్లదేవునకు లోఁబడినవాఁ డనుసూచన ఉదాహృత శ్లోకములయందుఁ గలదు. త్రైలోక్యమల్లదేవునిశాసనములు ఆలంపూరులో మూడును, గంగాపురములో నొకటియుఁ, డాకూరులో నొకటియుఁ గనిపెట్టినారము. ఇం దొకటియగు డాకూరులోని త్రైలోక్యమల్లునిశాసనము శా. శ. ౧౦౧౩ త్రైలోక్యమల్లరాజ్యసంవత్సరములు ఆంగీరస అనుకాలనియతి గలది. ఈత్రైలోక్యమల్లదేవుఁడు చాళుక్యపెమ్మాఁడియని యుపనామముగలవాఁడు. శాసనకాలము ఆంగ్లమానముచే ౧౦౮౧ అగును. ఇది దాదాపుగ మొదటిప్రోలరాజు కాలమునకుఁ గలియునుగాన త్రైలోక్యమల్లునకు మొదటి ప్రోలునకు సంబంధము సరిపడుచున్నది.

రెండవ బేతరాజుచే నర్చితుఁడగు రామేశ్వరుని చరిత్రము కొంత గ్రహించితిమి. అట్లే యాచార్యుఁడగు మల్లికార్జున కాలాముఖాచార్యుని వివరములు గూడఁ గొంత గ్రహించవలసి యున్నది. తపోరాశి శిష్యుఁడును, కారా

7. ఈ శాసన ప్రతిబింబము మండలివారివద్ద గలదు. దీని మూలము J. A. H. R. S. VIII- Pti I P. 32. లో ప్రకటింప బడినది. సంపాదకుడు.

ముఖ్యతాధికారియునగు మల్లికార్జునుఁ డను ప్రసిద్ధుఁ డొకఁడు గలఁడు. ఈయన క్రీ.శ. 1050 ప్రాంతమున వనవాసియందు మఱము నెలకొల్పెను పశ్చిమచాళుక్యులు, చోడులు మల్లికార్జునుని సాదరగౌరవములతోఁ బూజించిరి. ఈయనగురుడగు తపోరాశివిగ్రహము లలంపురియందుఁ గలవు. అచటిశాసనములలో విశేషించి సూర్యరాశి, తపోరాశి, తేజోరాశి మున్నగు కాలాముఖాచార్యులప్రశంసయు, వారిని జాళుక్యులు పూజించినవిధము పేర్కొనఁబడినది. రెండవబేతభూవల్లభుని కాలమున మిగులప్రసిద్ధుఁడుగనున్న కాలాముఖాచార్యుడగు మల్లికార్జునుఁ డీయనయనియే విశ్వసింపవచ్చును. దాదాపుగ నీబేతనృపుని కాలముతో నీతనికాలము గూడ సరిపోవుచున్నది. ఈమల్లికార్జునునిగూర్చి యుదాహరించిన యంశములు కుమారసంభవపీఠికనుండి రచించితిమి.

అజ్ఞాతముగానున్న కాకతీయచరిత్రమున గొన్నియంశము లిప్పటికి నిర్ణీతములైనవి. ఇఁక దెలిసికొనవలసిన యంశము లివి- కాకతీయులు రాజప్రతినిధులుగ నెన్నటినుండి ఓరుగల్లు ప్రాంతములందుఁ బేరొందిరి? వీరలకు రాష్ట్రకూటులతోను చాళుక్యులతోనుగల సంబంధము లెట్టివి? దుర్జయునకును మొదటిబేత రాజునకును మధ్యగల పురుషాంతరము లెవ్వి? వారి ప్రసిద్ధియెట్టిది? కాకతీయు లేనాఁడుజైనులు, ఏనాడు శైవులు? కాకతిపురము అనుపురిని నివసించుటచేతనే వీరుకాకతీయులుగా బరిగణింపఁ బడిరా? కాకతిదేవతను గూర్చి జైనగ్రంథము లేమని చెప్పుచున్నవి? మున్నగునవి.

భువనగిరిదుర్గము.

[By courtesy of H. E. H. The Nizam's Archaeological Department.]

260B



రామప్ప దేవుని మందిరము,—నిజామ్ రాష్ట్రము.

[By courtesy of H. E. H. The Nizam's Archaeological Department.]

గద్వాల సంస్థానము.*

శ్రీయుత మారేమండ రామారావుగారు ఎం. ఏ., బి. ఇడి.,

I. చరిత్రము.

అనేకవందలసంవత్సరములనుండియు విద్యోత్పోషణమునకును, వితరణా విభవమునకును, విశేషవిఖ్యాతి గాంచిన గద్వాలసంస్థాన మాధునికాంధ్రసంస్థానములలో నగ్రగణ్యము. ఇయ్యది ప్రకృతమున నైజాంరాజ్యాంతర్గతమై కృష్ణాతుంగభద్రానదుల మధ్యగలభాగమునందున్నది. దీని కుత్తరమున మహబూబు నగర మండలమును, తూర్పున కృష్ణయు, దక్షిణమున దుంగభద్రయు, బశ్చిమమున రాయచూరు మండలమును యెల్లలు. ఈ సంస్థానపు వైశాల్యము 1200 చదరపు మైళ్ళు. జనసంఖ్య 110000. ఈ యాంధ్రరాజ్యము సుప్రసిద్ధపాకనాటికులజులగు రెడ్డిరాజులపరిపాలనమునం దున్నది.

ఉత్పత్తి.

గద్వాల సంస్థానము కాకతీయ సామ్రాజ్యమునుండి యుద్భవించినది. క్రీ. శ. 1290 ప్రాంతమున గాకతిరుద్రాంబయు బ్రతాపరుద్రుడును గలసి రాజ్యముచేయుచుండిన కాలమున రాయచూరు దోఆబ్‌ను, గర్నూలు మండలము నరణ్యావృతములై యుండగా, నీప్రాంతమునందలి కాకతీయసామంతులును, సేనాలు నీభూభాగమును గృషియోగ్యమొనర్చిరి. ఇట్టివారిలో గోనవంశీయులు ముఖ్యులు. వీరిలో ముగ్గురు సోదరు లీకాలమున గాకతీయసామ్రాజ్యపు దక్షిణదిశ నధికారము చేయుచుండిరి. గన్నయరెడ్డి వర్ధమానపురమునను, విఠలనాథుడు రాయచూరు బళ్ళారి మండలములను, కాటరెడ్డియు నాతని పుత్రుడగు ఇమ్మడి కాటారెడ్డియు రాయచూరు దోఆబ్‌పైనను అధికారులై యుండిరి. వీరందరును కాకతీయసామంతులే. అడవులను నిర్మూలించి భూమిని వాసయోగ్యముగ జేయుటలో ఇమ్మడికాటారెడ్డికి ఐజగ్రామనివాసియగు బుడ్డారెడ్డి లేక పోలవిరెడ్డియను నతడు మిక్కిలి సహాయమొనర్చెను. అందుచే నీ కాకతీయసేనాని ప్రతాపరుద్రునిచే క్రీ. శ. 1290 లో పై బుడ్డారెడ్డికి మానవ, బెళుదోణి గాయచూరు. మోసలకల్లు, అలంపురము, ఆదోని, ఐజ అను ఏడుసీమలపై నాడగౌడరికము నిప్పించెను. ఇంతటినుండియు బుడ్డారెడ్డియు నాతని సంతతివారును 'ఐజనాడ గౌడు'లని ప్రసిద్ధి నందిరి.

నాడ గౌడరికము.

క్రీ. శ. 1323 లో కాకతీయ సామ్రాజ్యమస్తమించినపిమ్మట నాంధ్రదేశమునం దెన్నియో చికాకులు గల్గినవి. అపుడెచ్చటి సామంతు లచటనే స్వతంత్రులైరి. ఆసందర్భమున నీ యైజనాడగౌడులు స్వస్థలమునువీడి, కర్నూలు మండలములోని గోసునూరనంతాపురమునకు బోయి, యచటి పాలకులగు విజెము వంశీయులకు సామంతులైరి. ఈ కర్నూలు మండలమున నంద్యాల మున్నగు దక్షిణభాగ

*శ్రీ గద్వాల మహారాణీ సాహేబావారి యాజ్ఞానుసారము నేను రచించిన "గద్వాలసంస్థాన చరిత్రము" న కీవ్యాసము సారాంశము. ||మా । రా||

ము విజయనగరరాజుల స్వాధీనమయ్యెను. క్రీ. శ. 1344 లో హరిహరుడును, ప్రతాప రుద్రుని పుత్రుడగు కృష్ణనాయకుడును ఏక శిలానగరమును ముట్టడించి స్వాధీనము చేసి కొనినప్పుడు పై ఐజనాడగౌడులుగూడ వారికి దోడ్పడిరి. దానికి బ్రతిఫలముగ గర్నూలు మండలమున బశ్చిమమున గొన్నిగ్రామముల పై వీరికి నాడగౌడరికము హరిహరునిచే నొసంగబడెను. కాని క్రీ. శ. 1347 లో బహమనీసుల్తానులు బయల్వెడలి రాయచూరు దోఆబ్‌ను, కర్నూలు మండలమునందలి పడమటి భాగమును జయించుటచే ఐజనాడగౌడులు బహమినీ సుల్తానులకు సామంతులైరి. ఇప్పటినుండి సుమారు క్రీ. శ. 1500 వరకును సుల్తానులకును, విజయనగరరాజులకును దోఆబ్‌నుగూర్చి యనేక యుద్ధములు జరిగియుండినను, మహమ్మదీయులే ఆ భూమిపై దమయధికారమును సాగించుచుండిరి. క్రీ. శ. 1489 లో బిజాపురరాజ్యము బయల్వెడలి యాప్రాంతమును స్వాధీనముచేసికొనుటచే నీ ఐజనాడగౌడు లారాజ్యమునకు సామంతులైరి. క్రీ.శ. 1500 నాటికి వీరు తిరిగి ఐజప్రాంతమునకేగి పూర్వపు నాడగౌడరికమును సంపాదించిరి. హరిహరుడు వీరికి గర్నూలులో నొసంగిన యధికారములు బిజాపురసుల్తాను లాగికొనెను. క్రీ. శ. 17 వ శతాబ్ది ప్రారంభమున పెద్దారెడ్డి యను నతడు ఐజకందనూలు (కర్నూలు) సీమలకు నాడగౌడుగానుండెను. ఇతడు పూడూరు సీమకు నాడగౌడుగ నుండిన వీరారెడ్డియను నతని కూతురు బక్కాంబను బెండ్లాడి యా సీమకుగూడ నధిపతి యయ్యెను.

పెదసోమభూపాలుడు.

క్రీ. శ. 1663-1713 నడుమ పెదసోమభూపాలుడు తనతండ్రి పెద్దారెడ్డియనంతరము నాడగౌడరికమునకు వచ్చెను. బుడ్డారెడ్డి యైజనాడగౌడరికమును సంపాదింప నీశూరుడు ప్రకృతగద్వాలసంస్థానమును నిర్మించెను. ఆకాలపుపాళెగాండ్లలో నీతడు ప్రబలుడు నగ్రగణ్యుడునై యుండెను. మాతృకమగు పూడూరుగ్రామమునందలి కోటను బాగుచేయించుచుండగా నితని కొకనిక్షేపము దొరకెను. గురప్పయ్యయను తనగురువుసాయముతో నీ రాజు దానిని బొందెను. పేరుకుమాత్రి మీతడు బిజాపురసుల్తానుకు సామంతుడుగనుండినను, స్వాతంత్ర్యమును బ్రకటింప నుద్యుక్తుడై యుండెను. అదేసమయమున మొగలుచక్రవర్తియగు ఔరంగజేబు దక్కనులోని అహమద్‌నగర్, బిజాపూర్, గోల్కొండమున్నగు మహమ్మదీయరాజ్యములను సంపూర్ణముగ జయించుచుండెను. అందు ప్రబలమగు బిజాపురమును ధ్వంసమొనర్చుటలో నారాజ్యసామంతుడగు సోమభూపాలునితో ఔరంగజేబు మైత్రి యొనర్చుకొనెను. దీనిని యూతగగొని సోమభూపాలుడు 1686-87 ప్రాంతముల దన స్వాతంత్ర్యమును బ్రకటించెను. ఇంతటితోదృప్తినందక నీరాజు బన్గానిపల్లె, సిరివెళ్ళ, నంద్యాల, సిరిగుప్ప, సిద్ధావుటం, భండాత్మకూరు, అహోబిలము, ఆదవేని మున్నగు సీమలను జయించి తనయధికారమును విస్తరించెను. దీనితోనతనికి శత్రువులెక్కుడైరి. అంతనితడుశిథిలమగు పూడూరుదుర్గము క్షేమకరముగాదనియెంచి క్రీ. శ. 1698-1705 నడుమ పూడూరున కైదుమైళ్ళ దూరమున విశాలమగుబయలులో బలిష్ఠమగు నొకకోటనుగట్టించి, దానికి 'గద్వాల' యనిపేరిడి తనని వాసము నచటికి మార్చుకొనెను. అప్పటికి బిజాపురరాజ్యము ఔరంగజేబుచక్రవర్తిచే పూర్తిగజయింపబడెను. ఆసందర్భమున దనకొనర్చిన

యుపకారమునకుబదులుగ నాచక్రవర్తి సోమ భూపాలునికి "రాజ" బిరుదమును లాంఛనము లనేగాక,నదివరలోనాతడు జయించిన బంగాని పల్లె, కర్నూలుసీమలలో ఆరుమహాలులపై సర్వాధికారము నొసంగెను. ఇందు మూలమున రాయచూరుదోఅబ్‌లోని తూర్పుననుండునగ ముభాగమేగాక కర్నూలుమండలమునందలి విశేషభాగముగూడ సోమభూపాలునికి స్వాధీ నమయ్యెను. ఇట్లుండగా ఔరంగజేబుచక్రవర్తి మరణించెను. ఆతనివెనుక మొగలుసింహాసన మునకువచ్చిన బహదూర్షా బలహీనుడుగనుం డుటచే దక్కనులో మొగలుల సుబేదారుగ నుండిన నైజాముల్‌ముల్క్ విజృంభింపసా గెను. క్రీ. శ. 1709-1712 నడుమ రెండున్న రసంవత్సరములకాలము కర్నూలుదుర్గము సో మభూపాలుని యాధీనమునందుండెను. నైజా ముల్‌ముల్క్ దీనిని స్వాధీనముచేసికొనుటకై దిలీల్‌ఖానను సర్దారునుబంపెను. ఈఖానుకును సోమభూపాలునికిని నిడుదూరుమిట్టలవద్ద యు ద్ధముజరిగి క్రీ. శ. 1712. నందనసంవత్సర జ్యేష్ఠ శు॥ నాడు గద్వాలసోమభూపాలుడం దుమరణించెను. ఈవీరశిఖామణికి మతవిషయ ములలోగూడ మిక్కిలిశ్రద్ధయుండెడిది. మా తామహస్థలమగు పూడూరులో నుండగనే యిత డచటి కేశవస్వామియాలయము నుద్ధరిం చెను. గద్వాలదుర్గమును నిర్మించినపిమ్మట నీరాజధానిని మరియొకకేశవాలయమునుగట్టిం చెను. మున్నీతడు నిక్షేపమును బొందుటకై కేశవుడనుబ్రహ్మచారిని బలియొసగిన దోష ముపోవుటకై యాదేవళము నిర్మింపబడెనని కొన్ని యాధారములలో గలదు. ఏమైనను సోమభూపాలుడు తన సర్వస్వమును గేశవునిక ర్పించి యాతని పక్షమున దాను రాజ్యకార్య ములను నిర్వహించుచుండెను. వీరధర్మమునను రాజకీయములయందును, భగవద్విషయముల లోనేగాక యీరాజుకు కవిత్వమునగూడ ప్ర శంసనీయమగు ప్రావీణ్యతయుండెడిది. జయ దేవకవి సంస్కృతమున రచించిన గీతగోవింద కావ్యము నీతడు తెనుగుచేసి, ప్రతిశ్లోకము నకు నొకపద్యమును, ప్రతియష్టపదికి నొక చూర్ణికను రచించెను. ఈవిధమున పెదసోమ భూపాలుడు గద్వాలరాజ్యమును స్థాపించి దా నిని తాత్కాలిక సంస్థానములలో నగ్రగణ్య ముగ నొనర్చెను.

లింగమ్మరాణి

ఈతని యనంతర మీతని పుత్రుడు తిరు మలరాయడు బాలుడగుటచే వెంకన్న, రమ ణయ్య యను నుద్యోగులు నటుపై నీతని భార్యలగు అమ్మక్క, లింగమ్మ యను రాణులును రాజ్యకార్యములను నిర్వహించిరి. క్రీ. శ. 1725-1738 నడుమ గద్వాలనేలిన లింగమ్మరాణి కాలము మిగుల ముఖ్యమైనది. ఇప్పటి కీమెయధికారము కర్నూలుమండలము లోని మరికొంతభాగమునకును, బళ్ళారిలోని ఆదోనిసీమకును వ్యాపించినది. మొగలులిం కను గద్వాలవారి సాహాయ్యమును గోరుచు నేయుండిరి. ఈకాలమున గొప్పకాటకమొ కటి సంభవింపగా జనులెందరో లింగమ్మ రాణి దానధర్మములను, దయామయత్వమును గూర్చి విని, గద్వాలకు వలసవచ్చిరి. ఈదీను లనెల్లర నీరాణి యాదరించి యనేక సౌకర్య ముల నొనగూర్చెను. క్రీ. శ. 1723 లో దక్కను సుబేదారగు నైజాముల్ ముల్క్ స్వతంత్రుడై హైదరాబాదులో "నైజాం" అను బిరుదముతో నొక ప్రత్యేకరాజ్యమును స్థాపించెను. తమ కింతవరకును మిత్రులుగనుం డిన మొగలులు క్షీణించుటను, పరివరములనేలు కర్నూలు నవనూరు నబాబులు మున్నగు

వారు శత్రువులుగనుండుటను గుర్తించి, యీ రాజ్ఞి నైజాముతో మైత్రిని బాటించి, యాతని యధికారము నంగీకరించెను. ఈమెకు బిమ్మట నీమె పుత్రుడు తిరుమలరాయుడు మూడేండ్లు పరిపాలించెను.

రామరాయడు

పిమ్మట తిరుమలరాయని తమ్ముడగు రామరాయడు రాజ్యమునకు వచ్చెను. గద్వాల రాజ్య మీతనికాలమున (క్రీ.శ. 1746-1761) మిక్కిలి యభివృద్ధినందెను. 1745 ప్రాంతమున కర్ణాటకసింహాసనమును గూర్చి యొదవిన అర్కాటుముట్టడిలో బాల్గొనిన నైజాముకు రామరాయడు సాయముచేసెను. ఆయుద్ధము నుండి మరలునపుడు నైజాము సేనానియు, గర్నూలునబాబు నొకరినొకరు హత్య చేసి కొనిరి. ఈయదనున క్రీ.శ.1746 లో గద్వాల రామరాయడు కర్నూలుదుర్గమును స్వాధీనముచేసికొని, యథాపూర్వముగ నాడగౌడు, సర్నాడగౌడు, సర్ సర్నాడుగౌడు రుసుములను వసూలుచేయుచుండెను. క్రీ శ.1752 లో నైజాముచే పంపబడిన మహమ్మదలంకు రామరాయడు కర్నూలును స్వాధీనముచేసెను. కాని యీక్రొత్తనబాబు తనదివాను ప్రేరణచే గద్వాలవారి నాడగౌడగి మున్నగు హక్కులను త్వరలోనే లాగికొనెను. దీనికి ప్రతీకారమొనర్ప నవకాశమునకై రామరాయడు వేచియుండెను. ఇంతలో మరణించిన కర్నూలునబాబు తమ్ముడు రణమస్తుఖానను నతడు గర్నూలుపై దండెత్తి, పూర్వపుటధికారముల నొసంగెదననియు, గర్నూలుదుర్గమును స్వాధీనము చేయుమనియు రామరాయనికి రాయబార మంపెను. ఈ రాజునట్లొనర్చెను. ఇందుమూలమున గద్వాలరాజులకు కర్నూలుజిల్లాలోని బేతంచెర్ల, రంగాపురము, కొలుమలపల్లి, ముద్దవరం, బుగ్గానిపల్లె, ఎర్రగుంట్ల, ఎంబావి మున్నగు 19 నూతన గ్రామములపై నాడగౌడరికము లభించెను. ఈ రామరాయడు క్రీ. శ. 1761 లో మరణించెను.

చిన్నసోమ భూపాలుడు

పిమ్మట రామరాయని యన్న తిరుమలరాయని పుత్రుడగు చినసోమ భూపాలుడు రాజ్యమునకు వచ్చెను. ఈ రాజు మహావీరుడును, రాజ్యతంత్రజ్ఞుడునై యుండెను. తన పినతండ్రి రాజ్యకాలముననే యీతడు తన సైన్యములతో నైజామునకు దోడ్పడి యాతనివలన 2000 రూప్యములను బహుమానముగ బొందెను. రాజ్యాభిషిక్తుడయిన పిమ్మట నితనికి నైజాంసలబత్ జంగు కర్నూలులో 2 మహాలుల పైనను, ఆదోనిలో రెండిటిపైనను, నంద్యాలసీమలో 15 పైనను, మొత్తము 19 మహాలులపై నాడగౌడు, సర్నాడగౌడు, సర్సర్నాడగౌడు అధికారముల నొసంగెను పిమ్మట సోమభూపాలుడు తనరాజ్యమును విశేషముగ విస్తరింపజేసెను. అమరచింత సంస్థానములోని కొన్ని గ్రామముల నీతడుయుద్ధ సమయములలో విశేషసాహాయ్యము చేయు పద్ధతిని గుత్తకు దీసికొని తన కతిసమీపమునందున్న రాజోళిసీమ నాక్రమించెను. క్రీ. శ. 1773 లో నైజామునకును షోరాపుర రాజునకును జరిగినయుద్ధములో నైజాము సేనానియగు అమీర్ ఉల్ ఉమ్రాకు మిక్కిలి తోడ్పడెను. ఇందుమూలమున నైజాముకు సోమభూపాలునియెడ గౌరవ విశ్వాసములు పరిబలి యాతడు రాయచూరు, బళ్ళారి, సుబేదార్లు మున్నగువారికి సోమభూపాలుని యాజ్ఞలను వారు చెల్లింప వలెననియు, నతడు వారితో జేయు నొడంబడికలకు దాను బద్ధుడుగ నుందుననియు పర్వానాలను బంపించెను. ఇటు

పైన గద్వాల సంస్థానమునకు గొన్ని యిబ్బందులు గలిగినవి. ఇప్పటికి మహారాష్ట్రులు దక్కనులో ప్రబలిరి. నైజాముగూడ వారితో సంధిచేసికొని తనరాజ్యమున చౌతును వసూలుచేయు నధికారము వారి కొసంగెను. ఇందు మూలమున నైజాంరాజ్యమున ద్వంద్వప్రభుత్వమేర్పడినది. సోమభూపాలుని కీ మహారాష్ట్రులు ప్రక్కలోని బల్లెమువలెనుండిరి. ఇదే సమయమున కర్నూలునవాబు గద్వాలవారి నాడగౌడగి మున్నగు హక్కులను రద్దు చేసి క్రీ.శ. 1773_1775 నడుమ ఎంబాయి, రంగాపురము, సిరివెళ్ళ, ఎఱ్ఱగుంట్ల, బేతంచెర్ల, కోములపల్లె, బుగ్గానిపల్లె మొదలగు గ్రామముల నాక్రమించెను. వ్యాధిగ్రస్తుడుగ నుండుటచే చినసోమభూపాలు డిందులకు ప్రతీకారము జేయలే కుండెను. ఈ రాజు క్రీ. శ. 1794లో మరణించెను.

ఆంధ్రవాఙ్మయాభివృద్ధికి చినసోమభూపాలుని రాజ్యకాలము మిక్కిలి ముఖ్యమైనది. సమకాలికు లీతని నభినవభోజుడని కొనియాడుచుండిరి. ఈరాజు రచించిన రతిరహస్యమను శృంగారగ్రంథము ప్రశంసనీయము. ఈతని యాస్థానమునం దెందరో కవులుండి చక్కని గ్రంథములను రచించిరి. వారిలో నెన్మండు గురు ముఖ్యులు. (1) కాణాదము పెద్దన సోమయాజి యనునత డాత్రేయసగోత్రుడు. వేదశాస్త్రపురాణములను కరతలామలకములజేసికొనిన యీకవి ఆశు, చిత్ర, బంధ, గర్భములను చతుర్విధకవితలను జెప్పనేర్చినవాడు. భోజుని చంపూరామాయణమునకు వ్యాఖ్యానమునురచించెను. సురపుర సంస్థానముననుండి యాంధ్రమత్స్యపురాణమును, గద్వాలసంస్థానముననుండి భద్రాపరిణయమును, ఆధ్యాత్మరామాయణమును, యథాశ్లోకతాత్పర్యరామాయణమునందలి బాలకాండమును, రచించెను. (2) కిరీటి వెంకటాచార్యుడను శ్రీవైష్ణవకవి "సర్వతంత్రస్వతంత్ర కవితార్కికకంఠీరవ, శ్లేషయమకచక్రవర్తి" యను బిరుదములు గలవాడు. అలంకారకౌస్తుభము, జంఝూమారుతము, శృంగారలహరి, భావశతకముమున్నగు సంస్కృతగ్రంథములును, అచలాత్మజాపరిణయమను నాంధ్రద్వ్యర్థికావ్యము నీతని గీర్వాణాంధ్రభాషాపాండిత్యమును దెల్పుచున్నవి. (3) క్రొత్తపల్లి రామాచార్యులను మరియొక శ్రీవైష్ణవకవి యథాశ్లోకతాత్పర్యరామాయణమునందలి యయోధ్యాకాండమును రచించెను. (4) గార్లేయపుర సుబ్బశాస్త్రి యనుకవి "ఉభయకవితానిస్సహాయసాహితీధురణ" బిరుదాంకితుడు. ఇతడు రామాయణారణ్యకాండమును తెనుగుచేసెను. (5) "విద్వత్కవికుంజర" బిరుదాంకితుడగు కామసముద్రం అప్పళాచార్యుడు వివిధబంధముల కవిత్వమును జెప్పి సంస్కృతప్రాకృతములలో కావ్యములను రచించినవాడు. యథాశ్లోకదాత్పర్యరామాయణమునందలి కిష్కింధకాండమును రచించెను. (6) తిరుమల కృష్ణమాచార్యుడనుకవి "అష్టభాషాకవితాదురంధరుడు". రామాయణ సుందరకాండము నాంధ్రీకరించెను. (7) బోరవెల్లి శేషకవి రామాయణ యుద్ధకాండమును రచించెను. (8) సోమనాథశాస్త్రికవి. ఈవిధమున చినసోమభూపాలుని కాలమున నాంధ్రగీర్వాణ వాఙ్మయము లభివృద్ధి నందినవి.

రెండవ రామరాయడు.

పిమ్మట రెండవరామరాయడు గద్వాలరాజ్యమునకు వచ్చెను. ఇతడు క్రీ. శ. 1794-1806

నడుమ రాజ్యమేలెను ఈకాలమున గొన్ని ముఖ్యకార్యములు జరిగినవి. ఇతడు రాజ్యమునకు వచ్చుటకు గొంచెము ముందుగ మనూరుద్దౌలా యను నైజాంసేనాని, గద్వాలసంస్థానములోని గట్టుదుర్గముపై దాడివెడలెను. ఇందులకు గద్వాలవారు కొంతకాలము నుండి పేష్కసును చెల్లింపకుండుటయేకారణము. అప్పుడు రామరాయని దివాను హైదరాబాదుకుపోయి 11 లక్షలరూపాయిలను పాతబాకీగానిచ్చి, యటుపై సంవత్సరమునకు 2 లక్షలనొసంగుట కంగీకరించి, గట్టుదుర్గమును తిరిగి సంపాదించెను. దీనికి ఫలితముగ క్రీ. శ. 1800లో నైజాము రామరాయనికి "రాజా, భూపాల్, బహద్దర్" మున్నగు బిరుదములను, వస్త్రాభరణాదులను బంపించెను. మరి యారుసంవత్సరముల కీరాజు మరణించిన పిమ్మట వారసత్వమునుగూర్చి కొన్నివివాదములును, కల్లోలములును జరిగినవి. తుదకు రామరాయని యంత్యశాసనము ననుసరించి, యతని మేనమామపుత్రుడగు సీతారామరెడ్డి గద్వాలరాజ్యమునకు సీతారాము భూపాలుడనుపేరుతో వచ్చెను.

రాజరామభూపాలుడు.

క్రీ. శ. 1807-1840. నడుమగల సీతారామభూపాలుని రాజ్యకాలము ప్రశాంతముగ జరిగిపోయెను. గద్వాలపేష్కసును గూర్చి యితనికిని నైజాముకును గొంత చర్చ జరిగి తుదకది 115000 రూపాయలుగ నిర్ణయింపబడెను. పిమ్మట నీరాజు దత్తపుత్రుడగు మూడవసోమభూపాలుడు రాజ్యమునకు వచ్చెను. నైజాము నిందులకంగీకరించెను. ఈరాజసమర్థుడును విషయలాలసుడునైయుండెను. సైనికులతోనీతడు వివాదపడుటచే వారు 3—6—1840 దేదీని దర్బారులో బహిరంగముగ నీరాజును కాల్చివేసిరి. అంత నీతని తల్లియగు రాణీవెంకటలక్ష్మమ్మ రాజ్యభారమును వహించి, క్రీ. శ. 1845లో తన మేనల్లుని దత్తుచేసికొని రామభూపాలుడనుపేరుతో గద్వాలసింహాసనమెక్కించెను. ఈరాజుకాలమున కృష్ణా తుంగభద్రానదుల మధ్యనున్న భాగముపై పేష్కసును నైజాం బ్రిటిషువారికొసగుటచే గద్వాలవారికి బ్రిటిషువారితో సంబంధమేర్పడెను. సిపాయీలకలహమిదేసమయమున జరిగినది. రాజు యువకుడైనను, పరిస్థితు లుద్రేకజనకములుగ నుండినను, రాజమాతయగు రాణీ వెంకటలక్ష్మమ్మగారు స్థైర్యము వహించి తనపుత్రుని యీ విద్రోహమునం దేజోక్యమును గల్గించుకొననీయకుండెను. ఈకాలమున సంస్థానీకుల పోలీసు, సివిల్, రెవిన్యూ అధికారములనుగూర్చి కొంత చర్చ జరిగినది గాని తుదకది సంస్థానీకుల కనుకూలముగనే పరిష్కరింపబడినది. రామభూపాలుని కాలమున సంస్థానమెక్కుడుగ నభివృద్ధినందినది. ఈయన దోమకొండసంస్థానాధీశ్వరులగు శ్రీరాజా సోమేశ్వరరావు బహద్దరువారిపుత్రికయగు రామక్కమ్మగారిని మొదటి భార్యగను, మహబూబు నగరుజిల్లా తాటికొండ గ్రామములోని లక్ష్మీదేవమ్మగారిని ద్వితీయభార్యగను స్వీకరించి, వారివలన సంతతిగల్గకుంటచే తనసోదరపుత్రులగు వెంకటరామారెడ్డిగారిని పెంచుకొనెను. ఇందు రాణీ లక్ష్మీదేవమ్మగారు నేటికిని జీవించియున్నారు.

మహారాజా సీతారామభూపాల్.

క్రీ. శ. 1901 సంవత్సరములో పై వెంకటరామారెడ్డిగారు నైజాముపారి యనుమతితో "మహారాజాసీతారామభూపాల్ బహ

ద్దర్" అను పేరుతో గద్వాల సింహాసన మధి ష్ఠించిరి. వీరి పరిపాలనమున గద్వాలసంస్థాన మనేకవిధముల నభివృద్ధి జెందినది. విద్వత్కవు లెందరో వీరి యాదరమునకు బాత్రులైరి. అందు తిరుపతి వేంకటకవులును, కొప్పరపు కవులు నగ్రగణ్యులు. క్రీ. శ. 1912 లో జరిగిన ఢిల్లీదర్బారులో వీరికి గొప్ప సన్మానము జరిగెను. మహారాజావారు కర్నూలుజిల్లా ఉల్సలగ్రామములోని యొకగౌరవ నీయమగు రెడ్డికుటుంబమునుండి శ్రీ ఆది లక్ష్మీదేవమ్మ యను నామెను పరిణయమైరి. వీ రిర్వురకును శ్రీలక్ష్మీదేవమ్మ, వరలక్ష్మీదేవమ్మ యనునిర్వురు పుత్రికలు జన్మించిరి. మహారాజాసీతారామ భూపాల్ బహద్దరువారు 1924 సంవత్సరము మేనెల 12 వ తేదీని దివంగతులైరి.

మహారాణి శ్రీ ఆదిలక్ష్మీదేవమ్మ బహద్దర్ వారు.

అంతటినుండియు మహారాణీశ్రీ ఆదిలక్ష్మీ దేవమ్మ బహద్దరువారు గద్వాల రాజ్యభారమును వహించుచున్నారు. కాకతీయ సామ్రాజ్యాంతర్గతమగు రాజ్యము నేలుచుండుటవలననో లేక నాంధ్రుల పూర్వపుణ్యవశముననో యీమహారాజ్ఞి యన్నివిధములను నాంధ్రరాజ్ఞీవతంసమగు కాకతిరుద్రాంబికను పోలియున్నారు. ఈమె సంస్థానకార్యములయందెక్కుడు శ్రద్ధవహించి స్వయముగ నెల్లవిషయములను చూచుకొనుచున్నారు. వీరు తమ ప్రథమపుత్రికను దోమకొండ సంస్థాన యువరాజగు శ్రీరాజా సోమేశ్వరరావు బహద్దరు వారికిచ్చి వివాహము చేసిరి. వీరికి శ్రీరాజా కృష్ణరామభూపాలరావ్ బహద్దర్ అను దౌహిత్రులు కలిగిరి. కాకతీయ రుద్రాంబికవలె మహారాణీవా రీదౌహిత్రుని పుత్రవాత్సల్యముతో పెంచి విద్యనేర్పించుచు, ప్రతాపరుద్రదేవుని వలెనే వీరిని భావిగద్వాల పాలకుని జేయనై యున్నారు.

మహారాణీవారి శీల మాదర్శప్రాయము. సంస్థానాధీశ్వరియయ్యు నీమె సదా శ్రీచన్నకేశవపాదారవింద మధుకరాయమానమానసయై దినమున విశేషభాగము నాముష్మికచింతతో గడపుదురు. వీరిదర్శన మెల్లరకును సులభము. కష్టసుఖముల జెప్పికొనగోరు ప్రజలును, ఆశ్రయము నభ్యర్థించు విద్వాంసులును, సాహాయ్యము నపేక్షించు పరోపకారపరాయణులును, మహారాణీవారిసమక్షమున కసంఖ్యాకులుగ వచ్చుచు బోవుచుందురు. ఇందసంతృప్తులుగ మరలువా రుండరనుటలో నతిశయోక్తి యెంతమాత్రమును లేదు. కార్తికమాసమున విద్వాంసులకును, మాఘమాసమున కవిగాయకులకును జేయబడు సన్మానము లీ మహారాజ్ఞి కాలమునందపూర్వతను గాంచినవి. వీని వైభవమును చూడవలెనుగాని వర్ణింపనలవిగాదు. ఈమె కాలమున గద్వాలకు "విద్వద్గద్వాల" యను నామము సార్థక మైనది.

ఇట్లు ప్రజానురంజకముగ రాజ్యము నేలుచు, సకలవిద్యలకును గల్పతరువై, సదా శ్రీచెన్నకేశవ పాదారవింద మధుకరాయమానసయై, యాంధ్రరాజ్ఞీతిలకమై, యాంధ్రగౌరవాధినేతయై యొప్పు శ్రీ మహారాణీవారికిని, వారి ప్రియ దౌహిత్రులగు శ్రీరాజా కృష్ణరామ భూపాల్ బహద్దరు వారికిని, వారి కుటుంబమునకును సర్వేశ్వరు డాయురారోగ్యైశ్వర్యముల నొసంగుగాక.

II. సంస్థానీకుల అధికారములు.

గద్వాల సంస్థానాధీశ్వరులకు స్వతంత్రపరిపాలనాధికారముగలదు. వీరికిని నైజాంరాష్ట్రమునందలి యితరులకును గల సంబంధముల

నుమాత్రము నైజాంవారు పరిష్కరింతురు. సంస్థానన్యాయశాఖలోని యున్నతోద్యోగములు మాత్రము హైదరాబాదు హైకోర్టువారామోదింతురు. ఇతరోద్యోగు లందరిని సంస్థానీకులే నియమించుకొందురు. కొలదికాలమువరకును "గద్వాలరూపాయలు" వ్యాప్తిలోనుండినవి. ఇటీవలినుండి బ్రిటిషురూపాయలు వాడబడుచున్నవి. నేటికి నిదియే ప్రమాణనాణెము. సంస్థానములోని భూస్వాములందరికిని సంస్థానమే Court of Wards అగును. 1895 వరకును సంస్థానమునకు ప్రత్యేకచట్టము లుండనవి. అప్పటినుండియు నైజాంప్రభుత్వమువారి చట్టములే యిచటను వర్తించుచున్నవి. రివిన్యూవిషయమునకూడ వీరికి విశేషమగు నధికారమున్నది. 1906వ సంవత్సరమువరకును వీరికి ఆబ్కారీహక్కులు పూర్తిగనుండినవి. అప్పటినుండియు వానిని నైజాంవారు నిర్వహించుచు గద్వాలకు 13000 రూపాయిలను పరిహారముగా నిచ్చుచున్నారు. కోర్టుస్టాంపులను సంస్థానీకులు తామే వేయించుకొనుచున్నారు. సుంకములను(Customs) నైజాంవారే వసూలుచేసి వీరికి సుమారు 20000 రూపాయలనిచ్చెదరు. పన్నులు విధించి వసూలుచేయు నధికారము పూర్తిగ సంస్థానము వారిదే. గద్వాలలో 300 మంది రాజపుత్రులసైన్యమును, అరబ్బుల అంగరక్షకబలమును గలదు. ఈ నియోగమునకై యేటేటను 30000 రూపాయిలు ఖర్చగును. నేరస్తులను శిక్షించుటలో సంస్థానీకులకు పూర్ణాధికారమున్నది. ఉరిశిక్షలుమాత్రి మిటీవల నైజాంవారిచే నామోదింపబడుచున్నవి. ఈ సంస్థానమున ప్రబలమగు పోలీసుశాఖ పూర్వము నుండియు నున్నది. పైనిబంధనలును,ఏటేటను నైజాంవారికి నియమితమగు పేష్కసును చెల్లించుటయును దప్ప నితరవిషయములలో గద్వాల రాజులకు పరిపూర్ణాధికారముగలదు.

ఈరాజులయెడ జూపబడు విశేషగౌరవములనుగూర్చి యిచ్చట దెల్పుట సమంజసముగ నుండును. వీరికి రాజ్యాభిషేక కాలమున నైజాంవారు తమ సమ్మతిని దెల్పుచు నొక ఖిల్లతును, తురాయి, చీగా, హారములు, దస్తుబంద్, భుజబంద్, మున్నగు నాభరణములను, దస్తార్ (ఉష్ణీషము) దుశ్శాలువ, ఉత్తరీయము, అంగీ మున్నగు వస్త్రములను బంపుదురు. అదే విధమున రాణులకును చీరలును, రవికెలును, ఆభరణములును బంపబడును.

III. ప్రాచీన శిథిలములు.

ఈసంస్థానము పూర్వకాలమున బశ్చిమ చాళుక్యసామ్రాజ్యమునను, బిమ్మట గొంతవరకును తెలుగుచోడుల రాజ్యములందును, దర్వాత కాకతీయ సామ్రాజ్యమునను చేరియుండినది. అటుపై నిందు ఐజ, దరూరు, పూడూరు, గట్టు, వల్లూరు మున్నగు సీమలేర్పడి యనేక నాడగౌడులచే పాలింపబడినవి. ఈ రాజవంశముల శాసనములును, కట్టడములు నీసంస్థానమునం దెన్నియోగలవు. వీనివలన నీరాజ్యపు ప్రాముఖ్యత స్పష్టమగును. గాన వీని నిట సంగ్రహముగ వర్ణించుట యుక్తము.

గద్వాల.

ఈసంస్థానమునకు గద్వాలముఖ్యపట్టణము. ఇది కృష్ణానదికి మూడుమైళ్ళ దూరమునసికింద్రాబాదు-కర్నూలు రైలుమార్గమునందున్నది. ఇందు సువిశాలమగు దుర్గమొకటి గలదు.దీనిని గద్వాలరాజులలో నగ్రగణ్యుడగు రాజా పెదసోమభూపాలుడు (క్రీ.శ.1663-1712) లేక శోభనాద్రి గట్టించెను. ఈదుర్గనిర్మాణ

కాలము క్రీ. శ. 1700-1706 అయినటుల వాఙ్మయము నుండియు స్థానిక చరిత్రముల నుండియు దెలియుచున్నది. వలయాకారము గనున్న యీదుర్గమున నిరువదియొక్క బురుజులు గలవు. కోటలోపలియావరణము రెండు భాగములుగనున్నది. అందు దక్షిణమున కేశవాలయము రామస్వామియాలయమును, రాజసౌధము నున్నవి. సౌధప్రాంగణమున కేడంకణాల సోఫాయనిపేరు. దానినడుమ నలుచదరముగానున్న తిన్నెగలదు. ఇదియే గద్వాల దుర్గమునకు శంకుస్థాపన చేయపడిన స్థలమని తెలియుచున్నది. ఇచటిగోడలపై కొన్నివర్ణచిత్రములున్నవి. వీనిలో గద్వాల దుర్గనిర్మాతయగు రాజా పెదసోమ భూపాలుని నుండి యారుతరముల రాజుల చిత్రములు గలవు. చరిత్రమున కీచిత్రములు మిగుల ముఖ్యములైనవి. ఇచటగల యితరచారిత్రకవస్తువులలో సుమారు ముప్పదియడుగుల పొడవుగలతుపాకి యొకటియు, మహమ్మదీయుల చంద్రధ్వజమొకటియు ముఖ్యములు. వీనిని తమయధీనములోని దరూరుపై బిజాపురసైన్యములు దండెత్తినపుడు గద్వాలరాజులు వశపరచుకొనిరట.

పూడూరు.

గద్వాలసంస్థానమునందలి గ్రామములలో నెల్ల పూడూరు మిక్కిలి ముఖ్యమైనది. ఈ యూరు 9 వ శతాబ్దినుండియు నభివృద్ధిలో నుండెనని యిచటి యొక కన్నడశాసనమునుండి తెలియుచున్నది. ఈ గ్రామమున జూడవలసినవి మూడుదేవాలయములు. అందు మొదటిది కేశవస్వామియాలయము. ఇది యాధునికము. ఆలయమునకు శిఖరములేదు. దీని యావరణలోగల సింహద్వారము ప్రాచీనచాళుక్యశిల్పద్ధపతి ననుసరించి నిర్మింపబడినది. పొలమును దున్నునపు డిది భూగర్భమునుండి బయల్వెడలెనని తెలియుచున్నది. పిమ్మట పేర్కొనదగినది పూడూరుదుర్గము. గ్రామమునకు చుట్టును వలయాకారమగు నొక మట్టిగోడగలదు. ఇది పూర్వదుర్గమునకు బహిరావరణమనునంశము ఈయూరి మల్లిఖార్జునగుడివద్దగల శాసనములోని "పుడ్రసంజ్ఞేపురే" "దుర్గేయశస్సోదరే" యను మాటలవలన స్పష్టమగుచున్నది. మల్లికార్జునగుడి మట్టిగోడకు ముప్పదిగజముల దూరముననున్నది. దీనికి సమీపమున నొకగోడనుజేరి కొన్నివిగ్రహములున్నవి. ఇందు ఒక స్త్రీవిగ్రహమును, ఒక పురుషవిగ్రహమును, తలపై నేడు పడగలసర్పముగల్గి ధ్యానముద్రలోనాసీనుడై యున్న జైన తీర్థంకరుని విగ్రహమును ముఖ్యములు. ఇవిగాక మరిమూడు తీర్థంకరవిగ్రహములు గూడ నిచట గలవు. మల్లిఖార్జునగుడి కొకఫర్లాంగుదూరమున వీరభద్రాలయమున్నది. ఇందు నందిగల ముఖమంటపము నటుపై బ్రవేశమంటపమును దానివెనుక గర్భాలయమును గలవు. ఆలయముపై శిఖరము మెట్లు మెట్లుగా నిర్మింపబడి పోనుపోను సన్నమగును. దీని యగ్రము తలక్రిందులుగ బోర్లింపబడిన కలశమువలె నున్నది. ఇది జైనాలయ శిఖరమని యీవర్ణనమునుండి తెలియుచున్నది. ఈ యాలయమున నొక శివలింగమును వీరభద్రుని విగ్రహమును గలవు. ప్రత్యక్షముగ జైనాలయముగ గన్పడు నిందు శైవ విగ్రహములుండుటనుబట్టి యిందేమియో విశేషముండవలెనని తోచుచున్నది. శైవులకును జైనులకును 12 వతాబ్దములో ప్రబలమగు శాక్తవమేర్పడి తత్ఫలితముగ జైనులు క్షీణించుటయు వారి గ్రంథములు నశించుటయు, వారికట్టడ

ములు మార్పునందుటయు శాసనవాఙ్మయాదులనుండి తెలియుచున్నవి. ఈ సుప్రసిద్ధ చారిత్రిక విషయమును పైన పేర్కొనబడిన జైనాలయమున శైవవిగ్రహము లుండుట యందలి వైరుధ్యముతో సమన్వయించినచో పూడూరుగూడ శైవజైనసంఘర్షణమున కొక ముఖ్యరంగస్థలమై యుండెనని యూహింపనగుచున్నది. ఈ యూహను బలపరచుట కీయూరనే యీక్రింది ప్రమాణములు గాంచనగుచున్నవి. (1) ఇచటి మల్లిఖార్జునగుడివద్ద చెదరియున్న విగ్రహములలో పార్శ్వనాథుని యొక్కయు మరియిర్వురు తీర్థంకరులయొక్కయు విగ్రహము లున్నవి. (2) ఈ యాలయమున కనతిదూరమునందున్న నల్లరాతిపై మూడు వైపుల 12వ చాళుక్య విక్రమసంవత్సరమునాటి కన్నడ శాసనముమొదట కూర్చొనియున్న ధ్యాని జైనవిగ్రహమును, జినుని ప్రశంసయు, పల్లవజినాలయప్రశంసయు గలవు. మొదటిప్రక్క చిగురుభాగమున పుండ్రిపుర దుర్గమును, ద్రవిళసంఘమునకు జెందిన కాంచనసేనపండితుడును పేర్కొనబడి యున్నారు. (3) వీరభద్రాలయమున కుత్తరముగ నున్న యొక సత్రముయొక్కగోడలో నొక రాతిపైన మొదటి వరుసలో శివలింగమును ధ్యానిజైన విగ్రహమును, రెండవ వరుసలో జైనునిక్రింద కత్తితో పోరాడుచున్న రౌతుగుఱ్ఱమును శివలింగము క్రిందనున్న పదాతియొకడు యీటెతో పొడుచుచున్నట్లును, మూడవవరుసలో రౌతుక్రింద తలక్రిందుగ పడుచున్న మనుష్యుడును, నాల్గవవరుసలో నొక మృతదేహమును చెక్కబడియున్నవి.

ఈ శిల్పములనుండి నేటి వీరభద్రాలయమే పూర్వపు పల్లవజినాలయ మనియు, నందు మల్లికార్జునగుడివద్దగల పార్శ్వనాథుడు నాతని యక్షిణీయక్షులు నుండెడి వారనియు, వీరశైవ మతము విజృంభించినపుడు పైన పేర్కొనబడిన సత్రపుగోడలోని శిల్పము సాంకేతికముగ దెల్పు శైవజైనమతసంఘర్షణ మిచ్చటగూడ జరిగి జైనులోడిపోయిరనియు, నటుపిమ్మట నిచట పల్లవజినాలయమున శివలింగమును వీరభద్రుని విగ్రహమును స్థాపింపబడినవనియు స్పష్టమగుచున్నది.*

వల్లూరు.

ఈగ్రామము హైదరాబాదు- కర్నూలు రైలుదారిపైనున్న చాగాపురమునకు రెండు మైళ్ళ దూరమునందున్నది. ఇచటి గోపాలస్వామి యాలయము సుప్రసిద్ధము. ఈయాలయావరణలో భూమిలో పాతుకొనియున్న రాతిమీద మిక్కిలియరిగిపోయిన శాసనమొకటిగలదు. ఆంధ్రచోళుల కొక వల్లూరు రాజధానిగ నుండెడిదనియు, కాకతీయ గణపతిదేవుని సామంతుడగు గంగయసాహిణి వల్లూరుపురము రాజధానిగా పానుగల్లుమొదలు మార్జవాడివరకునుగల దేశము నేలెననియు శాసనములనుండి తెలియుచున్నది. రుద్రాంబాప్రతాపరుద్రుల సామంతుడగు త్రిపురాంతకుడు నిటనుండియే రాజ్యమేలెను. ఈయూరనొకదుర్గముయొక్క చిహ్నములు గాంచనగుచున్నవి. పైచరిత్రప్రసిద్ధమగు రాజధాని ప్రకృతగద్వాలసంస్థానములోని యీవల్లూరేయని చెప్పవచ్చును.

బోరవెల్లి.

ఈగ్రామము వల్లూరు కెనిమిదిమైళ్ళ దూర

---

* వివరములకు J. A. H. R. S. vol VIII pts 2 & 3. లోని 'The Antiquities of Pudur' అను నావ్యాసమును జూచునది.

మునందున్నది. ఇటబలిష్ఠమగుదుర్గమొకటిగల దు. ఒకప్పుడీగ్రామ మొకసీమకు ముఖ్యస్థాన ముగ నుండినటుల స్థానికచరిత్రములనుండి తెలి యుచున్నది. "అలంకార శిరోభూషణ"మను సంస్కృతగ్రంథమున నీయూర ముష్టిపల్లికుల జులును, మినిమళ్ళగోత్రజులునగు పాకనాటి రెడ్లు పాలించుచుండిరని చెప్పబడియున్నది. ఈ వంశపాలకులలో కడపటిదగుగిరెమ్మయను రా ణి దత్తపుత్రుడగు రాజారామరాయడు 18 వ శతాబ్దమధ్యభాగమునగద్వాల కేలికయగుటచే నీబోరవెల్లిసీమయు దుర్గమును గద్వాలరాజ్య ములో గలసిపోయినవి.

రాజోళి

గద్వాలసంస్థానమునందలి ముఖ్యగ్రామము లలో నిదియొకటి. ఇది తుంగభద్రాతీరమునం దున్నది. నది యిట రెండుపాయలై యొకలంక యేర్పడగా బ్రిటిషుప్రభుత్వమువారొకయానక ట్టనుగట్టి యావలియొడ్డునకు జల సౌకర్యమును గల్గించిరి. ఈగ్రామమున బలమగు దుర్గమొకటి గలదు. ఇందలి రాజసౌధములలోని భాగము లింకను గన్పించుచున్నవి. దుర్గముమధ్యవీరనా రాయణస్వాము యాలయమున్నది. ఇది మనో హరమైనది. గ్రామమునకు రెండుమైళ్ళ దూర మున నదియొడ్డున రామేశ్వరాలయము గలదు. చిన్నదైన నీయాలయము చక్కనిది. ఇందొక లింగమును కొన్ని భిన్నశిల్పములును గలవు. ఆలయము ముంగిట నొక తెల్లరాతిపైన చాళు క్యభూలోకమల్లుని శాసనమొకటి యున్నది.

ఐజ

ఐజ మిగులముఖ్యమైనది. సంస్థాన మూలపురు షుడగు బుడ్డారెడ్డి యీగ్రామనివాసి. ఈతడు శా. శ. 1212 వ సంవత్సరమున కాకతీయ ప్రతాపరుద్రునివలన ఐజ మున్నగు నేడు సీమలపై నాడ గౌడరికమును బొందెను. ఇం దువలన నతని సంతతివారికి 'ఐజ నాడగౌడు' లను పేరేర్పడినది. ఇట పూర్వమొక దుర్గ ముండెడిదని తెల్పుటకు నేటికి నొక మట్టిబు రుజును, గోడలలోని భాగములును నిలచి యున్నవి. ఇందు మూడు ప్రాచీనాలయములు గలవు. అందలి యాంజనేయాలయము ప్రక్క నున్న దిగుడుబావిమెట్లలో బిగింపబడిన యొక రాతిపై నొక శాసనభాగమున్నది. దానిలో "స్వస్తి శ్రీ మన్మహామండలేశ్వర కాకతీయ ప్రతాపరుద్రదేవ మహారాజులు ఒరుగంటను సుఖసంకథా వినోదంబున రాజ్యమునేయు చుండగా" అని యున్నది. ఈశాసనశకలము పై బుడ్డారెడ్డికి నాడగౌడరికము వచ్చినవిధ మును దెల్పుచు, గద్వాల సంస్థానము కాక తీయ సామ్రాజ్య భవమని నిరూపించు సంస్థా నికులవద్దగల సన్నదును బలపరచు చున్నది.

ఉత్తనూరు

ఇది ఐజకు రెండుమైళ్ళలోనున్న గ్రామ మ. ఈగ్రామమునకు భాగణ్ణదాసులను కర్ణా టక భక్తుడు శాశ్వతమగు గీర్తిని గల్గించెను. ద్వైతమతభక్తులు గొందరు తమమత సిద్ధాం తములను పామరులకు సుబోధ్యముల నొన ర్చుటకై కన్నడభాషలో కీర్తనలను రచించిరి. ఈకీర్తనలను పాడుచు భక్తిపరవశులై యనే కాద్భుత కార్యముల నొనర్చిన యీభక్తుల సంఘమునకు 'దాసకూట' మనిపేరు. భాగణ్ణ దాసులను నత డీకూటమున ముఖ్యుడు. ఉత్త నూరు గ్రామ మీతని జన్మస్థానము. క్రీ. శ. 1722—62 నడుమ జీవించిన యీమహా నీయునిగూర్చి గర్ణాటకమున పెక్కుగాథలు గలవు. నేటికిని ఉత్తనూరులో "భాగణ్ణదాసర భావి" యని యొక బావిగలదు.

కుచినెర్ల.

ఈగ్రామము గద్వాల-రాయచూరురోడ్డు పై రాయచూరుకు 11 మైళ్ళ దూరమునందున్నది. ఊరి కరమైలుదూరమున పొలముల మధ్య సోమప్పగుడియని యొకచిన్నగుడిగలదు. ఇందొకరాతిమీద నాయుధహస్తుడై గుఱ్ఱముపై స్వారిచేయుచున్న యోధునివిగ్రహమున్నది. ఇదియొక "వీరకల్"అని తోచుచున్నది. ఈగుడికెదురుగ నొకనల్లని రాతి స్తంభము భూమిలో పాతబడియున్నది. దీనికి మూడువైపులను మూడుశాసనములు గలవు. అందొకటి చాళుక్యత్రిభువనమల్లుని సామంతుడగు నొకతెలుగుచోడుని ధర్మమునుదెల్పును. మరియొకటి పైరాజుయొక్క మంత్రియు దండనాథుడునగు పద్మనాభరస 14వ చాళుక్య విక్రమవర్షమునజేసిన దానములనుపేర్కొనును.

దరూరు.

ఈగ్రామము గద్వాలకారుమైళ్ళలో నున్నది పూర్వమిదియొకసీమకు ముఖ్యస్థానము. ఐజసీమతోపాటు దరూరుసీమకుగూడ గద్వాలసంస్థానీకులపూర్వుడగు బుడ్డారెడ్డి నాడగౌడరికమును సంపాదించెను. ఈయూరి చెరువుగట్టుననున్న యాంజనేయాలయములోని విగ్రహము క్రీ. శ. 15, 16 శతాబ్దములలో విజయనగర రాజులచే "కులదైవతముగ" నారాధింపబడినవాడును, ద్వైతమతాచార్యులలో సుప్రసిద్ధుడునగు శ్రీవ్యాసరాజస్వామిచే బ్రతిష్ఠింపబడెనని పరంపరాగతమగు స్థానికుల గాథలు తెల్పుచున్నవి.

బీచిపల్లి.

ఈగ్రామము గద్వాలకు దూర్పుగా పదిమైళ్ళదూరమున గృష్ణాతీరమునందున్నది. ఇచటియాలయము ముఖ్యమైనది. ఇందలి యాంజనేయవిగ్రహము దర్శనీయము దీనినిగూడ శ్రీవ్యాసరాజస్వామి ప్రతిష్ఠించెనట. ఉత్తర దక్షిణముగా ప్రవహించునదిలో నిచట బ్రాక్పశ్చిమముగా నొకద్వీపమేర్పడినది. ఇందలి యొకగుట్టపై బలిష్ఠమగు కోటగలదు. దీనికి నైజాంకొండయని పేరు. దీనికనతిదూరమున సీతారామస్వామి జీర్ణాలయమున్నది. పై యాంజనేయాలయము వెలుపల నొకచింత చెట్టుక్రింద భూమిలో చాలభాగముపూడియున్న శిలాస్తంభమొకటి గన్గొనబడినది. దీనికి మూడువైపుల నొకశాసనముగలదు. ఇందు చాళుక్య భూలోకమల్లుని రాజ్యకాలమున శా. శ. 887 వ సంవత్సరమున నారాజు సామంతుడగు బిద్దంచోళమహారాజు చేసిన ధర్మము వర్ణింపబడినది. "కాశ్యపగోత్ర, ఒరయూర్పురవరాధీశ్వర" మున్నగు బిరుదములనుండి యీసామంతు డాంధ్రచోడవంశీయుడని నిర్ణయింపవచ్చును.

ఇంతవరకును వర్ణింపబడిన శిథిలములుగాక గద్వాలసంస్థానమునం దెన్నియో ప్రాచీన దుర్గములును, దేవాలయములును గలవు. ఇందలి శాసనములనుండి యీభూభాగము గొంతకాలము పశ్చిమచాళుక్య సామ్రాజ్యమునను, పిమ్మట నాంధ్రచోళుల వశమునను, పిదప గాకతీయచక్రవర్తుల పరిపాలనమునందునుండి, యటుపై ననేకసీమలుగ విభజింపబడి కాలక్రమమున ప్రకృత గద్వాలరాజ్యముగ నయ్యెనని తెలియుచున్నది.

—



కాకతీయ మరియాత్మోత్సవము — పరిణయములు, గృహప్రవేశములు.



కాకతీయ వర్ధంత్యుత్సవము—ఆహ్వానసంఘము, స్వచ్ఛందసేవకులు.

272B

కాకతీయ వర్ధంత్యుత్సవము.

ఆంధ్రదేశపు ప్రాచీనగౌరవమును పరిశోధనామూలకముగ బయల్పరచి, దేశీయచరిత్రమునం దభిరుచినిగల్పించి, భారతీయచరిత్రమును బరిశోధించు నితరసంస్థలకును, పరిశోధకులకును దోడ్పడుట ఆంధ్రేతిహాసపరిశోధకమండలి యొక్క ముఖ్యోద్దేశ్యము. పరిశోధకులసిద్ధాంతములను వెల్లడిచేయుటకై యొక త్రైమాసికపత్రిక నాంగ్లమున ప్రకటించుటయేగాక ప్రత్యేక రాజవంశముల యొక్కయు, విభాగములయొక్కయు, చరిత్రమును గ్రంథరూపకముగ సేకరించుటగూడ మండలి కార్యక్రమములో గలదు. దీని ననుసరించి రాజరాజసంచికయు, కళింగదేశచరిత్రమును బ్రకటింపబడినవి.

1925 ప్రాంతముననే మండలివారు కాకతీయోత్సవమును జరుపనిశ్చయించిరి గాని కారణాంతరములచే నాపట్టున కళింగవర్ధంతి జరుపబడినది. 1930 లో కళింగసంచిక బ్రకటింపబడుటయు, నటుపై మరియొక వర్ధంతి జరుపుటావశ్యమగుటయు, నిదేసమయమున గాకతీయుల చరిత్రమునుగూర్చి మద్రాసు విశ్వవిద్యాలయమున గొంతపరిశోధనచేసియుండిన నేను, నైజాం రాష్ట్రమునందలి గొన్ని నూతనశాసనములతో బరిచయముచేసికొని, రాజమహేంద్రవరముచేరి, మండలివారి త్రైమాసికపత్రికలో పై శాసనముల యాధారముపై నిర్మింపబడిన కాకతీయులచరిత్రమును బ్రకటించుటయు జరిగినవి. ఇంతలో నేనును, అప్పటి మండలి కార్యదర్శిగారగు సుబ్బారావుగారును, మండిలివారు కాకతీయవర్ధంతి జరపినచో బాగుగనుండుననియు, దానిని కాకతీయరాజధానియగు నోరుగల్లులోనే నిర్వహించుట సమంజసమనియు నిశ్చయించుకొని మండలికార్యనిర్వాహకవర్గమునం దీవిషయమును బ్రవేశపెట్టితిమి. మండలివారు నిందుల కంగీకరించి, యాయుత్సవమునకు గావలసిన యేర్పాటులను జేయుడని మమ్ములను గోరుచు, వర్ధంత్యనంతరము బ్రకటింపబడు సంచికకు నన్ను సంపాదకునిగను, శ్రీ జయంతి రామయ్యపంతులు, రాళ్ళబండి సుబ్బారావు, భావరాజు వేంకటకృష్ణారావు, టేకుమళ్ళ అచ్యుతరావుగార్లను, సంపాదకీయసంఘసభ్యులుగను నియమించిరి.

1931 డిసెంబరు నెలలో నేనును సుబ్బారావుగారును హైదరాబాదునకేగి యచ్చటి యాంధ్రప్రముఖులను జూచితిమి. స్థానికులు నైజాంరాష్ట్రమునం దిట్టివర్ధంతులను జరపుటకు నైజాం ప్రభుత్వమువారి యనుమతి గావలెననియు, నయ్యది దుస్సాధ్యమనియు జెప్పుటచే మేము గొంచెము నిరుత్సాహత జెందితిమి. కాని యీసమయమున నైజాం ప్రభుత్వమున Director of Records అను నున్నతోద్యోగము నందుండువారును, పర్షియను భాషాకోవిదులునగు సయ్యద్ కుర్షిద్ ఆలీ బి. ఏ. గారు మాకు అమూల్యమగు సాహాయ్యము నుత్సాహము నొసంగిరి. వారిమూలమున మాకు ప్రభుత్వమువారి Deputy Home Secretary గారితో సమావేశము గలిగినది. మండలియొక్క ఆశయములను, మేము తలపెట్టిన కాకతీయోత్సవము

యొక్క కార్యక్రమును విని యాయుద్యోగి కొన్ని షరతులపై మాకుత్తరువు నొసంగ నంగీకరించెను. అటుపై మేము హనుమకొండకేగి స్థానికులగు మాదిరాజు రామకోటేశ్వరరావుగారిని, ఇతర న్యాయవాది ప్రముఖులను, వర్తకప్రముఖులను గాంచి వారి సానుభూతిని పొందితిమి. ఈయుత్సవ మచటనే జరుగవలెననియు, దానినిర్వహణభారమును తాము వహింతుమనియు, వారుత్సాహముతో దెల్పిరి. ఈసందర్భమున శ్రీదూపాటి రమణాచార్యులు, రామకోటేశ్వరరావు, ఒద్దిరాజు రాజేశ్వరరావుగార్లు విశేషసాహాయ్యమొనర్చిరి. అనంతరము మేము ఒరంగల్లులోని సుబేదారుమున్నగు నున్నతోద్యోగులను గూడ దర్శించి తిరిగి హైదరాబాదు చేరితిమి. అచట శ్రీరాజా కొత్వాలు వేంకటరామారెడ్డిబహద్దరువారు, సురవరము ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, పింగళి వెంకటరామారెడ్డి దేశముఖుగార్ల సాహాయ్యమున మేముమిగిలిన యేర్పాట్లను చేయగల్గితిమి. నైజాంకళాశాలలో చరిత్రాచార్యులును, విద్యావిషయములలో నగ్రగణ్యులునగు యస్. హనుమంతరావుగా రుత్సవమునకును, పిం. వెంకటరామారెడ్డిగారు ఆహ్వానసంఘమునకును, నధ్యక్షులుగనుండుటకును, ధర్మవీర్ వామనాయక్ జాగీర్దారుగారు చారిత్రకవస్తుప్రదర్శనమును తెరచుటకు నంగీకరించిరి. కాకతీయోత్సవము మార్చి 25, 26, 27 తారీకులలో జరుపబడునని మేము నైజాం ప్రభుత్వమునకు దెలియపరచితిమి. వారును హనుమకొండలో కళాశాల నారోజులలో మూయించి సభలను జరుపుకొనుటకై మాకొసంగెదమనియు, వారియార్షశాఖ(Archaeological Department) వారిసాహాయ్యమును గూడ నొసంగెదమనియు, దయతో దెల్పిరి. ఈయేర్పాటులను చేసికొని మేము రాజమహేంద్రవరమునకు మరలితిమి.

హనుమకొండలోని ప్రముఖులందరు నధికోత్సాహముతో కార్యమునకు గడంగి పెక్కుమంది విద్యాధికులును, శ్రీమంతులునుగల ప్రబలమగు నొక యాహ్వానసంఘము నేర్పరచికొని ప్రయత్నములు చేయుచుండిరి. వారి సహకారముతో నొక కార్యక్రమము నేర్పరచి, మండలివారు తమత్రైమాసిక పత్రికామూలమునను, వార్తాపత్రికల మూలమునను గాకతీయోత్సవమును గూర్చిన వివరములను, కార్యక్రమమును బ్రకటించి పండితుల తోడ్పాటును కోరిరి. రాబోవు కాకతీయసంచికకు వ్యాసములను బంపుటకై పండితులకును, ఉత్సవకాలమున జరుపబడు చారిత్రకవస్తుప్రదర్శనమునకు సామగ్రిలను బంపుడని వ్యక్తులకును, సంస్థలకును గూడ లేఖలు పంపబడినవి.

కాని మార్చి 20 వ తారీకున నైజాం ప్రభుత్వమునుండి మండలి కార్యదర్శి కొకతంతి వార్త వచ్చినది. అంతట కార్యదర్శి తొందరగా హైదరాబాదుకుపోయి కనుగొనగా కాకతీయ సభ కేగాని కాకతీయవర్ధంతి కుత్తరువొసంగబడలేదని నైజాం ప్రభుత్వమువారు తెలిపిరి. తిరిగి యుత్తరువు జారీయగుట కాలస్యమయ్యెను. స్థానికుల ప్రయత్నములును పూర్తికాలేదు. అందుచే గాకతీయోత్సవమును ఏప్రిలునెలకు మార్చవలసివచ్చినది. ఈమార్పునను సరించి 12 ఏప్రిలుతేదీని సభాకార్యక్రమమును దెల్పుచు మరియొక కరపత్రము

నుండలివారిచే బ్రకటింపబడినది. దేశీయప్రముఖులకును, పరిశోధకపండితులకును, విద్యా విషయక సంస్థలకు నాహ్వానములు పంపబడినవి.

మండలికార్యదర్శిగారు ఏప్రిలు 20 వ తేదీకి హనుమకొండ చేరి యచ్చటి యాహ్వాన సంఘముతో కలసి యవసరములగు నేర్పాటులను గావించిరి. అతిథులకు వసతియు భోజన సౌకర్యములును ఉస్మానియా కాలేజీహాస్టలులో నేర్పరుపబడినవి. తోరణములతోడను, పతాకములతోడను దానిని స్థానికప్రముఖులు చక్కగ నలంకరించిరి. సభాప్రతినిధులు చాలమంది 24 వ తారీకు సాయంకాలమును, మిగిలినవారు 25వ తారీకు ఉదయమునకును వచ్చిచేరిరి.

సభాప్రారంభము.

25 వ తారీకు ఉదయం పదిగంటలకు ప్రతినిధులు, ప్రేక్షకులు, స్థానికప్రముఖులు మున్నగువారందరును ఉస్మానియా హాస్టలులో సమావేశమైరి. అంతట మంగళవాద్యములతో నొక యూరేగింపు బయల్వెడలి కళాశాలాభవనమును చేరినది. 11 గంటలకు సభప్రారంభమయ్యెను. సభాభవనము క్రిక్కిరిసి యుండినది. ఎల్లెడల నమితమగు నుత్సాహము గన్పట్టినది. సభ నలంకరించినవారిలో నీక్రిందిముఖ్యులు గలరు.

వారంగల్ సుబేదారగు దరబ్జీ బాపూజీచినోయిగారు, తాలూక్దారు మహమ్మద్ అబ్దుల్ బసిత్ ఖాన్ గారు, పూర్వము హైదరబాద్ హైకోర్టు జడ్జిగనుండిన పండిత కేశవరావుగారు, బారిస్టరు శ్రీనివాసరావుశర్మగారు, ధర్మవీర్ వామననాయకుగారు జాగీర్దారు, పింగళి వెంకట్రామారెడ్డిగారు దేశముఖ్, కె. యస్. వైద్య ఎం. ఏ., ఎల్. ఎల్ బి. గారు, పోలీసుసూపరెంటు సర్దారు నిరంజనసింగుగారు, తాహశిల్దారు గోవిందరావుగారు, ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాలగు అబ్దుల్ అజీజ్ ఖాన్ బి. ఏ. గారు, నార్మల్ స్కూలు సూపరెంటు ఏ. వెంకటరమణయ్యగారు, వకీలు శ్రీరామారావుగారు, కళాశాలోపన్యాసకులగు అబ్దుల్ అజీజ్, ఎ. గోపాలరావు, ఎ. రామచంద్రరావుగార్లు, ప్రొఫెసరు తెలికిచర్ల వెంకటరత్నంగారు, ఎం .ఏ. గుంటూరు, ఎ. శ్రీనివాసరావుగారు, ఎం. ఏ., హైదరాబాదు ఆర్షశాఖప్రతినిధి జోషీగారు, డాక్టరు చిలుకూరి నారాయణరావు ఎం. ఏ. ఎల్. టి. పి. హెచ్. డి. గారు, భావరాజు వెంకట కృష్ణారావు బి. ఏ. బి. ఎల్. గారు, మాడపాటి హనుమంతరావుగారు హైకోర్టువకీలు, అడవి బాపిరాజుగారు బి. ఏ, శ్రీ శేషాద్రిరమణకవులు, మాదిరాజు రామకోటేశ్వరరావుగారు వకీలు, ఆకారపు చిన్నయ్యగారు, కొమరవెల్లి కాశయ్యగారు, బి. కృష్ణమూర్తిగారు, ఆహ్వానసంఘ సభ్యులు, స్వచ్ఛందసేవకులు.

శ్రీ మాదిరాజు రామకోటేశ్వరరావుగారి ప్రార్థనతో సభాకార్యక్రమ మారంభింపబడినది. పిమ్మట ఆంధ్రేతిహాస పరిశోధకమండలి గౌరవకార్యదర్శియగు రాళ్ళబండి సుబ్బారావు యం. ఏ., యల్. టి. గారీక్రింది ప్రారంభోపన్యాసము నొసంగిరి—

1922 సంవత్సరములో చిలుకూరి వీరభద్రరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, భావరాజు వెంకటకృష్ణరావు, చిలుకూరి నారాయణరావుగార్లు ఆంధ్రేతిహాసపరిశోధకమండలిని రాణ్మహేంద్రవరమున స్థాపించిరి. అదే సంవత్సరమున రాజరాజనరేంద్రపట్టాభిషేకనవమశ

తాబ్దవర్ధంతిని రాజమండ్రిలో జరపి, భా. వెం. కృష్ణారావుగారి సంపాదకత్వమున, మండలివారు రాజరాజ పట్టాభిషేకసంచికను ప్రకటించిరి. 1926 నుండియు త్రైమాసికపత్రిక ప్రారంభింపబడినది. ఇంతవరకును 22 సంచికలు వెలువడినవి. జమీందారులును, పండితులు నెందరో యీ సందర్భమున సాహాయ్య మొనర్చిరి. వారికి మావందనములు. 1927 సంవత్సరము జూన్ నెలలో మండలివారు ముఖలింగములో కళింగవర్ధంతిని జరపిరి. దీనికి పర్లాకిమిడి కళ్ళికోట జమీందారులును, సర్. ఎ. పి. పాత్రో, శ్రీరాజా విక్రమదేవవర్మగార్లును పోషకులుగనుండిరి. దీనిఫలితముగ 1931లో కళింగదేశచరిత్రమనుగ్రంథము నా సంపాదకత్వమున ప్రకటింపబడినది. ఇప్పుడు మండలివారు ఏకశిలానగరమున కాకతీయోత్సవమును జరపి మరియొకసంచికను ప్రకటింపదలచియున్నారు. దానికి నామిత్రులగు మారేమండ రామారావు బి. ఏ. ఆనర్సుగారు సంపాదకులుగ నెన్నుకొనబడిరి. ఈనగరము కాకతీయులకు రాజధానియగుటయు, వారి చరిత్రమునువ్రాయబోవువారు తత్కాలీనములగు శిథిలములను సందర్శించుట సమంజసమగుటచేతను, నైజాంరాష్ట్రమునందలి చారిత్రకసామగ్రిని బయల్వెడలింపజేయు నుద్దేశ్యముతోడను మండలివారీయుత్సవము నిచ్చటజరుప సంకల్పించిరి. స్థానికులగు శ్రీమంతులును, పండితులు నుద్యోగులు నీసందర్భమున మండలికి తోడ్పడుదురని మాయాశయము. ఉత్సవమును జరుపుటకు త్తరువొసంగుటయేగాక, కళాశాలాభవనమునొసంగియు, ఆర్షశాఖవారిని చారిత్రకవస్తుప్రదర్శనమునకు సాయమొనర్పజేసియు సనేకవిధముల మండలికి దోడ్పడిన శ్రీ నైజాం ప్రభుత్వమువారికి మాకృతజ్ఞతాపూర్వక వందనములు.

పిమ్మట కాకతీయ సభాహ్వానసంఘాధ్యక్షులగు శ్రీయుత పింగిలి వెంకటరామారెడ్డి దేశముఖ్‌గారీక్రింది యుపన్యాసమును జదివిరి—

సోదరీ సోదరులారా!

నిజాంరాష్ట్రాంధ్రులచరిత్రలో నత్యంతప్రాచీనమును, అత్యంతౌన్నత్యస్థితియందుండినదియునగు కాకతీయవంశముయొక్క చారిత్రికోత్సవమును జరుపునందర్భమున మిమ్ముల నందరను ప్రేమపురస్సరముగా నీప్రాచీనచారిత్రకనగరమం దీనాటి సభకు ఆహ్వానించు గౌరవము నాకొసగబడి నందులకు నేనెంతయు ధన్యుడనని విశ్వసించుచున్నాను. ఈసభను ప్రారంభించుటకు మొదలు ఈసభోద్దేశములను కాకతీయసామ్రాజ్యవిశేషములను నా తెలిసినంతవరకు మీతో విన్నవించుకొందును.

రాజమహేంద్రవరమందలి ఆంధ్రచారిత్రికపరిశోధకమండలివారు ఇదివరలో రాజరాజనరేంద్ర వర్ధంతిని, కళింగవర్ధంతిని జేసి చాళుక్యసంచికను, కళింగసంచికను ప్రకటించి ఆంధ్రులకు మహోపకారము చేసియున్నారు. ఇప్పుడును అదేపద్ధతిపై యీనగరమందును కాకతీయసంబంధమగుసభను జేసి త్వరలో కాకతీయవర్ధంతిసంచికను ప్రకటింపనున్నారు.

ఈపద్ధతివలన మన విస్మృతమైనట్టి ఏకశిలానగరసామ్రాజ్యచరిత్రయు, కాకతీయుల కాలమునాటి యాంధ్రులచారిత్రిక, సాంఘిక, సారస్వతాదిస్థితియు మనకు విశదముగా తెలియగలదు. మఱియునిట్లు చేయుటవలన నాంధ్రులు తమ స్థితిగతులనుగుర్తించి తమ విధ్యుక్త

కాకతీయ సంచిక.



కాకతీయ సభ—వ్యవస్థాపకులు,

కాకతీయ సంచిక.

పెద్దచెరుకూరు శాసనము.

[By courtesy of The Telugu Academy, Cocanada.]

మేమియో, తమభావికర్తవ్యమేమియో నిర్ణయించుకొను నవకాశము కలుగగలదు.

ఏ వర్ధంతియైనను, ఎచ్చటనైనను జరుగనీ జరుగకపోనీ యీవర్ధంతి మాత్రము ఇచ్చట నిప్పుడైనను జరుగుట చాల సమంజసము. కొన్ని సంవత్సరముల క్రిందట కీ. శే. కే. వి. లక్ష్మణరావు పంతులువారు సందర్భాంతరమున మన హైద్రాబాదు రాష్ట్రములో ఆంధ్రుల చారిత్రకసంబంధమయిన వాఙ్మయము, శాసనాదికములు, శిల్పములు, పరిశోధ నార్హము లుగా వేనకువేలుగా నున్నవనియు, వానిని పరిశోధించుట చాల యవసర మనియు, తెలిపి యుండిరి. వారియాశయములు నేటివరకును నెరవేరలేదు. ఈ రాష్ట్రములో చోళచాళుక్య శాసనములవలె కాకతీయశాసనములు వందలకొలది మూలమూలలందును గలవు. వానిస్థితి దినదినము హీనమై పోవుచున్నది. అనేకస్థలములలో భూమిలో పూడిపోయి తామింకను పనికిరాగలమని తలలుమాత్రము చూపుచున్నవి. మఱికొన్ని స్థలములలో వానిని ప్రజలు దుర్వినియోగము చేయుచున్నారు. కొన్ని తావులలో శాసనములు పగిలిపోయి తలయో తోకయో మిగిలినవై యున్నవి.

మనరాష్ట్రములో గ్రామగ్రామమందు తరచినకొలది తాటియాకులగ్రంథములును దిబ్బదిబ్బయందు త్రవ్వినకొలది ప్రాచీన నాణెములును, నిక్షేపములును, దొరకగలవు. మన ఆర్కశాఖవారును యెంతయో పరిశ్రమచేసి మద్రాసు పండితులచే వ్యయముకోర్చి పరిశోధింప జేసి ప్రకటించిన మూడు కాకతీయశాసనములు చదివినవారు కాకతీయుల చరిత్ర కొంతవఱ కెఱిఁగియే యుందురు.

అయినను ఆ కాకతీయుల విషయములో రెండుమూడుమాటలను జెప్పదలచినాఁడను. మనలో చరిత్రలు తక్కువని కొందఱు సులభముగా విమర్శింతురు. మనదేశ పరిస్థితు లెట్లుం డెనో, ఆకాలమందలి యల్లకల్లోలములలో గ్రంథములు నాశనమగుటకు అవకాశము లెట్లుం డెనో విచారించక వీరిట్లు నూట్లాడుదురు. ఇటీవల కొన్నియేండ్లనుండి యనేక కావ్యాదుల నుండి, శాసనములనుండి, స్థానిక కైఫీయతులనుండి కాకతీయచరిత్రలోని బహుభాగము గుర్తింప బడి వ్రాయబడి యున్నది.

ఈ ఓరుగల్లు నగరమును, హనుమకొండ పట్టణమును సుప్రసిద్ధస్థలము లైనవి, మనకే కాదు ఖండాంతర వాసులైన మార్కోపోలోవంటి వారికిని నాఁటికిని నేటికినిచిరపరిచితము లై నవి. ఈఓరుగల్లు సామ్రాజ్యమువలన ఆంధ్రులభాషయేకాక, ఆంధ్రుల సర్వకళలునభివృద్ధినొం దెను. ఆంధ్రులప్రతిభ దిక్కుదిక్కులకు వ్యాపించెను. ఈ పరిసర ప్రదేశము లన్నియు చారి త్రిక స్థలములే.

కాకతీయులు రెడ్లా కమ్మలా యని యనేక పండితులు చర్చించి యిదమిత్థమని నిర్ణయిం పక విడిచిపెట్టి యున్నారు. నాయభిప్రాయములో కాకతీయుల కాలములో రెడ్లు, కమ్మలే కాక వెలమలుకుండిరి. ఈ మూడుతెగలును మొదట రెడ్లుగానుండి తర్వాత ఆచారభేదముల చేతనేమి, రాజకీయద్వేషములచేతనేమి భిన్నులై పరస్పర ద్వేషములను బెంచుకొని తుదకు చేతులార నిమ్మహాసామ్రాజ్యవినాశమునకును, తద్ద్వారాయాంధ్రులదైన్యమునకును కారకు

లైరి. ఈ మటెవాడ సీమయందలి రెడ్లనే మటెవాడ రెడ్లనిరి. వారినే తర్వాత మోటాటిరెడ్లనిరి. ఓరుగంటిరాజులీమోటాటిశాఖవారేయై యుందురు. ఇట్టిరెడ్డివంశమందుద్భవించిన కాకతీయులవంశ మవిచ్ఛిన్నముగా ౧౦౦౦ సంవత్సరముల వరకు నిత్యాభివృద్ధిలో నుండెనని "ప్రతాప చరిత్ర"మను నొక ప్రాచీనవచనచరిత్ర చెప్పుచున్నది. కాని మనకు చారిత్రికాధారము లంతగా కనబడనందున నిశ్చయముగా నిర్ణయింపజాలము.

ఈ కాకతీయులలో మొదట ప్రఖ్యాతివహించి శాసనములందు గాన్పించునట్టివాడు ప్రోలరాజు. ఇతనికాలమునుండి ప్రతాపరుద్రచక్రవర్తికాలమువఱకు మనకు చరిత్రాధారములు కావలసినన్ని దొఱకియున్నవి. ఇంకను దొఱకుచున్నవి.

రుద్రదేవునికాలమువఱకే సామ్రాజ్య మతివిస్తారమయ్యెనని మన యీనగరమందలి సహస్రస్తంభదేవాలయశాసనమే తెలుపుచున్నది.

తూర్పున సముద్రతీరమును, దక్షిణమున శ్రీశైలమును, పశ్చిమమున కటకమును, ఉత్తరమున మాల్యవంతమును నీరుద్రదేవుని రాజ్యమునకు హద్దులయ్యెను. ఈహద్దు లింతటితో నిలువలేదు. ప్రతాపరుద్రుని కాలమునకు దక్షిణమున కాంచీనగరమువరకు నుత్తరమున దేవగిరివరకును వ్యాపించి అంతరించుటకు పూర్వము మహోన్నతదశ నందియుండెను.

ఈఓరుగల్లురాజులకాలమందే ఆంధ్రులు మహాశూరులనియు, గొప్పగా విదేశ వ్యాపారములు జేయువారనియు ప్రసిద్ధికెక్కియుండిరి. గణపతిదేవమహారాజు మోటుపల్లిరేవులో చెక్కించిన శాసనమువలన నానాడు ఓడరేవులందెట్టెట్టి సుంకములు తీసికొనుచుండిరో, సముద్ర వ్యాపార మెంతవిరివిగ సాగినదో విశదమగుచున్నది. ఈసామ్రాజ్య మా కాలమందెట్టి మహోన్నత దశలో విలసిల్లుచుండెనో యూహించికొనుడు.

తొలుత ద్రవిడ కర్ణాట మహారాష్ట్రదేశముల గలుపుకొని చాళుక్య లాంధ్రదేశమును బాలించుచుండిరి. కాలక్రమమున చాళుక్యరాజ్య మంతరించుటచే వారి సేనానాయకులగు కాకతీయులు క్రొత్తగ నొక రాజ్యమును స్థాపించిరి. అదియే కాకతీయ సామ్రాజ్యము. కాకతీయు లాంధ్రులు. ఆంధ్ర భాషాభిమానులు. ఆంధ్ర వ్యక్తిత్వము గల వీరులు. కాననే సమయమెఱింగి క్షాత్రానుగుణముగ సామ్రాజ్య నిర్మాతలైరి. ఆంధ్రదేశ మీసామ్రాజ్య కాలమున శిల్పమునందును దుర్గనిర్మాణమునను, పరిపాలమునను, వాఙ్మయమునను, విజ్ఞానమునను సాటిదేశములకుఁ దలమానికమై పేరొందెను.

కాకతియనుదేవి జైనదేవతయనియు ఆదేవతను బూజించుటచే కాకతీయులు జైనులనియునుఁ గొందఱందురు. కాకతి యన దుర్గ. కాకతీయులు దుర్గోపాసకులని విద్యానాథుఁడు నిర్వచించినాఁడు. ఉపలబ్ధములగు నాధారములకతన కాకతీయవంశము ప్రోలరాజువఱకు జైనమతము నవలంబించెననియు, రుద్రదేవునికాలమునుండి వైదికమతముల నభిమానించి యవలంబించెననియు నెఱుంగవచ్చును. కాకతీయులకాలమున శిల్పము మహోన్నత స్థితికి వచ్చినది. హనుమకొండ, ఓరుగల్లు, రామప్ప, పిల్లలమఱ్ఱి, నాగులపాడు మున్నగుతావుల ఆంధ్రశిల్పము వెల్లివిరిసినది. ఆంధ్ర జాతీయత అందు అనివార్యముగ

బ్రసరించినది. ఆనాటి నాట్యకళలు, లలితకళాభిమానము, పురాణాభిరుచియు శిల్పములలో లగ్నమై దేశమున నభిమానము సంపాదించుకొనెననుట సత్యము. ప్రోలరాజు ఆంధ్రసామ్రాజ్యనిర్మాతగాన నాతని స్మరణము ఆంధ్రచరిత్రవిదులకుఁ బ్రథమ కర్తవ్యము. ప్రోలుని యనంతరము రుద్రదేవుఁడు హనుమకొండలో రత్నసింహాసన మధిష్ఠించి చిరకాలమురాజ్యము పాలించెను. ఈతనికాలమున ఆంధ్రకవులకవితకు మంచిదోహదము లభించెను. ఆంధ్ర సామ్రాజ్యము మహోన్నతికి వచ్చెను. అద్వితీయపరాక్రమశాలియగు రుద్రదేవుని జీవితము ఆంధ్రసామ్రాజ్యవృద్ధికి వినియోగింపఁబడినది. ఈ రుద్రదేవుఁడు తన రాజధానిని అనుమకొండనుండి ఓరుగంటికి మార్చినాఁడు. అది మొదలుకొని కాకతీయసామ్రాజ్యము మహావిస్తృతమై శత్రుజనాభేద్యమై పేరొందినది. అనంతరమురాజైన గణపతిదేవుఁడు ధర్మమూర్తి. ఇతఁడు సముద్రవ్యాపారమునకు మంచి అవకాశములు కలిగించెను. సముద్రమునకుఁ దీసిపోని పాకాల, రామప్ప, లక్కారము, గణపురము తటాకములఁ ద్రవ్వించెను. వీరశైవవాఙ్మయమును మిగుల బెంపొందించెను. అనేకవిధముల ఆంధ్రత్వమును నిలువఁబెట్టెను. ఈతఁడొనరించిన ధర్మములకు మేఱలేదు. తిక్కనసోమయాజికాశ్రయమొసంగి యతని కామితము సఫలమొనరించిన గణపతిదేవుని రసికతకుఁ బ్రమాణము లనవసరములు. ఈయన తనయనంతరము పరిపాలించుటకు గుమారికకు రాజకీయతంత్రముల నేర్పినాఁడు. అతిచతురుఁడగు విశ్వేశ్వర శివదేశికునికడ తనపుత్రికకు విద్యాభ్యాసముచేయించి తన యంతిమదశలో నాయమను రాజ్ఞిగ నొనరించి యాంధ్రసామ్రాజ్యవైభవము కనులజూచినాఁడు.

రుద్రమదేవి చరిత్రము అద్వితీయమైనది. శత్రురాజులు దండెత్తివచ్చినవేళ స్వయముగా స్వారియై యుద్ధముచేసి శత్రువుల నోడించిన దీవీరవనిత. రాజ్యపరిపాలనము చేయుతఱి పురుషవేషముచే సింహాసన మలంకరించి సామంతులను, ప్రజలను, పండితులను, ఆశ్రితులను, ఎవ్వరెవ్వరి నెట్లుమన్నింపవలెనో అట్లు మన్నించి, యందఱ మెప్పువడసి, ఖండ ఖండాంతరములందు తన కీర్తిని నాటి యాంధ్రులకీర్తిని సహితము వ్యాపింప జేసెను. ఇట్టి యామెచరిత్రమును ఆంధ్రులే సరిగా నెఱుగకుండుట యెంతటిశోచనీయస్థితియో యూహించుడు.

ఈ ప్రాంతములన్నియు చాలపవిత్రములైనవి. ఈప్రాంతములందే వీరశైవము తన జయభేరిని మ్రోయించి దక్షిణాపథము నాక్రమించుకొనెను. ఈప్రాంతమందే జైనమతము విజృంభించి శైవ వైష్ణవ ప్రచారముల యొత్తిడిని "యుద్ధతులమధ్య పేదలకుండ దరమె?" అన్నట్లు నిర్వీర్యమై క్షీణించి నశించిపోయెను. ఈప్రాంతమందే పోతనాది మహాకవులు, పండితారాధ్య పాల్కురికిసోమనాథ, బసవరాజాదిపండితులును, మతకర్తలును నివసించియుండిరి.

ఈ ప్రాంతములందే రుద్రాంబ తన పవిత్రప్రజాపాలనము జగద్విఖ్యాతముగా శత్రుభయంకరముగా ప్రజానురంజకముగా జేసెను. ఈరుద్రాంబ యాంధ్రస్త్రీలలో ననేల హిందువులలోనెల్లను విఖ్యాతయైన మహారాణి. ఈయమ నా జన్మస్థానమగు వడ్డెపల్లికి సహితము తనకూతు సంతానకాంక్షిణియై యచ్చటి వినాయకు నారాధింపవచ్చి కొన్నిదివసము లుండెనని చరిత్రకారులు వ్రాసియున్నారు.

కాకతీయసామ్రాజ్యమునఁ దుదిఁవాడు ప్రతాపరుద్రదేవచక్రవర్తి. ఈయన ప్రతిష్ఠాదికములు చెప్పు ప్రతాపరుద్రీయము అద్వితీయమగు అలంకారశాస్త్రము. కాకతీయ రాజులచరిత్రము ఆనాటి రాజ్యపాలనము, ప్రజల విజ్ఞానము ఆంధ్రసామ్రాజ్యవైభవము గ్రహించుటకు అందనేకాధారములుకలవు. ఈయుత్తమగ్రంథమును కాకతీయచరిత్రమునకుఁ బరమ ప్రమాణముగా గ్రహింపవచ్చును.

ఓరుగల్లు రాజ్యచరిత్రము పల్లెవాండ్రు, శారదకాండ్రు పాటలుగా బాడుచున్నారు. స్థానికచరిత్రమున దీనిగూర్చినవివరములు కొన్ని కలవు. కొన్ని కొన్ని కావ్యములలో కాకతీయుల చరిత్రములు వివరింపఁ బడియున్నవి. వీనిని సమన్వయించియు నూతనాధారములు సేకరించియు నొక చరిత్రగ్రంథము ప్రకటించుట యత్యవసరము. ఈకృషి ఆంధ్రేతిహాసపరిశోధక సంఘమువారు ప్రకటింపబోవు కాకతీయసంచికరూపమున సఫలముకాగలదని యాశించుచున్నాఁడ.

కాకతీయ సామ్రాజ్యము మిగుల విశాలమైనది. దీనికి సరిహద్దులు ఆంధ్రదేశమున కావలనున్నవి. దేవగిరి యాదవులు, వెలనాటి చోడులు, పాండ్యులు, హతశేషులగు చాళుక్యులు వీరికి ప్రత్యర్థులుగానుండి పలుతావులఁ దాము కాకతీయులజయించితి మని చెప్పికొనిరి ఆవిజయములు తమవని కాకతీయులు చెప్పుకొనిరి. చరిత్రమునకుఁ గలవరము గూర్చు స్థానిక చరిత్రములు సమన్వయించినగాని యథార్థచరిత్రములు బయలువెడలఁ జాలవు. ఆంధ్రులు నిష్పాక్షిక భావముతో ఆంధ్రసామ్రాజ్యచరిత్రము ప్రకటించుటలోఁ గృతార్థులగుట వారల ప్రథమధర్మము.

కాకతీయులకు సంబంధించిన శాసనము లనేకములు మదరాసుశాసనశోధకశాఖవారు ప్రకటించినారు. హైదరాబాదులోని లక్ష్మణరాయపరిశోధకమండలివారును దొరతనమువారి శాసనపరిశోధకులును విలువగల శాసనములు ప్రచురించుచున్నారు. ప్రజలలోఁ జరిత్రము నెఱుంగుటలోఁ గొంత కొంతయుత్సాహము తలసూపుచున్నది. ఆంధ్రదేశేతిహాససంఘమువారీసుసమయమున ప్రబోధకరమగు పరిశోధనముతో సర్వాంగసంపూర్ణమగు సంచికను బ్రచురింపనెంచుట భావిశుభసూచకము.

ఈ యుద్యమమునెడ నభిమానముజూపి వస్తుప్రదర్శనశాల నీసభాసమయమున నేర్పరచినందులకును, ఈ యుద్యమమున కెంతయో సహాయము గావించినందులకును ఈశాఖవారికి హృదయపూర్వకముగా గృతజ్ఞత దెలుపుకొను చున్నాఁడను.

ఆనాహూతముగా "కాకతీయసభ" ఈ చరిత్రప్రదేశమున నలుప సంకల్పించి దొరతనమువారికడ ననుజ్ఞబొంది సభానిర్వహణమునకు మన నేటి సమావేశమునకును గారకులగు నీపరిశోధకసంఘమునకు కార్యదర్శులైన శ్రీయుత రాళ్ళబండి సుబ్బారావు పంతులు ఎం. ఏ. యల్. టి. గారికిఁ గృతజ్ఞత దెలుపుట నాప్రథమ కర్తవ్యము. వారి తీవ్రకృషివలన చాళుక్య, కళింగ సంచికలవంటి కాకతీయసంచిక అచిరకాలమున. దర్శింపఁ గలుగుదుమని ఆశించుచున్నారము. చరిత్రాధారములతో నిండిన పరిశోధనవ్యాసములతో సంచిక నలంకరించు

పరిశోధకులును మనకృతజ్ఞతకు పాత్రులు.

ఇట్టి మహాసభకు అధ్యక్షులుగా నుండుటకై ప్రొఫెసర్ యస్. హనుమంతరావు ఎం. ఏ., ఎల్. టీ గారిని మేము ప్రార్థింపగా వారు వెంటనే యంగీకరించియున్నారు. వారు నిజాముకాలేజిలో చారిత్రికపండితులు. ఈరాష్ట్రములో వీరికన్న చారిత్రికజ్ఞానముగల్గిన పండితులు అరుదుగా నున్నారు, కావున అట్టి యీప్రొఫెసరుగారిని అధ్యక్షతాపీఠ మలంకరించుటకై మాపక్షమున ప్రార్థించుచు మరల నొకతూరి మీకు మా సంఘముపక్షమున కృతజ్ఞతావందనము లర్పించుచు నింతటితో సెలవు తీసికొనుచున్నాను.

కాకతీయసభాధ్యక్షోపన్యాసము.

పిమ్మట ప్రొఫెసరు సిరిగూరిహనుమంతరావు పంతులు ఎం. ఏ, ఎల్, టి గారధ్యక్షపీఠము నలంకరించి యీక్రిందియుపన్యాసము నొసంగిరి.

సభ్యులారా!

ప్రాచీనమైన ఏకశిలానగరమున నేడు చేయబడుచున్న కాకతీయవర్ధంత్యుత్సవసందర్భమున నన్నధ్యక్షునిగ నియమించినందులకై ఆంధ్రేతిహాసపరిశోధకమండలికి వందనము లర్పించుట నాప్రథమకర్తవ్యమైయున్నది. ఆంధ్రచరిత్రమునందు నాంధ్రవాఙ్మయమునందును నిరుపమానపాండిత్యముగలిగి నేటిసభ కగ్రాసనమలంకరింపనర్హులగు విద్వాంసులనేకులుండ నన్నేల నేటికార్యమున కధ్యక్షునిగనియమించిరో యూహింపజాలకున్నాను. ఆలోచించిచూడగా రాజమహేంద్రవరమున జేయబడుచున్న ఆంధ్రపరిశోధనకును నైజామురాష్ట్రమున నాబోంట్లు కొందఱచే యథాశక్తి జేయబడుచున్నపరిశోధనకార్యమునకు నొకవిధమైనసంబంధ మేర్పరుచుటకు నన్ను నియమించియుందురని తోచుచున్నది. గనుక నేటియుపన్యాసమందు ప్రధానాంశము,ఘనతవహించిన శ్రీనిజాముగారిరాష్ట్రమున దొరతనమువారిచేతను,ఇతరసంస్థలచేతను, పండితులచేతను జరుపబడుచున్న పరిశోధనాక్రమమును నిరూపించుటయైయున్నందులకు క్షమించవలసియున్నది. ఆంధ్రచరిత్రమునకు మనదేశమందుదొరకుమూలాధారములపరిశోధన మిటీవలనారంభింపబడినది. కర్జనుప్రభువుగారిసంస్కరణములను ప్రవేశపెట్టినతరువాత ఇండియాదొరతనమువారు ఆర్షశాఖను సంస్కరించిరి. హిందూదేశచరిత్రమును పరిశోధించుటకు గావలసినసదుపాయములుచేసి, ఆర్షశాఖవలన సేకరింపబడిన సాధనముల నన్నిటినిగైకొనిహిందూదేశచరిత్రమందలి పూర్వమధ్యమయుగములనిర్మాణమున కుపయోగించుటకు విశ్వవిద్యాలయములారంభించి పదునైదువత్సరములైనది. తదుపరి ఇండియాదొరతనమువారిని దృష్టాంతముగగొని ఎందరోదేశీయరాజ్యాధిపతులు తమతమరాష్ట్రములలోను ఆర్షశాఖల నేర్పాటు చేసియున్నారు. 1914 సంవత్సరమున మహాఘనతవహించిన నిజాముప్రభువుగారు దయతో నొక ఆర్షశాఖనేర్పరచి దానికి శ్రీయాజ్‌దానీగారిని డైరెక్టరుగనియమించిరి. 1914 సంవత్సరమునకు బూర్వము నైజామురాష్ట్రమందున్న వివిధప్రాచీనవస్తువులు బొంబాయిఆర్షశాఖాధికారికి లోబడియుండెను. దక్కనుఆర్షశాఖకు హిరిస్రింగుహామిదొరసానిగారును, ఫెర్గుసన్, బర్జెస్, కిఫీత్ దొరగార్లును మార్గదర్శకులయి యున్నారు. 1834 సంవత్సరమునప్రచురిం

పబడిన బొంబాయిగెజటీరు, కీ. శే. నవాబునయ్యదుహుసేను బిల్గ్రామిగారును విల్‌మాటు గారును వ్రాసిన "The Historical and descriptive sketches of the Nizam's Dominions"అను నమూల్యగ్రంథములయందు నైజాము రాష్ట్రమందున్న వివిధప్రాచీనవస్తువులవిషయమై విపులముగ వ్రాయఁబడియున్నది. బొంబాయియందున్న ఇండియాదొరతనపుఆర్షశాఖాధికారియైన కజెన్సుగారు నిజాము రాష్ట్రమందలి ప్రాచీనవస్తుజాతమున కొకపట్టీ తయారుజేసినారు. కజెన్సుగారు బీజాపూరుశిల్పమును గుఱించియు, చాళుక్యశిల్పమునుగుఱించియు రెండుత్తమమైనగ్రంథముల రచించియున్నారు. శ్రీయుతరామకృష్ణకవిగారు నిజాము రాష్ట్రశాసనము లను శీర్షికక్రింద నొకనివేదిక వ్రాసిరి.

ఇరువదవశతాబ్దారంభముతో భాగ్యనగరమం దొక నూతనశక మేర్పడినది. ఆర్షశాఖానిర్మాణ మీనూతన శకచిహ్నములలో నొకటియని చెప్పవచ్చును. నిజాం రాష్ట్రమందంతటను విరివిగగన్పట్టు ప్రాచీనవస్తువులు 'New Stone Age' మొదలుకొని నేటివరకును చరిత్రయందుగన్పట్టు వివిధయుగముల మానవులయొక్కయు, రాజవంశములయొక్కయు వృత్తాంతమును, నాగరికతను ఉన్నతిని తెలుపుచున్నవి. కెయిరన్సు (Cairns) అను సాంకేతికనామములుగల అజ్ఞాతయుగపుసమాధులు నైజాంరాష్ట్రమునందంతటను, ముఖ్యముగ తెలుఁగు జిల్లాలయందును సమృద్ధిగ జూపట్టుచున్నవి. నల్లగొండజిల్లాయందలి రాయగిరి, పాల్వంచ తాలూకాలోని జానంపేట, హైదరాబాదు సమీపముననున్న మాలాలి మొదలగుప్రదేశముల సమాధులు పరిశీలింపదగినవి. ఈసమాధులఁగన్నడుకుండలకును మదరాసుమ్యూజియములోని అదైచెనల్లూరికుండలకును ఎక్కుడుసామ్యము వెల్వడినది. నిజాము రాష్ట్రమునఁజూపట్టు కోయలు, కురుంబలు, బంజారులు మొదలగు ఆదిమజాతివారు కొత్తరాతియుగపునివాసులసంతతివారై యున్నారు. ఆంధ్రపరిశోధకసంఘకార్యదర్శియు నత్యుత్సాహమూర్తియునగు శ్రీయుత సుబ్బారావుగారు పౌనఃపున్యముగ ఆదిమవాసులనుగుఱించి వ్యాసముల వ్రాసి ప్రచురించియున్నారు. ఇంకను జిల్లాలలో నిట్టి పనికత్యంతావకాశముకలదు.

ఇఁక అజ్ఞాతయుగ ప్రశంసవదలి, జ్ఞాతయుగమునందు క్రీస్తుశకమునకుఁబూర్వము 300 సంవత్సరములు, క్రీస్తుకుఁదరువాత 300 సంవత్సరములనాటి చరిత్ర, విజ్ఞానము, నాగరికత మొదలగునవి తెలిసికొనుటకు దక్కను ఎంతవఱకుఁ దోడ్పడుచున్నదో తెలిసికొనవలసియున్నది. రాయచూరుజిల్లా మస్కియొద్ద దొరకినశాసనము మౌర్యులు దండెత్తివచ్చి దక్కనునిమాదపడిరనుయుక్తిని దృఢముచేయుట కుపకరించుచున్నది. అశోకుని శాసనముల నిర్ధారణచేయుటకు సామాన్యముగ "దేవానాంపియ" 'పియదశి' యను ఆతనిబిరుదములే యాధారములు. కాని మస్కీశాసనమందుమాత్ర మశోకుని పేరు వ్రాయఁబడినది. శిథిలమైన హంపికిఁ బశ్చిమమున నిరువదియొక్క మైళ్లదూరమున శ్రీనిజాముగారి సరిహద్దుననున్న కొప్పల్‌కడ రెండుశాసనములు దొరకినవి. ఇవి నైజాము పరిశోధనశాఖచేఁ బ్రచురింపఁబడుచున్నవి. ఈశాసనములును, గుత్తికనతిదూరమునఁ బయల్పడిన కొంతసామగ్రియు దక్కనుపై మౌర్యులు దండెత్తివచ్చిరనుయుక్తిని ధృవపరచుచున్నవి.



పాలంపేట దేవాలయము—శిఖరము.

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.



పాలంపేట దేవాలయము.—ముఖమంటపము.

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.

ఆంధ్రశాతవాహనుల 'పైఠను' "టాగర" అను ముఖ్యమైన రెండుపట్టణములు నిజాము రాష్ట్రములోనివే. పరిశోధనశాఖవారు పైఠనును త్రవ్వుటకు కేంద్రస్థానముగ జేసియున్నారు. ఈరాజవంశమువలన హిందూదేశనాగరికతకేకాక విశాలవిశ్వమానవజాతికికూడ సంక్రమించినసొత్తు అమూల్యమగును. అజంతాఅనుశబ్దమును, అజంతాగుహాలయములును, అజంతా వాస్తుశాస్త్రము, శిల్పనైపుణ్యము, చిత్తరువులువ్రాయువిధానమునుగూడ నిరుపమానములు. ఇటాలియను రినైసాన్సు కాలమువఱకును అజంతాచిత్తరువులబోలిన వెచ్చటను ప్రపంచమందు లేకుండెను. అజంతాగుహ లిరువదితొమ్మిది.కొన్ని అజంతాగుహలు ఆంధ్ర,వాకాటక, పూర్వచాళుక్యుల కాలమునకు దరువాతికాలపునాటివై యున్నవి. మొదటిగుహ జగద్విఖ్యాతమైనది. ఖాతితోఁ చెక్కఁబడిన హిందూదేశములోని ఆలయములలో దీనినిమించిన దేదియు లేదు. ఇటీవల పరిశోధనశాఖవారిచేఁ బ్రచురింపఁబడిన సంచికయందు బోధిసత్త్వ పద్మపాణి యొక్క దివ్యమైనచిత్తరువు. మఱికొన్నినలుబది చిత్తరువులు కన్పట్టుచున్నవి. ఈసంచికకు యాజ్‌దానీగా రత్యుత్తమమై శాస్త్రీయమైన వివరముప్రాసిరి. 1200 సంవత్సరములక్రిందట బౌద్ధప్రపంచమునుండి దీర్ఘప్రయాణములుచేసి రాజకుమారులు, యాత్రావరులును, ప్రధాన యాత్రాస్థలములును విశ్వవిద్యాలయములునగు అజంతాగుహల సందర్శించుటకై వచ్చుచుండెడివారు. కొంతకాల మివి విస్మృతములయ్యును మరల ప్రపంచదృష్టి నాకర్షించుచు నత్యంతాశ్చర్యసంజనకము లగుచున్నవి. ఈ గుహలలో నొక చోట ఆంధ్రవర్ధంతిని జరుపుటసమంజసముకాదా!

మొదటి చాళుక్యులకును కల్యాణిచాళుక్యులకును మధ్యకాలముననున్న రాష్ట్రకూటుల కాలముకూడ దక్కనుయొక్క ఘనతకును, ఉన్నతికిని, నాగరికతకును మిగుల ముఖ్యమైనది. అజంతాగుహల విస్తీర్ణముకంటె ఎల్లోరాగుహల విస్తీర్ణమధికము.ఎల్లోరాగుహలు ఆనాటి బౌద్ధ, జైన, శైవమతము లన్యోన్యముగ వర్ధిల్లెననుటకు ప్రమాణము. ఎల్లోరాశిల్ప మతిదివ్యము. మఱియు నేకశిలానిర్మితమును దేదీప్యమానమునగు కైలాసాలయము ప్రపంచమునకెల్ల నత్యంతవిస్మయముగొల్పు కట్టడములలో నొకటి.ఎల్లోరా గచ్చుగోడలపై వ్రాయఁబడిన చిత్తరువులజంతాచిత్తరువులంత పనితనముకలవికావు. కీ. శే. గోపినాథరావుగారు, బి. సి.భట్టాచార్యులగారు, కృష్ణశాస్త్రిగారు, బి.సి.గంగూలిగారు, టి. జీ. అరవముత్తను మొదలగు పండితుల వ్రాతలమూలమున ఆధునిక కాలమందు ఉత్తరహిందూస్థానమందలి బౌద్ధులయొక్కయు,దక్షిణ హిందూస్థాన బ్రాహ్మణులయొక్కయు విగ్రహశిల్ప శాస్త్రము(Iconography) యందు ప్రజల కత్యంతాదర మేర్పడినది.ఎల్లోరాగుహలలోని విగ్రహములనుగురించి యొక ప్రత్యేకవ్యాసము వ్రాయబడినచో పురాతనకాలపు శైవవిగ్రహములనుగూర్చిన మన జ్ఞానమును వృద్ధిపరచుటకు ఎంతయు తోడ్పడగలదు.

రాష్ట్రకూటులరాజధానియైన మల్‌ఖేడు నైజాంరాష్ట్రమునందున్నది. ఇది త్రవ్వుటకు దగియున్నది. బోధన్ (ఇప్పుడిది నైజామాబాదుకు 14 మైళ్ళదూరమున నిందూరనివ్యవహరింపఁబడుచున్న యొక గ్రామము) రాష్ట్రకూటరాజగు మూడవయింద్రునికి (915—917)రాజ

ధానియై యింద్రపురమని వ్యవహరింపఁబడుచుండెనని కల్యాణిచాళుక్యుల యొకశాసనము వలనఁదెలియుచున్నది.

11, 12 వ శతాబ్దములలోఁజాళుక్యరాజనిర్మితములగు కొన్ని దేవాలయము లానాటి యత్యుత్తమమయిన ఆలయశిల్పచిత్రముల నైపుణ్యమునకు నిదర్శనములై యున్నవి. ఏకశిలా నగరమునకును భాగ్యనగరమునకును మధ్యస్థమైన కొల్లిపాక, దోనకల్లున కనతిదూరమునను న్న గార్ల, వాడికిసమీపముననున్న నాగై, రాయచూరుమండలమునను న్న అలంపూరుమొద లగు ప్రదేశములలోగల్యాణిచాళుక్యులదేవాలయములు శిథిలములై జూపట్టుచున్నవి. ఈ ఆలయములలో గొన్నింటినిరక్షించుటకు దగినయేర్పాట్లుచేయబడినవి. ప్రచురింపబడిన గల్యా ణిచాళుక్యులశాసనములలో మొట్టమొదటిది రెండవజయసింహజగదేకమల్లునిది. ఇది దౌల్తా బాదునుసమీపముననొరకినది. మొదటిసోమేశ్వరునిశాసనములు రెండు(1056,1058A.D.)బోధ నుయొద్దనునాగై యొద్దనుదొరకినవి. ఆరవవిక్రమాదిత్యునిశాసనములు రెండు రాయచూరుజిల్లాము నిరాబాదుయొద్ద సంపాదింపబడినవి. రెండవజగదేకమల్లునిశాసనము నాగై సమీపమునగాన్పించె ను. కల్యాణిచాళుక్యులలో నారవవిక్రమాదిత్యుని రాజ్యకాల మతి దివ్యమైనది. సంస్కృత కవితల్లజుడగు బిల్హణకవి యీతనిచరిత్రమునువ్రాయుదటస్థించుట కడుంగడుప్రశంసార్హము. విక్రమాదిత్యునిరాజధానియై, ఇండియాయొక్క వివిధభాగములనుండి విద్వాంసులనాకర్షించి నట్టి కల్యాణి, నైజాముర్రాష్ట్రములోనిదే. పైనిబేర్కొనబడిన నాగై శాసనములు ఆరవవిక్ర మాదిత్యుని "రామనారాయణ, రాయకంఠీరవ" అను అపూర్వబిరుదములకెంటినివెల్లడిజేయుచు న్నవి. మరియు నాగై శాసనములవలన 252 మందివిద్యార్థులకు భోజన వస్త్ర పుస్తకభాండాగా రాదిసౌకర్యములకై విరాళమొకటియొసంగబడినట్లు తెలియవచ్చుచున్నది.

హైదరాబాదు మ్యూజియమునందు సంగ్రహింపబడి రక్షింపఁబడుచున్న నాణెములు 25000 లకు మించియున్నవి. ఈనాణెములు బహుప్రాచీనకాలముమొదలుకొని నేటికాలమువ ఱకు నుపయోగములోనుండినవి. కొన్ని నాణెములు క్రీస్తుకు పూర్వము రెండవశతాబ్దమునా టివి. అత్యాధునికకాలమునకుసంబంధించియున్నకొన్ని నాణెములు కరీంనగరు(త్రిలింగజిల్లా)లో లభ్యమైనవి. ఈనాణెములకు బూరణములు, లేక కాపాణములనియుపేరు. ఈనాణెములపై చిహ్నములుతప్ప తేదులుగాని పేరులుకానికనబడుటలేదు. చాళుక్యులనాణెములలో గొన్ని పూర్వచాళుక్యరాజగు కుబ్జవిష్ణువర్ధనుని కాలమునాటివి నల్లగొండ జిల్లాయందు సంపాదిం పబడినవి. కల్యాణిచాళుక్యులనాణెము లనేకములు గుల్బర్గా బీరు జిల్లాలనుండి తేబడినవి. వీని లో నొకటిరెండు బంగారునాణెము లారవవిక్రమాదిత్యుని వని(1075—1126A.D.) ఊహిం పబడుచున్నవి.

కాకతీయు లనేక కట్టడములు కట్టియున్నారు. 12 వ శతాబ్దమున బ్రోలరాజుచేనిర్మింప బడిన అనుమకొండదేవాలయము కాకతీయప్రథమస్మారక చిహ్నమని చెప్పవచ్చును. ఇదియిపు డు పడిలముచేయబడినది. వరంగల్లుకోట రెండవది. ఇది కాకతీయకులాబ్ధిచంద్రుడగు గణప

తిదేవునిచే ప్రారంభింపబడెను త్రిలింగమునందంతటను గణపతిదేవునిశాసనములు జూప ట్టుచున్నవి. గణపతిదేవు డనేకదేవాలయముల గట్టించిన విఖ్యాతపురుషుడు. అనుమకొండకు నలుబదిమైళ్ళదూరమునసున్న పాలంపేటదేవాలయము లు మధ్యమయుగహిందూదేవాలయము లలోనగ్రగణ్యములనివర్ణింపఁబడినవి. గణపతిదేవునిచేతను తదనంతరనృపపుంగవులచేతను గట్టిం పబడిన యాలయములు కరీంనగరంజిల్లాలోని ఉప్పరపల్లె, నగునూరు, మంథెన, నల్లగొండజి ల్లాలోని పిల్లలమఱ్ఱి, నాగులపాడు, త్రిలింగయందంతటను, ముఖ్యముగ నల్లగొండజిల్లాలోని పానగల్లు, రాజకొండ ఈమొదలగు స్థలములదృశ్యములు ఈయాలయములశిల్పనైపుణ్యముమిగు ల కొనియాడదగినది. పిల్లలమఱ్ఱిదేవాలయమున యాజ్ దానీగారు కనిపెట్టిన గచ్చు గోడపైని మూడుచిత్తరువులలోనొకటి శేషరజ్జువుతోను, మంథరగిరిమంథనదండముతోను దేవాసురులు సముద్రమథనము చేయుచున్నట్లు ప్రదర్శించుచున్నది.

గణపతిదేవుఁడుజగద్విఖ్యాతములగు దేవాలయములగట్టించుటయగాక దివ్యతటాకముల ద్రవ్వించెను. ఈతటాకములన్నియు తరువాతియేలికలచే మరమ్మత్తు చేయింపఁ బడుచువ చ్చెను. రామప్ప తటాకము పేర్కొనఁదగినది. ఇది ఎనిమిదిచదరపుమైళ్ళ విస్తీర్ణముకలది. దీనికొకవంక అత్యున్నతమైనకట్టకలదు. పాకాలతటాక మనదృశమని చెప్పవచ్చును. దీనివిస్తీ ర్ణము 13 చదరపుమైళ్లు.

కాకతీయులు తమరాజ్యమందంతటను గిరిదుర్గములు కట్టించిరి. ఈగిరిదుర్గములు కాకతీ యులయుగమునను, భామినీకుతుబుషాహీల కాలమునను కడుప్రాముఖ్యత నొందెను. గోలు కొండ ఏకశిలాగిరిదుర్గములలో నొకటి. మఱియు కాకతీయచిహ్నమగు రెండుతలలగండభే రుండపక్షి రెండేనుఁగుల ముక్కున గఱచుకొని బాలాహిస్సారునందు దర్బారుహాలుకెదుట నున్న హిందూదేవాలయముయొక్క గోడపై నేటికిని స్పష్టముగానుండుట కడుచోద్యము. తెలగందలయను తెలుఁగుకవికి వాసస్థానమయిన కరీంనగరుజిల్లాలోని ఏల్గందల్, భోనగిరి, రాచకొండ, నల్లగొండ, పానగల్లు మొదలయినవి త్రిలింగయందలి మధ్యమయుగపు గిరిదు ర్గములలోకొన్ని. ఇవిశిథిలములుకాకుండుటకై తగుప్రయత్నములుచేయబడినవి. కాకతీయశాసన ములు ప్రచురింపబడినవి. వీనిలో నొకదానియందు తేదివేయలేదు. గణపతిదేవునివఱకు కాక తీయవంశావళిమాత్రము కన్పట్టుచున్నది. 1213 సం॥ నాటిపాలంపేటశాసనము కాకతీయచరిత్ర మందు ప్రాముఖ్యతను వహించిన రేచర్లసామంతరాజవంశావళియొక్క ఘనతను తెలుపుచు న్నది. 1236 సం॥ ఉప్పరపల్లిశాసనము గణపతిదేవుని ఉత్తరదిగ్విజయములను వివరించుచున్న ది. పిల్లలమఱ్ఱి నాగులపాడు గ్రామములయందలి గణపతిదేవునిశాసనములనుగుఱించి సంక్షే పముగ శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారి యాంధ్రచరిత్రమున వ్రాయబడియున్నది. ఈశాసన ములు చక్కగఁ బరిశీలింపబడి ప్రచురణమునకు నిపుణులగుపండితులకుఁ బంపఁబడుచున్నవి. ఈశాసనములు రేచర్ల రెడ్డివంశముయొక్క ప్రాముఖ్యతను వెల్లడిచేయుచున్నవి.

రుద్రాంబకాలమున 1273 లిఖింపబడిన శాసనమొకటి నేను ప్రచురించియుంటిని. దీనియందు విద్యాలవంశమను క్రొత్త సామంతరాజవంశము వర్ణింపబడియున్నది.

ఆంధ్రచరిత్రపరిశోధకసంఘ ప్రధానకార్యస్థానమయిన రాజమహేంద్రవరములో నొక ప్రాముఖ్యమైన మస్జీదు బహిర్ద్వారముపై నొక పర్షియనుశాసనముకలదు. దీనిని మొట్టమొదట యాజ్దానీగారు ఎపిగ్రాఫికాఇండోమానికాలో ప్రచురించిరి. ఈశాసనము వలన 1324 A.D లో నీమస్జిదును ఘియాజుద్దీను తుగ్లకుగారిసేనానాయకుఁడయిన ఉలుఘ్ ఖానుగారు కట్టించిరని స్పష్టమగుచున్నది. ఘియాజుద్దీను తుగ్లకుగారు 1324 సం॥రమున నేకశిలానగరమును స్వాధీనముచేసికొనిరి.

ఏకశిలానగరపతనానంతరము తుంగభద్రానదీతీరమున విజయనగరరాజుల వంశమొకటి క్రొత్తది స్థాపింపబడెను. విజయనగరసామ్రాజ్యమునకు బూర్వము ఆనెగొంది యొక ప్రాచీన హిందూరాజ్యమై యుండెను. ప్రస్తుతము ఆనెగొంది శ్రీనిజాముగారి సామంతరాష్ట్రములలో నొకటి. ఆనగొందియం దనేకప్రాతదేవాలయములను, గచ్చుగోడలపై నేత్రపర్వమొనర్చు చిత్రములను గనిపెట్టుచున్నారు.

సితాబ్ ఖాను పదునేనవ శతాబ్దాంతమున బహామనులపరిపాలనలోనున్న ఏకశిలానగరమునకు రాజప్రతినిధిగనుండెను. ఇతడు వరంగల్లు కోటయం దొక దర్బారుహాలుకట్టించెను. ఈహాలు పదిలముచేయబడినది. సితాబ్ ఖానుయొక్క శాసనమొకటి కీ. శే. కే. వీ లక్ష్మణరావుగారిచే విపులోపోద్ఘాతముతో బ్రచురింపబడి ప్రకృతము పరిశోధనశాఖవారిచేప్రకటింపబడు చున్నది.

గోలుకొండ కుతుబుషాహీ రాజులలో నొకడు ఆంధ్రులకు ప్రధానపోషకుడయ్యెను. అద్దంకిగంగాధరకవిని, పొన్నగంటితెలగనార్యుని ఇతడుపోషించెను. ఇతఁడుచిరకాలము విజయనగరవాసియగుటచేతను, ఆంధ్రసామంతుల సాహాయ్యమున సింహాసనమునధిష్ఠించిన వాడగుటచేతను ముఖ్యముగ నాంధ్రులీతని యనుగ్రహమునువడసిరి. మహబూబునగరుజిల్లాలోని కొల్లకొండ ఆంధ్రులచే నధిష్ఠింపబడిన దుర్భేద్యదుర్గమైయుండినది. కుతుబుషాహీకు ఆంధ్రులు మిగుల దోడ్పడి నట్లొకశాసనమువలన తేటపడుచున్నది.

భక్తాగ్రేసరుడగురామదాసుచరిత మాంధ్రులకందర కును విశదమేకదా! గోలుకొండ దుర్గముపై గుహయొకటి రామదాసుకారాగారస్థానమనిచూపబడుచున్నది.

ఈపై ప్రసంగమువలన తేలినసారాంశమేమనగా హైదాబాదుగవర్నమెంటు ఆర్కశాఖవారిచే రక్షణము (Conservation) శాసనపరిశోధనము, (Epigraphy) నాణెములపరీక్షణ (Numismatics) మొదలగువివిధఆర్కశాఖారూపముల చేయబడినకృషి దక్కచరిత్రనిర్మాణమునకు ముఖ్యమనుట. ఇట్టిసమాచారములు ఆర్కశాఖవారి పోటోలయందునునివేదికయందును మఱుగుపడియుండవలసినదేకాని ప్రజలకు వానిచదివితెలిసికొనునంతటి యవకాశముకానిశ్రద్ధకానిలేకుండుట విచారకరమైన సంగతి. పురాతనవస్తువులయందు ప్రజలకభిరుచిపుట్టించుటకు శోధకసంఘమునకు దోడు మ్యూజియమొకటి దాని సిటీవల హైదాబాదులో మంచిసాధనసామగ్రితో శ్రీనివాసముగారు స్థాపించిరి. దీనియందు అమరావతినుండి తెప్పించిన సుందరమైన 37విగ్రహములును, మెదకుజిల్లా పటంచేరునుండి తెప్పించిన 10- 14 అడుగులయెత్తైనజైనవిగ్రహములు విశేషముగ త్రిలింగనుండి తెప్పించిన హిందూశైవ వైష్ణవవిగ్రహము



ఇత్తగిదేవాలయ శిఖరము.

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.

286 B



ఇత్తగిదేవాలయము—స్తంభములు.

By Courtesy of H. E. H. The Nizam's Archaeological Department.

లును, చాళుక్యులయొక్కయు కాకతీయులయొక్కయు శిలాశాసనములును అజాంతాఎల్లోరా చిత్తరువులున్ను తాటియాకు గ్రంథములును ఇట్లువిచిత్రమై ప్రాచీనచరిత్రాధారములగువస్తుజాలము సందర్శింపబడుచున్నది.

దొరతనమువారుఎంతద్రవ్యము వ్యయముచేసినను,ఎంతపరిశోధకసామగ్రిసంపాదించినను పరిశోధన సంపూర్ణముగజరుగవలెనన్న విద్వత్సంస్థలయొక్కయు ఇతరవిద్వాంసులయొక్కయు సాహాయ్యమత్యవసరము. పూనాభండార్‌కర్ ఇన్‌స్టిట్యూటు, బెంగుళూరు మిథికసొసైటి, రాజమహేంద్రవరమండలి యాంధ్రపరిశోధకసంఘము ఇట్టివి జనులయొక్కచరిత్రవృద్ధికి మిగుల దోడ్పడినవి. దాదాపు పదిసంవత్సరముల క్రిందట నైజాంరాష్ట్రాంధ్రుల కొక పరిశోధకసంఘముస్థాపించిన శ్రీయుత మునగాలరాజాగారికి నితరనిజాంరాష్ట్రాంధ్రప్రముఖులకును వందనశతములు.ఈఆంధ్రఆర్షశాఖాస్థానము హైద్రాబాదునందలి శ్రీకృష్ణ దేవరాయాంధ్రభాషానిలయమే. కృష్ణదేవరాయాంధ్రభాషానిలయము స్థాపింపబడి ముప్పదిసంవత్సరములయినవి. దీనియందు 4000 గ్రంథములేర్పడినవి. ఈ భాషానిలయము భాగ్యనగర నివాసులగు ఆంధ్రులప్రజ్ఞావిశేషమునకును అత్యుద్ధతికిని మిగులదోడ్పడుచున్నది. ఈపరిశోధకసంఘపక్షమున సుప్రసిద్ధపండితులయిన శేషాద్రిరమణకవు లపుడపుడు జిల్లాలయందుఁ బర్యటనముచేసి, ప్రాచీనలిఖితగ్రంథముల సంపాదించియు, శాసనములకుఁబ్రతిబింబములదీసియు,యీ ఆంధ్రపరిశోధకసంఘమునకుజేసిన మహోపకారము చిరస్మరణీయము. ఈయాంధ్రపరిశోధకసంఘముకై సంపాదింపఁబడిన యమూల్యతాళపత్రగంథములు, కయిఫియ్యతులు, నాటికాలవుచరిత్రలు, శాసనప్రతిశింబములు మొదలగునవి యీభాషానిలయమున సంరక్షింపబడుచున్నవి. శాసనబింబములకు ప్రతులువ్రాసి స్థానికపత్రికలలో సంగ్రహముగ బ్రచురించి యున్నారు. మదరాసువిశ్వవిద్యాలయముననుండి కాకతీయచరిత్రపరిశోధించినవిద్యార్థియగు శ్రీమారేమండరామారావుగారు కాకతీయశాసనములను గురించి యొకనివేదికనువ్రాసిరి. మఱియు నిజామురాష్ట్రాంధ్రి పరిశోధనసంఘముచే సేకరింపబడిన శాసనప్రతిబింబములకు నకళ్ళు వ్రాసియు పని పూర్తిచేసినారు. ఈప్రతులారితేరిన పండితులకు సవరణనిమిత్తము పంపబడుచున్నవి. రామారావుగారి పరిశోధనకార్య మాంధ్రపరిశోధకసంఘసంచికలయందుఁ గన్పట్టుచున్నది. ఇంతకు బూర్వమాంధ్రపరిశోధకసంఘకార్యదర్శిగనుండినశ్రీయుత బి. వి. కృష్ణారావుగారు మాశాసనమొకటి తెప్పించుకొని భారతియందు బ్రచురించిరి. శ్రీ శేషాద్రిరమణకవులు స్వానుభవమునను ఎఫిగ్రాఫికురికార్డుల యాధారమునను వ్యాసములుప్రచురించియున్నారు.

నిజామురాష్ట్రాంధ్ర పండితులలో కీ. శే. కే. వీ. లక్ష్మణరావుగారు గొప్పమార్గదర్శకులు. వీరి యకాలమరణముపలన నాంధ్రదేశమునకు వచింపరాని నష్టము సంభవించినది. వీరాంధ్రచరిత్రపరిశోధనారూపమున నాంధ్రులకుజేసిన యమూల్యసేవాచిహ్నముగ మాపరిశోధకసంఘము లక్ష్మణరావు గారిపేరవ్యవహరింప బడుచున్నది.

హైద్రాబాదునగరమున రెడ్డివిద్యాలయమువారు ప్రాచీనవస్తుసంపాదన చేసి కాపాడుచున్నారు. వీరియుద్యమము కొనియాడదగినది. కాకతీయులకాలముననున్న రెడ్డిప్రభువుల సత్సాం

ప్రదాయములు, వారిమహాభాగ్యము, వారితేజస్విత, వారిధార్మికత్వాది గుణములు భాగ్యనగర నివాసులగు రెడ్డిదొరలయందు మూర్తీభవించినవి. భాగ్యనగరపుపోలీసుకమీషనరుగారును, నేటి ఆహ్వానసంఘాధ్యక్షులగు శ్రీయుత వేంకటరామారెడ్డిగారును మొదలగు రెడ్డిప్రముఖులు కడుంగడు వంద్యులు. హైదాబాదునందొకపెద్దహాలును గట్టించి అందొకపుస్తకభాండాగారమే ర్పరచిరి సుప్రసిద్ధమంత్రిపుంగవులగు అక్కన్న మాదన్నల పటములును, గద్వాలసంస్థానము వారిచేనొసగఁబడిన సచిత్రమహాభారతపర్వమొకటియు, పూర్వకాలమునఁజేతివ్రాతయందు లిఖింపబడి నైపుణ్యమునుచాటు కొన్నివ్రాతప్రతులును రెడ్డివిద్యాలయమునగలవు. అవిమిగుల సందర్శనీయములు. హైద్రాబాదుమ్యూజియమునందు పూర్వుల ఁజేతివ్రాతయందలికౌశల మును బ్రకటించునవియు, కుతుబుషాహీలకాలమున శిలాఫలకములపై వ్రాయబడినవియు నగు శాసనములు, చేతితోవ్రాయఁబడిన కురాను షామొదలగునవియు చూడఁదగినవి.

భాగ్యనగరవాస్తవ్యుడును, యూనాని వైద్యుఁడునగు మహమ్మద్ కాసిముగారి స్వాధీనమున కన్నడభాషలోవ్రాయఁబడి యనేకవిషయములతో నిండిన తాళపత్ర గ్రంథము లుకలవు. పరిశోధింపబడనందున నీగ్రంథముల ప్రాముఖ్యత బయల్పడలేదు. ఇవి మొత్తముపై కన్నడములో వ్రాయబడియుండుటచేతను కన్నడజిల్లాలలో వీరశైవమతము సర్వజనాదరణీయ మగుటచేతను ఈగ్రంథములు వీరశైవమత గ్రంథములని తోచుచున్నవి. నైజాముదొరతనము వారీగ్రంథములను కొనుటకు సంసిద్ధులై యున్నను డాక్టరుగారిష్టపడుటలేదు. ఈహేతువువలన నీగ్రంథములన్నియు గూఢనిక్షేపమనదగును.

విశేషముగ నిట్టి నిక్షేపములు నైజామురాష్ట్రములోని జాగీరుదారులయొక్కయు, ఇత రప్రభువులయొక్కయు, స్వాధీనముననున్నవి. యుద్ధారంభమునకు ఁబూర్వము జర్మనీసామ్రా జ్యమందెంతప్రాముఖ్యతగలజమీందారీలుండెడివో అట్టి ప్రాధాన్యతగల గద్వాల, వనపర్తి, పా ల్వంచ, పాపన్నపేట మొదలగుసంస్థానములు మననైజాముర్రాష్ట్రముననున్నవి. ఈసంస్థానాధిప తులందఱు విద్వాంసులును ప్రభావంతులై తమతమ పూర్వసాంప్రదాయములను, సౌజన్యమును ఘనతను దెలిసికొనుటకు నాభిలాషులై యున్నారు. ఈజాగీరుదారులు మొదలగువారు తమ స్వాధీనమందున్న అమూల్యములగు రికార్డులను లిఖితగ్రంథములను (ఇవిప్రచురింపఁబడినచో దమకును రాష్ట్రమునకును బ్రత్యవాయములేనిచో) పబ్లికు లైబ్రరీలకును మ్యూజియములకు నెరువిచ్చిన గొప్పపండితులచే నవిపరిశోధింపబడుటకు వీలగునని యూహించుటకు నేనుసాహసింప వచ్చునా? ప్రాతరికార్డులు ప్రచురించుటవలన చరిత్రకు గొప్ప ఆధారములు బయలు పడగలవు. బొంబాయిదొరతనమువారు మదరాసుగవర్నమెంటువారి కార్యాలయములయందలి రికార్డు లను, ఇటీవల పీష్వాలకార్యాలయములలోని రికార్డులను ప్రచురించుటవలన చరిత్రమునకమూ ల్యములయినయాధారములనేకములుదొరకినవి. కుతుబుషాహానృపాలుని అమాత్యులయినఅక్క న్నమాదన్నలను గుఱించి దొరకినయాధారములన్నియు మదరాసురికార్డులలోనుండియేబయల్వె డలినవి. మదరాసు దొరతనమువారిచే బ్రకటింపబడిన ఆనందరంగపిళ్ళైగారిదినచర్యగ్రంథము 12 సంపుటములకు గౌరవముప్రాధాన్యముచేకూరినది. దేశీయరాజులు బ్రిటిషిండియాదొ

రతనము వారును ఇతరప్రభువులును ప్రాచీనస్మారకచిహ్నములను సంరక్షించుటకు ద్రవ్యమును విపులముగ వ్యయపరచిచేయు వివిధప్రయత్నములకు పండితబృందము సాహాయ్యమొసర్చినగాని శీఘ్రముగ జ్ఞానాభివృద్ధి కానేరదు. ఆంధ్రదేశమున చరిత్రపరిశోధనకు ప్రథమభిక్షపెట్టిన శ్రీయుత చిలుకూరి వీరభద్రరావుగారు కీ. శే. కే. వీ. లక్ష్మణరావుగార్ల ప్రజ్ఞ సర్వతోముఖమని చెప్పవచ్చును. వీరిరువదవశతాబ్దమునాటి యాంధ్రులవికాసమునకును అభ్యుదయమునకును మిగుల దోడ్పడిరి. ఆంధ్రార్షశాఖాధ్యక్షులయిన శ్రీ జయంతి రామయ్యపంతులుగారు ఉద్యోగకాలమంతయు చేసిన భాషాసేవ అనన్యసామాన్యము. ఉద్యోగమునుండి విరమించినదాదిగ రామయ్యపంతులుగారు ముక్తేశ్వరమున నొక యాశ్రమమునం బ్రశాంతముగం గూర్చొని ఆంధ్రపరిశోధన కార్యమునకై తమయాసచ్ఛక్తిని వినియోగించు చున్నారు. నేటియువకుల కీమువ్వురు పండితులును గొప్ప యాదర్శకపురుషులును బ్రోత్సాహకులు నైయున్నారు. నైజాముకాలేజి నుండియు, ఉస్మానియా విశ్వవిద్యాలయము నుండియుం బట్టభద్రులైనవారిలోం బరిశోధక శాఖయందుం బనిచేయుచున్న యేనొలదిమంది పట్టభద్రులోతప్ప ఇతరులెవ్వరును స్వతంత్రమైన పరిశోధనచేసినట్లు వినము. శాసనములం బరిశోధించుటకేమి, వాఙ్మయాధారముల విమర్శించుటకేమి, దేశభాషలయందు సంపూర్ణప్రజ్ఞాతిశయ మత్యవసరమైయున్నది. సంస్కృత కన్నడ మహారాష్ట్రాది భాషాజ్ఞానము సమగ్రముగ లేనిచో మూలాధారముల ననుసరించి దక్కనుచరిత్రమందలి ఘనతను, నాగరికతను వివరించుటకు వీలుపడదు. ఈహేతువువలననే ఉస్మానియా విశ్వవిద్యాలయాధికారులు దేశభాషలయందు సంపూర్ణ పాండిత్యమును సంపాదించుటకు విద్యార్థివేతనముల నేర్పఱచియున్నారు. ఇట్టివిద్యార్థు లచిరకాలమున స్వయముగ పరిశోధననుజేయ సమర్థులు కాగలరు.

సభ్యులారా! నాఉపన్యాసము ముగియనున్నది. చరిత్రవలన మనము గ్రహించునదేమనగా మన సాంప్రదాయములు, మనఘనత, మనసైతికదృష్టి, మనసంస్థలు మనపూర్వులవలన మనకెట్లు సంక్రమించెనో అట్లే మనసంతతివారి సాంప్రదాయములకు, వారిఘనతకు, వారిసైతికప్రవర్తనకును మనము బాధ్యులము కాగలము. ఏదేశీయులైనను, ఏజాతివారైనను, దమపూర్వసంస్కారములను బూర్తిగ దుడిచివేయఁజాలరనుట నిర్వివాదాంశము. అయితే మనపూర్వులవలన మనకు సంక్రమించిన సంస్కారములయందు లోపములున్నచో ఆలోపములదూరీకరించి నీరక్షీరన్యాయమున మనపూర్వుల సత్సాంప్రదాయములను, సద్గుణములనే మనముగ్రహింపవలసి యున్నది. పరమతద్వేషము చూపని నాగరికతలే చిరకాలస్థాయులుగ నుండగల్గినవి. చరిత్రము నింద్యప్రచారముకాదు. ఇదిమనకు విదితమే. చరిత్రమునుపరిశీలించువానియొక్కదృష్టి ననుసరించి చరిత్రమ యొక్క ప్రయోజనములే మారుచుండును. సాంఘికవాదియగువాడు చరిత్రమునొకదృష్టిచేఁ బరిశీలించును. అయితే ఉభయులదృష్టులును సరియైనవే యని వారిరువురయభిప్రాయము కనుక ప్రపంచముయొక్క యోగక్షేమ మభిలషించు మనకందఱకును చరిత్రమునకు ఉత్కృష్టప్రయోజనము కల్పింప వలసిన భారము కలదు. ప్రతిమనుజుడును పూర్వాయాతమైన తనసాంప్రదాయములను, తనఘనతను స్మరించుకొని ఎట్లు గర్విం

చునో అట్లే తనపొరుగు వారియొక్కయు, ఇతరమానవులయొక్కయు, ఇతరజాతీయులయొక్కయు ప్రాచీనసాంప్రదాయములను ఘనతను విన్నంతమాత్రమున నుప్పొంగిన శరీరముతో నతడు గర్వపడవలసియున్నది. మనకుటీరములో ముక్కుమూసికొని కూర్చుండి మనపొరుగువాని నమ్మక, స్వార్థపరులమై యుండుకాలము మాఱినది. సర్వప్రపంచమునకును అపూర్వమైన ఐక్యత ఏర్పడినది. కనుక మానవునకు సంక్రమించినప్రాచీనాదర్శములు సార్వజనీనములనియు సర్వజనోద్రేకసంజనకములనియు చాటుచు, విశాలదృష్టినిం బ్రసాదించునంశములు చరిత్రమందుకలవో ఆయంశములే మనకు పునః పునః సంస్మరణీయములని నాయభిప్రాయము.

అధ్యక్షోపన్యాసము ముగిసినపిమ్మట శ్రీదూపాటి రమణాచార్యులవారికిని ది స్వాగత పద్యములను చదివిరి.

ఓం.

కాకతీయ సభా స్వాగత పద్యములు.

ఉ॥ స్వాగత మాంధ్రులార! భుజశక్తిధురంధరకాకతీయరా
ట్ప్రిగనవద్యకీర్తి విభవప్రకటీకృత మోదబాష్పధా
రాగమనేత్రులార ! మహితైక శిలాసగరీ మహోత్సవా
ధ్యాగతులార ! మీ కిదియ స్వాగత మిద్ది పరిగ్రహింపరే ॥

సీ॥ ప్రసరించె నీవీటి ప్రస్తరాంచలముల జినదేవతాంకమా శిల్పలక్ష్మి
కాలె నీవీటిదుర్గద్వారములనుండి కాకతీయనృపాలకౌశలంబు
అలరె నీవీటి మహాసభాముఖమున కనువివిద్యానాథు సూక్తిసుధలు
తనరె నిచ్చటిమహిధరసానువులపయి ఆంధ్రజాతీయధ్వజాదికంబు

తే.గీ॥ ఇది త్రిలింగమహారాజ్యపదవి, యిదియ విస్మృతాంధ్రిమహారాజ్యవీరభూమి,
ఇదియ యానాటియోరుగ, ల్లిచ్చు మీకు స్వాగతం బందుకొనుఁడు మహాంధ్రులార॥

సీ॥ పాడైన యీకోటగోడలలో నెందుఁ గనుమొఱంగినదో మాకాకతమ్మ
భూగర్భమున నెందుఁబూడిపోయెనో దేశమేలినతల్లి మాయేకవీర
అవతార మెట విడనాడెనో కాకతి భూమికల్పము స్వయంభూవిభుండు
ఏమయ్యెనో దేశహితమెంచి యవతారధారియైచనిన మైలారువిభుఁడు

తే.గీ॥ పూర్వవిఖ్యాతిచిహ్నముల్ భూమిగతము లగుట నెచ్చటడాఁగెనో యాంధ్రిమాత
శిథిలములఁగాంచి తెలియఁగాఁక్షించు సోద ! రాంధ్రిమణులార ! మీకుసుస్వాగతంబు

సీ॥ నవలక్షధానుష్కనాథులు మండలాగ్రణులెత్తి రాజమార్గములనడువ
కవిగృహాంగణములు కావ్యగీతములచే మాపుటేఁ పొడతేర మాఱుమ్రోయ

రత్నసింహాసనాగ్రమున రుద్రమదేవి వసియించి విక్రమపటిమ నెఱప
ఆకాశమొఱయుచు నాంధ్రసామ్రాజ్యపతాకిక లింటింటఁ దాండవింప
తే గీ॥ మణిగణాలంకృతమనోజ్ఞమదగజాధి । రోహియై కాకతీకుమారరుద్రదేవ
చక్రవర్తి చరించు నీస్థలమహత్త్వ । మరయు బుధులార మీకుసుస్వాగతంబు॥
సీ॥ కనుమాయలేదింకఁ గాకతీయనృపాల శేఖరకల్పిత శిల్పలక్ష్మి
మఱపురాలేదింక మహితవిద్యానాథ కవిరాజగంభీర కావ్యగీతి
చెదరలేదింక లక్ష్మీభారతీవిలా సాకరద్వార బంధాదికంబు
తరుగలేదింక నుద్యచ్ఛిలాప్రాకార కల్పితదుర్గవర్గప్రశస్తి
తే.గీ॥ కలదు ప్రత్యణువున నిటఁ గాకతీయ । రాజకోటీరమణిఘృణీ రక్త రేఖ
కనుఁగొనుం డాంధ్రసామ్రాజ్యగౌరవంబు । ఆంధ్రమణులార! మీకు సుస్వాగతంబు.

పిమ్మట మండలి కార్యదర్శిగారు హైకోర్టుజడ్జి రాజా గిరిరావు బహదూర్, రెసిడెంటుగారి కార్యదర్శి, రావుబహదర్ డాక్టరు ఎస్. కృష్ణస్వామి అయ్యంగారు, బారిస్టరు రామచంద్రనాయక్, రావుసాహెబ్ గిడుగురామమూర్తిపంతులు, రాయబహదర్ పండిత హీరాలాల్ బి. ఏ, గొర్తి వెంకటరావు ఎం. ఏ. ఎల్. ఎల్. బి, రాయబహదర్ ప్రొఫెసర్ కిబె ఎం. ఎ, సర్ ఎ. పి. ప్రాత్, జయంతిరామయ్యపంతులు బి. ఏ. బి. ఎల్, ప్రొఫెసరు పొత్దార్, సయ్యిద్ కుర్షీద్ఆలీ బి. ఎ, జేరయ్స్రాట్కె ఏం. ఎ, డీ. డీ. డాక్టరు బురాశేషగిరిరావు, న్యాయపతి కామేశ్వరరావు. బి. ఏ, బి. ఎల్, మల్లంపల్లిసోమశేఖరశర్మగార్లు సభకు రాజాలనందుకు చింతించుచు కార్యక్రమము జయప్రదముగ గొనసాగుగాకయని యాశీర్వదించుచు బంపిన లేఖలను జదివిరి. ఇంతటితో నాటియుదయము సభముగిసినది.

చారిత్రక వస్తుప్రదర్శనము.

సాయంకాలము 4 గంటలకు తిరిగి ప్రతినిధులును ప్రేక్షకులును ఉస్మానియాకళాశాలలో సమావేశమైరి. అందు మూడుగదులలో చక్కని చారిత్రకవస్తుప్రదర్శన మొకటి నిర్మింపబడినది. ప్రదర్శన మీక్రిందివిధమున నేర్పరుపబడినది—

i నైజాంప్రభుత్వార్షశాఖ—ఫోటోలు

1. శిథిలాలయము—పాలంపేట
2. పెద్దదేవళము— డిటో
3. మరియొకయాలయము.
4 కరీంనగర దేవాలయము
5. నాగులపాడు ముకుందదేవాలయ ద్వారము
6. సహస్రస్తంభ దేవాలయ ద్వారము హనుమకొండ
7. డిటో డిటో శిల్పములు
8. రామప్ప దేవాలయ ద్వారము
9. సూర్యాపేటదేవాలయము
10. ఉప్పరపల్లి దేవాలయము
11. రామప్పగుడి—నర్తకీవిగ్రహము
12. పంచమహాశివాలయస్తంభము—పానగల్లు
13. శివాలయము— డిటో
14. స్తంభములపై శిల్పములు—రామప్ప
15. డిటో —హనుమకొండ
16. గణపతివిగ్రహశిల్పము—పానగల్లు
17. శితాబ్ఖాన్ కచేరి—వరంగల్లు
18. దేవాలయద్వారము.—డిటో
19. దుర్గద్వారము—డిటో

బొమ్మలుగల కార్డులు

1. గుహలు, చిత్రములు—అజాంతా
2. డిటో —ఎల్లోరా,
3. దౌలతాబాదుదుర్గము

అర్షశాఖాప్రకటనలు

1. అశోకశాసనము—సూస్కీ
2. జగదేకమల్లుని దౌలతా బాదుశాసనము
3. పాలంపేట, ఉప్పరపల్లి కాకతీయశాసనములు
4. కాకతీయగణపతిదేవుని పాఖాలశాసనము
5. త్రిభువనమల్లుని మునిరాబాదు శాసనము
6. కాకతిరుద్రాంబ కోటగిరితామ్రశాసనము
7. త్రైలోక్యమల్లుని బోధాశాసనము
8. నాగై శాసనము
9. సాంవత్సరికనివేదికలు 1325—1338. ఫసలీలు

తామ్రశాసనములు.

1. కోటగిరితామ్రశాసనము

నాణెములు.

30. పశ్చిమచాళుక్యనాణెములు.

ii లక్ష్మణరాయపరిశోధక మండలి, హైదరాబాదు—

లిఖితగ్రంథములు.

1. యాదగిరినరసింహశతకము
2. నిరోష్ఠ్యసీతాకల్యాణము
3. ధంసాచరిత్రము
4. హైదరాబాదుకైఫీయతు
5. ప్రతాపరుద్ర చరిత్ర
6. రామదాసుచరిత్ర(పర్షియన్)
7. భువనగిరి చరిత్ర(ఉర్దు)
8. చరిగొండ కైఫీయతు
9. బ్రహ్మకైవర్తము

తాళపత్ర గ్రంథములు.

1. ధనంజయవిజయవ్యాయోగము
2. బ్రహ్మోత్తరఖండము
3. రామాయణచంపు
4. శాలివాహనసప్తశతి
5. పావులూరి గణితము
6. అశ్వలక్షణసారము
7. తాళాంక నందినీపరిణయము
8. కొల్లిపాక మాహాత్మ్యము
9. శతారివైభవము
10. నారాయణ శతకము
11. ప్రభు లింగలీల
12. బసవపురాణము
13. సస్యా నందము
14. శివయోగసారము
15. కచ్ఛపుట తంత్రము
16. భైరవతంత్రము
17. శాల్మలీకందనందనవిలాసము
18. శ్రీకృష్ణశతానందీయము
19. అధ్యాత్మరామాయణము
20. అనంగ మంగళము
21. బ్రహ్మవైవర్తము
22. కవిగజాంకుశము
23. సూరినాథనందన విలాసము
24. బిలువపడిగరేని పేరణము
25. మధురవాణీవిలాసము
26. నలచరిత్ర
27. లక్షణా పరిణయము
28. సీతా వివాహము



కాకతీయవర్ధంత్యుత్సవ చారిత్రిక వస్తుప్రదర్శనము—స్థానికశాఖ.



కాకతీయవర్ధంత్యుత్సవ చారిత్రికవస్తుప్రదర్శనము— నైజాంప్రభుత్వ ఆర్కశాఖ.

292B



కాకతీయ నగరము

By Courtesy of H. E H. The Nizam's Archaeological Department

ప్రచురణములు.

1. పరిశోధక నివేదికలుసం. 1—7.
2. ...ప్రకటనలు....1—4
3. శాసనపట్టిక
4. గ్రంథములపట్టిక

iii కృష్ణదేవరా యాంధ్రభాషానిలయము, హైదరాబాదు.

1. రామరాయల చిత్రపటము—
2. రజతోత్సవ సంచిక. భా 1 + 2
3. పూసపాటివారి కైఫీయతు
4. సామర్లకోట కైఫీయతు

iv రెడ్డివిద్యార్థివసతిగృహము హైదరాబాదు.

1. సచిత్రభారతము
2. వరంగల్లు చరిత్ర(పర్షియన్)
3. జలాలుద్దీను చిత్రపటము
4. విల్లు ఏబాణములు
5. బల్లెపు తల
6. అమర సింగి
7. బల్లెపు తలలు పెద్దవి
8. తాబేటి బొరుసుతో చేసినడాలు
9. అప్రకటిత గ్రంథములు
10. వీరభద్ర విజయము
11. సారంగధర చరిత్రము
12 రంగనాథ రామాయణము
13. భాగవతము
14. తోలు డాలులు

v. డాక్టరు నారాయణరావుగారు తెచ్చినవి

1. శాసనములలోని వాడుక భాష—పటము
2. దక్షిణదేశ లిపిపరిణామము—
3. సంఖ్యాపరి ణామము—
4. ఆంధ్రవిజ్ఞాన విస్తృతి—
5. ఆశోకుని ఎఱ్ఱగుడిశాసనములు—ప్రతిబింబములు

vi ఆంధ్రసాహిత్యపరిషత్తు - కాకినాడ

1. మల్కాపురశాసనము—ప్రతిబింబము
2. సర్వలోకాశ్రయుని పెద్దచెరుకూరు శాసనము
3. క్రొత్తరాగి నాణెములు.30

vii అబ్దుల్ బసీత్ ఖాన్ సాహెబుగారు రాసంగినవి

1. వరంగల్ దుర్గ.శిథిలములు—పటము
2. కాకతీయుల చరిత్ర—ఉర్దు భాష.

viii. ఆంధ్రేతిహాసపరిశోధకమండలి, రాజమహేంద్రవరము

.1 కళింగగాంగ, వేంగీచాళుక్య తామ్రశాసనములు. ,,

2. విజయనగరరాజుల రాగినాణెములు.
3. మహమ్మదీయ నాణెములు
4. గాంగ, యాదవ,విజయనగర రాజవంశముల బంగారునాణెములు
5. పద్మనాయకుల చరిత్రము—తాళపత్రప్రతి
6. రాజమండ్రీలోని కాకతీయశాసనములు—ప్రతిబింబములు.
7. కాకతీయ సామ్రాజ్యము—చిత్రపటము.
8. రాజు శిరస్సు—శిల్పము.
9 ,పద్మాక్షీగుడి దగ్గరనున్న జైనశిల్పములు.

ఈ చారిత్రక వస్తుప్రదర్శనమును తెరచుచు ధర్మవీర్ వామనరాయక్ జాగీర్దారు గారీ క్రింది యుపన్యాసమునొసంగిరి.

సోదరులారా,

చారిత్రిక గౌరవమునకు స్థానమైయున్న హనుమకొండయందు జరుపబడుచున్న కాకతీయవర్ధంత్యుత్సవ సందర్భమున, నిరుపమానప్రభావంతమగు ఆ వంశస్థుల కాలపు చారిత్రిక వస్తువుల ప్రదర్శనమును ప్రారంభించుకీర్తిప్రదమగు కార్యమునకు ఆంధ్రుడను కాకపోయినను తమవానిగ దలచి నన్ను నియోగించినందునకు ఆంధ్రేతిహాసపరిశోధకమండలివారికి నేనుమనః పూర్వకముగా నాకృతజ్ఞతను దెలుపుచున్నాను. యథార్థముననిచాగించినచో, మండలివారు, ఐతిహాసిక పరిశోధనమున విఖ్యాతినిసంపాదించిన దిగ్దంతులగు పండితులనేకులుండ, నాకీగౌరవము కలిగించుట నన్నుధన్యునిగా జేయుటకేయని విశ్వసించుచున్నాను.

ప్రదర్శనాదుల ప్రాముఖ్యత

ఇట్టి పురాతన వంశముల యుత్సవములను, చారిత్రిక వస్తుప్రదర్శనములను జరుపుట వలన కలుగు ప్రయోజనము లమూల్యమని చెప్పవలసిన పనిలేదు. పరిశోధకుల దృక్పథము ప్రకారము ఇట్టి యుత్సవాదుల ప్రాముఖ్యత ఏమన, యథార్థమగు చరిత్రను ప్రజలజ్ఞానాభివృద్ధికై బయట బెట్టుట. అనగా మూఢవిశ్వాసములు, కల్పితకథలు అను కలుపులోనుండి చరిత్రాంశములను విడదీసి వానివిలువను హెచ్చించుటయని సాధారణముగా చెప్పుచున్నారు. ఈ యుద్దేశ్యమును నేనుగాదనువాడనుకాను. కాని, సోదరులారా! నేను సాధారణపరిశోధకుల కంటె కొంత ఎక్కువ ఆసగొట్టును. ఎంతో శ్రమతోను, ఎంతో ధనవ్యయముతోను, ఏరియేరి సంపాదింపబడిన, బడుచున్న ఈచారిత్రిక సాధనము లను రత్నములు జ్ఞాన ప్రదములు మాత్రమే యనుకొనినచో నాహృదయము సంతసించుటలేదు. మన పురాతన రాజవంశముల గౌరవ చిహ్నమగు ప్రతియంశము మనపూర్వపు ఔన్నత్యమును ప్రకటించుచు, మనవర్తమాన కాలపు హీనస్థితిని చూపుచు, మనభవిష్యత్తునుకాంతివంతముగా జేసికొనుటకై మనస్సుప్రేరేపించుచు మార్గదర్శకమగు చున్నదని నామనోనిశ్చయము. ఇట్టిఫలితమును కలిగింపని చారిత్రిక పరిశోధనము నిష్ప్రయోజనమని నాతలంపు.

కాకతీయ సామ్రాజ్యము

ఏమహా సామ్రాజ్యముయొక్క వర్ధంత్యుత్సవము జరుపుటకు మనము కూడియున్నామో, ఏప్రకాశవంతమగు చరిత్రము కాలగర్భమున లీనమైపోయిన తరువాత ఆరుశతాబ్దములకు,-అతిదీర్ఘములగు ఆరువందల వత్సరములు గడచిన తరువాత,-దానియశోగానమును మనము కలువరించు చున్నామో, అట్టికాకతీయులను గురించిన చరిత్రము కొంచెము ఈసందర్భమున అప్రస్తుతముకాదని తలచుచున్నాను.

కాకతీయులు ఆరంభమున పశ్చిమచాళుక్యులకు మండలాధిపులుగా నుండి బహుశః ౧౨ వశతాబ్దమున స్వతంత్రిమువహించిరి. ప్రోలరాజు, శ్రీరుద్రదేవ మహారాజు (క్రీ.శ౧౧౮౦ నుండి ౧౧౯౬) మహాదేవరాజు (౧౧౯౬--౧౧౯౯) గణపతి దేవచక్రవర్తి(౧౧౯౯-౧౨౯౦) రుద్రమదేవి (౧౨౯౫-౧౩౨౩) మహావైభవముగ మొదట అనుమకొండయు, తరువాత ఇప్పుడు వరంగల్లుఅని పేర్కొనబడు ఓరుగల్లు రాజధానిగా బరిపాలించిరి. వీరిచరిత్రము అవక్రపరాక్రమ ప్రసంగములతోను, ఉదారభావోపేతములగు చారిత్రిక కథానకములతోను, అజరామరఖ్యాతి గడించిన విద్యావిభూషణత్వముతోను, నిరుపమానమగు రాజనీతివిశారదత్వముతోను దాదాపు మూడుశతాబ్దములవఱకు ప్రకాశించినది. సాధారణమాండలికత్వమునుండి మహాసామ్రాజ్యము ఏర్పడినదని చెప్పినచో వీరి రాజ్యవిస్తారము నూహింప వచ్చును! ఊహింప వలసిన పనియేమి? ఈ హనుమకొండలోని సహస్రస్తంభ దేవాలయములో శ్రీరుద్రదేవుని వలన వేయించబడిన శాసనములో ఆసామ్రాట్టుయొక్క రాజ్యవిస్తార మిట్లు వర్ణింపబడినది:-

ప్రాతీచ్యాన్తాకటకసికట స్థాయినీరాజ్యలక్ష్మీః
కాబేరాశా తటవిలసిత మాల్యవంతప్రదేశే
రాజ్యం ప్రాచ్యాంలవణజలధే స్త్రీ రపర్యన్త మస్య
శ్రీశైలాంతం ప్రచరతి సదా దక్షిణాస్యాంసమగ్రం.

ఇట్టియున్నతిగాంచినవంశము క్రీ.శ.౧౩౨౪లో, మహమ్మదీయులదాడులమూలమున పతనముచెందెను. తరువాతకొంతకాలమువఱకు ప్రతాపరుద్రునికుమారుడు ఓరుగల్లు పాలించెననిచెప్పెదరు. క్రీ శ. ౧౩౪౪ లో కాకతీయప్రతాపజ్యోతి తుదిమాఱు ప్రజ్వలించి మలిగిపోయినట్లు చరిత్ర వక్కాణించుచున్నది.

రుద్రమదేవి

కాకతీయవంశయశమును గానముచేయువా డెవడైనను, మహారాణి రుద్రాంబనుగూర్చి ప్రత్యేకముగ ప్రశంసింపక ఊరకుండఁజాలఁడు. ఈమె కాకతిగణపతిచక్రవర్తికుమార్తె. అనన్యసామాన్యమగు తేజముతో 34 సంవత్సరములు పాలనమొనర్చి, యోధురాలుగను, రాజనీతిజ్ఞురాలుగను, మహాయోధాగ్రేసరులగు దేవగిరియాదవసామ్రాట్టులు మున్నగుదేశీయులచేతనేకాక, ఆకాలమున ఇటలీ దేశమునుండి వచ్చియామె పాలనాప్రౌఢిమనుఓరుగల్లుననుండి వరిశీ

లించిన మార్కోపోలో (Marcopolo) వంటివారిచేతను మిక్కిలి శ్లాఘింప బడినది ‡

చరిత్రకాలమున భారతవర్షమునందు రాజ్యపాలన జేసినహిందూస్త్రీలలో ఈమెయే మొట్టమొదటిదని చెప్పవచ్చును. స్త్రీయై సింహాసనము నధిష్ఠించిన మహమ్మదీయ యువతి, రజియాబేగము (క్రీ. శ. ౧౨౩౬-౧౨౪౦) ఈమెకంటె ౨౦ సంవత్సరములు పూర్వముండెనను టనిశ్చయమే. అయినను, భారతీయ విదుషీమణిగా నుండుటయు, పరిపాలనాకాలముదీర్ఘము గ నుండుటయు, నిష్కలంకమగు చరిత్ర కలిగియుండుటయు, అవసానము విషాదాంత ము కాకుండుటయు శ్రీమహారాణి రుద్రమదేవి జీవితమునకు భూషణములై యొప్పు చున్నవి. ఈమహారాజ్ఞి స్త్రీజాతికి ఆదర్శ ప్రాయగా నెన్నదగినది. శ్రీప్రతాపరుద్రచక్రవర్తి కం కిత మీయబడిన విఖ్యాతమగు ప్రతాపరుద్రీయములో విద్యానాథకవియొక్క యమృతవాక్కు క్రింద యుల్లేఖించుట ఈవిషయమున జాలును.

♦ యోరుద్రో రజతాచలే స్థితి మగా దర్ధాంగనారిః పురా సోయం సంప్రతి కాకతీశ్వర కులే సర్వాంగనారిఃస్థితః

కాకతీయాస్తమయము

పదమూడవ శతాబ్దాంతమున దక్కనులో విఖ్యాతిగాంచియుండిన ప్రతిభావంతములగు మూడారాష్ట్రములలో, దేవగిరియాదవ వంశము ౧౨౯౫లోను, ద్వారసముద్రములోని బల్లాలవంశము ౧౩౧౦ లోను, ఓరుగల్లులోని కాకతీయవంశము ౧౩౨౩లోను, మొత్తమ మీద ౩౦ సంవత్సరముల కాలములో పరసుతస్థుల దాడికి ఆగలేకస్వాతంత్ర్యమును కోల్పోయెను. అనగా, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రరాజ్యములు ఈవిధముగ నాశనదేవత పాలై స్వీయసభ్యతను గోల్పోయి, వానిలో మొదటిదియు చివరదియు నేటివరకు తలయెత్తలేని స్థితియందుండుట చారిత్రిక వైచిత్రములలో నొకటిగా గాన్పించుచున్నది!

నిజాంరాష్ట్రము.

పైన పేర్కొనబడిన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్ర, ప్రాంతభూభాగము కలిసియే ఇప్పటి నిజామురాష్ట్రము ఏర్పడియున్నది. దీనిని మహాఘనతవహించిన నిజాముప్రభువు పరిపాలించుచున్నాడు. ఈరాష్ట్రములోని సగముకంటె ఎక్కువభాగము ఆంధ్రదేశము. ఇదియొకప్పుడు కాకతీయుల పాలనములోనుండుటయే కాక దీనిలోనే వారిరాజధానియుండుటచే నేటిమహోత్సవము ఇచ్చటజరుగు చున్నది.

"‡ ఈమెతనపూర్వులవలెనే ధర్మమును, నీతినిగాపాడి దేశమునకు శాంతిని గలిగించి తనప్రజలచే మిక్కిలి భక్తిపూర్వకముగాగౌలువంబడి ప్రేమింపబడుచుచిరకాలము పరిపాలనముచేసెను" మార్కోపోలో

♦అర్ధాంగనారియై కైలాసమందున్న రుద్రుఁడు కాకతివంశమున పూర్ణముగ స్త్రీశరీరమునే ధరించియున్నవాఁడు,

ఈరాష్ట్రములో అసంఖ్యాకములగు పురాతనచారిత్రికసాధనములును, చిహ్నములును కలవు. దుర్గములు, దేవళములు, శిలాశాసనములు, తామ్రశాసనములు, తాళపత్రగ్రంథములు, వివిధనాణెములు, ఇవియవియననేల నిజాముమరాష్ట్రైశ్వర్యమనదగిన యమూల్యనిధులు పరిశోధకులశ్రద్ధకై నిరీక్షించుచున్నవి. ముఖ్యముగా ఆంధ్రప్రాంతమున కాకతీయచరిత్రకు సాధనము లెన్నియేని లభించగలవు. శిలాశాసనములలో భూగర్భమున కొన్నియు, భిన్నభిన్నమై కొన్నియు, గృహసోపానములుగకొన్నియు, గోరీలపై కొన్నియు నున్నవని శోధించినవారు వక్కాణించుచున్నారు.

ప్రభుత్వమువారి ఆర్షశాఖ

గడచిన ౧౮ సంవత్సరములనుండి యవిశ్రాంతముగ, పురాతనవస్తుసంగ్రహణమును తత్పరిశోధనమును ముఖ్యకర్తవ్యముగా పనిచేయుచున్న మాప్రభుత్వమువారు కాకతీయుల మూడునాల్గుశిలాశాసనములను మిగులవ్యయప్రయాసలతో పరిశోధించి ముద్రింపించియున్నారు. ఏ రెన్నియోపురాతనదేవాలయములను మందిరములను నాశనముకాకుండ సురక్షితమొనర్చియున్నారు. విశ్వవిఖ్యాతములగు ఎల్లోరా, అజంటాగుహలనుచూచుటకై ప్రపంచములోని వివిధదేశములనుండివచ్చుయాత్రికులకు సర్వవిధములగు సౌకర్యములు చేయుటలో అద్భుతమగు శ్రద్ధను వహించుచున్న మాప్రభుత్వమువారు ప్రశంసార్హులు లని చెప్పవలసినపని లేదు. ఏ రెన్నియోచారిత్రికసాధనములను సేకరించి ప్రదర్శనశాల (Museum) లోనుంచియున్నారు. మా ఆర్షశాఖ ఇప్పటికంటె ఎక్కువ కృషిచేసినచో, రాష్ట్రమునడాగియున్న సాధనములు బయటకువచ్చి కాకతీయవర్ధంత్యుత్సవముయొక్కయుద్దేశ్యము నెరవేర్చుటలో తోడ్పడగలవనుట నిస్సంశయము.

ఇతర ప్రయత్నములు

చారిత్రికసాధనములు సమకూర్చుటలో ఈరాష్ట్రమున ప్రయత్నముచేయుచున్న సంఘము లక్ష్మణరాయపరిశోధకమండలి. వీరు గత ౧౦ సంవత్సరములలో వందలకొలది అముద్రిత శాసనములను, నాణెములను, తాళపత్రగ్రంథములను, కొన్నిపటములను సంపాదించియున్నారు. వీరి శాసనప్రతులు గ్రంథరూపమున త్వరలోనే వెలువడనున్నవని తెలియుచున్నది. హైదరాబాదులోని రెడ్డిగ్రంథాలయమువారుకూడ తాళపత్ర గ్రంథములను, అనన్యలభ్యములగు పటములను, కాకతీయులకాలపు ఆయుధములను సేకరించియున్నారు. ఇట్టిప్రయత్నములు ఇంకను ఎన్నియేని జరుగవలసియున్నవి. ప్రభుత్వము వలనను, ప్రజలవలనను ప్రోత్సహింపబడవలసి యున్నవి!

ప్రదర్శింపబడు వస్తువులు

నేడు మనముప్రారంభింపనున్న ప్రదర్శనములో, నిజాముప్రభుత్వముయొక్క ఆర్షశాఖవారివలనను, లక్ష్మణరాయ పరిశోధకమండలివలనను, రెడ్డిగ్రంథాలయనిర్వాహకులవలన

ను సంపాదింపబడినవేకాక ఎయ్యది కాకతీయవర్ధంత్యుత్సవమునకును ఈ ప్రదర్శనమునకును కారణమైనదో అట్టి ఆంధ్రేతిహాసపరిశోధకమండలి (రాజమండ్రి) యొక్క నిర్వాహకులు సంగ్రహించిన శాసన ప్రతులు, బంగారునాణెములు మున్నగునవియునుకలవు. వానిమూల్యమును మనము నిర్ణయించుట కష్టము! వానివిలువను కాలమును పరిశోధనమే నిర్ధారణచేయగలదు.

ముగింపు

సోదరులారా! ప్రదర్శింపబడనున్న వస్తుసంచయమునుజూచి యానందించుటకు కుతూహలపడుచున్న మీహృదయములలోని యుత్సాహమునకడ్డమునిల్చి, దీర్ఘోపన్యాసముచేయుచున్న నన్ను క్షమింపవేడుచున్నాను. నిశ్చయముగా నేడు మనకందరకు సుదినము, చారిత్రిక దివసము. ఇట్టి సదవకాశమును వరంగల్లువాసులకేకాక, ఈరాష్ట్రములోని వారందరకు కల్పించిన ఆంధ్రేతిహాసపరిశోధకమండలి (రాజమండ్రి) వారును అందునుముఖ్యముగా ఈకార్యమున ఈరాష్ట్రములోని ప్రత్యేకపరిస్థితులమూలమున విశేషశ్రమకుపాలుపడిన ప్రొఫెసరు రాళ్ళబండిసుబ్బారావు ఎం. ఏ., ఎల్‌టి., కార్యదర్శిగారును, ఈయుత్సవమునకై వచ్చువారికి తగిన పరిచర్యలుచేయుచున్న హనుమకొండయందలి ఆహ్వానసంఘమువారును మనకు వంద్యులై యున్నారు. చారిత్రికపరిశోధనరూపముననేయగుగాక ఈవిధముగా మనపూర్వుల యశోగానము చేయు నవకాశము మనకు తరచుగా లభింపజేసి, దేశముయొక్క భావిభాగ్యోదయమునకు మార్గమేర్పరచుగాకయని భగవంతుని ప్రార్థించుచు, ఈప్రదర్శనమును బహిరంగపరచితినని ప్రకటించుచున్నాను.

సాయంకాలము 6 గంటలకు ఉస్మానియాకాలేజీ ముందుభాగమున సభాప్రతినిధులు, ప్రేక్షకులు, ఆహ్వాన సంఘసభ్యులుమున్నగువారు సమావేశమైరి. అప్పుడొకఛాయాపటము తీయబడెను. పిమ్మట నాహ్వానసంఘముయొక్కయు, సభావ్యవస్థాపకులయొక్కయు, వస్తుప్రదర్శనముయొక్కయు, ఛాయాపటములు గైకొనబడినవి.

రాత్రి 8 గంటలకు గానవిద్యాప్రదర్శనమును, పురాణపఠనమును జరిగినవి. 9-30 గంటలకు శ్రీజగదీశనాట్యమండలివారు వరవిక్రయనాటకమును ప్రదర్శించి చక్కనివినోదమును గల్పించిరి.

రెండవ రోజు.

ది 26-4-1932 ఉదయము 8 గంటలకు హనుమకొండ రాజరాజనరేంద్రగ్రంథాలయసభ్యు లాంధ్రేతిహాసపరిశోధకమండలిసభ్యులను గ్రంథాలయమున కాహ్వానించి, స్వాగతమొసంగి యీక్రిందిపత్రము నొసంగిరి.

వినతిపత్రము

—:♦:—

